# తెలుగు దినపత్రికలు

## భాషాసాహిత్య స్వరూపం



డా॥ జి. చెన్నయ్య

# తెలుగు దినపత్రికలు
# భాషా, సాహిత్య స్వరూపం

డా॥ జె. చెన్నయ్య

రవికిరణ్ పబ్లికేషన్స్
హైదరాబాద్

# TELUGU DAILIES - A STUDY OF LANGUAGE AND LITERATURE

By

**Dr. J. Chennaiah**

First Edition 1998
Second Edition 2003

Cover Design :
**AVBS Anand**

© Authors

**Price : Rs. 120/-**

Copies :
Visalandhra Publishing House
4-1-435, Vignan Bhavan
Bank Street, Hyderabad-1
And its all branches

**Navodaya Book House**
3-3-865
Opp. Arayasamaj Mandir
Kachiguda Cross Roads
Hyderabad-27.

And

C.75 NRR Puram Colony
Site, I, Borabanda
Sanathnagar
Hyderabad-500 018.
Phone : 23831035

Composed at
**Fontline Graphics,** Hyd. Ph : 27660000

Printed at
**Planographers,** Chiragali Lane, Hyd-1.

# అంకితం



తెలుగు సంస్కృతికి స్వర్ణ శిఖరం

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్

**డా॥ సి. నారాయణరెడ్డి గారికి**

గౌరవాభిమానాల్తో . . .

# స్వీకృతి

అధ్యయనశీలికి అభిరుచికి తగ్గ పరిశోధనాంశం లభించడం అదృష్టమే. నా పిహెచ్.డి. పట్టానికి ఆధునికాంధ్ర కవిత్వం పైన పరిశోధన చేసే అవకాశం లభించడం అలాంటిదే. వృత్తిరీత్యా, మనోవృత్తిరీత్యా పత్రికా రచయితగా ఎదిగి వచ్చిన డా॥ చెన్నయ్య పరిశోధనాంశం "తెలుగు దినపత్రికలు" కావడం కూడా అలాంటి సందర్భమే.

తెలుగు పత్రికా రంగానికి సంబంధించిన ప్రాథమిక దశ మొదలుకుని ప్రస్తుత దిశ వరకు సమగ్రంగా పరిశోధించి రూపొందించిన ఈ గ్రంథాన్ని నాకు అంకితం చేస్తున్న డా॥ చెన్నయ్యకు ఆశీరభినందనలు. నిండు మనసుతో చెన్నయ్య అందిస్తున్న ఈ పుస్తకాన్ని పండు మనసుతో స్వీకరిస్తున్నాను.

# పాత్రికేయ వివేచన

– ఆచార్య చేకూరి రామారావు

పత్రికలు లేని ఆధునిక ప్రపంచాన్ని ఊహించలేం. మనిషి జీవిత విధానాన్ని, ఆలోచనా క్రమాన్ని సమూలంగా మార్చివేసే శక్తి పత్రికలకుంది తెలుగులో పత్రికా చరిత్ర రచన అంటే స్థూలంగా సామాజిక చరిత్రరచనే. ఏ పత్రికయినా సరే అచ్చయిన అంశాలన్నీ ఒక క్రమంలో పరిశీలిస్తే సామాజిక చరిత్రలోని ఒక భాగం లేక కొన్ని భాగాలు స్పష్టంగా అర్థమవుతాయి. తెలుగులో తొలినాటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన అనేక పత్రికల సమాచారం 'తెలుగు దినపత్రికలు-భాషా సాహిత్య స్వరూపం' అనే ఈ గ్రంథంలో దొరుకుతుంది. తొలినాటి పత్రికలు మత పత్రికలనీ తర్వాత సాహిత్య పత్రికలు, సామాజిక సంస్కరణ పత్రికలు వచ్చాయని వీటి పుట్టు పూర్వోత్తరాలతో సహా చెన్నయ్య ఈ గ్రంథంలో వివరించారు. ఈ సమాచారం ఇతరత్రా కూడా దొరకొచ్చు కాని గత రెండున్నర దశాబ్దాల తెలుగు పత్రికలను గురించి చాలా సమాచారమిచ్చిన తొలి సిద్ధాంత గ్రంథమిదే. తెలుగు పత్రికల సమగ్ర సమాచారం సంపాదించాలంటే ఒక సంస్థ కొందరు పర్యాటకులను నియమించి పరిశోధిస్తే గాని అందదు. చెన్నయ్య తన శక్తి వంచన లేకుండా కృషి చేసి ముఖ్య సమాచారమంతా సంగ్రహించి మనకు అందించాడు. చెన్నయ్య కొత్త వివాదాల్ని రేకెత్తించకుండానే దినపత్రికల కాలాన్ని గురించి మిగిలిపోయిన వివాదాలకు పరిష్కార మార్గాలు సూచించాడు. ముఖ్యంగా తొలి దినపత్రిక ప్రారంభం, పరిధి మొదలైన విషయాల గురించి విశేషమైన వివేచన చేశాడు. ఇటీవలి కాలంలో దినపత్రికలు తప్పని సరిగా ఒక సాహిత్య పుటను వారంలో ఒక రోజు కేటాయించడం చెన్నయ్య గుర్తించాడు. వాటి పద్ధతిని వివరించాడు. వాటిలో తను గ్రహించిన ముఖ్య విశేషాలను పేర్కొన్నాడు. ఇవి గాక ఇటీవలి కాలంలో పత్రికల్లో వివిధ శీర్షికా రచన (Column writing) కనిపిస్తుంది. వాటి విశేషాలను కూడా ఈ గ్రంథంలో అందించాడు. వార్తా పత్రికల్లో వార్తలు ఇచ్చే పద్ధతిలో శీర్షికలకొక పద్ధతి, విషయ పరిచయాలకొక పద్ధతి, వార్తా కథనానికొక పద్ధతి, ఆ కథనానికొక క్రమమూ ఉంటాయని సోదాహరణంగా

అంతర్భేదాలతో సహా ఈ పుస్తకంలో నిరూపించాడు. ఈ పుస్తకంలో ఇదొక బలమైన అంశం. ఇన్ని అంతర్భేదాలను ఇతరులెవరూ ఇంత వివరంగా పరిశీలించినట్లు లేదు. తెలుగు పత్రికల శీర్షికల్లో కనిపించే సాహిత్యాంశను కూడా రసస్ఫూర్తి కలిగించేట్టు ప్రదర్శించాడు. వాటికి ఉచిత రీతిని నామకరణం కూడా చేశాడు. తెలుగు పత్రికలకు భిన్న భాషాభేదాలున్నా అవి అవలంబించే శైలిలో స్థూలంగా ఏకత్వం ఉంటుంది. ఆ ఏకత్వాన్ని రకరకాల పద్ధతుల్లో నిరూపించాడు. అనువాద పద్ధతుల్ని వివరించాడు. భాషలో నవ్యపదకల్పనలు జరిగే రీతులను సూచించాడు. ఇతరత్రా జరిగిన మార్పులను వివరించాడు. ఈ జరుగుతున్న మార్పుల దిశను సులభీకరణ దిశగా గుర్తించాడు. అందులో వున్న సారభూతాంశాన్ని పట్టుకొని 'సులభీకరణలో అంతర్గతంగా వున్న అంశమేమిటంటే మౌఖికభాషకు, లిఖితభాషకు దూరాన్ని తగ్గించడం అని' సూత్రీకరించాడు. భాషా వ్యవస్థను, ప్రయోగాన్ని, పరిణామాన్ని చాలా కాలం నుంచి పరిశీలిస్తున్న మా బోటి వాళ్ళకు ఇది ఆమోదయోగ్యమైన సూత్రీకరణ.

పత్రికలనుగురించి ఇతరత్రా దొరకని అనేక వినూత్నాంశాలు ఈ పుస్తకంలో దొరుకుతాయి. పత్రికల తత్త్వాన్ని, ప్రాముఖ్యాన్ని, భాషా స్వరూపాన్ని స్థూలంగా (కొన్ని చోట్ల సూక్ష్మంగా) పరిశీలించి ప్రదర్శించిన పుస్తకం ఇది. ఈ పుస్తకంలో చేసిన ప్రతిపాదనలన్నీ విలక్షణమైనవి కాకపోవచ్చు గానీ ఈ పుస్తకం చదివితే పత్రికలను గురించి ఇంతకు ముందు మనకు తెలియని కొత్త విషయాలు మరికొన్ని తెలుసుకున్నామన్న తృప్తి మిగులుతుంది. ఇంకో విషయమేమిటంటే చెన్నయ్య ఇచ్చిన సమాచారమే కాదు ఆయన చేసిన భాషా ప్రయోగం కూడా పత్రికా భాషను గురించి చెప్పని విషయాల్ని చెబుతుంది.

చెన్నయ్య తన పరిశీలన ఇంతటితో ఆపకుండా మరింత సూక్ష్మాంశ పరిశీలనకు ప్రయత్నిస్తాడని ఆశిస్తున్నాను. ఆ ప్రయత్నంలో సఫలం కావాలని ఆశీర్వదిస్తున్నాను.

**4.4.1998**
హైదరాబాద్

# పర్యవేక్షక వాక్యం

– ఆచార్య ఎన్. గోపి,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

నా దగ్గర రీసర్చ్‌స్కాలర్‌గా చేరి తమ్ముడైన వాడు డా॥ జె. చెన్నయ్య. 'మీ దగ్గర పరిశోధన చెయ్యాలనుంది సార్!' అని మొదటిసారి నన్ను అడిగినప్పుడు మేమింత చేరువవుతామని ఆనాడు ఊహించలేదు. నా పర్యవేక్షణ కోసం వచ్చే సీటు వదులుకొని ఒక సంవత్సరం పాటు ఆగాడు కూడా. చెన్నయ్యలోని ఆ సీరియస్‌నెస్సే అప్పటికీ ఇప్పటికీ నాకెంతో నచ్చేది.

చెన్నయ్య ఎం.ఎ. తెలుగు నుంచి పాత్రికేయ వృత్తిలోకి వచ్చినవాడు. ఒక దశాబ్దం పాటు ఈనాడులో అనేక స్థాయిల్లో సమర్థవంతంగా పనిచేసి అందరి మెప్పునూ పొందాడు. ఏది చేసినా నిబద్ధంగా, నిమగ్నంగా చెయ్యడం అతని నైజం. అతని పదేళ్ళ పత్రికానుభవం తెలుగు విశ్వవిద్యాలయంలోని పౌరసంబంధాల అధికారి (పి.ఆర్.ఓ.) గా పరిణమించింది. పి.ఆర్.ఓ. గా వృత్తివల్లనే గాక ప్రవృత్తి వల్ల కూడా అందరికీ తలలోని నాల్కగా మారాడు. అయితే పిఆర్ఓ ను ఎట్లా ఉపయోగించుకోవాలో మన విశ్వవిద్యాలయాలకు పూర్తిగా తెలియని విద్య. విశ్వవిద్యాలయ కార్యకలాపాలకూ బయటి సమాజానికీ వూలవంతెనలా ఉండవలసిన పిఆర్ఓ సంక్షోభ నివారకుడి (crisis manager) గానే మిగిలిపోవడం గమనార్హం.

పత్రికల్లో రచనలు చేయడం తప్ప పాత్రికేయ వృత్తిలోని మెలుకువలు తెలిసినవాడిని కాదు నేను. స్వతహాగా పాత్రికేయ నేపథ్యం వుండడం వల్ల డా॥ చెన్నయ్య ఈ సిద్ధాంత వ్యాస రచనలో మంచి అభినివేశం చూపించాడు. నా పని కూడా సులభతరమైంది. చెన్నయ్య గొంతు ఆకాశవాణిలో ప్రాంతీయ వార్తలు వినేవారికి సుపరిచితమే. న్యూస్ రీడర్‌గా, అనువాదకుడిగా గడియారం ముళ్ళతోపాటు పరుగెత్తవలసిన సమయస్ఫూర్తి, సద్యః స్ఫూర్తి కూడా అబ్బిన professional గా చెన్నయ్య మంచి పేరు తెచ్చుకున్నాడు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి,

గవర్నర్ల ప్రసంగానువాదం, పఠనం కాలపరీక్షల్లో నిర్దుష్టంగా నెగ్గి ఆ సంస్థలో dependability ని సాధించాడు.

చెన్నయ్య ఎన్నుకున్న పరిశోధనాంశం 'తెలుగు దినపత్రికలు - భాషా సాహిత్య స్వరూపం (1975-90)'. ఈ 15 ఏళ్ళనే ఎన్నుకోడానికి కారణముంది. 1974 ఆగస్టులో ఈనాడు ఆవిర్భావం జరిగింది. ఒక వ్యాపార సంస్థ ఆధ్వర్యంలో సర్క్యులేషన్ ఓరియెంటెడ్‌గా ఒక ప్రత్యేక గొంతుకతో వెలువడిన పత్రిక ఈనాడు. ఈనాడు స్థాపనతో ఏర్పడిన పోటీ వల్ల మిగతా పత్రికల ధోరణిలో కూడా మార్పులు రాసాగాయి. సరిగ్గా ఈ పరిణామ దశ కాలం చెన్నయ్య పరిశోధనాంశమైంది. అతడు ఓ దశాబ్దకాలం పాటు ఈనాడులో పని చేయడం వల్ల ఆ పత్రిక పద్ధతితో సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ కారణం వల్ల పరిశోధన కోసం ఉపయోగించుకున్న మెటీరియల్ కూడా ఎక్కువ భాగం ఈనాడుకు సంబంధించిందిగా గమనించవచ్చు.

ఇది వరకు దినపత్రికల్లోని భాషా స్వరూపం గురించిన పరిశీలన కొంత జరిగింది గానీ సాహిత్య స్వరూప పరిశీలన అచుంబితంగానే మిగిలిపోయింది. చెన్నయ్య భాషా పరిశీలన ఆధునిక భాషా శాస్త్ర దృష్టితో జరిగింది. సాహిత్య స్వరూపం ఒక పెద్ద సముద్రం. ఆ సముద్రంలోంచి ఎన్ని గ్రంథాలైనా రావాల్సిదే. చెన్నయ్య దానిలో మునిగి తనకు దొరికినన్ని రత్నాలు పట్టుకొచ్చాడు. ఈ పరిశోధనలో మెచ్చుకోదగిన మరో విషయం ఏమిటంటే సమాచారాన్ని పుష్కలంగా ఒక చోట కుప్పవోయటం. మన దేశంలో పత్రికల గురించి సమాచార సేకరణ అంత సులభమేమీ కాదు. ప్రత్యేకంగా పత్రికాగ్రంథాలయాలు ఏర్పడవలసినంత అభివృద్ధిని మనం సాధించలేదో లేక దాని అవసరాన్ని గుర్తించలేదో ఆలోచించాలి. ఉన్న పరిమితుల్లో చెన్నయ్య విశేషంగా పరిశ్రమించాడు. చాలా వరకూ ఇది స్థూల పరిధి (Macro level) లో సాగిన పరిశీలన. భవిష్యత్తులో జరిగే సూక్ష్మ పరిశీలవ (micro level) కిది తప్పకుండా ఆకర గ్రంథమవుతుంది.

చెన్నయ్య పరిశ్రమ జీవి. శక్తిలో పరిమితులన్నప్పటికీ శ్రద్ధలో లోపం లేని వాడు. చాలా మందిలాగా పిహెచ్.డి.తో ఆగిపోక micro level కృషి కూడా తానే చేయాలని నా ఆశ. పిహెచ్.డికి ఒక ప్రారంభమే కాని పరమావధికాదు. ఈ కష్ట జీవికి ఉజ్వలమైన భవిష్యత్తును ఆకాంక్షిస్తున్నాను.

# నా మాట

పత్రికలపై పరిశోధన ఎంత కష్టమో అనుభవంవల్లగానీ తెలిసి రాలేదు. నా పరిశోధనాంశం దినపత్రికలకు సంబంధించింది. అందువల్ల ప్రధానంగా నాకు దినపత్రికల కాపీలను క్షుణ్ణంగా పరిశీలించవలసిన అవసరం ఏర్పడింది. అయితే దినపత్రికలను మొదటి నుంచీ భద్రపరచడం అనేది జరగటంలేదు. మొదట నాకు కావలసిన దినపత్రికల కాపీలు ఆయా పత్రికల గ్రంథాలయాల్లో పూర్తిగా లభ్యమవుతాయని ఆశించాను. కాని ఆ ఆశ పూర్తిగా నెరవేరే అవకాశాలు కనిపించలేదు. ఆంధ్రపత్రికను అక్కడక్కడయినా సరే 1914 నుంచి 1990 వరకూ చూడాలి. ఆ పత్రిక మూతబడడం వల్ల అవన్నీ ఏమయినాయో తెలియదు. స్టేట్ ఆర్కైవ్స్‌లో వున్నాయి గాని అక్కడా పూర్తిగా లేవు. 1960 వరకే వున్నాయి. ఆంధ్రప్రభ 1938 ఆగస్టు 15న ప్రారంభమైంది. అయితే హైదరాబాద్‌లోని ఆ పత్రిక గ్రంథాలయంలో 1975 నుంచి మాత్రమే అందుబాటులో వున్నాయి. ఆంధ్రజ్యోతి కూడా అంతే. ఉదయం మూతబడి వుండడం వల్ల ఆజామాబాద్‌లోని ఆ పత్రికా కార్యాలయానికి వెళ్ళి అక్కడ కొందరు మిత్రుల సహాయంతో అతికష్టం మీద కొన్ని ఫైళ్ళు చూడగలిగాను. 'ఈనాడు' రీసర్చ్ అండ్ రిఫరెన్స్ గ్రూపు (గ్రంథాలయం) లో ఈనాడుతో పాటు అన్ని పత్రికల ఫైళ్ళు వున్నాయిగాని అక్కడి వాతావరణంలో ఆశించినంత సహకారం లభించే అవకాశం లేదు. ఆ విధంగా దినపత్రికల కాపీలు లభ్యమవుతాయనుకున్న ప్రతిచోటికీ ఓపిగ్గా వెళ్ళాను. విశాలాంధ్ర కాపీలు మగ్దుంభవన్ గ్రంథాలయంలోనూ, ప్రజాశక్తి కాపీలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయంలోనూ లభ్యమయ్యాయి. ప్రధాన దినపత్రికలు ముఖ్యగా ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి ఫైళ్ళు స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో దొరికాయి. సాధారణంగా ప్రభుత్వ గ్రంథాలయాల్లో దేనికీ ఒక వ్యవస్థ వుండకపోవడం గమనార్హం. పుస్తకాలకు కేటలాగింగ్ చేసి ర్యాక్‌లలో భద్రపరచినా దినపత్రికల ఫైళ్ళు భద్రపరచడం ఇబ్బందే. ఉదాహరణకు 1947 లో ఒక నెల ఆంధ్రప్రభ ఫైలు ఆ నెలలో ఎక్కడ ఎలా పడేసి వుందో ఇప్పటికీ అలాగే పడి వుంది. అయినప్పటికీ దినపత్రికలకు సంబంధించినంత వరకూ స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో చాలా ఉపయుక్త సమాచారాన్ని చేదుకోగలిగాను.

వాస్తవానికి నా పరిశోధనకు 1975-90 కాల పరిమితి విధించుకున్నప్పటికీ దినపత్రికలకు సంబంధించి అంతకు ముందు పరిశోధన ఎక్కువగా జరగలేదు. కాబట్టి 1975-90 మధ్య కాలమే గాక అంతకు పూర్వ (Back-ground) సమాచారం కూడా సేకరించి పొందుపరచవలసి

వచ్చింది. అందువల్ల ఆయా దినపత్రికలను అక్కడక్కడ అయినా సరే ప్రారంభం నుంచీ చూడవలసిన అవసరం ఏర్పడింది.

నేను బహు వ్యాపకుడ్ని. విశ్వవిద్యాలయ అధికార బాధ్యతలు, అప్పుడప్పుడూ రేడియో వార్తలు, ఏవేవో అనువాదాలు. అన్నీ కొనసాగిస్తూనే ఈ సమాచార సేకరణ చేయడంలో నిమగ్నమయ్యాను.

స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో కూడా పత్రికలు పడేసిన చోట కనీసం కాలు పెట్టేందుకు కూడా జాగాలేదు. నిలబడేందుకు చోటు సరేసరి. అయినా ఏదో విధంగా సమాచారం సేకరించుకోవాలని పట్టుదల. దీనికి తోడు లైబ్రరీకి వారాంతపు సెలవులు, నిర్ణీత వేళలు. ఉన్నంతలో నేను చేయగలిగింది ఉదయం లైబ్రరీ తెరిచే వేళకు అక్కడ ప్రత్యక్షం. మూసే వేళకు వాచ్‌మెన్ వచ్చి 'ఉఠో సాబ్ టైమ్ హోగయా!' అనే దాకా పత్రికల ఫైళ్ళతో కుస్తీ పట్టడం.

ఇన్ని పరిమితుల మధ్య సమాచార సేకరణ సాగినా అసంతృప్తి మిగిలే వుంది.

ఎంత రాండమ్‌గా చూసినా అన్నేళ్ళ దినపత్రికల్లో రాష్ట్రాన్ని, దేశాన్ని పట్టి కుదిపి వేసిన ఎన్నో సంఘటనలు చూస్తుంటే గతంలోకి వెళ్లిన థ్రిల్ కలిగింది. పొట్టి శ్రీరాములు గారు ఆంధ్ర రాష్ట్రావతరణ కోసం ఆమరణదీక్షకు కూర్చున్నారు. దీక్ష కొనసాగుతోంది. ఒకటి, రెండు, పది, ఇరవై రోజులు ఇలా. ప్రకాశం పంతులు, సంజీవరెడ్డి, తెన్నేటి విశ్వనాథం వీళ్ళంతా శ్రీరాములు గారి దీక్ష నివారించలేక, విరమింపజెయ్యలేక, ఆయన కోరిన విధంగా మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రం సాధించే పరిస్థితి లేక ఎంత మధనపడ్డారో ఆంధ్రపత్రికలో నేను చదవగలిగాను. మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రం కోసం శ్రీరాములు గారు దీక్ష బూనారు. ప్రకాశం ప్రభృతులకు కూడా మద్రాసుతో కూడిన రాష్ట్రం కావాలనే వుంది. కాని కాంగ్రెస్ అధిష్ఠానవర్గమనండీ, ప్రధానమంత్రి పండిత నెహ్రూ అనండీ అందుకు సుముఖంగా లేరు. మన వాళ్ళు నెహ్రూతో గట్టిగా దెబ్బలాడలేరు. శ్రీరాములు దీక్ష విరమించే మార్గమూ లేదు. అలా చూస్తుండగానే శ్రీరాములు గారు ప్రాణాలు విడిచారు. దేశమంతా భగ్గున మండింది. పార్లమెంటులో ప్రధానమంత్రి పక్షాన ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్ ప్రకటన చేస్తూ 'వివాదం లేని ప్రాంతాలను కలిపి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని' అన్నారు. దానర్థం శ్రీరాములు గారు కోరిన రాష్ట్రం అని కాదు. కాని ఎవరూ ఏమీ చెయ్యలేకపోయారు. శ్రీరాములు గారి ఆత్మకు మనం శాంతి చేకూర్చలేకపోయామన్న విషయాన్ని పత్రికలు స్పష్టంగా ఘోషించాయి.

ఇది మచ్చుకు మాత్రమే. మైలురాళ్ళనదగిన ఇలాంటి ప్రముఖ సంఘటనలు పత్రికల్లో చూస్తున్న నాకు పత్రికలు చరిత్ర నిర్మాణానికి ఎంత ముఖ్యమో తెలిసి వచ్చింది. ఇవాళ మన

మధ్య లేని ఆంధ్రదేశపు ఆణిముత్యాలు, అతిరథ మహారథులు ఎందరో మళ్ళీ బతికి వచ్చి పత్రికా ప్రకటనలిచ్చినట్టూ, సభల్లో ప్రసంగించినట్టూ, ప్రజల మధ్య సంచరించినట్టూ అనిపించింది. ఆ విధంగా పత్రికలు నన్ను ఒక అర్ధశతాబ్దం వెనక్కి తీసుకువెళ్ళాయి.

పాత్రికేయునిగా పనిచేసిన స్వల్ప అనుభవం, జర్నలిజం చదువుకున్న కొద్దిపాటి పరిజ్ఞానం, తెలుగుశాఖలో సాహిత్యపఠనాభిరుచి ఇవన్నీ నాకు పాథేయంగా తోడ్పడ్డాయి. కేవలం జర్నలిస్టు గానే పరిశోధన చెయ్యాలంటే అందుకు అవకాశాలు లేవు. కేవలం ఎం.ఎ. తెలుగుతో పరిశోధన చేస్తే అది భాషా సాహిత్యాల పరిశోధనే అవుతుంది తప్ప పత్రికలపై పరిశోధన కానేరదు. నా వృత్తి జర్నలిజానికి ఎం.ఎ. తెలుగు తోడవడంతో నా పని కొంత సులువైంది. భాషా సాహిత్యాంశాలతో పాటు జర్నలిజం కలిసి రావడంతో నేనీ పరిశీలనకు సాహసించాను.

ఇప్పుడీ పుస్తకాన్ని కళ్ళారా చూసుకొనేందుకు మా అమ్మ లేదు. కంపోజింగ్‌కు వెళుతున్న దశలో ఆకస్మికంగా నా చేతుల్లో కన్ను మూసి తీవ్రమైన దుఃఖాన్ని మిగిల్చి వెళ్ళింది. 6 నెలల వయసులోనే మా నాన్న చనిపోతే నాకు అమ్మా, నాన్న తానే అయి పెంచినందువల్ల అమ్మ పోవడం అమ్మా, నాన్న ఇరువురూ ఒకేసారి పోయినంత దుఃఖం. కూలీనాలీ చేసుకొని జీవించిన అమ్మ నన్ను ఎంతో కష్టపడి పెంచి చదివించింది. నేను కూడా కూలీ దగ్గర నుంచి అన్ని రకాల ఇబ్బందుల్ని అధిగమించి చదువుకుని పైకి వచ్చాను. ఆనాడు నేనున్న స్థితి నుంచి ఇప్పుడున్న స్థాయికి రావడం నిజంగా పెద్ద మలుపే. మామూలుగా అయితే రాకూడదు. అందుకే గత జీవితాన్ని తలచుకుంటే తృప్తీ, రుచీ. నా ఈ ప్రతి మలుపులో మా అమ్మ కష్టఫలం, ఆశీర్వాదబలం వెన్నంటి వుంది.

సరిగ్గా 1980 నుంచి 1990 వరకు ఈనాడుతో నా అనుబంధం. స్వయం కృషి ఆత్మశక్తితో తాను పట్టిందల్లా బంగారం చేస్తున్న రామోజీరావు గారి వల్లనే ఈనాడులో పనిచేసే అవకాశం నాకు కలిగింది. ఈనాడులో పాత్రికేయునిగా పనిచేసిన అనుభవం నా మూర్తిత్వ వికాసానికి దోహదం చేసింది. రామోజీరావు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈనాడులో పనిచేస్తుండగానే డా॥ సి. నారాయణరెడ్డి గారి దయవల్ల నాకు ఇప్పుడున్న స్థానం లభించింది. తెలుగువారి జ్ఞానపీఠమైన నారాయణరెడ్డిగారికి ఈ గ్రంథం అంకితమిస్తున్నాను. ఒక గొప్ప కవి, మానవతామూర్తి, వక్త, ఇంగితజ్ఞుడు, సమయ పాలకుడు ఇలా అనేక శక్తుల కలయిక నారాయణరెడ్డి గారు. వారికి విద్యార్థిని కాలేకపోయాననే లోటు తప్ప తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా వున్నప్పుడు పిఆర్ఓగా రెండేళ్ళ కాలానికి పైగా ఆయన కనుసన్నల్లో మెలగుతూ పనిచేసే అవకాశం నన్ను అంతకన్నా ఎక్కువగా వెలిగించింది.

ప్రముఖ కవి, పరిశోధకుడు, ఆచార్య ఎన్. గోపి నాకు పరిశోధనా గురువు, పర్యవేక్షకుడు.

ఉన్నతమైన ప్రతిభ, ఉదాత్తమైన వ్యక్తిత్వాల మేలుకలయిక వారు. నా బాధను సంతోషాన్నీ హృదయంతో పంచుకొంటూ అన్ని విధాలా పేరెంట్‌గా అండగా నిలుస్తున్న వ్యక్తి. గోపి గారు నా పరిశోధనకు పర్యవేక్షకులుగా ఉంటే వారి శ్రీమతి ఎస్. అరుణ గారు చాలాసార్లు కన్నతల్లిలా అన్నం పెట్టి, ఆశీస్సులు పలికారు. గురు దంపతులకు నా కైమోడ్పులు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధిపతి, ఎం.ఎ. లో గురువు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మొదటి నుంచీ నన్నెంతగానో ప్రోత్సహిస్తూ వస్తున్నారు. నా ఈ పరిశోధనలో కూడా వారి సహాయ సహకారాలు లభించాయి. తెలుగు శాఖ అధ్యాపకులు ఆచార్య ఎస్.వి. రామారావు, డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి, డా॥ కె. బుక్నుద్దీన్, డా॥ సుమతీ నరేంద్ర ఎంతో ఆత్మీయంగా వెన్ను తట్టిన గురువులు.

ఈ సిద్ధాంత వ్యాసాన్ని ఆసాంతం ఓపిగ్గా చదివి సవరణలు సూచించి మంచి పీఠికను సంతరించిన ప్రముఖ భాషా శాస్త్రవేత్త, విమర్శకులు చేరా గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అధికార రీత్యా ప్రస్తుతం మా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులైన ఆచార్య నాయని కృష్ణకుమారి గారు ఎం.ఎ. లో నా గురువు కూడా కావడం నా అదృష్టం.. మాతృమూర్తి వాత్సల్యానికి మనసారా వందనం. మా రిజిస్ట్రార్, అధ్యాపకుడు పరిశోధకుడు ఆచార్య కడప రమణయ్యకు కృతజ్ఞతలు.

పిహెచ్‌డి పరిశోధనా కాలంలో విలువైన సమాచారం అందించిన మౌఖిక విజ్ఞాన సర్వస్వం, పాత్రికేయులు శ్రీ జి. కృష్ణ గారికి, శ్రీ జి.ఎస్. వరదాచారి గారికి కృతజ్ఞతలు. స్వర్గీయ డా॥ తిరుమల రామచంద్రగారికి స్మృత్యంజలి. మిత్రుడు డా॥ పి. చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు. తమ్ముడు జగన్నాథం (కదిరి), రాములు (వార్త విలేఖరి, హైదరాబాద్) లకు కృతజ్ఞతలు.

నాలోని శక్తులను గుర్తించి ప్రోత్సహించి తగిన అవకాశాలు కల్పించిన పెద్దలను స్మరించాలి. 20 సంవత్సరాలుగా రేడియోలో నా నాటకాలు, రూపకాలు, ప్రసంగాలు, కథానికలు ప్రసారమవుతున్నాయి. రేడియోలో తొలుత అవకాశం కల్పించిన వారు ప్రముఖ రచయిత, రేడియో కళాకారుడు శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి. 1991లో క్యాజువల్ న్యూస్ రీడర్‌గా కె. ఆసయ్య గారు పరిచయం చేస్తే అప్పటి నుండి నాకన్ని విధాలా సూచనలు సలహాలు అందించి అవకాశాలు పెంపొందిస్తూ నా పట్ల ఎనలేని వాత్సల్యం చూపుతున్న ప్రేమమూర్తి ప్రముఖ కథా, నవలా రచయిత, రేడియో కళాకారుడు, శ్రీ డి. వెంకట్రామయ్య, అవ్యాజమైన ఆదరణ కనబరుస్తున్న ప్రాంతీయ వార్తా విభాగం అధికారులు ఆర్.వి.వి. కృష్ణారావు, భండారు శ్రీనివాసరావు, పవని విజయలక్ష్మి గార్లకు కృతజ్ఞతలు.

[illegible]

# విషయ సూచిక


**1. తెలుగు పత్రికలు - ఆవిర్భావ వికాసాలు 1**

(i) కుంపిణీ యుగంలో ముద్రణ ప్రయత్నాలు (ii) ముద్రణ యంత్ర స్థాపన (iii) భారతదేశంలో ముద్రణ ప్రయత్నాలు (iv) తెలుగులో తొలి ముద్రిత గ్రంథం - ముద్రణ వ్యాప్తి (v) తొలి తెలుగు ముద్రాపకుడు (vi) మద్రాసులో తెలుగు ముద్రణ (vii) సిరాంపూర్‌లో ముద్రణ (viii) విశాఖపట్నంలో ముద్రణ (ix) పాశ్చాత్యుల సేవ (x) బెంజమెన్ షుల్జ్ - తొలి తెలుగు ముద్రాపకుడు (xi) జేమ్స్ గ్రాంటు -దేశీయ విద్యలపై దృష్టి (xii) ఛార్లెస్ వైట్ - నిఘంటు నిర్మాణానికి అంకురార్పణ (xiii) సి.పి. బ్రౌన్ - పునరుజ్జీవన ప్రదాత (xiv) సర్ థామస్ మన్రో - ప్రజల గవర్నరు (xv) విలియం బ్రౌన్ - విశిష్ట వ్యాకర్త (xvi) ఎ.డి. క్యాంబెల్ ప్రామాణిక వ్యాకరణం (xvii) ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ తులనాత్మక అధ్యయనం (xviii) కోలిన్ మెకంజీ చారిత్రక సంపద

**2. ప్రారంభ దశలో వివిధ పత్రికలు - తొలి పత్రిక 20**

(i) పత్రికల ఆవిర్భావం - ఆవశ్యకత (ii) తొలి పత్రిక - చర్చ, నిర్ణయం (a) సత్యదూత (b) తెలుగు జర్నల్ (c) మద్రాసు క్రానికల్ (d) కర్నాటిక్ క్రానికల్ (e) ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ (f) వృత్తాంతి (iii) ఇతర పత్రికలు (a) వర్తమాన తరంగిణి (b) హితవాది (c) సంవాద కౌముది (d) దినవర్తమాని(e) జిల్లా గెజిట్లు (f) క్రెసెంటు

**3. పత్రికల వర్గీకరణ 41**

(1) కాలమాన వర్గీకరణ (Periodicity) (a) వారపత్రికలు (b) పక్షపత్రికలు (c) మాసపత్రికలు (d) ద్వైమాస పత్రికలు (e) త్రైమాస పత్రికలు (f) అర్ధ సంవత్సర పత్రికలు (g) వార్షిక పత్రికలు (h) వార్షిక ప్రత్యేక సంచికలు (i) దినపత్రికలు (2) పత్రికల విషయానుగుణ వర్గీకరణ (1) సాంఘిక పత్రికలు (a) వృత్తాంతి (b) తత్త్వబోధిని (c) ఆంధ్రభాషా సంజీవని (d) పురుషార్థ ప్రదాయిని (e) వివేకవర్ధని (f) హాస్య సంజీవని (g) సతీహిత బోధిని (h) సత్యసంవర్ధని (i) తెలుగు జనానా (2) రాజకీయ పత్రికలు (a) ఆంధ్రప్రకాశిక (b) దేశాభిమాని (c) దేశోపకారి (d) శశిలేఖ (e) కృష్ణాపత్రిక (f) ఆంధ్రపత్రిక (g) కాంగ్రెస్ (h) నీలగిరి - తెనుగు పత్రిక (i) మాతృసేవ (j) జమీన్ రైతు (k) గోలకొండ పత్రిక (l) నవశక్తి (3) సాహిత్య పత్రికలు (a) అముద్రిత గ్రంథ చింతామణి (b) చింతామణి (c) ఆంధ్రభారతి (d) శారద (e) సారస్వత సర్వస్వము (f) భారతి (g) ఆంధ్ర సర్వస్వము (h) ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక (i) సాహితి (j) వజ్రాయుధం (k) జయంతి (l) ఉదయిని (m) ప్రతిభ (n) అభ్యుదయ (o) స్రవంతి (p) సృజన (q) కళాకేళి (r) సంవేదన (s) తెలుగు పరిశోధన (4) మత పత్రికలు (1) క్రైస్తవ మత పత్రికలు (a) హితవాది (b) రవి (2) హిందూ మత పత్రికలు (a) తత్త్వబోధిని (b) శైవప్రచారిణి (c) విభూతి (3) కుల పత్రికలు (4) వైజ్ఞానిక పత్రికలు (a) విజ్ఞాన వర్ధని (b) సతీహిత బోధిని (c) పురుషార్థ ప్రదాయిని (5)

# విషయ సూచిక

**1. తెలుగు పత్రికలు - ఆవిర్భావ వికాసాలు 1**

(i) కుంఫిణీ యుగంలో ముద్రణ ప్రయత్నాలు (ii) ముద్రణ యంత్ర స్థాపన (iii) భారతదేశంలో ముద్రణ ప్రయత్నాలు (iv) తెలుగులో తొలి ముద్రిత గ్రంథం - ముద్రణ వ్యాప్తి (v) తొలి తెలుగు ముద్రాపకుడు (vi) మద్రాసులో తెలుగు ముద్రణ (vii) సిరాంపూర్‌లో ముద్రణ (viii) విశాఖపట్నంలో ముద్రణ (ix) పాశ్చాత్యుల సేవ (x) బెంజమెన్ షుల్జ్ - తొలి తెలుగు ముద్రాపకుడు (xi) జేమ్స్ గ్రాంటు -దేశీయ విద్యలపై దృష్టి (xii) ఛార్లెస్ వైట్ - నిఘంటు నిర్మాణానికి అంకురార్పణ (xiii) సి.పి. బ్రౌన్ - పునరుజ్జీవన ప్రదాత (xiv) సర్ థామస్ మన్రో - ప్రజల గవర్నరు (xv) విలియం బ్రౌన్ - విశిష్ట వ్యాకర్త (xvi) ఎ.డి. క్యాంబెల్ ప్రామాణిక వ్యాకరణం (xvii) ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ తులనాత్మక అధ్యయనం (xviii) కోలిన్ మెకంజీ చారిత్రక సంపద

**2. ప్రారంభ దశలో వివిధ పత్రికలు - తొలి పత్రిక 20**

(i) పత్రికల ఆవిర్భావం - ఆవశ్యకత (ii) తొలి పత్రిక - చర్చ, నిర్ణయం (a) సత్యదూత (b) తెలుగు జర్నల్ (c) మద్రాసు క్రానికల్ (d) కర్నాటిక్ క్రానికల్ (e) ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ (f) వృత్తాంతి (iii) ఇతర పత్రికలు (a) వర్తమాన తరంగిణి (b) హితవాది (c) సంవాద కౌముది (d) దినవర్తమాని(e) జిల్లా గెజిట్లు (f) క్రెసెంటు

**3. పత్రికల వర్గీకరణ 41**

(1) కాలమాన వర్గీకరణ (Periodicity) (a) వారపత్రికలు (b) పక్షపత్రికలు (c) మాసపత్రికలు (d) ద్వైమాస పత్రికలు (e) త్రైమాస పత్రికలు (f) అర్ధ సంవత్సర పత్రికలు (g) వార్షిక పత్రికలు (h) వార్షిక ప్రత్యేక సంచికలు (i) దినపత్రికలు (2) పత్రికల విషయానుగుణ వర్గీకరణ (1) సాంఘిక పత్రికలు (a) వృత్తాంతి (b) తత్త్వబోధిని (c) ఆంధ్రభాషా సంజీవని (d) పురుషార్థ ప్రదాయిని (e) వివేకవర్ధని (f) హాస్య సంజీవని (g) సతీహిత బోధిని (h) సత్యసంవర్ధని (i) తెలుగు జనానా (2) రాజకీయ పత్రికలు (a) ఆంధ్రప్రకాశిక (b) దేశాభిమాని (c) దేశోపకారి (d) శశిలేఖ (e) కృష్ణాపత్రిక (f) ఆంధ్రపత్రిక (g) కాంగ్రెస్ (h) నీలగిరి - తెనుగు పత్రిక (i) మాతృసేవ (j) జమీన్ రైతు (k) గోలకొండ పత్రిక (l) నవశక్తి (3) సాహిత్య పత్రికలు (a) అముద్రిత గ్రంథ చింతామణి (b) చింతామణి (c) ఆంధ్రభారతి (d) శారద (e) సారస్వత సర్వస్వము (f) భారతి (g) ఆంధ్ర సర్వస్వము (h) ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక (i) సాహితి (j) వజ్రాయుధం (k) జయంతి (l) ఉదయిని (m) ప్రతిభ (n) అభ్యుదయ (o) స్రవంతి (p) సృజన (q) కళాకేళి (r) సంవేదన (s) తెలుగు పరిశోధన (4) మత పత్రికలు (1) క్రైస్తవ మత పత్రికలు (a) హితవాది (b) రవి (2) హిందూ మత పత్రికలు (a) తత్త్వబోధిని (b) శైవప్రచారిణి (c) విభూతి (3) కుల పత్రికలు (4) వైజ్ఞానిక పత్రికలు (a) విజ్ఞాన వర్ధని (b) సతీహిత బోధిని (c) పురుషార్థ ప్రదాయిని (5)

# 1. తెలుగు పత్రికలు-ఆవిర్భావ వికాసాలు

## i. కుంపిణీ యుగంలో ముద్రణ ప్రయత్నాలు

ఇంగ్లండులోని కొంతమంది వర్తకులు తమ దేశపు రాజు అనుమతి తీసుకొని వ్యాపారం చేసుకొనేందుకు భారతదేశం వచ్చారు. వారు ఒక సంఘంగా ఏర్పడి ఇక్కడ వ్యాపారం ప్రారంభించారు. మొదట్లో ప్రధానంగా రేవు పట్టణాలలో గిడ్డంగులు కట్టుకున్నారు. క్రమంగా దేశమంతటా వ్యాపించి దానిని తమ అధికారం కిందకు తెచ్చుకున్నారు. అప్పటికే భారతదేశంలో పోర్చుగీసు, డచ్చి, డెన్మార్క్, ఫ్రెంచి వారు వ్యాపారం నిర్వహిస్తున్నా వారిలో బలంగా వేళ్లూనుకొనిపోయింది బ్రిటిషు వర్తక సంఘం వారు మాత్రమే. 1757 ప్లాసీ యుద్ధం మొదలుకొని దేశంలో వ్యాపారం పెంపొందించుకొంటూ, దేశ భాషలను నేర్చుకుంటూ, రాజకీయాలను, ప్రజల్లో అనైక్యతను ఆసరాగా చేసుకుని ఆధిపత్యం చేజిక్కించుకుంటూ వచ్చారు. వ్యాపారం కోసం రేవు పట్టణాల్లో తూర్పు ఇండియా కంపెనీ వ్యాపార సంఘం వారు కట్టుకున్న గిడ్డంగులు కోటలుగా మారాయి. ఈ రకంగా కంపెనీ భారతీయులపై పట్టు సంపాయించింది. 1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత 1858లో కుంపిణీ పాలన అంతరించి బ్రిటిషు పార్లమెంటు ప్రత్యక్ష పాలన ప్రారంభమైంది.

కుంపిణీ యుగం దాదాపు ఒక శతాబ్దం సాగినట్లుగా గమనించవచ్చు. దేశ చరిత్రలో ఈ శతాబ్ది కాలానికి విశేష ప్రాధాన్యత చేకూరింది. ఒక సువిశాల దేశాన్ని అతి కొద్దిమంది వర్తక సమూహం చాపకింద నీరులా ఒక్కో ప్రాంతాన్నే చేజిక్కించుకుంటూ ఒక నాటికి సామ్రాజ్యంగా ఒకే అధికార ఛత్రం కిందకు తీసుకురావడం, బానిసత్వంలో మగ్గిన ప్రజలు క్రమక్రమంగా చైతన్యవంతులు కావడం చూడవచ్చు.

ఈ యుగంలో చెప్పుకోదగిన అంశాలు అనేకం ఉన్నాయి. విద్యా వైజ్ఞానిక రంగాలను మలుపు తిప్పిన అనేక విశ్వవిద్యాలయాలు ఈ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి.

బ్రిటిషు వారి హయాంలో దేశానికి కీడుతోపాటు కొంత మేలు కూడా జరిగింది,

1837లో తపాలా సర్వీసులు ప్రవేశపెట్టడం జరిగింది, 1851లో కలకత్తా - డైమండ్ హార్బర్‌ల మధ్య దేశంలో తొలి టెలిఫోన్ లైను ప్రారంభమైంది. 1852లో ఆంధ్రరాష్ట్రంలో గోదావరి నదిపై ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణం జరిగింది. 1853లో బొంబాయి - థానే మధ్య తొలి రైల్వే లైను ప్రారంభమైంది. 1855లో విజయవాడ వద్ద కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణం ఇలాంటి ప్రజాజీవనప్రయోజనదాయకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి.

అన్నిటికీ మించి ఈ యుగంలో జరిగిన ముద్రణ ప్రయత్నాలు అనంతరకాలంలో సరికొత్త జాగృతికి దోహదం చేశాయి. ఒక విలువైన గ్రంథం ముద్రణ యంత్రం వల్ల లక్షల ప్రతులుగా రూపొందడమనే అద్భుతం ఈ కుంపిణీ యుగంలోనే జరిగింది.

కుంపిణీ యుగంలోనే దేశంలో ఆంగ్లో ఇండియన్ పత్రికల ప్రేరణతో భారతీయ భాషా పత్రికల ఆవిర్భావం జరిగింది. కుంపిణీ సివిల్ ఉద్యోగులుగా దేశానికి వచ్చిన ఎందరో విద్వాంసులు తెలుగు భాషా సాహిత్యాల పట్ల ఎంతో ఆసక్తిని కనబరచారు. ప్రాచీన కావ్య, ప్రబంధ సాహిత్య సంచయాన్ని సముద్ధరించి పరిష్కరించి ప్రచురింప జేసేందుకు కృషి చేశారు. పాశ్చాత్య పండితులు తాము స్వయంగా వ్యాకరణాలు, నిఘంటువులు రచించారు. క్రైస్తవ మత ప్రచారం లక్ష్యంగా ప్రవేశించినప్పటికీ ముద్రణ యంత్రాలు దేశ భాషా సాహిత్యాల ప్రచురణను కూడా చేపట్టాయి. ముద్రణ యంత్రాల వల్ల దేశంలో పత్రికల ఆవిర్భావం, విస్తృతీ సంభవించింది.

కుంపిణీ యుగంలో ముద్రణ ప్రయత్నాలను గురించి చర్చిద్దాం .

## ii. ముద్రణ యంత్రస్థాపన

ప్రపంచంలో ప్రాచీన కాలం నుంచీ అనేక విషయాల్లో ముందడుగు వేసిన చైనా దేశమే కాగితాన్ని కనిపెట్టడంలోనూ, తొలిసారి ముద్రణ జరపడంలోనూ అగ్రస్థానం వహించింది. క్రీ. శ. 401లో చైనీస్‌లోకి అనువదించబడిన DIAMOND SUTRA అనే గ్రంథం చైనాలో క్రీ. శ. 868లో ముద్రితమైంది. ప్రపంచంలో అదే తొలి ముద్రణగా భావించబడుతున్నది. ఈ గ్రంథం బ్రిటిష్ మ్యూజియంలో ఉంది. లభిస్తున్నవాటిలో అతి ప్రాచీనమైన ముద్రిత గ్రంథం ఇది. ఐరోపాలో 15వ శతాబ్దం మధ్య ముద్రణ ప్రారంభమైందని చెప్పవచ్చు. మన దేశానికి ముద్రణ అక్కడి నుంచే వచ్చింది. నిజానికి

చైనా మనకు భౌగోళికంగా పొరుగున ఉండడమే కాక వాణిజ్యపరంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా సన్నిహిత సంబంధాలు కలిగిన దేశం. అయినప్పటికీ ముద్రణగాని, కాగితం గాని నేరుగా అక్కడి నుంచి కాక ఐరోపా నుంచి సంక్రమించడం ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది.

ముస్లిం పాలకుల కాలంలో 13, 14 శతాబ్దాల్లో భారతదేశంలో సిరా, కాగితం, ఈకతో రూపొందిన లేఖినులను ఉపయోగించారు. అయితే అంతకు పూర్వం రచనకు వాడుతున్న భూర్జర పత్రాల, తాళపత్రాల వాడకం తగ్గలేదు.

జర్మనీలోని మెయింజ్‌కు చెందిన గూటెన్‌బర్గ్ (1400-1468)ను ముద్రణ కళకు పితామహునిగా భావిస్తున్నారు. హాలెండ్‌లోని హార్లెమ్ నగరంలోని లారెన్స్ జాన్సన్ కాస్టర్ అనే డచ్చి వ్యక్తి తొలిసారిగా 1439లో చెక్క టైపులు తయారుచేశాడు. అటు తర్వాత ముద్రణ జరిపేటప్పటి ఒత్తిడికి చెక్కటైపులు నిలవకపోవడమే గాక విరిగిపోతాయని భావించి టైపులను సీసంతో తయారు చేశాడు. గూటెన్‌బర్గ్ కాస్టర్ దగ్గర ముద్రణ కళను నేర్చుకున్నాడు. కొంతకాలం తర్వాత కాస్టర్ చర్చికి వెళ్లిన సమయంలో గూటెన్‌బర్గ్ టైపులు, మాట్రిక్స్ తీసుకుని తన స్వస్థలమైన జర్మనీలోని మెయింజ్ వెళ్లాడు. అక్కడే ముద్రణ ప్రారంభించాడు. గూటెన్‌బర్గ్ లోహంతో చేసిన టైపుతో స్వతంత్రంగా ముద్రణ కళను అభివృద్ధి పరచినట్లు తెలుస్తోంది. 1440లో అప్పట్లో ప్రసిద్ధమైన 'అలెగ్జాండ్రి గాలి డాక్ట్రినేల్' అనే వ్యాకరణ గ్రంథాన్ని బ్లాక్‌బుక్‌గా ముద్రించాడు. 1455 ప్రాంతంలో గూటెన్‌బర్గ్ లోహపు టైపుతో 42 పంక్తుల బైబిల్‌ను ముద్రించాడు. ప్రతి పేజీలో ఈ బైబిల్ 42 పంక్తులుండడం వల్ల దీనికి 42 పంక్తుల బైబిల్‌గా పేరు వచ్చింది. ఇది పారిస్‌లోని కార్డినల్ మెజారిన్ గ్రంథాలయంలో లభ్యమవుతున్నందువల్ల దీనికి మెజారిన్ బైబిల్ అని కూడా పేరు వచ్చింది.

1462లో మెయింజ్ అగ్నికి ఆహుతైంది. అక్కడ ముద్రణ పనిలో ఉన్నవారంతా వివిధ ప్రాంతాలకు వలసపోయారు. ఈ వలస వల్ల 1465లో ఇటలీలో, 1469లో ఫ్రాన్సులో, 1470లో ఇంగ్లండులో, 1483లో స్పెయిన్‌లో ముద్రణ కళ వ్యాప్తిలోకి వచ్చింది.

ఇంగ్లండులో 1470లో మొదటి వ్యాపారాత్మక ముద్రణ యంత్రాన్ని నెలకొల్పిన

ఘనత విలియం కాక్స్‌టన్‌కు దక్కుతుంది. 'Collections from the History of Troy' అనే తొలి పుస్తకాన్ని ఆయన అచ్చువేశాడు. తొలిరోజుల్లో ఇంగ్లండుకు హాలెండ్, జర్మనీ మొదలైన ఐరోపా దేశాల నుంచి టైపును దిగుమతి చేసుకున్నారు. అయితే కాక్స్‌టన్ కన్నా ముందు అంటే **1468** డిసెంబర్ 17న ఇంగ్లండులోని ఆక్స్‌ఫర్డ్‌లో జర్మన్ టైపులో **40** పంక్తుల పుస్తకం ముద్రించినట్లు **1483**లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో కనుగొన్నారు.

## iii. భారతదేశంలో ముద్రణ ప్రయత్నాలు

జర్మనీలో గూటెన్‌బర్గ్ బైబిల్‌ను ముద్రించిన నూరేళ్లకు ముద్రణ మన దేశంలో ప్రవేశించింది. ఈ ఘనత క్రైస్తవ మిషనరీలకే దక్కుతుంది. **1556**లో జెసూట్ మిషనరీ వారు గోవాకు ముద్రణ యంత్రాన్ని పంపించారు. గోవాలో నెలకొన్న ముద్రణాశాలలో 'డాక్ట్రినా క్రిష్టా' అనే గ్రంథాన్ని ముద్రించారు. ఈ గ్రంథాన్ని సెయింట్ జేవియర్ రచించాడు. దీని ప్రతులెక్కడా లభ్యం కావడం లేదు. **1578** నాటికి తిరునల్వేలి జిల్లా పునికయెల్ గ్రామంలో ఒక ముద్రణాశాలను స్థాపించారు. అక్కడ 'డాక్ట్రినా క్రిష్టా'ను తమిళంలో అనువదించి ముద్రించారు. ఈ తమిళ గ్రంథం 'కిరిసిట్టియని వణక్కమ్' (డాక్ట్రినా క్రిష్టా తమిళానువాదం) అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో భద్రపరచబడి ఉందని తిరునల్వేలిలోని రాబర్ట్ డినోబిలి పరిశోధనా సంస్థకు చెందిన శ్రీ ఎస్. రాజమాణిక్కం తెలిపారు.[1] ఇదే తొలి ముద్రిత తమిళ గ్రంథం. **1579**లో కొచ్చిన్‌లో జెసూట్ మిషనరీలు ఒక అచ్చు కూటాన్ని నెలకొల్పారు. మన దేశంలో జెసూట్ మిషనరీల కేంద్రాన్ని కొచ్చిన్ నుంచి **1581**లో వైపికోటకు మార్చారు. **1602**లో పోప్ ఒక ముద్రణ యంత్రాన్ని ఇక్కడికి పంపారు. వైపికోటలో తమిళ, మళయాళ, కొంకణి భాషల్లో క్రైస్తవ గ్రంథాల్ని మళయాళంలోకి అనువదించి **1616** ప్రాంతంలో ముద్రించారు. ఈ గ్రంథం రెండవ ముద్రణ **1649**లో, మూడవ ముద్రణ **1654**లో జరిగింది

తొలి రోజుల్లో భారతీయ భాషల్లో గ్రంథాల ముద్రణకు రోమన్ లిపి అనుకూలమైనదిగా భావించారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానమున్న వారెవరైనా ఏ భాషనైనా ఈ లిపిలో సులభంగా చదువుకోవచ్చునని, అధ్యయనం చేయవచ్చునని భావించారు. ఈ విధంగా రోమన్ లిపిలో రోమన్ క్యాథలిక్ ఫాదరీలు గ్రంథాలు ముద్రించసాగారు.

---

1. *The First Oriental Scholar, Rajamanickam, Tirunalveli, 1972.*

1674లో బొంబాయిలో భీమ్‌జీ పరేక్ అనే గుజరాతీ వర్తకుడు ముద్రణాశాల స్థాపించాడు. తర్వాత 1679లో తిరుచూరుకు 20 మైళ్ల దూరంలో ఉండే అంబల్ కాడ్ గ్రామంలో అక్కడి వారు కొందరు ఒక ముద్రణాశాల స్థాపించారు. అక్కడే మొదటి తమిళ-పోర్చుగీసు నిఘంటువు అచ్చయ్యింది. బహుశా భారతదేశంలో ముద్రితమైన తొలి నిఘంటువు ఇదే కావచ్చు. కుంపిణీ వారి పాలన కింద ఉన్న ప్రాంతాల్లో మొట్టమొదటిసారిగా చెన్నపట్టణంలో ముద్రణ యంత్రాన్ని 1711లో నెలకొల్పినట్లు చరిత్రకారులు భావిస్తున్నారు.[2] కలకత్తాలో 1779 నాటికి గాని ముద్రణ యంత్రం నెలకొనలేదు.

1712లో తంజావూరు సమీపాన ఉన్న తరంగం బాడి దగ్గర డెన్మార్క్ మిషనరీ వారు ముద్రణాశాల నెలకొల్పి తమిళ గ్రంథాలను ముద్రించనారంభించారు. ఆకాలంలో డెన్మార్క్ రాజు నాలుగవ ఫ్రెడరిక్ మొదటి జట్టులో ఇరువురు మత ప్రచారకులను తరంగంబాడికి పంపించాడు. వారిలో ఒకరు బర్తలోమయిజిగింబాగ్, రెండవవాడు హెన్రీ ప్లూచో. జిగింబాగ్ బైబిల్‌ను తమిళంలోకి అనువదించాడు. ఇంగ్లీషు సొసైటీవారు 1711లో బహూకరించిన ముద్రణయంత్రంపై లాటిన్ గ్రంథాన్ని ముద్రించాడు. తమిళంలో నీతివెణ్బా, కొంద్రైవేందన్, ఉలగనీతి అనే గ్రంథాలు రచించాడు. 1713లో జర్మనీ నుంచి తనకు వచ్చిన తమిళ ముద్రణా యంత్రంపై మొదటి తమిళ గ్రంథాన్ని జిగింబాగ్ అచ్చువేశాడు. 1709లో మరో ముగ్గురు జర్మనులు మత ప్రచారానికి వచ్చారు. వాళ్లకు జిగింబాగ్ అనేక భాషలు నేర్పాడు. వీరిలో జాన్ ఎర్నస్టస్ గ్రుండ్లర్ ఒకరు. వీరి తర్వాత మరో పదేళ్ల వరకూ జర్మనీ నుంచి ఎవ్వరూ రాలేదు.

1719లో బెంజమెన్ షుల్జ్ మరో ఇద్దరితో భారతదేశానికి వచ్చాడు. అప్పటికి జిగింబాగ్ మరణించాడు. షుల్జ్ రాక గ్రుండ్లర్‌కు ఆనందాన్ని కలిగించింది. తర్వాత 1720 జనవరిలో గ్రుండ్లర్ షుల్జ్‌ని ఫాదరీగా నియమించాడు. ఆ తర్వాత గ్రుండ్లర్ మరణించాడు. షుల్జ్ తరంగంబాడి మిషనరీకి నిర్వాహకుడయ్యాడు. పోర్చుగీసు, డేనిష్, తమిళ భాషల్లో ఆరేళ్లకాలంలో 20 పుస్తకాల్ని ప్రకటించాడు. షుల్జ్ 1725 నాటికి బైబిల్ తమిళానువాదం పూర్తి చేశాడు. దాన్ని 1728లో అచ్చువేశాడు.

---

2. *C.J.Nirmal - The Journal of Indian History - 1966.*

## iv. తెలుగులో తొలి ముద్రిత గ్రంథం - ముద్రణ వ్యాప్తి

ఇప్పటివరకు లభించిన ఆధారాలను బట్టి బెంజమెన్ షుల్జ్ జర్మనీలో 1746లో ముద్రించిన 'మోక్షానికి కొంచ్చుపొయ్యేదొవ' అనే గ్రంథాన్ని తెలుగులో తొలి ముద్రణగా పేర్కొనవచ్చు. అయితే మద్రాసులోని సెంట్ జార్జి కోటలోని గ్రంథ సంచయంలో 1719 నాటి తెలుగు బైబిల్ గ్రంథం ఉన్నట్లు ఆరుద్ర తెలిపారు.[3] ఆనాటికి మద్రాసులో తెలుగు ముద్రణ సౌకర్యాలు లేవని, ఆరుద్రగారు పేర్కొంటున్న తెలుగు బైబిల్ ముద్రిత ప్రతిగాక వ్రాతప్రతి అయి ఉండవచ్చునని డా॥ జె. మంగమ్మ అభిప్రాయపడ్డారు.[4]

## v. తొలి తెలుగు ముద్రాపకుడు

తెలుగు భాషను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఐరోపా దేశీయుల్లో డేనిష్ ఫాదరీ బెంజమెన్ షుల్జ్ మొదటి వాడు. 18వ శతాబ్దం మధ్యలో అనేక తెలుగు గ్రంథాలను ఆయన హాలేలో ముద్రించాడు. ఆ రోజుల్లో తెలుగు అధ్యయనం పట్ల ఐరోపా సమాజం అమితమైన శ్రద్ధను కనబరిచేదని దీన్ని బట్టి గ్రహించవలసి ఉంటుంది. బెంజమెన్ షుల్జ్ తన 29వ ఏట భారతదేశం వచ్చి 23 సంవత్సరాల పాటు సేవ చేసి స్వదేశం తిరిగి వెళ్లి కూడ మరో 17 సంవత్సరాల పాటు జర్మనీలో తెలుగు పుస్తకాల రచనలో, ముద్రణలో నిమగ్నం కావడం సామాన్యమైన విషయం కాదు. ఈయన తర్వాతి ఐరోపా పండితులు పలువురు స్ఫూర్తినిపొంది కారణాలేమైనా కావొచ్చుగాక తెలుగు భాషా సాహిత్యాలకు సేవలందించారని చెప్పక తప్పదు. షుల్జ్ తాను స్వయంగా తెలుగు వైపును పోతపోయించి నాలుగు పుస్తకాలు ప్రచురించాడు. అవి ప్రఖ్యాత జర్మన్ లూథరన్ తత్త్వవేత్త జోహాన్ ఆర్నెడ్ట్ (1555 - 1621) రచించిన గ్రంథాలకు అనువాదాలు. షుల్జ్ అనువదించి ముద్రించిన గ్రంథాల పేర్లు.

1. 'సత్యమైన వేదంలో ఉండేజ్ఞాన ఉపదేశాల యొక్క సంక్షేపం'
   24 పుటలు 1746లో హాలెలో ముద్రణ.

---

3. *Biginings of Telugu Journalism Essay - Arudra, studies in the History of Telugu Journalism, Narla Shashtyabdapurthi Celebration committee, Delhi, 1968.*
4. *Book Printing in India Dr. J. Mangamma, Bangorey Books, Nellore, 1975.*

2. 'మోక్షానికి కొంచుపొయ్యే దొవ' - 47 పుటలు, 1746లో హాలేలో ముద్రణ. దీనికి అనుబంధంగా 24 పుటల ఎడిషన్ వేరే ఒకటుంది.

3. 'వక గురువు అఇదు బ్రాహ్మల యొక్క నడిమను కూర్చుండి విండ్లతోను . . ఆకాసమును భూమిని సృష్టించిన పెద్ద, స్వామి మీద ప్రసంగించ్చిన తర్క మితె' - 48 పుటలు, 1747లో హాలేలో ముద్రణ.

4. 'బుద్ధి కలిగిన తెలుగు వాండ్లలోపల వొకడొకడికి పుంణ్యపుదొవ చూపించ్చెనూరు జ్ఞానవచనాల యొక్క చింన్న పుస్తకం ఇతి' - 48 పుటలు. 1747లో హాలేలో ముద్రణ. దీనికి కూడా ఇంకో ఎడిషన్ ఉన్నట్లుంది.

పై నాలుగు పుస్తకాల ముఖపత్రాల మీద పొడవైన పేర్లూ వివరంగా ఉన్న పెద్దక్షరాలతో చిన్న పేర్లను సూచించాడు. మొదటిది 'సంక్షేపం', రెండవది 'మోక్షానికి', మూడవది 'పెద్దస్వామి', నాలుగవది 'నూరు జ్ఞానవచనాల' అని పేర్కొనబడటం గమనార్హం.

బెంగాలుకు 1770లో క్లర్కుగా వచ్చిన బ్రిటిష్ దేశీయుడు చార్లెస్ విల్కిన్స్. ఈయన సంస్కృతాన్ని అధ్యయనం చేసిన పాశ్చాత్యుల్లో మొదటివాడు. అతడు భగవద్గీత, హితోపదేశం, శాకుంతలం వంటి గ్రంథాలను ఇంగ్లీషులోకి అనువదించాడు. అంతేగాక అతడు స్వయంగా ముద్రణకోసం టైపులను తయారు చేసి లోహంపై పోతపోసి దేవనాగరి లిపి టైపు సిద్ధం చేశాడు. ఇదే పద్ధతిలో ఇతర భారతీయ భాషలకు కూడా ముద్రాక్షరాలను రూపొందించడంలో స్థానికులకు విల్కిన్స్ శిక్షణ నిచ్చాడు. అందరిలోకి పంచానన్ అనే నిపుణుడైన కంసాలికి ఈ కళ బాగా అబ్బింది. ఆ తర్వాత ఈ నైపుణ్యం సిరాంపూర్‌లో తెలుగు ముద్రణలో ప్రధాన పాత్ర వహించింది.

## vi. మద్రాసులో తెలుగు ముద్రణ

తొలినాళ్ల తెలుగు ముద్రణ మద్రాసులో, సిరాంపూర్‌లో ఏకకాలంలో జరిగింది. అయితే మద్రాసులో ముద్రణాశాల నెలకొనడం విచిత్రమైన పరిస్థితిలో జరిగింది. 1761లో బ్రిటిషు వారు ఫ్రెంచివారి అధీనంలో ఉండిన పాండిచ్చేరిని వశపరచుకొని అక్కడ గవర్నరు భవనంలో ఉన్న ముద్రణాశాలను మద్రాసుకు తెచ్చారు. అప్పట్లో

మద్రాసులో ఉన్న తమిళ విద్వాంసుడయిన ఫాబ్రిసియస్ అనే ఆంగ్లేయుడికి దాన్ని అప్పగించారు. ఆ ముద్రణ యంత్రాన్ని వేప్పేరిలోని మిషన్ కాంపౌండ్‌లో అమర్చారు. అందులో 1779లో తమిళ - ఆంగ్ల నిఘంటువును, 1786లో ఆంగ్ల - తమిళ నిఘంటువును ముద్రించారు. 1873లో ప్రచురితమైన 1871 మద్రాసు పట్టణ జనాభా నివేదికలో మద్రాసులో జరిగిన విద్యావికాసానికి సంబంధించిన సంగ్రహ వివరణ ఉంది. అందులో పాండిచ్చేరి నుండి తెచ్చిన ముద్రణాశాల గురించి వివరిస్తూ, "ఒన్స్‌మోర్, దేర్‌ఫోర్, ఈజ్ మెడ్రాస్ ఇన్‌డెటెడ్ టు ది మిషనరీస్ ఫర్ ఇట్స్ ఫస్ట్ ప్రెస్" అని రాశారు. ఈ వాక్యం ఆధారంగా చూస్తే 1761కి పూర్వమే మద్రాసులో ముద్రణాశాల ఉండి ఉండాలని భావించటానికి అవకాశం ఉంది. హెచ్. డి. లవ్ అనే ఆయన 1746 నాటి మద్రాసులోని ముద్రణాశాల గురించి ప్రస్తావించారు. రోమన్ క్యాథలిక్ శాఖ వారైన ఫ్రెంచివారు మద్రాసుపై జరిపిన దాడిలో 1746లో అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రొటెస్టెంటు శాఖవారైన జర్మన్ మిషను వారి భవనాన్ని కూడా కూల్చివేశారు. ఆ జర్మన్ మిషన్ వారివద్ద ఆ భవనంలో ఒక ముద్రణా యంత్రం కూడా ఉండేది. బహుశా ఫ్రెంచివారు ఆ ముద్రణా యంత్రాన్ని పాండిచ్చేరికి తీసుకువెళ్లి ఉండవచ్చు. ఈ విధంగా 1746లో పాండిచ్చేరికి తీసుకెళ్లిన ముద్రణ యంత్రమే 1761లో ఆ నగరాన్ని ఆంగ్లేయులు పట్టుకున్న సందర్భంలో తిరిగి మద్రాసుకు తీసుకురావడం జరిగింది.

1712 ప్రాంతంలో తరంగంబాడి మిషనరీ వారికి లండన్‌లోని 'ది సొసైటీ ఫర్ ప్రమోటింగ్ ది క్రిస్టియన్ నాలెడ్జి' వారు ఒక ముద్రణ యంత్రాన్ని బహూకరించారు. ఈ యంత్రం మద్రాసు చేరి ఉండవచ్చు. దీన్ని ఫ్రెంచి వారు 1746లో పాండిచ్చేరికి తీసుకెళ్లగా, 1761లో ఆంగ్లేయులు తిరిగి మద్రాసుకు తీసుకువచ్చారు.

ది మద్రాస్ రిలిజియస్ ట్రాక్ట్ సొసైటీ 1818లో ప్రారంభమై ఆ శతాబ్దాంతానికి తెలుగులో 10 లక్షల మేరకు క్రైస్తవ మత ప్రచార గ్రంథాలను ముద్రించింది.

## vii. సిరాంపూర్‌లో ముద్రణ

లండన్ మిషనరీ సొసైటీకి చెందిన విలియం క్యారీ భాషల పట్ల తనకున్న అమితమైన శ్రద్ధ వల్ల 1798లో సిరాంపూర్ వచ్చేముందే ఒక ప్రెస్సు కొన్నాడు.

అంతకుముందు విల్‌కిన్స్ దగ్గర ముద్రణ కళలో ప్రావీణ్యం సంపాదించిన పంచానన్ ఉద్యోగం వెతుక్కుంటూ సిరాంపూర్‌కు వచ్చాడు. అతడ్ని క్యారీ చేరదీశాడు. పంచానన్ మనోహర్ అనే మరో సహచరుడ్ని తెచ్చుకున్నాడు. తొలినాళ్ల తెలుగు ముద్రణను వీళ్లు దాదాపు **40** సంవత్సరాల పాటు సిరాంపూర్‌లో జరిపారు.

**1804**లో ప్రాక్ భాషల్లోకి గ్రంథాలను అనువదించేందుకు సిరాంపూర్ మిషనరీలు ఇంగ్లండులోని తమ సొసైటీకి ప్రతిపాదనలను సమర్పించారు. వారు అనువాదానికి ప్రతిపాదించిన ఏడు భాషల్లో 'తెలింగ' ఒకటి. ఇందుకోసం తమ వద్ద పెద్ద ఎత్తున ముద్రాక్షరాలూ ఇతర సామగ్రీ ఉన్నట్లు సిరాంపూర్ మిషనరీ వారు తమ సొసైటీకి నివేదించారు. ఈ విధంగా ముద్రణ ప్రారంభమైంది. బ్రిటిష్ అండ్ ఫారిన్ సొసైటి వారు బైబిల్‌ను, బైబిల్‌లోని కొన్ని అధ్యాయాలను ప్రకటించి కలకత్తాలోని రాధాబజారులో అమ్మకానికి ఉంచారు. అలా ఉంచిన వాటిల్లో బెంగాలీ బైబిల్ - **24** రూ, బైబిల్ అధ్యాయాలు సంస్కృతానువాదం - **12** రూ. ఒరియా అనువాదం - **8** రూ. తెలింగ గాస్పెల్స్ - **4** రూ.[5] ఇలా ధరలు నిర్ణయించారు.

సిరాంపూర్ మిషనరీని వార్డు అనే అతడు ఈ విధంగా వర్ణించాడు. "అక్కడ భారతీయులు వివిధ భాషల్లోకి గ్రంథాలను అనువదించడం, ప్రూఫులు దిద్దడం కనిపిస్తుంది. అరబ్బీ, ఫార్సీ, నాగరి, తెలుగు, బెంగాలీ తదితర భాషల ముద్రాక్షరాల కేసులున్నాయి."[6] ఖర్చు తగ్గించేందుకు తెలుగు, నాగరి భాషల ఫాంటులను లండన్ నుంచి శీఘ్రగతిన దిగుమతి చేసుకొనేవారు.

**1807** జూలై నాటికి సిరాంపూర్ మిషనరీల వారు తెలుగు, ఫార్సీలతో సహా నాలుగు భాషల్లో గ్రంథాల ముద్రణ కోసం ఫాంటులను ఇంగ్లండులో తయారు చేశారు.

**1812** మార్చి **11**న సిరాంపూర్ ముద్రణశాల పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ప్రాచ్య భాషల ముద్రణకు సంబంధించి **14** ఫాంటుల భారీ టైపు దగ్ధమైంది. రామాయణ అనువాదానికి సంబంధించిన లిఖిత ప్రతి పూర్తిగా ధ్వంసమైపోయింది. పాలీ గాట్ నిఘంటువు, తెలుగు వ్యాకరణం ముసాయిదా ప్రతి కూడా కాలిపోయిన వాటిల్లో ఉన్నాయి.[7]

---

5. *Carey the good old days of Honourable John company 1684-1800 Vol. II.PP39-40*
6. *The Audit Bureau of circulation, History of press in India. P. 33*
7. *Ibid, p.p. 468-469 Grierson. P.40.*

తిరిగి అనువాదాలు చేయించేందుకు పండితులను నియమించారు. నాలుగు టన్నులకు పైగా లోహాన్ని సేకరించి టైపులు తయారు చేశారు. కొన్ని మాసాల్లోనే ప్రెస్సు మళ్లీ పూర్తి స్థాయిలో పని చేయడం ప్రారంభించింది. అగ్ని ప్రమాదంలో దగ్ధమైన అనువాదాల పనంతా ఆ సంవత్సరాంతానికే పునః ప్రారంభమైంది. వాటిలో ఒకటి విలియం క్యారీ 'తెలుగు వ్యాకరణం' (1814).

## viii. విశాఖ పట్నంలో ముద్రణ

1804 ఫిబ్రవరిలో లండన్ మిషన్ సొసైటీ జార్జిక్రేన్, ఆగస్టస్ డిగ్రాంజెస్ అనే ఇద్దరు మత ప్రచారకులను భారతదేశం పంపింది. వారు డిసెంబర్‌లో తరంగం బాడి చేరుకొని కొంతకాలం తర్వాత అంటే 1805 జూలై 25న ఉత్తర సర్కారుల్లోని విశాఖ పట్టణం వచ్చారు. వారక్కడ తెలుగు నేర్చుకున్నారు. నిఘంటు నిర్మాణం, వ్యాకరణ రచనకు కృషి చేశారు. ఆ రెండింటిలో జరిపిన కృషి వారు చేపట్టిన బైబిల్ అనువాదానికి దోహదం చేసింది. మైసూరులో టిప్పుసుల్తాన్ సైన్యంలో పని చేసిన సుబ్బారావు తర్వాత క్రైస్తవ మతంలోకి మారి, తన పేరు సైతం ఆనందరావుగా మార్చుకున్నాడు. మొత్తం మీద తరంగంబాడి మిషనరీ అనుమతి పొంది విశాఖ వచ్చి డిగ్రాంజెస్, క్రేన్‌లకు బైబిల్ తెలుగు అనువాదంలో సహకరించడం ప్రారంభించాడు. కొంతకాలానికి జార్జిక్రేన్ మరణించాడు. డిగ్రాంజెస్ జబ్బు పడ్డాడు. అంతలో జాన్ గార్డన్ అనే కొత్త ప్రచారకుడు విశాఖ వచ్చాడు. అనారోగ్యంలో ఉన్న డిగ్రాంజెస్ ఆనందరావును, అసంపూర్తిగా ఉన్న బైబిల్ అనువాదాన్ని గార్డన్‌కు అప్పగించాడు. 1810 జూలై 12 నాటికి డిగ్రాంజెస్ మరణించకముందే మత్తయి, మార్కు, లూకా మూడు సువార్తల అనువాదం పూర్తయింది. 1812లో వాటిని సిరాంపూర్‌లో ముద్రించారు "దేవుని యొక్క సమస్తమైన వాక్యము", "సువిశేషము మమ్మును రక్షించే కర్త అయిన యేసుక్రీస్తు యొక్క శుభ సమాచారము" అనే పేరుతో ప్రచురించారు.

డిగ్రాంజెస్ మరణించిన రెండేళ్లకు ఎడ్వర్డ్ ప్రిచ్చెట్ విశాఖపట్టణం మత ప్రచారకునిగా వచ్చాడు. డిగ్రాంజెస్ వదిలివేసిన భాగాలను అనువదించడం ప్రారంభించాడు. ఆరు సంవత్సరాలకు మూఢు సువార్తల అనువాదం పూర్తయి 1818లో మద్రాసులోని

కమర్షియల్ ప్రెస్‌లో ముద్రితమైంది. దాని ముఖపత్రంపై జాన్‌గార్డన్, ఆనందరాయర్ల సహాయంతో ఎడ్వర్డ్‌ప్రిచ్చెట్ అనువదించినట్లు వేశారు. 'యేసు క్రీస్తు యొక్క నూతన నిర్ణయమైయున్నది' అని పేరు పెట్టారు.

ఆ సంవత్సరంలోనే సిరాంపూర్‌లోని మిషనరీలు అనువదించిన **860** పుటల తెలుగు బైబిల్ వారి ముద్రణాలయంలో అచ్చువేశారు. దాని పేరు 'ఈశ్వరుని అన్న మాటలు. . . . ఇది దమన్ పుస్తకము' ఇందులో పాత, కొత్త నిబంధనల్ని రెంటినీ అనువాదం చేశారు. అయితే ఈ అనువాదానికి పెద్దగా ఆదరణ లభించలేదు. **1831, 1854** సంత్సరాల్లో విశాఖ మిషనరీ వారు చేసిన అనువాదాన్ని ఆధారం చేసుకొని పునర్ముద్రణలు జరిగాయి.

దక్షిణ భారతీయ భాషల్లో ప్రధానంగా మిషనరీలు గ్రంథ ప్రచురణ చేపట్టినా సెంట్ జార్జి కోటలో కాలేజి ఏర్పాటయ్యాక మద్రాసు కుంపిణీ ప్రభుత్వం వారు కూడా ప్రాథమిక పాఠ్య గ్రంథాలను ప్రచురించారు. కోటలో కాలేజికి అనుబంధంగా ప్రెస్సు, ఒక డిపో **1812**లో తలపెట్టారు. లాటిన్, ఇంగ్లీషు, తమిళ, తెలుగు భాషల్లో గ్రంథ ప్రచురణ ప్రయత్నాలు మొదలు పెట్టారు. తెలుగు అక్షరాలను పోతపోసే మూల యంత్రాలను, పరికరాలను కొనడానికి పెట్టుబడి కోసం కొంత మొత్తాన్ని మంజూరు చేశారు. ఇదే కాలంలో ప్రైవేటు ప్రెస్సులో కూడా గ్రంథాల ముద్రణ జరిగింది. విలియం బ్రౌను గారి వ్యాకరణం, విలియం బ్రౌన్ వొకాబ్యులరీ వంటివి కొన్ని ముద్రణ జరిగిన వాటిలో వున్నాయి.

కుంపిణీ వారి సివిల్ సర్వెంట్లు చాలా మంది పాఠ్య గ్రంథాలుగా ఉపయోగపడే పుస్తకాలను రాయసాగారు. మిషనరీలు దేశంలోని కుంపిణీ వారి పరిధిలోని రాజ్యాల్లో స్వేచ్ఛగా ప్రచారం కొనసాగించవచ్చుననే హక్కును **1814** నాటి చార్టరులో పొందుపరచాక **1817**లో బళ్లారిలో వెర్నాక్యులర్ ట్రాక్టు సొసైటీని స్థాపించారు. కరపత్రాల వంటి చిన్న పుస్తకాలను ఇక్కడ మిషనరీలు ప్రచురణకు సిద్ధం చేసేవారు. **1825** నాటికి బళ్లారిలో ప్రెస్సు నొకదాన్ని వీరు స్థాపించారు. మొత్తం మీద మిషనరీల ముద్రణలన్నీ క్రైస్తవ మత ప్రచారానికి ఉద్దేశించినవే. తర్వాతి కాలంలో మచిలీపట్నం, కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి వంటి ప్రాంతాల్లో ముద్రణాశాలలు నెలకొన్నాయి.

సి. పి. బ్రౌన్ తన తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు ప్రవేశికలో (1852) తెలుగులో ముద్రణ 1806లో ప్రారంభమైనా ముద్రణ అభివృద్ధి 1830లోనే జరిగిందని రాశారు. అయితే తెలుగు ముద్రణ తెలుగు వారి మధ్య కాకపోయినా 18వ శతాబ్దం పూర్వార్ధంలోనే ప్రారంభమైందని పేర్కొనడం జరిగింది. 1807లో తెలుగు వ్యాకరణం, 1812 మామిడి వెంకయ్య 'ఆంధ్ర దీపిక', 1816లో ఎ. డి. క్యాంబెల్ 'తెలుగు వ్యాకరణం', 1819లో రావిపాటి గురుమూర్తి శాస్త్రి 'విక్రమార్క కథలు' ముద్రించబడ్డాయి.

1815లో బళ్లారిలో బళ్లారి ట్రాక్ట్ సొసైటీ ఏర్పడింది. సొసైటీకి చెందిన ప్రెస్సు వేలాది చిన్న పుస్తకాలు ముద్రించినట్లు సిలోన్‌కు చెందిన సౌత్ ఇండియా మిషనరీ కాన్ఫరెన్స్ తెలియజేసింది. క్రైస్తవ ధర్మశాస్త్రంపై ఉపన్యాసాలు, సాక్ష్యాలు, పవిత్ర గ్రంథ చరిత్ర వంటి గ్రంథాలను బళ్లారిలోని మిషనరీ ప్రెస్సు ముద్రించింది.

ముద్రణ యంత్రాల ఫలితంగా విద్యార్థులకు, సాధారణ పాఠకులకు అద్భుతమైన సాహిత్యం సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చింది.

ముద్రణ యంత్రాల యుగం పత్రికా ప్రచురణ యుగం కోసమేనన్నట్లు పురోగమించింది.

## పాశ్చాత్యుల సేవ :

### ix. బెంజమెన్ షుల్జ్ - తొలి తెలుగు ముద్రాపకుడు

తెలుగులో తొలిసారిగా గ్రంథాన్ని ముద్రించి చరిత్రకెక్కిన బెంజమెన్ షుల్జ్ చిరస్మరణీయుడు. ఇతడు 1689లో జర్మనీలో జన్మించాడు. 1719లో తన 29వ ఏట దక్షిణ భారతదేశం వచ్చాడు. డెన్మార్క్ రాజు ఐదవ ఫ్రెడరిక్ పంపగా జర్మనీ నుంచి దక్షిణ భారతదేశంలోని తరంగంబాడికి క్రైస్తవ మత ప్రచారం కోసం వచ్చిన రెండవ జట్టు ఫాదరీల్లో షుల్జ్ ఒకరు. చెప్పులు సైతం లేకుండా నిరాడంబరంగా పాదచారిగా మత ప్రచారం చేశాడు. అనారోగ్య కారణాల వల్ల స్వదేశం తిరిగి వెళ్లిన తర్వాత కూడా తెలుగు టైపులు పోతపోయించి, తెలుగు గ్రంథాలు రచించి ముద్రించాడు. జర్మన్ లూథరన్ తత్త్వవేత్త జోహన్ ఆర్నెడ్ (1555-1621) రచించిన నాలుగు గ్రంథాలను షుల్జ్ తెలుగులోకి హాలేలో ముద్రించాడు. 23 సంవత్సరాల సుదీర్ఘకాలం

ముద్రణారంగంలో శ్రమించాడు. స్వదేశం వెళ్లిపోయాక కూడా 17 సంవత్సరాల పాటు తెలుగు పుస్తకాలు ముద్రించాడు. స్వయంగా 'GRAMMATICA TELUGICA' (1728) పేర 8 ప్రకరణాల్లో తెలుగు వ్యాకరణం రచించాడు. దీనిని హాలే విశ్వవిద్యాలయం వారు భద్రపరచి 1984లో తొలిసారి ముద్రించారని ఆరుద్ర తెలియజేశారు.[8] తమిళం, పోర్చుగీసు, డేనిష్ భాషల్లో 20 పుస్తకాలను ఆరేళ్లలో ముద్రించాడు. మద్రాసులో సెంట్ జార్జ్ కోటలో కుంపిణీ గవర్నర్‌ను ఒప్పించి భారతీయుల కోసం పాఠశాల పెట్టించడమే గాక అందులో తెలుగు విభాగాన్ని ప్రారంభించి పిల్లల్లో తానూ ఒకనిగా కేవలం రెండు నెలల్లో తెలుగు నేర్చుకున్నాడు. అంతేకాదు బైబిల్‌ను సాహసోపేతంగా తెలుగులోకి అనువదించి ముద్రించాడు. 1760 నవంబర్ 25న షుల్జ్ కన్నుమూశాడు.

## x. జేమ్స్ గ్రాంటు - దేశీయ విద్యలపై దృష్టి :

కుంపిణీ వారికి మన దేశంలో మొట్టమొదట వశమైనవి ఉత్తర సర్కారులు. ఈ ప్రాంతాల సంక్షిప్త రాజకీయ చరిత్రను, విపులమైన రెవెన్యూ చరిత్రను వ్రాసిన తొలి ఆంగ్లేయుడు జేమ్స్ గ్రాంటు[9] నిజాం దర్బారులో బ్రిటిషు రాయబారిగా పనిచేశాడు. దేశీయ విద్యలు మూలపడ్డాయని, వాటిని ఉద్ధరించాలని చెప్పాడు.

## xi. ఛార్లెస్ వైట్ - నిఘంటు నిర్మాణానికి అంకురార్పణ

సెంట్ జార్జ్ కోటలో సివిల్ సర్వెంట్ హోదాలో పనిచేసిన ఛార్లెస్ వైట్ తెలుగులో నిఘంటు నిర్మాణానికి 1793 ప్రాంతాల్లో అంకురార్పణ చేశాడు.

మంచి నిఘంటువు తయారు చేసిన వారికి బహుమతులివ్వాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశాడు. అంతేకాదు తెలుగు నేర్చుకొనేవారికి ఉపయోగపడే ప్రాథమిక గ్రంథాలను రాయించాలని సూచించాడు. ఈయన సూచనవల్లే సెంట్ జార్జి కోట

---

*8. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర 9వ సంపు. కుంపిణీ యుగం*

*9. " " "*

పాలకులు మామిడి వెంకయ్య 'ఆంధ్ర దీపిక' హక్కులను కొన్నారని భావించవచ్చునని ఆరుద్ర తెలిపారు.

## xii. సి. పి. బ్రౌన్ - పునరుజ్జీవన ప్రదాత

తెలుగు భాషా సారస్వతాల రంగాన్ని బ్రౌను మహోజ్వల కాంతులతో నింపాడు. తెలుగు భాషా సాహిత్యాల పునరుద్ధరణకు, పునరుజ్జీవానికి అతడు ధారవోసిన శ్రమ అపారం. 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఇంగ్లండులో విద్యాభ్యాసం తర్వాత 1817లో కుంపిణీ ప్రభుత్వ సివిల్ సర్వెంట్‌గా భారతదేశంలో అడుగుపెట్టాడు. దక్షిణ భారత క్యాడర్‌లో బ్రౌను నియామకం ముఖ్యంగా తెలుగు వారు చేసుకున్న పుణ్యం.

కలెక్టరు సహాయకునిగా, మెజిస్ట్రేటుగా, పర్షియన్, తెలుగు అనువాదకునిగా, పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా, విద్యామండలి సభ్యునిగా, కాలేజ్ బోర్డు కార్యదర్శిగా అనేక హోదాల్లో అనేక ప్రాంతాల్లో ఉద్యోగం చేశాడు. 38 సంవత్సరాలు కుంపిణీ వారి కొలువులో ఉన్నాడు. తాను దేశంలోనూ, తిరిగి ఇంగ్లండు వెళ్లాకకూడా మొత్తం దాదాపు ఐదున్నర దశాబ్దాల కాలం తెలుగు భాషా సాహిత్యాల వికాసం కోసం అవిశ్రాంతంగా కృషి చేశాడు. ఇది ఒక వ్యక్తికి సాధ్యమయ్యే పని కాదు. తెలుగు గ్రంథాల రచనలో, తాళపత్ర గ్రంథాల సేకరణలో, ఉద్ధరణలో, భద్రపరచడంలో, పరిష్కరణలో, ముద్రణలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పనిచేశాడు బ్రౌన్. బ్రౌన్ వేమన పద్యాల ఆంగ్లానువాదం 1825లోనే చేపట్టాడు. తెలుగు ఛందస్సు (1827) ముద్రించాడు. తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు, తెలుగు వ్యాకరణం, ఆంగ్లంలో తెలుగు వ్యాకరణం ప్రచురించాడు. ది లిటిల్ లెక్సికాన్, ది జిల్లా డిక్షనరీ కూర్చాడు. కొత్త నిబంధనను అనువదించాడు. వేమన పద్యాలను ఆంగ్లంలో 1829లో 693 పద్యాలతో, 1839లో 1164 పద్యాలతో ప్రచురించాడు. ఆయన ఎన్నో విధాలా శ్రమించి వ్యయప్రయాసల కోర్చి సేకరించిన తెలుగు, సంస్కృత గ్రంథాల సంఖ్య వేలల్లో వుంది. మాజేటి సర్వేశలింగం సంకలనం నుండి సేకరించిన గ్రంథాలు 613 కాగా 227 గ్రంథాలు తెలుగు, 386 సంస్కృత గ్రంథాలు. మచిలీపట్నంలో కొన్నవి 1830 గ్రంథాలు. ప్రత్యేకంగా కడపలో భవనాన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి, దిగ్గంతులైన పండితులను

నియమించి అనేక కావ్యాలు, శతకాలకు సంబంధించిన వేరు వేరు చోట్ల లభ్యమైన ప్రతులను పోల్చి చూపి (Collation) శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరింపజేశాడు. వాటిల్లో వసు చరిత్ర, మనుచరిత్ర, రాఘవపాండవీయం, రంగనాథ రామాయణం, పండితారాధ్య చరిత్ర, పల్నాటి వీర చరిత్ర, దశావతార చరిత్ర మొదలైనవి ఉన్నాయి.

పోతన భాగవతాన్ని పరిష్కరించడమే కాక తెలుగు భారతం 18 పర్వాల పరిష్కరణకు, శుద్ధ ప్రతుల తయారీకి **2714** రూపాయలు ఖర్చు చేశాడు. తెలుగు నేర్చుకోదలచే ఇంగ్లీషు వారి కోసం, ఇంగ్లీషు నేర్చుకోదలచే తెలుగు వారి కోసం వాచకాలు తయారు చేశాడు. మద్రాసులో, కడపలో, మచిలీపట్నంలో స్వంత ఖర్చులతో ఉచిత పాఠశాలలు నడిపాడు. ఆయనే అన్నాడు " In 1825 I found Telugu Literature dead in thirty years I raised it to life "[10] అని. అది అక్షరాలా నిజం. 1855 ఏప్రిల్‌లో ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తిరిగి ఇంగ్లండు వెళ్లిపోయాడు. లండన్ యూనివర్సిటీలో తెలుగు గౌరవ ఆచార్యునిగా పనిచేశాడు. గ్రంథ రచన, ముద్రణ నిర్వహించాడు. ఆయన చివరి ప్రచురణ 'తాతాచార్యుల కథలు'. **1884**లో కన్నుమూశాడు. పురుషులందు పుణ్య పురుషులు వేరయా అన్న వేమన పద్యానికి నిదర్శనంగా తెలుగుజాతి ఎన్ని తరాలకైనా మరువరాని పుణ్య పురుషుడు సి. పి. బ్రౌన్.

## xiii. సర్ థామస్ మన్రో - ప్రజల గవర్నరు

తన **19** ఏళ్ల వయసులో మద్రాసుకు సైనిక విద్యార్థిగా వచ్చిన సర్ థామస్ మన్రో తన **66**వ ఏట మద్రాసు గవర్నర్‌గా చేస్తూ చనిపోయాడు. తెలుగు నేర్చుకున్న తెల్ల దొరల్లో ఈయన సుప్రసిద్ధుడు. రాయలసీమ తెల్లదొరల అధీనంలోకి వచ్చాక ఈయనను పాలకునిగా నియమించారు. దత్త మండలాల్లో ఉన్న **80** మంది పాలెగాండ్లను అదుపులోకి తెచ్చి రైతులకెంతో ఉపకారం చేశాడు. పాఠశాలలు నెలకొల్పేందుకు, ప్రజోపయోగకరమైన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడానికి పథకాలు రూపొందించాడు. రాయలసీమ అంటే ప్రాణం.

---

*10. Litarary Auto-Biography of C.P.Brown, S.V. University, 1978.*

## xiv. విలియం బ్రౌన్ - విశిష్ట వ్యాకర్త

1783లో రైటర్‌గా మద్రాసు వచ్చిన విలియం బ్రౌన్ మచిలీపట్నం, విజయనగరం, విశాఖ, గంజాం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో అనేక హోదాల్లో 50 సంవత్సరాల పాటు పనిచేశాడు. 1817లో 'జెంటూ' (తెలుగు) వ్యాకరణం ముద్రించాడు. అందులో పూర్వ వ్యాకర్తలను స్మరించడమే గాక కొన్ని పూర్వ వ్యాకరణాలు నిరుపయోగాలన్నాడు. 1818లో ఆయన ప్రచురించిన జెంటూ వొకాబులరీ వల్ల ఆనాటి సాంఘిక చరిత్ర తెలుసుకోవచ్చు. 1832లో తెలుగు అనువాదకునిగా పనిచేశాడు. మచిలీపట్నంలోని మామిడి వెంకయ్య, గుండుమల్ల పురుషోత్తం వంటివారు విలియం బ్రౌను తెలుగు వ్యాకరణ రచనకు సహాయం చేశారు. ఆయన తెలుగు వ్యాకరణం చాలా విశిష్టమైనది. ఇంగ్లీషు వర్ణక్రమం ప్రకారం తెలుగు అక్షరాలు 22 మాత్రమేనని వర్గీకరించాడు. ఇది ఇంగ్లీషు వాళ్లు తెలుగు నేర్చుకొనేందుకు దోహదం చేసింది. తెలుగు భావ ప్రకటనకు గంభీరంగానూ, వినడానికి కమ్మగానూ ఉంటుందని అన్నాడు.

## xv. ఎ. డి. క్యాంబెల్ - ప్రామాణిక వ్యాకరణం

అలెగ్జాండర్ డంకన్ క్యాంబెల్ 1807లో రైటర్‌గా మనదేశానికి వచ్చాడు. బళ్లారి, తంజావూరు కలెక్టరుగా పనిచేశాడు. ప్రభుత్వ తెలుగు, పర్షియా అనువాదకునిగా పనిచేశాడు. బళ్లారి మిషన్‌కు ఈయన కృషివల్లే ముద్రణశాల లభించింది. 1817లోనే సెంట్ జార్జికోట కాలేజ్ బోర్డుకు కార్యదర్శి అయ్యాడు. రెవెన్యూ బోర్డు కార్యదర్శిగా కూడా పనిచేశాడు. తెలుగును నిశితంగా అధ్యయనం చేయడమేగాక తెలుగులోనూ, తెలుగును గురించి ఆంగ్లంలోనూ ప్రామాణిక రచనలు చేసిన కొద్ది మందిలో క్యాంబెల్ ఒకరు. ఉదయగిరి నారాయణయ్య అనే పండితుని దగ్గర ఆంధ్ర శబ్ద చింతామణిని ఆమూలాగ్రం చదువుకున్నాడు. మామిడి వెంకయ్య ఆంధ్ర దీపిక పీఠిక, ఆంధ్రకౌముది, అహోబిల పండితీయం మొదలైనవి 10 ఏళ్లపాటు శ్రద్ధగా పఠించాడు. ఈ పరిజ్ఞానంతో తర్వాతి వారికి ఉపయుక్తంగా ఉండేలా ఆరు అధ్యాయాలు, 519 సూత్రాలతో తెలుగు వ్యాకరణాన్ని ఇంగ్లీషులో రచించాడు. అప్పట్లో ఇంగ్లీషు వచ్చిన తెలుగు వ్యాకరణాల్లో క్యాంబెల్ వ్యాకరణ గ్రంథం ప్రామాణికమైనదిగా పరిగణనకెక్కింది.

1812 నుంచి దేశ భాషల అధ్యయన సంఘానికి కార్యదర్శిగా ఉన్నాడు. అదే తర్వాత కాలేజ్ బోర్డుగా మారింది. 1816లో వ్యాకరణం ముద్రణ జరిగింది. 1812 నుంచి 1820 వరకు ఎనిమిదేళ్లు కాలేజ్ బోర్డు కార్యదర్శిగా, పరీక్షాధికారిగా పనిచేశాడు. ఆయన ప్రతిభా విశేషాలకు మెచ్చి ప్రభుత్వం వారు నిఘంటువు రాయమన్నారు. క్యాంబెల్ ఆంధ్ర దీపికను ప్రాతిపదికగా తీసుకొని కొత్త పదాలు కలుపుకుంటూ తెలుగు ఇంగ్లీషు అర్థాలిస్తూ నిఘంటువు పూర్తి చేశాడు. దాని తొలి ముద్రణ 1821లోనూ, రెండవ ముద్రణ 1848లోనూ జరిగింది. తన వ్యాకరణానికి ఆయన రాసిన ప్రవేశిక చాలా గొప్పది. ఆంధ్ర భాషా చరిత్రను, ఆంధ్రదేశ చరిత్రను సంక్షిప్తంగా రాసినా అది కూడ ప్రామాణికమైనది. ఆంధ్ర చరిత్ర రచించిన వారిలో క్యాంబెల్ మొదటివాడు కావచ్చునని ఆరుద్ర అభిప్రాయపడ్డారు.[11] తన గ్రంథంలో త్రిలింగ శబ్దానికి విపులమైన పీఠిక రచించాడు. ప్రాచీన పాశ్చాత్య చరిత్రకారులు ఆంధ్రదేశం గురించి భావించిన అంశాల్ని ప్రస్తావించాడు. వివిధ భారతీయ పురాణాల్లో ఆంధ్రప్రసక్తి ఉన్న ఘట్టాలను క్రోడీకరించాడు. మెకంజీ సేకరించిన వ్రాత ప్రతులను, శాసనాలను ఆధారం చేసుకొని విజయనగర రాజుల జాబితా రూపొందించాడు.

## xvi. ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ - తులనాత్మక అధ్యయనం

మద్రాసులో రైటర్‌గా 1796లో సివిల్ సర్వీసు ప్రారంభించిన ఎల్లిస్ 1802లో రెవెన్యూ బోర్డు సభ్యునిగా, జిల్లా జడ్జిగా, కలెక్టర్‌గా అనేక హోదాల్లో పనిచేశాడు. మచిలీపట్నంలో జడ్జిగా పనిచేస్తున్నప్పుడు తెలుగు బాగా నేర్చుకున్నాడు. తెలుగు, తమిళం, మళయాళం భాషల్లో ప్రావీణ్యం సంపాదించడంతో పాటు దక్షిణ భారతీయ భాషల విషయంలో చెప్పుకోదగిన కృషి చేశాడు. తమిళ, సంస్కృత, మళయాళ భాషలలో తెలుగును తులనాత్మకంగా అధ్యయనం చేసి ద్రావిడ భాషావాదం బలపడడానికి ఎల్లిస్ దోహదం చేశాడు.

ఎ. డి. క్యాంబెల్ తెలుగు వ్యాకరణానికి పరిచయంగా ఎల్లిస్ తెలుగుతో ద్రావిడ భాషకు గల సామ్యాన్ని గురించి రాసిన నోటును (1816) పొందుపరచడం జరిగింది.

---

*11. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర - 9వ సంపుటం.*

భారతీయుల సాంఘిక పరిస్థితుల పట్లా, చరిత్ర పట్లా ఎంతో శ్రద్ధ కనబరచి ఆ విషయాలపై ప్రామాణిక రచనలు చేశాడు. "జనని సంస్కృతంబు సకల భాషలకును" అన్న కొందరు ఆంగ్ల పండితుల వాదాన్ని ఎల్లిస్ ఖండిస్తూ తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ భాషలు ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన భాషలనీ, సంస్కృతం నుంచి జనించినవి కావని నిరూపించాడు. వాక్య నిర్మాణ పద్ధతిలో దక్షిణాది భాషలు సంస్కృతంతో ఎలా విభేదిస్తున్నాయో రాశాడు. మామిడి వెంకయ్య 'ఆంధ్ర దీపిక' ఉపోద్ఘాతంలో చెప్పిన తత్సమ, తద్భవాలను గురించి చర్చించాడు. లక్ష్మధరుని షడ్భాషా చంద్రికను ఉటంకించాడు. ఇది భాషా శాస్త్ర విషయకంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకోదగింది. ఎల్లిస్ మరణానంతరం ఆయన భాషా శాస్త్ర పరిశోధన పత్రాలన్నిటినీ సర్ వాల్టర్ ఇలియట్‌కి అందే ఏర్పాటు జరిగింది. ఇలియట్ డాక్టర్ పోప్‌కు ఇచ్చి ఆక్స్‌ఫర్డ్ బోదిలియన్ గ్రంథాలయంలో భద్రపరచేట్లు చేశాడు.

## xvii. కోలిన్ మెకంజీ - చారిత్రక సంపద

తెలుగుతో పాటు 15 భారతీయ భాషల్లో వేలాది వ్రాతప్రతులు సేకరించి అనంతర తరాలకు అమూల్యమైన విశేషాలను అందించిన పాశ్చాత్య ప్రముఖుడు కోలిన్‌మెకంజీ. లూయిస్ ద్వీపానికి చెందిన మెకంజీ 1783లో ఈస్టిండియా కంపెనీ వారి ఇంజనీర్స్ క్యాడెట్‌లో ఎంపికై భారతదేశం వచ్చాడు. మద్రాసు ప్రెసిడెన్సీ సర్వేలో పాల్గొన్న ఇంజనీర్లలో మెకంజీ ఒకరు. కోయంబత్తూరు, దిండిగల్, నెల్లూరు, గుంటూరు ఎక్కడికి సర్వే కోసం వెళ్లినా తనతో జిజ్ఞాసువులైన పండితులను తీసుకెళ్లేవాడు. 1809లో మద్రాసు సర్వేయర్ జనరల్‌గా, 1817లో కలకత్తా సర్వేయర్ జనరల్‌గా ఉండి దాదాపు 70 వేల చదరపు మైళ్ల మేర సర్వే జరిపించాడు. కావలి వెంకట బొర్రయ్య, లక్ష్మయ్య అనే ఇద్దరు ప్రతిభావంతులైన తెలుగు సోదరుల సహాయంతో దేవాలయాలు, చెరువులు, రిజర్వాయర్లు, శాసనాల ప్రాచీన చరిత్రను మెకంజీ వెలికితీశాడు. ఆయన కృషిని సెంట్ జార్జి కోట ప్రభుత్వం కూడా ఎంతగానో ప్రశంసించింది.

తాను సేకరించిన 1620 ప్రాంతాల స్థానిక చరిత్రల కైఫీయతుల విశ్లేషణ, కేటలాగింగు చేపట్టిన కొంత కాలానికి 1821లో కలకత్తాలో మెకంజీ మరణించాడు. మెకంజీ సేకరించిన సమాచారన్నంతటినీ ఈస్టిండియా కంపెనీ కొనుగోలు చేసింది.

ఏషియాటిక్ జర్నల్ మెకంజీ సేకరించిన విషయ సంపదను మొదటిసారిగా వెలుగులోకి తెచ్చింది.

విల్సన్స్ మెకంజీ కలెక్షన్స్ పేరుతో 1828లో కలకత్తాలో కేటలాగింగ్ ఆరంభమైంది. మెకంజీ సేకరించిన 176 తెలుగు లిఖిత ప్రతుల వివరాలు అందులో చోటు చేసుకున్నాయి. 36 పౌరాణిక, వైతాళిక సాహిత్య గ్రంథాలు, 23 స్థానిక చరిత్రలు, 82 ప్రతులు కావ్యాలు, నాటకాలు, గాథలకు సంబంధించినవి ఉన్నాయి. వీటి సహాయంతో సాధికారికమైన స్థానిక చరిత్ర నిర్మాణం చేయవచ్చు.

వీరేగాక ఇంకా ఎందరో తెల్లదొరలు తెలుగు ప్రాంతాల్లో, తెలుగువాళ్ల మధ్య తెలుగు భాషా సాహిత్యాల వికాసానికి కృషి చేశారు. వారందరి గురించి విపులంగా చర్చించడం ఈ అధ్యయనంలో సాధ్యమయ్యేది కాదు. అయితే వారిని నామమాత్రంగానైనా స్మరించడం బాధ్యత. బెంజిమెన్ బ్రాన్‌ఫీల్, జాన్. పి. మారిస్, థామస్ కన్‌సెట్టస్, సర్ విలియం జోన్స్, చార్లెస్ విల్‌కిన్స్, హెన్రీ థామస్, కోల్‌బ్రూక్, జె. బి. గిల్ క్రిస్ట్, విలియం కేరీ, జార్జి అబ్రహం గ్రియర్ సన్, రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ (సి. పి. బ్రౌన్ తండ్రి) క్లాడినస్ బచ్యస్, జాషువా మార్ష్‌మన్, హెన్రీ మార్టిన్, డేనియల్ కోరీ, డా. జాన్ లీడెన్ . . . ఇలా వారి వారి స్థాయిల్లో, పరిమితుల్లో తెలుగు భాషా సాహిత్యాల వికాసానికి కృషి చేశారు.

# 2. ప్రారంభ దశలో వివిధ పత్రికలు - తొలి పత్రిక

## i. పత్రికల ఆవిర్భావం - ఆవశ్యకత

పత్రికల ఆవిర్భావం ప్రపంచ గమనాన్ని వేగవంతం చేసి అనంతర కాలంలో అపూర్వ వికాసానికి బాట వేసింది. ప్రపంచంలోని ఒక మూల సమాచారాన్ని మరో మూలకు తెలియజేసే మౌలిక సమాచార సాధనంగానే గాక అసంఖ్యాక ప్రజలవాణిగా రూపొంది నిత్యావశ్య పఠనీయంగా మారింది. పత్రిక అనేది అంకురించేనాటికి అది నిర్వర్తించవలసిన బాధ్యతలెన్నో అనాటికే గూడుకట్టుకొని ఉన్నట్లు చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రపంచ సమాజ స్వరూపాన్ని మార్చేసి నవసమాజ నిర్మాణానికి సామగ్రినందించవలసిన తరుణం అది. అందుకోసం పత్రిక అవతరణ ఆవశ్యకత ఏర్పడింది.

మానవాళి సమస్తం, అనుకరణ, అనుసరణ గుణాలతో మనుగడ సాగిస్తూ పురోగమిస్తోంది. అది అనివార్యం. ఒక దేశంలోని నాగరికత వికాసానికి, విజ్ఞానాభివృద్ధికి దారి తీసిన పరిస్థితుల్ని అనుసరించడం ద్వారా మరో దేశం అభివృద్ధి సాధించగలుగుతోంది. ఆ ప్రయోజనం కోసం కూడా పత్రికావిర్భావం అవశ్యకమైంది.

భారతదేశంలో సంఘసంస్కరణ, భాషా సంస్కరణ, సాహిత్యాభ్యుదయం, స్వాతంత్ర్య సముపార్జన కోసం సాగిన పోరాటానికి చేయూత మొదలైన అనేక విషయాల్లో పత్రికల ఆవశ్యకత ఆనాడెంత ఉండిందో అవి నిర్వహించిన పాత్రను పరిశీలిస్తే మనకు బోధపడుతుంది.

1740 - 56 మధ్యకాలంలో మనదేశంలో అడుగుపెట్టిన ఆంగ్లేయులు క్రమంగా మనదేశమంతటినీ ఆక్రమించుకున్నారు. 1766లో ఉత్తర సర్కారుల్లో పాదం మోపడం ద్వారా మన రాష్ట్రానికి విస్తరించారు. 1799లో శ్రీరంగపట్నం యుద్ధంలో టిప్పుసుల్తాన్ మరణించడంతో కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలు నిజాంకు సంక్రమించాయి. 1800లో నిజాం ఆ ప్రాంతాలను ఆంగ్లేయులకు ధారాదత్తం చేశాడు. ఆ విధంగా ఆ ప్రాంతాలు బానిసత్వంలోకి వెళ్లడం వల్లా, అంతకు పూర్వమే

సాంఘికంగా ప్రబలి ఉన్న వెనుకబాటుతనం వల్లా చేపట్టవలసిన ఉద్యమాలకు పత్రికలు కావలసి వచ్చింది.

అప్పటికే అనేక సాంఘిక దురాచారాలు పట్టి పీడిస్తున్నాయి. అది చాలదని ఆంగ్లేయులు ప్రజల స్వాతంత్ర్యాన్ని హరించి వెయ్యడమేగాక దేశ ప్రజలపై తమ సంస్కృతిని బలవంతంగా రుద్దడం ప్రారంభించారు. మత ప్రచారం ఒక ఉద్యమంలా సాగుతూ వచ్చింది. దానిని ప్రతిఘటించి హైందవ మతాన్ని సమర్థిస్తూ పత్రికల ద్వారా రచనలు చేయవలసి వచ్చింది. సతీసహగమనం, అవినీతి వంటి దురాచారాలను రూపుమాపేందుకు పత్రికలను అస్త్రాలుగా మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ విషయంలో బెంగాల్‌లో రాజారామమోహన్‌రాయ్, ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం చేసిన కృషి అనితర సాధ్యమైంది. వీరి కృషిలో పత్రికలు తమ వంతు సహకారం అందించాయి అనడం కన్నా వీరు స్వయంగా పత్రికలను పదునెక్కించి ప్రత్యక్ష చర్యకు దోహదం చేశారని చెప్పవచ్చు. రాజారామమోహన్‌రాయ్ ఆధునిక భారత పునరుజ్జీవన జనకుడుగా, కందుకూరి వీరేశలింగం ఆధునికాంధ్ర పునరుజ్జీవన జనకుడుగా ప్రసిద్ధి పొందారు.

మొట్టమొదటిసారి సామాజిక ప్రయోజనం కోసం పత్రికలను ఉపయోగించుకున్న ఘనత రామమోహనరాయ్‌కే దక్కుతుంది. అనేక పత్రికల్లో వ్యాసాలు రాయడమేగాక ఆయన స్వయంగా పత్రికలు నడిపాడు. భారతీయ మతాలను కించపరుస్తూ ఆంగ్లేయులు నిర్వహించిన పత్రికల్లో వచ్చే వ్యాసాలను ఖండిస్తూ రాయ్ వ్యాసాలు రాసేవాడు. 1818లోనే దేశంలో తొలిపత్రిక 'బెంగాల్ గెజిట్'లో సతీసహగమనాన్ని వ్యతిరేకిస్తూ రాజారామమోహన్‌రాయ్ వ్యాసం రాశాడు. తర్వాతికాలంలో ఆయన నడిపిన 'సంవాద కౌముది' సంఘ సంస్కరణావశ్యతను చాటింది. ఫలితంగా 1829 డిసెంబర్ 4న సతీసహగమనాన్ని నిషేధిస్తూ గవర్నర్ విలియం బెంటింక్ శాసనం చేశాడు. అది రామమోహన్‌రాయ్ పత్రికాముఖంగా జరిపిన కృషివల్లే సాధ్యమైందంటే అతిశయోక్తి కాదు.

1830 నుంచి 1857 మధ్యకాలంలో గవర్నర్ జనరల్ విలియం బెంటింక్, చార్లెస్ మెట్కాఫ్‌ల ఔదార్యం వల్ల పత్రికలు కుంపిణీ ప్రభుత్వ జోక్యం లేకుండా నడిచాయని చెప్పవచ్చు. ఈ కాలంలో వెలసిన భారతీయ పత్రికలు ప్రథమ భారత సంగ్రామానికి

స్ఫూర్తినిచ్చాయి. 1857లో మీరట్‌లో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఈ సంగ్రామానికి పత్రికలు రెచ్చగొట్టాయని భావించి అంతకుముందు సడలించిన నిబంధనల్ని ప్రభుత్వం తిరిగి విధించింది. 1857 జూన్ 13న 'గాగింగ్ ఆక్ట్' అనే కఠినమైన ఆంక్షలతో కూడిన శాసనం అమలులోకి వచ్చింది. పాత్రికేయులనేకులను శిక్షలకు గురిచేశారు. ఆంక్షలవల్ల అనేక పత్రికలు మూతబడ్డాయి. ఉత్తరాదికి చెందిన 'బాంబే సమాచార్', 'సోమ్ ప్రకాశ్' వంటి పత్రికలు, దక్షిణాదికి చెందిన అనేక పత్రికలు సిపాయిల తిరుగుబాటును సమర్థించి ఎన్నో ఇబ్బందులెదుర్కొన్నాయి.

ఆంధ్రదేశంలో ప్రధానంగా ఈ కాలంలో సాహిత్య, సాంఘిక రంగాల్లో సంస్కరణ యుగోదయమైంది. రాజారామమోహన్‌రాయ్ దారిలో ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం సాగించిన కృషి అసామాన్యమైంది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "పత్రికా ప్రకటనము నందు నాయుద్దేశములు భాషాభివృద్ధియు, దేశాభివృద్ధియు ముఖ్యముగా రెండు. నేనేర్పరచుకొన్న భాషాభివృద్ధి మార్గము తెలుగు భాషలో మృదువైన సులభశైలిని సలక్షణమైన వచన రచన చేయుట. దేశాభివృద్ధి మార్గము జనులలో గల దురాచార దుర్వర్తనముల బాపియు వృద్ధి పద్దతులను జూపియు, వారినధిక నీతివంతుల్నుగా జేసి దేశమునున్నత స్థితికి దెచ్చుటకయి శక్తి వంచనలేక పాటుపడుట. దేశాభివృద్ధి కలుగుటకయి, విద్యా విషయమునను, వ్యవహార విషయమునను, కులాచార విషయమునను, నీతి విషయమునను, మత విషయమునను, నానా ముఖములగు గృషిచేయవలయుననియే కాని యొక్క రాజ్యాంగ విషయములందే పనిచేయుట నా యుద్దేశము కాదు.[1]

వీరేశలింగం ఆధునిక సాహిత్యరంగంలో ప్రభవించిన అనేక ప్రక్రియలకు ఆద్యుడయ్యాడు.

ఆ ప్రక్రియలకు పత్రికలే పురుడుపోశాయి. కందుకూరి సమగ్ర ఆధునిక పత్రికా రచనను కూడా ప్రవేశపెట్టాడు. 'వివేక వర్ధని' పత్రిక ఈ కోవలోదే. సంఘ సంస్కరణ కోసం 'హాస్య సంజీవని', 'సత్య సంవర్ధని', 'సత్యవాదిని', 'సతీహితబోధిని' వంటి అనేక పత్రికలను కందుకూరి నిర్వహించాడు. స్త్రీ విద్య, బాల్య వివాహాలు, స్త్రీల ఆర్థికాభ్యున్నతి, వితంతు పునర్వివాహం, అవినీతి వంటి అనేకమైన అంశాలను పత్రికల్లో రాశాడు.

---

1. *స్వీయచరిత్రము - మొదటి భాగం - మూడవ ప్రకరణం పు. 85*

భాషా సంస్కరణ, సంఘ సంస్కరణ రంగాల్లో కందుకూరి పత్రికలను సవ్యసాచిగా ఉపయోగిస్తే ఆ రంగాల్లో కందుకూరితో విభేదించేవారు కూడా తమ వ్యతిరేక ప్రచారానికి పత్రికలనే వినియోగించారు. ప్రజాభ్యుదయోద్యమాలకు అభ్యుదయకాముకులు, వాటికి వ్యతిరేకంగా సనాతనులూ పత్రికలనే ఉపయోగించుకున్నారంటే పత్రికల ప్రాముఖ్యం ఆనాటి ధర్మం అని చెప్పుకోవాలి.

స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు నిర్వహించిన పాత్రను గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన అవసరం ఉంది. పత్రికలు దేశ ప్రజల్లో స్వాతంత్ర్యేచ్ఛను జాగృతం చేస్తూ రావడం బ్రిటిషు వారికి సహజంగానే నచ్చలేదు. పత్రికలు తమ కర్తవ్య నిర్వహణను ఉధృతం చేసిన కొద్దీ బ్రిటిషు వారిలో అసహనం, ఆగ్రహం పెరగసాగింది. పత్రికలపై నిర్బంధం ప్రారంభమైంది. పాత్రికేయునిగా, స్వాతంత్ర్య పిపాసిగా ఉన్న సురేంద్రనాథ బెనర్జీ నాయకత్వంలో దేశీయ పత్రికలు నిర్భయంగా సామ్రాజ్యవాదుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించసాగాయి. పత్రికలపై ఆంగ్ల పాలకులు నిర్బంధాన్ని ఎక్కువ చేసి చివరికి 1878లో 'వెర్నాక్యులర్ ప్రెస్ బిల్లు' పేర శాసనం తెచ్చారు. బెనర్జీ తన 'బెంగాల్' పత్రికలో 1883 ఏప్రిల్ 2వ తేదీ నాటి సంచికలో ఎంతో సాహసంతో హైకోర్టును విమర్శిస్తూ సంపాదకీయం రాశాడు. ఫలితంగా ఆయనకు రెండు నెలల కారాగార శిక్ష పడింది. అయినప్పటికీ పత్రికలు నిర్బంధాలకు భయపడి వెనుకంజ వేయలేదు. స్వాతంత్ర్యసమరాగ్నికి ఆజ్యం పోయడం ప్రారంభించాయి. ఫలితంగా పత్రికలపైనా, మేధావులపైనా, జాతీయ నాయకులపైనా బ్రిటిషువారి నిర్బంధపుటుచ్చు బిగుస్తూ వచ్చింది. అది బిగుస్తున్న కొద్దీ స్వాతంత్ర్య చైతన్యం గాఢతరం కాసాగింది.

బ్రిటిషువారి నిర్బంధాన్ని ప్రతిఘటించి ఒక పటిష్టమైన సంఘం ఏర్పాటు చేస్తే బావుంటుందనే ఆలోచన క్రమక్రమంగా కార్యరూపం దాల్చింది. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావానికి ఆ ఆలోచనలు దారితీశాయి. బొంబాయిలోని గోకుల్ దాస్ తేజ్‌పాల్ మందిరంలో జాతీయ కాంగ్రెస్ సంస్థ అవతరించింది. సంస్థ క్రమంగా బలపడింది. జైళ్లకు వెళ్లడానికి, లాఠీ దెబ్బలు తినడానికి స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నడూ వెనుదీయలేదు. వెనుదిరిగి చూడవలసిన అవసరమే కలగలేదు. స్వాతం[illegible] శతాబ్దంలోకి ఉద్యమించారు. స్వాతంత్ర్య ఉషోదయాన్ని వీక్షించారు, విశ్రమ[illegible] కాని, పత్రికల ప్రస్థానం ఆగలేదు. విరామం తెలియని బాటలో నడుస్తూనే ఉన్నా[illegible]

తెలుగు సాహిత్యరంగంలో, భాషా సంస్కరణ రంగంలో పత్రికలు నిర్వహించిన కృషి కూడా ప్రత్యేకంగా పేర్కొనదగింది. భాషా సాహిత్య రంగాల్లో పత్రికలు చేసిన సేవను తర్వాతి అధ్యాయంలో వివరించడం జరుగుతుంది.

## ii. తొలి పత్రిక - చర్చ, నిర్ణయం

### a. సత్యదూత

ఆరంభాలు ఎప్పుడూ నిర్వివాదంగా ఉండవు. తెలుగులో వెలువడిన తొలిపత్రిక విషయంలో కూడా ఇదే జరిగింది. 1835 ప్రాంతంలో వెలువడిన 'సత్యదూత' తొలి తెలుగు పత్రిక అనీ, దీన్ని బళ్లారి క్రైస్తవ మిషనరీలు మద్రాసు నుంచి వెలువరించారని నిడుదవోలు వెంకటరావు, నార్ల పేర్కొన్నారు.[2] మిషనరీల రికార్డుల్లో 'ట్రూత్‌ఫుల్ మెసెంజర్' అనే పత్రిక ప్రస్తావన ఉంది. దాన్ని తెలుగులోకి అనువదిస్తే 'సత్యదూత' అవుతుంది. కాబట్టి ఇది తొలి తెలుగు పత్రిక అని వారుభయులూ అభిప్రాయపడ్డారు. బళ్లారి మిషనరీ రికార్డులో 'సత్యదూత' వెలువడినట్లు ఆధారాలు లేవు. 'ట్రూత్‌ఫుల్ మెసెంజర్' కొంతభాగం కాని పూర్తిగా కాని తెలుగులో ఉన్న విషయం కూడా వెలుగులోకి రాలేదు. కాబట్టి ఈ మాత్రం స్వల్ప ఆధారంతో, 'సత్యదూత' తొలి తెలుగు పత్రిక అనడానికి బలం చాలదు.

### b. తెలుగు జర్నల్

నార్ల షష్ట్యబ్ద పూర్తి సంచికలో తన వ్యాసానికి ఆరుద్ర సమకూర్చిన అనుబంధంలో 1831లో మద్రాసులోని లండన్ మిషన్ సొసైటీ మొట్టమొదటి తెలుగు పత్రిక 'తెలుగు జర్నల్' ప్రారంభించి ఉండవచ్చునని రాశారు. 'నవమేధావి నార్ల' అనే గ్రంథంలో గొర్రెపాటి వెంకటసుబ్బయ్య కూడా ఇదే విషయం పేర్కొన్నారు. ఇవి తప్ప ఇంకెటువంటి ఆధారాలూ కనపడడం లేదు. 1831లో మద్రాసులోని క్రైస్తవ మిషనరీలు 'తమిళ పత్రిక'ను వెలువరించారు. ఇదే తొలి తమిళ పత్రిక అని పరిశీలనలు పేర్కొన్నాయి.[3] ఉభయభాషా ప్రాంతమైన మద్రాసు నుంచి 'తమిళ పత్రిక'తో పాటు తెలుగు పత్రిక కూడా వెలువడి ఉంటుందని ఆరుద్ర భావించి వుంటారు.

---

2. *Venkata Rao. N "Literary Journalism", studies in the History of Telugu Journalism P. 57*
3. *A Survey of the Tamil Press, Somalay P. 5*

### c. మద్రాస్ క్రానికల్

మద్రాసు ఆర్కైవ్స్‌లో లభ్యమవుతున్న ఆకరాలను బట్టి కాన్‌స్టాంటిన్ శాంపీ, మరో ముగ్గురు స్థానికులు ఎ. అవదిశైవ, టి. విశాకపరకుల అయ్యవారుడు, టి. శామన్న పెరుమాళ్లయ్య తెలుగు, మలబారు భాషల్లో 'మద్రాస్ క్రానికల్' అనే పత్రికను స్థాపించేందుకు మద్రాస్ గవర్నర్ ఫ్రెడ్రిక్ ఆడమ్స్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఆ పత్రికే 'మద్రాసు క్రానికల్'.

పత్రికను వారానికి రెండుసార్లు బుధవారం తెలుగులో, శనివారం తమిళంలో వెలువరించదలచినట్లు ఆ అర్జీలో పేర్కొన్నారు. ఈ మద్రాసు క్రానికల్‌కు అనుమతి లభించింది లేనిదీ తెలియదు. అయితే 1833 నాటికే తెలుగు, తమిళ వార్తా పత్రికలున్నట్లు ఆరుద్ర రాశారు.[4] 1859లో రెవరెండ్ జె. లాంగ్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో తొలి తెలుగు, తమిళ పత్రికలు 1833 నాటికి వెలువడినట్లు పేర్కొన్నారు. ఆ తొలి తెలుగు, తమిళ పత్రిక 'మద్రాసు క్రానికల్' కావచ్చు. అయితే ఈ మద్రాసు క్రానికల్ 1835లో వెలువడినట్లు ఆర్. నటరాజన్ అంటున్నారు.[5] ఈ అభిప్రాయాన్నే ఎం. సంబంధన్ కూడా వ్యక్తీకరించారు.[6] ఈ మద్రాస్ క్రానికల్ తెలుగు, తమిళాల్లో వెలువడేదని అభిప్రాయపడ్డారు.

### d. కర్నాటిక్ క్రానికల్

1833 నవంబర్ 'ఏషియాటిక్ జర్నల్'లో 175, 176 పేజీల్లో ఇంగ్లీషు, తమిళ, తెలుగు భాషల్లో ముద్రితమైన 'కర్నాటిక్ క్రానికల్' ఫైళ్లు అందినట్లుగా ప్రస్తావన ఉంది. అందులో ఇంగ్లీషు నుంచి తెలుగు, తమిళ భాషల్లోకి, తెలుగు, తమిళాల నుంచి ఇంగ్లీషులోకి వ్యాసాలు అనువదించినట్లు పేర్కొంటూ, అనువాదాలు మూలాన్ని అనుసరించి సరైన విధంగా జరిగినట్లు, ముద్రణ కూడా బాగున్నట్లు ఏషియాటిక్ జర్నల్‌లో ఉంది. 'కర్నాటిక్ క్రానికల్'లో ప్రచురించిన రెండు ఆంగ్ల వార్తా ఖండికల్ని కూడా జర్నల్‌లో ప్రచురించారు.

---

4. *Beginings of Telugu Journalism, Studies in the History of Telugu Journalism P. 2.*
5. *Tamil Cheyidi Idaigal, Essay, A Survey of Tamil Press P.9*
6. *Tamil Vattirigaigal Essay, A Survey of Tamil Press*

ఈ ప్రస్తావనతో 'కర్నాటిక్ క్రానికల్' పేర తెలుగు, తమిళ, ఆంగ్ల పత్రిక ఒకటి 1933 నాటికే ఉన్నట్లు ధ్రువపడింది. 1833 నవంబర్ ఏషియాటిక్ జర్నల్‌లో ప్రచురితమైన పుస్తక సమీక్షను బట్టి 'కర్నాటిక్ క్రానికల్' ఉనికిని ఆచార్య జి. ఎన్. రెడ్డి నిరూపించారు.

ఆంగ్లేయుడైన శాంపీ, మరో ముగ్గురు దేశీయులు నెలకొల్ప తలపెట్టిన 'మద్రాస్ క్రానికల్', ఏషియాటిక్ జర్నల్‌లో ప్రస్తావించిన కర్నాటిక్ క్రానికల్ రెండూ ఒకటేనా వేరు వేరా అనే విషయం తేలవలసి ఉంది.

ఆ రోజుల్లో దక్షిణ భారతదేశంలో చాలా భాగాన్ని, మద్రాసు ప్రాంతాన్ని కూడా కర్నాటకం అనేవారు. ఆర్కాటు ప్రాంతాల్లో జరిగిన యుద్ధాలను కర్నాటక యుద్ధాలు అనేవారు. కర్నాటక నవాబు చెన్నపట్టణంలో ప్రముఖుడైన కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్లె గారి కుమారుని వివాహానికి వచ్చారని 1852 జూలై 25వ తేదీనాటి "వర్తమాన తరంగిణి" పత్రిక ప్రస్తావించిన విషయాన్ని ఒక తార్కాణంగా పేర్కొంటూ మద్రాసు ప్రాంతాన్ని కర్నాటకం అని వ్యవహరించేవారని, కాబట్టి, 'మద్రాస్ క్రానికల్', 'కర్నాటిక్ క్రానికల్' రెండూ ఒకటేనని డా. వి. లక్ష్మణరెడ్డి తెలిపారు.[7]

నిడుదవోలు, నార్ల పేర్కొన్నట్లు 'సత్యదూత'గాని, ఆరుద్ర ఊహించినట్లు 'తెలుగు జర్నల్' గాని తొలి తెలుగు పత్రిక అనడానికి ఆధారాలు చాలవు. జి. ఎన్ రెడ్డి నిరూపించిన 'కర్నాటిక్ క్రానికల్' 1833 నాటికే ఉన్నట్లు తెలుస్తున్నా దాని ప్రతులు దొరకలేదు.

## ఈ. ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్

1832 జనవరి 4వ తేదీన ఈ గెజిట్ తొలి సంచిక వెలువడింది. మొదట్లో ఆంగ్లంలో వెలువడేది. తర్వాత 1834 నుంచి కొన్ని ప్రకటనలను ప్రాంతియ భాషల్లోకి అనువదించి ప్రచురించడం ప్రారంభించారు. 1835 నుంచి తెలుగు, తమిళ భాషల్లో ప్రకటనలు చోటు చేసుకున్నాయి. గెజిట్‌లో ప్రకటనలు వ్యావహారిక భాషలోనే ఉండడం విశేషం. 1835 జనవరి 10వ తేదీ నాటి గెజిట్‌లో అప్పట్లో ప్రభుత్వ దుబాషీ ఏనుగుల వీరాస్వామి (కాశీయాత్రా చరిత్ర రచయిత) అనువదించిన ప్రకటన ప్రచురితమైంది. జె. సి. మోరిస్ కూడా తెలుగులోకి ప్రకటనలు అనువదించేవాడు.

---

*7. తెలుగు జర్నలిజం అవతరణ వికాసం పు. 68*

## f. వృత్తాంతి

ఇది మద్రాసు నుంచి వెలువడిన వారపత్రిక. ఇది అచ్చంగా తెలుగు పత్రికే అనుకోవచ్చు. అలాగే పత్రికకు 'వృత్తాంతి', 'వృత్తాంతిని' అని వ్యవహారమున్నట్లు తెలుస్తోంది. నిశితంగా పరిశీలిస్తే రెండు పత్రికలు వేరు వేరని తెలుస్తుంది. ఒకటి 1838 ప్రాంతంలో వెలువడిన 'వృత్తాంతి' వార పత్రిక. దీని ప్రతులు అలభ్యమైనా బంగోరె సేకరించిన బ్రౌన్ జాబుల్లోని 'లోకరక్షణి' లేఖను బట్టి దాని ఉనికి తెలుస్తున్నది.[8] ఇక రెండవ 'వృత్తాంతిని'. ఇది పైన పేర్కొన్న ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ అయి ఉంటుంది. గెజిట్‌ను తెలుగులో రాజకీయ వృత్తాంతినిగా వ్యవహరించినట్లుంది. కాబట్టి ఈ గెజిట్ వృత్తాంతిని కావాలి. ఇక ఈ వృత్తాంతిని గురించిన చరిత్రలోకి వెళ్దాం.

రెవరెండ్ జె. లాంగ్ 1833 నాటికి వెలువడినట్లు పేర్కొన్న తెలుగు పత్రిక 'వృత్తాంతి' అని ఆర్. నటరాజన్ తన 'తమిళిల్ చెయిది ఇదైగళ్' అనే వ్యాసంలో రాశారు. ఇది తమిళంలోనూ, తెలుగులోనూ వెలువడుతూ ఉండేదని ఆయన అభిప్రాయం. అయితే తమిళంలోనూ, తెలుగులోనూ వెలువడింది ఇది కాదు. 'భారతి' మాసపత్రిక 1951 జూలై సంచికలో నిడుదవోలు వెంకటరావు గారు రాసిన 'కొక్కొండ వెంకటరత్నం పంతులు' అనే వ్యాసంలో "1833 వరకు ప్రత్యేకముగా తెలుగు పత్రికలు వెలువడలేదు. ఆ కాలమున తెలుగున వెలువడినది యొక్క ఫోర్ట్ సెంటు జార్జి కోట రాజకీయ వృత్తాంతిని మాత్రమే" అని పేర్కొన్నారు. 1832లో ప్రారంభమైన ఫోర్ట్ సెంట్ జార్జ్ గెజిట్‌లో 1835 నుంచి తెలుగు, తమిళ భాషలు నియతంగా చోటు చేసుకున్నాయని డా. లక్ష్మణ రెడ్డి[9] అన్నదాని ప్రకారం రెవరెండ్ జె. లాంగ్ పేర్కొన్న 'వృత్తాంతి' ఈ వృత్తాంతి ఒకటి కాదని, నటరాజన్ పేర్కొన్నది కూడా ఈ వృత్తాంతి కాక ఫోర్జ్‌సెంట్ జార్జి గెజిట్ అయి ఉంటుందని భావించవచ్చు. ఈ వృత్తాంతి తెలుగులో మాత్రమే వెలువడింది. తమిళంలో కూడా వెలువడినట్లు ఆధారం లేదు. ఈ పత్రిక 1838 - 41 సంవత్సరాల మధ్యకాలంలో వెలువడినట్లు తిరుమల రామచంద్ర గారు[10] తెలుపుతున్నారు. ఆయన 'ఈ వృత్తాంతిని అసందిగ్ధంగా

---

*8. బ్రౌన్ జాబులు తెలుగు జర్నలిజం చరిత్ర : 1832-1857*

*9. తెలుగుజర్నలిజం - అవతరణ వికాసం*

*10. తెలుగు పత్రికల సాహిత్య సేవ*

తెలుస్తున్న తొలి తెలుగు వార పత్రిక'గా నిర్ధారించారు. ఈ పత్రిక 1840లో ప్రారంభమైనట్లు నిడుదవోలు, నార్ల ప్రభృతులు రాశారు. అయితే మద్రాసు ఆర్కైవ్స్‌లో ఉన్న ఆధారాలను బట్టి ఈ పత్రిక 1838లోనే ఉన్నట్లు బంగోరె పేర్కొన్నారు. ఈ పత్రికలో అచ్చయ్యే విమర్శలను అనువాదం చేసి సంపుతూ ఉండమని 1838 డిసెంబర్ 4వ తేదీన ప్రభుత్వం ట్రాన్స్‌లేటర్ జె. సి. మోరిస్‌కు ఆర్డర్ జారీ చేసింది. కాబట్టి ఈ పత్రిక 1838 నాటికి ఉన్నట్లు భావించవచ్చు.

'వృత్తాంతి' పత్రికను ఎవరు ప్రచురించారు, ఎక్కడ ముద్రితమైందీ తెలియడం లేదు. 'వృత్తాంతి'ని ముద్రించిన ప్రెస్సు మద్రాసులో వేప్పేరిలోని చర్చివీధిలో ఉండేదని ఆరుద్ర అంటుండగా ఆ ప్రెస్సు తీఫింగ్ బజారులో ఉన్నట్లు బంగోరె పేర్కొన్నారు.[11] పత్రికకు సంపాదకునిగా కడపకు చెందిన మండిగల వెంకట్రాయశాస్త్రి పని చేశారు. 1842 నవంబర్ 23వ తేదీన శాస్త్రిగారు 'వర్తమాన తరంగిణి' పత్రిక ఎడిటరుకు రాసిన లేఖను బట్టి ఆయన కడపకు చెందిన వాడనే విషయంతో పాటు 'వృత్తాంతి' 1842వ సంవత్సరం ప్రారంభం నాటికే ఆగిపోయిందనేది కూడ నిర్ధారణ అవుతున్నది. పత్రిక ప్రతులేవీ లభ్యం కావడం లేదు. అయితే గిడుగు రామమూర్తి పంతులు గారు 'గద్య చింతామణి'లో 'వృత్తాంతి' పత్రికలో అచ్చయిన లేఖను ఉటంకించారు. సి. పి. బ్రౌను ఈ లేఖను తన తెలుగు రీడరులో కూడా ప్రచురించారు. బ్రౌన్ జాబుల సేకరణలో కూడా 'వృత్తాంతి'లోని ఒక వార్తా ఖండికను చేర్చారు. పేరు వెల్లడించని పాఠకుడు 'లోక రక్షణి' పేరిట వివాహాల్లో దుబారా గురించి రాసిన లేఖను 1841 ఫిబ్రవరి 15 నాటి వృత్తాంతి సంచికలో ప్రచురించారు. ఆ లేఖను బ్రౌను తన సంపుటంలో చేర్చాడు.[12]

వృత్తాంతి పత్రిక పలు ప్రాంతాలకు వెళ్లి పాఠకులకు వివిధ విషయాలను పరిచయం చేసిన ప్రస్తావనలు అనేకం కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం నివాసి బొమ్మరాజు నాగేశ్వరరావు సి. పి. బ్రౌనుకు 1839 సెప్టెంబర్‌లో రాసిన లేఖలో 'చెన్న పట్నపు వృత్తాంతి' అనే తెనుగు న్యూసుపేపరులో మీ (బ్రౌను) వద్దనున్న గ్రంథాల వివరాలు చదివానని' రాశారు.

---

*11. జర్నలిజం చరిత్ర వ్యవస్థ - రాపోలు ఆనందభాస్కర్ 1988 పు. 38*

*12. బ్రౌన్ జాబులు తెలుగు జర్నలిజం చరిత్ర 1832-1857*

1843 మే 18 నాటి 'వర్తమాన తరంగిణి' పత్రికలో ఇలా ఉంది. "చన్న పట్టణమందు మిక్కిలి ప్రముఖులుగానున్నూ, ధనవంతులు అనే పేరు గల వారుగానున్నూ ఉండే కొందరు నేటివు పెద్దమనుషులు పూర్వం 'వృత్తాంతి' అనే వక ఆంధ్రపత్రికను ప్రచురం చేసి అది కొద్ది కాలము వరకు జరుగుతూ వుండెను. యింతలో దానికి అంత్యకాలము సంభవించి అది మృతి పొందెనని" మిక్కిలి కలతతోటి తెలియచేసింది.

రాజమండ్రిలోని జిల్లా జడ్జి జేమ్స్ థామస్ భార్య జూలియా థామస్ 1839 జనవరి 19న లండన్‌కు రాసిన లేఖలో 'వృత్తాంతి' వార్తల తీరు తెన్నులపై వ్యాఖ్యలు చేసింది.

ఈ పత్రిక నిలిచిపోయిన ఉదంతాన్ని వివరిస్తూ పత్రిక సంపాదకుడు మండిగల వెంకట్రాయశాస్త్రి వర్తమాన తరంగిణి ఎడిటరుకు రాసిన లేఖలో 'లోక వ్యాపారములను తెలియజేయడం వృత్తాంతి ప్రయోజనమని శాస్త్రి గారు రాశారు. ఆ పత్రికలో పాఠకులు కూడ ఎంతో ఉత్సాహంగా విమర్శనాత్మకమైన లేఖలు రాసేవారనడానికి లోక రక్షణి లేఖ చెరగని ఉదాహరణ. 'నీలగిరి చరిత్ర' వంటి వాటిని ఈ పత్రికలో ప్రచురించి ఉంటారు. పత్రికలో ఆనాటి మద్రాసు వ్యావహారిక భాష కనిపిస్తుంది. తమిళ, ఆంగ్ల పదాలు అక్కడక్కడా కనిపిస్తాయి.

కొందరు దీనిని 'వృత్తాంతిని' అన్నారు. తమిళంలో 'వృత్తాంతి' గానే పేర్కొనడం జరిగింది. గిడుగు రామమూర్తి గారు 'వృత్తాంతి' గానే రాశారు. ప్రభుత్వ రికార్డుల్లో కూడా 'వృత్తాంతి' అనే ఉంది. బ్రౌన్ జాబుల్లోనూ, పత్రిక ఎడిటర్ మండిగల వెంకట్రాయశాస్త్రి వర్తమాన తరంగిణి ఎడిటరుకు రాసిన లేఖలోనూ దాని పేరు 'వృత్తాంతి' గానే ఉంది. కాని వృత్తాంతినిగా కాదు. దీనిలోని లేఖ, ఇతర వార్తా ఖండికల ప్రస్తావనలు పుష్కలంగా ఉన్నా సంచికలు మాత్రం అందుబాటులో లేవు.

కొందరు పరిశోధకులు 'వృత్తాంతి' ని తొలి తెలుగు పత్రిక చర్చల్లోకి తీసుకున్నారు. లభించిన ఆధారాలను బట్టి 'కర్నాటిక్ క్రానికల్' తొలి తెలుగు పత్రికగా ఆచార్య జి. ఎన్. రెడ్డి నిరూపించారు. కాబట్టి 'వృత్తాంతి' ని తొలి పత్రిక చర్చ నుండి మినహాయించడం మంచిదని కొందరు భావిస్తున్నారు. అయితే జి. ఎన్. నిరూపించిన 'కర్నాటిక్ క్రానికల్' నిస్సందేహంగా తొలి తెలుగు పత్రికే అయినా దాని తెలుగు రూపం ఎలా ఉండేదో ఆధారాలు లభ్యం కాలేదు. కాబట్టి అది కనిపించని తొలి తెలుగు పత్రికగా నిర్ధారించవలసి ఉంటుంది.

## iii. ఇతర పత్రికలు :-

### a. వర్తమాన తరంగిణి

'వర్తమాన తరంగిణి' 1842 జూన్ 8వ తేదీన వారపత్రికగా మద్రాసు నుంచి ప్రారంభమైంది. దీని యజమాని సయ్యద్ రహిమతుల్లా అనే ముస్లిం. మొదటి ఆరు సంచికలకు సంపాదకుడెవరో గాని ఆ తర్వాత పువ్వాడ వెంకటరావు సంపాదకత్వం వహించారు. కొంత కాలానికి ఆయనే సర్వాధికారి అయినట్లు తెలుస్తోంది. ఇంగ్లీషు డెమ్మీ సైజులో చైనా పీచు కాగితం పై 12 పుటలుగా వేసేవారు. పుటకు రెండు 'కాలము' లుండేవి. ఒక్కోసారి 8 పుటలతో సరిపెట్టేవారు. ఫోర్ట్‌సెంట్‌జార్జిగెజిట్‌లోని విషయాలను తెలుగులోకి అనువదించి వేయడం అలవాటుగా ఉండటం వల్ల గెజిట్ ప్రతి మంగళవారం వెలువడితే 'వర్తమాన తరంగిణి'ని బుధవారం వెలువరించేవారు. తర్వాత గెజిట్‌లోని అంశాలు అనువదించేందుకు ఒక్కరోజు చాలకపోవడం వల్ల పత్రిక వెలువరించే దినాన్ని బుధవారం నుంచి గురువారానికి మార్చారు. అప్పుడప్పుడూ పత్రికకు సప్లిమెంటు (అనుబంధం) కూడా వేసేవారు. దాన్ని వారు 'ఉపపత్రిక'గా వ్యవహరించేవారు.

ఈ పత్రికలో ప్రచురించే విషయాలపై వారే ఇలా చెప్పుకున్నారు. "మత విషయములైన వాదములకున్ను, దూషణ భూషణ తిరస్కారములకున్ను, నటవిట గాయకాది చరిత్రములకున్ను ఇంకా ఇతర దుర్విషయములకున్ను" స్థలం ఇచ్చేవారు వారు. ప్రాంతీయ వార్తలే గాక ఐరోపా, చైనా వంటి విదేశాల్లో, బొంబాయి, కలకత్తా వంటి నగరాల్లో జరిగే రాజకార్యాలు, వర్తక, వ్యాపార విషయాలు, ఖగోళ, భూగోళ, గణిత ధర్మశాస్త్ర, నీతి శాస్త్ర విషయాలను ప్రచురించేవారు. సివిల్, మిలిటరీ ఉద్యోగుల నియామకాలు, సెలవులు వంటి విషయాలను ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ నుంచి వేసేవారు. వ్యాపార ప్రకటనలు, ఉత్తరాలు, నాటికి సమాధానాలు, అప్పుడప్పుడూ 'రేపు దినుసులు' అనే శీర్షిక కింద ధాన్యం మొదలైన వాటి ధరలను వేసేవారు.

స్పెక్టేటర్, యెథీనియం, హరకారు, ఇంగిలీషుమేన్, ఢిల్లీ గెజిట్టి, టయంస్, బొంబాయి టైంసు, ఈవినింగ్ మెయిల్, తిరావిట (ద్రావిడ), తీపికై (దీపిక), దేశాభిమాని వంటి ఆంగ్ల, తమిళ పత్రికలలోని వార్తలను, విశేషాలను తెలుగులోకి అనువదించి ప్రచురించేవారు.

'జనమనోరంజకుడు', 'కల్పవాసి', 'సూచనాతత్పరుడు', 'మతాభిమాని', 'గుణగ్రహణ కౌతుకుండు', 'న్యాయశోధకుడు' వంటి పేర్లతో పాఠకుల లేఖలు ప్రచురితమయ్యేవి.

ఒక చందాదారుడు ఉత్తరాలు ప్రచురించడం వల్ల పత్రికలో స్థలం వృథా అవుతుందని సంపాదకునికి లేఖ రాస్తే దానికి 'ఉత్తరము వ్రాసిన వారికి ఎడిటరు మారు' ఈ విధంగా రాశారు.

"మా చందాదారులైన యొక్క పెద్దమనిషి గారు మా పత్రికలోన నుత్తరములం బ్రచురపరచుట వలన కొంత స్థలము వృథా అయిపోతున్నదని వాడుకొన్నారట వారి వొక్కరి నిమిత్తము మాత్రము మేము పత్రికను ప్రచర పరచడం లేదు. గాన యుత్తరములనెట్లు తిరస్కరింతుమోగాని వాటి వల్ల నున్నతి ప్రయోజనము కద్దు - ద్రావిడ ధీపిక యనే 4 పక్కల పత్రికలో 3 పక్కలుత్తరములున్ను నాలుగో పక్క నొక్క కాలము సమాచార మున్నుండుట వారు చిత్తగించలేదు కాబోలు – "

ఎడిటరు

1842 ఆగస్టు 20వ తేదీన బళ్లారి నుంచి పత్రిక చదివే పాఠకుడు 'వర్తమాన తరంగిణి'లో 'అక్షరాలు బొత్తిగా తెలియకపోవడాన్ని, హస్సలు కలం చెప్పడానికి బదులు (మౌలిక రచనకు బదులు)గా యింగ్రేజి పత్రికల్లో వుండే వాటిని అలాగే తర్జుమా చేశి' వేయడాన్ని విమర్శిస్తూ రాసిన లేఖ ప్రచురితమైంది. ఇది ఆనాటి పాఠకుల విమర్శనా శక్తికి మచ్చుతునక. ఈ విమర్శనాత్మక లేఖకు పత్రికాధిపతి జవాబు 1842 సెప్టెంబర్ 8 నాటి 'వర్తమాన తరంగిణి' లో వచ్చింది.

అప్పటి వార్తా రచనా విధానాన్ని తెలియ జేసేందుకు ఒక వార్త పరిశీలిద్దాం.

' కృష్ణ

కొన్నాళ్ల కిందట కృష్ణలో వ్యసనకరమయిన వక సంగతి జరిగి అందువలన అనేక ప్రాణహాని హేతువ అయినది. సుమారు నూటికి జనం యెక్కి వక పడవ - బెజవాడ రేవు దాటేటప్పుడు యేటిన తెమికి పోయి మహా వేగముతో వక పెద్దరాతినట్టుకు తగిలి దాపు దాపుగా అందులో నుండిన బాటసార్లందరు చనిపోయినారు. ఆ పడవ నీళ్లవడికి నిలువలేక బహువేగముగా పోతూ వొడ్డిగిలినందువలన నిముషములో నీరు నిండి మునిగిపోయినది. ముగ్గురు మాత్రము తప్పి వచ్చినారు - ఇది బాజారి ఖబురుగా

తెలిసినది గాని అధికారత్వేనా వకరికి సమాచారము అందలేదు. ఆ రేవున ఉండే కృష్ణ వెడల్పు సుమారు కోశెడు దాకా ఉన్నది. అక్కడ సంభవించిన పడవ స్థితి వ్రాసి వచ్చినందు వలన నీళ్ల రేవులు పడవల మీద దాటేవారికి జాగ్రత్త కలుగవలెనని తెలియ చేసినాము.

– **1842** ఆగస్టు **11**, వర్తమాన తరంగిణి.

అప్పట్లో వార్తలను కథల్లాగా చెప్పుకుపోయే పద్ధతి ఉండేదని పై ఖండిక చూస్తే తెలుస్తుంది. వింత వ్యాఖ్య కూడా కలిపి రాసేవాళ్లు.

వార్తలకు శీర్షికలు ఉండేవి. వాటికి కొన్ని ఉదాహరణలు :

| | |
|---|---|
| పాము కఱచుట | అద్భుతము |
| ఆకస్మీకపు మరణము | హత్య |
| దొంగలు | ధార్వాడ |
| వర్షము | నిప్పు |
| అగ్నిహోత్రుడు | |

'వర్తమాన తరంగిణి'లో సంపాదకీయ తుల్య రచనలుండేవి. వాటిని 'ఎడిటోరియా'. అనేవారు. మచ్చుకు ఒక ఎడిటోరియా పేర్కొనడం జరుగుతుంది. దీనివల్ల 'వర్తమాన తరంగిణి' సాంస్కృతిక పునరుద్దీప్తికి చేసిన కృషి స్పష్టమవుతుంది. ఆనాటి పత్రికా భాష, శైలి మొదలైన అంశాలు కూడా అవగతమవుతాయి.

**1842** ఆగస్టు **4**వ తేదీ నాటి సంచికలో ప్రచురించిన 'ఎడిటోరియా'.

" మత సిద్ధాంతము

ఇప్పుడు కొద్ది రోజులుగా చెన్న పట్టణములో చెంగాయి అంగళ్ల వద్ద కొందరు మనవారయిన పెద్ద మనుష్యులు పాదిరీలు అచ్చువేసే క్రిష్టియన్ - మత విషయములైన పుస్తకముల మీద ఆక్షేపణలున్ను ఖండనలున్ను అరవములో నచ్చువేసి పుస్తకాలు అమ్మేటట్టున్ను విన్నాము.

అయితే తెనుగున్ను - యీ దేశములో ముఖ్యముగా నుండే భాషే గనక - యీ భాషలో నున్ను ఆ ప్రకారమే అచ్చువేయిస్తూ వస్తే బాగుండును - ఇందువల్ల మరేమిన్ని

విశేష లాభము లేకపోయినా గాని ఫాదరీలు విస్తారము చదివి - బహుబుద్ధిమంతులు గనక మనవారు చేసే అక్షేపణలకు మంచి సమాధానములు చేస్తున్నారు. మన వాండ్లలో చదువుకొన్న బుద్ధి విచక్షణగల వారున్ను అదే ప్రకారము చేస్తూ వస్తే ఆ పుస్తకాలు చదివే వారిన్ని - మంచి జ్ఞానము కలగడానకు హేతువుగా నుండును."

వర్తమాన తరంగిణిలో వ్యాపార ప్రకటనలు ఎలా ఉండేవో ఒక ఉదాహరణ :

" ప్రకటన.

దొరలకున్ను - నల్లవారిలో గొప్పవారికిన్ని - ఉపయోగమయ్యే శ్రేష్ఠమయిన బందరు పాడిబుడ్లు మిక్కిలి ప్రశస్తమయినవి - ముత్యాలపేట పొగడాల వీధిలో - 21 నెం. యింట్లో వున్నవి. కావలసిన వారు వచ్చి కొనుక్కోవలెను."

" (1842 సెప్టెంబరు 22వ తేదీ)

మద్రాసు కమీషనర్ ఆఫ్ పోలీస్ కల్నల్ జె. సి. బౌల్డర్ సన్ 1858లో చీఫ్ సెక్రటరీకి పంపిన రిపోర్టు వల్ల 1858 నాటికి 'వర్తమాన తరంగిణి' నెలకు మూడుసార్లు ప్రకటితమవుతూ వుండేదని, దేశీయులలో మంచి ప్రాభవం కలిగి వుండేదని, 600 ప్రతులు దాకా అమ్ముడుపోయేదని తెలుస్తుంది. ఆ తర్వాత వర్తమాన తరంగిణి వునికి తెలియలేదు."

**b. హితవాది**

పాశ్చాత్యులలో గొప్ప తెలుగు పండితుడని పేరు గాంచిన జె. ఎడ్మండ్ షార్కీ ఈ మాసపత్రిక ప్రారంభించాడు. పత్రికను మద్రాసులో ముద్రించి మచిలీపట్నం నుంచి ప్రచురించేవారు. నిడుదవోలు, నార్ల, నాడిగ్ కృష్ణమూర్తి వంటివారు పత్రిక అవతరణకాలం 1862గా పేర్కొంటున్నారు. ఆరుద్ర ఈ పత్రిక 1848 నుంచి 1862 వరకు వెలువడిందంటున్నారు.[13] ఎఫ్. ఎఫ్. గ్లెయిడ్ స్టోన్ రచించగా ఇ. ప్రకాశం సంకలితం చేసిన 'షార్కీ జీవితం' రచనను ఆరుద్ర చూపారు. 'మచిలీబందరు చరిత్రము' - "పోయిన హితవాదిని పునరుద్ధరణ గావించుటకును కారణం బైనది" - అనే వాక్యం ఆధారంగా 1848లో అవతరించిన ఈ పత్రిక మధ్యలో కొంతకాలం ఆగిపోయి 1862లో పునరుద్ధరించబడిందని అనుకోవలసివస్తోందని బంగోరె అంటున్నారు.[14]

13. *Studies in the History of Telugu Journalism*
14. *బ్రౌన్ జాబులు - తెలుగు జర్నలిజం చరిత్ర.*

క్రైస్తవ మిషనరీలు వెలువరించిన తొలిపత్రికగా 'హితవాది' 14 సంవత్సరాల పాటు నడిచిందని ఆరుద్ర తెలిపారు. ఈ పత్రిక 1862 నాటి సంచికలు లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్నాయి. క్రైస్తవ మత ప్రచారమే ఈ పత్రిక ప్రధాన ధ్యేయంగా స్వీకరించింది. అయితే కేవలం మత విషయాలకేగాక ఇతర సాధారణ విషయాలు కూడా ప్రచురించేవారు. మామిడి సారంగపాణి, మతుకుమల్లి కృష్ణశాస్త్రి తమ 'మచిలీబందరు చరిత్రము'లో "హితవాదైతే తమ మత హితముతో బాటు యితర మత హితమును జూచుకొనుచు నుండెనే నింక నింక వృద్ధి కాదగియున్నది" అని పేర్కొన్నారు.[15]

లండన్‌లోని బ్రిటిషు మ్యూజియంలో ఉన్న 'హితవాది' పత్రిక 1862 నాటి సంపుటి నుంచి కొన్ని జిరాక్స్ కాపీలను డా. లక్ష్మణరెడ్డి అక్కడి వారి స్నేహితుని ద్వారా తెప్పించి కొన్ని విషయాల్ని వెలుగులోకి తెచ్చారు. ఆ ప్రకారం హితవాదిలో దేశవిదేశ వార్తలు, ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, సార్వజనీన ప్రకటనలు-మొదలైన ఆసక్తికరమైన విషయాలెన్నో చోటు చేసుకున్నాయి.

1862 నవంబర్ సంచికలో ప్రచురితమైన ఒక వార్తా ఖండికను చూడండి :

"జూలై నెల హితవాదిలో ఉదాహరించిన శంకరాచార్య స్వాముల వారి యొక్క హస్తకులను ఒక స్త్రీ చంపినదని, లోక వార్తవల్లను ప్రచురము చేసి యుంటిమి, అయితే ఇప్పుడు ఆమెను, బెజవాడలో నుండే న్యాయాధికారులు విమర్శించి, నిర్దోషిగా ఏర్పరచి విడుదల చేసిరి."

అలాగే ఆ సంచికలోనే మరో వార్తా ఖండిక ఈ విధంగా ఉంది : "రాణిగారి పెద్దకుమారుడు ఈ దేశమునకు శీఘ్రముగా వత్తురని అనుకొంటున్నారు."

అదే పుటలో ఒక విదేశ వార్త ప్రచురితమైంది :

"చీనా, హిందూ, ఆఫ్రికా మొదలైన దేశముల నుంచి వచ్చి ఇంగ్లండులో ప్రవేశించినవారు చలి, వ్యాధి, ఆకలి, దిప్పలు కలిగి తెచ్చుకొనిన సొమ్ము అక్కడి వగాకోరులకు సమర్పించి, ఇల్లున్ను, స్నేహితులున్ను దిక్కున్ను లేక వారిలో అనేకులు చనిపోవడమున్ను, శ్రమ పడడమున్ను చూచి, కొందరు ఉపకారులు అయిదు సంవత్సరముల

15. గిడుగు రామమూర్తి, గద్య చింతామణి. పు. 267

క్రిందట ఒక ఆశ్రయపు ఇల్లు వారికి గాను కట్టి, వారు ఆ దేశములో ఉన్నంత కాలమున్ను వారిని అందులో ఉంచి, వారి వారి దేశములకు పంపుతున్నారు."

1862 ఫిబ్రవరి సంచికలో 16వ పుటలో " Summary of News for 1861 " – శీర్షిక కింద "1861 - సంవత్సరములో జరిగిన వృత్తాంత సంగ్రహము" - అని తెలుగులో ఇచ్చి దానికింద ఇంగ్లండు, ఇటలీ, ఆస్ట్రియా, అమెరికా దేశాలలో జరిగిన వృత్తాంత సంగ్రహాలు ఇచ్చారు. విషయ శీర్షికలు మొదట ఇంగ్లీషులోనూ తర్వాత తెలుగులోనూ ఇవ్వడం ఈ పత్రికలో కన్పించే విశేషం.

1862 ఫిబ్రవరి సంచికలో విక్టోరియా మహారాణి భర్త ఆల్బర్ట్ గారి మరణవార్త ప్రచురితమైంది. ఇది ఆనాటి మరణవార్త రచనా రీతికి (Obituary News Item) ఒక నమూనా ఉంది. 1862 నవంబరు సంచికలో "విండ్సర్‌కోట" (Windsor castle) కు సంబంధించిన వ్యాసం సచిత్రంగా పెద్దటైపులో అచ్చువేశారు. వ్యాసం మొదట్లోనే కోట చిత్రం ఇచ్చారు. ఇది చాలా అద్భుతమైన విషయం.

హితవాదిలో భాష సరళ గ్రాంథికంగా ఉండేదని దిగవల్లి వెంకట శివరావు, నిడుదవోలు వెంకటరావు అభిప్రాయపడ్డారు. ఈ పత్రికలో సామినేని ముద్దు నరసింహం గారు అనేక వ్యాసాలు రాశారు. 1862లో ఆ వ్యాసాలను 'హిత సూచిని' పేరుతో గ్రంథాన్ని ప్రచురించారు. పత్రికలో వాడుక భాషే వాడారని లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న 'హితవాది' ఫైళ్లు పరిశీలించిన డాక్టర్ కృష్ణమూర్తి డా. లక్ష్మణరెడ్డికి[16] తెలియజేశారు. అయితే 'ఉపయోగించును'. 'కట్టబడెను', 'చేయుచున్నారు', 'చేసిరి' ,వంటి ప్రయోగాలు కొన్ని పుటల్లో కనిపిస్తాయి. 'మొదటి ఉల్యం అనేవారి చేత కట్టబడెను' - లాంటి కర్మార్థక ప్రయోగాలు కూడా కనిపిస్తాయి. 'ము' కు బదులు నేడు మనం వాడుకునే అనుస్వారం నాడు అరుదుగా కనిపిస్తుంది. కొన్ని అపవాదాలు మినహా 'హితవాది' భాష వ్యావహారికమని నిర్ధారించవచ్చు.[17]

## C. సంవాద కౌముది

నిడుదవోలు వెంకటరావు గారు ఈ పత్రిక 1852లో వెలువడినట్లు అభిప్రాయపడ్డారు. బ్రౌన్ తన నిఘంటువులో 'కౌముది' శబ్దానికి అర్థం రాస్తూ 'సంవాద కౌముది' అని

---

16. తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం
17. " "

పేర్కొని 'ది నేమ్ ఆఫ్ ఎ న్యూస్ పేపర్' అని అర్థం ఇచ్చారు. ఇదే నిడుదవోలు వారి అభిప్రాయానికి ఆధారం కావచ్చు. దిగవల్లి వెంకట శివరావు, డా. అక్కిరాజు రమాపతిరావులు కూడా ఈ అభిప్రాయాన్నే బలపరచారు. ఈ పత్రిక కొంతకాలమే నడిచినట్లుంది.

నిఘంటువులో సి. పి. బ్రౌన్ ఉదాహరించిన 'సంవాద కౌముది' తెలుగు పత్రిక కాకపోవచ్చు. 1821లో 'సంబాద కౌముది' అనే వంగ భాషా వారపత్రికను రాజారామమోహనరాయ్ నడిపాడు. వంగ భాషలో 'వా' ను 'బా' అని ఉచ్చరిస్తారని తెలిసిందే. ఆ దృష్టితో ఈ పత్రిక పేరు 'సంవాద కౌముది'గా వ్యవహరించడం జరిగింది. ఈ పత్రిక ఆ రోజుల్లో సతీసహగమనం వంటి దురాచారాల నిర్మూలనకు, సంఘ సంస్కరణకు కృషి చేసింది. ఈ 'సంవాద కౌముది' తెలుగు పత్రిక అనడానికి ఇంతకు మించి ఆధారాలు లేవు. దాని ప్రతులు అలభ్యం.

## d. దినవర్తమాని

పేరు చూస్తే ఇది దినపత్రిక అనే అభిప్రాయం కలుగుతుంది. కాని కాదు. వారానికోసారి ఆ వారంలో జరిగిన సంఘటనలు ఇతర విషయాలు ప్రచురించేవారు. ఇది ప్రతి శనివారం మద్రాసు నుంచి వెలువడేది. 1855లో తొలుత తమిళంలో ప్రారంభమైంది. 1856 జూలై ప్రాంతంలో తెలుగులో కూడా వెలువడింది. దీని సంపాదకుడు రెవరెండ్ పీటర్ పెర్సివల్. ఈయన రాజధాని కళాశాలలో దేశభాషల విభాగంలో ఆచార్యునిగా ఉన్నారు. 1862లో ప్రపంచ ప్రఖ్యాతమైన ఆరేబియన్ నైట్స్ కథలు తెలుగులో రచించినది ఈయనే.

ఈ పత్రికకు ప్రభుత్వం నెలకు 200 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడమే గాక ప్రెస్సు నడుపుకోడానికి ఉచిత భవన వసతి కూడా కల్పించింది. ఈ పత్రిక 700 ప్రతులు దాకా అమ్ముడయ్యేది. 'దిన వర్తమాని' గురించి 1863 ప్రాంతాల్లో మంకుమల్లి నృసింహ కవి రచించిన 'చెన్న పురీ విలాసం' అంతరాళ పద్ధతి 7వ పద్యంలో ప్రస్తావన ఉంది. దీని గురించి 'తత్త్వబోధిని' 1868 ఏప్రిల్ సంచికలో "దిన వర్తమాని యొక్కటి తప్ప నాంధ్ర మందు వేరొక పత్రికయు లేదు" అని ఉంది.

ఈ పత్రిక ముఖ్య ఉద్దేశం దాని ముఖపత్రంపై ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

"This Journal is designed to convey interesting and useful information on such topics as are usually contained in those of Europe; and thereby to promote the advancement and Civilisation of the Hindu Community."

ఇందులో కేవలం వార్తలే గాక విజ్ఞాన విషయాలు, గలివర్స్ ట్రావెల్స్, రాబిన్‌సన్ క్రూసో లాంటి సారస్వత గ్రంథాలు, విమర్శనాత్మక వ్యాసాలు ప్రచురితమయ్యేవి. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో 'దినవర్తమాని' ప్రభుత్వ విధానాలను సమర్థించింది. ప్రభుత్వానికి విధేయంగా నడచుకొంది.

'దినవర్తమాని' **1861**వ సంవత్సరం సంచికల సంపుటి బ్రిటిషు మ్యూజియంలో భద్రపరచబడి ఉంది. డాక్టర్ లక్ష్మణరెడ్డి గారు లండన్‌లోని తమ స్నేహితుడు డా. కృష్ణమూర్తి గారి ద్వారా పత్రిక జిరాక్స్ ప్రతులు తెప్పించుకొని పరిశీలించడం వల్ల కొన్ని విషయాలు తెలుస్తున్నాయి. ప్రధానంగా **1861** సెప్టెంబర్ **14**వ తేదీ (సంపుటి **6** సంచిక **272)** సంచికలో మొదటి పుటలో వ్యాపార ప్రకటనలున్నాయి. విషయ సూచిక కూడా మొదటి పుటలో ఉంది. మద్రాసు రైల్వే (చెన్నపురి యినుపదారి) వారి ప్రకటన తెలుగు, తమిళ భాషల్లో ఉంది. పుస్తకాల ప్రకటన ఇంగ్లీషులో అప్పటి విద్యాశాఖాధికారి అర్బత్‌నాట్ పేరు మీద ఉంది. ఈయనే చిన్నయ (సూరి)కు 'సూరి' అనే బిరుదాన్ని సీమ నుంచి తెప్పించి ఇచ్చాడంటారు.

పత్రిక మొదటి పుటలో విషయసూచిక ఆంగ్లంలో ఉన్నా లోపలి భాగం విషయ వివరణ తెలుగులోనే సాగింది. ఈ సంచికలో సాధారణ విద్యా విషయములు - అనే శీర్షిక కింద భూగోళ శాస్త్ర విషయాలు వివరించబడ్డాయి. ఈ సంచికలోనే 'అన **1861**టో సంవత్సరపు **10** దో శాసనము' వివరించబడింది. ఇది 'పోయిన వారపు కొరతః ఇది కూడా సశేషం. తర్వాత "యూరోపు వృత్తాంతము" అనే శీర్షిక కింద ఆగస్టు **10**వ తేదీ వరకు ఐరోపా వార్తలున్నాయి. శీర్షిక పై భాగంలో సూయజు పొగయోడ అనే బొమ్మ ఉంది. తర్వాత 'మెరుపు తపాలా' (టెలిగ్రాం వార్తలు) శీర్షిక కింద అమెరికా మొదలైన విదేశ వార్తలు వివరించబడ్డాయి.

తర్వాత 'ఇండియా వృత్తాంతము'లు వివరించబడ్డాయి. ఇందులో "చట్ట నిరూపణ సభ", "ఐరోపియా పటాళముల శిల్ప శాలలు" "మెస్టర్ లెయింగుదొర", "బంగళా లెస్ గవర్నరు గారు," "నానాసాహెబ్" మొదలైన ఉపశీర్షికల కింద విషయ వివరణ ఉంది.

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర వహించిన "నానాసాహెబ్"ను గురించి ఈ సంచికలో ఇలా ఉంది.

"నానాసాహెబ్ అను పరమ ద్రోహి ఇంక ప్రాణముతో నున్నట్లు ఉత్తర ఇండియా వృత్తాంత పత్రికలు కొన్ని ఉద్దేశముగా దెలియపరచుచున్నవి. నేపాళ రెసిడంట్ ఉద్యోగస్థుడు తమ చేత కూడిన మట్టుకు అచ్చటచ్చట మనుష్యులను బంపి దీర్ఘ విచారణ చేయించగా, నా దుర్మార్గుడు చలి జ్వరము చేత చనిపోయెనను వదంతి దృష్టాంతముతో దెలియవచ్చినదిగాని వేరొక వృత్తాంతమును వినబడలేదని గవర్నమెంటు వారికి రిపోర్టు చేసినట్లు ఇంగ్లిష్ మెన్ పత్రికలో కనుపరచి యున్నది."

తర్వాత "రాజధాని వృత్తాంతము" శీర్షిక కింద వార్తా విశేషాలున్నాయి. ఫోర్ట్ సెంటుజార్జి గెజిట్ వివరాలు కూడా ఇందులోనే వున్నాయి. "దేశవృత్తాంతము" శీర్షిక కింద కొన్ని కొచ్చి, హయిదరాబాదు ప్రాంతాల విశేషాలు వివరించబడ్డాయి. "ఇతర దేశ వృత్తాంతము" శీర్షిక కింద జపాన్, కేపెల్ - గుడ్ హోప్, నత్తాల్ దేశాల వార్తలు ప్రచురితమయ్యాయి. "నానా వృత్తాంత సంగ్రహము" శీర్షిక కింద ఆయా తేదీల్లో జరిగిన విశేషాలు, ఇతర పత్రికల నుంచి సంగ్రహించి ప్రచురించబడ్డాయి. **1861** సెప్టెంబర్‌నెల **14**వ తేదీ మొదలు, **25**వ తేదీ వరకు పంచాంగం కూడా ప్రచురితమైంది. "చెన్నపట్టణపు సరకుల ధరలు", "వర్తకమునకు ఉపయోగములయిన సరకులు - సామగ్రీలు - తీసుకొని పోవుటను గురించి యేర్పరచిన నిబంధనలు" మొదలైన విషయాలన్నీ ఈ సంచికలో ప్రచురించారు.

దీన్ని బట్టి 'దినవర్తమాని'లో దేశ విదేశ వార్తలే గాక మరెన్నో ఆసక్తికరమైన విషయాలు ప్రచురించేవారని తెలుస్తోంది. ఈ సంచికలో ప్రచురితమైన ఒక విదేశ వార్తా ఖండిక ఇలా ఉంది :

" జప్పాన్

జూలై నెల **20** తేది.

"యేతోన్నగరమునందు అంగిలేయ స్థానాధిపతి మొదలగువారు దిగియుండినయొక గృహములో ఈ నెల **6**తేదీ రాత్రి జపానియులగు కొందరు దుర్మార్గులు తంత్రముగా ప్రవేశించి స్థానాధిపతిని లేఖకునిన్ని పొడిచి గాయపరచి తొందర పెట్టిరి. ఆ దుష్టులు చంపుటకు మునుపు దైవాధీనముగా బెదిరించి పారదోల బడిరి."

అదే సంచికలో దేశీయ వార్తనొకదాన్ని ఏ విధంగా వేశారో చూడండి! :

"హయుదరాబాదు

మిగుల ఘనత వహించిన గవర్నర్జనరల్గారు హయిదరాబాదు నిజాం గారిని గౌరవ పరచుటకు వారికి నయిట్ పట్టమివ్వబోవుచున్నారు. ఆ యభిప్రాయమును తెలియ పరచునట్టి యొక పత్రికను రెసిడంటుకు (కర్నల్ డెవిసన్) పంపగా నా ధొర క్రమ ప్రకారము తనదు పరివారముతో కూడ నిజామ్ గారి యొద్దకుబోయి యా పత్రికను ఒప్పగించిరి. వారు దాన్ని మిగుల తృప్తితో నంగీకరించి యా మంగళ వార్తను దెలియు పరచుటకు చిహ్నముగా తనదు రాజధానియందు మాత్రము కాకుండ సికందరాబాధు పాలారమునందును ఫిరంగీలు వేయించిరి".

'దిన వర్తమాని' భాష వ్యావహారికమని నిడుదవోలు రాశారు.[18] కాని పైన పేర్కొన్న వార్తా ఖండికలను పరిశీలిస్తే భాష సరళ గ్రాంథికమే గాని వ్యావహారికం కాదు. ఇందులో నుగాగమాలు, యడాగమాలు విరివిగా కనిపిస్తాయి. సంధినియమాలు పాటించక, విసంధిగా రాయడంతో పాటు "ఉంటున్నారు", "10 దో" లాంటి ప్రయోగాలు అరుదుగా కనిపిస్తాయి. "పోయిన తూరి", "మున్నూరు" "కొత్తెత్తువాండ్రు", "పటాళములు" లాంటి మద్రాసు ప్రాంతీయ మాండలికాలు ఈ పత్రికా భాషలో కనిపిస్తాయి. వలపలగిలక కుంపిణీ యుగంలోని పత్రికలన్నిటిలో కనిపిస్తుంది.

### e. జిల్లా గెజిట్లు

**1856** నుంచి నాటి ప్రభుత్వం జిల్లా గెజిట్లను ప్రచురించింది. ప్రభుత్వ విషయాలను ప్రజలకు తెలియజేయడమే వీటి లక్ష్యం. గెజిట్లలో ఆంగ్ల పదాలను తెలుగీకరించి రాయడం, కొంత జిల్లా మాండలిక భాష కూడా కనిపిస్తుంది. తెలుగు జిల్లాలకు సంబంధించిన గెజిట్లు తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉన్నాయి. ద్విభాషా ప్రాంతాలకు సంబంధించిన గెజిట్లను ఆంగ్లంతో కలిపి మూడు భాషల్లో ప్రచురించారు. ఆయా జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ ప్రకటనలు, వాతావరణ సూచనలు, విపణి పరిస్థితులు ఈ గెజిట్లలో ప్రచురించేవారు.

---

*18. కొక్కొండ వెంకటరత్నం పంతులు. వ్యాసం "భారతి" 1951 జూలై సంచిక*

### f. క్రెసెంటు

తొలి పత్రికల చర్చ ముగింపుకు ఈ 'క్రెసెంటు' ఒక కొసమెరుపు. ఆ పత్రికను అంత చైతన్యవంతంగా నడిపిన వ్యక్తి గాజుల లక్ష్మీనర్సు సెట్టి. కుంపిణీ పాలకులు, ప్రభుత్వోద్యోగుల అక్రమాలను బయట పెట్టేందుకు సెట్టి గారు తమ ఆంగ్ల పత్రిక ద్వారా ప్రశంసనీయమైన కృషి చేశారు. ఆయన **1806**లో మద్రాసులో స్థిరపడిన సంపన్న ఆంధ్ర కుటుంబంలో జన్మించాడు. "చెన్నపట్టణ స్వదేశ సంఘం" స్థాపించి దానికి అధ్యక్షునిగా ఉన్నాడు. 'నేటివ్ సర్క్యులేటర్' అనే ఆంగ్ల పత్రికను, దాని ముద్రణాశాలతో సహా కొని తర్వాత పత్రిక పేరును 'క్రెసెంటు'గా మార్చి నిర్వహించాడు. **1844** అక్టోబర్ **2**న తొలి సంచిక వెలువడింది. ఆ పత్రికంటే పాలకులకున్న కంటగింపువల్ల ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయమూ లభించలేదు. దేశీయులు కోల్పోయిన ఉనికిని, స్వేచ్ఛను పత్రిక ప్రతిబింబించింది. తనకున్న ఆస్తినంతా ధారవోసి లక్ష్మీనర్సు సెట్టి క్రెసెంటు పత్రికను **1864** వరకు కొనసాగించి ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందుల వల్ల గత్యంతరం లేక మూసివెయ్యవలసి వచ్చింది. **1868**లో మరణించాడు.

ఇంతటితో తొలి పత్రికల చర్చ ముగుస్తున్నది. మనకు పత్రికల స్థాపన విదేశీయుల ద్వారానే సంక్రమించినా మొదటి నుంచీ మనదైన చైతన్యం పత్రికల్లో కొనసాగింది. 'వృత్తాంతి', 'వర్తమాన తరంగిణి' మొదలైన పత్రికల్లో సాంఘిక చైతన్యం గోచరిస్తుంది. పాఠకులు రాసిన ఉత్తరాలను పరిశీలిస్తే ఆ విషయం బోధపడుతుంది. అదే విధంగా పత్రికల స్థాపన, నిర్వహణ వెనుక లాభాపేక్ష ఏ కోశానా కనిపించదు. 'వర్తమాన తరంగిణి' స్థాపకుడు సయ్యద్ రహిమతుల్లా ఒక ఆదర్శం కోసం నడిపాడు. ఆనాటి పత్రికల్లో భాషలో కొంత వరకు అనువాద ఛాయలున్నాయి. ఆంగ్ల పదాలకు ఆంధ్రీకరణ కనిపిస్తుంది. వీటిలో ఎక్కువగా వ్యావహారిక భాష చోటు చేసుకోవడం చెప్పుకోదగిన విషయం.

# 3. పత్రికల వర్గీకరణ

తొలి రోజుల్లో పత్రికలను ఒక ధ్యేయం కోసం ఒక వ్యక్తో, వ్యక్తులో నడిపేవారు. ఆధునిక కాలంలో వ్యాపార సంస్థలు పత్రికలు నడపడం మొదలైన తర్వాత వాటికొక పాలసీని రూపొందించుకోవడం ప్రారంభమైంది. ఏ పత్రిక వెలువడడానికైనా ఒక కాలమానం (Periodicity) అవసరం. అలాగే ఏ పత్రికైనా సమాజంలో తాను నిర్వహించాలనుకున్న పాత్రను బట్టి తన ప్రధాన విషయ ప్రవంతిని నిర్ణయించుకుంటుంది.

తొలిరోజుల్లోని పత్రికలు వారం వారం వెలువడడం గమనార్హం. కాలమానం అనేది కేవలం వెలువరించే వారి సౌకర్యమే కాక సమాజంలో దాని తరచుదనం (Frequency) వల్ల పడే ప్రభావం కూడా పరిగణనలోకి వస్తుంది. తొలిరోజుల్లో పత్రికలు వెలువరించేవారి వనరులు పరిమితమే అయినప్పటికీ తరచుదనంకోసం వారపత్రికా నిర్వహణకు ఉద్యమించారని చెప్పవచ్చు. మాసపత్రికల వల్ల అప్పట్లో తమ ధ్యేయం గాఢంగా నెరవేరదని భావించి ఉండవచ్చు. దినపత్రికల భావనకు (Concept) అప్పటికింకా అంకురార్పణ జరగలేదు. ఈ నేపథ్యంలో పత్రికల వర్గీకరణకు ప్రయత్నించవలసి ఉంది.

## i. కాలమాన వర్గీకరణ (Periodicity)

### a. వారపత్రికలు

తెలుగులో తొలి పత్రిక 'వృత్తాంతి' వారపత్రికే అని తెలుసుకున్నాం. వృత్తాంతి తర్వాత వచ్చిన మరికొన్ని పత్రికలు కూడా వారపత్రికలే. తొలి నాటి పత్రికలను వారపత్రికలుగానే ఎందుకు నడిపారు అనే విషయం తరచి చూస్తే కొన్ని కారణాలు వెలుగులోకి వస్తాయి. తెలుగులో తొలి పత్రికలకు విదేశీ పత్రికలే స్ఫూర్తి కలిగించాయని అనుకుంటే విదేశాల నుంచి వచ్చే పత్రికల సరళిలో ఆ పత్రికల్లోని వార్తలు ఇతర విషయాలను తెలుగులోకి అనువదించి తెలుగు పత్రికలు అందించేవని గమనించవచ్చు. అంతేకాకుండా మద్రాసులో కుంపిణీ ప్రభుత్వం ఆధ్వర్యంలో వారానికోసారి వెలువడిన ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్‌లోని అంశాలనుకూడా తెలుగు పత్రిక 'వర్తమాన తరంగిణి'లో

ప్రచురించేవారు. మరీ ప్రధానంగా వారం అనే కాలమానం వారి పత్రికా నిర్వహణ ధ్యేయానికి అనుకూలంగా ఉంది. ఈ కారణంగా తొలిపత్రికలు వారానికో మారు వెలువడ్డాయని భావించవచ్చు.

'వృత్తాంతి'కి తగినన్ని వనరులు లేకపోయినా పాఠకుల నుంచి కూడా పత్రిక చందా పెద్దగా రాకపోయినా లోకంలో జరిగే విషయాలను తెలియజేయడమే ప్రధాన లక్ష్యంగా ఎన్నో ఇబ్బందుల్ని సహించి పత్రికను నడిపించారు. "లోక వ్యాపారములను తెలియజేయడం" 'వృత్తాంతి' పత్రిక ప్రయోజనంగా దాని సంపాదకుడు మండిగల వెంకట్రాయశాస్త్రి కడప నుంచి 'వర్తమాన తరంగిణి' ఎడిటరుకు రాసిన జాబువల్ల తెలుస్తుంది. పత్రికపట్ల పాఠకుల్లో ఉన్న చైతన్యం వల్ల కూడా వారం వారం వెలువడే పత్రికకు ఆదరణ ఉండేదని తెలుస్తున్నది.మొదట్లో వచ్చిన పత్రికలకు ఆర్థిక వనరులు లేక అవి నడవడం కష్ట తరమనే విషయాన్ని కందుకూరి వీరేశలింగం గారు వివేకవర్ధని పత్రిక **1882** జూన్ సంచికలో ఈ విధంగా పేర్కొన్నారు.

"..... వానింజదువు వారు మిక్కిలి తక్కువ సంఖ్యగల వారుగా నుండి చందాదారుల వలన వచ్చెడి ధనము ముద్రాభృతికే చాలక నశింపక మిగిలినవి యభివృద్ధి లేక పురుటిండ్ల వద్ద వ్రేలాడగట్టిన కలబంద చెట్ల వలె చచ్చియు చావకుండ కుట్టూపిరితో నిలిచియు వార్తా పత్రికలు ప్రబలకున్నవి"1

'వర్తమాన తరంగిణి'లో ప్రతి బుధవారం వెలువడె ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్‌లో ఆంగ్లంలో ప్రచురించే విషయాలను తెలుగులోకి అనువదించి ప్రచురించేవారు. ఇంకా ఈ పత్రికలో స్పెక్టేటరు, యెథీనియం, హర్‌కారా, ఇంగిలీషుమేన్, బొంబాయి టైంస్ వంటి పత్రికల్లోని వార్తలను అనువదించి వేసేవారు. అందువల్ల వారం వారం వెలువరించడం తప్పనిసరైనట్లుంది.

'దిన వర్తమాని' అనేది వారపత్రిక. పేరును బట్టి ఇది దినపత్రిక అనిపించినా రోజూ జరిగే సంఘటనలను గురించి ప్రతి శనివారం వెలువడేది. పత్రిక లక్ష్యాన్ని గురించి ఈ విధంగా పేర్కొన్నారు

---

*1. బ్రౌన్ జాబులు - తెలుగు జర్నలిజం చరిత్ర. 1832-1857 పు. 83*

అంటూ హిందూ (భారతీయ) సమాజం అభ్యున్నతిని ధ్యేయంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. 'దినవర్తమాని'లో టెలిగ్రాం (మెరుపు తపాలా) వార్తలు శీర్షిక కింద విదేశీ వార్తలు, ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ వివరాలు ప్రచురించేవారు.

తెలుగు ప్రముఖుడు గాజుల లక్ష్మినర్సు సెట్టి స్థాపించిన క్రెసెంటు ఆంగ్ల వారపత్రిక ప్రజల్లో జాతీయతను పెంపొందించడంతో, కుంపిణీ పరిపాలనలోని అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడంతో ఎంతో కృషి చేసింది.

తొలి పత్రికలు ప్రధానంగా క్రైస్తవ మత ప్రచారానికి అంకితమయ్యాయి. ఇతర విషయాలను కూడా ప్రచురించాయి.

వార్తలను విషయాలను త్వరత్వరగా ఎప్పటికప్పుడు ప్రచురించి పాఠకులకు అందించడానికి వారపత్రికను ఎన్నుకున్నట్లు కనిపిస్తుంది. అదే విధంగా విషయాలను కొంత ఆలశ్యంగానైనా సరే సమగ్రంగా సంచికను తయారు చేసి వెలువరించాలనేందుకు పక్ష, మాసపత్రికను ఎన్నుకొన్నారు. ఒకే పత్రిక మొదట వారపత్రికగా ప్రారంభమై తర్వాత పక్షపత్రికగా అటుపైన మాసపత్రికగా మారి చిరకాలం నడిచిన సంఘటనలున్నాయి. అదే విధంగా మొదట మాసపత్రికగా ప్రారంభమై తామేర్పరచుకున్న లక్ష్య సాధన దిశలో వేగవంతంగా సాగడానికి ఆ పత్రికను వార పత్రికగా మార్చి నడిపిన సంఘటనలూ ఉన్నాయి.

సంఘ సంస్కరణకూ, భాషా సంస్కరణకూ పత్రికలను ఆయుధాలుగా చేసుకొని అనేక సమరాలు నడిపిన కందుకూరి వీరేశలింగం 1874లో తొలుత మాసపత్రికగా ప్రారంభించిన 'వివేకవర్ధని' తర్వాత పక్షపత్రికగా ఆ తర్వాత వారపత్రికగానూ మారి రెండు దశాబ్దాలపాటు నడవడం గమనార్హం.

రాజకీయ ప్రాధాన్యం గల తొలి వారపత్రికగా 'ఆంధ్రప్రకాశిక' ను చెప్పుకోవాలి. ఎ. సి. పార్థసారథినాయుడు ప్రారంభించిన ఈ పత్రిక 42 సంవత్సరాలపాటు నడపడం గొప్ప విషయం. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించిన 1885 సంవత్సరంలో ప్రారంభమైన ఈ పత్రిక కాంగ్రెస్ ఉద్దేశాలను బలపరచడం యాదృచ్ఛికమేమీ కాదు. అవినీతి,

సైనికుల దౌర్జన్యాల గురించి ప్రచురించి తెలుగు పాఠకుల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందింపజేయడంతో పాటు పత్రికా పఠనాభిరుచిని గణనీయంగా పెంచింది.

ఆ మార్గంలో దేవగుప్తంశేషాచలపతిరావు గుంటూరు నుంచి ప్రారంభించిన 'దేశాభిమాని' మరో రాజకీయ వారపత్రిక తర్వాత బెజవాడకు మారి దినపత్రికగా అవతరించింది. దీన్నే తొలి తెలుగు దినపత్రికగా భావిస్తున్నారు.

20వ శతాబ్ది మొదటి దశాబ్దం వారపత్రికా స్థాపనలో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఒకటి 'కృష్ణాపత్రిక' స్థాపన. 1902 ఫిబ్రవరి 1న మచిలీపట్నంలో కృష్ణా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు గార్ల సంపాదకత్వంలో 'కృష్ణాపత్రిక' వారపత్రికగా ప్రారంభమైంది. ఆంధ్రుల సాంఘిక, సాహిత్యాభ్యుదయంలో 'కృష్ణాపత్రిక' నిర్వహించిన పాత్ర అమోఘం. జాతీయోద్యమ, స్వాతంత్ర్యోద్యమ పథంలో తెలుగు జనావళిని ముందుకు నడిపించింది. ముట్నూరి కృష్ణారావు సారథ్యంలో 'కృష్ణాపత్రిక' దేశంలోని భాషా పత్రికల్లో ఎనలేని ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

రెండవది 'ఆంధ్రపత్రిక'. కాశీనాథుని నాగేశ్వరరావు గారు 1908 ఆగస్టు 9న బొంబాయి నుంచి 'ఆంధ్రపత్రికను' వారపత్రికగా ప్రారంభించారు. పాఠకులకు వేగంగా వార్తలు అందించవలసి వచ్చినప్పుడు పత్రిక తరచుదనా (Frequency) న్ని మార్చడం గురించి ఇదివరకే చెప్పుకున్నాం. 1914లో మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ప్రజలకు వెంటవెంటనే యుద్ధ వార్తలు అందించడానికి 'ఆంధ్రపత్రిక'ను దినపత్రికగానూ, వారపత్రికగానూ నడపడం ప్రారంభించారు. ఆ తర్వాత 'భారతి'ని కూడా ప్రారంభించి అనితరసాధ్యంగా నిర్వహించి మూతపడే వరకూ తెలుగు ప్రజలకు అందించిన సేవ సాటిలేనిది.

తెలంగాణాలో ఎన్నో కష్టాల నడుమ ప్రారంభమై కష్టాల్లోనే ఆగిపోయిన రెండు వారపత్రికల గురించి చెప్పుకోవాలి. వరంగల్లు జిల్లా ఇనుగుర్తి నుంచి ఒద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు 1922 ఆగస్టు 27న 'తెనుగు పత్రిక'ను, నల్లగొండ నుంచి 1922 ఆగస్టు 24న షబ్నవీసు వెంకట రామనరసింహారావు 'నీలగిరి పత్రిక' ను ప్రారంభించి చారిత్రక స్ఫూర్తితో నడిపారు.

1926లో సురవరం ప్రతాపరెడ్డి హైదరాబాద్ నుంచి 'గోలకొండ పత్రిక' ను అర్ధ

వారపత్రికగా ప్రారంభించారు తర్వాత వారపత్రికగా మారింది. నిజాం రాష్ట్రంలో అణగారిన తెలుగు ప్రజలను జాగృతం చేసేందుకు వజ్ర సంకల్పంతో ప్రతాపరెడ్డి గారు ఈ పత్రికను నడిపారు. నాలుగు దశాబ్దాల పాటు ఎనలేని సేవలందించిన 'గోలకొండ పత్రిక' ఆంధ్రోద్యమాన్ని విజయవంతంగా కొనసాగించింది. **1947**లో నూకలనరోత్తమరెడ్డి సంపాదకత్వంలో దినపత్రికగా మారి కొంతకాలం నడిచింది. ప్రతాపరెడ్డి గారు 'ప్రజావాణి' అనే మరో వారపత్రికను కూడా నడిపారు.

తొలుత వారపత్రికలుగా వెలువడిన శశిలేఖ, ప్రజాశక్తి వంటి పత్రికలు అనంతరకాలంలో దినపత్రికలుగా మారాయి. వారపత్రికలుగా నడిచి సాంఘిక, రాజకీయ, సాహిత్య రంగాల్లో విశేషంగా సేవచేసిన పత్రికల్లో విబుధరంజని, ఆంధ్రకేసరి, వందేమాతం, స్వరాజ్య, దేశమాత, ఆంధ్రభారతి, నెల్లూరు పత్రిక, స్వతంత్ర, సాధన వంటివి చెప్పుకోదగినవి.

**1930** నుంచి ఈనాటి వరకూ వారపత్రికగా నడుస్తున్న 'జమీన్ రైతు' పత్రిక ప్రాంతీయ పత్రికల్లో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నది. నెల్లూరు జమీందారీ రైతుల తరపున వెంకట్రామనాయుడు స్థాపించిన ఈ పత్రిక మొదట్లో 'జమీందారీ రైతు'గా వెలువడేది. 'జమీన్ రైతు' పత్రిక ఈన్నాటికీ మారిన పరిస్థితులకు అనుగుణంగా రూపొంది వెలువడుతున్నది. జమీందారీ రైతు ఉద్యమాన్ని చేపట్టి ఆ ఉద్యమాన్ని జాతీయోద్యమంలో భాగం చేసి జమీందారీలు రద్దయ్యేవరకు పోరాడిన ఘనత ఈ పత్రిక వ్యవస్థాపకుడు వెంకట్రామనాయుడుకి దక్కుతుంది.

ప్రస్తుతం 'ఆంధ్రభూమి', 'ఆంధ్రప్రభ', 'ఆంధ్రజ్యోతి' ప్రముఖ దినపత్రికల సంస్థలు ఆ పేర్లతో వారపత్రికలు నిర్వహిస్తున్నాయి. ఇవిగాక ఇంకా 'మయూరి', 'స్వాతి' వంటివి కూడా బాగా నడుస్తున్న వారపత్రికలు.

### b. పక్షపత్రికలు

తెలుగులో పక్షపత్రికలు సంఖ్యాపరంగా స్వల్పంగా ఉన్నాయి. వాటిలో మత ప్రధాన పత్రికలు, కులపత్రికల సంఖ్య ఎక్కువ. విద్యా, వైజ్ఞానిక, న్యాయ, వాణిజ్య పత్రికలు ఆ తర్వాతి స్థానమాక్రమిస్తున్నాయి. పక్ష పత్రికల్లో మరీ తొలినాళ్లలో వెలువడిన 'శ్రీయక్షిణి' ని గురించి చెప్పుకోవాలి. బళ్లారి నుంచి **1863** నుంచి **1867** వరకు త్యాగరాజ మొదలి,

వెంకట రమణ కవి 'శ్రీయక్షిణి'ని నడిపారు. ఇది డెమ్మీ సైజులో ఉండేదని భాష గ్రాంథికమని నిడుదవోలు వెంకటరావు గారు 'కొక్కొండ వెంకటరత్నం పంతులు' అనే వ్యాసంలో రాశారు. శైలి మనోహరంగా ఉండేదని కందుకూరి వీరేశలింగం ప్రశంసించారు. వారి విగ్రహతంత్రాన్ని ఆ పత్రిక సమీక్షించింది.

1874 అక్టోబర్‌లో వీరేశలింగం గారు ప్రారంభించిన 'వివేక వర్ధని' ప్రసిద్ధి తెలిసిందే. 'వివేక వర్ధని' 1876 జూలై నుంచి 1885 వరకు పక్షపత్రికగా నడిచింది. వీరేశలింగం గారు ఈ పత్రికను మాసపత్రికగా ప్రారంభించి దాని సంచికలను వేగిరం చేసే క్రమంలో తొలుత పక్షపత్రికగా మార్చి ఆపైన వారపత్రికగా చేశారు. 'వివేక వర్ధని' మాసపత్రిక నుంచి వారపత్రికగా మారే మార్గంలో పక్షపత్రికగా ఉంది. ఈ మార్పు కేవలం మాసపత్రిక నుంచి వారపత్రికకు మారడానికి ఒక మజిలీగా సాగలేదు. పక్షపత్రికగా దాదాపు 9 సంవత్సరాలు నడిచింది. తెలుగు పత్రికా రచనకు నవయుగాన్ని తెచ్చిపెట్టింది. 1959లో ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ వారు ప్రచురించిన 'ది హిస్టరీ ఆఫ్ ది ప్రెస్ ఇన్ ఇండియా' అనే గ్రంథంలో "Sri Veeresalingam of Rajahmundry started what may be termed as news Journal called VIVEKAVARDHANI" అని పేర్కొనడం ఆ పత్రిక సాధించిన నవ్యతకు యోగ్యతాపత్రమే.

పక్షపత్రికల్లో మత, కుల పత్రికలే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు ఇదివరకే చెప్పుకున్నాం. ఈ పత్రికలు 1920-30 మధ్యకాలంలో ఎక్కువ ఉండడం యాదృచ్ఛికమేమీ కాదు. వివిధకులాల్లో అభ్యుదయకరమైన భావాలను కులపత్రికలు పెంపొందించాయి. అరుణోదయం (1920), క్షత్రియ పత్రిక (1921), ఆనంద తీర్థ (1922), శైవ ప్రచారిణి (1923), జ్ఞాన దీపిక (1923), ధర్మసాధని (1923), వీరశైవ ప్రచారిణి (1929), ఆదిమాంధ్ర (1927), వైశ్య (1929) వంటి కుల, మత పత్రికలు ఒక దశాబ్దంలో వెలువడ్డాయి.

'దేశాభిమాని' 1896లో పక్షపత్రికగా ప్రారంభమై 1906 నాటికి దినపత్రికగా మారింది. పత్రికా వ్యవస్థాపకుడు శ్రీ దేవగుప్తం శేషాచలపతిరావు పట్టుదలకు మారుపేరు. స్థానికాధికారులపై కూడా ఈ పత్రిక ధ్వజమెత్తేది. నిర్మొహమాటమైన విమర్శలు వెలువడేవి. పత్రికాపఠనాసక్తిని మిక్కిలి పెంపొందించిన పత్రిక 'దేశాభిమాని'. దేశాభిమాని 1866లో పక్షపత్రికగా ప్రారంభమైందని డా. సౌభాగ్యమ్మ[2] అన్నారు. వారపత్రికగా

---

2. *తెలుగులో సాహిత్య పత్రికలు - 1992. పు. 33*

1886లో ప్రారంభమైందని డా. లక్ష్మణరెడ్డి తెలిపారు.[3] దేశాభిమాని వారపత్రికగా 1896లో ప్రారంభమైందని దిగవల్లి శివరావు పేర్కొన్నారు.[4] ప్రారంభకాలం సంగతెలా ఉన్నా ఈ పత్రిక వారపత్రికగా ప్రారంభమైందని ఎక్కువమంది అభిప్రాయ పడుతున్నారు.

ఇతరత్రా పక్షపత్రికల్లో జ్ఞానోదయం, విజ్ఞాన వర్ధని, బాప్టిస్టు, హిందూబాంధవి, లోకబంధు, నవయుగ, దర్బారు, శ్రీధన్వంతరి, వసుంధర, శృతిధర్మ, ఆంధ్రరంజని, కొరడా, దేవాలయ సమాచార పత్రిక, పదుగురిబంటు, అహింస, కౌమోదకి, ప్రభ, రెడ్డి, వాసవి, ముద్దులు, మాతృసేవ, కళ్యాణి, జయభారతి, జయభేరి, టాంటాం, తెలుగు జర్నల్, తెలుగు తల్లి, రేనాడు, మారుతి కళ, ఆంధ్రలా జర్నల్, తీర్పుల పత్రిక, లా జర్నల్, లా రిపోర్టర్, మోహిని వంటివి.

ప్రస్తుతం 'సుప్రభాతం' వంటి కొద్దిపాటి ప్రముఖ పక్షపత్రికలు వెలువడుతున్నాయి.

### c. మాస పత్రికలు

ఆనాటి 'హితవాది' (1848) మొదలు ఈనాటి వరకు తెలుగులో మాసపత్రికలే అత్యధికం. క్రైస్తవ మత ప్రచార సంఘాలు వెలువరించిన మొట్టమొదటి మాసపత్రిక ఇది. 14 ఏళ్ల పాటు నడిచినట్లు తెలుస్తున్నది. మాసపత్రికలు తమ లక్ష్యం నిర్దేశించుకోవడంలోనూ, వారపత్రిక లెదుర్కొన్నటువంటి ఒడిదుడుకులు లేక స్థిరమైన విధంగానూ నడవడమేగాక చాలావరకు మాసపత్రికలు నిరంతరాయంగా ఎక్కువ కాలం నడిచినట్లు అవగతమవుతోంది. తెలుగులో కాలమానం (Periodicity) దృష్ట్యా మాసపత్రికలే అచ్చి వచ్చినట్లు కూడా గమనించవచ్చు.

ఈ విధంగా తెలుగులో మాసపత్రికల ఆవిర్భావ నేపథ్యం, అవి ఏర్పరచుకున్న స్థాపన లక్ష్యం, నడవడంలో ఎదుర్కొన్న సాధక బాధకాలు పరిశీలిద్దాం.

'హితవాది' ప్రారంభమైన 16 సంవత్సరాలకు 'సుజనరంజని' (1864) అవతరించింది.

---

3. *తెలుగు జర్నలిజం అవతరణ వికాసం 1985*
4. *Telugu Journalism : Past and Present essay 'Studies in the History of Telugu Journalism 1968 P. 33*

సాహిత్య విషయాలకు ప్రాధాన్యతనిచ్చిన తొలిపత్రిక ఇది. విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే విషయాలను కూడా 'సుజనరంజని' ప్రచురించేది.

అదే సంవత్సరం 'తత్త్వ బోధిని' (1964) ప్రారంభమైంది. బ్రహ్మసమాజ సూత్రాలు, సంఘ సంస్కరణోద్యమం నిర్వహించడానికి కంధుకూరి వీరేశలింగం గారికి స్ఫూర్తినిచ్చిన పత్రిక ఇది.

కొక్కొండ వెంకటరత్నము పంతులు గారు స్థాపించిన 'ఆంధ్ర భాషా సంజీవని' **(1871)** సంఘ సంస్కరణ వ్యతిరేక ప్రచారానికి కృషి చేసింది. పూర్వోన్నత్య పునరుద్ధరణ వాదులకు, సనాతనులకు ప్రతీకగానూ, ప్రాతినిధ్య శక్తిగానూ నిలిచింది. సాంఘిక, భాషా, సాహిత్య పునరుజ్జీవనోద్యమాలను ప్రతిఘటించింది. ఒకసారి మధ్యలో ఆగి మళ్ళీ ప్రారంభమై 19 సంవత్సరాలపాటు నడిచింది.

'పురుషార్థప్రదాయిని' **(1872)** మాసపత్రికను దైవసమాజం ఆధ్వర్యంలో ఉమారంగనాయకులు ప్రారంభించారు. తెలుగులో అన్ని విషయాల్లో విరివిగా సాహిత్యం వృద్ధి చెందాలని ఈ పత్రిక ఆశించింది. విజ్ఞాన విషయాలను తెలుగు వచనంలో రాయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఈ పత్రిక 20 ఏళ్లపాటు నడిచింది.

మాసపత్రికలకు ఒక నిర్దిష్టమైన లక్ష్యం ఉండటం వల్ల అది పాఠకులకు చక్కగా చేరింది. తరచుదనం (Frequecy) కోసం ఇబ్బంది పడలేదు. ఒక సంచిక వెలువరించిన తర్వాత మలి సంచికను తీర్చి దిద్దేందుకు నెలరోజుల వ్యవధి చేతిలో ఉండేది. ఆ వ్యవధి సౌలభ్యం మాసపత్రికను సుసంపన్నంగా నడిపించిందని చెప్పవలసి ఉంటుంది.

**1875** నాటికి స్వల్ప సంఖ్యలో వెలువడిన మాసపత్రికలు అనంతరకాలంలో ఇతర పత్రికల్లో ఎప్పుడూ ఆధిక్యాన్నే సాధిస్తూ నడిచాయి. ఒక దశాబ్దాన్ని తీసుకుని పత్రికలను లెక్కిస్తే అన్నిటికన్నా ఎక్కువ సంఖ్యలో మాసపత్రికలు, వాటిలో సగం వారపత్రికలు ఉండటం కనిపిస్తుంది.

ఆ సంవత్సరం వి. కృష్ణమాచార్యులు మద్రాసు నుంచి 'జనవినోదిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. పిల్లల కోసం మొట్టమొదటి సారిగా కథలు, పాటలు, ప్రచురించడం విశేషం. **1875** నుంచి దాదాపు సాహిత్య, సంఘ సంస్కరణ విషయాలే పత్రికలను ఆక్రమించాయి. 19వ శతాబ్ది చివరిపాదం ప్రధానంగా అప్పటివరకూ అలభ్యంగా ఉన్న సాహిత్య గ్రంథాలను పత్రికల ద్వారా పాఠకుల ముందు పరచింది.

**1885**లో ప్రారంభమైన 'అముద్రిత గ్రంథ చింతామణి' కేవలం సాహిత్యానికి

అంకితమైన తొలి పత్రిక. అప్పటి వరకూ పత్రికలు సాహిత్యానికి ప్రాధాన్యతనిచ్చినా సాహిత్యమే సర్వస్వంగా వెలువడిన పత్రికలు లేవు. పేరును సార్థకం చేసుకుంటూ అప్పటివరకూ అముద్రితంగా ఉన్న అనేక తెలుగు గ్రంథాలను ఈ పత్రిక ప్రచురించింది.

1891లో రాజమండ్రి నుంచి న్యాపతి సుబ్బారావు, కందుకూరి వీరేశలింగం ప్రారంభించిన 'చింతామణి' మాసపత్రిక తొలిసారిగా నవలారచనపోటీలు నిర్వహించింది. ఈ పత్రిక ప్రోత్సాహంతోనే నవలా ప్రక్రియ ఊపందుకుంది. వనప్పాకం ఆనందాచార్యులు మద్రాసు నుంచి వెలువరించడం ప్రారంభించిన ఈ సారస్వత మాసపత్రిక తన లక్ష్యాన్ని పత్రిక తొలి సంచికలో ఈ విధంగా ప్రకటించుకున్నది. "విద్యా విషయ వ్యాసములో, పురాతన గ్రంథ గుణ ప్రదర్శకములగు చర్యలును, నముద్రితంబులగు పూర్వకృత రత్నంబులును, లక్షణ జ్ఞానప్రదంబులగు లేఖలును" ప్రచురిస్తామని సంపాదకులు ప్రకటించారు.[5] జాతీయ కాంగ్రెస్‌లో కీలకపాత్ర వహించిన ఆనందాచార్యులు కేవలం సాహిత్య విషయాలకు అంకితం చేసి పత్రికను కొనసాగించడం ఎన్నదగింది.

పత్రికల దృష్ట్యా చూసినా 19వ శతాబ్ది సంస్కరణోద్యమాలకు ప్రాధాన్యం వహించింది. ఇరవయ్యో శతాబ్ది రాజకీయోద్యమాలకు ప్రాధాన్యం వహించింది. 20వ శతాబ్దం ప్రారంభంలో బెంగాల్ విభజన, ఆ ఉదంతం తెలిసి దేశమంతటా ఆగ్రహ జ్వాలలు నాల్కలు సాచినవి. 'కృష్ణాపత్రిక' ఆ విషయాలను రాయడంతో పాటు ఒక అడుగు ముందుకు వేసి బిపిన్ చంద్రపాల్ పర్యటనను తెలుగునాట ఏర్పాటు చేసి ప్రజా చైతన్యానికి పదును పెట్టింది. జాతీయోద్యమం వెంటే స్వాతంత్ర్యోద్యమం ముందుకుసాగింది. ఈ ఉద్యమాలు, పత్రికలు పరస్పరం పెనవేసుకుని ప్రజల్లో ఉద్యమ స్పృహను పెంపొందించే కృషిని ప్రోది చేశాయి.

ఈ విధంగా స్వాతంత్ర్యోద్యమం విస్తరిస్తున్న కొద్దీ దాని ప్రభావాన్ని అన్ని ప్రాంతాలకూ తీసుకువెళ్లవలసిన బాధ్యత పత్రికల మీద పడింది.

1910 దశకంలో మాసపత్రికలు అత్యధికంగా 50 ఉన్నాయి. వారపత్రికలు 9, పక్షపత్రికలు 3, ఒక త్రైమాస పత్రిక.[6] మాసపత్రికా ప్రాధాన్యం ప్రత్యేకంగా వివరించనవసరం లేదు. ఈ దశాబ్ది మాసపత్రికల్లో మత సంబంధమైనవి ఎక్కువ.

---

*5. తెలుగు జర్నలిజం - అవతరణవికాసం - లక్ష్మణరెడ్డి*

*6. " " "*

ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ గారి సంపాదకత్వాన వెలువడిన 'కల్పలత' మాసపత్రిక 1903 నవంబర్ సంచికలో 'లలిత' అనే పేరుతో తొలి తెలుగు కథానిక ప్రచురితమైంది. ఆ కథానిక శర్మగారు రచించిందే.

'1910 ప్రాంతాల్లో ఆంధ్ర రంగస్థలంలో "ఆంధ్రభారతి" జేగీయమానంగా నిలిచింది. 'ఆంధ్రభారతి' బందరులో కృష్ణాపత్రికా ముద్రణాలయంలో ముద్రితమయ్యేది...' ఆంధ్రభారతి ప్రథమ సంచికలోనే (1910 ఫిబ్రవరి) గురజాడవారి మొదటి కథ 'దిద్దుబాటు' ప్రచురితమైంది.'7

1920 నుంచి ప్రారంభమయ్యే దశాబ్దిలో కూడా మాసపత్రికలదే ఆధిక్యం. ఆ దశాబ్దిలో మాసపత్రికలు 56, వారపత్రికలు 12 వెలువడ్డాయి. ఎప్పుడూ లేని స్థాయిలో పక్షపత్రికలు ఈ కాలంలో 11 వెలువడ్డాయి.

ఈ దశాబ్దిలో ఎక్కువగా కుల, మత ప్రాధాన్యం గల పత్రికలు, మిగతావి విద్యా, వైజ్ఞానిక రంగాల పత్రికలుగా ఉన్నాయి.

1920 నుంచి ప్రారంభమయ్యే దశాబ్దిలో మాసపత్రికలు 129 వచ్చాయి. వారపత్రికలు 50 వెలువడ్డాయి. తర్వాతి స్థానం పక్షపత్రికలది (20).

ఈ దశాబ్దిలో తెలుగులో ఆణిముత్యాలనదగిన పలు సాహిత్య మాసపత్రికలు వెలువడ్డాయి. వీటిలో ఒకటి 'ప్రబుద్ధాంధ్ర'. ఈ పత్రికా సంపాదకులు 1924 డిసెంబరు సంచికలో చందాదారులనుద్దేశించి చేసిన విన్నపం చూడండి.

"మరికొందఱు దేశబాంధవులు చందాదారులుగా చేరినచో అర్థాత్తు మా చందాదారులు తమ మిత్రుల చేయూతను గూడ ఇచ్చినచో నెఱవేఱవలసిన సంకల్పములు రెండుగలవు. ఒకటి ఈ రెండు రూపాయల చందాతోడనే పత్రికలను 64 పుటలకు వృద్ధి చేయుట. రెండవది కవీశ్వరుల లలితభావములను చిత్రకారుల రూపకల్పనముల మూలమున తీర్చి ఆంధ్రవాఙ్మయమును రసజగత్తుగ జేయుట. ఈ రెండును నెఱవేఱిన గాని ప్రబుద్ధాంధ్ర సార్థకనామముగాదు. ఆంధ్రసర్వస్వ పత్రికాధిపతులును మా మిత్రులును అగు ఏడిద వేంకటరావు గారు మా కళాభివర్ధని పరిషత్తునకు నూటపదియార్లు ఇచ్చుటకంగీకరించి పోషకులై నారని విన్నవించుటకు

7. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు - డా. సి. నారాయణరెడ్డి.

మేము ఆనందభరితులమగుచున్నాము. మా మిత్రులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు వ్రాసినట్లు ప్రసుప్తాంధ్రను ప్రబుద్ధాంధ్రను గావించుట మా యుద్యమము."

సంపాదకుడు.

కౌతా శ్రీరామశాస్త్రి గారు మచిలీపట్నం నుంచి 1923 మార్చి నుండి వెలువరించడం ప్రారంభించిన 'శారద' తెలుగు సాహిత్య పత్రికా చరిత్రలో చిరస్మరణీయం. ప్రతి మాసం ఇరవయ్యో తేదీ వెలువడే ఈ పత్రిక నూటరవై (160) పుటలతో నిండుగా వచ్చేది. సంవత్సర చందా 7 - 8 - 0. తెలుగులో వర్ణ చిత్రాలతో నడిచిన తొలి సాహిత్య మాస పత్రిక 'శారద'.

1930లో ఎస్. ఎస్. వాసన్ (జెమిని స్టూడియో వ్యవస్థాపకుడు) మద్రాసు నుంచి వెలువరించిన 'ఆనందవాహిని' మాసపత్రిక తొలిసంచికలో స్వవిషయం ఇలా రాశారు;

"తెలుగుదేశంలోని కూలినాలి వ్యవసాయం మొదలైన పనిపాట్లు జరుపుకొనేవారికి (పెద్దలకే కాదు) కూడా ఉపయోగపడవలెననే తలంపుతో మేమిప్పుడు 'ఆనందవాహిని' ని ఆరంభించినాము."

ఈ సంపాదకుల మాట విలక్షణంగా ఉంది. తత్పూర్వం ఈ విధమైన పత్రికా సంస్థాపనోద్దేశాన్ని ఎవరూ వెల్లడి చేయలేదు. సామాన్య పాఠకుల కోసం కూడా మా పత్రిక అని పేర్కొనడం దీని ప్రత్యేకత.

1930తో ప్రారంభమైన దశాబ్దిలో వెలువడిన మాసపత్రికల్లో 'జ్వాల' (1932) సృష్టించిన సంచలనం చెక్కు చెదరనిదిగా నిలిచిపోతుంది. ముద్దుకృష్ణ (వైతాళికులు వెలువరించిన) బెజవాడ నుంచి వెలువరించిన 'జ్వాల'లో నారాయణబాబు, కొడాలి ఆంజనేయులు మొదలైన వారి కవితలు ప్రచురించారు. "జ్వాల'లోనే నా "మహాప్రస్థాన' ' గేయం మొదటిసారిగా ప్రచురితమైంది."[8] అని శ్రీశ్రీ పేర్కొన్నారు.

1940తో ప్రారంభమైన దశాబ్దిలో స్వాతంత్ర్యోద్యమ ఉధృతిని పల్లెపల్లెకూ ఏ రోజు కారోజు తీసుకువెళ్లడానికి దినపత్రికలు తమ వంతు పాత్ర వహించాయి. ఆకారణంగా ఆ దశాబ్దిలో మాసపత్రికలు తగ్గుముఖం పట్టినట్లు కనిపిస్తోంది.

---

*8. అనంతం - శ్రీశ్రీ ప్రజాతంత్ర - జూలై 1976*

ఈ కోవలో ఇంకా అభ్యుదయ (1946), 'స్రవంతి' (1954), 'సాహితి' (1961), 'కళాకేళి' (1969), 'సంవేదన' (1968), 'ప్రజాసాహితి' (1977), 'అరుణతార' (1977) వంటి మాసపత్రికలు సాహిత్య ప్రధానమైనవి వెలువడ్డాయి. వెలువడుతున్నాయి.

ఇటీవలి దశాబ్దాల్లో పత్రికలు సాహిత్యానికో, మరో విషయానికో మాత్రమే పరిమితం కావాలనే నియమాన్ని అధిగమించి అన్నివర్గాల పాఠకుల కోసం అన్ని రకాల శీర్షికలతో సర్వాంగ సుందరంగా రూపొంది వెలువడుతున్నాయి. మాసపత్రికలకు కూడా ఇది వర్తిస్తుంది.

## d. ద్వైమాస పత్రికలు

తెలుగులో 1920 వరకూ ద్వైమాస, త్రైమాస పత్రికలు మచ్చుకైనా కనిపించవు. ఒకరకంగా తొలి ద్వైమాసపత్రికను ప్రారంభించిన ఘనత తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి గారికి దక్కుతుంది. శాస్త్రి గారు స్థాపించిన 'సాహితి' ద్వైమాస సాహిత్య పత్రిక. అప్పటి నుంచి అడపాదడపా ద్వైమాస పత్రికలు వెలువడుతూ వచ్చాయి. అయితే ద్వైమాస పత్రికల్లో అత్యధికంగా సాహిత్య పత్రికలే కావడం యాదృచ్ఛికమేమీ కాదు. పాఠకుల తక్షణ పఠనాసక్తి, వెంట వెంటనే ప్రచురించి పాఠకులకందజేయవలసిన ప్రాముఖ్యం ఉన్న విషయం. . . వీటిని బట్టి ఆ పత్రిక నిర్వాహకులు కాలమానాన్ని నిర్ణయించుకుని నడిపినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. తక్షణావసరాన్ని బట్టే వారపత్రికలు, మాసపత్రికలు వచ్చాయి. ద్వైమాస పత్రికల విషయాన్ని బట్టి చూసినా ప్రధానంగా కనిపించేది సాహిత్యం.

సాహిత్యాన్ని ప్రచురించినవి మాసపత్రికలుగా కూడా నడిచినా మాసపత్రికల్లో వచ్చిన సాహిత్య ప్రచురణ తీరులో, ద్వైమాస పత్రికల్లో వచ్చిన సాహిత్యాంశాల ప్రచురణ తీరులో మార్పు కనిపిస్తుంది. మాసపత్రికల్లో కన్నా ద్వైమాస పత్రికల్లో ఎవరూ తరుముకు రావడం లేదన్న దృష్టితో పత్రికకు సంపూర్ణ పత్రికా స్వరూపమిచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పద్ధతి త్రైమాస పత్రికల్లో కూడా కనిపిస్తుంది. తల్లావజ్ఝల వారు ఆనాటికి లబ్ద ప్రతిష్టులైన కవులతో కలిసి తెనాలిలో 1919లో సాహితీ సమితిని నెలకొల్పారు, నోరి నరసింహశాస్త్రి, చింతా దీక్షితులు, మునిమాణిక్యం నరసింహారావు, మొక్కపాటి నరసింహశాస్త్రి, నండూరి సుబ్బారావు, నాయని సుబ్బారావు, విశ్వనాథ,

కృష్ణశాస్త్రి సమితిలో సభ్యులు. "కొత్త కవిత్వం, కొత్త కొత్త వచన రచనా ఫణితులూ, జీవంతో తొణికిసలాడే నూతన వచన శైలీ" - వీటితో నిండి 'సాహితి' అత్యంతాకర్షణీయంగా వెలువడేది. 'సాహితి' వ్యావహారిక వాదానికి లక్ష్యభరితంగా నిలిచి ఆ వాద ప్రాశస్త్యాన్ని రుజువుచేస్తూ ఆదర్శ వాఙ్మయాన్ని సృష్టించింది. దీంతో భాషా సాహిత్యాలకు సంకెలలు విడిపోతున్నాయనే ఆనందోత్సాహాలు పాఠకలోకంలో వెల్లివిరిశాయి. ఈ నూతనాభిరుచి త్వరత్వరగా విస్తరించింది.

1930తో ప్రారంభమయ్యే దశాబ్దిలో మూడే ద్వైమాసపత్రికలు కనిపిస్తున్నాయి. వాటిలో చెప్పుకోదగినది విశ్వనాథ వారు వెలువరించిన 'జయంతి' సాహిత్య పత్రిక. ఈ పత్రికను విశ్వనాథ బందరు, మద్రాసుల నుంచి నడిపినట్లు వి. లక్ష్మణరెడ్డి[9] పేర్కొనగా ఇది విశాఖపట్నం నుంచి వెలువడేదని సౌభాగ్యమ్మ[10] అంటున్నారు.

అందులో 'అధునా' అనే సంపాదకీయంలో ఇలా రాశారు. "ఇక నేటి పండితులు. వారికి తెలుగు మీదకన్నా సంస్కృతం మీద గౌరవం. ఏదన్నా కొత్త త్రోవ అంటే అట్లా పూర్వం ఉండాలి. అప్పుడది రైటూ, కావ్యానికి మొదట మూడవ కంటి మంట వుంటే అశ్లీలం. పూర్వ కవి ఇలాగే వర్ణించాడంటే ఒప్పుకుంటారు."

'జయంతి' ప్రథమ సంపుటం రెండో సంచికలో విశ్వనాథ వారు 'గ్రామ్యమా? వాడుక భాషా?' అనే వ్యాసం రాసి వ్యావహారికాన్ని సమర్థించారు.

తర్వాత 1919లో తంగిరాల రామనాధశర్మ, అనంతయ్య అనేవారు నెల్లూరు నుంచి 'నిమిషాంబ' అనే పత్రికను, అదే ప్రాంతాల్లో ఐ. వెంకటరమణయ్య పెదరావూరు (తెనాలి) నుంచి 'ముద్దులు' అనే పత్రికను నడిపారు.

'ఉదయిని' పేర కొంపెల్ల జనార్దన్ రావు నడిపిన సాహిత్య పత్రిక బహుళంగా సాహిత్యలోకం ఆదరణను చూరగొన్నది. ముద్దుకృష్ణ 'వైతాళికులు' పై కొంపెల్ల రాసిన సమీక్ష ఉదాత్తంగా ఉంది. ఉదయినిని గురించి శ్రీశ్రీ ఇలా రాశారు :

"జనార్దనరావు చిరిగిపోయిన మురికి ఖద్దరు దుస్తులు ధరించేవాడు. కాని తన పత్రికను మాత్రం పేపర్ వెయిట్ కాగితం మీదనే అచ్చువేయించేవాడు. అతడే

---

9. *తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం*

10. *తెలుగులో సాహిత్య పత్రికలు*

మరికొన్నేళ్లు బతికి ఉంటే తెలుగుసాహిత్యానికి పదిహేనంతస్తుల భవనం నిర్మించేవాడేమో! ఆరవ సంచిక కేసరి ముద్రణాలయం నుంచి బైటికి రానేలేదు. ఆ బెంగతోనే జనార్దనరావు మరణించాడని నా నమ్మకం. ఏ సంచిక కాసంచికను అతి ప్రయాసతో తీసుకొనస్తూ ఆరవది అచ్చుకిచ్చిన తర్వాత జనార్దనరావు క్షయవ్యాధిగ్రస్తుడయ్యాడు. ఆ వ్యాధితోనే చనిపోయాడు. ఆరవ సంచిక ప్రతులన్నిటినీ ప్రెస్ బిల్ నిమిత్తం చెత్త కాగితాల కింద అమ్మేయడం జరిగింది. ఒక కాపీ అయినా దొరుకుతుందేమో అని నేను కేసరి ప్రెస్సుకు వెళ్లి చాలా ప్రాధేయపడ్డాను. 'అన్నీ అమ్మేశాం' అని జవాబు వచ్చింది.[11]

ఆ రోజుల్లో ఆర్థిక వనరుల కొరతవల్ల పత్రికా సంస్థాపకులే తమ సర్వస్వాన్నీ ఒడ్డి పత్రికలు నిర్వహించారనడానికి కొంపెల్ల జనార్దనరావు ఉదంతం ఒక ఉదాహరణ మాత్రమే.

1954లో ప్రారంభమై తిరుమల రామచంద్ర సంపాదకత్వంలో మద్రాసు నుంచి 'పరిశోధన' అనే పత్రిక వెలువడేది. 1969లో ప్రారంభమై వరంగల్ నుంచి సుప్రసన్న సంపాదకత్వాన 'జనధర్మ' వెలువడేది.

## e. త్రైమాస పత్రికలు

త్రైమాస పత్రికలు కూడా 1920తో ప్రారంభమయ్యే దశకానికి పూర్వం వెలువడినట్లు లేదు. 1916లో రెండు త్రైమాస పత్రికలు వెలువడ్డా అవి కేవలం క్రైస్తవ మత ప్రచార ప్రయోజనం కోసమే కొంతకాలం నడిచాయి.

1912లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు వాణిగా ప్రారంభమైన 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక ఆనాటి త్రైమాసపత్రికల్లో పేరెన్నిక గన్నది. చారిత్రక పరిశోధనకు ముడిపదార్థంగా ఉపయోగపడేవిధంగా శాసనాలను మూ ల రూపాలతో సహా ప్రచురించిన ఘనత ఈ పత్రికకు దక్కుతుంది. అనేక అముద్రిత ప్రాచీన గ్రంథాలు ఈ పత్రికలో తొలిసారిగా ప్రచురితమయినాయి. టేకుమళ్ల అచ్యుతరావు గారి 'విజయనగర సామ్రాజ్యమునందలి ఆంధ్ర వాఙ్మయం', పాక్కులూరి లక్ష్మీనారాయణ 'ఎంకిపాటల'

---

*11. అనంతం - శ్రీశ్రీ - ప్రజాతంత్ర జూలై 25, 1976*

ను నిరసిస్తూ రాసిన 'అనర్థక వాఙ్మయం' లాంటి అరుదైన వ్యాసాలను ఈ పత్రిక ప్రచురించింది. ఇది వ్యావహారిక భాషావాదాన్ని వ్యతిరేకించింది.

1915లో అయ్యంకి వెంకట రమణయ్య గారు 'గ్రంథాలయ సర్వస్వము' పేర ఒక త్రైమాస పత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో నడిచి గ్రంథాయలయోద్యమ వ్యాప్తికి ఇతోధికమైన తోడ్పాటునందించింది. రెండు సంవత్సరాల తర్వాత ఇది ద్వైమాస పత్రికగా మారి, ఆరవ సంపుటం నుంచి మాస పత్రికగా రూపొందింది.

1926లో తేజోమూర్తుల శివరామయ్య అనే ఆయన జులుమూరు (గంజాం) నుంచి 'గ్రామోపాధ్యాయుడు' అనే త్రైమాసిక పత్రికనొకదాన్ని వెలువరించాడు. 1930వ దశకంలో త్రైమాస పత్రికలు నాలుగు మాత్రమే వెలువడ్డాయి. 1940వ దశకంలో పత్రికలు చాలావరకూ రెండవ ప్రపంచ యుద్ధం దరిమిలా ఏర్పడిన ఆర్థిక మాంద్యం, ధరల పెరుగుదల ధాటికి కొట్టుకుపోయాయి. అప్పటి వరకు 540 వరకూ ఉన్న పత్రికలు ఆ పరిస్థితుల వల్ల 180 అంతకు తక్కువగానే నిలబడ్డాయి.

ఈ దశలో 'ప్రతిభ' (1936) అనే సాహిత్య పత్రిక ఒకటి వెలువడింది. బరంపురంలో అవతరించిన నవ్యసాహిత్యపరిషత్తు నవ్యసాహిత్యోద్యమ వ్యాప్తికి, వ్యావహారిక భాషా ప్రచారానికి నడుం కట్టింది. పరిషత్తు స్థాపక దిగ్గజాలైన గిడుగు, పంచాగ్నుల, తల్లావజ్ఝుల ప్రభృతులు సంపాదకవర్గంగా 'ప్రతిభ' నునెలకొల్పారు. సూర్యరాయాంధ్ర నిఘంటువు తొలి సంపుటి వెలువడినప్పుడు గిడుగు రామమూర్తి గారు అందులోని ప్రతిపదాన్ని కూలంకషంగా పరిశీలించి సుదీర్ఘమైన సమీక్షను 'ప్రతిభ' లో ప్రకటించారు. భాషాదృష్టితో ఇది చాలా విలువైన వ్యాసం.

'ప్రతిభ' ప్రారంభ సంచికలోని సంపాదకీయ వాక్యాలు పరిశీలనార్హమైనవి :

". . . . వచన వాఙ్మయమూ, సాధ్యమైనంత వరకు వాఙ్మయమున్నూ ప్రజలకు సుపరిచితమైన భాషలో నిర్మించి అందుమూలముగా ప్రజల్లో విజ్ఞానము వ్యాపింపజేయడమూ - ఇవి సదుద్దేశములు . . . . ." గా పేర్కొన్నారు.

'ప్రతిభ' తర్వాత సుమారు 20 సంవత్సరాల వరకూ త్రైమాస పత్రికలు రాలేదు.

1955లో శ్రీనివాస చక్రవర్తి గారు 'నాట్యకళ'ను ప్రారంభించారు. రంగస్థల నాటక

కళను గురించిన ఈ అరుదైన పత్రిక నాట్యకళ, రంగస్థల శాస్త్రానికి, అభినయ శాస్త్రానికి విశిష్టమైన సేవ చేసింది. కొంతకాలం నడచి ఆగిపోగా దాన్ని తిరిగి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక ఆకాడెమీ తరఫున వెలువరించారు. ఈ పత్రికను తిరుమల రామచంద్ర మాసపత్రికగా పేర్కొంటుండగా లక్ష్మణరెడ్డి త్రైమాస పత్రికగా పేర్కొన్నారు. తొలుత ఇది మాసపత్రికగా ప్రారంభమై ఆగిపోయి తిరిగి సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రారంభమైనప్పుడు త్రైమాస పత్రికగా నడిచి ఉండవచ్చు.

1965 నవంబర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుండి వరవరరావు గారి నేతృత్వంలో వెలువడడం ప్రారంభించిన 'సృజన' ఆధునిక సాహిత్యానికి ఒక వేదికగా పనిచేసింది. పత్రిక ముఖ్యోద్దేశాన్ని పత్రికలో ఇలా పేర్కొన్నారు:

"ఇది ఒక సాహస ప్రయోగం. ఇది పత్రికా? కాదు. మారుతున్న కాలాన్నీ విస్తృతమవుతున్న జాగృతినీ ప్రతిబింబించే, అనువదించే ఒక ఫోరం. దీనికి సంపాదకుడూ లేడు సాధకులే తప్ప. ప్రయోగశీలత్వం, సృజనాత్మక శక్తి, ఆధునిక దృక్పథం ఈ ఫోరం పునాదులు."

తర్వాత చాలాకాలానికి గాని మళ్ళీ త్రైమాసిక పత్రిక వెలువడలేదు. 1987లో 'తెలుగు పరిశోధన' పేరుతో హైదరాబాద్ నుంచి ఒక పరిశోధన పత్రిక డా. ఎన్. గోపి సంపాదకత్వంలో వెలువడింది. పత్రిక తెలుగు పరిశోధనకు ఎంతగానో దోహదం చేసే విధంగా రూపొంది వెలువడేది.

పత్రిక నిర్వాహకులు ప్రారంభ సంచికలో స్థాపనోద్దేశాన్ని ఈ విధంగా పేర్కొన్నారు:

"మూణ్నెల్లకోసారి వెలువడే ఈ సంచికల్లో ప్రధానంగా రీసెర్చి మెథడాలజీ, తెలుగు పరిశోధన క్రమ పరిణామ వికాసాలు, విమర్శకు పరిశోధనకు వున్న సామ్య భేదాలు, ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో వెలువడుతున్న వినూత్న దృక్కోణాలు, వాటిని అన్వయించుకోవటంలో వాటిల్లో సాధక బాధకాలు ఇతర విషయాలను చర్చించుకోవటానికి ఈ సంచికలు వేదికలు కావాలని ఆశిస్తున్నాం." ఆ ఉద్దేశానికనుగుణంగానే పత్రికను నడిపారు. పత్రిక ఆగిపోయి దాదాపు ఒక దశాబ్దం తర్వాత డా. వాసిలి వసంతకుమార్ పునరుద్ధరించాడు. 1960లో ప్రారంభమై జువ్వాడి గౌతమరావు సంపాదకత్వాన 'మేఖల' అనే త్రైమాసిక పత్రిక హైదరాబాద్ నుంచి

వెలువడింది. 1987 నుంచి శ్రీకాకుళం నుంచి 'జముకు' అనే త్రైమాసిక పత్రిక వెలువడింది. దీని సంపాదకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి. తెలుగులో త్రైమాసిక పత్రిక ఉనికి ఈనాడు ఎక్కువగా కనిపించడంలేదు. తెలుగు అకాడమీ వారి 'తెలుగు', పొట్టిశ్రీరాములుతెలుగు విశ్వవిద్యాలయం వారి 'వాఙ్మయి' త్రైమాసిక పరిశోధన పత్రికలుగా వెలువడుతున్నాయి.

## (f) అర్ధ సంవత్సర పత్రికలు

తెలుగు విశ్వవిద్యాలయం వారి 'వాఙ్మయి' పరిశోధన పత్రిక కొంతకాలం అర్ధ సంవత్సర పత్రికగా వెలువడి త్రైమాసిక పత్రికగా మారింది. ఇది తప్ప ఎక్కువ సంఖ్యలో అర్ధ సంవత్సర పత్రికలు మృగ్యం. 1981 ఫిబ్రవరిలో ప్రారంభమై వేటూరి ఆనందమూర్తి సంపాదకత్వాన 'మణిమంజరి' షణ్మాస పత్రిక కొంతకాలం వెలువడింది. తర్వాత అప్పుడొకటి ఇప్పుడొకటి వెలువడుతూ వచ్చింది.

త్రైమాస కాలమానం దాటితే అటు పాఠకుల ఆసక్తి దృష్టితో చూసినా ఇటు నిర్వాహకుల నిర్వహణ సౌలభ్యం దృష్టితో చూసినా ప్రోత్సాహకరంగా ఉండదు.

## (g) వార్షిక పత్రికలు

అర్ధ సంవత్సర పత్రికల లాగే సంవత్సర పత్రికల సంఖ్యం కూడా మృగ్యం. వెలువడ్డ కొన్ని వార్షిక పత్రికల్లో 1954లో హైదరాబాద్ సాయం కళాశాల నుంచి వెలువడిన 'సంధ్య' ఒకటి. ఇందులో విద్యార్థులు, అధ్యాపకుల రచనలు ప్రచురించేవారు. దివాకర్ల వెంకటావధాని రచించిన 'మృచ్ఛ కటికము - వసంత సేన', గరికపాటి లక్ష్మీకాంతయ్య రచించిన 'మేఘసందేశ ప్రశంస', అడపా రామకృష్ణారావు రచించిన 'కావ్య ప్రపంచంలో పుష్పాల పరిమళం', కేశవాచారి రచించిన 'వేమన పుట్టు పూర్వోత్తరములు' వంటివి ఇందులో ప్రచురించారు.

1976 జనవరిలో వరంగల్లు పి. జి. సెంటరు నుంచి ప్రారంభమైన 'విమర్శిని' తొలి సంపాదకులు కేతవరపు రామకోటిశాస్త్రి గారు.

తొలి సంచికలో ఈ విధంగా తమ ఆశయ ప్రస్తావన చేశారు :

"ఓరుగల్లు స్నాతకోత్తర విద్యా కేంద్రము తెలుగు విభాగము అధ్యాపకులు వ్యష్టిగానూ, సమష్టిగానూ చేసెడు పరిశోధనాధ్యయన ఫలితాలను ప్రచురించుటకు ఒక పత్రిక

అవసరమన్న అభిప్రాయమును విశ్వవిద్యాలయాధికారులు అనుమతించినందువల్ల ఈ సంవత్సరము నుండి 'విమర్శిని' పత్రికను ప్రారంభించినాము. మన విశ్వవిద్యాలయాలలోనూ, స్నాతకోత్తర విద్యాకేంద్రాలలోనూ తెలుగు శాఖ ఒక పరిశోధన పత్రికను ప్రచురించుటకిది మొదలు. మిగిలిన కేంద్రాల తెలుగుశాఖలు కూడా ఇంతకంటే మంచిగా పరిశోధన పత్రికలను ప్రచురించుటకిది ప్రేరణ కావలయునన్నది మా ఆకాంక్ష. ఒక స్థాయిలో ఒక విద్యా విభాగము నందు వినిమయమున కవకాశముండుట ఎంతైనా అవసరము. ఇంత రాష్ట్రమున ఇన్ని కేంద్రములందు ఇన్నీ తెలుగు విభాగములుండి మన భాషా సాహిత్యముల భవిష్యదభ్యుదయమునకు విశ్వవిద్యాలయ స్థాయిలో కృషి జరుగవలసినంతగా జరుగట లేదన్న ఆందోళనయే మా యీ సాహసమునకు మూలము."

ఈ పత్రికలో అధ్యాపకుల, పరిశోధకుల, విద్యార్థుల రచనలుండేవి.

'వివేచన' పేరుతో వార్షిక పత్రికను **1976** డిసెంబరులో హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ప్రారంభించింది. దీని సంపాదకుడు అప్పట్లో ఆచార్య బి. రామరాజు గారు. పత్రిక అవిర్భావావశ్యకతను గురించి దాని ప్రథమ సంచికలో ఈ విధంగా పేర్కొన్నారు.

"విశ్వవిద్యాలయాలలో ఈనాడు పరిశోధనకు అగ్రతాంబూల మివ్వబడుతున్నది. ఆధునిక ఆదర్శాధ్యాపకులకు పఠన పాఠనాలు వృత్తి ధర్మంగానూ, పరిశోధన ప్రవృత్తి ధర్మంగానూ పరిగణింపబడుతున్నాయి. ఈ దృష్టితో **1974**లో జరిగిన తెలుగు శాఖ సర్వసభ్యసమావేశం పరిశోధనాపత్రికా ప్రచురణం జరుగవలెననీ, అది విశ్వవిద్యాలయాంధ్రోపన్యాసకుల పరిశోధన కృషికి పతాకగా ఉండవలెననీ తీర్మానించడం జరిగింది. ఈ యత్నంలో ఉన్న ఔచిత్యాన్ని గుర్తించి అప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ నూకల నరోత్తమ రెడ్డిగారు రెండువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసినారు. ఈ అక్షర రూపానికి ఆలంబనం కల్పించిన వారి సహృదయతకు కృతజ్ఞతలు."

ఈ పత్రిక ఉత్తమ ప్రమాణాలతోనూ, మౌలిక పరిశోధన విషయాలతోనూ వెలువడుతోంది. ఇందులో విశ్వవిద్యాలయ అధ్యాపకుల రచనలు, జంటనగరాల్లోని

కళాశాలల అధ్యాపకుల రచనలు ప్రచురించేవారు. సంపాదకుడుగా తొలుత రామరాజు గారు ఉన్నా తర్వాత పదవీరీత్యా తెలుగు శాఖ అధ్యక్షులైన వారు సంపాదకులుగా ఉంటూ వస్తున్నారు.

## h. వార్షిక ప్రత్యేక సంచికలు

ప్రసిద్ధ పత్రికలకు ప్రత్యేక సందర్భాలలో పర్వదినాలలో ప్రచురించే సంచికలను వార్షిక ప్రత్యేక సంచికలుగా వ్యవహరించాల్సి ఉంటుంది. 'ఆంధ్రపత్రిక', 'ఆంధ్రజ్యోతి', 'జ్యోతి', విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి పత్రికలు దీపావళి, ఉగాది, సంక్రాంతి పర్వదినాలను, పత్రిక వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా వెలువరించే విశేష సంచికలు వార్షిక సంచికలే గాని వాటిని వార్షిక పత్రికలు అనడానికి వీలులేదు. ఆంధ్రపత్రిక దినపత్రికగా వెలువడక ముందు నుండే సంవత్సర సంచికలు వేసింది. గతంలో పర్వదినాలు సమీపిస్తున్నాయంటే చాలు పత్రికలు పోటీలు నిర్వహించి బహుమతినందుకున్న కథలు, కవితలు, వ్యాసాలతోపాటు ప్రముఖ కవులు, విమర్శకుల రచనలతో ప్రత్యేక వార్షికసంచికలను అందంగా ముస్తాబుచేసి అందించేవి. అటువంటి సంచికలకోసం ఇటు కవి, రచయితలు, అటు పాఠకులు ఎదురు చూసేవారు.

ప్రస్తుతం 'ఇండియా టుడే' పత్రిక తెలుగులో ప్రత్యేక వార్షిక సాహిత్య సంచికను ఆ స్థాయిలో వెలువరిస్తోంది.

ఇవేగాక ప్రముఖ సాహితీ, సాంస్కృతిక సంస్థలు ప్రత్యేక సందర్భాల్లో అంటే సంస్థలు తలపెట్టే అరుదైన కార్యక్రమాల్లో రజతోత్సవ, స్వర్ణోత్సవ సందర్భాల్లో వెలువరించే ప్రత్యేక సంచికలు (సావనీర్లు) ప్రస్తుత : ప్రాముఖ్యం సంతరించుకున్నా అవి పత్రికల కిందకు రావు.

## i. దినపత్రికలు

పత్రికల కాలమానాన్ని (Periodicity) వేగిరం చేయడమంటే త్రైమాస నుంచి ద్వైమాస పత్రికగా, ద్వైమాస నుంచి మాసపత్రికగా, మాసపత్రిక నుంచి పక్షపత్రిక నుంచి వారపత్రికగా, దినపత్రికగా మార్పు చెందడమన్న మాట. ఈ మార్పు కాలాన్ని బట్టి ప్రజల అవసరాన్ని బట్టి అనివార్యమవుతూ వస్తున్నది. ఒకోసారి ఆర్థిక వనరుల కొరతవల్ల కొందరు తమ పత్రికను స్థిరచిత్తంతో మాసపత్రికగా నడపవచ్చు. వార

పత్రికను తప్పనిసరిగా ఎన్నటికీ మాసపత్రికగానే కొనసాగించడం సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే సమాజంలో ఏదైనా పెనుమార్పు జరిగి అది అనేక విధాలుగా పరిణమిస్తే దాని గురించి ప్రజలకు తెలియజేయవలసి వస్తుంది. అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు ఆ మాసపత్రికగా తప్పక వారపత్రికగానో, దినపత్రికగానో మారితీరాలి. కొత్తగా పత్రిక నెలకొల్పే వారు సైతం పరిస్థితుల దృష్ట్యా దినపత్రికే ప్రారంభించవలసి రావచ్చు. ఈ విధంగా మొదటి ప్రపంచ యుద్ధం దినపత్రికల స్థాపనావసరాన్ని ఎత్తి చూపిందనవచ్చు.

ఆ రకంగా ప్రజలకు సమాచారాన్ని వేగంగా అందుబాటులోకి తేవాలనే అవసరం దినపత్రిక ఆవిర్భావానికి దారి చూపింది. ఇందువల్ల అంతకు పూర్వం వారపత్రికలుగా ఉన్నవి దినపత్రికలుగా మారడంగాని, కొత్తగా దినపత్రికే ఏర్పాటు కావడం గాని మనకు పత్రికల పరిణామాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

దినపత్రికంటే నేటిపత్రిక అనే అర్థం రూఢి అయిపోయింది. ఈనాడు ప్రపంచమంతటా సమాచార వినిమయం కోసం ఒక భారీ పరిశ్రమగా నడుస్తున్నది.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన **1885** సంవత్సరంలో ఎ. సి. పార్థసారథినాయుడు వారపత్రికగా ప్రారంభించిన 'ఆంధ్రప్రకాశిక' **25** సంవత్సరాలపాటు నడచి, కొంతకాలం ద్వైవార పత్రికగా వెలువడి తర్వాత దినపత్రికగా మారింది.

'దేశాభిమాని' పత్రిక మొదట 'కృష్ణావృత్తాంతిని' అని 'కృష్ణాన్యూస్' అని బెజవాడ నుంచి వెలువడి తర్వాత 'దేశాభిమాని'గా మారింది. ఇది వారపత్రికగా నడచి **1901** నాటికి దినపత్రికగా మారింది. ఈ పత్రికను స్థాపించిన దేవగుప్తం శేషాచలపతిరావు తొలి తెలుగు దినపత్రికా వ్యవస్థాపకుడనే కీర్తి దక్కించుకున్నారు.

**1908**లో శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు రాజమండ్రి నుంచి నడిపిన 'గౌతమి' దినపత్రికగా వెలువడిందని మద్రాసులోని రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ వారి కార్యాలయంలో నమోదైంది. అయితే ఈ దినపత్రిక **1911**లో వెలువడినట్లు నిడుదవోలు వెంకటరావు గారు పేర్కొన్నారు.

1894లో మద్రాసు నుంచి గట్టుపల్లి శేషాచార్యులు వారపత్రికగా వెలువరించిన 'శశిలేఖ' తర్వాత ద్వైవార పత్రికగా మారి ఈ తర్వాత దినపత్రికగా మారి కొంతకాలం నడిచింది. తెలుగు పాఠకుల్లో యుద్ధ వార్తా పఠనాభిలాష రేకెత్తించింది. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని వాదించి ఆంధ్రోద్యమానికి బాసటగా నిలిచింది.

1908 ఆగస్టు 9న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభమైన 'ఆంధ్రపత్రిక' 1914 ఏప్రిల్ 1న మద్రాసుకు తరలివచ్చి వారపత్రికగా, దినపత్రికగా నడిచింది. అది దినపత్రికగా, వారపత్రికగా, సాహిత్య పత్రిక (భారతి) గా ఏడు దశాబ్దాలకు పైగా తెలుగు వారిని సమగ్రంగా ప్రతిఫలించింది. మొదటి ప్రపంచ యుద్ధం నాటి నుంచి మొదలుకొని తెలుగు పాఠకులకు వార్తలందిస్తూనే జాతీయోద్యమం, స్వాతంత్ర్యోద్యమాల్లో ప్రజల ఆశలనూ, ఆకాంక్షలనూ ప్రతిబింబించింది. ఈ పత్రిక వ్యవస్థాపకుడు, తెలుగు పత్రికా వైతాళికుడు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఒక ఉద్యమంలా 'ఆంధ్రపత్రిక' ను నడిపించారు.

1935లో భారత ప్రభుత్వ శాసనం మేరకు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఆ సందర్భంలో జస్టిస్ పార్టీ నేతగా ఉన్న పిఠాపురం మహారాజా పార్టీపత్రికగా 'జనవాణి' దినపత్రిక ప్రారంభించారు. తాపీ ధర్మారావు గారు ఈ పత్రిక ద్వారా ఎన్నో కొత్త పోకడలు సృష్టించి అనంతర పత్రికా రచనకు మార్గదర్శకులయ్యారు. ఎన్నికల్లో జస్టిస్ పార్టీ ఓడిపోవడంతో పత్రికను ఆపివేశారు.

1938 ఆగస్టు 15న రామ్‌నాథ్ గోయెంకా తమ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికల్లో ఒకటిగా ఆంధ్రప్రభ దినపత్రికను మద్రాసు నుంచి ప్రారంభించారు. పత్రిక ఒక పరిశ్రమగా రూపొందే క్రమాన్ని అప్పుడే అందుకొంది. గొలుసు పత్రికల పద్ధతి ప్రవేశ పెట్టింది కూడా ఈ ఎక్స్‌ప్రెస్ గ్రూపే. ఖాసా సుబ్బారావు గారితో ప్రారంభించి, న్యాపతి నారాయణమూర్తి, నార్ల వెంకటేశ్వరరావు మొదలైన దిగ్గంతులైన సంపాదకులు అనంతర దినపత్రిక పోకడలను తీర్చిదిద్దడానికి ఆంధ్రప్రభ ఒక వేదికగా నిలిచింది.

1945లో రాజగోపాల్ మొదలియార్ హైదరాబాద్‌లో 'తెలంగానా' అనే దినపత్రికను ప్రారంభించారు. బుక్కపట్నం రామానుజాచార్యులు సంపాదకత్వం నెరిపారు. ఈ దినపత్రిక మూడేళ్లకు మించి నడవలేదు.

అదే సంవత్సరం కలకత్తావాలా అనే వ్యాపారి హైదరాబాద్‌లో 'మీజాన్' అనే దినపత్రికను అడివి బాపిరాజు గారి సంపాదకత్వంలో ప్రారంభించాడు. జి. కృష్ణ, రాంభట్ల, తిరుమల రామచంద్ర వంటి ప్రముఖ పాత్రికేయులు ఇందులో పనిచేశారు. నిజాం అనుకూల ధోరణిని అవలంబించవలసి వచ్చినప్పుడు బాపిరాజు గారితో సహా పాత్రికేయులు వైదొలగారు. పత్రిక ఆగిపోయింది.

గోలకొండ పత్రిక 1947లో దినపత్రికగా మారింది. సురవరం ప్రతాపరెడ్డి గారు సంక్లిష్ట సాంఘిక, రాజకీయ వాతావరణంలో తెలంగాణా ప్రజల జాగృతిని సాధించే దిశగా నడిపిన గోలకొండ పత్రిక దినపత్రికగా మారినప్పుడు దానికి నూకల నరోత్తమరెడ్డి గారు సంపాదకులుగా ఉన్నారు. ఆ దినపత్రిక 1966లో ఆగిపోయింది.

కమ్యూనిస్టు పత్రికలైన 'ప్రజాశక్తి', 'విశాలాంధ్ర'ల గురించి వేరుగా ప్రస్తావిస్తాను.

రాయలసీమ ప్రాంతానికి చెందిన యువకులు 1950లో ప్రారంభించిన 'విజయప్రభ' దినపత్రిక కొద్దికాలం మాత్రమే నడిచింది.

1955లో సికింద్రాబాదు నుంచి 'ఆంధ్రజనత' దినపత్రిక ప్రారంభమైంది. విశాలాంధ్ర ఉద్యమ ప్రచారానికి గాను ఒక పత్రిక ఉండాలని భావించి బూర్గుల రామకృష్ణారావు, వి. బి. రాజు, జనార్దనరావు దేశాయ్ కలిసి ప్రారంభించిన 'ఆంధ్రజనత' రాష్ట్రావతరణ అనంతరం కాంగ్రెస్ పత్రికగా మారి కొంతకాలానికి ఆగిపోయింది.

1960లో శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్ విజయవాడ నుంచి ప్రారంభించిన 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక నార్ల వెంకటేశ్వరరావుగారి సంపాదకత్వాన దినపత్రికా మనుగడకు ప్రమాణాలను రూపొందించింది. వాడుక భాషకు పదును పెట్టింది. సంపాదకీయ నడవడికి ఒరవడి పెట్టింది. అదే సంవత్సరం సికింద్రాబాద్ నుంచి 'ఆంధ్రభూమి' దినపత్రిక ప్రారంభమైనది దక్కన్ క్రానికల్ గ్రూపులో ఒకటిగా ఏర్పడ్డ ఈ పత్రిక గోరాశాస్త్రి గారి సంపాదకత్వంలో విశిష్టతను సంతరించుకుంది.

1974లో విశాఖ నుంచి ప్రారంభమైన 'ఈనాడు' ఆధునిక పత్రికా రచనను ఒక మలుపు తిప్పింది. తెలుగు పాఠకుల అవసరాన్ని సహేతుకంగా అంచనా వేసి ఆ అంచనాలకు దీటుగా దినపత్రికను తీర్చిదిద్దుకున్నారు. తెలుగు పత్రికకు మున్నెన్నడూ లేని సర్క్యులేషన్‌తో పాటు ముద్రణ పరిజ్ఞానంలో, వార్తా నాణ్యతా ప్రమాణాల్లో దేశ భాషా పత్రికా రంగంలో తెలుగును అగ్రశ్రేణిలో నిలబెట్టేందుకు మార్గం వేసింది.

1984 డిసెంబరు 29న హైదరాబాదు నుంచి ప్రారంభమైన 'ఉదయం' దినపత్రిక పత్రికా రచనా రంగంలోకి సరికొత్త విప్లవాన్ని తెచ్చింది. గొలుసు పత్రికలతో పాటు విద్య, ఉద్యోగ, ఆర్థిక, వ్యాపార రంగాల సమాచారం కోసం ప్రత్యేక అనుబంధాలను ప్రవేశపెట్టడంలో ముందంజవేసి మిక్కిలి ప్రాచుర్యం పొందింది.

1996 ఫిబ్రవరి 1న హైదరాబాదు నుంచే ప్రారంభమైన 'వార్త' దినపత్రిక ఏకకాలంలో 9 కేంద్రాల నుంచి వెలువడిన తొలి తెలుగు దినపత్రిక. మహిళలు, పిల్లల కోసం ప్రతిరోజూ ప్రత్యేక అనుబంధాలను అందించడంతో పాటు 'వృత్తి', 'విద్య', వికాసం, 'ఉపాధి', 'నాడి', 'పల్లె', 'కృతి', 'కళ' వంటి పేర్లతో విద్యా, ఉద్యోగ, ఆరోగ్య, గ్రామీణ, సాహిత్య, కళారంగాల సమాచారాన్ని విస్తృతంగా అందిస్తోంది.

ఇవే గాక రాష్ట్రంలో చిన్న, పెద్ద దినపత్రికలు ఇంకా చాలా ఉన్నాయి. దినపత్రికల గురించిన చర్చ మరో చోట వివరంగా ఉంది.

## 2. పత్రికల విషయానుగుణ వర్గీకరణ

తెలుగు పత్రికలు ఇతర భాషా పత్రికల్లాగే క్రమంగా దేశ కాలపరిస్థితులను బట్టి మార్పు చెందుతూ వచ్చాయి. మరోవిధంగా చెప్పాలంటే కాల పరిణామంలో చారిత్రకంగా తాము నిర్వహించవలసిన అవశ్య కర్తవ్యానికి అనుగుణంగా రూపుకడుతూ వచ్చాయి. తొలుత వెలువడినట్లు భావిస్తున్న 'కర్నాటిక్ క్రానికల్'[12] మొదలైన తొలినాళ్ళ పత్రికలు అనువాద బలంతో నడిచాయి. ఏవో ప్రకటనలు ఆంగ్లంలో మౌలికంగా ఉండి ప్రాంతీయ భాషల్లోకి అనువాదం పొంది అచ్చవుతూ ఉండేవి. ప్రభుత్వానికి అనువాదకులు కూడా ఉండేవారు. వారే ఆంగ్ల ప్రకటనల్ని స్థానికులకు తెలియజేసేందుకు వారి భాషల్లో అనువాదం చేసి ప్రచురించేవారు.[13] పత్రికలు పేజీలు విప్పిన నాటి నుంచీ పాఠకుల్లో పత్రికా చైతన్యం వెల్లివిరిసిందని చెప్పడానికి 'వృత్తాంతి' వారపత్రికలో

*12. కాన్‌స్టాంటిన్ శాంపి మరో ముగ్గురు దేశీయులు వెలువరించిన తెలుగు, తమిళ, ఆంగ్ల పత్రిక (1833)*

13. జె.సి. మారిస్, ఏనుగుల వీరాస్వామయ్య, సిపిబ్రౌన్ వంటివారు. జెసిమారిస్‌కు Teloogoo **translator to Government** అని పేరు కింద పేర్కొన్నారు. చూ. తెలుగు జర్నలిజం అవతరణ వికాసం - లక్ష్మణరెడ్డి పు. 69

'లోకరక్షకుడు' అనే చందాదారుడు సంఘంలో 'వివాహములను గురించిన దుర్వ్యయమును' విమర్శిస్తూ రాసిన లేఖ ఎన్నదగిన సాక్ష్యం. 'వృత్తాంతి' పత్రిక ప్రతులు కూడా తత్పూర్వం వెలువడినట్లు చెబుతున్న 'కర్నాటిక్ క్రానికల్' లేదా 'మద్రాసు క్రానికల్' వలెనే ప్రతులు లభ్యం కావడం లేదు. అయితే 'వృత్తాంతి'లో వచ్చిన ఆ లోకరక్షకుని లేఖ ప్రస్తావన పలుచోట్ల ఉండడమే గాక బ్రౌన్ సంపుటాల్లోకి ఎక్కడం వల్ల[14] 'వృత్తాంతి' కి కనిపించే తొలి తెలుగు పత్రికా గౌరవం దక్కింది.

భాష విషయంలో 'వృత్తాంతి' ని ప్రశంసించవచ్చు. ఆనాటి వ్యవహారాంధ్ర భాష పత్రికలో చోటుచేసుకొన్నది. వర్తమాన తరంగిణిలో కూడా అటువంటి భాషనే వాడారు. 'ప్రాంతీయ వార్తలేకాక యూరోపు, చైనా, కలకత్తా, బొంబాయి, మొదలైన చోట్ల జరిగే రాజకార్యాలను, వర్తక వ్యాపార విషయాలను, భూగోళ, ఖగోళ, గణిత, ధర్మశాస్త్ర, నీతిశాస్త్ర' విషయాలను ప్రచురించేవారు. పాఠకుల లేఖల్లో ఆనాటి నుంచే పరిణతికనిపించడం చెప్పుకోదగిన విశేషం.

తర్వాతి కాలంలో వచ్చిన సాంఘిక సంస్కరణోద్యమాలకు అనుగుణంగా సాంఘిక పత్రికల సంఖ్య హెచ్చింది. ఆ కాలంలో కొంతవరకూ ఆ తర్వాతో సాహిత్య పత్రికలు వచ్చాయి.

స్వాతంత్ర్యోద్యమం వ్యాప్తినందిన కొద్దీ రాజకీయ పత్రికలు వచ్చాయి. ఆ తర్వాతకాలంలో మతపత్రికలు ప్రాబల్యం వహించాయి. ఆ క్రమంలో శాస్త్ర, సాంకేతిక, విద్యా, వైజ్ఞానిక, వేదాంత, వ్యవసాయ, వాణిజ్య, మహిళా, హాస్య, సినిమా విషయాల్లో ప్రధానంగా పత్రికలు వెలువడ్డాయి. పత్రికలను ఎక్కువగా సాంఘిక, రాజకీయ మత విషయాలు ప్రభావితం చేశాయి. అయితే ఏ దశాబ్దిలోనైనా ఏదో ఒక విషయం కొంతవరకు ఆధిక్యం వహించినట్లుంది గాని ఆ దశాబ్దిలో మిగతా విషయాలకు చోటు లభించకపోవడం లేదు. పత్రికల్లో ఒకే విషయం ఉండదు కదా! ఇక విషయపరంగా పత్రికలను విశ్లేషిస్తాను.

## i. సాంఘిక పత్రికలు

సాంఘిక పత్రికలంటే సంఘ సంస్కరణ ప్రధానమైన పత్రికలనే రూఢిగా చెప్పుకోవచ్చు. ఆ విధంగా 19వ శతాబ్దాన్ని సంఘ సంస్కరణయుగంగా పరిగణిస్తే ఆ యుగంలో

14. *వర్తమాన తరంగిణి 1843 మే 18 నాటి సంచికలో వుంది.*

ప్రవర్తిల్లిన అత్యధిక పత్రికలను సాంఘిక పత్రికలుగా వ్యవహరించవలసి ఉంటుంది. ఆ శతాబ్దం తొలినాళ్ల నుంచే సంఘ సంస్కరణోద్యమాలు తలెత్తాయని కాదు. కాని సంఘ సంస్కరణావశ్యకత మాత్రం శతాబ్ది ఆదినుంచీ ఉంది. ఆవశ్యకతకు తోడు ప్రజల్లో సంఘ సంస్కరణ స్పృహ పెంపొంది మార్పుపట్ల అనురక్తి పెరగాల్సి వస్తుంది. ఆ అనురక్తిని ప్రేరేపిస్తూ ఒక ఉద్యమంగా దాన్ని చేపట్టడం అవసరం. ఆ పని మొదట్లో వంగ దేశంలో రాజారామమోహన్‌రాయ్, తెలుగునాట కందుకూరి వీరేశలింగం ప్రభృతులు చేశారు. సంఘసంస్కరణోద్యమ విస్తృతికీ, ఉధృతికీ వారు పత్రికల్ని అస్త్రాలుగా ఉపయోగించారు. రాజారామమోహన్ రాయ్ 'సంవాద కౌముది' (1821) అనే వంగభాషా పత్రికను, 'మిరాతుల్ అఖ్‌బార్' (1822) అనే పారశీక పత్రికను నడిపాడు. సతీసహగమనం, సాంఘికంగా వెనుకబాటుతనం, అజ్ఞానం పారదోలడానికి పత్రికల ద్వారా ఆయన చేసిన కృషి అపారం. ఆధునిక భారత పునరుజ్జీవన జనకునిగా రామమోహనరాయ్ నిలిచిపోయాడు. సతీసహగమనాన్ని నిషేధిస్తూ విలియం బెంటింక్ శాసనం చేశాడు.

తెలుగునాట పునరుజ్జీవన జనకునిగా కందుకూరి వీరేశలింగాన్ని చెప్పుకోవాలి. ఆయన కూడ సంఘ సంస్కరణ కృషిలో ఎన్నో పత్రికలు నడిపాడు. అటు అభ్యుదయ వ్యతిరేక శక్తులను, వ్యక్తులనే కాదు సంఘ సంస్కరణకు వ్యతిరేకంగా నడిచిన సనాతన భావ ప్రచార పత్రికలను కూడా వీరేశలింగం తన పత్రికల ద్వారా ఎదుర్కొన్నాడు. ఆ యుగంలో ప్రారంభమై ముందుకు సాగిన సాంఘిక పత్రికలను గురించి తెలుసుకుందాం.

**a. వృత్తాంతి**

'వృత్తాంతి' తెలుగులో అక్కడక్కడా ప్రస్తావనా మాత్రంగా కనిపిస్తున్న తొలి తెలుగు పత్రికగా ఇదివరకటి అధ్యాయంలో చెప్పుకున్నాం. ఈ పత్రికను కనిపిస్తున్న పత్రికగా నిలబెట్టిన ఇందులోని 'లోకరక్షకుని లేఖ' ను గురించి తప్పక చెప్పుకోవాలి. వివాహాల విషయంగా ఆనాటి సంఘంలో జరుగుతున్న దుర్వ్యయాన్ని గురించి ఆ పాఠకుని లేఖా రూపేణా 'వృత్తాంతి' ఎలుగెత్తి చాటింది. ఏవి వాంఛనీయమైన ధోరణులో కూడా అది తెలిపింది.

### b. తత్త్వబోధిని

1864 ప్రాంతాన చెన్నపురి వేదసమాజం (ఇది అనంతర కాలంలో బ్రహ్మ సమాజంగా రూపాంతరం చెందింది) నడిపిన 'తత్త్వబోధిని' మాసపత్రిక ప్రధానంగా బ్రహ్మసమాజ యాత్రాలను, సంఘ సంస్కార విషయాలను ప్రచారం చేసింది. 'స్త్రీ పునర్వివాహవిషయకోపన్యాసములు'[15] తొలిసారిగా ఈ పత్రికలోనే ప్రచురితమయ్యాయి. ఈ వ్యాసాల ప్రభావం వీరేశలింగం గారిపై పడింది..

### c. ఆంధ్ర భాషా సంజీవని

ప్రసిద్ధ గ్రాంథిక భాషాభిమాని కొక్కొండ వెంకటరత్నము పంతులుగారు కలశపాకము విజయరాఘవనాయుడు అనే వదాన్యుడి సహాయంతో ఈ పత్రికను 1871 నవంబర్ 28 వ తేదీన ప్రారంభించారు. ఈ పత్రిక పూర్వోన్నత్య పునరుద్ధరణ వాదులకు, సనాతనులకు ప్రాతినిధ్యం వహించింది. సాంఘిక సాంస్కృతిక భాషా పునరుజ్జీవనోద్యమాలను ప్రతిఘటించడానికి పూనుకొన్నది. వితంతు వివాహాలు, స్త్రీ విద్య మొదలైన సాంఘిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ వ్యాసాలు ప్రచురించింది. ఈ పత్రిక 1871 నుంచి 1883 వరకు నడిచి ఆగిపోయి 1892లో తిరిగి ప్రారంభమై 1899 వరకూ నడిచింది.

### d. పురుషార్థ ప్రదాయిని

1872 జనవరిలో బందరు నుంచి వెలునడిన ఈ పత్రిక ఉమారంగనాయకులు గారి సంపాదకత్వంలో దాదాపు 20 సంవత్సరాలు గొప్పగా నడిచింది. దీన్నే 'దైవ సమాజిని' అనీ, 'తత్త్వ ప్రకాశిని' అనీ అనేవారు. గొప్ప ఆశయాలు కలిగిన పత్రిక. తెలుగులో అన్ని విషయాల్లో కూడా విరివిగా సాహిత్యం వృద్ధి చెందాలని ఆశించడంతోపాటు వివిధ శాస్త్రాలకు సంబంధించి పారిభాషిక పదాలను రూపొందించి ప్రచురించింది. సంఘ సంస్కరణ దృష్ట్యా తెలుగు నాట పునరుజ్జీవనోద్యమానికి ఈ పత్రిక నాంది పలికింది. సంఘంలో అవినీతిని గురించి కూడా రాసింది. సాహిత్య సేవ

---

15. *వీరేశలింగంగారి స్వీయచరిత్రము ప్రథమ భాగం ద్వి.ము. 4వ ప్రకరణం పు. 156*

కూడా చేసింది. 18వ శతాబ్దంలో వచ్చిన పత్రికలన్నిటిలోనూ పురుషార్థ ప్రదాయిని సమగ్ర పత్రికగా మార్గదర్శిగా పేరుపొందింది.

**f. వివేక వర్ధని**

తెలుగు జర్నలిజానికి పటిష్టమైన పునాదులు వేసిన కందుకూరి వీరేశలింగం గారు 1874 అక్టోబర్‌లో 'వివేక వర్ధని' ని ప్రారంభించారు. ఈ పత్రిక సంఘ సంస్కరణ ప్రచారానికి ఎంతగానో దోహదం చేసింది. తొలుత మాసపత్రికగా ప్రారంభమై తర్వాత 1876 జూలై నుంచి పక్షపత్రికగా మారి, 1885 నుంచి వారపత్రికగా 20 సంవత్సరాల పాటు సాంఘిక, మత, రాజకీయాది వివిధ రంగాల్లో విశేష సేవలందించి తెలుగు పత్రికల చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచింది. అవినీతికి పాల్పడే రాజకీయోద్యోగులకు, సంఘానికి అపకారం చేసే దుశ్శీలురకు ఈ పత్రిక సింహస్వప్నంగా ఉన్నది. సంఘ సంస్కరణోద్యమానికి ఊతం ఇవ్వడానికి వీరేశలింగంగారు మరిన్ని పత్రికలు నడిపినప్పటికీ 'వివేకవర్ధని'ని ఆయన వజ్రాయుధంలా ఉపయోగించుకున్నారు. ఇందులో ఇంగ్లీషు విభాగాన్ని కూడా నిర్వహించారు. 'వివేక వర్ధని' వార్తా రచనా విధానంలో కొత్త పుంతలు తొక్కింది.

**f. హాస్య సంజీవని**

ఈ పత్రికను వీరేశలింగంగారు 'వివేకవర్ధని' కి అనుబంధంగా నడిపారు. కొక్కొండ వెంకటరత్నముపంతులు గారి వాదాలను ఖండిస్తూ సంఘ సంస్కరణ వాదాన్ని కొనసాగించారు. ఇది తర్వాత వివేకవర్ధనిలో విలీనమైంది. దీని ముఖచిత్రం మీద విఘ్నేశ్వరుడు ఇరువైపులా గజసింహాలు, మూషిక మార్జాలాలు తనను సేవిస్తుండగా నిలబడి తాండవమాడుతున్నట్లు చిత్రించారు. గజసింహాలకు, మూషిక మార్జాలాలకు సహజాతంగా ఉండే వైరాన్ని ప్రతీకగా తీసుకున్నారు.

**g. సతీ హితబోధిని**

కందుకూరి వీరేశలింగంగారి సంపాదకత్వాన వెలువడిన మరో పత్రిక ఇది. 1883లో రాజమండ్రి నుంచి ప్రారంభమైంది. స్త్రీ జనాభ్యుదయాకాంక్షతో వెలువడ్డ మొదటి పత్రికగా దీనికి ప్రతీతి. సనాతన సంప్రదాయాలు ముసిరిన సమాజంలో

దిక్కుతోచక దీన స్థితిలో ఉన్న స్త్రీలకు తోడయి నిలిచింది ఈ పత్రిక. 'సత్యవతీ చరిత్రం' వంటి ఆదర్శ స్త్రీ జీవిత చరిత్రలు, నీతి కథలు, స్త్రీలకు ఉపయోగకారిగా ఉండే రచనలు ప్రచురించే వారు.

## h. సత్య సంవర్ధని

వీరేశలింగం గారు 1891 జూలైలో ప్రారంభించి రాజమండ్రి నుంచి వెలువరించిన 'సత్య సంవర్ధని'లో కొంత కొత్తదనం ఉట్టిపడేలా రచనలు ప్రచురించారు. ముఖ్యంగా కలిపురుష శనైశ్వర విలాసం, హిందూ మత సభ వంటి ప్రహసనాలు, విద్యాధికుల ధర్మాలు, విద్యాధురీణుల యర్థ కృత్యాలు వంటి ఉపన్యాసాలు, రాజారామమోహన్ రాయ్ జీవిత చరిత్ర వంటి రచనలు, సరస్వతీ నారద విలాపం వంటి వ్యంగ్య రచనలు 'సత్యసంవర్ధని'లో ప్రచురించారు. సంఘ సంస్కరణకు సాహిత్యాంశ జోడించి పత్రిక ద్వారా ప్రచారం చేసే పద్ధతిని ప్రశంసనీయంగా పాటించారు.

## i. తెలుగు జనానా

'తెలుగు జనానా' మాసపత్రిక (1893) కు మొదట మల్లాది వెంకటరత్నం, మధ్యలో ఏడాది రాయసం వెంకటశివుడు సంపాదకత్వం వహించారు. అనంతరం వీరేశలింగం గారు సంపాదకబాధ్యత స్వీకరించారు. స్త్రీల స్థితిగతులను వివరిస్తూ రచనలు ప్రచురించడంతో పాటు ప్రధానంగా స్త్రీ విద్య కోసం ఈ పత్రిక ఎంతగానో కృషి చేసింది. ఇందులో కూడా విదేశీ మహిళల జీవిత చరిత్రలను ప్రచురించి తెలుగు మహిళలకు స్ఫూర్తినిచ్చారు.

ఈ విధంగా సంఘ సంస్కరణ ప్రధానమైన పత్రికలు అనేకం వచ్చాయి. వాటిల్లో చెప్పుకోదగినవి దీనబంధు, నవజీవన్, హిందూజన సంస్కారిణి, సర్వోదయ, సుజనరంజని మొదలైన పత్రికలు. ఈ పత్రికల్లో సాంఘిక విషయాలు ఎక్కువగా వేస్తూనే సాహిత్యం, ఇతర అంశాలు కూడా ప్రచురించారు.

## ii. రాజకీయ పత్రికలు

రాజకీయాలు సంఘాన్ని అంటిపెట్టుకొని మనుగడ సాగిస్తూరావడం ఈనాటిది కాదు. సంఘాన్ని రాజకీయాలను విడదీయడం అసలు సాధ్యమయ్యే పనేకాదు.

భారతదేశానికి వర్తకం కోసం వచ్చిన కుంపిణీ వారు క్రమ క్రమంగా అధికారాన్ని చెలాయించడం ప్రారంభించింది మొదలు, దేశమంతా బ్రిటిషు వారి ప్రత్యక్ష పాలన కిందకు పోవడం, మహాసంగ్రామం, తదనంతరం స్వాతంత్ర్య సముపార్జన, ప్రజా ప్రభుత్వపాలన ఈ విధంగా రాజకీయ ప్రభావం లేని కాలం లేదు. అదే విధంగా పత్రికల్లో రాజకీయ స్పర్శ చోటు చేసుకుంది. ప్రజలకు ప్రభుత్వానికీ మధ్య రాజకీయాల ప్రభావం ఏ మేరకు ఉంటే పత్రికల్లో రాజకీయాలు ఆ స్థాయిలో ప్రతిబింబించాయి. పత్రికలకు సంబంధించినంతవరకు 19వ శతాబ్దం చివరి 15 ఏళ్లలో రాజకీయ పత్రికలు ప్రారంభమయ్యాయి. భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించిన సంవత్సరం 1885లో 'ఆంధ్రప్రకాశిక' తెలుగులో తొలి రాజకీయ పత్రిక ప్రారంభమైంది. శతాబ్దం చివరి వరకూ అంటే 15 ఏళ్ల కాలంలో కొద్ది సంఖ్యలోనే రాజకీయ పత్రికలు వచ్చినా అన్నీ ఒక లక్ష్యం కోసం కృషి చేశాయి. 20వ శతాబ్దం మాత్రం రాజకీయ పత్రికలదీ, రాజకీయాలదే. శతాబ్ది ఆరంభంలో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం, ఆ ఉద్యమ వాతావరణంలో 'కృష్ణాపత్రిక' అవతరణ, పాల్ ఆంధ్ర పర్యటన, బొంబాయిలో 'ఆంధ్రపత్రిక' అవతరణ ..... ఈ విధంగా రాజకీయ పత్రికల శతాబ్దం ముందుకు సాగింది.

### a. ఆంధ్రప్రకాశిక

తెలుగులో వెలువడిన తొలి రాజకీయ పత్రికగా 'ఆంధ్రప్రకాశిక' ఖ్యాతి దక్కించుకుంది. ఈ వారపత్రికను ఎ. సి. పార్థసారథినాయుడు మద్రాసు నుంచి నడిపారు. భారత జాతీయ కాంగ్రెస్ అవతరించిన సంవత్సరంలో అవతరించడం వల్ల కూడా ఈ పత్రిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. అంతే కాదు పార్థసారథినాయుడు ఈ పత్రికను 42 సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా నడిపి స్వాతంత్ర్య సముపార్జనకు కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమానికి ఎంతగానో ఊతమిచ్చారు. ఇందులో కాంగ్రెస్ సిద్ధాంతాలను బలపరచడం, బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను విమర్శించడం చెప్పుకోదగిన అంశాలు. పోలీసులు, ఇతర శాఖల్లోని అవినీతిని వెలుగులోకి తెచ్చేది. సైనికుల దౌర్జన్యాలను కూడా విమర్శించడానికి వెనుకంజ వెయ్యలేదు. రాజకీయ చైతన్యాన్ని వ్యాపింపజేసింది. దీని సంపాదకుడు పార్థసారథినాయుడు 1894లో మద్రాసులో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా పాల్గొన్న పాత్రికేయుడు. ఈ పత్రిక

తొలుత వారానికి రెండుసార్లు నడిచి, 1918 నుంచి కొంతకాలం దినపత్రికగా కూడా వెలువడింది.

## b. దేశాభిమాని

దేవగుప్తం శేషాచలపతిరావు బెజవాడ నుంచి ఈ రాజకీయ వారపత్రికను 'కృష్ణా వృత్తాంతిని', 'కృష్ణాన్యూస్' అనే పేర్లతో ప్రచురించి తర్వాత 'దేశాభిమాని'గా మార్చారు. కొంతకాలం తెలుగు, ఆంగ్ల భాషలో ప్రచురించారు. తర్వాత కాలంలో ఇది దినపత్రికగా మారింది. తెలుగులో తొలి దినపత్రికగా కూడా ఇది పేరు పొందింది. ఈ పత్రిక దాదాపు 30 సంవత్సరాల పాటు నడిచింది.

## c. దేశోపకారి

సత్తిరాజు సీతారామయ్య ఏలూరు నుంచి ఈ వారపత్రికను 1893లో నడిపారు. చిలుకూరి వీరభద్రరావు కొంతకాలం సంపాదకత్వం వహించారు. తెలుగు వారిలో వార్తా పత్రికా పఠనాభిలాషను పెంపొందించిన పత్రికగా దీన్ని చెప్పుకోవాలి. ఈ పత్రికను సీతారామయ్య పాఠకులకు చవకగా కూడా ఇచ్చారు. నిజానికి పత్రిక అమ్మకం వల్ల వచ్చే మొత్తంతో పత్రిక నడపడం కష్టమైన పని అయినప్పటికీ తెలుగు పత్రికా పాఠకులను పెంచే కృషిలో ఆయన ఈ త్యాగం చేశారు.

## d. శశిలేఖ

గట్టుపల్లి శేషాచార్యులు మద్రాసు నుంచి 1894లో వారపత్రికగా నడిపారు. శేషాచార్యుల వారితోపాటు నేలటూరు పార్థసారథి అయ్యంగారు కొంతకాలం దీనికి సంపాదకత్వం వహించారు. ఆ రోజుల్లో ఇంగ్లీషులో వెలువడే మద్రాసు స్టాండర్డ్ పత్రికకు తెలుగు కాపీగా [illegible] పేర్కొనేవారు. ఇందులో బోయరు యుద్ధ వార్తలు విపులంగా ప్రచురించేవారు [illegible] పత్రిక తరువాతి కాలంలో అంటే ఈ శతాబ్దం తొలి నాళ్లలో దినపత్రికగా మారింది.

## e. కృష్ణాపత్రిక

ఈ శతాబ్ది ప్రారంభంలో వెలువడి తెలుగునాట రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక విషయాలకు వెలుగు బావుటా పట్టిన పత్రిక కృష్ణాపత్రిక. ఈ శతాబ్ది పూర్వార్థంలో

వెలువడి ప్రజలను ఇంతస్థాయిలో ప్రభావితం చేసిన కొద్ది పత్రికల్లో 'కృష్ణాపత్రిక' అగ్రశ్రేణిలో నిలుస్తుంది. సంపాదకులు ముట్నూరి కృష్ణారావు గారి వల్ల కూడా ఈ పత్రిక బహుళ జనాదరణ పొందింది. పలువురు మేధావులు 1892 లో కృష్ణా జిల్లా సంఘాన్ని స్థాపించారు. ఆ సంఘం ఆధ్వర్యంలోనే 1902 ఫిబ్రవరి 1వ తేదీన కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు గార్ల సంయుక్త సంపాదకత్వంలో 'కృష్ణాపత్రిక' ప్రారంభమైంది. మొదట్లో 'కృష్ణాపత్రిక' పక్షపత్రికగా మద్రాసులోముద్రణ పొంది బందరు నుంచి వెలువడేది. 1907వ సంవత్సరంలో ముట్నూరి కృష్ణారావు గారు సంపాదకులయ్యారు. చిల్లరిగె సేతుమాధవరావు, శ్రీనివాసరావు సోదరుల వద్ద 5వేల రూపాయలకు ప్రెస్సు కొన్నారు. 'కృష్ణాపత్రిక' తొలి సంచికలోనే పత్రిక పరిపాలనలో లోపాలను గురించి తెలియజేస్తూ, వాటికి పరిష్కారమార్గాలు, సంఘ సంస్కరణ విషయాలు రసవాద, ప్రకృతిశాస్త్ర, వ్యవసాయ విశేషాలు, చేతి వృత్తులను గురించి రాస్తామని పేర్కొన్నది. స్వలాభం కోరక దేశాభివృద్ధికై అభిమాన బుద్ధితో పూనుకున్నామని తెలియజేస్తూ పాఠకుల ఆదరణ కోరారు.

1908లో కృష్ణారావు 'తెల్లవారిని తుపాకితో కాల్చుట' అనే శీర్షిక కింద ఒక వ్యాసం కృష్ణాపత్రికలో ప్రచురించారు. ఫలితంగా బ్రిటిషు ప్రభుత్వం పత్రికపై అణచివేత చర్యలు చేపట్టింది. దాంతో ముట్నూరివారు కొంతకాలం పత్రికకు దూరంగా ఉండవలసి వచ్చింది. 1911లో తిరిగి పత్రిక సంపాదకులుగా చేరినప్పటి నుండి 1945లో తాను మరణించేవరకూ కృష్ణారావే సంపాదకులుగా ఉన్నారు.

1930 శాసనోల్లంఘన కాలంలో ప్రెస్సుకు ధరావతు కట్టలేదు. కృష్ణారావే అందుకు నిరాకరించారు. ఆ కారణంగా ప్రభుత్వ ఆగ్రహానికి గురై పత్రిక ఆరు నెలల పాటు మూతపడవలసి వచ్చింది. కృష్ణారావును నెల్లూరు జైలులో నిర్బంధించారు.

బెంగాల్ విభజనతో చెలరేగిన ఉద్యమ జ్వాలలు ఆంధ్రదేశాన్ని తాకాయి. ఆ సమయాన 'కృష్ణాపత్రిక' అతివాద ధోరణితో ప్రజల ఆగ్రహాగ్నిని ప్రతిబింబించింది. 'కృష్ణాపత్రిక'లో ముట్నూరి వారి సంపాదకీయాలకు ఆనాడు తెలుగు నాట విశేషమైన ఆదరణ లభించింది. గ్రామాల్లో సైతం రచ్చబండలపై పత్రిక సంపాదకీయాలను అనుదినం చదివేవారు. వినేవారు, ఉత్తేజం పొందేవారు.

### f. ఆంధ్రపత్రిక

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు 1908 సెప్టెంబర్ 9న బొంబాయిలో 'ఆంధ్రపత్రిక'ను వారపత్రికగా ప్రారంభించారు. పంతులు గారు 'అమృతాంజన్'లో లభించే లాభాన్నంతటినీ 'ఆంధ్రపత్రిక' కోసం ఖర్చు పెట్టారు. ఆంధ్రజాతిలో స్వాతంత్ర్య దీప్తిని, రాజకీయ చైతన్యాన్ని నలుదెసలకు విస్తరింపజేశారు. దూరదేశంలో ఉన్నప్పుడు కూడా 'ఆంధ్రపత్రిక' జాతీయ పత్రికగా వెలువడింది. భారతదేశంలోని ఇతర ప్రాంతాల విషయాలతోపాటు విశాల ప్రపంచంలోని విశేషాలను కూడా ప్రచురించేవారు. సాంఘిక, ఆర్థిక, మత, రాజకీయ, సంగీత, సాహిత్యాది అనేక విషయాలతో పత్రిక విలసిల్లేది.

'ఆంధ్రపత్రిక' ఆనాడు మితవాద ధోరణినే అనుసరించింది. 1910 నుంచి ఉగాది సంచికల ప్రచురణ ప్రారంభించి అనేక దశాబ్దాల కాలం నిర్విరామంగా కొనసాగించారు. 1914 ఏప్రిల్ 1వ తేదీన 'ఆంధ్రపత్రిక' మద్రాసుకు మారి వారపత్రికతో పాటుగా దినపత్రికగా కూడా వెలువడడం ప్రారంభించింది. తెలుగులో దేశాభిమాని, శశిలేఖ, గౌతమి లాంటి కొన్ని దినపత్రికలు ప్రారంభమైన కొద్ది కాలానికే మూతబడ్డాయి. 'ఆంధ్రపత్రిక' ప్రారంభం ఆ లోటు తీర్చింది.

మహత్తరమైన లక్ష్యాలతో 'ఆంధ్రపత్రిక' ఒక మహాస్రవంతిలా సాగింది. పత్రిక ఎన్నో అవరోధాల నెదుర్కొంది. ప్రపంచ యుద్ధకాలంలో కాగితం ధర పెరుగుదల ఇతర ఇబ్బందుల వల్ల ఎన్నో పత్రికలు మాడి మసైపోయినా, స్వాతంత్ర్య సమరంలో బ్రిటిషువారి కోపాగ్నికి మరెన్నో పత్రికలు సమిధలై నశించిపోయినా 'ఆంధ్రపత్రిక' అమరజీవిగా బతికింది. స్వాతంత్ర్య ఉద్యమానికి, ఆంధ్రోద్యమానికి, ఆంధ్ర భాషా సాహిత్యాల అభ్యుదయానికి అపూర్వ కృషి జరిపి ుది

### g. కాంగ్రెస్

1921 మే నెలలో రాజమండ్రిలోని ఆంధ్ర యువజన స్వరాజ్య సభవారు ఈ పత్రికను ప్రారంభించి ఆరుమాసాలపాటు సైక్లోస్టయిల్ పత్రికగా నడిపారు. తర్వాత ముద్రిత పత్రికగా మారింది. 1925 ఆగస్టు నుంచి సీతానగరం గౌతమి సత్యాగ్రహాశ్రమం నుంచి వెలువడింది. 1929లో ఈ పత్రికలో రామచంద్రుని వెంకటప్పయ్య రాసిన

'చిచ్చుల పిడుగు' అనే వ్యాసం పెద్ద సంచలనం కలిగించింది. పత్రికా నిర్వాహకుడు అన్నపూర్ణయ్యను అరెస్టు చేశారు. ఆ వ్యాసరచయిత పేరు చెప్పమని అప్పటి సంపాదకుడు క్రొవ్విడి లింగరాజును ఎంత వత్తిడి చేసినా లొంగలేదు. తర్వాత లింగరాజుకు కూడా ప్రభుత్వ వ్యతిరేక రచనలు ప్రచురించారని రెండున్నర సంవత్సరాల కఠిన జైలు శిక్ష విధించారు. ఈ విధంగా మద్దూరి అన్నపూర్ణయ్య 18 మాసాలు శిక్షననుభవించారు. ద్రోణంరాజు బుచ్చికామేశ్వరరావు వ్రాసిన 'భారత స్వాతంత్ర్య వ్యాసాలు' పేర ప్రచురించినందుకు అప్పటి సంపాదకుడు కాంద్రేగుల రామచంద్రరావు గారికి 15 మాసాల శిక్ష విధించారు. ఉప్పు సత్యాగ్రహకాలంలో ధరావత్తు కట్టడానికి నిరాకరించడంతో రెండుసంవత్సరాల శిక్షపడింది. భగత్‌సింగ్ ఉరికంబమెక్కినప్పుడు లింగరాజు 'వీరబలి' అన్న సంపాదకీయం రాసినందుకు ఆయనకు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష పడింది. 1932లో డిక్లరేషన్ లేకుండా పత్రిక నడిచింది. పత్రికకు ఆశ్రయం కల్పించిన సీతానగర సత్యాగ్రహాశ్రమం ప్రభుత్వాధీనం కావడంతో పత్రిక ఆగిపోవలసి వచ్చింది.[16] ఈ పత్రిక జీవితకాలంలో ఒక సంపాదకుడు జైలుకు వెళితే మరొకరు సంపాదకులవుతుంటే అన్నట్లుగా సాగింది. తెలుగులో వెలువడిన రాజకీయ పత్రికల్లో 'కాంగ్రెస్' పత్రికకు ఉన్న ప్రాముఖ్యం చెప్పుకోదగింది.

## h. నీలగిరి - తెనుగు పత్రిక

షబ్నవీసు వెంకటరామనరసింహారావు నల్లగొండ నుంచి 1922 ఆగస్టు 24న 'నీలగిరి' వారపత్రికను ప్రారంభించారు. ఆ తర్వాత 4 రోజులకే వరంగల్లు జిల్లా ఇనుగుర్తి నుంచి డాక్టర్ ఒద్దిరాజు సీతారామచంద్రరావు, ఒద్దిరాజు రాఘవరంగారావు సోదరులు 'తెనుగు పత్రిక' అనే మరో వార పత్రికను వెలువరించారు. తెలంగాణాలో తెలుగు ముద్రణ, తెలుగు పత్రికలు, ఆఖరికి తెలుగు మాధ్యమంగా విద్యావకాశాలు కూడా కరవైన రోజుల్లో అనేక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతూ కూడా ఈ రెండు పత్రికలూ నడిచాయి. హైదరాబాదుకు రెండు ప్రాంతాలూ దూరంగా ఉండడం వల్ల ఉన్న ఇబ్బందుల దృష్ట్యా అటు షబ్నవీసు వారు తమ 'నీలగిరి పత్రిక' ముద్రణకు, ఇటు

---

*16. తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం - లక్ష్మణరెడ్డి. పు. 364*

ఒద్దిరాజు సోదరులు తమ 'తెనుగు పత్రిక' ముద్రణకు స్వంతంగా చిన్నపాటి ప్రెస్సులు నెలకొల్పుకున్నారు. ఐదేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలు ఆంధ్రోద్యమానికి ఎంతో ఊతమిచ్చాయి. తెలంగాణాలోని మారుమూల ప్రాంతాల్లో సైతం తెలుగు పాఠకులను తయారు చేశాయి. ఈ యజ్ఞం కోసం పత్రికా నిర్వాహకులు స్వయంగా పత్రికలను గ్రామ గ్రామానికీ చేర్చేందుకు శ్రద్ధ వహించారు. నేరుగా బ్రిటిషు పాలన కింద ఉన్న ఇతర ఆంధ్ర ప్రాంతాల్లోని రాజకీయ చైతన్యాన్ని 'తెనుగు పత్రిక', 'నీలగిరి' తమ ప్రాంతాల పాఠకుల్లో కలిగించేందుకు కృషి చేశాయి. ఆ విధంగా తెలంగాణాలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఆ రెండు పత్రికలు మంచి బలాన్ని చేకూర్చాయి. 'గోలకొండ పత్రిక' అవతరణ తర్వాత అంతరించాయి.

### i. మాతృసేవ

ఈ పత్రికను కేతు వెంకటరెడ్డి, సంకటి కొండారెడ్డి ప్రభృతుల సహకారంతో 1922లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు తాడిపత్రి నుంచి నడిపారు. రాయలసీమ ప్రాంతంలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో 'మాతృసేవ' చేసిన కృషి ఎన్నదగినది. స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలను ఈ పత్రికలో ప్రచురంగా వేసేవారు. జాతీయోద్యమ విషయాలకు తోడు పత్రికలో రాయలసీమ ప్రాంత సమస్యలను కూడా ప్రచురించేవారు. రాయలసీమ క్షామ నివారణ కార్యక్రమాలకు ప్రాధాన్యత నిచ్చేవారు.

### j. జమీన్ రైతు

నెల్లూరు జిల్లా జమీన్‌దారీ రైతు సంఘం పక్షాన 1930 మార్చిలో 'జమీందారు రైతు పత్రిక'గా ప్రారంభమైన ఈ పత్రిక 1934 సెప్టెంబర్‌లో 'జమీన్ రైతు'గా మారింది. పత్రిక ఈనాటికీ వెలువడుతున్నది. ఒక ప్రాంతీయ పత్రిక ఇన్ని దశాబ్దాలుగా విజయవంతంగా నడవడం ఒక చరిత్రగా చెప్పుకోవాలి. పత్రిక వ్యవస్థాపించడమే కాక పత్రికా ప్రపంచంలో ఈ పత్రికకు ప్రతిష్టనార్జించి పెట్టిన ఘనత నెల్లూరు వెంకటరామానాయుడుకు దక్కుతుంది. నాయుడు గారు జమీందారీ రైతుల ఉద్యమాన్ని చేపట్టి దాన్ని జాతీయోద్యమంలో విలీనం చేసి జమీందారీలు రద్దయ్యే వరకు పోరాడారు.

వెంకటగిరి జమీందారుల దోపిడీకి వ్యతిరేకంగా జమీన్ రైతులను సమీకరించడం కోసం ప్రారంభమైనా ఈ పత్రిక గ్రామీణులు, కర్షక, శ్రామిక వర్గాల కోసం పోరాటం సల్పింది. జమీన్ రైతు సమస్యలు తొలిగిపోయిన తర్వాత ఇది 'జమీన్ రైతు' పత్రికగా రూపొందింది. నెల్లూరు జిల్లాకు పరిమితంగా నడుస్తోంది. తెలుగులో ప్రాంతీయ వారపత్రికగా 'జమీన్ రైతు' కు సాటిరాగల పత్రికలు అరుదు.

## k. గోలకొండ పత్రిక

తెలంగాణా ప్రాంతంలో సుప్రసిద్ధ వైతాళికుడైన సురవరం ప్రతాపరెడ్డి గారు 1926 మే 10వ తేదీన అర్ధ వారపత్రికగా 'గోలకొండ పత్రిక' ను ప్రారంభించారు. తెలుగు వాతావరణం బొత్తిగా కానరాని చోట, తెలుగు పత్రికా సుగంధమే తెలియని చోట నిజాం రాష్ట్రానికి కేంద్రమైన హైదరాబాద్ నుంచి ఈ పత్రిక ప్రారంభమై అనంతర తెలంగాణా జాతకాన్నే మార్చింది. అప్పటి పోలీస్ కమీషనర్ రాజబహద్దుర్ వెంకట రామారెడ్డి గారి సహాయంతో పత్రికను ప్రారంభించేందుకు ప్రతాపరెడ్డి గారు బ్రిటిష్ రెసిడెన్సీ నుంచి అనుమతి కోరారు. లభించలేదు. వెంకటరామారెడ్డి గారు విచారించగా రెసిడెంట్ కార్యదర్శి "Oh! that editor is a khaddar man, a political one, who comes from Guntur, a hot bed of Non co-operation" అని చెప్పాడట. గూఢచారశాఖవారు రెడ్డిగారిపై రెసిడెంట్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారన్నమాట. ఎలాగయితేనేం రాజబహద్దూర్ గారు పత్రికకు అనుమతి ఇప్పించారు. ట్రూప్ బజారులో ఒక చిన్న పెంకుటింట్లో పత్రిక ప్రారంభమైంది. ఆ చిన్న ఇంట్లో ఒక పక్క ప్రెస్సు, మరో గది ప్రతాపరెడ్డి గారికి, పుస్తకాల బీరువాలు. మొదట సంపాదకుడు, ముద్రాపకుడు,మేనేజర్, ఉపసంపాదకుడు, కంపోజిటరు, ప్రూఫు రీడరు, చప్రాసీ అన్నీ సురవరం ప్రతాపరెడ్డిగారే. చాలా కష్టాలతో కొంతకాలం జరిగాక కొంతమంది సహాయకులను ఆయన నియమించుకున్నారు. ఒకసారి ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి విమర్శిస్తూ 'పిరికిపందలు' అని నిందించారు. ప్రభుత్వ అనువాదకులు దాన్ని 'పిరికిపందులు' అని అనువదించారు. దాంతో నైజాం ప్రభుత్వాధికారులు మండిపడ్డారు. తరచూ తీవ్ర బెదిరింపులు వచ్చేవి. ఇబ్బందులతో ఎంతో కాలం నడపలేని పరిస్థితిలో 'గోలకొండ పత్రిక'కు ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు సహకారం

లభించింది. సంక్లిష్టమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక ప్రతిబంధకాలను అధిగమిస్తూ 'గోలకొండ పత్రిక' నిలదొక్కుకుని తెలంగాణాలో ఆంధ్రాభ్యుదయానికి అనితర సాధ్యమైన కృషి అందించింది. 1947 నుంచి కొంతకాలం ఇది దినపత్రికగా కూడా వెలువడింది.

## I. నవశక్తి

1937 డిసెంబర్ 15వ తేదీన రాజమండ్రి నుంచి ఈ రాజకీయ వారపత్రిక వెలువడింది. కాంగ్రెస్ పత్రిక సంపాదకునిగా పనిచేసిన మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకునిగా డిక్లరేషన్ తీసుకున్న ఈ పత్రిక కాంగ్రెస్‌లోని వామపక్షాల వారికి, సోషలిస్టులకు, కమ్యూనిస్టులకు వాణిగా నిలిచి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది. కొంతకాలం రాజమండ్రి నుంచి వెలువడి తర్వాత బెజవాడకు మారింది. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారదేశానికి చెందిన ద్రవ్యాన్ని, ప్రజలను బ్రిటిష్‌వారు యుద్ధంలో తమ ప్రయోజనాలకు వినియోగించుకోవడాన్ని 'నవశక్తి', తదితర వామపక్ష పత్రికలు విమర్శించాయి. ఆ విధంగా 'నవశక్తి' బ్రిటిష్ వ్యతిరేక వైఖరినవలంబించినందుకు ప్రభుత్వం దాన్ని నిషేధించవచ్చునని భావించి పత్రికను నిర్వాహకులు మూసివేశారు. ఇది పేరుకు కాంగ్రెస్ సోషలిస్ట్ పత్రికైనా కమ్యూనిస్టు పత్రికగానే చెప్పుకోవాలి. 'నవశక్తి' లోని విదేశ వార్తలు, వ్యాసాలను ఆనాటి దినపత్రికలు పునర్ముద్రించుకొనేవి. ప్రజలకు జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల అవగాహనను కలిగించడంతోపాటు తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకొనే దృష్టి ప్రజల్లో పెంపొందించేవిధంగా ఉండేది. సాంఘిక, సాహిత్య రంగాల్లో 'నవశక్తి' నూతన విప్లవ భావాలను వ్యాప్తి చేసింది.

తెలుగులో ఇంకా రాజకీయ పత్రికలు అనేకం వచ్చాయి. విబుధరంజని, ఆంధ్రకేసరి, వందేమాతరం, భారతమాత, స్వరాజ్య, దేశమాత, ఆంధ్రచంద్రిక, నెల్లూరు పత్రిక, గాంధీ, గ్రామపాలన, పినాకినీ పత్రిక, మాతృసేవ, స్వతంత్ర, ఆంధ్రవాణి, ఎలక్షన్ క్రానికల్, గుంటూరు పత్రిక, పల్లెటూరు, వేగుచుక్క, స్వతంత్ర, స్వరాజ్యపత్రిక, సింహపురి, ఆంధ్రవాణి, జ్యోతి, సత్యాగ్రహి, ఆంధ్రకేసరి, కార్మిక పత్రిక, ప్రజ, విజయవాడ, స్వశక్తి, సాధన, ఆంధ్ర రాష్ట్రము, గాంధీగీత, చిత్తరంజన్, ఇంద్రావతి,

ఐరావతి, కళింగ, ప్రజాశక్తి, యుగంధర, రంగూన్ ఆంధ్రపత్రిక, స్వధర్మ, హిందూ ముస్లిం పత్రిక, ఆంధ్రమాత, తుంగభద్రా ప్రాజెక్టు, స్వతంత్ర, పశ్చిమాంధ్ర, సత్యసాధని, కేసరి, వార్తావళి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రరైతు, కాగడా, కేసరి, దీపిక, దేశాభిమాని, ప్రకాశ్, ప్రజాపత్రిక, ప్రజాబంధు, ప్రజామిత్ర, ప్రజావాణి, ప్రజాసేవ, ప్రభాత్, భాగ్యనగర్, యుగవాణి, రంధ్రాన్వేషి, రాయలసీమ, వాహిని, విజయవాణి, వెన్నెల, సుబోధిని మొదలైన వారపత్రికలు, హిందూబాంధవి, లోకబంధు, నవయుగ, దర్బారు, ఆంధ్రదేశోపకారి, ఆంధ్రజనని, ఆంధ్రరంజని, కొరడా, నవయుగ, పదుగురిబంటు, కల్యాణి, జయభారతీ, జయభేరి, టాంటాం, తెలుగు జర్నల్, తెలుగు తల్లి, ప్రభ, రేనాడు వంటి పక్షపత్రికలు. బారతమాత, ప్రజాబంధు, లోకమాన్య, ఆంధ్రకేసరి, అంతర్జాతీయ వార్తలు, ఆంధ్రవాణి, కాంతి, గాంధి, చిత్రాంగి, ఢంకా, దక్కన్ కేసరి, మాతృవాణి, మాణిక్యప్రభ, సుదర్శనం, సుధ, సూర్యప్రభ, సేవ, స్వతంత్ర రైతు వంటి మాసపత్రికలను చెప్పుకోవచ్చు. ఇక్కడే ఒక విషయం. రాజకీయ పత్రికలుగా పేర్కొన్న పత్రికల్లో ఇతర అంశాలతో పాటు రాజకీయాలకు ప్రాధాన్యం కల్పించారనేది స్పష్టంగా గమనించాలి. అదే విధంగా పైన పేర్కొన్న పత్రికల అనంతరం లెక్కకు మించిన పత్రికలు వెలువడడంతోపాటు ఒక యిజానికి కట్టుబడకుండా అన్నివర్గాల పాఠకులను దృష్టిలో ఉంచుకొని సమగ్ర దృక్పథంతో వెలువడుతున్నాయి. ముఖ్యంగా స్వాతంత్ర్యానంతర తెలుగు పత్రికలన్నీ రాజకీయాలు, సాహిత్యం, అభివృద్ధి వార్తలు, సభలు, శాసనసభ, పార్లమెంటు సమావేశాలు, ప్రజా సమస్యలు ఈ విధంగా అన్ని అంశాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నాయి. కాబట్టి అటు తర్వాత పత్రికలను కేవలం రాజకీయ పత్రికలనిగాని, సాంఘిక పత్రికలని గాని విభజించడం సాధ్యం కాదు.

### iii. సాహిత్య పత్రికలు

తెలుగులో పత్రికలు సాంఘిక పునరుజ్జీవనానికి ఎంతగా దోహదం చేశాయో సాహిత్య సేవకు కూడా ఆ స్థాయిలో కృషి జరిపాయి. సాహిత్య పత్రికల చరిత్ర కూడా తొలినాటి పత్రికల ఆవిర్భావ పంక్తిలోనే ప్రారంభమైంది. సాహిత్య విషయాలు ప్రధానంగా ప్రచురించిన తొలిపత్రిక 'సుజనరంజని' (1864 - 67) తెలుగునాట రాజకీయ,

సాంఘిక పత్రికల విస్తృతి కన్నా మునుపటిది. సాంఘికంగా అనేక దురాచారాలు, రాజకీయంగా పరపాలన వల్ల అసంతృప్తి ఉన్నప్పటికీ సాహిత్య వారసత్వం ముందు అవి తక్కువే. తెలుగులో కావ్య యుగం, ప్రబంధయుగం అప్పటికే చెప్పుకోదగిన సాహిత్యాన్ని అందించింది. అవసరమైనదల్లా ఆ సాహిత్యాన్ని తాళపత్రాల నుంచి కాగితం మీదకు ఎక్కించి జనబాహుళ్యానికి అందించడమే. ఈ విషయంలో సి. పి. బ్రౌన్ మొదలైన పాశ్చాత్యులే దేశీయ పండితులకు అలవిగానంత కృషి జరిపి ప్రాచీన సాహిత్య పునరుద్ధరణ యజ్ఞం చేపట్టారు. ఆ యజ్ఞం కొనసాగిస్తూ సాహిత్య పత్రికలు ఆవిర్భవించాయి. అవి మరికొంత ముందుకు సాగగానే సంఘ సంస్కరణ యుగం కలిసింది. పాశ్చాత్య భావ ప్రభావంతో తెలుగులోకి అనేక ప్రక్రియలు వచ్చాయి. కందుకూరి వీరేశలింగం ఆధునిక తెలుగు సాహిత్యంలోకి ఆ నూతన ప్రక్రియలను ప్రవేశ పెట్టిన అపర భగీరథుడయ్యాడు. నవ్య భావచైతన్యం నలుదెసలకు విస్తరించింది. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు కథ, నవల, నాటకం, విమర్శ, వ్యాసం వంటి అనేక ప్రక్రియల్లో రచనలు చేసేవారు అధికమయ్యారు. వాటిని ప్రచురించి వెలుగులోకి తేవడానికి పత్రికల అవసరం ఏర్పడింది. ఆ పనిని సాహిత్య పత్రికలు ఏ మాత్రం ఆలశ్యం చెయ్యకుండా అందుకున్నాయి. ప్రాచీన కావ్యాలను, ప్రబంధాలను ప్రచురిస్తూనే నూతన ప్రక్రియల్లో రూపుకడుతున్న సాహిత్యాన్ని పత్రికలు ప్రచురిస్తూ వచ్చాయి. తెలుగులో వచ్చిన సాహిత్య పత్రికలను పరిశీలిద్దాం.

### a. అముద్రిత గ్రంథ చింతామణి

1885లో వెలువడిన సాహిత్య మాసపత్రిక 'అముద్రిత గ్రంథ చింతామణి'. దీన్ని పూండ్ల రామకృష్ణయ్య నెల్లూరు నుంచి వెలువరించారు. కేవలం సాహిత్యానికే అంకితమైన తొలి పత్రిక ఇది. అప్పటి వరకు అంటే 1835 నుంచి 1885 వరకూ అర్ధ శతాబ్దకాలం వరకూ వెలువడిన పత్రికలలో ఇతర విషయాలతోపాటు సాహిత్యానికి పాక్షికంగా మాత్రమే చోటుదొరికేది. ఈ పత్రిక నుంచే సాహిత్య పత్రికలు ప్రారంభమయ్యాయి. పేరును బట్టే అముద్రిత గ్రంథాలను సేకరించి, పరిష్కరించి ప్రచురించడమనే లక్ష్యాన్ని కలిగి వున్న పత్రికగా దీన్ని అర్థం చేసుకోవచ్చు. అప్పటి వరకూ లేని విధంగా పాశ్చాత్య సాహిత్య విమర్శ రీతుల్ని మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టి విమర్శను

కొత్తపుంతలు తొక్కించింది. మొదటి నాలుగు పుటల్లో ఛందోవ్యాకరణాది శాస్త్ర విచార విషయాలు, గ్రంథ విమర్శ, సమస్యాపూరణం, ప్రాచీన ప్రబంధాల్లోని కఠిన పద్యాలకు అర్థ నిరూపణం, ఒకే గ్రంథానికి గల వేరు వేరు ప్రతులను సేకరించి పాఠాంతరాలను నిర్ధారించడం, విద్యా విషయక లేఖలు ప్రచురించేవారు. మండపాక పార్వతీశ్వర శాస్త్రి, వేదంవెంకటరాయశాస్త్రి, నడకుదుటి వీరరాజుపంతులు మొదలైన పండితులు చర్చలు జరిపేవారు. ఈ పత్రిక రెండు దశాబ్దాల పాటు సాహిత్య రంగాన్ని ఏకచ్ఛత్రంగా ఏలిందని చెప్పవచ్చు.

**b. చింతామణి**

సాహిత్య మాసపత్రికల్లో 'అముద్రిత గ్రంథ చింతామణి' స్ఫూర్తితో 1890 అక్టోబర్‌లో రాజమండ్రి నుంచి ప్రారంభమైన 'చింతామణి'ని పేర్కొనవలసి ఉంటుంది. సంపాదకులు న్యాపతి సుబ్బారావు గారు. దీని ప్రచురణ ప్రారంభ కాలాన్ని డా. వి. లక్ష్మణరెడ్డి 1891గా పేర్కొంటున్నారు. తిరుమల రామచంద్ర, డా. ఎస్. హెచ్. సౌభాగ్యమ్మ 1890 గా తెలియజేశారు. నవలల (వచన ప్రబంధములని అప్పటి పేరు) పోటీలను తొలిసారిగా ప్రారంభించిన పత్రిక 'చింతామణి'. ఈ పోటీలందించిన ప్రోత్సాహం వల్ల 19వ శతాబ్దం నవలా రచనకు నాంది అయ్యింది. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు వంటి ప్రముఖ నవలా రచయితలకు 'చింతామణి' ప్రేరణ కలిగించింది. విజ్ఞానేశ్వరీయం, భోజరాజీయం, వరాహ పురాణం, మొల్ల రామాయణం, ప్రభావతీ ప్రద్యుమ్నం మొదలైన ప్రసిద్ధ కావ్యాలను 'చింతామణి' ప్రచురించింది. నాలుగేళ్ల కాలన్నే పత్రిక మనుగడ సాగించింది. నవలా ప్రక్రియ వికాసానికి ఆనాడే ఈ పత్రిక బాటవేసింది. గురజాడ అప్పారావు గారి 'కన్యాశుల్కం' నాటకానికీ పత్రిక సమీక్ష రాసింది. 1897లో మద్రాసుకు మారింది. తర్వాత ఒక ఏడాది నడిచి ఆగిపోయింది.

**c. ఆంధ్ర భారతి**

అయ్యంకి వెంకటరమణయ్య సంపాదకత్వంలో 1910లో మచిలీపట్నం నుంచి ప్రారంభమైన ఈ సాహిత్య మాసపత్రికను కృష్ణాపత్రిక ప్రెస్సులో ముద్రించేవారు. దీని ప్రారంభ సంచికలో గురజాడ అప్పారావు గారి తొలికథ 'దిద్దుబాటు' ప్రచురణ

పొందింది. రాయప్రోలు సుబ్బారావు వంటి ప్రముఖ కవుల కవితలు కూడా ఇందులో ప్రచురించేవారు. ఇందులో ముఖ్యంగా కథలు, కథానికలు, పద్యాలు, వ్యాసాలు, విమర్శలు వంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నీ ప్రచురించేవారు. ఇది సాహిత్యానికి ముఖ్యంగా ఆధునిక సాహిత్యానికి చేసిన సేవ ప్రత్యేకంగా పేర్కొనదగింది. ఆధునిక ప్రక్రియలను విస్తృతంగా ప్రచురించిన తొలిపత్రికగా కూడా దీన్ని చెప్పుకోవలసి ఉంటుంది. 'ఆంధ్రభారతి'లో గురజాడ వారి 'నీలగిరి పాటలు' లోని 'వూటి చోద్యమేమి చెపుదు', 'తోక చుక్క', 'కాసులు', 'డామన్ పితియస్', 'లవణ రాజుకల', 'కన్యక', 'లంగరెత్తుము', వంటి ప్రసిద్ధమైన రచనలు ప్రచురించారు.

నూతన రచయితలకు ఇందువల్ల ఎంతో ఉత్సాహం, ప్రోత్సాహం లభించాయి. తేనీరు, హృదయ పరీక్ష, అక్షరాభ్యాసము, యెక్కడా లంగరందలేదు, అంబపూజ వంటి కథానికలు, 'కొంచెము మన భాష సంగతి' వంటి వ్యాసాలు, వేడుకోలు, పిదప, గిరికుమారుని ప్రేమ గీతాలు వంటి పద్య కవితలు, నూర్జహాన్ వంటి నాటికలు, కోయిలపాట, అనుతాపము, వలపంత వేడుకొందు వంటి గేయ కవితలు ఈ పత్రికలో వచ్చాయి. దువ్వూరి రామిరెడ్డి ప్రభృతుల రచనలు సైతం వేశారు.

## d. శారద

1923 మార్చి నెలలో ప్రారంభమై మచిలీపట్నం నుంచి వెలువడిన ఈ మాసపత్రికకు కౌతాశ్రీరామశాస్త్రి సంపాదకుడు. బెంగాలీలోని మోడర్న్ రివ్యూవల్ వలె మొట్టమొదటి సారిగా వర్ణ చిత్రాలతోనూ, ఉన్నత ప్రమాణాలలోనూ 160 పుటల్లో వెలువడిన తెలుగు సాహిత్య పత్రిక ఇది. 1922 సెప్టెంబర్ నుంచి రెండున్నర సంవత్సరాల పాటు ఈ పత్రిక వెలువడిందని తిరుమల రామచంద్ర పేర్కొంటుండగా శ్రీమతి ఎస్. హెచ్. సౌభాగ్యమ్మ 1923 మార్చిలో ప్రారంభమైందని అంటున్నారు. ఈ పత్రికలో చోటు చేసుకున్న అంశాల విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలు లేవు. ఈ పత్రిక తెలుగు సాహిత్య లోకంలో సంచలనాన్ని తెచ్చి పెట్టింది. ఇందులో పొందుపరచే అంశాలు నెల తిరిగి మరో సంచిక వచ్చేవరకు పాఠకులకు కాలక్షేపమయ్యేలా వుండేవి. అంతేకాదు ఏ సంచిక కాసంచిక విజ్ఞాన సర్వస్వంలా రూపొంది వచ్చేది. అడివి బాపిరాజు 'హిమబిందు' నవల ఇందులోనే తొలుత సీరియల్‌గా వచ్చింది. సాహిత్యంతోపాటు చరిత్ర, పరిశోధన,

విమర్శ తదితర ప్రక్రియలు; ప్రజోపయోగకరాలైన ఇతర ప్రాపంచిక విషయాలు కూడా ప్రచురించేవారు. ఆయా ప్రక్రియల్లో నిష్ణాతులైన ప్రముఖుల రచనలు పాఠకులు నిరీక్షించేలా ముస్తాబై వచ్చేవి.

## e. సారస్వత సర్వస్వము

ఏలూరుపాటి రామభద్ర చయనుల సంపాదకత్వాన తణుకు నుంచి వెలువడిన ఈ 'సారస్వత సర్వస్వము' **(1923)** మాసపత్రిక పాఠకుల నాడిని బట్టి రూపొందేది. ఈ పత్రికలో అముద్రిత గ్రంథాలు, అనువాదాలు, వ్యాసాలు, గ్రంథ విమర్శలు, ఖండ కావ్యాలు, నాటకాలు, నవలలు, ప్రహసనాలు, కథలు, పద్యాలు, ప్రశ్నలు, వ్యాఖ్యలు, కవి పండితుల జీవిత చరిత్రలు మొదలైనవి పాఠకుల అభిరుచికి తగ్గవి వేసేవారు.

ఆనాడు తమకు అందే ఇతర పత్రికలను కూడా ఒక శీర్షిక పెట్టి పరిచయం చేసే సంప్రదాయం ఉండేది. ఈ పత్రిక కూడా ఆ సంప్రదాయాన్ని పాటించింది. ఆ రకంగా సరస్వతి, సాహితి, మీమాంస, రెడ్డిరాణి, నీలగిరి, ఆంధ్రాభ్యుదయము వంటి పత్రికలను 'పత్రికా స్వీకారం' శీర్షికలో పరిచయం చేసింది. చిలుకూరి నారాయణరావు, జనమంచి శేషాద్రిశర్మ, మరింగంటి సింగరాచార్య, గిడుగు రామమూర్తి, వజ్ఝల చిన సీతారామ స్వామి శాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, మామిడి పూడి వెంకటరంగయ్య, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ప్రభృతుల రచనలు ప్రచురించేవారు. మొదట్లో ప్రబంధాలను కూడా ముద్రించడానికి పూనుకున్నట్లు పత్రిక ప్రకటించింది. తర్వాత పాఠకులు ఇష్టపడని కారణం వల్ల మానుకుంది.

## f. భారతి

**1924** జనవరిలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ప్రారంభించిన 'భారతి' సాహిత్య మాసపత్రిక తెలుగు సాహిత్య పత్రికల్లోకి మకుటాయమానమైంది. బసవరాజు అప్పారావు సహాయ సంపాదకత్వాన మద్రాసు నుంచి వెలువడేది. కాశీనాథుని వారే సంపాదకులుగా ఉన్న ఈ పత్రికకు సహాయ సంపాదకులుగా ఉన్నవారు కూడా విఖ్యాత పండితులే. మల్లంపల్లి సోమశేఖర శర్మ, గన్నవరం సుబ్బరామయ్య, గిడుగు సీతాపతి, వి. డి. ప్రసాదరావు, పిలకా గణపతి శాస్త్రి, తిరుమల రామచంద్ర వంటివారు

సహాయ సంపాదకులు. ఆరు దశాబ్దాల సుదీర్ఘకాలం పాటు తెలుగు పాఠకులకు ఈ పత్రిక సేవ చేసింది. తెలుగు సాహిత్యంతో పాటు సంస్కృతం, చరిత్ర, పురాతత్వ, శాసన పరిశోధన వంటి అనేక విమర్శనాత్మక, పరిశోధనాత్మక విషయాల్ని 'భారతి' ప్రచురించింది. 'శారద' వంటి సర్వాంగ సుందరమైన, ఉన్నత ముద్రణ ప్రమాణాలు కలిగిన పత్రికలు సైతం 'భారతి'తో పోటీకి నిలవలేని పరిస్థితిని ఆనాడు పాఠకులు చూశారు. ప్రతిభామూర్తులైన కవి పండితులు, రచయితలు, విమర్శకులు, పాండిత్యాన్ని నిష్పాక్షికంగా కొలవగల సహాయ సంపాదకులు, సహృదయ పాఠకుల మేలు కలయికతో 'భారతి' జైత్ర యాత్ర సాగించింది.

ఆధునిక తెలుగు కవిత్వంలో ముఖ్యంగా భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం విస్తృతంగా ప్రచురించారు. గేయ, వచన కవితలు, స్మృతి కవిత, మినీ కవిత వంటి అధునాతన ధోరణుల్ని కూడా పత్రిక ప్రచురించింది, ప్రోత్సహించింది. ఆనాటి కవులు, రచయితలు, వ్యాసకర్తలు 'భారతి'లో తమ రచన ప్రచురించడం ఒక స్థాయి లభించడంగా భావించేవారు. రచనలకు పారితోషికం కూడా 'భారతి' ప్రవేశపెట్టింది. 1974లో స్వర్ణోత్సవాన్ని, 1984లో వజ్రోత్సవాన్ని జరుపుకొన్న గర్వకారకమైన 'భారతి' ఈనాడు లేకపోవడం తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు.

## g. ఆంధ్ర సర్వస్వము

1924 జనవరిలో ప్రారంభమై రాజమండ్రి నుంచి ఏడిద వెంకటరావు సంపాదకత్వంలో వెలువడేది. ఆంధ్రుల చరిత్ర, సాహిత్యం, భాష, ఆంధ్ర భాష పుట్టుక, లిపి పుట్టు పూర్వోత్తరాలు ఈ విధంగా సమస్త విషయాలకు చోటిచ్చేది కాబట్టి ఆంధ్ర సర్వస్వముగా ఈ పత్రిక వెలువడింది. కర్నల్ కోలిన్ మెకంజీ సేకరించిన కైఫీయతులను ప్రచురించడంలో ఈ పత్రిక అందరి దృష్టిని ఆకర్షించింది. బహుజనపల్లి సీతారామాచార్యులు, కస్తూరిశివశంకరశాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి వంటి సాహితీవేత్తల జీవితచరిత్రల్ని పత్రికలో ప్రచురించే వారు.

## h. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక

1912లో ప్రారంభమై మద్రాసు నుంచి వెలువడిన ఈ త్రైమాసిక పత్రికకు జయంతి రామయ్య సంపాదకుడు. చెన్నపురి ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఈ పత్రికను

నడిపేది. పత్రికలో పద్య కావ్యం, వచన కావ్యం, నాటకం, వాటిల్లో గుణదోష విచారం, ఆంధ్ర వాఙ్మయం తారతమ్య విచారం, శృంగారాది వర్ణనలు, గ్రామ్య ప్రయోగాలు వంటి సాహిత్య విషయాలు చోటుచేసుకొనేవి. తెలుగు భాష ఉత్పత్తి వికాసాలు, సంస్కృతం, ఇతర భాషలతో దానికి గల సంబంధ సాదృశాలు వివరించడం వంటి విషయాలను 'భాషా చరిత్ర' శీర్షిక ద్వారా వెలుగులోకి తెచ్చేవారు. దేశ చరిత్ర, సాంఘిక, రాజకీయ ప్రతిష్ఠాపనాల చరిత్ర, శిల్పకళాదుల చరిత్ర 'చరిత్ర' శీర్షికలోనూ, చిన్న చిన్న పద్యాలు, పద్యాల సముదాయాలు 'పద్యములు' శీర్షికలోనూ ప్రచురించేవారు. పత్రిక గ్రాంథిక భాషా వాదాన్ని అవలంబించింది. బండారు తమ్మయ్య, వేముల వాడ భీమకవి, చిన్నయసూరి, రంగాజమ్మ, గిడుగు రామమూర్తి, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కుందూరి ఈశ్వర దత్తు, దివాకర్ల వెంకటావధాని, మల్లికార్జున పండితారాధ్యులు వంటి ప్రముఖ కవి పండితుల రచనల్ని ఈ పత్రికల్లో ప్రచురించేవారు.

**i సాహితి**

1919లో ప్రారంభమైన ఈ ద్వైమాసిక సాహిత్య పత్రిక తెనాలి నుంచి వెలువడేది. సంపాదకుడు తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి. చింతా దీక్షితులు, అక్కిరాజు ఉమాకాంతం వంటి రచయితలు చక్కని కథలు, వ్యాసాలూ, పద్యాలూ పత్రిక కోసం రాసేవారు. ఆధునిక వచన రచనలు, కవిత్వంతో ఆకర్షణీయంగా వెలువడేది. 'సాహితి' పత్రిక ద్వారా వ్యావహారిక భాషా వాదానికి మంచి అవకాశాలు, ఆదరణ లభించాయి.

'ఆంధ్ర సారస్వత నిర్మాతలు' పేరుతో తెలుగు కవుల గురించి గ్రంథ రచనను ప్రోత్సహించేందుకు 'సాహితి' తగిన పారితోషికం కూడా ప్రకటించింది. ఇందులో నాటకం, రూప లక్షణాలు, దేశభాషలు, పూర్వ శాసనాలు, వేమన యోగి కథలు వంటి అనేక రచనలు, ఆలోచన ప్రేరేపించే విషయాలు ప్రచురించేవారు.

కవులు, పండితులు, గాయకులు, శిల్పులు, ప్రముఖుల ఫోటోలు, విశేషాలు కూడా ప్రచురించేవారు.

## j. వజ్రాయుధం

శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి సంపాదకత్వాన 'వజ్రాయుధం' 1925 జనవరిలో రాజమండ్రి నుంచి వెలువడింది. ప్రధానంగా గ్రాంథిక భాషా సమర్థన, గ్రామ్య (వ్యావహారిక) భాషా నిరసన లక్ష్యంగా ఎంచుకున్నది. ఈ పత్రికలో సంపాదకీయ వ్యాసాలు, విమర్శ వ్యాసాలు, సాహిత్య వ్యాసాలు, ప్రబంధాలు, నాటకాలు, గ్రంథ విమర్శలు, పత్రికా వ్యాసాలు, కథానికలు ప్రచురించేవారు. అన్నీ దాదాపు గ్రాంథికంలో ఉన్నవే ప్రచురించడం విశేషం. అప్పట్లో వ్యావహారిక భాషోద్యమం నిర్వహిస్తున్న గిడుగువారిని విమర్శిస్తూ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గ్రామ్యాచార్యులు - వారి బాష, గ్రామ్యాచార్యులు వంటి వ్యాసాలు రాశారు. ఒక్క గిడుగునే కాదు నాడు వ్యావహారిక భాషకు అనుకూలంగా ఉన్న ఇతర పత్రికలను సైతం శ్రీపాద వదలలేదు. 'ఆంధ్ర విశ్వ విద్యాలయము' అనే శీర్షికతో 'వజ్రాయుధము'లో ఒక సంపాదకీయం రాస్తూ (విశ్వ విద్యాలయంలో వైస్ ఛాన్సలర్‌గా రామలింగారెడ్డి గ్రామ్య భాషను ప్రవేశపెట్టాలని నిర్ణయించిన విషయంపై) "వీరు ఎంకి పాటలకు మహాస్థానమును కలిగించినారు. అంతియు గాక ఈనడుమనుద్యోగపదమందు నుండియు శ్రమంపడి 'ఆంధ్రభాషానుశాసన' మను నవ్యవ్యాకరణమునకును, బీఠిక ననుగ్రహించి ఈ గ్రంథమును శిరసావహించినారు. ఆ గ్రంథమందలి ప్రయోగములన్నియు అపప్రయోగములే అట్టియపూర్వ గ్రంథమారెడ్డిగారి పొగడ్తలకు బాత్రమైనది. మఱియును వారికి తమ యూనివర్సిటీ యుందు గ్రామ్య భాషనుపయోగింప జేయవలెననియు గట్టి పట్టుదల యుండినట్లు తెలియుచున్నది. దానికనుగుణముగా దమ విశ్వవిద్యాలయమున బెక్కురు గ్రామ్యవాదులు జేరినారు. వీరందరు గలిసి గ్రామ్యమున కోటిత్తురు. గ్రామ్య గ్రంథము లేర్పడును. గ్రామ్యాభివృద్ధి యగును, గ్రాంధిక భాష నశించును, ఆంధ్రమున కథోగతి సిద్ధించును" అని విమర్శించారు. ఈ పత్రికను శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి మొదట ఒకసంవత్సరంపాటు నడపాలని ప్రారంభించారు. తర్వాత కొన్ని సంవత్సరాలు నడపడానికి పూనుకొని 1927వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో స్వంత ప్రెస్సు నెలకొల్పి పత్రికను కొనసాగించారు.

### k. జయంతి

విశ్వనాథసత్యనారాయణగారి సంపాదకత్వంలో 1927లో ప్రారంభమై మద్రాసు, బందరుల నుంచి ఈ పత్రిక వెలువడేది. ఇది ద్వైమాసిక ప్రతిక. పత్రిక ప్రారంభ సంచికలో 'అధునా' అనే శీర్షికతో విశ్వనాథ సంపాదకీయం రాస్తూ – "ఈ కాలంలో పత్రికల సంపద ఖండకావ్యాలూ, చిన్న కథలూ, నవలలూ, నాటకాలూ, విమర్శనలూ అన్నీని అగ్రస్థానం కథకీ, ఖండకావ్యానికీ. చిత్రాలకు, కథలకేం, ఖండకావ్యాలకేం పాశ్చాత్యుల ఒరవడి సరిగా అనుకరించడం ఉపజ్ఞ లేకుండా కుదరదు. ఇప్పటికి తెలుగులో బయలుదేరిన మంచి కథలు వేళ్లమీద లెక్కపెట్టవచ్చును.

ఖండకావ్యాల స్థితి కథలంత వాసిగా లేదు. ఖండ కావ్యాలకి రూపం ఏర్పడ్డది అంటానికి యింతమంది దుయ్యబట్టటమే సాక్ష్యం. దీని వలన భావకవులు, రసవంతంగా వ్రాసేవాళ్లు, దేశంలో తగినంత మంది ఉన్నారనీ, ప్రతివాడూ ఒక్కొక్క వ్యక్తిత్వంతో భాసిస్తున్నారు అనీ తేలుతోంది."

ఈ పత్రికలో గ్రామ్యమా? వాడుక భాషా? అనే వ్యాసంలో విశ్వనాథ వ్యావహారిక భాషను సమర్థించాడు. తర్వాత పత్రిక కొంతకాలం ఆగిపోయి 1958 నవంబర్‌లో తిరిగి ప్రారంభమైంది. విశ్వనాథ అధ్యక్షతన మల్లంపల్లిసోమశేఖరశర్మ, దివాకర్లవేంకటావధాని, కేతవరపు రామకోటి శాస్త్రి, జువ్వాడి గౌతమరావులతో సంపాదకమండలి ఏర్పడి 'జయంతి' పత్రిక మాసపత్రికగా పునరవతరించింది.

ఇందులో సంపాదకీయాలు, సాహిత్యధార, పాఠకుల ఉత్తరాలు, ఆకాశవాణి, పుస్తక సమీక్ష, చర్చా వేదిక వంటి శీర్షికలతో వ్యాసాలు కథానికలు, కవితలు, నాటకాలు, సమీక్షలు, అనువాదాలు ప్రచురించేవారు.

### l. ఉదయిని

ఉదయిని ద్వైమాసిక పత్రిక 1935 జనవరిలో ప్రారంభమై మద్రాసు నుంచి వెలువడేది. సంపాదకుడు కొంపెల్ల జనార్దనరావు. ఈ పత్రిక నెలకొల్పడంలో సంపాదకుని ఉద్దేశం ఈ విధంగా ఉంది. "ఆంధ్రభారతి, గ్రంథాలయ సర్వస్వము, సాహితి, సఖి, శారద, కళ, జయంతి మొదలైన పత్రికలు అనల్పమైన సాహితీ సేవ సలిపి అంతరించినవి.

కృష్ణా, భారతి మొదలైన పత్రికలు ప్రశస్తముగా తత్కార్యము సాగిస్తూనే ఉన్నవి. కాని నాటి నుండి నేటి వరకు సాహిత్యపు గతులు నిరూపిస్తూ, తత్పరిణామమునకు తోడ్పడుతూ దీని కోసమై ప్రత్యేకముగా నిలిచి బ్రదికిన పత్రిక లేకపోయింది." ఈ ఉద్దేశాన్ని బట్టి ఆనాడు సాహితీ సేవకు మంచి పత్రిక లేకపోవడమే తమ పత్రిక వ్యవస్థాపనకు కారణమైందని తెలుస్తున్నది. సాహిత్యసేవకు 'ఉదయిని' అంత ప్రాధాన్యతను సంతరించుకున్నట్లు పలువురు సాహితీ ప్రముఖులు వెలిబుచ్చిన అభిప్రాయాలను బట్టి అంచనా వెయ్యవచ్చు. ఇందులో కిరణాలు, కవిత, కళ - నీతి, వాఙ్మయ వీధి, శృంగాటకం, అభిప్రాయాలు వంటి శీర్షికలతో పాటు పద్య కవితలు, గేయ కవితలు, వచన కవితలు, ఫీచర్లు, సాహిత్య గోష్ఠి, నాటకాలు, వ్యాసాలు, విమర్శలు ప్రచురించేవారు. వేదుల, శ్రీశ్రీ, దువ్వూరి, ముద్దుకృష్ణ, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, నేలటూరి వెంకట రమణయ్య, చింతా దీక్షితులు, వేటూరి ప్రభాకర శాస్త్రి, చలం, బాపిరాజు, నారాయణ బాబు, ప్రభృతుల రచనలు పత్రికలో కొలువు తీరేవి. నవ్య సాహిత్య రచనల ప్రచురణకు 'ఉదయిని' అందించిన ప్రోత్సాహం ఎన్నదగినది.

## m. ప్రతిభ

నవ్య సాహిత్య పరిషత్తు వేదికగా రాజమండ్రి నుంచి 1936 మే లో ప్రారంభమైన త్రైమాసిక పత్రిక 'ప్రతిభ'. తెలికిచర్ల వెంకటరత్నం సంపాదకులు. నవ్య సాహిత్యోద్యమ వ్యాప్తికి, వ్యావహారిక భాషా ప్రచారానికి ఈ పత్రిక విశేషమైన సేవ చేసింది. పద్యకావ్యాలు, ఖండ కావ్యాలు, గేయాలు, నాటకాలు, ఏకాంకికలు, ప్రహసనాలు, కథలు, వ్యాసాలు, వచన రచనలు, గ్రంథ సమీక్షలు ప్రచురిస్తామని పత్రికా నిర్వాహకులు ప్రకటించారు.

పత్రికలో చోటు చేసుకొనే సాహిత్య స్వరూపాన్ని గురించి పాఠకులు రాసిన లేఖలకు సమంజసమైన మార్పులు చేపడుతూనే కొన్ని విషయాల్లో ఆ కాలం సాహిత్య ప్రయోజనాల దృష్ట్యా పాఠకుల సూచనలను తిరస్కరించడం పత్రిక దృఢ వైఖరికి నిదర్శనం. వ్యాసాలకు చాలా పేజీలు విడిచి పెడుతున్నారని, మంచి వ్యాసాలు రావడం లేదని, పద్యాలు తగ్గించాలనీ, కొందరి పద్యాలు వెలివేయాలనీ కొంతమంది పాఠకులు సూచనలు చేశారు. వాటికి సమాధానంగా పత్రికవారు "సాహితి, సఖి, జయంతి,

ఉదయిని మొదలైన సుప్రసిద్ధ సారస్వత పత్రికలకు వ్యాసములు పంపిన వారే 'ప్రతిభ' కు కూడా వ్యాసములు అభిమానపూర్వకముగా పంపుతున్నారు. వారి ఇప్పటి రచనలు మునుపటి రచనకంటే ఎక్కువ ప్రశస్తముగ ఉన్నవనే మా అభిప్రాయము.' పద్యాలు తగ్గించడం మాకు సమ్మతం కాదు. కావ్య రచనలలో మనవారు చేస్తూ ఉన్న నూతన యత్నములకు, కొత్త ఛందస్సులు వాడుకలోకి తీసుకరావడమూ, వ్యావహారిక భాషలో పద్యములు వ్రాయడము మొదలైన వాటికి ఈ పత్రికలో తావు కల్పించవలెనని మొదటనే సంకల్పించుకొన్నాము. . . ," అని పేర్కొన్నారు. ఆంధ్రవాఙ్మయం పుట్టుపూర్వోత్తరాలు, శాసనములలోని తెలుగు భాష, పద్య రచన, రాష్ట్రేతర ఆంధ్రులు, నవ్య సాహిత్యం, భాషా సంస్కరణం, మువ్వ గోపాల కథానిక, శిష్టభాష, హిత సూచని, కృత్యాద్యవస్థ, యక్షగానము, సాహిత్య తత్త్వము, నేటి సాహిత్యం, ప్రకృతి - భావ కవిత వంటి రచనలు ప్రచురించే వారు.

'ప్రతిభ' గిడుగు రామమూర్తి పంతులు సూర్యరాయాంధ్ర నిఘంటువు తొలి ప్రచురణ మీద చేసిన సుదీర్ఘమైన సమీక్షా వ్యాసాన్ని ప్రచురించింది.

## n. అభ్యుదయ

అభ్యుదయ మాసపత్రిక 1946 అక్టోబర్ నెలలో ప్రారంభమై విజయవాడ నుంచి వెలువడేది. 1943లో ఏర్పడిన అభ్యుదయ రచయితల సంఘం అభ్యుదయ పత్రికను నెలకొల్పింది. పత్రికకు చదలవాడ పిచ్చయ్య సంపాదకుడుగా ఉన్నారు. కందుకూరి, గిడుగు, గురజాడల ఆశయసిద్ధికోసం, ముఖ్యంగా వ్యావహారికభాష ద్వారా విద్యారంగంలో విజ్ఞాన వ్యాప్తికి దోహదం చెయ్యాలనే ఆదర్శానికి ఈ పత్రిక పాటుపడింది.

లక్ష్య ప్రకటన ఈ విధంగా ఉంది. "దాస్య భారతం లో ముక్కలు ముక్కలుగా ఉన్న తెలుగుదేశాన్ని ఒకే స్వతంత్ర రాష్ట్రంగా నిర్మించడానికీ, విశాలాంధ్ర జాతీయ భాషా వికాసానికీ, ఆంధ్ర సంస్కృతికీ, కళా విజ్ఞానాలకు రూపురేఖలు తీర్చడానికి 'అభ్యుదయ' నిరంతరం పోరాడుతుంది" అని ప్రకటించారు.

కొంతకాలానికి తెలంగాణాలో నిజాం నిరంకుశ పాలనలో ఏర్పడిన [illegible] కారణంగానూ, కోస్తా ఆంధ్ర జిల్లాల్లో ప్రభుత్వ దమనకాండ ఫలితం గానూ 'అభ్యుదయ' పత్రిక నిర్వాహకులు జైళ్ల పాలయ్యారు. ఈ పరిస్థితుల వల్ల ఆగిపోయిన పత్రిక

1955లో పునః ప్రారంభమైంది. కొంతకాలం త్రైమాసిక పత్రికగా, కొంతకాలం ద్వైమాసిక పత్రికగానూ ఆ తర్వాత మాసపత్రికగానూ 1959 వరకూ నడిచి ఆగిపోయింది. చివర్న తుమ్మల వెంకట్రామయ్య సంపాదకులు.

1976 జూన్‌లో మద్రాసులోని అరసం శాఖ పక్షాన తిరిగి అభ్యుదయ పత్రిక ప్రారంభమై 14 నెలల పాటు వెలువడింది. ఆ కాలంలో 8 పేజీల బులెటిన్‌గా వెలువడింది. తర్వాత 4 పేజీల చొప్పున పెంచుకుంటూ 1977 ఫిబ్రవరి నుంచి అరసం పక్షాన మళ్లీ రెండేళ్ల పాటు నడిచింది. పత్రిక హైదరాబాదుకు మారింది. అనంతరం కొన్ని అవాంతరాల వల్ల, ఆర్థిక ఇబ్బందుల వల్ల పత్రిక క్రమం ప్రకారం వెలువడడం మానివేసి కొన్ని ప్రత్యేక సంచికల్ని మాత్రం ప్రచురించింది. సమాజానికి ప్రగతిశీల దృక్పథంతో కూడిన సాహిత్యాన్ని అందించే ప్రయత్నం ఈ పత్రిక చేసింది. పత్రికలో 'అంతర్జాతీయ గీతం కాదగిన గురజాడ దేశభక్తి గీతం,' 'సామాజిక భావుకతల భావకవి తిలక్,' 'గోర్కీ సాహిత్య సంస్థలో భారతీయ విద్యార్థి,' 'ప్రజా జీవనం ఉన్నంతవరకు అభ్యుదయ సాహిత్యం', శ్రీశ్రీ కవితార్ణవం మహాప్రస్థానం', రావిశాస్త్రి 'దొంగ వెధవ' కథానిక, 'కవిత పుట్టు పూర్వోత్తరాలు,' 'చలం భావాలు', విమర్శ, 'అభ్యుదయ సాహిత్యోద్యమం - మన కర్తవ్యం' వంటి వైవిధ్యంతో కూడుకొన్న వ్యాసాల్ని, రచనల్ని ప్రచురించారు.

'అభ్యుదయ' పత్రిక మొదటి నుంచీ తెలుగు సాహిత్యంలోని ఉత్కృష్టమైన రచనల్ని పరిచయం చేయడం కర్తవ్యంగా ఎంచుకొని నడిచింది.

## ౦. స్రవంతి

1954 ఏప్రిల్ నెలలో హైదరాబాదు నుంచి ప్రారంభమైన ఈ సాహిత్య మాస పత్రిక హిందీ ప్రచార సభ తరపున వెలువడుతోంది. పత్రికకు వేమూరి ఆంజనేయ శర్మ, దాశరథి ప్రభృతులు సంపాదకులుగా ఉన్నారు. 'ఉత్తమ సంస్కారం కలిగిన సాహితీవేత్తల అమూల్య రచనలే జీవనంగా బహుజనానికి విజ్ఞానాన్ని ప్రసాదించి, భారతీయ సంస్కృతికి ప్రతిబింబ ప్రాయమై వెలుగొందే రీతిని' స్రవంతిని రూపొందించాలన్న లక్ష్యం ఏర్పరచుకున్నట్లు ప్రకటించారు.

అదేవిధంగా 'రాజకీయంగా చిన్నాభిన్నమై, ప్రాంతీయ తత్వాలతో నిండిపోయిన

వాతావరణానికి అతీతంగా ఉండి 'స్రవంతిని' నడుపగోరుతున్నాము' అని కూడా ప్రకటించారు. 1957 అక్టోబర్ నుంచి ఈ పత్రికా నిర్వహణ హైదరాబాద్, విజయవాడల్లోని హిందీ ప్రచార సంఘాలు ఏకమై దక్షిణ భారత హిందీ ప్రచార సభగా ఐక్యమైన తర్వాత కూడా వెలువడుతున్నది. 1961 ఏప్రిల్ 1 నుంచి తెలుగు - హిందీ ద్విభాషా పత్రికగా సాగింది.

ఆధునిక సాహిత్యంలోని అన్ని శైలులూ, అన్ని ప్రక్రియలు, అన్ని ధోరణులకూ 'స్రవంతి' స్థానం కల్పిస్తూంది. కథలు, గేయాలు, నాటికలు, కథానికలు, పద్యాలు, సాహిత్య వ్యాసాలు, పరిశోధన వ్యాసాలు, కవితలు, సమీక్షలు, హిందీ అనువాదాల్ని 'స్రవంతి' ప్రచురిస్తోంది. ప్రసిద్ధ సాహితీవేత్తల రచనల్నే గాక యువరచయితల రచనలకూ ప్రోత్సాహం అందిస్తోంది. ఈనాటి ఎందరో ప్రముఖ కవులు, రచయితలు 'స్రవంతిలో' తమ తొలినాటి రచనల ప్రచురణతో ప్రోత్సాహం పొంది ఎదిగినవారే.

మల్లవరపు విశ్వేశ్వరరావు, నాయని కృష్ణకుమారి, ఇల్లిందల సరస్వతీ దేవి, సి. నారాయణ రెడ్డి, ముకురాల రామారెడ్డి, జి. ఎస్. మోహన్, కుందుర్తి, దాశరథి, పోలాప్రగడ సత్యనారాయణమూర్తి, పేర్వారం జగన్నాథం, పైడిపాటి సుబ్బరామశాస్త్రి, మాదిరాజు రంగారావు, ఎన్. గోపి, నగ్నముని వంటి అసంఖ్యాకులైన కవులు, రచయితల రచనల్ని 'స్రవంతి' ప్రచురించింది.

సురవరం ప్రతాపరెడ్డి స్మృత్యంజలి, కాటూరి సంస్మరణ, బూర్గుల రామకృష్ణారావు షష్టిపూర్తి సంచికలను కూడా పత్రిక ప్రచురించింది. గత 42 సంవత్సరాలుగా పత్రిక నడుస్తూ సాహిత్యానికి నిర్విరామంగా సేవ చేస్తూనే ఉంది.

## p. సృజన

1966 నవంబర్‌లో త్రైమాసిక పత్రికగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో సాహితీ మిత్రులు ప్రారంభించిన 'సృజన' ప్రధానంగా ప్రగతిశీల, విప్లవ రచనలను ప్రచురించింది. పత్రిక తన ఉద్దేశాన్ని ఈ విధంగా పేర్కొన్నది. "ఇది ఒక సాహస ప్రయోగం. ఇది పత్రికా? కాదు. మారుతున్న కాలాన్ని, విస్తృత మవుతున్న జాగృతిని ప్రతిబింబించే, అనువదించే ఒక ఫోరం దీనికి అనువాదకుడూ లేడు. సాధకులే తప్ప. ప్రయోగ శీలత్వం, సృజనాత్మక శక్తి, ఆధునిక దృక్పథం ఈ ఫోరం పునాదులు."

పత్రికలో దుర్గానంద్, కిషన్, నగ్నముని, నిఖిలేశ్వర్, మహాస్వప్న, కె. వి. ఆర్. భైరవయ్య, సి. వి. కృష్ణారావు, అనుముల కృష్ణమూర్తి, పేర్వారం జగన్నాథం, త్రిపురనేని వెంకటేశ్వరరావు, కొ. కు, పరిగి రాధాకృష్ణ, అమ్మంగి వేణుగోపాల్, ఎన్. గోపి, శ్రీపతి, నవీన్, సంపత్ కుమార్, వే. న. రెడ్డి, వేగుంట మోహన్ ప్రసాద్, సురమౌళి వంటి కవులు, రచయితల రచనలు ప్రచురించారు.

తర్వాత ఇది మాసపత్రికగా మారినప్పటి నుంచి విప్లవ సాహిత్య వేదికగా నడిచింది. తిలక్, బుచ్చిబాబు, చలం, శ్రీశ్రీల ప్రత్యేక సంచికలు విలువైనవిగా పాఠకుల అభిమానాన్ని చూరగొన్నాయి.

'చలం సాహిత్య సమాలోచన' ప్రత్యేకంగా రూపొందింది. చలం కథల మీదా, నవలల మీదా, పరిశీలనాత్మకమైన వ్యాసాలు, చలం దృక్పథాన్ని గురించి, విశ్వాసాల గురించి ప్రముఖులు రచించిన వ్యాసాలు, చలంతో జరిపిన ఇంటర్వ్యూ ఈ సంచికలో ప్రచురితమయ్యాయి.

విప్లవ సాహిత్య వేదికగా పనిచేయడం వల్ల క్రమక్రమంగా సృజన నిర్బంధాలకు, నిషేధానికి గురైంది. ప్రచురణకర్త, సంపాదకుడు పలుమార్లు జైలుకు వెళ్లవలసి వచ్చింది.

## ౧. కళాకేళి

**1968** ఏప్రిల్‌లో కాకినాడ నుంచి ప్రారంభమైన 'కళాకేళి' మాసపత్రిక సంపాదకుడు ఆవంత్స సోమసుందర్. 'కళాకేళి ఆధునిక సాహిత్య దిక్సూచి' అంటూ పత్రిక చివరి అట్ట మీద ముద్రించిన మాటను బట్టి 'కళాకేళి' ఆధునిక సాహిత్య ప్రచురణకు విశేష ప్రాముఖ్య మిచ్చిందని తెలుస్తున్నది.

ఈ పత్రికలో ప్రధానంగా 'గ్రంథావలోకనం' శీర్షికలో గ్రంథ సమీక్షలు, గ్రంథ విమర్శలు, 'స్వీకారం' శీర్షికలో కవితా సంపుటాలు, కవితా సంకలనాలు, సాహిత్య వ్యాసాలు, వ్యాసావళులు, పత్రికలు, నవలలు, కావ్యాలు, కథల సంపుటాలు వంటి ప్రచురణలకు సంబంధించిన వ్యాసాలు ప్రచురించేవారు. 'తొలకరి' శీర్షికలో కొత్తగా కవిత్వం రాస్తున్న వారి కవితలు ప్రచురించేవారు. 'లేఖాళి' శీర్షికలో పాఠకుల లేఖలు,

'ఋతుపవనాలు' శీర్షికలో దేశదేశాల కవులను గురించి, వారి కవితా ధోరణులను గురించీ రాసేవారు.

ఈ పత్రికలో కవితలు, వ్యాసాలు, కథానికలు, సంపాదకీయాలు, గ్రంథ విమర్శలు ప్రధానంగా చోటుచేసుకొనేవి. ఇందులో కేవలం సాహిత్య సంబంధమైనవే తప్ప ఇతర అంశాలకు ఏ మాత్రం అవకాశం ఉండేది కాదు.

'కళాకేళి' పత్రిక మూడవ సంచిక కారల్ మార్క్స్ 150వ జన్మదిన ప్రత్యేక సంచికగా వెలువడింది. 7, 8 సంచికలను గాంధీ శతజయంతి సంచికలుగా 10 ,11 సంచికలను శ్రీశ్రీ షష్టి పూర్తి అభినందన సంచికలుగా వెలువరించింది. మొత్తం 19 సంచికలుగా వెలువడింది. ఇందులో వ్యాపార ప్రకటనలు కూడా సాహిత్య సంబంధమైనవే కావడం విశేషం. 1971 వరకూ నడిచి ఆగిపోయింది

## r. సంవేదన

ప్రసిద్ధ విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి సంపాదకత్వంలో1968 ఏప్రిల్‌లో కడప నుంచి సంవేదన మాసపత్రిక వెలువడింది. ఆ పత్రికకు రచనల్ని ఆహ్వానిస్తూ రాసిన స్వాగతవచనం . . "మంచి పత్రిక లన్నిటికీ ఉన్నట్లే మా పత్రికకూ ఒక దృక్పథమూ. ఒక స్థాయీ ఉన్నాయి. ఆ దృక్పథంతో జీవించి, ఆ స్థాయిని అందుకున్న యే రచనకైనా మా పత్రికలో కృతజ్ఞతా పూర్వకమైన స్వాగతం లభిస్తుంది." . . . .

'సంవేదన' పత్రికలో కవితలు, కథానికలు, సమీక్షలు, సాహిత్య వ్యాసాలు, సంపాదకీయ వ్యాసాలు, కొత్త పుస్తకాల స్వీకారం వంటివి ప్రచురించేవారు. కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, కె. వి. రమణా రెడ్డి, తంగిరాల వెంకట సుబ్బారావు, మహీధర రామమోహన్ రావు, పుట్టపర్తి నారాయణాచార్యులు, గొల్లపూడి మారుతీరావు, మిరియాల రామకృష్ణ, నవీన్, చేకూరి రామారావు ప్రభృతుల రచనలు ప్రచురించేవారు.

## s. తెలుగు పరిశోధన

1987 నవంబర్‌లో డా. ఎన్. గోపి నిర్వహణలో వాసిలి వసంతకుమార్ సంపాదకత్వంలో హైదరాబాద్ నుంచి ప్రారంభమైన 'తెలుగు పరిశోధన' తెలుగు పాఠకుల్లో పరిశోధనా జిజ్ఞాసను పదును చేసింది. సాహిత్య పత్రికల్లో అరుదైన రీతిలో వెలువడిన ఈ త్రైమాసిక పత్రికలో సాహిత్య పరిశోధన పద్ధతులు, ప్రామాణికమైన సాహిత్యాంశాల్లో

వ్యాసాలు ప్రచురించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో జరుగుతున్న తెలుగు పరిశోధనకు సంబంధించిన వివరాలు విశేషాలు ప్రచురించి ఒకరకమైన ఏకరూపతా సాధనకు దోహదం చేసింది. పరిశోధనలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించే మెళకువలను, ప్రముఖులతో ఇంటర్వ్యూలను, ఆలోచనలను ప్రేరేపించే అంశాలను, చర్చనీయాంశం కాగల వ్యాసాలను ప్రచురిస్తూ అనతికాలంలో సాహితీలోకం దృష్టిని ఆకర్షించింది. అధ్యాపకులు, సీనియర్ పరిశోధకులు, విమర్శకులు, యువ రచయితలు, పరిశోధక విద్యార్థుల మేలిమి సమ్మేళనంగా ఈ పత్రిక వెలువడింది.

ఇవన్నీ ప్రసిద్ధమైన సాహిత్య పత్రికల్లో కొన్ని మాత్రమే. ఇంకా సాహిత్య పత్రికలుగా పేర్కొనదగినవి, సాహిత్యానికి ప్రాధాన్యత నిచ్చినవి అనేకం ఉన్నాయి. సమాచారం లభ్యం కాకపోవడం వల్లా, స్థలాభావం వల్లా అన్నీ వివరంగా చోటు చేసుకోలేకపోయాయి.

చెప్పుకోదగిన సాహిత్య పత్రికల్లో సుజనరంజని, శ్రీయక్షిణి, మధురమంజరి, అనల్ప జల్పితా కల్పవల్లి, ప్రబంధ కల్పవల్లి, కళానిధి, సుజన మనోల్లాసిని, గ్రంధ ప్రదర్శిని, మహారాణి, కల్పవల్లి, కళాభివృద్ధి, శారద, వైజయంతి, ధీమణి, వర్తమాన తరంగిణి, సూర్యాలోకము, సరస్వతి, కళావతి, మంజువాణి, వాగ్వల్లి, ఆనంద దాయిని, బాలసరస్వతి, శ్రీ భారతి, ప్రబంధ కల్పవల్లరి, కల్పలత, కామేశ్వరి, విద్యావతి, మనోరమ, సుదర్శిని, అభినవ సరస్వతి, కవితా భారతి, మనోరంజని, అభినవభారతి, మానవ సేవ, సాహిత్య ప్రకాశిక, ఆంధ్ర సంరక్షిణి, ఆంధ్ర సేవ, భటనేశ్వరి, రామకథాసుధ, జనరంజని, తెలుగు సాహితి, సాహిత్య, మాతృభాషా, ప్రబుద్ధాంధ్ర, కళ, ఆంధ్ర భాషా విలాసిని, ఆంధ్రాభ్యుదయము, పుష్కరిణి, పారిజాతము, మధుర భారతి, తెలుగు వాఙ్మయ పత్రిక, దేశబంధు, బ్రహ్మభారతి, లలిత, సుభాషి, అభ్యుదయ, ఆంధ్రాహెరాల్డ్, కల్పవల్లి, కవిత, పుష్పమాల, భారత కధానిధి, సుజాత, సుప్రభాతము, గుంటూరు కాలేజి మ్యాగజైను, ఆంధ్రజ్యోతి, ఆంధ్రి, ఆనంద భారతి, విద్యార్థి, పుష్పాంజలి, సుధ, సరస్వతి, రెడ్డిరాణి, దివ్యవాణి, కళ్యాణి, జ్వాల, ఆంధ్రభూమి, ఉదయలక్ష్మి, నవ్యభారతి, చంద్రిక, జయలక్ష్మి, పూలదండ, ప్రభాతము, వీణ, తెనుగు తల్లి, మహతి, విభూతి, విశ్వకళ, కధాంజలి, పూర్ణిమ, భాషామణి, ఉదయభారతి, తరణి, కిన్నెర, శోభ, సాహితి, సంస్కృత, ప్రగతి, కాకతీయ, జయభారత్, మేధావి, సారథి, విశ్వసాహితి, నవభారతి, వీచిక, అరుణతార, ప్రజా సాహితి, నవత, తెలుగు, ప్రసారిక, చైతన్య కవిత, వెల్లువ, ఎక్స్‌రే, జానపద, సరస్వతి, కళాసౌరభం, వడిసెల, అంకితం, వేదిక మొదలైనవి తెలుగులో వెలువడిన సాహిత్య పత్రికలు.

## (iv) మత పత్రికలు

మత ప్రచారం పత్రికల ద్వారానేగాక ముద్రణ సౌకర్యాల వ్యాప్తి వల్ల కూడా పెరిగింది. దేశంలో తొలిరోజుల్లో ముద్రణ యంత్రాలను క్రైస్తవ మిషనరీలు బాగా ఉపయోగించుకోవడం జరిగింది. తర్వాత పత్రికలకు కూడా మత ప్రచారం విస్తరించింది. ముందు క్రైస్తవ మత పత్రికలు వచ్చాయి. తర్వాత దేశంలో పాశ్చాత్య భావాల విస్తృతి వల్ల, ఆంగ్ల విద్యా వ్యాప్తి వల్ల కలిగిన ప్రభావంతో సంఘ సంస్కరణ, మత సంస్కరణ విప్లవం తలెత్తింది. హైందవ మతంలోనూ ఈ సంస్కరణ ప్రారంభమైంది. రాజారామమోహన్‌రాయలు 1828లో కలకత్తాలో బ్రహ్మసమాజం స్థాపించాడు. విగ్రహారాధనం మాని వర్ణ విభేదాల్ని విస్మరించి ఏకేశ్వరోపాసన చెయ్యాలని బ్రహ్మసమాజికులు ప్రచారం చేశారు. 1881 నాటికి ఇది ఆంధ్రదేశానికి కూడా విస్తరించింది. కాకినాడ మొదలైన చోట్ల బ్రహ్మసమాజశాఖలు, ప్రార్థనా సమాజాలు స్థాపించారు. వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు, పిఠాపురం మహారాజా సూర్యారావు మొదలైనవారు బ్రహ్మ సమాజాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

ఈ కాలంలో సంభవించిన మత ఉద్యమాల్లో రెండవది ఆర్య సమాజ స్థాపన. 1875లో స్వామిదయానందసరస్వతి స్థాపించారు. మానవులంతా వైదిక మతం ఒక్కదాన్నే అవలంబించాలని ఆయన ప్రచారం చేశారు. దయానందుని ఆర్య సమాజం జాతీయతను బలపరచింది.

మూడవది రామకృష్ణ పరమహంస, ఆయన శిష్యుడు స్వామి వివేకానంద ప్రారంభించిన ఉద్యమం. అద్వైత తత్వం ఉత్కృష్టమైనదని రామకృష్ణుని ప్రబోధం. మానవ సేవయే మాధవ సేవ అనీ, మోక్ష సాధనకు ప్రజా సేవ ప్రధాన సాధనమని ఆయన ప్రవచించారు. సర్వ మత సామరస్య సమానత్వాలను నిరూపించడానికి రామకృష్ణ పరమహంస ప్రయత్నించారు. వివేకానందుడు రామకృష్ణుని బోధనల్ని ప్రపంచమంతటా ప్రచారం చేసి, వాటిని సాంఘిక, ఆర్థికాది రంగాల్లో సమ్మేకం చేశాడు. వివేకానందుడు ప్రబోధించిన సనాతన మత పునరుద్ధరణ మహోద్యమం ఆంధ్ర దేశంలో కూడా నవోత్తేజాన్ని రేకెత్తించింది.

విద్యాధికుల్లో జాతీయతను బలపరచిన మరో మత ఉద్యమం దివ్యజ్ఞాన సమాజం.

ఇది 1875లో సర్వ మత సమన్వయ కాంక్షతో అమెరికాలో స్థాపించడం జరిగింది. 1893లో డాక్టర్ అనిబీసెంటు భారత దేశానికి వచ్చి ఈ సమాజం ద్వారా వివిధ రంగాలో ముఖ్యపాత్రవహించడం వల్ల ఈ సమాజం బాగా వ్యాప్తిగాంచింది. సమాజ కార్యక్రమాల్లో ఆంధ్రుడు తల్లాప్రగడ సుబ్బారావు చురుగ్గా పాల్గొన్నారు. వీరి ప్రోత్సాహంతో మద్రాసు అడయారులో 1882లో దివ్యజ్ఞాన సమాజం స్థాపించడం జరిగింది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపకుల్లో ముఖ్యుడు ఎ. ఓ. హ్యూం ఇందులో సభ్యుడు.

ఈ నేపథ్యంతో తెలుగులో మత పత్రికలు వెలువడ్డాయి. మత పత్రికల్లో ప్రధానంగా హిందూ, క్రైస్తవ మత పత్రికలున్నాయి. హిందూమత పత్రికల్లో ఇప్పటివరకూ ప్రస్తావించిన వివిధ సిద్ధాంతాలకు సంబంధించిన అంశాల గొప్పతనాన్ని ప్రచారం చేసేందుకు ఉద్దేశించినవి. ఇవి కేవలం హైందవ మతంలోనే అంతర సిద్ధాంత స్పర్శ కలవి. క్రైస్తవ మత పత్రికల్లో ఆ విధంగా కాకుండా క్రైస్తవ మత విశిష్టతను ప్రచారం చేసేవి ఉన్నాయి. ఇతర మతాల సరసన క్రైస్తవ మతాన్ని ఎక్కువ చేసి చూపుతాయి. అంతే కాదు క్రైస్తవ మతంలో చేర్చుకొనే (మత మార్పిడి) భావాల్ని ప్రచారం చేయడం జరుగుతుంది.

మత పత్రికలతో పాటు తెలుగులో కులపత్రికలు కూడా బాగానే వెలువడ్డాయి.

## (1) క్రైస్తవ మత పత్రికలు

### (a) హితవాది

1848లో జె. ఎడ్మండ్ షార్కీ ఈ మాసపత్రికను స్థాపించాడు. ఆంగ్లేయుల్లో తెలుగు బాగా తెలిసిన షార్కీ ఈ పత్రికను మద్రాసులో ముద్రించి మచిలీపట్నం నుంచి వెలువరించేవాడు. ఈ పత్రిక 1862లో వెలువడినట్లు నిడుదవోలు,[17] నార్ల,[18] నాడిగ్ కృష్ణమూర్తి[19] పేర్కొంటున్నారు. అయితే నార్ల షష్ట్యబ్ది పూర్తి సంచికలో ఆరుద్ర 'ఈపత్రిక 1848లో అవతరించి 1862 వరకు నడిచినట్లు రాశారు. ఎఫ్. ఎఫ్. గ్లేయిడ్ స్టోన్ రచించగా ఇ. ప్రకాశం సంకలనం చేసిన 'షార్కీ జీవితం[20] అనే రచనను తన

17. Studies in the History of Telugu Journalism P. 57
18. Veeresalingam, Narla P. 45
19. Indian Journalism P. 316
20. Studies in the History of Telugu Journalism P. 16

వాదనకు ఆధారంగా ఆరుద్ర చూపారు. 'మచిలీ బందరు చరిత్రము'లో "పోయిన హితవాదిని పునరుద్ధరణ గావించుటకును కారణం బైనది" అనే వాక్యం ఆధారంగా 1848లో అవతరించిన 'హితవాది' మధ్యలో ఆగిపోయి మళ్లీ 1862లో పునరుద్ధరణ జరిగినట్లు భావించవలసి వస్తున్నదని బంగోరె[21] అన్నారు.

'హితవాది' పత్రిక 1862వ సంవత్సరం సంచికలు లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరచబడి ఉన్నాయి.

క్రైస్తవ మత ప్రచారమే పత్రిక ధ్యేయం. అయితే కేవలం మత విషయాలకే గాక అనేక ఇతర సామాన్య విషయాలను ప్రచురించేవారు. మామిడి సారంగపాణి, మతుకుమల్లి కృష్ణశాస్త్రి 'మచిలీ బందరు చరిత్రము' (1879)లో "హితవాదైతే తమ మతహితముతో బాటు ఇతర మతహితమును జూచుకొనుచు నుండెనే నింక నింక వృద్ధి కాదగియున్నది"[22] ప్రస్తావించారు.

హితవాది పత్రిక ఫైలును డా. వి. లక్ష్మణరెడ్డి[23] సంపాయించారు. ఆయన విశ్లేషణ ప్రకారం హితవాదిలో దేశ, విదేశ వార్తలు, ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, సార్వజనీన ప్రకటనలు ఎలా ఉండేవో మచ్చుకు కొన్ని ఇచ్చారు. అయితే క్రైస్తవ మత ప్రచారానికుద్దేశించిన అంశాలెలా ఉండేవో తెలియడం లేదు.

## (b) రవి

కెనెడియన్ బాప్టిస్టు మిషన్ వారు సుమారు 30 ఏళ్లకు పైగా కాకినాడ నుంచి ఈ పత్రికను నడిపారు. మత వ్యాప్తి దీని ప్రధానోద్దేశమైనా లోక వార్తావళి కూడా ప్రచురించారు. ఆంధ్ర క్రైస్తవులలో ప్రబోధానికి ఇది హేతుభూతమైంది.

ఇతరత్రా చెప్పుకోదగిన క్రైస్తవ మత పత్రికలలో తెలుగు బాప్టిస్టు, జ్ఞాన భాను, రాయబారి. సత్యదూత, లూథరిన్, బాప్టిస్టు, తెలుగు ఉద్యోగస్తుడు, క్రైస్తవ బోధిని,

21. బ్రౌన్ జాబులు - తెలుగు జర్నలిజం చరిత్ర 1832 -1857 పు. 112

22. గద్య చింతామణి - గిడుగు రామమూర్తి పు. 267

23. తమ పరిశోధన కోసం లండన్‌లోని వారి మిత్రుని ద్వారా లండన్ మ్యూజియం నుంచి [illegible] కాపీలు సంపాయించారు.

హితవాది, క్రైస్తవ, సంయుక్త, సంఘ వర్తమాని, క్రైస్తవ సంఘాభి వర్ధిని, స్త్రీల కొరకు వర్తమానములు, హృదయారావము, దేశీయ మిషనరి, కేథలిక్కు మిత్రము, తెనుగు చర్చిమన్ పత్రిక, బాలమిత్ర, తెలుగు లూథరన్, వేకువ జుక్క, గెత్యమనె, దక్షిణ ఇండియా దూత, ములాగ్ వర్తమాని, ఆర్కాట్ మిషను, ఆంధ్ర క్రైస్తవ పత్రిక, పరోపకారిణి, క్రైస్తవ నిరీక్షణ, ఆంధ్ర లూథరిన్, ఉదయకాంతి, క్రీస్తు వర్తమానము, గాస్పెల్, ఇల్యుమినేటర్, బైబిల్ రీడింగ్ పత్రిక, ఏసు, సత్య రాయబారం, కిరణం, ప్రార్థనా శక్తి, స్పందన వంటివి ముఖ్యమైనవి.

## ii. హిందూ మత పత్రికలు

### a. తత్త్వ బోధిని

చెన్నపురి వేదసమాజం (బ్రహ్మ సమాజానికి పూర్వ రూపం) వారు తత్త్వ బోధినిని మాసపత్రికగా **1864**లో ప్రారంభించారు. వేద సమాజం కలకత్తాలో ఆవిర్భవించింది. కలకత్తాలో ఈ ఉద్యమాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన మహర్షి దేవేంద్రనాథటాగోర్ **1839**లో వంగ భాషలో 'తత్త్వ బోధిని' పత్రిక వెలువరించారు. **1865** ప్రాంతానికి బ్రహ్మ సమాజ ప్రచారానికి హిందీలో కూడా 'తత్త్వ బోధిని' పత్రిక వెలువడింది.

'తత్త్వ బోధిని' ప్రధానంగా బ్రహ్మసమాజసూత్రాలను, సంఘ సంస్కార విషయాలను ప్రచురించేది. స్త్రీ పునర్వివాహ విషయకోపన్యాసాలు ఈ పత్రికలో మొదటిసారి ప్రచురితమయ్యాయి. బాలికల విద్యాభ్యాసానికి సంబంధించిన వ్యాసాలు కూడా వేశారు. ఈ వ్యాసాలు కందుకూరి వీరేశలింగంగారిని ప్రభావితం చేశాయి. ఈ పత్రిక సంఘ సంస్కరణోద్యమ నిర్వహణకు వీరేశలింగం గారిని ప్రేరేపించింది. ఈ విషయాన్ని వారే ప్రస్తావించారు.[24]

ఈ పత్రికలో వేదాల్ని కూడా ప్రచురించారు. తొలిసారిగా తెలుగు వివరణతో సహా ఋగ్వేద సంహిత సస్వరంగా తెలుగు లిపిలో ప్రచురించారు. ప్రతి సంచిక నిరాకార బ్రహ్మ ప్రార్థనమైన ఒక ఋక్కుతో ఆరంభమయ్యేది. ఈనాటికి కూడా బ్రహ్మ సమాజికులు ఈ ఋక్కును ఆలపిస్తారు. మండ్యం కృష్ణమాచార్యులు చేసిన శతావధానం

---

*24. స్వీయచరిత్రము. ప్ర.భా (ద్వి.ము) 4వ ప్రకరణం పు. 156*

వివరాలు దీనిలో తొలిసారిగా 1868లో ప్రచురితమైనాయి. పరమాత్మ స్వరూపము, పరిశుద్ధాస్తిక స్వరూపము మొదలైన మతపరమైన వ్యాసాలు 'తత్త్వబోధిని'లో వేశారు. ఈ పత్రికలో ప్రచురితమైన ముఖ్య వ్యాసాలను తత్త్వబోధిని పుస్తకం 1, 2, 3 గా వేద సమాజం ప్రచురించింది. ఈ పద్ధతిలోనే వీరేశలింగం 'వివేకవర్ధని'లో ప్రచురితమైన వివిధ వ్యాసాలను సంపుటాలుగా ప్రచురించారు.

తత్త్వబోధిని భాష గ్రాంథికం. అయితే శైలి రుచికరంగా ఉన్నట్లు వీరేశలింగం గారు రాశారు.[25] ఈ పత్రిక మూడవ సంపుటం (1867 - 68) ఆంధ్రపత్రిక వారి వద్ద ఉండేది.[26]

## b. శైవప్రచారిణి

1923 డిసెంబర్‌లో వరంగల్లు నుంచి ప్రసిద్ధ శైవమత ప్రచారకులు కొడిమెల రాజలింగారాధ్యులు ఈ మాసపత్రికను వెలువరించారు. దీనికి సంపాదకులు విద్వాన్ ముదిగొండ వీరేశలింగఅయ్యవార్లంగారు. ఇందులో 'స్కాంధపురాణం' మొదలైన శైవమత గ్రంథాలు ప్రచురించారు. కొన్నాళ్ల తర్వాత ఇది పక్ష పత్రికగా మారింది. 'వృత్తాంత పత్రిక'గా పేరు కూడా మార్చుకొని కొంతకాలం నడిచింది.

## c. విభూతి

1939లో పండిత చిదిరెమఠము వీరభద్ర శర్మగారు ఈ మాసపత్రికను సికిందరాబాద్ నుంచి నడిపారు. ఈ పత్రిక శైవ మత సిద్ధాంతాలు, శైవ సాహిత్యం పై వ్యాసాలు, చర్చలు, గ్రంథాలు, సారస్వత విషయాలు ప్రచురించారు. 1940 ఫిబ్రవరి సంచికలో శేషాద్రి రమణ కవుల "నిజాము రాష్ట్ర మండలి అముద్రిత ద్విపద కావ్యములు" గురించిన వ్యాసాలు ప్రారంభమయ్యాయి. ఈ సంచికలోనే చిలుకూరి నారాయణరావు గారి 'పండితారాధ్య చరిత్ర' పీఠికపై పండిత చిదిరెమఠం విమర్శ ఉంది. 1940 ఏప్రిల్ సంచికలో శివతత్త్వ సార కర్త మల్లికార్జున పండితారాధ్యులు కాదన్న డా. చిలుకూరి నారాయణరావుపై వీరభద్ర శర్మ విమర్శ ఉంది. 1940 మే సంచికలో నన్నిచోడ కుమార

*25. 'పురాతనాంధ్రవార్తాపత్రికలు' - కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి.*

*26. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక మే 1920.*

సంభవం కాలాన్ని గురించి దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి వ్యాసం ప్రచురించారు. జూన్ సంచికలో పండితారాధ్య చరిత్రపై వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వ్యాసం ప్రచురితమైంది. శ్రీపతి పండితుని శ్రీకర భాష్యం కూడా విభూతిలో ధారావాహికంగా వెలువడింది.

పండిత వీరభద్ర శర్మ గారు వీరగ్రాంథికవాదులు చిలుకూరి నారాయణరావు గారు పండితారాధ్య చరిత్రకు వ్యావహారికంలో పీఠిక రాశారని 'విభూతి' 1940 ఫిబ్రవరి సంచికలో విమర్శించారు. పత్రికా నిర్వాహకులు వీరభద్రశర్మ గారు 1942లో కాశీలోని శైవ పీఠానికి అధిపతిగా వెళ్లడంతో 'విభూతి' ఆగిపోయింది.

హిందూ మత పత్రికల్లో చెప్పుకోదగినవి హిందూజన సంస్కారిణి, ధర్మ వర్ధిని, శివగ్రంథ ముక్తావళి, సాధని, ధర్మవాదని, ప్రసన్న మంజరి, ధర్మోపదేశిని, విశ్వస్పట్, ఈశ్వర దర్శిని, హంస, సుజ్ఞాన, ఈశ్వర వాదిని, దివ్యజ్ఞాన దీపిక, విశిష్టాద్వైత ప్రకాశిక, శంకర విజయము, వేదాంత చంద్రిక, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర పత్రిక, ఆర్య తిలక, వేదాంత చంద్రిక, ఆంధ్రమాత, భారతభాను, శృతిధర్మ, భక్త సంజీవని, శైవ మత ప్రకాశిక, వైష్ణవ పత్రిక, ఆనంద తీర్థ, తారక సందేశము, మీమాంస, శైవ ప్రచారిణి, ఆదిశైవ పత్రిక, ఐకమత్యము, జ్ఞాన దీపిక, ధర్మ సాధని, విశిష్టా ద్వైత సిద్ధాంతము బోధన, సత్సంగ, రామకోటి, సుజ్ఞాన చంద్రిక, మురళి, శైవ రహస్య బోధిని, ఆర్యపత్రిక, వేదాంత దీపిక, శాంతి, శ్రీశైల పత్రిక, జ్యోతి, యదార్థ భారతి, స్వవృద్ధి, సుబోధిని, నిమిషాంబ, వర్ణాశ్రమ, వీరశైవ ప్రచారిణి, జీవన ప్రభ, జ్ఞానప్రియ, ధర్మజ్యోతి, నిత్యానంద, ప్రభుహరనాథ్, బ్రహ్మ విద్య భక్తి ప్రబోధిని, మోక్ష సాధని, వేదాంత మాసపత్రిక, శంకరం, శ్రీ రామసేవ, శ్రీ వైష్ణవ పత్రిక, శ్రీ రామానుజ పత్రిక, హరనాథ మురళి వంటి హిందూమత పత్రికలు వెలువడ్డాయి.

### iii. కులపత్రికలు

శెట్టి బలిజ, ఆర్యవైశ్య, వైశ్య సామ్రాజ్య ప్రదాయిని, చౌదరి, నియోగి, వర్ణాశ్రమ ధర్మ సంస్థాపనము, క్షత్రియ పత్రిక, దేవాంగ జ్యోతి, అగ్నికుల ప్రకాశిక, కమ్మకుల పత్రిక, కమ్మ పత్రిక, రెడ్డి రాణి, వైశ్య, కాపు, దేవాంగ పత్రిక, తెలగ, బ్రాహ్మణ పత్రిక, ...కాంధ్ర, ఆది క్షత్రియ పత్రిక, ఆర్యవైశ్య, తెలగ సంఘాభివర్ధని, దేవాంగ సేవ, భట్టరాజ పత్రిక, వాసవి వైశ్యవాణి, రాజపుత్రాభివర్ధని, అగ్నికుల ప్రబోధిని, రెడ్డి కుల ప్రభ, దీనబంధు, భారతీయ వైశ్య, రెడ్డి పత్రిక, రెడ్డి, వాసవి, ఆది ఆంధ్ర, ఆది వెలమ,

ఉదయార్ పత్రిక, గౌడ పత్రిక, నవజీవన్, రెడ్డి ప్రభ, విప్రకుల దర్పణము, సెట్టి బలిజ సుందరి, హరిజన్, దక్కన్ వైశ్య వంటి వివిధ కులాల పత్రికలు వెలువడ్డాయి.

## iv. వైజ్ఞానిక పత్రికలు

తెలుగులో మొదటి నుంచీ అన్ని రకాల పత్రికలు నెలకొంటూ వచ్చాయి. ఆంగ్లో - తెలుగు పత్రికలు ప్రారంభమైన కొద్ది కాలానికి కందుకూరి వీరేశలింగం తెలుగు పత్రికా రచనపై తమ కాంతిని ప్రసరింపజేయడం జరిగింది. ఆయన కృషి వల్లనే తెలుగులో 'వివేక వర్ధని' వంటి సమగ్ర పత్రికలు 'సతీహితబోధిని' వంటి స్త్రీలు పాటించవలసిన సూత్రాలను గురించిన వైజ్ఞానిక పత్రికలు, సాహిత్య పత్రికలు, సంఘ సంస్కరణ పత్రికలు వచ్చాయి. ఆ మార్గంలో అన్ని రకాల పత్రికలు వచ్చాయి. తెలుగు వారిలో వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించి జ్ఞాన తృష్ణను తీర్చిన పత్రికలు అనేకం ఉన్నాయి. అటువంటి పత్రికల్లో కొన్నింటిని విపులంగా తెలుసుకుందాం.

### a. విజ్ఞాన వర్ధని

'విజ్ఞాన వర్ధని' తొలి తెలుగు విజ్ఞాన పత్రికగా 1894లో ప్రారంభమైంది. పూర్తిగా విజ్ఞాన శాస్త్రానికే అంకితమైన ఈ పత్రికను రాయదుర్గం నుంచి యల్లమరాజు నారాయణమూర్తి ప్రచురించారు.

### b. సతీ హిత బోధిని

కందుకూరి వీరేశలింగం గారు రాజమండ్రి నుంచి స్త్రీలలో వైజ్ఞానిక దృక్పథం పెంపొందించేందుకు నడిపిన పత్రిక ఇది. సతీహిత బోధినిని తొలి స్త్రీల పత్రికగా కూడా కొందరు పేర్కొంటున్నారు.[27] 1883 నాటి సంచికలు గౌతమి గ్రంథాలయంలో ఉన్నాయి. స్త్రీల శారీరకారోగ్య సంబంధమైన సమస్యలు, పిల్లల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి విషయాలు ఈ పత్రికలో చోటు చేసుకునేవి.

### c. పురుషార్థ ప్రదాయిని

1865లో ఉమా రంగనాయకులు అధ్యక్షతన మచిలీపట్టణంలో ప్రారంభమైన దైవ సమాజం పక్షాన 1872 జనవరిలో ఈ మాసపత్రిక ప్రారంభమైంది. దీన్ని 'దైవ

---

27. తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం పు. 150

సమాజిని' అనీ, 'తత్త్వ ప్రకాశిని' అనీ పిలిచేవారు. ఇది చాలా గొప్ప ఆశయాలు కలిగిన పత్రిక. తెలుగులో అన్ని శాఖల్లో కూడా విరివిగా సాహిత్యం అభివృద్ధి చెందాలని ఈ పత్రిక ఆశయం. తెలుగులో వచనంలో విజ్ఞాన విషయాలు రాయవలసిన అవసరాన్ని గురించి పత్రికలో 1872 లోనే శరీర శాస్త్రాన్ని ఈ పత్రికలో వ్యాసరూపంలో వెలువరించారు. అనేక ఆంగ్ల గ్రంథాలను పరిశీలించి ఈ వ్యాసాలు రాశారు. ఆ ఏడాది అక్టోబర్‌లో ప్రచురించిన దేహారోగ్యలక్షణము, పేశల వివరణము, నవంబర్‌లో ప్రచురించిన దేహారోగ్య లక్షణము, నాడీ వివరణము, డిసెంబర్ సంచికలో ప్రచురించిన దేహారోగ్య లక్షణము, రుధిర వివరణము మొదలైన వ్యాసాలు ఉత్తమ శ్రేణికి చెందినవి. అలాగే ప్రకృతి శాస్త్రం, జ్యోతిషశాస్త్రం వంటి అంశాలకు సంబంధించిన వ్యాసాలను కూడా 'పురుషార్థ ప్రదాయిని' ప్రచురించింది.

జ్ఞాన వినోదిని, జనానా, బుధవిధేయ, విజ్ఞాన వర్ధని, ధీరంజని, ప్రబుద్ధాంధ్ర, బుద్ధి ప్రదాయిని, బాలిక, జానపది, జ్ఞానోదయ, విజ్ఞాన వల్లిక, విజ్ఞాన వల్లరి, విజ్ఞానము, విజ్ఞాన ప్రపంచం తదితర వైజ్ఞానిక పత్రికలు వెలువడ్డాయి.

## v. ఆరోగ్య వైద్య పత్రికలు

తెలుగులో వైద్య సంబంధమైన విషయాలతో ప్రజలకు అనేక అనుసరణీయ విషయాలు తెలియజేసేందుకు పత్రికలు వచ్చాయి. వీటిల్లో ప్రధానంగా భారతీయ వైద్యంలో ప్రాచీనమైన ఆయుర్వేద విజ్ఞానాన్ని ప్రచారం చేసిన పత్రికలే ఎక్కువని చెప్పాల్సి ఉంటుంది.

### a. కౌమోదకి

1929లో కైవ సుబ్రహ్మణ్యశర్మ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు నంద్యాల నుంచి ఈ పక్ష పత్రికను నడిపారు. ఈ పత్రికలో ఆయుర్వేద వైద్యంతో పాటు జాతీయోద్యమానికి సంబంధించిన విషయాలు కూడా ప్రచురించేవారు. హరి సర్వోత్తమరావు గారు 'సాభిప్రాయ వార్తలు' అనే శీర్షిక కింద ఆనాటి ప్రభుత్వ నిర్బంధ విధానాలు, ఉప్పు సత్యాగ్రహ వార్తలు, విశేషాలను వివరిస్తూ దేశభక్తిని ప్రేరేపించేవారు. కృష్ణదేవరాయల పట్టంపు ఉత్సవ ప్రత్యేక సంచికల్ని కూడా ప్రచురించేవారు.

## b. ధన్వంతరి

మహా మహోపాధ్యాయ, ఆయుర్వేద భూషణ డాక్టర్ వేటూరిశంకరశాస్త్రి గారి సంపాదకత్వాన 'ధన్వంతరి' ముక్త్యాల నుంచి వెలువడింది. సుమారు మూడు దశాబ్దాలకు పైగా ఆయుర్వేదానికే గాక సాహిత్యంలోని వివిధ శాస్త్రాల పరిశోధనకై కూడా ఈ పత్రిక కృషిచేసింది. ఈ పత్రిక కొన్ని ప్రాచీన వైద్య గ్రంథాలను ధారావాహికంగా ప్రచురించింది. మహా వయ్యాకరణుడు ఎలకూరి బాలసరస్వతి రచించిన శరీరం అనే శుశ్రుత శారీర ఆంధ్ర పద్యానువాదాన్ని సంస్కరించి తాను ఇందులో ప్రచురించినట్లు తిరుమల రామచంద్ర పేర్కొన్నారు.[28]

వైద్య పత్రికల్లో పేర్కొన దగినవి. . . . ఆరోగ్య ప్రబోధిని, జంతువర్తమానసారం, ఆరోగ్యము, శ్రీ ధన్వంతరి, ఆయుర్వేద పత్రిక, ఆయుర్వేద చంద్రిక, ఆరోగ్య ప్రకాశిక, ఆంధ్ర వైద్య పత్రిక, ఆంధ్ర వైద్య సమ్మేళన పత్రిక, సదారోగ్యము దంతక్షేమము, ఆరోగ్య ప్రకాశిని, ప్రకృతి, సరస్వతీ వైద్య పత్రిక, సంజీవి, గోభూమి, ఆంధ్రహోమియోపతి, పశు సంరక్షిణి, వైద్య ప్రదీపిక మొదలైనవి.

## vi. విద్యా పత్రికలు

తెలుగులో విద్యా పత్రికలకు కొదవలేదు. ప్రాథమిక పాఠశాల విద్య, ఉపాధ్యాయుల అవగాహన పెంపొందించే దిశలో విద్యాపత్రికలందించిన కృషి చెప్పుకోదగినటువంటిది. గ్రంథాలయోద్యమానికి కూడా పత్రికలు ఊతం కల్పించి ఉద్యమ స్ఫూర్తికి గట్టి ప్రచారం కల్పించాయి. తద్వారా భాషా, సాహిత్యాలకు వ్యాప్తిని చేకూర్చి పఠనాసక్తిని, అక్షరాస్యత వృద్ధిని సంతరించి పెట్టాయి.

## a. తెలుగు జనానా

ఈ పత్రికను తొలుత మల్లాదివెంకటరత్నంగారు ప్రారంభించారు. తరువాత రాయసం వెంకట శివుడు గారు స్వీకరించి నిర్వహించారు. ఈ పత్రికా కాలాన్ని 1893 - 1904; 1906 గా తిరుమల రామచంద్ర పేర్కొంటున్నారు.[29] అంటే 1893 నుంచి

---

*28. తెలుగు పత్రికల సాహిత్య సేవ పు. 127*

*29. " " పు. 35*

1904 వరకు నడిచి మధ్యలో ఒక సంవత్సరం ఆగిపోయి తిరిగి 1906లో ఒక సంవత్సరం పాటు మొత్తం 12 సంవత్సరాలు నడిచినట్లుంది. కందుకూరి వీరేశలింగం, వావిలాల వాసుదేవశాస్త్రి ఇందులో రచనలు చేసేవాళ్లు. ఈ పత్రిక ప్రచురించిన ఒక వార్తా వ్యాఖ్య వల్ల అప్పటి బాలికా పాఠశాలల వివరాలు తెలుస్తున్నాయి :

"చెన్నపురి రాజధాని[30] లో నుండు బాలికా పాఠశాలల్లో 1897 - 98 సంవత్సరములో మన చెన్నపురి స్త్రీలకును బాలికలకును విద్యగరపుట కేర్పడి యుండిన పాఠశాలలివియని ప్రభుత్వము వారు ప్రచురించిరి. పాలంకోటలో నొక రెండవ తరగతి పాఠశాల గలదు. సారాటకర్ కాలేజియను పేరుగల్ల దానినొక క్రైస్తవ సంఘము వారు జరుపుచున్నారు. మన రాజధానిలో ప్రవేశ పరీక్ష వరకును జెప్పు పెద్ద పాఠశాలలు 21 గలవు. దీనిలో చెన్నపురిలో నుండు ఉపాధ్యాయినుల బోధనాభ్యసన పాఠశాల యొకటి మాత్రమే దొరతనము వారి పరిపాలనలో నున్నది. తక్కిన 20 పాఠశాలలను క్రైస్తవ సంఘాల వారును, క్రైస్తవులును జరుపుచున్నారు. ఇక లోవరు సెకండరీ పరీక్ష వరకును జెప్పు పాఠశాలల సంఖ్య 185. వీనిలో 115 క్రైస్తవుల యాజమాన్యము కిందను, 45 ప్రభుత్వము వారి పరిపాలనములోను, 1 జిల్లా సంఘం వారి పోషణనందును ఉన్నవి. మిగిలిన 24 మాత్రమే జనులు జరుపుతున్నారు. మన రాజధానిలో 851 ప్రైమరీ పాఠశాలలు గలవు. వీనిలో 385 పాఠశాలలను క్రైస్తవులును, 112 ప్రభుత్వము వారును, 23 బోర్డు వారును, 31 స్వదేశీయులును స్థాపించి నడుపుతున్నారు."

విద్యా సంబంధమైన పత్రికల్లో పేర్కొనదగినవి. జనవినోదిని, విద్యార్థి కల్పభూజము, ఉపాధ్యాయోపయోగిని, సకలార్థదాయిని, ఉపాధ్యాయోపకారి, శారద, విద్యావతి, ప్రారంభ విద్య, ప్రథమ పాఠశాల పత్రిక, గురుబోధిని, ప్రాథమిక విద్య, గ్రంధాలయ సర్వస్వము, విద్యానిధి, విద్యాకల్పము, ఉపాధ్యాయబోధిని, గౌతమి గ్రంథాలయోద్యమం, విద్యాభివర్ధని, గ్రామోపాధ్యాయుడు, ప్రాథమిక విద్య, ఆంధ్ర రాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ పత్రిక, గ్రామ గురూపదేశిని, ధర్మగ్రంథాలయపత్రిక, పాఠశాలపత్రిక, విజయనగర మహారాజకళాశాలపత్రిక, విద్యార్థి, ఆంధ్రవిద్యాభివర్ధని, విద్యాపత్రిక, ఆంధ్రరాష్ట్రప్రాథమిక విద్య, ఉపాధ్యాయ పత్రిక, విద్యానంద, ఉపాధ్యాయుడు, ప్రథమ పాఠశాల, అవర్

---

*30.* మద్రాసును చెన్నపురి అనేవారు.

స్కౌట్. ఆంధ్ర రాష్ట్ర ప్రారంభ విద్య, ఆంధ్ర విద్యాసమ్మేళన పత్రిక, కళాజ్యోతి, ప్రాథమిక పాఠశాల, యువకళ, వ్యాయామకళ, శిల్ప సమ్రాట్, సండే స్కూల్ లెసన్స్, తెలుగు విద్యార్థి మొదలైనవి.

## vii. స్త్రీల పత్రికలు

తెలుగులో తొలి మహిళాపత్రికారచయిత్రి శ్రీమతి పోతం జానకమ్మ అని తెలుస్తోంది. 'తెలుగు జర్నలిజం - అవతరణ, వికాసం' లో డా. వి. లక్ష్మణరెడ్డి ఇచ్చిన వివరం ఈ విషయాన్ని సమర్థించేదిగా ఉంది. తెలుగులో తెలిసిన తొలి స్త్రీల పత్రిక 'సతీ హిత బోధిని.' స్త్రీలకు దైనందిన సమస్యలకు సంబంధించిన విషయాలను బోధించడంతో పాటు ఈపత్రిక అనేకవిధాలా మహిళాభ్యుదయ వ్యాసాలు ప్రచురించింది. ఈ పత్రికను కందుకూరి వీరేశలింగం గారు 1883లో ప్రారంభించి రాజమండ్రి నుంచి మూడేళ్లపాటు నడిపారు. తెలుగులో పత్రికా సంపాదకత్వం నెరపిన తొలి మహిళగా డ్రైడను దొరసానిని పేర్కొంటున్నారు. తర్వాత పలువురు మహిళలు పత్రికా రచన చేపట్టారు. బాలాంత్రపు శేషమ్మ, పులుగుర్త లక్ష్మీ నరసమాంబ, వేలూరి శేషమాంబ ప్రభృత విదుషీమణులను పేర్కొనవలసి ఉంటుంది.

పత్రికల ద్వారా మహిళాభ్యుదయ సాధనకు ప్రథమ పథ నిర్దేశం చేసింది కందుకూరి వీరేశలింగం గారే. ఆ తర్వాత ఆయన మార్గాన్ని పలువురు అనుసరించారు. 'సతీహిత బోధిని' తర్వాత మహిళల స్థితి గతులు మెరుగుపరచే ఆశయంతో కృషి చేసిన పత్రిక 'జనానా.' ఈ పత్రికను తొలుత మల్లాది వెంకటరత్నం, రాయసం వెంకటశివుడు నడిపారు, తర్వాత దీని నిర్వహణ బాధ్యతను వీరేశలింగం గారు వహించారు. స్త్రీ జనాభ్యుదయ గామి పత్రికలు 19వ శతాబ్దం చివరి పాదంలోనే ప్రారంభమైనాయి.

### a. హిందూ సుందరి

మహిళల నిర్వహణలో మహిళల సంపాదకత్వంలో మహిళా సమస్యల కోసం వెలువడిన తొలి మహిళా పత్రిక హిందూ సుందరి.[31] ఈ పత్రిక 1902 జూన్‌లో శ్రీమతి మాడభూషి చాడమ్మ, శ్రీమతి కళ్లేపల్లి వెంకట రమణమ్మల సంపాదకత్వంలో కాకినాడ

*31. తెలుగు పత్రిక సాహిత్య సేవ - తిరుమల రామచంద్ర పు. 48*

నుంచి ప్రారంభమైంది. దాదాపు 15 సంవత్సరాలకు పైగా కొనసాగింది. ఈ పత్రికలో రచయిత్రులందరూ మహిళలే కావడం విశేషం. ఈ పత్రికకు వివిధ విషయాలపై వ్యాసాలు రాసేవారు దాదాపు 100 మంది మహిళలుండే వారంటే మరీ విశేషం. వారిలో కొందరు : శ్రీమతులు కందనపల్లి కనకమ్మ, గూడపాటి లక్ష్మీనరసమ్మ, బుర్రా బుచ్చి బంగారమ్మ, కొటికల పూడి సీతమ్మ, వింజమూరి వెంకటరత్నమ్మ, ఆదుర్తి భాస్కరమ్మ, దామెర్ల సీతమ్మ, మోటుపల్లె రాజా బాయమ్మ, మల్లాది లక్ష్మీదేవమ్మ, నడుపల్లె బుచ్చి వెంకట సుబ్బమ్మ, జూలూరి తులశెమ్మ, మామిడన్న కామేశ్వరమ్మ, పిల్లారి శెట్టి లక్ష్మీకాంతమ్మ, బులుసు సూరమ్మ, ఇప్పగుంట వెంకమాంబ, చోడి గుడి సీతమ్మ, యర్రగుంట జనార్దనమ్మ.

11వ సంపుటం రెండవ సంచికలో సంపాదకురాలి విన్నపం ఇలా ఉంది : "ఈ సంచికయందు శ్రీమతి కాశీనాథుని రామాబాయమ్మ గారి చిత్రపటమును వేసియున్నారము. గతమాసమునందు బంపియున్న కె. కనకమ్మ గారి పటపు చరిత్రము నీ సంచికయందు వేరొకచో చూడగలరు. రామాబాయమ్మ గారి చరిత్రము పూర్తిగా లభింపమికి మిక్కిలి చింతించుచున్నారము.

ఈమె గడచిన నాలుగు సంత్సరాల నుండి నిరాఘాటముగా వెలువడుచున్న ఆంధ్ర పత్రికారాజము యొక్క అధిపతులగు శ్రీయుత నాగేశ్వరరావు పంతులు గారి యొక్క సహధర్మచారిణి. మిక్కిలి చక్కగ బండిన వరి తలల భారముచే గట్లపైకి వంగిన మాడ్కి ఈ విదుషీమణి విద్యచ్ఛక్తి, సౌశీల్యము మున్నగువానిచే గనబఱచు శాంత స్వభావము, నమ్రభావము ప్రశంసార్హమైనవి.

ఈమె గడచిన మార్చి నెల 21వ తేదీని బందరులో జరుపబడిన ఆంధ్ర మహిళాసభ కగ్రాసనాధిపత్యము వహించి యిచ్చిన గంభీరోపన్యాసము మా చదువరులకు పంపించియే యున్నారము. ఇట్టి స్త్రీ రత్నములింకను బయలు వెడలినగాని భారత వర్షమభివృద్ధి గాంచనేరదు. స్త్రీ విద్యాభిమానము గల సోదరీమణులందఱు నిట్టి స్త్రీ రత్నముల ఛాయాపటములు దయచేసి మాకు పంపి ప్రోత్సాహమివ్వగలందులకు ప్రార్థించుచున్నారము.

శ్రీ విద్యార్థినీ సమాజము శ్రీమతి బండారు అచ్చమాంబగారి స్థాపన మగుటచేతను

ఆమె స్థాపించిన మొలకయభివృద్ధి సూచకమయి పత్రికా నిర్వహణ మొనరించు శక్తిగలదగుట చేతను 'హిందూ సుందరి' యామెకు ప్రియపత్రికారత్నమగుట చేతను యింతటి నుండి నెలనెల శ్రీ సుందరి అచ్చమాంబగారిని ముందిడుకొని గృహే గృహే నీతులు బోధింపవెలువడుచుండును. ఈ సంచిక యందలి రామబాయమ్మ గారి యొక్కయు, కె. కనకమ్మ గారి యొక్కయి చిత్రపటముల దిమ్మ (బ్లాకు)లను దయచేసిన ఆంధ్రపత్రికాధిపతు లెంతయు వందనీయులు."

పైన పేర్కొన్న సంపాదకురాలి విన్నపాన్ని బట్టి మహిళాభ్యున్నతికి ఆదర్శంగా స్వీకరించగల వారిని పాఠకులకు పరిచయం చేసి స్ఫూర్తి కలిగించేవారని తెలుస్తోంది.

1913 జూలై సంచికలోనే బందరులో జరిగిన ఆంధ్ర మహిళా సభలో శ్రీమతి కంచనపల్లి కనకమ్మగారి 'సంఘలాభములు' అనే ప్రసంగం, శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మ గారి 'బాలికా వివాహములు' ప్రసంగంలో కొంతభాగం, శ్రీమతి కొటికెలపూడి సీతమ్మగారి 'సత్కారోత్సాహము' అనే ప్రసంగం ప్రచురితమయ్యాయి.

స్త్రీల సమస్యల పట్ల స్త్రీలే ఆసక్తితో, శ్రద్ధతో, వివేచనతో దీనిలో వ్రాసిన వ్యాసాలు అనేకం నేటికీ ప్రయోజనకరంగా కనిపిస్తాయి. ఈ సంచికలోనే శ్రీమతి జి. రామలక్ష్మమ్మ గారు రాసిన 'శ్రీ భజగోవింద శ్లోకార్థ వచనము' అప్పటి మహిళల పాండిత్యానికి తార్కాణం.

ఈ పత్రిక విదేశాలలో జరిగిన స్త్రీలకు సంబంధించిన సంఘటనలను కూడా ప్రచురించేది.

## b. గృహలక్ష్మి

రాజామంత్రిప్రగడ భుజంగరావు 1903లో ఏలూరు నుంచి ఈ మాసపత్రికను నడిపారు. పత్రికకు నందిరాజు చలపతిరావు సంపాదకునిగా ఉండేవారు. ఆంధ్రస్త్రీల అభ్యుదయానికి అనువైన సచిత్ర వ్యాసాల్ని ఈ పత్రిక ప్రచురించేది. ఈ పత్రికలో బాల విజ్ఞానానికి కూడా అవకాశం ఏర్పరచారు.

## c. సావిత్రి

పులుగుర్త లక్ష్మీనరసమాంబ 1904 జనవరిలో కాకినాడ నుంచి ప్రారంభించి 'సావిత్రి' మాస పత్రికను నడిపారు. అయితే 'సావిత్రి' ని సంపాదకురాలు నరసమాంబ మహిళాభ్యుదయ వ్యతిరేక భావాల ప్రతిబింబంగా నడపడం విచిత్రం. ఆమె సనాతన

దృక్పథానికి పట్టం గట్టి వితంతు వివాహాది సరేషు సంస్కరణలకు వ్యతిరేకంగా పత్రికను తీర్చారు. వీరేశలింగం గారి సంస్కరణోద్యమంపై ధ్వజమెత్తారు. ఈమె సంస్కరణ వ్యతిరేకి అయినప్పటికీ స్త్రీ విద్యా ప్రచారాభిలాషి

### d. గృహలక్ష్మి

స్త్రీ జనాభ్యుదయ లక్ష్యంతో 1927లో మద్రాసు నుంచి ఇది మాసపత్రికగా వెలువడింది. డా. కె. ఎస్. కేసరి ఈ పత్రికను నడిపారు. స్త్రీలకు సంబంధించిన శీర్షికలకు, వారి రచనా వ్యాసంగానికి దోహదం కలిగించిన పత్రిక ఇది. ఇందులో ప్రప్రథమంగా మహిళలకు సంబంధించిన ప్రత్యేక శీర్షిక "శారద లేఖలు" ను శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ నిర్వహించారు. ఆంధ్ర వనితా లోకానికి ఈ 'గృహలక్ష్మి' పత్రిక ఎంతో బలాన్ని చేకూర్చింది. పత్రిక కల్పించిన ప్రోత్సాహాన్ని ఆధారం చేసుకొని ఎక్కువ సంఖ్యలో స్త్రీలు అక్షరాస్యులుగా మారడంతో పాటు కవిత్వం అల్లే స్థాయికెదిగారు. 1930 సెప్టెంబర్ సంచికలో ప్రచురించిన వ్యాసాల్లో కనుపర్తి లక్ష్మమ్మ శీర్షిక 'శారద లేఖలు'తో పాటు ఆమె శారదా చట్టాన్ని గురించి చర్చించిన వ్యాసం, ఆంధ్రశేషగిరిరావు గారి 'విజయరాఘవనాయని రాణి', సామవేదం జానకి రామశర్మ గారి 'స్త్రీలుః సాహిత్య జ్ఞానము', పెమ్మరాజు సత్యనారాయణగారి 'హిందూధర్మశాస్త్రము : స్త్రీ వారసులు', అలూరు రామచంద్రయ్య గారి 'గర్భధారణ చిహ్నములు' మొదలయిన వ్యాసాలున్నాయి. విడాకుల చట్టం గురించి ప్రచురితమైన చర్చావేదికలో పద్నాలుగుమంది స్త్రీలు పాల్గొన్నారు. ఇంకా అనేకమంది రచయిత్రుల కథలు, విదుషీమణుల జీవిత చరిత్రలు, లోకవార్తలు, గ్రంథ విమర్శలు, కథలు, కబుర్లు మొదలైన ఆసక్తికరమైన విషయాల్ని ఇందులో పొందుపరచారు

### e. సౌందర్య వల్లి

గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారి సతీమణి శ్రీమతి రామాబాయి గురుస్వామి చెట్టి గారనే న్యాయవాది సహాయంతో ఈ పత్రికను నడిపారు. 1919లో మదరాసు నుంచి మాసపత్రికగా 'సౌందర్యవల్లి'ని వెలువరించారు. ఇందులో మహిళలెదుర్కొనే సమస్యలకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. సంఘ సంస్కరణకు, స్త్రీ విద్యావశ్యకతకు సంబంధించిన

సంపాదకీయాల ద్వారా ఈ పత్రిక మహిళాలోకంలో విజ్ఞాన వికాసాల్ని కలిగించేంధుకు కృషి చేసింది.

ఇతరత్రా చెప్పుకోదగిన స్త్రీ పత్రికల్లో : సుందరి, వివేకవతి, అనసూయ, స్త్రీధర్మ, ఆదిలక్ష్మి, హిందూ యువతి, భారత మహిళ, యశోద వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఆంధ్రజ్యోతి పత్రికల గ్రూపు నుంచి వనితాజ్యోతి, వనిత అనే మరో పత్రిక నడుస్తున్నాయి.

## viii. బాలల పత్రికలు

బాలసాహిత్యం, బాలలకోసం పత్రికలు నడిపే విషయంలో పెరుగుతున్న బాలల అవసరాల మేరకు ఇంకా కృషి జరపవలసిఉన్నప్పటికీ ఇప్పటివరకూ, ఇప్పుడూ జరుగుతున్న కృషి ఎన్నదగినది గానే ఉంది. తెలుగు పత్రికలలో సంఘ సంస్కరణ, రాజకీయాలు, మతం, సాహిత్యం వంటి విషయాలతోపాటు మహిళలకోసం బాలలకోసం పత్రికల్లో చోటు కల్పించడం, ప్రత్యేకంగా మహిళలు, బాలలకోసమే పత్రికలు నిర్వహించడం 19వ శతాబ్దం చివరి పాదం నుంచే ప్రారంభమైంది. 1875 నుంచి వి. కృష్ణమాచార్యులు మాసపత్రికగా నిర్వహించిన 'జనవినోదిని'లో పిల్లలకోసం 'చిట్లపొట్లకాయ', 'రంగు రంగు బిల్ల' వంటి పాటలు, కథలు ప్రచురించారు. తెలుగులో బాలల్ని దృష్టిలో ఉంచుకొని చేసిన తొలిప్రయోగం. 1908 నుంచి 1910 వరకు స్త్రీల పత్రికగా నడిచిన 'వివేకవతి'లో పిల్లలకు సులభ గ్రాహ్యమయ్యే విధమైన చిన్న కథలు ప్రచురించారు. మరో స్త్రీల పత్రిక 'అనసూయ'ను నడిపిన వింజమూరి వెంకటరమణమ్మ పిల్లలకోసం కృష్ణశాస్త్రి కథలు, గేయాలను ప్రచురించింది. 1940లో ఆంధ్రపత్రిక గ్రూపులోని 'భారతి'లో 'బాలానందం' అనే శీర్షికను బాలల కోసం ప్రారంభించారు.

### a. బాలకేసరి

1940 అక్టోబర్‌లో మేడిచెర్ల ఆంజనేయమూర్తి బెజవాడ నుంచి ప్రారంభించిన 'బాలకేసరి' తొలి తెలుగు బాలల పత్రిక. "ఇందు బాలురు బాలికలకు సంబంధించిన ప్రత్యేకపు సబ్జక్టులపైన, క్రీడలపైనను, కట్టుకథలపైనను, పండగలపైనను, మృదుమధురములైన వ్యాసములు ప్రకటింపబడును." అని నిర్వాహకులు ప్రకటించడాన్ని బట్టి చూస్తే ఇది బాలల కోసం ప్రత్యేక పత్రిక అని తెలుస్తుంది. అదే విధంగా "ఈ

పత్రిక మూలమున బాలబాలికలలో నొకకొత్త యానందమును ఒక క్రొత్త ఉత్తేజమును, ఒక క్రొత్త శోభను, వెలయింపజేయవలయునని మా యుత్సాహము' అని సంపాదకులు పత్రిక రెండవ సంచికలో మనవి చేయడం కూడా గమనించదగింది.

ఈ పత్రికలో పెట్టిన శీర్షికలు కూడా వివిధ విషయాల్లో బాలల్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా రాసిన వ్యాసాలుగా స్పష్టమవుతున్నది.

## b. బాల

1945 ఆగస్టులో మరింత సమగ్రమైన 'బాల' పత్రికను న్యాయపతి రాఘవరావు (రేడియో అన్నయ్య), కామేశ్వరి (అక్కయ్య) గార్లు ప్రారంభించారు. బాలలకు విజ్ఞాన, వినోదాలు కల్పించేందుకు ఈ పత్రికను ప్రారంభించారు. బెంగాలీలో తప్ప మరే ప్రాంతీయ భాషలోనూ బాలలకోసం ప్రత్యేక పత్రిక లేదు. పైగా ఇటువంటి చిన్న పత్రికలు నడపడం కష్టదాయకంగా ఉన్న రోజుల్లో బాలపత్రిక నిర్వహణలో, రచనల ఎంపికలో రాఘవరావు గారు తీసుకున్న శ్రద్ధ అది నాలుగు కాలాలపాటు నిలవడానికి దారితీసింది. చిట్టిపొట్టి మాటలతో గేయాలను, కథలను ప్రచురించి బాలల ఆదరణను చూరగొనడంతో పాటు వారి మనసులు దోచుకున్నారు. బాలల కోసం ప్రత్యేక శీర్షికలు ప్రవేశపెట్టడంలో, కొత్త కొత్త ప్రయోగాలు చేయడంలో 'బాల' తనకు మరో పత్రిక సాటిరాదని నిరూపించుకుంది. పత్రికను క్రమం తప్పక చదివే అసంఖ్యాక బాలపాఠకులను, పత్రికకోసం వివిధ రకాల రచనలు చేయగల బాలరచయితలను, చిత్రకారులను 'బాల' తయారు చేసింది.

## c. చందమామ

బాలల పత్రికలలో చందమామ మకుటాయమానంగా నిలిచింది. అంతకు ముందు 'బాల' పత్రిక తెచ్చిన విప్లవాన్ని అనేక రెట్లు పెంచింది. తెలుగు పత్రికకు 'చందమామ' జాతీయఖ్యాతినార్జించి పెట్టింది. 1946 నుండి మద్రాసు నుంచి నాగిరెడ్డి, చక్రపాణి వెలువరిస్తున్న ఈ పత్రిక సంస్కృతం, సింహళితో సహా అన్ని భారతీయ భాషల్లోనూ వెలువడుతూ ఏకరూపతను, బాల భావ సమైక్యతను సాధించింది. తెలుగు కథల మాధుర్యం, సౌందర్యం ఎల్లలు దాటి విస్తరించింది. ఈరకంగా బాలల భావిమూర్తిత్వ

వికాసానికి, వారిలో జాతీయ సమైక్యతను పాదుకొల్పడానికి చందమామ చేస్తున్న కృషి చరితార్థమయ్యేదిగా ఉంది. ఇంగ్లీషులోనూ, అంధ బాలల కోసం బ్రెయిలీ లిపిలోనూ వెలువడుతున్నది. ముద్రణ ప్రమాణాల్లోనూ, చిత్రరచనలోనూ 'చందమామ' ప్రత్యేకతను సంతరించుకుంది. పెద్దలకు సైతం కొరుకుడు పడని కథలను పిల్లలకు సరళగ్రాహ్యమయ్యే విధంగా అందించడంలో పత్రిక సాధించిన ప్రగతి అసాధారణం. బాలల జర్నలిజంలో నాగిరెడ్డి, చక్రపాణి గార్ల సేవ అపూర్వం అద్వితీయం.

చెప్పుకోదగిన బాలల పత్రికలు : బాలబంధు, బాలమిత్ర, పాపాయి, బాలవినోదిని, బాలభారతి, కుమార బోధిని, బాలవిద్య, పిల్లల కాకితము, విశ్వజ్ఞాని, పూలతోట మొదలైనవి. బాలజ్యోతి, బొమ్మరిల్లు, బుజ్జాయి, ప్రమోద, మాబడి, పాఠశాల, విద్యాబాల, జాబిల్లి, బాలరంజని వంటి బాలల పత్రికలు ఈనాటికీ వెలువడుతున్నాయి. 'ఆంధ్రప్రభ' దినపత్రిక వారు ప్రతిశనివారం దినపత్రికతో పాటే బాలలకోసం ప్రత్యేకంగా 'చిన్నారి' అనే పత్రిక ఉచితంగా అందజేస్తున్నారు. 'వార్త' దినపత్రికకు అనుబంధంగా రోజూ 'మొగ్గ' అందజేస్తున్నది.

## ix. హాస్యపత్రికలు

హాస్యం హాసాన్ని కలిగించి మానసికంగా శారీరకంగా హాయిని గొల్పుతుంది. ఇది ఆరోగ్యదాయకమని కూడా వైద్యులు పేర్కొంటున్నారు. నవరసాల్లో హాస్యానికున్న ప్రాముఖ్యం చెప్పనే అవసరం లేదు. తెలుగులో ప్రత్యేకంగా హాస్యాన్ని అందించేందుకు పత్రికలు వచ్చాయి. అయితే సంఖ్యలోనూ, ప్రమాణాల్లోనూ హాస్యపత్రికల నడక ఆశించినంతగా, అవసరమైనంతగా లేదు. అయినప్పటికీ ఈ శతాబ్దం మొదటి పాదాంతం నుంచే అడపాదడపా హాస్య పత్రికలు వచ్చాయి.

### a. నవ్వుల తోట

1922 ఆగస్టు 1వ తేదీన బందరు నుంచి కోసూరు గురునాథమూర్తి మాసపత్రికగా ప్రారంభించిన 'నవ్వులతోట' హాస్యపత్రికల్లో చెప్పుకోదగింది. ఈ పత్రికలో 'సంపాదకీయ వ్యాఖ్యానాలు, కబుర్లు, వినోదములు, విలేఖరులకు ప్రత్యుత్తరములు, పద్యాలు (వ్యంగ్యం), పిట్ట కథలు, మాపుల బుట్ట విచిత్ర వార్తలు' - ఇలాంటి శీర్షికల కింద

జోకులు, వ్యంగ్య రచనలు మొదలైన వెన్నిటినో ప్రచురించారు. సంపాదకుడు కోసూరు గురునాథమూర్తే పలు విషయాలు రాసేవాడు. పత్రిక తొలిసంచికలో ఇలా రాశారు; 'నాటకములు, నవలలు, ప్రహసనములు, సరసములు, పరిహాసములు, వింతలు, వినోదములు, బిడ్డల ముద్దుమాటలు, హాస్యాపహాస్యములు, చతురోక్తులు, ముచ్చటలు, చిక్కులు, చిత్రకథలు, ఉపన్యాసములు, అవి యివి అననేల ప్రతిపలుకునకు నవ్వు పుట్టించు నవ్వులతోట అను మాసపత్రిక ప్రథమ సంచిక వెలువడింది. వెంటనే చందాదారులుగా జేరుడు. విషయముల జదివి యానందింపుడు. పత్రిక నుద్ధరింపుడు.'

ఆ మేరకు పత్రిక శక్తి వంచన లేకుండా కృషి చేసిందని తెలుస్తున్నది.

**b. ఆనంద వాహిని**

సుప్రసిద్ధ స్టూడియో అధినేత ఎస్. ఎస్. వాసన్ (మద్రాసు) సినిమా రంగంలోనే కాకుండా పత్రికా రంగంలో కూడా కృషి చేశారు. తమిళంలో 'ఆనంద వికటన్' అనే హాస్య పత్రికను ఆయన స్థాపించారు. తెలుగులో కూడా అటువంటి పత్రికను 'ఆనందవాహిని' పేర, 1930లో నెలకొల్పారు. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు ఈ పత్రికకు సంపాదకత్వం వహించారు. ఆయన సకలం పేరుతో కొన్ని, కలం పేరుతో కొన్ని రాసేవారు.

**1930** జనవరి 1వ తేదీన పత్రిక తొలి సంచికలోని 'స్వవిషయము' అని సంపాదకీయంలో వారు పత్రిక ఆశయాలను ఈ విధంగా తెలియజేశారు.

"హాస్య ప్రధానంగా ఈ పత్రిక ఉంటుంది. ఇందులో ఎవరినీ నిందించడం ఉండదు. ఎప్పటికప్పుడు లోకములో, స్వదేశములో, జరుగుతూ ఉండే అపూర్వ విషయములే యిందులో నవ్వులాటలతో వెల్లడించడమౌను. చిన్న చిన్న కథలు, కబుర్లు, మంచి మాటలు, పాటలు, పదాలు, పద్యాలు ప్రకటిస్తాము. ఇది కాంగ్రెస్ పత్రిక కాదు. జస్టిస్ పత్రిక కాదు. బ్రాహ్మణ పత్రిక కాదు. ఆదిమాంధ్ర పత్రిక కాదు. ఏదీ కాదుగాని అన్నీ ఔను. అందరి పత్రికా ఔను. అందరికీ అందుబాటులో ఉండడం కోసం చందా సం॥ ఒకటికి రూ. **1-0-0** (ఒక రూపాయ్) పెట్టినాము. ఆంధ్ర

మహాజనులందరు చందాదారులుగా తోడు పడవలసిందని, ఆనందమును కలిగించే విషయములు వ్రాసి ప్రకటనకు కూడా పంపి సహాయ పడవలసినదని వేడుకొంటున్నాము."

ప్రభాకర శాస్త్రి గారు రాసిన ఒక భార్యాభర్తల హాస్య సంభాషణ ·

"ఆలు - మగలు"

భర్త : ఇంకా వంట కాలేదూ! కాకుంటే నేను హోటలుకైనా వెళ్తా.

భార్య : పది నిమిషాలోర్చుకోరూ!

భర్త : అయితే పది నిమిషాల్లో వంట ఔతుందా ఏమిటి?

భార్య : కాదండీ! కాదు! నేనూ తమతో కూడ హోటలుకే వచ్చేస్తా."

**c. వినోదిని**

1940వ దశకంలో ఆర్. రంగనాయకమ్మ మదరాసు నుంచి మాసపత్రికగా ఈ పత్రికను నడిపారు. ఈ 'వినోదిని'లో జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి 'పిల్లి', మునిమాణిక్యం నరసింహారావు 'బహుముఖాల అద్దం', మొక్కపాటి నరసింహశాస్త్రి 'బి. వి. టప్పయ్య' లాంటి రచనలు వెలువడ్డాయి.

చెప్పుకోదగిన కొన్ని హాస్య పత్రికలు : ఆనంద చంద్రిక, ముద్దులు, చిత్రగుప్త, హాస్య మంజూష, ఆనంద బోధిని, నవ్వుల రాణి, చిత్రగుప్త మొదలైనవి. ఈనాటి పత్రికల్లో కార్టూన్లు, జోకులు వంటివి చోటు చేసుకుంటున్నాయి. వ్యంగ్య శీర్షికలు వస్తున్నాయి. ప్రత్యేకంగా హాస్య పత్రికలు మృగ్యం.

**x. సినిమా పత్రికలు**

భారతీయ సినిమా చాలా ముందడుగు వేసింది. భారతీయ భాషల్లో తెలుగు సినిమా ప్రత్యేకతను సంతరించుకున్నది. 1931లో 'భక్త ప్రహ్లాద'తో టాకీయుగం ప్రారంభమైంది. ఈ రోజు సినిమా ఒక బలమైన మీడియా. సమాజాన్ని చెప్పుకోదగిన స్థాయిలో ప్రభావితం చేస్తున్నది. కోట్ల రూపాయల పెట్టుబడి సినిమా పరిశ్రమ మీద పెడుతున్నారు. ఇక సినిమా పత్రికలను గురించి చెప్పాల్సి వస్తే సినిమా (టాకీ) అవతరించినప్పటి నుంచీ అంటే 1931 నుంచి అప్పటికి ఉన్న ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక

వంటి పత్రికల్లో కొంతస్థానం సినిమాలను గురించి రాసేందుకు కేటాయిస్తుండేవారు. అయితే ప్రత్యేకంగా సినిమా పత్రిక వచ్చింది 1937లోనే.

తెలుగు సినీ వైతాళికుల్లో ఒకరైన గూడవల్లి రామబ్రహ్మం విఖ్యాత పాత్రికేయుడు కూడా. ఆయన 'సమదర్శిని' పత్రిక నుంచి బయటికి వచ్చాక 'ప్రజామిత్ర'లో చేరారు. సినిమా విమర్శను ఆయన ఆ పత్రిక ద్వారానే మలుపు తిప్పారు. సినిమారంగంలో అప్పటికి దాదాపు పౌరాణిక యుగానిదే పై చేయి. సినిమాలు కళాత్మక విలువలతో పాటు వర్తమాన రాజకీయాలు, ఆర్థిక, సామాజికాంశాల్ని కూడా ప్రతిబింబించాలన్న నూతనాదర్శాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ ఆదర్శాన్ని తానే ముందు ఆచరించారు. చలనచిత్ర నిర్మాతగా, దర్శకునిగా అటువంటి చిత్రాలు నిర్మించారు. ఇది తెలుగు సినీ పత్రికా రచన గురించిన విషయం.

తెలుగులో తొలి సినిమా పత్రిక 1937లో ప్రారంభమైంది. ఇంటూరి వెంకటేశ్వరరావు 'స్వరాజ్య', 'బాంబే క్రానికల్' వంటి పత్రికల్లో పనిచేసి ఆ తర్వాత 'చిత్రకళ' అనే తొలి సినిమా పత్రికను స్థాపించారు. ఆయనే దానికి సంపాదకులు. సినిమా పితామహుడు హెచ్. ఎం. రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గూడవల్లి రామబ్రహ్మం తొలి సినిమా పత్రిక తొలి ప్రతిని విడుదల చేశారు. ఇంక సినిమా పత్రికలు ఆగలేదు.

సినిమా కళగా, పరిశ్రమగా రెండింటి కలబోతగా మేళవించుకుని ఎన్నో ఎత్తులు ఎదిగింది. ఇటు ప్రేక్షకుల అభిప్రాయాన్ని, అటు పరిశ్రమ తీరుతెన్నుల్నీ ప్రతిబింబిస్తూ ముందుకు సాగుతున్నది సినిమా జర్నలిజం.

ఇంటూరి ప్రారంభించిన 'చిత్రకళ' విశేష పాఠకాదరణ చూరగొన్నా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎంతో కాలం నడవలేదు. తర్వాత కొమ్మూరి వెంకట్రామయ్య దాన్ని పునరుద్ధరించి కొంతకాలం నిర్వహించారు. ఆ తర్వాత వెంకట్రామయ్య కుమారుడు కొమ్మూరి సాంబశివరావు 'తెలుగు సినిమా' అనే మరో మాసపత్రికను ప్రారంభించారు. తర్వాత ఎ. వి. సీతారామయ్య సంపాదకత్వంలో మరో సినిమా పత్రిక 'రూపవాణి' వెలువడింది. ఇంకా కె. సుబ్బారావు 'చిత్ర', రాఘవరావు 'చిత్రసీమ', పి. వి. రమణమూర్తి 'కొరడా', డా. అప్పారావు 'సూర్యప్రభ' వెలువరించారు.

1954లో చక్రపాణి గారు 'సినిమా' అనే ఆకర్షణీయమైన పత్రిక ప్రారంభించారు.

తర్వాత టి. వి. రామనాథ్ ప్రారంభించిన 'సినిమారంగం', గోటేటి రామారావు ప్రారంభించిన 'మధురవాణి' చెప్పుకోదగిన పత్రికలు. ఇంకా 'ఆంధ్రా హాలీవుడ్', 'సినిమా జ్యోతి', 'చిత్రమణి', 'చిత్ర లోకం', 'సినీవార్త', 'సినీడైరీ', 'సినీసుధ', 'ఫిల్మ్ స్టార్', 'తారాపథం', 'తరంగిణి', 'సినీరాణి', 'కళావాణి', 'నటన', 'గౌతమి', 'సినిమా', 'కాగడా', 'సినీజనత', 'సినీ మనిషి', 'వెండితెర', 'చిత్రాలయ', 'సినీహెరాల్డ్', 'శివరంజని' వంటివి వెలువడ్డాయి. ఈనాడు గ్రూపు నుంచి 'సితార', ఆంధ్రజ్యోతి గ్రూపు నుంచి 'జ్యోతిచిత్ర' ఈనాటికీ అత్యధిక సర్క్యులేషన్‌తో నడుస్తున్న సినిమా పత్రికలు.

1966లో మద్రాసు నుంచీ బి. నాగిరెడ్డి ప్రారంభించిన 'విజయచిత్ర' పక్షపత్రిక అత్యాధునిక ముద్రణ ప్రమాణాలతోనూ,రచన ప్రమాణాలతోనూ వెలువడుతున్నది.

మారుతున్న సినిమా పరిశ్రమ ధోరణులను గురించీ, పరిశ్రమలోని నటన, దర్శకత్వం, నిర్మాణం, నేపథ్యగానం, సంగీతం వంటి అన్ని అంశాలను ఎప్పటికప్పుడు సినీ ప్రేక్షకులకు ఈ పత్రికలు సచిత్రంగా తెలియజేస్తున్నాయి. ఇతర భాషా సినీ పత్రికలకు ఏమాత్రం తీసిపోకుండా తెలుగు సినీ పత్రికలు వెలువడుతున్నాయి.

## xi. కళలు, సాంస్కృతిక పత్రికలు

కళలకు ప్రాధాన్యత ఈనాటిది కాదు. కళా ప్రదర్శనలపై విమర్శ కూడా కొత్తది కాదు. అయితే సంగీత, నృత్య, నాటకాది కళారంగాల విషయాలు రాసే ప్రత్యేక పత్రికలు చెప్పుకోదగిన సంఖ్యలో లేవు. కారణాలు అనేకం. తెలుగు నాట మిషనరీల మత ప్రచారంతోనూ, దాన్ని ప్రతిఘటించి భారతీయ మతాల పరిరక్షణ ప్రచారంతోనూ పత్రికలు వచ్చాయి. సాంఘిక దురాచారాల వల్ల కలిగిన అనర్థాలకు వ్యతిరేకంగా వచ్చిన సంఘ సంస్కరణ ఉద్యమాలను అనుసరించి సాంఘిక పత్రికలు, జాతీయోద్యమం, స్వాతంత్రోద్యమాల ప్రచారంతో పాటు బ్రిటిషు పాలనను ప్రతిఘటించడానికి రాజకీయ పత్రికలు వచ్చాయి. ఈ విధంగా కళా సాంస్కృతిక రంగాలకు సంబంధించినంతవరకూ ఎటువంటి ఉద్యమాలూ రాలేదు. కాబట్టి ప్రత్యేకంగా ఎక్కువ సంఖ్యలో కళలకు సంబంధించిన పత్రికలు రాలేదు. కొన్ని మాత్రమే వచ్చాయి. అవీ అభిరుచి కలిగిన రచయితలూ సంపాదకుల ప్రత్యేక శ్రద్ధ ఫలితంగానే వచ్చాయి. వాటి గురించి తెలుసుకుందాం.

## a. కళ

ప్రముఖ న్యాయవాది తర్వాత మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ పాకాల వేంకట రాజమన్నారు గారు 1924లో 'కళ' అనే పత్రికను స్థాపించారు. ఇది కళాసేవ కోసం మద్రాసు నుంచి నడిచిన పత్రిక. ఇందులో మానవల్లి రామకృష్ణ కవి, కొమర్రాజు లక్ష్మణరావు వంటి పరిశోధకులు వ్యాసాలు రాసేవారు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు దీనికి పరోక్ష సంపాదకులు. ఆయన ఈ పత్రికలో నాటక కళ మొదలైన వ్యాసాలే గాక నాటక ప్రదర్శనలపై సమీక్షలు కూడా రాసేవారు. 'కళ'కు ప్రభాకరశాస్త్రి గారు చేసిన సేవను రాజమన్నారు గారు పుస్తక ప్రపంచంలో 'నా కొత్త పంథా' అనే వ్యాసంలో ఇలా ప్రశంసించారు.

"కళ పత్రిక ద్వారా నాకు పరిచితులైన మహనీయుల్లో వేటూరి ప్రభాకరశాస్త్రి గారొకరు. అతని పరిశోధన సామర్థ్యం, అతని సామర్థ్యం, అతని సాహిత్య విమర్శ ప్రావీణ్యం అసమానం, అతడు విద్వాంసుడే కాదు. రసికుడు సహృదయుడు కూడ. అతని ప్రతిభను కొత్త మార్గంలో వినియోగించడానికి నేను పూనుకున్నాను. అదృష్టవశాత్తు నా యత్నం సఫలమైంది. నాటక ప్రదర్శనం గురించి వారిచే వ్యాసాలు వ్రాయించాను. అప్పుడు ఏలూరు నాటక సమాజం వారు మద్రాసులో నాటకాలు ప్రదర్శించారు. సావిత్రి, శకుంతల, రాధాకృష్ణ (పానుగంటి వారిది), కృష్ణ తులాభారం మొదలైనవి. ఆనాటకాల్లో పాల్గొన్న నటవర్గంలో చేరిన ప్రఖ్యాత నటులు యడవల్లి సూర్యనారాయణ, అద్దంకి శ్రీ రామమూర్తి, ఉప్పులూరు సంజీవరావు, పారుపల్లి సుబ్బారావు మొదలైనవారు. వీరి అభినయాన్ని విమర్శిస్తూ వ్యాసం రాశారు 'కళ' కోసం ప్రభాకర శాస్త్రి గారు. నా ప్రార్థన పాటించి నిష్పాక్షికంగా, నిర్భయంగా, నిశితంగా రచించిన వీరి విమర్శ ఒక చిన్న తుపాను లేవదీసింది. వీరి అభిప్రాయాన్ని కొందరు ప్రశంసిస్తూ కొందరు ఖండిస్తూ వ్యాసాలు రాశారు. ఒకటి రెండు అట్టివి. 'కళ' లో ప్రకటించాను. కొన్ని ఇతర పత్రికల్లో పడ్డవి. ఇటువంటి నాటక ప్రదర్శన విమర్శములు పాశ్చాత్య దేశాల్లో సామాన్యంగా పత్రికల్లో ప్రచురించడం సువిదితం. అయితే తెలుగు పత్రికల్లో 'కళ' దారి చూపిందని నా [illegible]కం. శాస్త్రిగారి వంటి విమర్శ కాగ్రేసరుల సాహాయ్యం లేకపోతే నేనీ కొత్త పంథా తొక్కడానికి సాహసించేవాణ్ని కాను. ఈ విషయంలో శాస్త్రిగారు చేసిన ఉపకారం మరచిపోలేను. . . "

### b. నాట్యకళ

1955లో ప్రాచ్య పాశ్చాత్య నాట్య రీతులలో నిష్ణాతుడైన శ్రీనివాస చక్రవర్తి ఈ 'నాట్యకళ' మాసపత్రికను ప్రారంభించారు. రంగస్థల నాటక, నాట్య కళలపై ఈ పత్రిక వ్యాసాలు రాసేది. ఈ నాట్యకళ రంగస్థల శాస్త్రానికి అభినయ శాస్త్రానికి విశిష్టమైన సేవ చేసి ఆగిపోయింది. తర్వాత ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక ఆకాడమీ ఈ పత్రికను పునరుద్ధరించింది. అప్పుడు కూడా శ్రీనివాస చక్రవర్తి గారే దీనికి సంపాదకత్వం వహించారు.

తెలుగులో ఇంకా ప్రత్యేకంగా వెలువడిన కళా సాంస్కృతిక పత్రికల్లో పేర్కొనదగినవి : మనోరంజని, సంగీత పత్రిక, గంధర్వ, మారుతి కళ, నాటక కళ మొదలైనవి.

ఈనాడు ప్రత్యేకంగా కళకోసం పత్రికలు అవసరం లేని పరిస్థితి వచ్చింది. దాదాపు అన్ని దినపత్రికలు, వారపత్రికలు కళావిమర్శ, ప్రశంస రాస్తున్నాయి. కళలు, సాంస్కృతిక విశేషాలు రాయని సంచిక ఉండడం లేదు. ఇందువల్ల కళా సాంస్కృతిక రంగాలకు ప్రయోజనం కూడ చేకూరుతోంది.

## xii. వ్యవసాయ పత్రికలు

### a. 'మా రయితు పత్రిక'

ఈ పత్రిక సంచికలు అందుబాటులో లేవుగాని 1906 డిసెంబర్ 7వ తేదీ నాటి 'శశిలేఖ' పత్రికలో రయితు పత్రిక గురించి ఇలా ఉంది :

"మా డిసెంబర్ సంచికతో 'మా రయితు పత్రిక'కు రెండవ సంవత్సరం నిండినది. ఈ రెండు సం॥లో మేము ప్రథమములో జెప్పినటుల మాశక్తి యుక్తులను వినియోగించి దీని జరిపితిమి. రచయితలకు వలసిన ననేక విషయములను దీనిలో వ్రాసియున్నాము. చెన్నపురి రివిన్యూ బోర్డు వారు, చెన్నపురిలో నేర్పడిన సెంట్రల్ అగ్రికల్చరల్ కమిటీ వారు మాకు వారి బుల్లిటినులను, సర్క్యులర్లను బంపిరి. వీనినన్నిటిని తేటతెమగులో ముద్రించితిమి. అగ్రికల్చరల్ బుల్లిటిన్‌ను, సర్క్యులర్లను మిగుల స్వల్పకర్చుతో తెనుగులో వ్రాసి రయితులకు పంచి పెట్టుటకు మార్గమెద్దియని అనేక కృషి సభలు ఆలోచించుచున్నవి. ఇట్టి మార్గము ఈ రయితుకు చందాదారులగునటుల రయితులకు

బోధించుటేయని నొక్కి చెప్పుచున్నాము. ఈ చిన్న పత్రికలో ఒక బుల్లిటినులు సర్క్యులర్లే కాక, రయితులకు వలసిన యింక నెన్నియో విధములగు విషయములు వ్రాయబడుచున్నవి.

చందాదారులు 3వ సం॥ చందాలు దయచేయవలయునని మిగుల కోరుచున్నాము.

గ. శేషాచార్యులు
35, నారాయణ మొదలి వీధి,
చెన్నపురి.

**అన్నదాత**

ఈనాడు గ్రూపునుంచి వాసిరెడ్డినారాయణరావు సంపాదకత్వంలో హైదరాబాదు నుంచి వెలువడుతున్న ఈ మాసపత్రికలో పంటలసాగు పద్ధతులు, తెగుళ్ళ నివారణ, ఎరువుల వాడకం, భూసారపరిరక్షణ, చేపలు, కోళ్ళు, మేకలు, గొర్రెల పెంపకం మొదలైన అనేక విషయాలపై నిపుణులు రాసిన వ్యాసాలు, రైతుసందేహాలకు సమాధానాలు ప్రచురిస్తున్నారు. వ్యవసాయపత్రికల్లో దేశంలోనే ఎక్కువ సర్క్యులేషన్ సాధించిన పత్రిక ఇది.

వ్యవసాయానికి సంబంధించి ఇంకా వ్యవసాయము, కృషి, కిసాన్, రైతాంగము, పాడిపంటలు, రైతు పత్రిక, శ్రమ జీవి, సేద్యపు విద్య మొదలైన పత్రికలు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈనాడు గ్రూపు పత్రికల నుంచి 'అన్నదాత' అనే వ్యవసాయపత్రిక మంచి సర్క్యులేషన్‌తో వెలువడుతూ రైతులకు మిగుల ప్రయోజనకారిగా ఉంటున్నది.

## xiii. సహకార పత్రికలు

### a. సహకారము

1915లో సూరివేంకటనరసింహశాస్త్రి, అయ్యంకి వేంకటరమణయ్య, గూడూరి రామచంద్రరావు బెజవాడ నుంచి వెలువరించిన మాసపత్రిక 'సహకారము'. ఇది పూర్వం మద్రాసు నుంచి 'మదరాసు బులెటిన్ ఆఫ్ కో-ఆపరేషన్' పేరున ప్రచురితమైంది. ఆంధ్ర సహకార సమ్మేళనం స్థాపితమైన తర్వాత భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి సంపాదకత్వాన బందరు నుంచి 'సహకారి' అనే పేరున ప్రచురితమైంది. ఆ తర్వాత సమ్మేళన కేంద్రంతో పాటు గుడివాడకు మారింది. తర్వాత బెజవాడకు వచ్చింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు కూడా ఈ పత్రిక నిర్వహణ బాధ్యత వహించారు.

### b. సహకార పత్రిక

సహకార పత్రిక 1928లో మన్నేపల్లి రామకృష్ణరావు సంపాదకత్వంలో నెల్లూరు నుంచి వెలువడింది. నెల్లూరు జిల్లా సహకార సమ్మేళనం (కో ఆపరేటివ్ ఫెడరేషన్)

తరపున ప్రచురితమయ్యేది. తర్వాతి కాలంలో నెల్లూరు జిల్లా బ్యాంకింగ్ యూనియన్ వారు ఈ పత్రిక నడిపారు. ఆ దశలో అంటే 1931లో మామిడిపూడి వెంకటరంగయ్య గారు కొంతకాలం ప్రధాన సంపాదకుడుగా ఉన్నారు. 1933 నుంచి వెన్నెకంటి అప్పారావు ప్రధాన సంపాదకుడుగా పనిచేశారు. అదే సమయంలో మన్నేపల్లి రామకృష్ణరావు గారు స్వయంగా 'సహకార మిత్ర' అనే పత్రిక నడిపినట్లు తెలుస్తోంది. ఆంధ్రదేశ సహకార రంగంలో ఈ పత్రికలు ప్రముఖమైన ఖ్యాతి గడించాయి.

ఇంకా ఆంధ్ర సహకార పత్రిక, కృష్ణాసహకార పత్రము, సహకార సమ్మేళన పత్రిక, పరపతి వంటి సహకార పత్రికలు వెలువడ్డాయి. 1998 జనవరిలో ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకుల అసోసియేషన్ 'సహకార సారథి' అనే ద్వైమాసపత్రికను ప్రారంభించింది.

## xiv. లా (న్యాయ) పత్రికలు

న్యాయరంగంలో కూడా ప్రత్యేకంగా పత్రికలు వెలువడ్డాయి.

### a. తీర్పుల పత్రిక

1932లో నెల్లూరు నుంచి ప్రారంభమైన ఈ పత్రిక కోర్టు తీర్పులు, చట్టాలు, కోర్టు వ్యాజ్యాలు ప్రచురించేది. నేలనూతల సుబ్బారాయుడు సంపాదకత్వంలో ఈపక్షపత్రిక చాలాకాలం కొనసాగింది. ఇటీవలి కాలంలో ఈ పేరుతో శ్రీ అయితంరాజు శ్రీనివాసులు నెల్లూరు నుంచే ఒక పత్రికను నడిపారు.

న్యాయరంగానికి సంబంధించిన విషయాలతో పలు ప్రత్యేక పత్రికలు వెలువడ్డాయి. చెప్పుకోదగిన పత్రికలు : లా పత్రిక, తెలుగు లా జర్నలు, న్యాయ బోధిని, లాయరు, క్రిమినల్ లానోట్సు, కింగ్స్ లా వర్తమానము, ఆంధ్ర లా జర్నలు, లా జర్నల్ మొదలైనవి.

## xv. పారిశ్రామిక, వ్యాపార వాణిజ్య పత్రికలు

### a. ఆంధ్ర బజారు

1917 ప్రాంతాల్లో, కాకినాడ నుంచి భారత సారస్వత సంఘం వారు 'ఆంధ్ర బజారు' ప్రచురించారు. భారత సారస్వత సంఘం సాహిత్య పత్రికను కాక వ్యాపార వాణిజ్య పత్రిక వెలువరించడం ఆశ్చర్యకరమైనదే. ఈ పత్రిక పేరు కింద,

ముఖపత్రంపైనా, అంతర్ముఖంపైనా 'మన ఐశ్వర్యమును ప్రకటించు మాసపత్రిక' అని పెద్ద అక్షరాలతో ముద్రింపబడింది. పంటలు, వ్యాపారం, పరిశ్రమలు - ఇలాంటి వాటిని గురించి లఘు వ్యాసాలు ప్రచురించడం ఐశ్వర్యాన్ని ప్రచురించడమే కదా! కాకినాడలో సాహితీ ముద్రాక్షరశాలలో ఈ పత్రికను ముద్రించేవారు. పత్రికలో 'ఆంధ్రులు - పొగాకు', 'భరత ఖండమునందలి పురాతన కృషులు (వ్యవసాయాలు)', 'వాణిజ్య వీరులు', 'చేపల చెరువు', 'బజారు ధరలు' వంటి శీర్షికలుండేవి.

### b. నీలి ప్రకాశిక

1885లోనే 'నీలి ప్రకాశిక' అనే నీలి మందు ప్రచార పారిశ్రామిక పత్రిక మద్రాసు నుంచి వెలువడేది. ఇంకా బీమా పత్రిక, ప్రకటన పత్రిక వంటి వ్యాపార, వాణిజ్య పత్రికలు, కార్మిక బులెటిన్, నిరుద్యోగి, శ్రమజీవి, ఇండస్ట్రీ వంటి పారిశ్రామిక పత్రికలు వెలువడ్డాయి.

## xvi. నైతిక పత్రికలు

నీతి దర్పణము, సన్మార్గ దర్శిని, సునీతి, విశ్వజ్ఞాని వంటి నైతిక పత్రికలు కూడా వెలువడ్డాయి.

ఆధునిక కాలంలో పత్రికలు సర్వవిషయసంభరితాలుగా రూపొందాయి. ముఖ్యంగా దినపత్రికలు పోటీపడి వ్యయ ప్రయాసల కోర్చి అన్ని విషయాలతో కూడిన సమగ్ర సంచికలతో సత్వర సమాచారమందిస్తున్నాయి. కాబట్టి ఒక విషయంలో ప్రత్యేక పత్రిక అంటూ అవకాశం లేకుండాపోయింది. రావడం లేదు.

# 4. నవీన వార్తాయుగం

ఒకరకంగా 20వ శతాబ్దం వార్తాయుగం. ఒకదినం అనే కాలమానానికీ, వార్తా ప్రకటనకూ అవిభాజ్యమైన సంబంధం ఉంది. దినం అనే కాలశకలం కాలం పరుగెత్తవలసిన అగత్యాన్ని ద్యోతకం చేస్తుంది. క్షణక్షణం చలనశీలంగా మారుతున్న ప్రపంచాన్ని గురించి వెంటవెంటనే తెలుసుకోవలసిన అవసరం బహుశా ప్రపంచ ప్రజలందరిలోనూ ఏర్పడినట్లున్నది. ఒకరకంగా వలసవాదుల గుప్పిట్లోంచి విముక్తం కావడానికి ప్రపంచంలోని చిన్న పెద్ద దేశాల్లో ఉద్యమ ప్రయత్నాలు మొదలైనవి. 20వ శతాబ్దం రెండు ఘోరమైన ప్రపంచ యుద్ధాలను చవిచూసింది. అంతకు ముందు తమ జీవితంతో ప్రమేయంలేని కొత్త అనుభవాలు, కొత్త సవాళ్లు ఎదురవుతున్న కాలమిది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచం నలుమూలల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఆసక్తి, అవసరం అక్షరాస్యుల్లోనే గాక మేధావి వర్గాల్లో కూడా అధికం కాజొచ్చింది.

ముఖ్యంగా మనదేశంలో స్వాతంత్ర్యేచ్ఛ, ఉద్యమ నిర్వహణ కాంక్ష, సామాన్య జన జాగృతి వంటి అవసరాలతో వార్త, దాని ప్రధానవాహిక అయిన దినపత్రిక ప్రాముఖ్యతను సంతరించుకోవడం చారిత్రక కర్తవ్యంగా మారిన వైనం మనకు కనిపిస్తుంది.

## i. వార్త ప్రాధాన్యం

ఆధునిక యుగంలో పత్రికలు ముందుపుట్టి తెలుగులో అనేక నూతన ప్రక్రియలకు పురుడుపోశాయి. దేశప్రజలపై బ్రిటిషు వలసవాదులు మోపిన ఉక్కుపాదాన్ని తుత్తునియలు చేయడంలో తమ వంతు పాత్ర ప్రశంసనీయంగా పోషించాయి. ఆ తర్వాత ప్రజాస్వామ్య సౌధం పటిష్ఠంగా నిలబడడానికి నాలుగోస్తంభమై ఊతమిస్తున్నాయి. భారతదేశంలో తొలిపత్రిక ఆవిర్భావం, తెలుగు పత్రికల పుట్టుక ఆధునికకాలంలోనే జరిగినా వార్తను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరవేయడం అనే విషయ వినిమయ పద్ధతి ప్రాచీన కాలం నుంచీ అనేక రూపాల్లో మనకు కనిపిస్తుంది. శ్రీమదాంధ్ర మహాభారతంలో నన్నయ విరచిత పద్యం 'వార్తయందు జగము వర్ధిల్లు చున్నది[1]

1. *వార్తయందు జగము వర్ధిల్లుచున్నది.*
*యదియు లేని నాడ యఖిల జనులు*
*నంధకారమగ్నులగుదురు గావున*
*వార్త నిర్వహింప వలయు బతికి*
*ఆదికవి నన్నయ శ్రీమదాంధ్ర మహాభారతం, సభాపర్వం 50వ పద్యం.*

సుప్రసిద్ధం. ఈ లోకం వార్త ఆ లోకంలో ఆ లోకం వార్త ఈ లోకంలో చాటించే నారద మహాముని మయసభను దర్శించిన మీదట ధర్మరాజుకు రాజనీతి విషయాలు బోధిస్తూ ఈ పద్యం చెప్పాడు. లోకంలో సమాచార వినిమయ ప్రాధాన్యతను ఈ పద్యం ద్వారా నన్నయ 11వ శతాబ్దిలోనే చాటిచెప్పాడని కొందరు అభిప్రాయపడ్డారు. ఆ దృష్టితోనే 'వార్తయందు జగము' పద్యాన్ని పత్రికలు మకుటాలుగా స్వీకరించాయి. అయితే అది అపోహ మాత్రమేనని డా. బూదరాజు రాధాకృష్ణ పేర్కొంటున్నారు. "సంస్కృతంలోనూ, మనుధర్మశాస్త్రం, కౌటిల్యుడి అర్థశాస్త్రం, వాత్స్యాయనుడి కామసూత్రాలు, మహాభారతం వంటి పూర్వ గ్రంథాల్లోనూ వార్తా శబ్దానికి నేటి మన అర్థం లేదు. 'కృషి వాణిజ్యేవార్తా' అనేది నాటి నిర్వచనం. అంటే వ్యవసాయం, వ్యాపారం అనే రెండూ కలిసి వార్త అనిపించుకునేవి. ఈ రెండు వృత్తులనూ విస్మరిస్తే ప్రమాదమని, ఆ రెంటినీ ప్రోత్సహించడం రాజధర్మమనీ ఈ పద్యం ఉద్బోధిస్తున్నది" అని ఆయన అంటున్నారు.[2] అయితే ఈనాటి అర్థంలో స్వీకరిస్తే 'వార్త' ప్రాధాన్యం వివాదరహితం.

ఐరోపాలో వచ్చిన పారిశ్రామిక విప్లవం ఫలితంగా ముద్రణ పద్ధతి వెలసింది కాగితం తయారీ అంతకుముందే నేర్చుకున్నారు. శ్రమ తగ్గింది. ఖర్చు తగ్గింది. ఆ దశలో విదేశ యాత్రలు చేసిన సాహసికులు, సముద్రయానం చేసిన వారు తమ అనుభవాలను దినచర్యగా పత్రాల మీద రాసి గ్రంథ రూపంలో పెట్టేవాళ్లు. ఆ విధానమే కాలాంతరంలో పత్రికా రచనకు దారితీసింది. తమ తమ అవసరాలను అభిరుచులను పురస్కరించుకొని రకరకాల పత్రికలు వెలువరించడం మొదలైంది. అది ఒక శాస్త్రంగా పరిణమించింది.[3] పత్రికా రచన, నిర్వహణ మొదలైన సమస్త విషయాలకు సంబంధించిన శాస్త్రాన్ని జర్నలిజం (Journalism) అని పిలుస్తుండేవాళ్లు. అది ప్రసారశాస్త్రం (Communication Science) అని పిలిచే స్థాయికి ఎదిగింది. ఈ ఇంగ్లీషు మాటకు మూలం 'Journal' అనే పదం. దీనికి అనుదినం (Daily) అనే విశ్లేషణార్థముంది. దీనికి పూర్వ రూపం diurnal అనే మాట అది 'dies' (దినం, day) అనే నామధాతువు నుంచి

---

2. జర్నలిజం అవగాహన ఆచరణ - బూ. రాధాకృష్ణ దక్షిణ భారత జర్నలిస్టులు

3. " " సమాఖ్య " మద్రాసు ప్రచురణ 1995

పుట్టింది. Journal అనే పదానికి అనేక విశేషార్థాలు కూడా ఉన్నాయి. 1. దినచర్య 2. దినచర్యా గ్రంథం 3. శాసన సభ, సంఘం, క్లబ్బు వంటి సంస్థల వ్యవహారాలను నమోదు చేసిన పుస్తకం 4. నౌకా ప్రయాణాది వివరాలను రాసిన పుస్తకం. 5. దినపత్రిక అని ఈ మాట మీది నుంచి పుట్టిన తద్ధితరూపం Journalism అనేది. దానికి ప్రాచీనార్థం దినచర్యను గ్రంథస్థం చేయటమని, ఒక దినపత్రికను గాని, నిర్దిష్ట వ్యవధిలో వెలువడే మరో విధం పత్రికను గాని ప్రచురించటానికి కావలసిన సమాచారం సేకరించటం, రాయటం, సంపాదకత్వం వహించటం, ప్రచురణ భారం వహించటం అనే అర్థాలు ఇప్పటివి. ఆ మాటకే పత్రికా రచన, పత్రికలు అనే అర్థాలు కూడా వచ్చాయి.

మొగలు చక్రవర్తుల కాలంలో రాజ్యంలోని ముఖ్య విశేషాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి నివేదించేందుకు వార్తాహరులను నియమించారనేందుకు ఆధారాలున్నాయి. ఔరంగజేబు ఆస్థానాన్ని సందర్శించిన విదేశీ యాత్రికుడు 'నికోలా మనుక్కి' తాను రచించిన 'స్టోరియాడో మొగల్' లో రోజా వార్తా నివేదికలు అందే ఏర్పాటుతో పాటు ఆ వార్తా లేఖలను అంతఃపుర కాంతలు రాజుల సమక్షంలో పఠించే వారని కూడా ఉంది. మొగలుల కాలం నాటి వార్తా నివేదికలు లండన్‌లోని రాయల్ ఏషియాటిక్ సొసైటీలో భద్రపరచబడి ఉన్నాయి.

'వెయ్యి తుపాకీ గుండ్ల కన్నా పగబట్టిన 4 పత్రికలు ఎంతో ప్రమాదకరమైనవని' నెపోలియన్ అన్నాడు. తుపాకీ గుండ్ల ప్రభావ తీవ్రత తెలిసిన నెపోలియన్ పత్రికల శక్తికి సరైన అంచనాయే కట్టాడనిపిస్తుంది.

'దేశంలో పత్రికలు లేకుండా ప్రభుత్వం ఉండాలా? ప్రభుత్వం లేకుండా పత్రికలుండాలా? అంటే పత్రికలుండాలని చెప్పేందుకు సంకోచించను' అని అమెరికా ఒకప్పటి అధ్యక్షుడు థామస్ జఫర్సన్ అన్నాడు.

'పత్రికలు పదునైన మాటలతో వ్యాఖ్యానించగలిగినప్పుడే పత్రికా స్వాతంత్ర్యం ఉన్నట్లు భావించాలి' అని మహాత్మాగాంధీ అన్నారు. పత్రికలను స్వయంగా నిర్వహించిన అనుభవంతో ఆయన చెప్పిన మాట ఎంతో విలువైందిగా భావించాలి.

'పత్రికా స్వాతంత్ర్యం కేవలం నినాదమాత్రంగా ఉండకూడదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అది అత్యవసరమైన సహజమైన గుణం' అని ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు.

'పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తలు, వ్యాఖ్యలు చరిత్రకు 'ముడిసరుకు లాంటివి' అన్న ప్రఖ్యాత భారతీయ పాత్రికేయుడు ఫ్రాంక్ మోరాయిస్ మాట కూడ ఈ సందర్భంగా గమనార్హం.

'పత్రికొక్కటున్న పదివేల సైన్యము' అని తెలుగు పత్రికా రచనా వైతాళికుడు నార్ల వెంకటేశ్వరరావు అన్నమాట ప్రతి పదార్థ తాత్పర్య వివరణ అవసరం లేని నిర్వచనం.[4]

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా పత్రికలు నిర్వహిస్తూన్న పాత్ర విస్తృతమైనది. పత్రికలు వహిస్తున్న ప్రాధాన్యం బృహత్తరమైనది. ఎక్కువ శాతం మంది ప్రజలు వార్తా పత్రికలేని దైనందిన జీవితాన్ని ఊహించలేకుండా ఉన్నారు.

ప్రజలను భుజానవేసుకుని ప్రభుత రథచక్రాలపై పురోగమిస్తున్న పత్రికలు ఆ రథాన్ని సక్రమంగా నడిపించేందుకు దారి చూపుతున్నాయి.

పత్రికలు నేటి తక్షణ సమస్యల పరిష్కార మార్గాలు, రేపటి వాస్తవ చరిత్ర నిర్మాతలు. ఇక దినపత్రికల ఆవిర్భావ వికాసాల గురించి చర్చిద్దాం.

## ii. భారతదేశంలో తొలి పత్రికలు :

భారతదేశంలో తొలి పత్రికల గురించి చర్చించాలంటే ఆంగ్లేయులు ప్రారంభించిన ఆంగ్లో ఇండియన్ పత్రికల గురించి చెప్పుకోవాలి. ఆంగ్లో ఇండియన్ పత్రికలే భారతీయ పత్రికావ్యాప్తికి మార్గదర్శకాలయ్యాయి. దేశంలో తొలి వార్తా పత్రిక 'బెంగాల్ గెజిట్'. జేమ్స్ అగస్టస్ హిక్కీ అనే ఆంగ్లేయుడు కలకత్తాలో ప్రారంభించిన ఈ వారపత్రిక 1780 జనవరి 29వ తేదీన తొలిసారిగా వెలువడింది. రెండు పుటలు, 12 అంగుళాల పొడవు, ఎనిమిది అంగుళాల వెడల్పు కలిగి ఉండేది. హిక్కీయే వ్యవస్థాపకుడు, సంపాదకుడు, ప్రచురణకర్త కావడం వల్ల ఈ పత్రికను 'హిక్కీస్ గెజిట్' అని కూడా పిలిచేవారు. దేశంలో పత్రికా స్వేచ్ఛ కోసం ఆ రోజుల్లోనే ఎలుగెత్తి నినదించిన ఈ పత్రిక ఆ విషయంలో ఈనాటికీ ఆదర్శంగా నిలిచింది. పత్రికలో రాసే విషయాలు

---

4. పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజలకు రక్షలేదు పత్రిక లేనిచో
పత్రికే నియంత పక్కలో బల్లెమ్ము
పత్రికే ప్రజాళి పట్టుగొమ్మ
ప్రభుత వక్రమౌను పత్రిక లేనిచో

ఆసక్తికరంగా ఉండేవి. లండన్ వంటి ప్రాంతాల్లో ఇతర ఐరోపా దేశాల్లోని పత్రికల్లో వచ్చే వార్తల్ని యథాతథంగా హిక్కి తన పత్రికలో ప్రచురించేవాడు. ఇంకా భారతదేశంలోని తూర్పు ఇండియా కంపెనీ ఉన్నతోద్యోగుల్లోని అవినీతిని ఎండగడుతూ వార్తలు ప్రచురించేవాడు. అనేక నిర్బంధాల నెదుర్కొంటూ హిక్కీ తన పత్రికను రెండేళ్లు నడిపాడు. 1782 మార్చిలో అప్పటి ప్రభుత్వం హిక్కీ ముద్రణాశాలను స్వాధీనం చేసుకుని హిక్కీని అరెస్టు చేసి దేశం నుంచి పంపించి వేసింది.

కలకత్తాలో అదే కాలంలో అంటే 1780 నవంబర్‌లో 'ఇండియా గెజిట్' అనే మరో పత్రిక ప్రారంభమైంది. బెర్నార్డ్ మెస్సినిక్, పీటర్ రీడ్ అనే ఇరువురు ఆంగ్లేయులు కలిసి ఈ ఆంగ్ల భాషావారపత్రికను స్థాపించారు. హిక్కీ పత్రికలాగా కాకుండా ఇది ప్రభుత్వానికి అనుకూలంగా రాస్తూ అనేక రాయితీలు అనుభవించింది.

దేశంలో వెలువడిన మూడవ వార్తాపత్రిక కలకత్తాలో ప్రారంభమైంది. 1784 ఫిబ్రవరి నుంచి వెలువడిన ఈ 'కలకత్తా గెజిట్' పత్రికలో వార్తలు ఆంగ్లంలోనూ, వ్యాపార ప్రకటనలు వంగ, పారశీక భాషల్లోనూ ఉండేవి. తరువాతి కాలంలో ఈ పత్రిక ప్రభుత్వ అధికార గెజిట్‌గా మారి నేటికీ ప్రచురితమవుతోంది.

అనతి కాలంలో కలకత్తా నుంచి పత్రికోదయ రేఖలు దేశంలోని ఇతర నగరాలకు విస్తరించాయి. మద్రాసులో 1785 అక్టోబర్ 12వ తేదీన 'మెద్రాస్ కొరియర్' అనే పత్రిక ప్రారంభమైంది. ప్రభుత్వ ముద్రాపకుడైన రిచర్డ్ జాన్సన్ ఈ పత్రికను నెలకొల్పాడు. ఈ వారపత్రిక నాలుగు పుటలుండేది. తర్వాత బోయ్డ్ అనే వ్యక్తి 1791లో 'హరకారు' అనే పత్రిక ప్రారంభించాడు. మద్రాసులో ప్రారంభమైన రెండవ పత్రిక ఇది. రెండేళ్ల తర్వాత బోయ్డ్ మరణంతో ఈ పత్రిక ఆగిపోయింది. 1795లో రాబర్ట్ విలియమ్స్ అనే ఆంగ్లేయుడు 'వీక్లీ మెద్రాస్ గెజిట్' అనే పత్రికను ప్రారంభించాడు. ఈ పత్రిక పారశీ భాషకు, మరికొన్ని భారతీయ భాషలకు అచ్చులు ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నించింది.

బొంబాయి నగరంలో 1789లో మొదటిసారిగా 'బాంబే హెరాల్డ్' అనే ఆంగ్ల వారపత్రిక ప్రారంభమైంది. రెండవ పత్రిక 'బాంబె కొరియర్' ను లూకాష్ బర్నర్ అనే అతను 1790లో స్థాపించాడు. లూకాష్ బొంబాయి మున్సిపాలిటీలో ఆల్డర్ మాన్‌గా పనిచేసేవారు. ఈ 'బాంబే కొరియర్' ఈనాటి 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికకు పునాది. 1839లో కొరియర్‌కు అప్పటి సంపాదకునిగా ఉన్న రాబర్ట్ సైట్ దాని పేరు

'బాంబే టైమ్స్' గా మార్చాడు. **1791** జూన్‌లో 'బాంబే గెజిట్' అనే మరో పత్రిక వెలసింది. అప్పటి పోలీస్ కమీషనర్‌పై విమర్శలు ప్రచురించినందుకు పత్రిక ప్రూఫులు ప్రచురణకు పూర్వం ప్రభుత్వ పరిశీలనకు పంపాలన్న ఆదేశాలు జారీ అయ్యాయి. **1792**లో 'బాంబే హెరాల్డ్', 'బాంబే గెజిట్' పత్రికలు విలీనమయ్యాయి. ఈ పత్రికకు తర్వాత ప్రభుత్వ గుర్తింపు లభించడమే కాదు అనంతరకాలంలో ప్రభుత్వ పత్రికగా మారిపోయింది.

## iii. భారతీయ పత్రికలు :

భారతీయ భాషల్లో వెలువడిన తొలి పత్రిక 'బెంగాల్ గెజిట్' **(1816)** అనే వంగభాషా పత్రిక. దీని వ్యవస్థాపకుడు గంగాధర భట్టాచార్య తొలి భారతీయ భాషా పత్రికగా, భారతీయుడు ప్రారంభించిన తొలి పత్రికగా దీనికి ఖ్యాతి దక్కుతుంది.

భారతీయ పత్రికల వ్యాప్తికి ఆంగ్లో ఇండియన్ పత్రికలే గాక ఆంగ్లేయులు నడిపిన భారతీయ భాషా పత్రికలు ఎంతో దోహదం చేశాయి. ఈ కృషిలో సిరాంపూర్‌లోని క్రైస్తవ మిషనరీలు కూడా పాలుపంచుకున్నాయి. **1818** ఏప్రిల్‌లో సిరాంపూర్ మిషనరీలు 'దిగ్దర్శన్' అనే వంగ భాషా వారపత్రికను ప్రారంభించారు. రాజనీతి, చరిత్ర మొదలైన విషయాలపై వ్యాసాలు, ప్రకటనలు, మత విషయాలు ఈ పత్రికలో ప్రచురించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అభ్యతరమూ లేకపోవడం గమనించి రెండునెలల తర్వాత వారు మరో భారతీయ భాషా పత్రిక 'సమాచార దర్పణ్' ప్రారంభించారు. ఇది కూడా వంగ భాషా వారపత్రికే. **1818** మే **23**న ఇది ప్రారంభమైంది. మిషనరీలు డా. మార్ష్‌మన్, వార్డు గార్ల కృషి ఈ సందర్భంలో చెప్పుకోవాలి. వీరికి అప్పటి గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ సహకారం పూర్తిగా లభించింది. అదే సంవత్సరంలో వారు 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా' అనే ఆంగ్ల మాసపత్రికను, దానికి అనుబంధంగా మరో త్రైమాసిక పత్రికను కూడా ప్రారంభించారు. **1827**లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆ పత్రికలు ఆగిపోయాయి.

భారతీయ పత్రికా వ్యాప్తి దిశలో జేమ్స్ సిల్క్ బకింగ్‌హాం అనే ఆంగ్లేయ వైతాళికుని కృషిని గురించి కూడా చెప్పుకోవాలి. **1818** అక్టోబర్ **2**న 'కలకత్తా జర్నల్' అనే పత్రిక ఆయన సంపాదకత్వంలో ప్రారంభమైంది. బకింగ్‌హాం నుంచి రాజారామమోహన్‌రాయ్

వంటి వారు స్ఫూర్తి పొందారు. పత్రికా ముఖంగా హైందవ, క్రైస్తవ మతాలపై పరస్పర విమర్శలు వెలువడుతున్న కాలమది. రాజారామమోహన్ రాయ్ క్రైస్తవ మతపరంగా హిందూ మతంపై జరుగుతున్న దాడిని తిప్పికొడుతూ రాసే వ్యాసాలను బకింగ్ హాం ఆంగ్లంలోకి అనువదించి తన 'కలకత్తా జర్నల్' లో ప్రచురించేవాడు. పోలీసుల అజాగ్రత్త, కలకత్తా వీధుల్లో పాశ్చాత్యుల అనుచిత ప్రవర్తన సంఘటనలు, భారతీయులుపడే బాధలను గురించి ఆ పత్రికలో వార్తలు ప్రచురించేవారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యాసాలు, సంపాదకీయాల వల్ల పత్రికకు ప్రాచుర్యం పెరిగింది. ఈ పత్రిక దేశంలో రాజకీయ చైతన్యం పెరిగేందుకు దోహదం చేసింది. ఆంగ్ల ప్రభుత్వం పై గట్టి విమర్శలను బకింగ్‌హాం తన పత్రికలో ప్రచురించేవాడు. జాన్ ఆడం తాత్కాలిక గవర్నర్ జనరల్‌గా రావడంతో పత్రికకు అనుమతి రద్దయింది. 'కలకత్తా జర్నల్' పత్రికను నిలిపివేసి జేమ్స్ సిల్క్ బకింగ్‌హాంను నిర్బంధించి విదేశాలకు పంపించారు. బకింగ్‌హాం లండన్ నుంచి కూడా 'ఓరియంటల్ హెరాల్డ్' అనే పత్రికను నడిపాడు. **1832**లోనే బారతదేశాన్ని భారతీయులే పాలించుకోవాలి అని నినదించిన వాడు. అంతేకాదు ప్రభుత్వ లోపాలను ధైర్యంగా పత్రికలో ప్రచురించే ఆదర్శానికి బకింగ్ హాం చిరస్మరణీయమైన స్ఫూర్తి.

భారత పునరుజ్జీవన పితామహుడు రాజారామమోహన్ రాయ్ తన ఉద్యమానికి పత్రికా నిర్వహణను ఒక దోహదశక్తిగా ఉపయోగించాడు. హైందవ మతంపై క్రైస్తవ మతం జరిపే దాడిని తిప్పికొట్టడానికి, సతీసహగమనం వంటి దురాచారాల గురించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడానికి రాయ్ పత్రికలు స్థాపించాడు. భారతీయ పత్రికా రచనకు అది ప్రభాత సమయం. సిరాంపూర్ మిషనరీలు నడిపే 'సమాచార దర్పణ్' లో హిందూ మతాన్ని కించపరుస్తూ వచ్చిన విమర్శలకు రామమోహన్‌రాయ్ సమాధానం రాస్తే దాన్ని ఆ పత్రిక వారు ప్రచురించేందుకు నిరాకరించారు. దాంతో రెచ్చిపోయిన రాయ్ తన మిత్రుడైన శివప్రసాదశర్మ సహాయంతో తాను స్వయంగా 'బ్రాహ్మనికల్ మ్యాగజైన్' అనే పత్రికను స్థాపించాడు. **12** సంచికలు వెలువడి అది ఆగిపోయాక, ఆంగ్ల, వంగ భాషల్లో 'బ్రాహ్మిణ్ సేవాధి' అనే మరో పత్రిక ప్రారంభించారు. ఆ తర్వాత కొంతకాలానికి 'సంబాద కౌముది' అనే వంగ భాషా వారపత్రికను రాయ్ నెలకొల్పాడు. ఇందులో అనేక విషయాలను నిర్భయంగా వ్రాసేవారు. ప్రధానంగా ఆంగ్లేయుల

పాలన వల్ల, వారు అనుసరించే విధానాల వల్ల భారతీయులకు కలిగే కష్టనష్టాల గురించి సాహసోపేతంగా రాసేవారు. తర్వాత 1822 ఏప్రిల్‌లో రాయ్ పార్శీలో 'మిరాత్ ఉల్ అఖ్‌బార్' అనే మరో వారపత్రికను ప్రారంభించాడు. ఈ పత్రికల ద్వారా దేశీయుల ప్రయోజనాలకోసం ఆంగ్లేయులతో పోరాటం కొనసాగిస్తూనే ఆనాటి సాంఘిక దురాచారాలను గురించి ప్రజలకు అనేక విషయాలు ప్రబోధించాడు.

## iv. తెలుగులో దినపత్రికలు

పత్రికల్లో దినపత్రికకున్న ప్రాధాన్యతను చాటి చెప్పింది ఇరవయ్యో శతాబ్దం. దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ జరిగిన సంఘటనల గురించిన వార్తలను సాదాసీదాగా మోసుకు వచ్చిన స్థితి నుంచి ఈ శతాబ్దారంభాననే దినపత్రిక అనేక యోజనాల దూరం ముందుకు వెళ్లింది. తెల్ల ప్రభుత్వమైనా, ప్రజాస్వామ్య ప్రభుత్వమైనా ప్రజల జీవన స్థితిగతుల్లో పాలన చూపే ప్రభావాన్ని దినపత్రిక ప్రతిబింబించింది. స్వదేశీ ఉద్యమంలోనూ, స్వాతంత్ర్యోద్యమంలోనూ దినపత్రికలు ముఖ్య పాత్ర వహించాయి. బానిసత్వంలోని దుర్భర పరిస్థితులకు అద్దం పట్టాయి. స్వాతంత్ర్యేచ్ఛను రగుల్కొలిపేందుకు దోహదం చేసిన సంఘటనల గురించి విస్తృతంగా ప్రచురించాయి. ఉద్యమ స్వరూపాన్ని ఈ మూల నుంచి ఆ మూల దాకా విస్తరింపజేశాయి. ఆ విధంగా సాంఘిక, రాజకీయ ఉద్యమాలను గురించి ప్రచురిస్తూనే ఇతరత్రా ప్రజలకవసరమైన అన్ని అంశాలకు చోటు కల్పించాయి. దినపత్రికల అవతరణ, పరిణామాన్ని గురించి తెలుసుకుందాం.

## i. స్వాతంత్ర్యానికి ముందు

### a. దేశాభిమాని (1886)

ఇప్పటివరకు లభించిన ఆధారాలను బట్టి 'దేశాభిమాని' తొలి తెలుగు దినపత్రికగా పేర్కొనవచ్చు. దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించిన ఈ పక్షపత్రిక వారపత్రికగా, ద్వైవార, త్రైవార పత్రికగా నడిచి 1906 నాటికే దినపత్రికగా మారినట్లు తెలుస్తోంది. కృష్ణాపత్రిక 1906 మార్చి 15 - ఏప్రిల్ 1 సంచికలో చెన్నాప్రగ్గడ వేంకట కృష్ణరాయశర్మ 'తెలుగు పత్రికలు' అనే వ్యాసం రాస్తూ 'దేశాభిమాని యొక్కసారిగనే దినపత్రికగా

మాటినది' అని రాశారు. ఈ దాఖలాను బట్టి 'దేశాభిమాని' 1906కు పూర్వమే దినపత్రికగా వెలువడింది. దీన్నే తొలి తెలుగు దినపత్రిక అని నిర్ణయించవచ్చు. డాక్టర్ నాడిగ్ కృష్ణమూర్తి 'Indian Journalism' అనే తన పరిశోధన గ్రంథంలో దేవగుప్తం శేషాచలపతిరావును తెలుగు దినపత్రికా స్థాపకుడు (పయొనీర్ ఇన్ స్టార్టింగ్ ఏ డెయిలీ న్యూస్ పేపర్ ఇన్ తెలుగు) గా పేర్కొన్నారు. ఈ పత్రిక మొదట 1886 - 87 ప్రాంతంలో స్థాపితమైంది.

ఇక్కడ 'తెలుగు జనానా' పత్రిక 1901 సెప్టెంబర్ నెల సంచికలోని ఒక సమీక్షా వార్తను ఉదాహరించడం సబబు. ఈ సమీక్షను బట్టి చూస్తే 'దేశాభిమాని' 1901 నాటికే వెలువడినట్లు తెలుస్తోంది. అంతేకాదు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు నడిపిన 'గౌతమి' ని కూడా తొలి తెలుగు దినపత్రికగా పేర్కొంటున్న నేపథ్యంలో 'జనానా పత్రిక' సమీక్షకు ప్రాధాన్యత చేకూరింది. "ఆంధ్రలోకమున గౌతమి యే మొదటి దినపత్రిక కాదు'' అని అందులో ఉంది. 'తెలుగు జనానా' సమీక్షలో వార్తా పత్రికల ప్రాముఖ్యాన్ని గురించిన అంశాలు గమనించదగ్గవిగా ఉన్నాయి. అందుచేత ఆ సమీక్షను యథాతథంగా అవలోకిద్దాం:

"ఈ యాగస్టు నెల మొదట 'గౌతమి' యను పేర నొక యాంధ్ర వార్తా పత్రిక యనుదినమును రాజమహేంద్రవరమున బ్రచురమగుచున్నది. ఈ పత్రిక యొక్క 1, 2, 3 వ సంచికలు వందన పూర్వకముగనందుకొన్నారము. పత్రిక అరఠావు కాకితము పరిమాణముగలది. ప్రతిసారియును నేదోయొక ముఖ్య వ్యాఖ్యానమును కొన్ని చిన్న వ్యాసములును వృత్తాంతములును ముద్రితములగుచున్నవి. అప్పుడప్పుడు చిన్న చిన్న ప్రహసనములు గూడ గలవు. ఇతర గ్రామస్థులీ పత్రికకు 6 మాసములకు రూ. 4 - 6 - 0, 3 మాసములకు రూ. 2 - 2 -0 జందా చెల్లింపవలయును.''

"ఏ దేశము యొక్క నాగరికతనైనను కొంతవరకు అక్కడవి వార్తాపత్రికలను బట్టి గ్రహింపవచ్చును. ఎక్కువ వార్తా పత్రికలు బాగుగా జరుపబడుచుండుటయే దేశము యొక్క శుభస్థితికి కొంత సూచకము. మోటు జనులకు వార్తాపత్రికలును, పుస్తకములును యేల? కాని విద్యాధికులకును నాగరకులకు మాత్రము సద్గ్రంథములును వార్తాపత్రికలును గావలయును, వార్తా పత్రికలు దేశమునకు గన్నుల వంటివి. కంటివలననే గదా మనకు లోకము గోచరమగుచున్నది. అట్లే వార్తాపత్రికల మూలముననే

ప్రపంచము యొక్క ప్రస్తుత స్థితి మనకు తెలియవచ్చుచున్నది. వార్తా పత్రికలు చదువు చుండనివాడును వినుచుండని వాడును త్రుప్పుపట్టిన మనసుగలవాడేయని చెప్పవచ్చును. లోకము యొక్క వర్తమానపు స్థితిని గురించి అట్టివానికి జ్ఞానమేమియు నుండదు.

ప్రపంచ జ్ఞానము విషయమునదాము వెనుకబడి యుండనొల్లని వారెల్లరును తప్పక వార్తా పత్రికల నామోదింపవలసినదే. ఆంధ్రదేశమున దినవార్తాపత్రికలేని లోపమునిప్పుడే గౌతమి కొంతవరకు వారింపబూనుకొన్నది. ఇది మంచి సంగతియే. పత్రికాధిపతియగు శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు ఆంధ్రభాషా పాండిత్యము గాంచినవారు. ఇది వరకు వీరు కొన్ని గ్రంథములు చేసి యుండుటయే గాక 'కళావతి' యను మాసపత్రికను గూడ బ్రచురించుచున్నారు. వారికి ముద్రాయంత్రము గూడ గలదు. 5 నెలల వరకును ఈ పత్రికను సాగించి తర్వాత వీలు కొలది నాలోచించెదమని చెప్పి యున్నారు. ఇది మంచి నియమమేయని యెన్నుచున్నాము. తామవిచ్చిన్నముగా బత్రిక జరపెదమని యాసపెట్టి కొందరివలన సం. చందాలు వసూలు చేసి పిమ్మట తగినంత ప్రోత్సాహము లేక పత్రికను మూలవైచి అనేక విధముల జందాదారుల విశ్వాసమునకును జనుల యాసలకును భంగము కలిగించిన పత్రికాధిపతులను మనము చూచుచున్నాము. ఈ యైదునెలలైనను క్రమముగా నీ గౌతమి పత్రిక సాగుననియు మిత్రులును జందాదారులును బత్రికాధిపతికి దోహదపడెదరనియును నమ్ముచున్నాము.

ఆంధ్రలోకమునకు గౌతమియే మొదటి దినపత్రిక కాదు. అట్టి భాగ్యము కృష్ణకే లభించినది కాని అది కృష్ణవెల్లువల వలెనే మూడు నాళ్ల మురిపెమేయై సింధుగతమైనది. ఇది వరకు బెజవాడలో నుండి యీ మధ్య కృష్ణదాటి వెడలి గుంటూరు జొచ్చిన 'దేశాభిమాని' కొంతకాలము క్రిందట దినదినమును దలచూపుచు వచ్చెను. ఇప్పుడు ప్రచురమగుచున్న ఈ గౌతమి పత్రిక యొక్క మొదటి పుటలో పై భాగముననున్న

"క. భూతల వార్తల నీతుల,
జాతుల రీతులను దెలియజాటెదనిని యీ,
గౌతమియను పత్రిక ప్రఖ్యాతిమెయిన్
వెడలు బ్రత్యహంబు గడంకన్"

అను పద్యములోని చరణమును "ప్రఖ్యాతి మెయిన్ వెడలు బ్రత్యహము గడకంటన్" అని

మొదట మేము పొరపాటున జదివి ఎల్లప్పుడు నీ పత్రిక సాగునుగదాయని యొక నిముషము సంతసించితిమి. మా సంతోషమునకు శాశ్వత జీవితము కలుగుగాక.

దినపత్రికలో నెప్పుడును 'తంత్రీవార్తలు' గూడ నుండవలయును. ఈ విషయమై పత్రికాధిపతి ఏమి ప్రయత్నములు చేయునో తెలియదు. అధమ పక్షము చెన్నపురి పత్రికలలో బ్రచురమగు తంతి వార్తల గొన్నింటినైనను 'గౌతమి' కి ఆ దినముననే తంతి మూలమున నెవరైన జెన్నపురి నుండి యిచ్చుచుండిన బాగుగనుండును. వార్తలను గురించి ఇటువంటి యేర్పాటు చేయలేనిచో అధమపక్షము పూర్వము ఇంగ్లండులో దినదినమును వెడలుచుండిన స్పెక్టేటర్ వలెనే నీతి మొదలగు నుత్కృష్ట విషయములను గురించి మంచి యుపన్యాసములు వ్రాయబడినను బాగుగనుండును." (పుట 61-63, 1901 సెప్టెంబరు, తెలుగు జనానా).

ఈ సమీక్షను బట్టి 'దేశాభిమాని' ని తొలి తెలుగు దినపత్రికగా పేర్కొనవలసి ఉంటుంది. ఇంకొక ఆధారం. 1910 నాటి 'ఆంధ్రపత్రిక' ఉగాది సంచికలో ఆనాడు దేశంలో ఉన్న పత్రికల వివరాలిచ్చారు. అందులో 'దేశాభిమాని' ని మాత్రమే దైనిక పత్రికగా పేర్కొనటం జరిగింది.[5]

## b. గౌతమి (1908)

మొదటి తెలుగు దినపత్రిక స్థాపించిన కీర్తి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారికి దక్కుతుందని, ఆ దినపత్రిక పేరు 'గౌతమి' అని, అది 1911లో ఒక ఏడాదిపాటు నడిచిందని నిడుదవోలు వెంకటరావు గారు పేర్కొన్నారు.[6] ఆంధ్రసారస్వత పరిషత్తు రజతోత్సవ సంచికలో 'తెలుగులో సాహిత్య పత్రికలు' అనే వ్యాసంలో ఇదే అభిప్రాయాన్ని తిరుమల రామచంద్ర వ్యక్తం చేశారు. ఈ పత్రిక రాజమహేంద్రవరం నుంచి 1908లో దినపత్రికగా నడిచినట్లు మద్రాసులోని రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ వారి కార్యాలయంలో నమోదైంది. 'దేశాభిమాని' తొలి తెలుగు దినపత్రిక అనేది 'తెలుగు జనానా' పత్రిక 1901 సెప్టెంబర్ సంచికలో ప్రచురితమైన సమీక్షను, 1910 నాటి ఆంధ్రపత్రిక,ఉగాది సంచికలో ఆనాటికి ఉన్న ఏకైక దినపత్రిక 'దేశాభిమాని' గా పేర్కొనడాన్ని బట్టి 'దేశాభిమాని'ని తొలి తెలుగు దినపత్రికగా నిర్ధారణ చేయవచ్చు.

---

5. *తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం.*
6. *Studies in the History of Telugu Journalism.*

**c. ఆంధ్ర ప్రకాశిక (1885)**

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన 1885 సంవత్సరంలో ఎ. సి. పార్థసారథినాయుడు గారు మద్రాసులో ఈ పత్రికను ప్రారంభించారు. తెలుగు పత్రికలకు తొలిసారిగా రాజకీయ ప్రాధాన్యతా మార్గాన్ని ఉపదేశించిన ఈ పత్రిక 25 సంత్సరాల పాటు వారపత్రికగా ఆ తర్వాత వారానికి రెండు సార్లు వెలువడుతూ నడచింది. ఈ పత్రిక స్థాపకులు పార్థసారథినాయుడు గారు తెలుగు వారి తరపున అటు కాంగ్రెస్ రాజకీయాల్లో ఇటు రాజకీయ పత్రికా రచనలో పాల్గొన్న భీష్మ పితామహులవంటివారు. 1916లో జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రకాశిక కొంతకాలం దినపత్రికగా వెలువడింది. దినపత్రికకు కూడా పార్థసారథి నాయుడు గారే సంపాదకులుగా ఉన్నారు.

**d. శశిలేఖ (1894)**

1894 జూన్‌లో గట్టుపల్లి శేషాచార్యులు గారు మద్రాసు నుంచి శశిలేఖ పత్రికను ప్రారంభించారు. గట్టుపల్లి వారితో పాటు నేలటూరు పార్థసారథి అయ్యంగారు దీనికి సంపాదకులుగా ఉండేవారు. బోయరు యుద్ధ సమయంలో దీనికి బాగా ఆదరణ లభించింది. తెలుగు పాఠకులకు యుద్ధ వార్తా పఠనాభిలాష కలిగించిన పత్రిక కూడా ఇదే. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ఆకాంక్షించి ఆంధ్రోద్యమానికి బాసటగా నిలిచింది. వారపత్రికగా కొన్నాళ్ళు, ద్వైవారపత్రికగా కొన్నాళ్ళు నడిచి దినపత్రికగా కొంతకాలం వెలువడింది. చివరకి వారపత్రికగా మారి ఆగిపోయింది. 'శశిలేఖ', 'గౌతమి'ల్లో ఏదో ఒకటి తెలుగు దినపత్రికల్లో రెండవది, మరొకటి మూడవదిగా, 'ఆంధ్రపత్రిక' (1914) నాలుగోదిగా పరిశోధకులు పేర్కొంటున్నారు.

**e. ఆంధ్రపత్రిక (1908)**

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉన్నతాశయంతో నెలకొల్పిన పత్రిక ఈ 'ఆంధ్రపత్రిక.' 1908 ఆగస్టు 9న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభించారు. మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేసిన నాగేశ్వరరావు గారు కందుకూరి వీరేశలింగం గారి అనుచరులుగా ఉన్నారు. కందుకూరి స్ఫూర్తితోనే సాంఘిక అభ్యున్నతి దృష్టితో

పత్రికను స్థాపించారు. 1914 ఏప్రిల్ 1న 'ఆంధ్రపత్రిక' ను మద్రాసుకు తరలించారు. ఆ రోజు నుంచి 'ఆంధ్రపత్రిక' దినపత్రికగా కూడా వెలువడింది. బెంగాల్ విభజనతో వెల్లుబికిన చైతన్యం ఆంధ్రదేశాన్ని కూడా తాకింది. అదే కాలంలో బిపిన్ చంద్రపాల్, సురేంద్రనాథ బెనర్జీ ఆంధ్రదేశాన గొప్ప స్ఫూర్తిని కలిగించారు. ఒకవైపు జాతీయోద్యమం, మరోవైపు స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్ర రాష్ట్రోద్యమం, గ్రంథాలయోద్యమం ఇవన్నీ తెలుగు నేలను ముప్పిరిగొన్నాయి. ఆ నేపథ్యంలో ఈ ఉద్యమాలకన్నిటికీ వేదికగా నిలిచి ప్రజానీకాన్ని మేలుకొల్పిన పత్రిక 'ఆంధ్ర పత్రిక.' ఆ సమయంలోనే ప్రథమ ప్రపంచ సంగ్రామం సంభవించింది. ఈ ఉద్యమాల, యుద్ధాల సంచలనం 'ఆంధ్రపత్రిక' లో ప్రతిబింబించింది. 1914 నుంచి దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా తెలుగువారి సమగ్ర మూర్తిని 'ఆంధ్రపత్రిక'లో దర్శించవచ్చు.

'ఆంధ్రపత్రిక' దినపత్రికతో పాటు పంతులుగారు 'ఆంధ్రపత్రిక' సచిత్ర వారపత్రికను నడిపారు. పంతులు గారు తాము స్థాపించిన రెండు పరిశ్రమల్లో 'ఆంధ్రపత్రిక' నుంచి నిరంతరం నష్టాలనూ, 'అమృతాంజనం' నుంచి లాభాలనూ చవిచూశారు. 'అమృతాంజనం' లాభాలను 'ఆంధ్రపత్రిక' లో పోశారు. ఆ పత్రిక తెలుగు వారి ప్రయోజనాలను పరిరక్షించి పెంపొందించింది

తొలి సంచికలో పత్రికా ప్రచురణ ఆశయాలను తేటతెల్లం చేస్తూ రాసిన సంపాదకీయం ఇలా ఉంది :

'విచారణీయంబులైన విషయంబులనేకములు గలవు. జనాభిప్రాయముల కనుకూలముగ విషయ విమర్శమును జేయుచు ననుదినమును నాంధ్ర దేశ వృత్తాంతాదులను ప్రచురించుటకు దినపత్రికను ప్రచురించుటకేర్పాటులు చేయబడినవి. కాని యనివార్యంబులైన యాటంకముల వలన విలంబనమేర్పడినందులకు జింతించుచున్నాము.

దేశీయ మహాసభాదర్శములును, రాష్ట్రీయ సభాదర్శములును నాంధ్రపత్రికా దర్శములు. హైందవ జాతీయాభ్యుదయములకు నాంధ్ర జాతీయాభ్యుదయమును ప్రసాదించుట పత్రికా నిర్వాహకుల ముఖ్యోద్దేశము. ఆంధ్ర జాతీయాభ్యుదయము సహకారిగాని ప్రతికూలముగాదని పత్రికా నిర్వాహకుల మతము. ఉభయ భావములకు

విరుద్ధభావమేర్పడినపుడు హైందవ జాతీయతకు బ్రతికూలముగ బ్రవర్తింపజాడము. నిమిత్తము ఆంధ్రాభ్యుదయముగాని యితర జాతి ద్వేషముగాదు. అవసరమైనపుడెల్ల యాంధ్రుల వృద్ధికి దగిన సదుపాయములను విసుగు విరామము లేకను ప్రజలకును పాలకులకును నివేదించెదము. శాఖాభేదములను, కులభేదములను, మతభేదములను, జాతిభేదములను గమనింపక మిత్ర భావమును వ్యాపింపజేయుటకై ప్రయత్నించెదము. ఆంధ్రోద్యమము పట్ల సంపూర్ణ సానుభూతి నుపయోగించెదము. ఆంధ్రభాష, ఆంధ్ర విశ్వవిద్యాలయ నిర్మాణము, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణావశ్యకత మొదలగు విషయములను సమదృష్టితో సమర్థించుటయే దినపత్రికను బ్రచురించుటకు గల ముఖ్య కారణము. భేదాభిప్రాయములు గలవారు మా యుద్దేశములను వేరుగ గ్రహింపకుండుటకు బ్రార్థితులు. పత్రికల యందు విదేశ స్వదేశ తంతివార్తలు యెప్పటికప్పుడు తెలుగు నందును నాంగ్ల భాషనందును బ్రచురించుటకు సాహసించితిమి. దైవానుగ్రహము వలన దినపత్రిక యించుకేనియు దేశాభ్యుదయమునకు దోడ్పడిన పత్రికా నిర్వాహకులు కృతకృత్యులు. ఇంతవరకును సహాయమును జేసినవారలకును, చందాదారులుగ జేరినవారలకును వందనములు. ఆంధ్రమహాజనులు సదభిమానమును బూని పత్రికను పోషించి దేశోపయోగకరముగ జేయుటకు బ్రార్థితులు.''

ఇటువంటి ఉన్నతమైన లక్ష్యాలతో, ఆదర్శాలతో 'ఆంధ్రపత్రిక' దినపత్రిక కృషి చేసింది. తెలుగు వారి భాషా, సాహిత్య, సాంఘిక, రాజకీయాభ్యుదయ సాధన దిశలో 'ఆంధ్రపత్రిక'ది ఒక విశిష్టత.

యుద్ధకాలంలో తెలుగు వార్తలతోపాటు ఇంగ్లీషులో 'రాయిటర్' వార్తా సంస్థ నుంచి వచ్చిన వార్తలను, టెలిగ్రాముల ద్వారా వచ్చిన వార్తలను యథాతథంగా ప్రచురించేవారు. యుద్ధవార్తల ప్రచురణ వల్ల పత్రికా ప్రచారం పెరిగినా కాగితం ధర మూడురెట్లు అధికమైంది. అయినా 'ఆంధ్రపత్రిక' తన ఆశయసిద్ధి లక్ష్యాన్ని వీడలేదు. తెలుగుజాతిని ప్రకాశమానం చేసి ఐక్యజాతిగా నిలిపేందుకు 'ఆంధ్రపత్రిక' కృషి చేసింది. యుద్ధం ముగిసిన తర్వాత పత్రిక కాంగ్రెస్ పంథాలో స్వాతంత్ర్య భావోద్దీపనకు ముందుకు సాగింది. సహాయ నిరాకరణోద్యమం వంటివి వచ్చి పత్రిక ప్రాచుర్యాన్ని మరింత పెంచాయి. కాంగ్రెస్ బలం పెరిగిన కొద్దీ 'ఆంధ్రపత్రిక'కు ఆదరణ పెరిగింది. దాన్ని అనుసరించి ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమానికి బలాన్ని చేకూర్చేందుకు పత్రిక ముందడుగు

నేసింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటివారు ఈ పత్రికకు సంపాదకత్వం వహించారు.

ఆంధ్ర ప్రజల్లో పత్రికా పఠనాభిలాషను పెంచడంలో కూడా 'ఆంధ్రపత్రిక' చేసిన కృషి ఎన్నదగింది. గ్రంథాలయాలకు ఆంధ్రపత్రిక ప్రతులను ఉచితంగా పంపేవారు. 'ఆంధ్ర పత్రిక'కు అనుబంధంగా సారస్వతానుబంధం వెలువరించారు. 1924 జనవరిలో ప్రారంభించిన 'భారతి' తెలుగునాట సారస్వత, సాంస్కృతిక, వైజ్ఞానిక వికాసానికి ఎంతో దోహదం చేసింది. అంతేగాక 'ఆంధ్రపత్రిక' సచిత్ర వార పత్రిక కూడా ఎంతో సేవ చేసింది. 'ఆంధ్రపత్రిక' విజయవాడకు మారి, ఆ తర్వాత హైదరాబాదుకు విస్తరించి విజయవాడ నుంచి, హైదరాబాదు నుంచి ఏకకాలంలో పత్రికను నడిపారు. చాలాకాలం పత్రిక సాయంకాలం ఎడిషన్ కూడ వెలువడింది. 20వ శతాబ్ది చివరిదశకంలో తెలుగు పత్రికా రంగం సంతరించుకున్న పెనుమార్పులు, పత్రికా నిర్వహణకు పెరిగిన భారీ ఆర్థిక వనరులు మొదలైన కారణాల వల్ల 'ఆంధ్రపత్రిక' 1990లో ఆగిపోయింది. పత్రికా రంగంలో దానికున్న ప్రాధాన్యత, చారిత్రక కర్తవ్య నిర్వహణలో అది నిర్వహించిన పాత్ర దృష్ట్యా 'ఆంధ్రపత్రిక' ను పునరుద్ధరించాలని పారిశ్రామిక వేత్త, ఒంగోలు పార్లమెంటు సభ్యునిగా పనిచేసిన శ్రీ మాగుంట సుబ్బరామిరెడ్డి సంకల్పించారు. అయితే ఆ పని పూర్తి కాకుండానే ఆయన హత్యకు గురయ్యారు.

### f. జనవాణి (1935)

1935లో భారతప్రభుత్వ శాసనాన్ని పురస్కరించుకొని రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చాయి. ఆ సందర్భంలో జస్టిస్ పార్టీ పత్రికగా పిఠాపురం మహారాజా 'జనవాణి' దినపత్రికను ప్రారంభించారు. జస్టిస్ పార్టీ ప్రచారాన్ని, ఇతర విషయాలను మాత్రమే ప్రచురించి అంతరించి ఉంటే ఈ పత్రికకు ఎటువంటి ప్రాధాన్యత లభించి ఉండేది కాదు. ఇది తెలుగు పత్రికా రచనలో వ్యావహారిక భాషకు పట్టం గట్టిన తొలి దినపత్రిక కావడంతో పాటు మరిన్ని విశేషాంశాల్ని స్వంతం చేసుకుంది. ముఖ్యంగా తాపీధర్మారావు గారు ఈ పత్రిక ద్వారా ప్రవేశపెట్టిన కొత్తదనం వల్ల పత్రికకూ, ఆయనకూ పేరు రావడమే కాకుండా తెలుగు జర్నలిజానికి ఒక ఒరవడి లభించింది. గ్రాంథిక భాషాభిమాని అయిన పిఠాపురం మహరాజా స్థాపించిన 'జనవాణి' ని మొదటి నుంచి చివరి దాకా

అంటే 1939లో అది మూతబడే దాకా తాపీ ధర్మారావు వ్యావహారిక భాషలోనే నడిపారు. ఓడల్లో విదేశాల నుంచి సరుకుల కింద పరచుకొని వచ్చే విదేశీ పత్రికలను సేకరించి వాటిలోని పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించి ఆ పద్ధతులను తెలుగులో ప్రవేశపెట్టి విప్లవం తీసుకు వచ్చిన దిట్ట తాపీ ధర్మారావు. ఒక సంఘటనకు సంబంధించిన కథనం లోంచి ముఖ్యమైన వివరాలను మాత్రమే స్వీకరించి వార్తను రూపొందించే మేలిమి విధానాన్ని 'జనవాణి'నుంచే మనం చూడవచ్చు. అది ఆధునిక పత్రికా రచనకు స్ఫూర్తి నిచ్చిందనే చెప్పాలి. ఇందులోని సంపాదకీయ రచనల్లో, శీర్షికల్లో కూడ కొత్తదనం చోటుచేసుకుంది. 1939లో పత్రిక మూతబడి తర్వాత కొంతకాలానికి తిరిగి ప్రారంభమై మరి కొంతకాలం నడిచింది.

## 9. ఆంధ్రప్రభ (1938)

1938 ఆగస్టు 15న రామ్‌నాథ్ గోయెంకా తన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికల వ్యవస్థ నుంచి 'ఆంధ్రప్రభ' తెలుగు దినపత్రికను మద్రాసు నుంచి ప్రారంభించారు. తొలి సంపాదకుడు ఖాసా సుబ్బారావు గారు. తర్వాత న్యాపతి నారాయణమూర్తి 'ఆంధ్రప్రభ' సంపాదకత్వం వహించారు. తర్వాత నార్ల వెంకటేశ్వరరావు గారు సంపాదకులుగా చేరారు. 'ఆంధ్రప్రభ' పత్రిక, నార్ల వారి సంపాదకత్వం పెనవేసుకుని ఒక నవశకానికి నాంది పలికాయి. మారుతున్న సామాజిక పరిస్థితుల కనుగుణంగా నూతనత్వానికి శ్రీకారం చుట్టి వార్తా ప్రచురణలో విప్లవాన్ని సాధించింది 'ఆంధ్రప్రభ.' కొన్ని విలువలు, ప్రమాణాలను రూపొందించుకొని నాటి నుంచి ఈనాటి వరకూ ఆ దారిలోనే పని చేస్తున్నది. జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలకు తగిన విధంగా ప్రాధాన్యత ఇవ్వడం మొదటి నుంచీ అనుసరిస్తున్న పద్ధతి. 1942లో క్విట్ ఇండియా ఉద్యమకాలంలో పత్రికా వార్తలపై ప్రభుత్వం ప్రీసెన్సార్‌షిప్ విధించినప్పుడు అందుకు నిరసనగా 'ఆంధ్రప్రభ' కొంతకాలం వార్తా ప్రచురణ నిలిపి వేసిందేగాని ప్రభుత్వ ఆంక్షలకు తలవొగ్గలేదు. పత్రికలో తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వస్తున్న వార్తలకు భయపడి నైజాం, మైసూరు, తిరువాన్కూరు ప్రభుత్వాలు తమ ప్రాంతాల్లో 'ఆంధ్రప్రభ' ను నిషేధించారు. అయినా పత్రిక ఆ ప్రాంతాలకు రహస్యంగానైనా వెళ్లేందుకు జంకలేదు. నిజాం రాష్ట్రంలో రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పత్రిక వార్తలు ప్రచురించింది.

నార్ల సంపాదకత్వంలో 'ఆంధ్రప్రభ' పత్రిక విస్తృత ప్రచారాన్ని, విశేష జనాదరణను పొందింది. సర్క్యులేషన్ పరంగా కూడా గతంలో లేని అభివృద్ధిని ఆంధ్రప్రభ సాధించింది.

అది రెండవ ప్రపంచ యుద్ధకాలం. యుద్ధ వార్తల్ని పాఠకులకు అందించడంలో వాటి అనువాదంలో ఎంతో నైపుణ్యాన్ని కనబరచింది పత్రిక. జాతీయ, అంతర్జాతీయ సంఘటనలపై కలకాలం నిలిచిపోగల మాటల్ని ప్రమాణీకరించింది.

'ఆంధ్రప్రభ'కు సంపాదకత్వం వహించిన నార్ల వెంకటేశ్వరరావు గారు ఆ పత్రికకే గాక యావత్ పత్రికా రచన స్వరూపాన్నే మార్చి వేయగల కొత్తదనాలను సంతరించారు. పత్రికను సరళ గ్రాంథిక బంధాల నుంచి పూర్తిగా విముక్తం చేశారు. వ్యావహారికంలో కూడా సరళతరమైన పత్రికా భాషను రూపొందించారు. వార్తా రచనా విధానంలో, అనువాద విధానంలో కొత్తదనాన్ని ప్రవేశ పెట్టారు. పరమ అంతర్జాతీయ విషయాలను కూడా పాఠకులకు సులభగ్రాహ్యమయ్యే విధంగా ఆకర్షణీయమైన శైలిలో ప్రచురించేవారు. నార్ల వారి సంపాదకీయాల విశిష్టత జగమెరిగినదే. ఆయనవి నిక్కచ్చి అభిప్రాయాలు. నిర్భయంగా, నిర్మొహమాటంగా తనదైన వాడి పదజాలంతో అభిప్రాయ ప్రకటన చేసేవారు. ప్రపంచ విజ్ఞానాన్ని, బహుగ్రంథ పఠనవల్ల ఆర్జించిన విషయ విజ్ఞాన విస్తృతిని, హేతువాద దృక్పథాన్ని, ఆధునిక ధోరణిని మేళవించితే అది నార్ల పత్రికా రచన అవుతుంది. **1959** ప్రారంభంలో నార్ల ఆంధ్రప్రభ సంపాదక పదవికి రాజీనామా చేశారు. రెండు మూడు నెలల వరకు వి. డి. ప్రసాదరావు సంపాదకత్వం వహించారు.

తర్వాత కలిగిన పరిణామాల్లో 'ఆంధ్రప్రభ' మద్రాసులో తాత్కాలికంగా మూతపడింది. ఆరేడు నెలల తర్వాత విజయవాడలో ప్రారంభమైంది. తర్వాత చిత్తూరులో ఎడిషన్ ప్రారంభించింది. చిత్తూరు ఎడిషన్‌కు జి. కృష్ణ సంపాదకునిగా పనిచేశారు. ఈ పత్రికకు నీలంరాజు వెంకటశేషయ్య, పండితారాధ్యుల నాగేశ్వరరావు, కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం, ఎ. బి. కె. ప్రసాద్, పొత్తూరి వెంకటేశ్వరరావు ప్రభృతులు సంపాదకులుగా ఉన్నారు. గోయెంకాలనుండి కొత్త యాజమాన్యం కొనుగోలు చేసింది.

### h. తెలంగానా (1945)

రెండవ ప్రపంచయుద్ధ పరిసమాప్తి అనంతరం హైదరాబాద్‌లో ఒక తెలుగు దిన పత్రిక స్థాపించాలని ప్రయత్నాలు సాగాయి. తమిళుడైన రాజగోపాల్ మొదలియార్ గారు 1945లో 'తెలంగానా' అనే తెలుగు దినపత్రికను స్థాపించారు. దీనికి బుక్కపట్నం రామానుజాచార్యులు సంపాదకులుగా ఉన్నారు. తెలంగానా మూడేళ్లకు మించి నడవలేదు.

### i. మీజాన్ (1945)

హైదరాబాద్‌లో 1945లో గులాం మహమ్మద్ కలకత్తావాలా అనే వ్యాపారి 'మీజాన్' అనే అరబ్బీ పేరుతో ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు దినపత్రికలు ప్రారంభించాడు. తెలుగు దినపత్రికకు సుప్రసిద్ధ రచయిత, చిత్రకారుడు అడివి బాపిరాజు సంపాదకునిగా ఉన్నారు. బాపిరాజుగారి 'గోనగన్నారెడ్డి' వంటి నవలలు ఇందులో వచ్చాయి. పత్రికా యజమాని కలకత్తావాలా స్వతహాగా వ్యాపారి కాబట్టి చాలా తెలివైన పనిచేశాడు. ఉర్దూ మీజాన్‌లో నిజాం అనుకూల వైఖరిని అవలంబించి ప్రభుత్వ సహాయాన్ని పొందాడు. తెలుగు మీజాన్‌లో కొంతవరకు ఆంధ్రోద్యమంపై సానుభూతి ప్రదర్శించాడు. మీజాన్‌లో పాత్రికేయులు రాంభట్ల కృష్ణమూర్తి, జి. కృష్ణ, తిరుమల రామచంద్ర ప్రభృతులు పనిచేసి ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టారు. మీజాన్‌లో రాంభట్ల ప్రభుత్వ వ్యతిరేక రచనలు, కార్టూన్ కవితలు రాశారు. రజాకార్ అనుకూల పత్రికగా మార్చేందుకు మీజాన్ యాజమాన్యం ప్రయత్నించినందుకు నిరసనగా అడివి బాపిరాజు సంపాదకత్వ బాధ్యతల నుంచి వైదొలగారు. 1948 సెప్టెంబర్‌లో పోలీస్ చర్య జరిగినప్పుడు మీజాన్ మూతబడింది. తనకు అనుకూలంగా ఉండేందుకు నిజాం ప్రభుత్వమే కలకత్తావాలా అనే వ్యాపారిని అడ్డం పెట్టుకుని మీజాన్ పత్రికను నెలకొల్పిందని రాంభట్ల కృష్ణమూర్తి పేర్కొన్నారు.

## ii. స్వాతంత్ర్యానంతరం

### a. గోలకొండ పత్రిక

సురవరం ప్రతాపరెడ్డి గారు నిజాం రాష్ట్రంలో చీకటి రోజులు రాజ్యం చేస్తున్న కాలంలో సాహసోపేతంగా వెలుగు ప్రసరింపజేసేందుకు 'గోలకొండ పత్రిక' ను స్థాపించారు.

గోలకొండ పత్రిక 1947లో దినపత్రికగా మారింది. ప్రతాపరెడ్డి గారు వైదొలగిన తర్వాత దినపత్రికకు నూకల నరోత్తమరెడ్డి సంపాదకునిగా ఉన్నారు. 41 ఏళ్ల పాటు వెలువడిన గోలకొండ పత్రిక 1966లో ఆగిపోయింది.

## b. కమ్యూనిస్టు పత్రికలు

1937 డిసెంబర్ 15న రాజమండ్రిలో ప్రారంభమైన 'నవశక్తి' పక్షపత్రికను కమ్యూనిస్టు పత్రికగా భావించవలసి వుంటుంది. నవశక్తి తర్వాత విజయవాడకు మారింది. అప్పుడు కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధారంభంలో పార్టీపైనా, పత్రికపైనా నిర్బంధం ఎక్కువై ప్రెస్సు మూసుకోవలసి వచ్చింది. తర్వాత 1939 - 42 మధ్య 'స్వతంత్ర భారత్' అనే మరో పత్రిక రహస్యంగా నడిచింది. ఆ పత్రిక దగ్గరుంటే చాలు జైలు శిక్షపడే రోజులవి. 1942 జూన్‌లో పార్టీపై నిషేధం తొలగగానే పార్టీ నాయకులు చాలా మంది జైళ్ళ నుంచీ, అజ్ఞాతవాసం నుంచీ వెలుపలికి వచ్చారు.

అదే అదనుగా 1942 జూన్ 17న 'ప్రజాశక్తి' వారపత్రికగా అవతరించింది. అధికార రీత్యా తొలి కమ్యూనిస్టు పత్రికగా పేర్కొనబడిన పత్రిక ఇది. రెండున్నర సంవత్సరాల పాటు వారపత్రికగా నడిచింది.

1945 డిసెంబర్ 3న 'ప్రజాశక్తి' దినపత్రికగా విజయవాడ నుండి వెలువడడం ప్రారంభించింది. 1948లో తిరిగి కమ్యూనిస్టు ఉద్యమంపై నిర్బంధకాండ కొనసాగింది. పత్రికా కార్యాలయంపై పలుమార్లు దాడులు జరిగాయి. ఫలితంగా 1948 ఏప్రిల్ 22న 'ప్రజాశక్తి' మూతబడింది. నిర్బంధకాండ కొనసాగుతుండగా 'జనత', 'సందేశం', 'జనవాణి' అనే పత్రికలు నడిచాయి.

1951 ఆగస్టులో నిర్బంధం కొంతవరకు సడలింది. ఫలితంగా 1951 నవంబర్ 21న 'ప్రజాశక్తి' తిరిగి వారపత్రికగా ప్రారంభమైంది. 1952 ఎన్నికల సందర్భంలో ద్వైవారపత్రికగా కూడా వెలువడింది. ప్రజాశక్తి పత్రిక మాస్ట్‌హెడ్‌ను అడివి బాపిరాజు చిత్రించారు.

1952 ఎన్నికల అనంతరం పార్టీ నాయకులంతా బహిరంగంగా రావడంతో తిరిగి దినపత్రిక ప్రారంభించాలని పార్టీ నిర్ణయించింది. ఆంధ్ర రాష్ట్ర సాధన, విశాలాంధ్ర సాధన లక్ష్యంతో పత్రికకు 'విశాలాంధ్ర' అని పేరు పెట్టారు. 1952 జూన్ 22న 'విశాలాంధ్ర' దినపత్రిక మోటూరి హనుమంతరావు సంపాదకత్వంలో వెలువడడం ప్రారంభించింది.

1963 జూన్‌లో 'జనశక్తి' వారపత్రికగా ప్రారంభమైంది. తర్వాత అది ద్వైవారపత్రికయ్యింది. 1964 నవంబర్‌లో కమ్యూనిస్టు ఉద్యమ పునర్నిర్మాణం, డిసెంబర్‌లో మళ్ళీ నిర్బంధం వచ్చింది. 1966 సెప్టెంబర్ 1న జనశక్తి దినపత్రికగా మారింది. పార్టీ విచ్ఛిన్నం అప్పుడే సంభవించింది.

1968 జూలై 28న ప్రజాశక్తి వారపత్రికగా పునరుద్ధరించబడింది. 13 సంవత్సరాలపాటు వారపత్రికగా, ద్వైవారపత్రిగా నడిచి 1981 ఆగస్టు 1 నుంచి దినపత్రికగా మారి సి. పి. ఐ. (ఎం) అధికారపత్రికగా నడుస్తోంది.

## b. i. విశాలాంధ్ర

'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' లక్ష్యంగా 1952 జూన్ 22న పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు వంటి త్యాగధనుల చేతుల మీదుగా విశాలాంధ్ర దినపత్రిక ఆవిర్భవించింది. కమ్యూనిస్టు ఉద్యమాలకు అద్దంపడుతూ, ప్రగతిశీల సాహిత్యానికి చోటు కల్పిస్తూ వస్తోంది. వేర్పాటువాద ఉద్యమాలు తలెత్తినప్పుడు 'విశాలాంధ్ర' విశాలాంధ్ర భావనను పెంపొందించింది. ప్రజాస్వామ్యం, అభివృద్ధి, శ్రమజీవుల అభ్యున్నతి లక్ష్యాల సాధనదిశగా జరిగేకృషిలో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులవాణిగా విశాలాంధ్ర ముందుకుసాగుతోంది. ప్రస్తుతం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అధికార దినపత్రికగా ఆధునిక ముద్రణా పరిజ్ఞానాన్ని సమకూర్చుకొని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నాల నుంచి వెలువడుతున్నది.

## b. ii. ప్రజాశక్తి

ప్రజాశక్తి వారపత్రికగా, ద్వైవారపత్రికగా చాలాకాలం నడిచి దినపత్రికగా మారింది. 1968 జూలై 27న వారపత్రికగా ప్రారంభమైనప్పుడు తొలి సంచిక సంపాదకీయంలో ఈ విధంగా లక్ష్యప్రకటన చేశారు."అభివృద్ధి నిరోధకత్వాన్ని, విధానాలను, గుత్తాధిపత్యాన్ని ప్రతిఘటించడానికి జరిగే పోరాటానికి ప్రజాశక్తి ప్రోద్బలమిచ్చి బలపరుస్తుంది. అందుకు అభ్యుదయకాముక ప్రజాశక్తులన్నీ కలిసి పనిచేయాలని ప్రజాశక్తి కోరుకుంటుంది. కార్మికవర్గ నాయకత్వాన కార్మిక, కర్షక ఐక్యతను పునాదిరాయి వేసుకొని జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించడానికి ప్రజాశక్తి కృషి చేస్తుంది".

ఆ దిశలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఐఎం) అధికార పత్రికగా కొనసాగుతూ కార్మిక, కర్షక, రైతుకూలీ ఉద్యమాలకువేదికగా తనదైన మార్గంలో పయనిస్తోంది. ప్రస్తుతం విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నాల నుంచి వెలువడుత ఇతర పెద్దపత్రికల్లోవలె కాలానుగుణమైన మార్పులను స్వీకరించి పాఠకుల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తోంది.

## c. విజయప్రభ (1950)

రాయలసీమ ప్రాంతానికి చెందిన యువకులు మద్రాసు నుంచి 1950లో ప్రారంభించిన 'విజయప్రభ' దినపత్రిక అతికొద్ది కాలం మాత్రమే నడిచింది. హన్మంతరెడ్డి, ఆర్. సుబ్బారెడ్డి, ఎం. కె. వి. రెడ్డి, సి. బాలిరెడ్డి ఆ కొద్దికాలం పత్రికను నడిపేందుకు తమ శక్తియుక్తులను ధారపోశారు.

## d. ఆంధ్రజనత (1955)

1955లో సికింద్రాబాద్ నుంచి 'ఆంధ్రజనత' దినపత్రిక ప్రారంభమైంది.పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణ ఫలితంగా 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. తర్వాత తెలంగాణా, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలను కలిపి విశాలాంధ్ర ఏర్పాటు కోరుతూ సాగించే ఉద్యమానికి ప్రచారం కల్పించేందుకు ఒక పత్రిక ఉండాలని భావించి బూర్గుల రామకృష్ణారావు, వి. బి. రాజు, జనార్దనరావు దేశాయ్ కలిసి 'ఆంధ్రజనత' ను ప్రారంభించారు. దీనికి కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం గారు సంపాదకులుగా ఉన్నారు. 1956 నవంబర్ నాటికి ఒక మోస్తరు సర్క్యులేషన్‌తో స్వయం సమృద్ధిని సాధించే స్థితికి వచ్చింది. తర్వాత ఇది కాంగ్రెస్‌పార్టీ పత్రికగా మారిపోయింది. రాను రాను నిర్వహణ విషయకమైన శ్రద్ధ, వ్యాపార దృష్టి లోపించడం వల్ల పత్రిక ఆగిపోయింది.

## e. ఆంధ్రజ్యోతి (1960)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాడిమండలం లాంటి విజయవాడలో 1960లో శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్ నెలకొల్పిన దినపత్రిక 'ఆంధ్రజ్యోతి'. అప్పటికే విజయవాడ నుంచి విశాలాంధ్ర మొదలైన దినపత్రికలు వెలువడుతున్నా అది పత్రికా కేంద్రంగా రూపొందలేదు. 1939లో 'ఆంధ్రప్రభ' సంపాదకత్వానికి రాజీనామా సమర్పించిన నార్ల

వెంకటేశ్వరరావుగారి సంపాదకత్వంలో 'ఆంధ్రజ్యోతి' విజయవాడలో ప్రారంభమైంది. 'ఆంధ్రజ్యోతి'లో కూడా నార్ల వారిదే కీలకస్థానం. ఒకప్పుడు 'ఆంధ్రప్రభ'లో తాను చేసిన ప్రయోగాలనే 'ఆంధ్రజ్యోతి'లోనూ కొనసాగించే తత్వంకాదు నార్లది. సత్యనూతనత్వం. నిరంతర అన్వేషణ. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికను అగ్రశ్రేణికి చేర్చేందుకు నార్ల ఎంతో కృషి జరిపారు. వాడుక భాషతో పాటు మరో అడుగు ముందుకు వేసి మాండలిక భాషనుంచి కూడా అనేక పదాలను స్వీకరించి ప్రామాణీకరించేందుకు ప్రయత్నించారు. 'ఆంధ్రజ్యోతి'లో కూడా నార్ల చేసిన కృషి వల్ల తెలుగు పత్రికా భాషకు, సంపాదకీయ ఒరవడికి ఎంతో ప్రయోజనం చేకూరింది. 1977లో ఆయన 'ఆంధ్రజ్యోతి' సంపాదక బాధ్యతల నుండి వైదొలగారు. నార్ల తర్వాత 'ఆంధ్రజ్యోతి' సమర్థుడైన సంపాదకుని పొందగలిగింది. నండూరి రామమోహన్‌రావు అనంతరకాలంలో ఆ పత్రికను ఎంతగానో అభివృద్ధి పరచారు. హైదరాబాద్ నుంచి కూడా పత్రిక వెలువడడం ప్రారంభించిన తర్వాత హైదరాబాద్ నుంచి రెసిడెంట్ ఎడిటర్‌గా శ్రీ ఎ. బి. కె. ప్రసాద్ పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి, విశాఖపట్నాల నుంచి కూడా 'ఆంధ్రజ్యోతి' వెలువడుతున్నది. 1986లో హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభించిననాడే ఆధునిక ముద్రణ పరిజ్ఞానాన్ని సమకూర్చుకొని రంగుల్లో ముద్రణ చేపట్టి ముందడుగు వేసింది. వ్యవస్థాపకులు శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్ గారి మరణానంతరం వారి కుమారుడు శ్రీ కె. జగదీష్‌ప్రసాద్ యజమానిగా ఉన్నారు. 2001 నుండి కొంతకాలం మూతబడి తిరిగి 2002లో కొత్త యాజమాన్యం పత్రికను పునరుద్ధరించి నడుపుతోంది

## f. ఆంధ్రభూమి (1960)

సికింద్రాబాద్ నుంచి 1960లో వెలువడడం ప్రారంభించిన 'ఆంధ్రభూమి' దినపత్రిక దక్కన్ క్రానికల్ గ్రూపులో ఒకటి. రామ్‌గోపాల్ మొదలియార్ కుమారులు క్రానికల్‌కు అనుబంధంగా పండితారాధ్యుల నాగేశ్వరరావు సంపాదకత్వంలో 'ఆంధ్రభూమి'

ప్రారంభించారు. ఆనాడు అధునాతనంగా ఉన్న రోటరీ ముద్రణాయంత్ర సౌకర్యంతో తెలంగాణాలో వెలువడిన తొలి పత్రిక ఇది. తర్వాత ఈ పత్రికకు గోరాశాస్త్రిగారు సంపాదకులుగా వచ్చారు. గోరాశాస్త్రిగారి సంపాదకీయాలకోసం పాఠకులు ఎక్కువ సంఖ్యలో 'ఆంధ్రభూమి' చదివేవారంటే అతిశయోక్తి కాదు. గజ్జెల మల్లారెడ్డి, ఎ. బి. కె. ప్రసాద్, సి. క. రాజు వంటి వారు సంపాదకులుగా పనిచేశారు. ప్రస్తుతం ఎం. వి. ఆర్. శాస్త్రి 'ఆంధ్రభూమి' దినపత్రిక సంపాదకులుగా ఉన్నారు. సినిమా, మహిళ, బాలల, కళా, సాహిత్య రంగాలకు ప్రత్యేక పుటలు కేటాయిస్తూ పాఠకాదరణ కోసం ముదడుగు వేస్తోంది. ప్రస్తుతం 'ఆంధ్రభూమి' హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, రాజమండ్రి కేంద్రాల నుంచి వెలువడుతున్నది.

## g. ఈనాడు (1974)

ఆధునిక తెలుగు జర్నలిజాన్ని అన్ని అంశాల్లోనూ ఒక మలుపు తిప్పిన 'ఈనాడు' దినపత్రిక 1974 ఆగస్టు 10న విశాఖపట్టణంలో ప్రారంభమైంది. అనతికాలంలో హైదరాబాద్, విజయవాడ, తిరుపతి కేంద్రాలకు విస్తరించింది. ప్రస్తుతం ఇంకా అనంతపురం, రాజమండ్రి, కరీంనగర్, సూర్యాపేట, గుంటూరు, నెల్లూరుల నుంచి కూడా వెలువడడం ప్రారంభించింది. పత్రిక ఉన్నతికి దాని అధినేత రామోజీరావు కృషి, సంకల్పమే కారణమని విమర్శకుల అభిప్రాయం. పత్రిక ప్రారంభించిన నాటి నుంచి ఈనాటి వరకు ప్రతి అంగుళాన్ని ప్రతి అణువునూ ఆయనే నియంత్రిస్తున్నారు. ఆయన అధికార ముద్ర, ఆలోచనా ముద్ర లేనిదే 'ఈనాడు' కదలికే లేదు. ప్రగతిశీల దృక్పథం, స్వయం కృషితోనే అంతా సాధ్యం అనే స్థిరమైన అభిప్రాయం ఉన్న రామోజీరావు పట్టిందల్లా బంగారమే.

ప్రజలు తమ చుట్టూ జరిగే సంఘటనల గురించి తెలుసుకొనేందుకు ఇష్టపడతారని, స్వయంగా చదువుకొనేందుకు, చదివించుకొని వినేందుకు అనువైన తేలిక భాషను కోరుకుంటారని, అన్నిటికీ మించి పత్రిక తెల్లవారేసరికి ముంగిట్లో వాలాలని ఆశిస్తారనే నాడిని పసిగట్టడంతోపాటు ఆ త్రిసూత్ర పథకాన్ని వేదంగా అమలు చేసింది 'ఈనాడు'. అదే పత్రిక విజయ రహస్యం. వార్తా సేకరణకు 'ఈనాడు' కున్నంత విస్తృత యంత్రాంగం మరో పత్రికకు లేదు. నాణ్యత విషయంలో, వార్తా సేకరణకు, చేరవేతకు, అత్యాధునిక

ప్రమాణాలతో ముద్రణకు అయ్యే ఖర్చు విషయంలో పత్రికది రాజీలేని ధోరణి. పత్రిక తెల్లవారే సరికి వెళ్లవలసిన ప్రాంతాల రూట్ మ్యాపు ఆధారంగా అనుకున్న సమయానికి పత్రికను చేరవేసేందుకు పటిష్టమైన వాహనాల వ్యవస్థ, డెడ్‌లైన్ క్రమశిక్షణ పాటించడం కూడా 'ఈనాడు' ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఏ ప్రాంతంలోనైనా సర్క్యులేషన్‌లో స్వల్ప తేడా వచ్చినా ప్రమోషన్ యంత్రాంగం రంగంలోకి దిగి తిరిగి తగ్గినన్ని కాపీలు పెంచడం కూడా నిరంతరం జరిగే ప్రక్రియ. హైదరాబాద్‌తో సహా వివిధ ప్రచురణ కేంద్రాల్లోని పాత్రికేయ సిబ్బందితో రామోజీరావు ప్రతినెలా సమావేశాలు జరిపి వాళ్లతో అభిప్రాయాలు కలబోసుకుంటూ కార్యోన్ముఖుల్ని చేస్తుంటారు. రోజూ తెల్లవారేసరికి ఇతర పత్రికలతోపాటు ఈనాడు వెలువరించే 30కి పైగా ఎడిషన్లు (పిల్లల పత్రికలతో సహా) చదివి నచ్చినవీ, నచ్చనివీ స్కెచ్ పెన్నుతో మార్క్ చేస్తారు. ఇవి కూడా 'ఈనాడు'ను ప్రభావితం చేసే అంశాలు.

'ఈనాడు' పాత్రికేయులకు ఉత్పత్తి సంస్థ. తనకు కావలసిన పాత్రికేయులను స్వయంగా తయారు చేసుకొనేందుకు 'ఈనాడు స్కూల్ ఆఫ్ జర్నలిజం' ను నడుపుతోంది. గతంలో 'ఈనాడు' అభివృద్ధికి తమ కృషిని అందించిన ప్రముఖుల్లో ఎ బి. కె. ప్రసాద్, వి. హన్మంతరావు, రాంభట్ల, పొత్తూరి వెంకటేశ్వరరావు, గజ్జెల మల్లారెడ్డి, వరదాచారి, వంటివారు ఉన్నారు. దినపత్రికలో సాహిత్యానికి, రాశిఫలాలు వంటి జ్యోతిషాంశాలకు చోటులేదు. 'ఈనాడు' గ్రూపు నుంచి న్యూస్‌టైం ఆంగ్ల దినపత్రిక, చతుర, విపుల, సితార, అన్నదాత పత్రికలు వెలువడుతున్నాయి.

### h. ఉదయం (1984)

సుమారు రెండులక్షల ప్రతుల సర్క్యులేషన్‌తో ప్రారంభమైన తొలి తెలుగు దినపత్రిక 'ఉదయం'. 1984 డిసెంబర్ 29న 'ఉదయం' హైదరాబాద్ నుంచి ప్రారంభమైంది. సుప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు డా. దాసరి నారాయణరావు పత్రికను నెలకొల్పగా ఎ. బి. కె. ప్రసాద్ సంపాదకత్వం వహించారు. అత్యాధునిక ముద్రణాయంత్రాలను వాడడంలో కూడా 'ఉదయం' ముందడుగు వేసింది. హైదరాబాద్‌తో పాటు తిరుపతి, విజయవాడ, కేంద్రాల నుంచి పత్రిక వెలువడింది. ఇతర అగ్రశ్రేణి పత్రికల్లో లాగే ఇది కూడా గ్రూపు పత్రికగా ఆవిర్భవించి 'ఉదయం' సచిత్రవార పత్రికను, 'శివరంజని' సినీ పత్రికను నడిపింది. పత్రికాభాషను మరింత సరళీకృతం చేసి మాండలికాలకు పట్టంగట్టి పాఠకాదరణను చూరగొన్నది. విద్యా

ఉద్యోగరంగాల్లో అవకాశాల కోసం చూసే పాఠకుల కోసం పత్రికకు అదనపు అనుబంధంగా 'దిక్సూచి' ని ప్రవేశపెట్టి పత్రిక డిమాండు పెంచింది. అటువంటి అనుబంధాలు ప్రవేశపెట్టడంలో మిగతా పత్రికలకు మార్గదర్శకమయింది. దినపత్రిక వారాంతపు అనుబంధంగా చక్కని పుస్తకాన్ని అందించడంలో కూడా 'ఉదయం' తనవంతు కృషి చేసింది. తర్వాతి కాలంలో మిగతా పత్రికలు ఆదివారం అనుబంధాల్ని మెరుగ్గా అందించాయి.

పత్రికా రచనలో ప్రగతిశీల భావుకతను, వామపక్ష భావ సానుభూతి ధోరణిని ప్రవేశపెట్టడంలో 'ఉదయం'ను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పత్రికా రచనలో ఔత్సాహికులకు అవకాశాల్ని పెంపొందించడంలో కూడా 'ఉదయం' ముందు నడిచింది. నిర్వహణపరమైన కారణాల వల్ల మూసివేశారు.

### i. వార్త (1996)

ఎ. బి. కె. పబ్లికేషన్స్ బ్యానర్ మీద సంఘి పరిశ్రమల గ్రూపు **1996** ఫిబ్రవరి **1**న హైదరాబాద్ నుంచి వెలువరించడం ప్రారంభించిన దినపత్రిక 'వార్త.' ఏకకాలంలో పది కేంద్రాల నుంచి వెలువడిన తొలి తెలుగు దినపత్రికగా నమోదైంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కడప, అనంతపురం, ఒంగోలు, నిజామాబాద్, వరంగల్, తిరుపతి కేంద్రాల నుంచి వెలువడుతోంది. కంపోజింగ్, ముద్రణ ప్రమాణాలతో పాటు వివిధ ప్రాంతాలనుంచి ప్రచురణకేంద్రాలకు వార్తల్ని చేరవేయడానికి ప్రవేశపెట్టిన పద్ధతులు ఇతరుల కంటే ఒకడుగు ముందే ఉన్నాయి. ప్రతి రోజూ 'చెలి' పేర మహిళలకు, 'మొగ్గ' పేరుతో బాలల కోసం ప్రత్యేక అనుబంధం, వృత్తి, విద్య, వికాసం, ఉపాధి, నాడి, పల్లె, కృతి, కళ వంటి అనుబంధాలు ప్రచురిస్తున్నది. విఖ్యాత సంపాదకుడు డా॥ ఎ బి.కె. ప్రసాద్ సంపాదకీయాలు పత్రికకు జీవనాడిగా భాసించేవి.[4] ఏ విషయంపై రాసినా లోతైన పరిజ్ఞానం. ఆదివారాల్లో సాహిత్య సంపాదకీయాలకు విశేషమైన ఆదరణ.

ఇవే కాకుండా తెలుగునాట దినపత్రికలుగా తక్కువ, ఒక మోస్తరు స్థాయిలో కొంతకాలం నడిచి అంతరించినవి, ఇంకా నడుస్తున్నవి, ప్రాంతీయంగా తక్కువ స్థాయిలో కూడా కొన్ని దశాబ్దాలుగా నడుస్తున్నవి అనేకం ఉన్నాయి. **1962**లో రాయలసీమ ప్రముఖులు కొందరు కలిసి పండితారాధ్యుల నాగేశ్వరరావు గారి సంపాదకత్వంలో 'ప్రజాప్రభ' దినపత్రికను ప్రారంభించారు. చింతలపూడి

---

4. ఎబికె వార్త నుంచి వైదొలగారు.

వరప్రసాదమూర్తి రాజు (సిహెచ్ వి. పి. మూర్తిరాజు) గారు మాచెర్ల కృష్ణమూర్తి గారి సంపాదకత్వంలో 'ఆంధ్రరత్న' దినపత్రికను ఆడంబరంగా ప్రారంభించారు. 1973లో ఎం.ఎ. రహమాన్‌గారు స్వీయ సంపాదకత్వంలో 'నవ్యాంధ్ర' దినపత్రికను ప్రారంభించారు. గౌతులచ్చన్న గారు 'బహుజన' పేరుతో నడుపుతున్న వారపత్రికను గత 1991 పార్లమెంటు ఎన్నికల సమయంలో దినపత్రికగా మార్చి నడిపారు. ఇవన్నీ కొంతకాలం నడిచి అంతరించాయి. విశాఖలో వారపత్రికగా వెలువడుతున్న 'విజయభాను' 1966 నుంచి దినపత్రికగా మారింది. వరంగల్‌లో 'జనధర్మ' వారపత్రికను, 1961 నుంచి జనవాణికి ప్రతిధ్వనిగా ఎం. ఎస్. ఆచార్య వరంగల్‌వాణి పేరిట ప్రాంతీయ దినపత్రికను ప్రారంభించి నిర్వహిస్తూ వచ్చారు. వారు ఇటీవలే మరణించారు. విజయవాడలో రామ్మోహనరావుగారు 'జనత' అనే పేరుతో సాయంకాలం దినపత్రికను నడిపారు. ఏలూరుతో 'ఏలూరు టైమ్స్' నడుస్తోంది. రాజమండ్రిలో గత 37 సంవత్సరాలుగా గంధం సీతారామానుజాచార్యులు 'సమాచారం' నడుపుతున్నారు. గతంలో 'ఆంధ్రప్రభ' కు సంపాదకత్వం వహించిన కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం గారు 'కోస్తావాణి' ని రాజమండ్రి నుంచి విజయవంతంగా నడుపుతున్నారు. ఇంకా 'అరుణ' (1947) కాకినాడ నుంచి, 'ముందడుగు' (1958), సర్కార్ ఎక్స్‌ప్రెస్ నడిచాయి. ఉజ్వల (1985) కర్నూలు నుంచీ, 'జీవగడ్డ' (1985) కరీంనగర్ నుంచి, రత్నగర్భ (1964) ఏలూరు నుంచి నడిచాయి. ప్రస్తుతం హైదారాబాద్ నుంచి పిరాట్ల వెంకటేశ్వర్లు సంపాదకత్వాన 'కృష్ణాపత్రిక', 'పాంచజన్య' సంపాదకత్వాన 'మహానగర్' వెలువడుతున్నాయి. బైస రాందాసు ఆధ్వర్యంలో 'పొద్దు' దినపత్రిక నిజామాబాద్, హైదరాబాద్‌ల నుంచి వెలువడుతున్నది. నల్గొండ నుంచి 'ప్రజాపోరాటం' వెలువడుతోంది. చాలావరకు చిన్న పత్రికలు ఆర్థికపరమైన చిక్కుల వల్ల ఎంతకాలం నడుస్తాయో, ఎప్పుడు ఆగిపోతాయో చెప్పలేని పరిస్థితి. దినపత్రికలుగా రిజిస్టరై కూడా వనరుల్లేక నడవలేని స్థితిలో ఉన్న పత్రికలున్నాయి.

ఈ అధ్యాయంలో దినపత్రిక ఆవిర్భావ వికాసాలను స్వల్పమాత్రంగా ప్రదర్శించటం జరిగింది. దీనవలన దినపత్రికల భాషా, సాహిత్య సేవలను, స్వరూపాన్ని గురించి సిగ్గిష్టంగా చర్చించుకోడానికి వీలు కలుగుతుందని భావించవచ్చు.

# 5. తెలుగు దినపత్రికల భాషా స్వరూపం

## i. ఆధునికీకరణ అవసరాలు

ప్రపంచవ్యాప్తంగా సమాజం ఎన్నడూ లేనంత వేగంగా మారిపోతున్న కాలమిది. అపూర్వమైన ఆధునిక సాంకేతిక విజ్ఞాన సన్నివేశంలో మనమున్నాం. ఇదివరకు ఎవరూ ఊహించని కొత్త కొత్త అవసరాలు పుట్టుకొస్తున్నాయి. కొత్త అవసరాలు కొత్త కొత్త మార్పులకు దారులు వేస్తాయి. ఈ మార్పులకు భాష మినహాయింపేమీ కాదు. భాష ఇదివరకు లేని కొత్త బాధ్యతలను (Functions) నిర్వర్తింపవలసి వస్తున్నది. అది ఇదివరకు తనకున్న నిర్దిష్టమైన క్షేత్రపరిధులను దాటుకొని విస్తరించవలసి వస్తున్నది. ఈ విస్తరణనే ఆధునికీకరణగా మనం భావించవచ్చు. ఒకప్పుడు మన తెలుగు వచన భాష సాహిత్య విషయాలకే పరిమితమై ఉండేది. బ్రిటిషువాళ్ళు పరిపాలించిన కుంపిణీ యుగంలో సాహిత్యేతర విషయాలకు విస్తరించిన విషయం మనకు తెలుసు. భూగోళం, చరిత్ర, ఆరోగ్యం వంటి విషయాలపై ఆ కాలంలో గ్రంథాలు వెలువడ్డాయి. కందుకూరి వీరేశలింగం కాలంలో సంఘ సంస్కరణవంటి వినూత్న భావాలకు వాహికగా భాష తన సరికొత్త కర్తవ్యాన్ని నిర్వహించింది. అప్పటికి అదే పెద్ద మార్పు.

సాధారణంగా స్వభావాన్ని బట్టి చూస్తే భాషకు త్వరత్వరగా మారే నైజం లేదు. అది మెల్లగా ప్రవహించే నది. ప్రవహిస్తున్నట్లు తెలియనంత మెల్లగా అది నడుస్తుంది. కాని అది ఎప్పుడైతే సమాజంతో తన కొంగు ముడివేసుకుందో అప్పుడు దాంతో పరుగెత్తక తప్పలేదు. దశాబ్దం, దశాబ్దానికి పెరుగుతూ వచ్చి ఇప్పుడు సంవత్సరం సంవత్సరానికి అనూహ్యమైన వేగంతో ముందుకు నడుస్తున్నది. ఇక్కడ భాష మారుతున్నది అన్నప్పుడు కొత్త అవసరాలతో కొత్త ధర్మాలతో కొత్త బాధ్యతలతో స్వయం సమృద్ధమవుతున్నదన్న మాట. ఇట్లా క్షణ క్షణం స్వయం సమృద్ధం కావడమే ఆధునికీకరణ.

ఆధునికీకరణలో, సులభీకరణ ఒక ప్రధానాంశం. ఈ సులభీకరణ బ్రిటిష్ వారి కాలంలోనే మొదలైంది. పత్రికల స్థాపనతో ఈ సులభీకరణ అనివార్యమైంది. గిడుగు వ్యవహారికోద్యమం దీనికో నిర్దిష్టమైన రూపాన్నీ ఊపునూ ఇచ్చింది. గురజాడ వంటి

రచయితలు ఈ లక్ష్యానికి రూపాన్ని కూడా సాధించారు. వ్యావహారిక భాషోద్యమం గ్రాంథిక భాషకు వ్యతిరేకంగా వచ్చినట్లు పైకి కనబడ్డా నిజానికి అది సులభీకరణ మార్గంలో పయనించిందని భావించవచ్చు. సులభీకరణలో అంతర్గతంగా ఉన్న అంశమేమిటంటే మౌఖికభాషకు లిఖితభాషకు దూరాన్ని తగ్గించటం.

భాష ఆధునికీకరణలో భాషయొక్క ఉపరిస్వరూపం మాత్రమేకాక ఆంతరిక నిర్మాణంలో కూడా మార్పువస్తుంది. ప్రధానంగా ఆధునికీకరణలో ఈ కింది అంశాలను గమనించవచ్చు. 1. కొత్త పదాల కల్పన. 2. నూతన శైలీ విధానం 3. లేఖన విధానం వంటివి.

ఆధునికీకరణపైన పాశ్చాత్య ప్రభావం ఉందనడం సబబు కాదు. ఎందుకంటే అది కాలధర్మాన్ని సూచించే అభిప్రాయం కాదు. ఇక్కడి కొత్త అవసరాలే దీన్ని సృష్టించుకున్నాయి తప్ప విదేశాల అవసరాలకనుగుణంగా ఇది రూపొందడం లేదు. అయితే పరోక్షంగా మన సమాజం మీద పాశ్చాత్య ప్రభావం ఉంటే ఉండవచ్చు అది వేరు.

గతంలో వ్యావహారికోద్యమంగానీ, గ్విన్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీగానీ, తెలుగు ఆకాడమీ గాని భాషను ఆధునికీకరించవలసిన క్రమంలో ఎంతో దోహదం చేశాయి. అయితే పత్రికాభాషను ఆధునికీకరించడానికి ఇటువంటి సంస్థాగతమైన లేదా వ్యూహాత్మకమైన ప్రయత్నాలేవీ జరిగినట్లు లేదు. ఒకరకంగా ప్రతినిత్యం పత్రికా భాష ఆధునికీకరింపబడుతూనే ఉంది. దీనికి ఫలానా వ్యక్తియో సంఘమో అని కాక ప్రతిపాత్రికేయుడు ప్రతిక్షణం ప్రయత్నిస్తూనే ఉన్నాడని చెప్పాలి.

## ii. భాషా స్వరూపం

పత్రికల యాజమాన్యానికి గాని సంపాదకవర్గానికిగాని జర్నలిజంలోని ఇతర శాఖలపై ఉన్నట్టుగా భాషను గురించి ప్రత్యేక దృష్టి ఏదీ లేదని అనిపిస్తుంది. అయితే 'ఈనాడు' దినపత్రికను దీనికి అపవాదంగా' చెప్పవచ్చు. దాదాపు 160 పంవత్సరాల నుంచి తెలుగులో పత్రికలు వెలువడుతున్నా భాషలోగాని, శైలిలోగాని తమదైన ప్రత్యేక స్వరూపాన్ని నిర్ణయించుకున్నవి కాదు. ఈ దృష్టి ఇతర పత్రికలకు ఉన్నట్టు లేదు. 'ఈనాడు' దినపత్రిక ఆవిర్భావం రోజుల్లో విలేఖరులకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో కూడా ఈ భాషా దృష్టి కనిపిస్తుంది. 'ఈనాడు' సరళీకరణ లేదా ఆధునికీకరణ

మాత్రమే గాక ఒక సామాన్యీకరణను కూడా ఏర్పరచుకొనే ప్రయత్నంలో 'ఈనాడు భాషా స్వరూపం' పేరుతో ఒక భాషా నియమావళి గ్రంథాన్ని ప్రకటించింది. దీన్ని ప్రముఖ భాషాశాస్త్రవేత్త డా॥ బూదరాజు రాధాకృష్ణ రూపొందించారు. ఈ సామాన్యీకరణకు గల కారణాలను ఆయన ఈ విధంగా చెప్పారు. "ఒక్కొక్క వ్యక్తికి ఒక ప్రత్యేక శైలి ఉండేమాట నిజం. అయితే పత్రికా ప్రచురణ ఎవరో ఒక వ్యక్తి చేయగలిగింది కాదు. అందులోనూ దినపత్రికల విషయంలో అసలు సాధ్యం కాదు. రకరకాల అనుభవాలూ, విద్యా సంస్కారాలు ఉన్న వ్యక్తులు పత్రికల్లో పనిచేస్తుంటారు. వారంతా ఒక ప్రాంతం వారు గానీ, ఒక కులం వారు గాని, ఒక మతం వారు గాని కారు. విద్య, కులం, మతం, వృత్తి, ప్రాంతం వంటి వన్నీ భాషలో భేదాలు తెచ్చిపెట్టేవే. భాషలో ఉన్న ఒక ప్రత్యేకత వైవిధ్యంలో ఏకత్వం, భిన్నవ్యక్తులు రాసే భాషలో ఏకత్వం సాధించటం అంటే భిన్నవిధ మాండలికాల నుంచి ఒక సాధారణ భాషా లక్షణాన్ని ఏర్పరచుకోవటమే. ఒకే పత్రిక భిన్న ప్రాంతాల నుంచి ఏకకాలంలో వెలువడేటప్పుడు ఆ పత్రికాభాషలో సాధ్యమైనంత ఏకరూపత లేకపోతే అది 'ఒకే' పత్రిక అనిపించదు. అందువల్ల అందరూ పాటించవలసిన కొన్ని నియమాలు ఏర్పరచుకోవాలి. ప్రపంచ భాషాపత్రికలన్నింటికీ భాషావిషయకంగా కూడా కొన్ని నియమ నిబంధనలున్నాయి. అలాగే 'ఈనాడు[1] కూ కావాలి."

ఈ నియమాలను పత్రికను ప్రారంభించిన ఆరేళ్లలోనే రూపొందించుకున్నారు. ఇది జీవద్భాషా వ్యవహారంలో నిత్యానుభవాన్ని ప్రోది చేసుకొని పత్రికలో ఉపయోగించే భాషకు ఒక నిర్దిష్ట స్వరూపాన్ని ఆశించడమన్న మాట. అయితే ఇక్కడ ఒక సందేహం తలెత్తవచ్చు. ప్రవాహశీలమున్న భాషకు ఒక ఏకరూపత సాధ్యమవుతుందా? అసలు ఏకరూపత అన్నది శాస్త్రీయంగా సాధ్యపడేదేనా? సామాన్యీకరించడం వల్ల ఆధునికీకరణ అనే నిరంతర స్రవంతి ఘనీభవించదా? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. దానిని రాధాకృష్ణ గారు ఈ విధంగా సమర్థించారు. "నియమం చేసినంత సులభంగా పాటించడం సాధ్యపడదు. అందుకు ప్రయత్నం, సాధన అవసరం. నియమంలో గొప్ప ప్రయోజనాలున్నాయి. మొదటి ప్రయోజనం సంయమనం. రెండోది ఏకరూపత.

1. 'ఈనాడు భాషా స్వరూపం' ఉషోదయా పబ్లికేషన్స్ ప్రై.లి. హైదరాబాద్ ప్రచురణ ప్ర.ము. పు. 1

మూడోది 'నాది' అనే భావం నుంచి 'మనది' అనే అభిప్రాయానికి మారటం. నాలుగోది బహుజన సమ్మతి."[2]

'అయితే ఇది ప్రాథమిక ప్రయత్నమే. అనుభవాన్ని పురస్కరించుకొని ఈ ప్రణాళికను అప్పుడప్పుడు పునర్విమర్శించుకోవలసి ఉంటుంది' అనే స్పృహ వల్ల ఇది కరడు గట్టిన ఇనుపచట్రం కాదని, కొత్తదనానికి వెసులుబాటు ఉందని తెలుస్తుంది. ఆ పత్రిక తనదైన ప్రత్యేక ముద్రను స్థాపించుకోటానికే ఈ పద్ధతిని పాటిస్తున్నదని గ్రహించవలసి ఉంటుంది.

## iii. అనువాదం

దినపత్రికా పరిశ్రమలో అనువాదమనేది ఒక అనివార్య వ్యాపారంగా మారింది. ప్రాంతీయ భాషల్లోని పత్రికలు మొదటి నుంచీ అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీషు పైన ఆధారపడే అగత్యం ఉండేది. ఇప్పటికీ ఉంది. బహుశా ఇక ముందు కూడా ఉంటుంది. భారతదేశంలోని ప్రాంతీయ భాషల్లో హిందీ ఎక్కువమంది మాట్లాడే భాష. ఉత్తరాది పత్రికలు హిందీ పైన ఆధారపడే పరిస్థితి ఉంది. ఒకప్పటి వలసవాద దేశాలన్నిటిపైనా ఇంగ్లీషు ప్రభావం అవిస్మరణీయ స్థితికెప్పుడో చేరింది. వసుధైక కుటుంబం (Global Family) అనే భావన ఈనాడు బాగా అనుభవంలోకి వస్తున్నది. ప్రసార సాధనాలు ఊహించలేనంత వేగాన్ని సాధిస్తున్నాయి. వాటిలో వార్తా పత్రికలకు సంబంధించినంత వరకు అద్భుతమైన సాంకేతిక సాధనం టెలిప్రింటర్. టెలిప్రింటర్ ప్రవేశం వల్ల వార్తా వేగం పెరిగింది. దీని ప్రమేయం వల్ల ఇదివరకు కొద్దిగా ఉన్న అనువాద అవసరం ఇప్పుడు ప్రధానంగా మారిపోయింది. అనువాదం లేని జర్నలిజాన్ని ఈనాడు ఎవ్వరూ ఊహించలేరు.

అసలీ అనువాదమంటే ఏమిటి? దీనివల్ల భాషకు మేలుజరుగుతున్నదా? కీడు వాటిల్లుతున్నదా? లేక భాషకు ఇదివరకు లేని సరికొత్త జవజీవాలు సంప్రాప్తించాయా? ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకవలసి ఉంది.

మనం అనువాదమనే మాటను వాడుతున్నాంగానీ అసలైన అర్థంలో అనువాదం ఎక్కడా లేదు. జరుగుతున్నదంతా అనుసృజనమే. 'No man ever translates, He always transcreates' అనేది సిద్ధాంతం. ప్రపంచంలో ఇంతవరకు నిర్దుష్టమైన ఏ

2. *'ఈనాడు భాషా స్వరూపం' ఉషోదయా పబ్లికేషన్స్ ప్రై.లి. హైదరాబాద్ ప్రచురణ ప్ర.ము. పు. 1*

అనువాద యంత్రమూ ఆచరణలో సాధ్యం కాలేదు. మన ప్రాచీన కవులెవరూ తాము అనువాదం చేస్తున్నామని చెప్పలేదు. 'తెనుగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్'[3] అని నన్నయను రాజరాజ నరేంద్రుడు కోరాడు. తిక్కన, ఎర్రనలు కూడా అనువాదమనే మాటను ఎక్కడా వాడలేదు. సంస్కృతంలో భాషాంతరీకరణమంటున్న ఈ అనువాదం ఒక భాషలో చెప్పినదాన్ని మరో భాషలో చెప్పడం అని స్థూలంగా అర్థం చెప్పుకుంటున్నాం.

'వద్' అనే ధాతువుకు 'అను' అనే ఉపసర్గ చేరితే అనువాదం ఏర్పడింది. 'అను' అంటే ఒకరు చెప్పిన తర్వాత మరొకరు చెప్పడమని అర్థం. పునః కథనం అని అర్థం. అంటే ఒకమారు చెప్పిన విషయాన్ని తిరిగి చెప్పడమన్నమాట.

To translate is to change into another language retaining the strange[4] అని జాన్సన్ అభిప్రాయపడ్డాడు.

(Smith A. H. 1958 VII)

ఇక అనువాదకుని విషయానికొస్తే : అతనికి అనేక భాషల్లో ప్రవేశముండాలి. అయితే ఒక వ్యక్తికి అనేక భాషల్లో సమానమైన సామర్థ్యం ఉండదు. అసమానమైన సామర్థ్యం మాతృభాషలోనే ఉంటుంది.

కాబట్టి నూటికి నూరుపాళ్లు సహజంగా రూపొందే అనువాదం ఆదర్శమే గాని ఆచరణలో సాధ్యమయ్యేది కాదు.

అయితే అనువాదానికి కొన్ని స్థూలమైన సూత్రాలున్నాయి. అనువాదంలో మూలంలోని పదాలుంటాయి. మూలంలోని భావాలుంటాయి. అనువాదంలో రచయిత శైలి, అనువాదకుని శైలి రెండూ ఉంటాయి. సొంత రచనలా కనపడే ప్రయత్నం ఉంటుంది. అందుకనే మూల విధేయానువాదం, స్వేచ్ఛానువాదం అని రెండు రకాలున్నట్లు చెబుతూ ఉంటారు. పత్రికాఫీసుల్లో వ్యవధి తక్కువ ఉండటంవల్ల అనువాదకునికి కుశాగ్రబుద్ధి, సద్య స్ఫురణ ఉండవలసిన అవసరం ఉంది.

అనువాదకుడు ధ్వనికి సంబంధించిన సమస్యల్ని, పదాలు, నుడికారాలకు సంబంధించిన సమస్యల్ని, పద నిర్మాణానికి సంబంధించిన సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది.

---

3. *శ్రీమదాంధ్ర మహాభారతం - కవిత్రయం*
4. *Smith A.H. 1958 VII*

# Ramdas takes over as navy chief amidst controversy

*Newstoday*

New Delhi: Amidst controversy over his credentials and seniority, Admiral Laxminarayan Ramdas took over charge on Friday as the nation's eleventh chief of naval staff.

Admiral Ramdas, whose father-in-law, Vice-Admiral R D Katari was the first Indian naval chief, was received at the South Block naval headquarters by the outgoing chief of naval staff, Admiral J G Nadkarni.

The controversy over Admiral Ramdas's appointment is unprecedented in the history of the navy and has arisen on two counts.

One is the statutory complaint submitted by Vice-Admiral S Jain, FOC-in-C western command, to the Prime Minister on grounds of supersession. Admiral Jain was, in fact, due to retire in March this year, but was given an extension, and thus an impression was created that he had been cleared for the top job. Now, he is due to retire next month.

The second is the case filed in the Bombay high court where two journalists have filed a writ petition challenging the appointment of Admiral Ramdas on the ground that one of his daughters was married to a Pakistani national as also his culpability in the sinking of the petya-class "Andaman" in manoeuvres off the coast of Visakhapatnam when he was the FOC-in-C eastern command.

What is perhaps intriguing is that it was the National Front government with Mr V P Singh as Prime Minister and defence minister which first gave the extension to Admiral Jain, and then pitched on Admiral Ramdas for the top post, although it was known at one point of time that the outgoing naval chief had expressed his preference for the former.



In any event, Admiral Ramdas assumed charge on Friday under shadows of doubts of credibility, if not competence, which had no doubt sullied the spotless white image of the navy.

Unfazed, however, by the controversy over his appointment, Admiral Ramdas was a picture of confidence in his informal chat with newsmen after his assumption of office at his South Block office.

He said it would be his endeavour to "restore the credibility and confidence of the navy." This would call for a lot of a teamwork, cooperation, training and ingenuity.

# నౌకాదళ ప్రధానాధికారి రామదాసు పదవీ స్వీకారం

న్యూఢిల్లీ, నవంబరు 30 (న్యూస్‌టుడే): అడ్మిరల్ లక్ష్మీనారాయణన్ రామదాసు నియామకం, సీనియారిటీ విషయాల్లో వివాదం కొనసాగుతుండగానే రామదాసు శుక్రవారంనాడు దేశ పదకొండో నౌకాదళ ప్రధానాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. భారత మొట్టమొదటి నావల్ చీఫ్ వైస్-అడ్మిరల్ ఆర్.డి. కటారికి రామదాసు అల్లుడు. ఇక్కడ సౌత్‌బ్లాక్‌లో నౌకాదళ ప్రధాన కేంద్రంలో కనువిందుగా జరిగిన కార్యక్రమంలో నౌకాదళ ప్రధానాధికారిగా పదవినుంచి వైదొలుగుతున్న అడ్మిరల్ జె.జి. నాదకర్ణి రామదాసుకు స్వాగతం పలికారు.

నౌకాదళ చరిత్రలోనే ఇంతకుముందెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో రామదాసు నియామకంపై వివాదం చెలరేగింది. తన సీనియారిటీని తోసిరాజని రామదాసుని నౌకాదళ ప్రధానాధికారిగా నియమిస్తున్నారని పశ్చిమ దళాధిపతి వైస్ అడ్మిరల్ ఎస్. జైన్ ప్రధానికి ఫిర్యాదు చేశారు. వాస్తవానికి జైన్ ఈ ఏడాది మార్చితో రిటైర్ కావలసి వుంది. అయితే ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. వచ్చేనెల ఆయన రిటైర్ కావలసి వుంది.

ఇదిలా వుండగా, అడ్మిరల్ రామదాసు నియామకాన్ని సవాల్‌చేస్తూ ఇద్దరు జర్నలిస్టులు బొంబాయిహైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రామదాసు కుమార్తెను పాకిస్తాన్ పౌరునికిచ్చి వివాహం చేశారని, అంతేగాకుండా రామదాసు తూర్పు నౌకాదళ అధిపతిగా వుండగా, నౌకాదళ విన్యాసాలు జరుగుతున్న సమయంలో ఓడ సముద్రంలో మునిగి 14 మంది ప్రాణాలు కోల్పోయారని ఈ కారణాల వల్ల ఆయన నియామకం చెల్లదని జర్నలిస్టులు తమ రిట్ పిటిషన్లో పేర్కొన్నారు. ఏది ఏమైనా సందేహాల నీలినీడల మధ్య అడ్మిరల్ రామదాసు శుక్రవారంనాడు నౌకాదళ ప్రధానాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

అడ్మిరల్ రామదాసు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడినప్పుడు, ఈ వివాదం గురించి ప్రస్తావించలేదు. నౌకాదళంలో విశ్వాసాన్ని విశ్వసనీయతను పెంపొందించేందుకు కృషి చేస్తానని దీనికి అందరి సహకారం ఉండాలని చెప్పారు. అంకిత భావంతో పనిచేయడం, విశ్వసనీయత, సమైక్యత నౌకాదళ ప్రధాన సూత్రాలుగా వుండాలన్నారు. వనరులు పరిమితంగా వున్న విషయాన్ని అంగీకరిస్తూ ఉన్నవాటితోనే సత్ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

57 ఏళ్ల వయస్సుగల అడ్మిరల్ రామదాసు మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. 1933 సెప్టెంబర్ 5న బొంబాయిలో జన్మించిన రామదాసు 1953, సెప్టెంబర్ 1న నౌకాదళంలో చేరారు. 37 ఏళ్ళ సుదీర్ఘ జీవితంలో ఆయన నౌకాదళంలో వివిధ పదవులు నిర్వహించారు.

5· ఈనాడు, న్యూస్‌టైం దినపత్రికల సంచికలు 1·12·90 నుంచి

పై వార్తకు ఇంగ్లీషు మూలం చాలా వరకు నుడికారంతోనే ఉంది. అక్కడ కూడా అలంకారయుక్త వాక్యాలున్నాయి. తెలుగు పాత్రికేయుడు దానికి సమవుజ్జీగానే అనువదించాడని చెప్పవచ్చు.

(i) Controversy

'Ramdas' appointment is unprecedented in the History of Navy'

నౌకాదళ చరిత్రలో ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో రామదాస్ నియామకంపై వివాదం చెలరేగింది.'

'Outgoing chief of Naval staff'

'పదవి నుంచి వైదొలగుతున్న నౌకాదళ ప్రధానాధికారి'

(ii) 'As also his culpability in the sinking of the petya class "Andaman" in Manoeuvres off the coast of Visakhapatnam' when he was FOC -in-C eastern command.'

'అంతేకాకుండా శ్రీ రామదాసు తూర్పు నౌకాదళం అధిపతిగా ఉండగా నౌకాదళం విన్యాసాలు జరుగుతున్న సమయంలో ఓడ సముద్రంలో మునిగిపోయి (14 మంది ప్రాణాలు కోల్పోయారని)'.

(iii) 'In any event, Admiral Ramdas assumed charge on Friday under shadows of doubts.'

'ఏది ఏమైనా సందేహాల నీలినీడల మధ్య అడ్మిరల్ రామదాస్ శుక్రవారం నాడు నౌకాదళం ప్రధానాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.'

(iv) 'In his informal chat with Newsmen.'

'విలేఖరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడినప్పుడు'

(v) He said, it would be his endeavour to restore credibility and confidence of the Navy.'

'నౌకాదళం విశ్వాసాన్ని, ప్రతిష్టను పెంపొందించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

పై ఉదాహరణలో తెలుగు పాత్రికేయుని అనువాద పటిమ తెలియ వస్తుంది.

'Controversy ' కి కనీ వినీ ఎరుగని రీతిలో . . . . , వివాదం అనటం (ఉదాహరణ-1), 'Shadows of doubts' ను సందేహాల నీలినీడలు అని అనువదించటం (ఉదాహరణ-3)

'Credibility and confidence' ను

'విశ్వాసాన్ని, విశ్వసనీయతనుగా' తర్జుమా చేయడం (ఉదాహరణ-6) పాత్రికేయుని సృజనాత్మక కల్పనాశక్తికి నిదర్శనంగా ఉంది.

వార్తను సహజసుందరంగా మలచుకోడానికి నుడికారాలు ప్రయోగించడం జరుగుతుంది. నిజానికి అతి తక్కువ వ్యవధిలో జరిగే ఈ అనువాదం పాత్రికేయుని ప్రతిభా పాటవానికి సవాలు వంటిది.

ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే నిజానికి రెండు విభిన్న భాషల పత్రికల్ని దగ్గరపెట్టుకొని చూసినప్పుడు అనువాదంలో మరెన్నో విశేషాలు గోచరిస్తాయి.

అయితే కొన్ని వార్తలు అనువాద కళగా బాగున్నప్పటికీ పదాడంబరం వల్ల గ్రామీణ ప్రజలకు అర్థం కాకుండా పోయే ప్రమాదముంది. ఉదాహరణకు 'Shadows of doubts = నీలినీడలు' విషయంలో ఈ పరిస్థితి ఉంది. కవితాత్మకంగా ఉండడమే ఇందుకు కారణం. అయితే ఈ కవితాత్మకత మూలంలోనే ఉండడం వల్ల పాత్రికేయునికి అదే స్థాయిలో అనువదించక గత్యంతరం లేదు. ఇది గ్రామీణ పాఠకులకు అందకపోతే అది అంగ్లంలో ఉన్న భావన (concept) కు సంబంధించిన లోపమే కాని అనువాదానికి సంబంధించిన లోపం కాదు. అనువాదం చేసేటప్పుడు తత్సమ పద బాహుళ్యం ఉండటం కనిపిస్తుంది. అయితే మారుమూల అచ్చ తెలుగు పదాలకు లభించిన ప్రచారం ఇదివరకే మన సంస్కృతిలో అవిభాజ్య భాగమైపోయిన తత్సమ పదాలకుండడం వల్ల అవి తప్పటం లేదనుకోవాలి.

ఆంగ్లంలో కర్మణి వాక్యాలున్నప్పటికీ అనువాదంలో అవి తెలుగుకు సహజమైన కర్తర్థక వాక్యాల్లోనే రాయటం నేటి పత్రికా భాషలో కనిపించే విశేషం.

## iv. నవ్య పదకల్పన

నవ్య పదకల్పన కూడా ఒకరకంగా అనువాదమే. కాని ఇది సృజనాత్మక శక్తి (creativity) ని అపేక్షిస్తుంది.

కొత్త అవసరాలు వచ్చినపుడు కొత్త పదాల కల్పన అవసరం అవుతుంది. అనూహ్యంగా, వేగంగా మారుతున్న సమకాలీన సమాజంలో అపూర్వమైన భావన (concept) లు

ఎదురవుతూ ఉంటాయి. ఆ కొత్త పద భావాలను తెలుగులో వ్యక్తీకరించవలసిన అవసరమే నవ్యపద సృష్టికి దారి తీస్తుంది. ఈ కల్పన రెండు రకాలుగా సాగుతుంది. 1. పదాలను ఆదానంగా తెచ్చుకోవటం 2. పదాలను సృష్టించుకోవటం. ఆదానంగా తెచ్చుకునే పద్ధతి సులభమైంది. అంటే అన్యదేశ్యాలను కొన్ని లేఖన సర్దుబాట్లతో తెలుగులో చేదుకోవటం. రెండవపద్ధతి అనువాదకుడ్ని భాషాపరమైన, సాంస్కృతికపరమైన సవాళ్లకు గురిచేస్తుంది. సృజనశక్తి, విషయ పరిజ్ఞానం కలిగిన పాత్రికేయులు నూతన సృష్టి చేస్తారు. అటువంటివి కొన్నిసార్లు వ్యవహారంలో తిష్ట వేసుకుంటాయి. అనాయాసంగా అన్యదేశ్యాలను ఆశ్రయించడమనేది అనువాద మార్గంలో ఆమోదయోగ్యమే అయినా తెలుగులో నూతన పదసృష్టి ప్రయత్నం ఎల్లప్పుడూ హర్షయోగ్యమవుతుందని పలువురు భాషావేత్తలు, పత్రికా రచయితలు పేర్కొంటున్నారు.

నిజానికి గ్రామీణ ప్రజలు మాట్లాడే మాండలిక భాషలో కూడ కొన్ని అపురూపమైన మాటలున్నాయి. వాటిని సందర్భానుసారంగా పదకల్పన సమయంలో పునఃప్రవేశపెట్టడం సరైనదే. ఇప్పటికే ఎంతగానో అభివృద్ధి చెందిన భాషల్లో సైతం ఇతర భాషా పదాలు విడదీయరానంతగా కలిసి వున్నాయి. తెలుగులో కూడా ఆ విధంగా ఆంగ్ల, సంస్కృత, ఉర్దూ, హిందీ తదితర భాషలకు చెందిన మాటలనేకం తెలుగుమాటలే అన్నంతగా స్థిరపడిపోయాయి. కాలానుగుణంగా కొత్త భావనలు, శాస్త్ర, సాంకేతికాభివృద్ధి, ప్రపంచంలోని వివిధ దేశాలు ఒకదానితో ఒకటి సమీపం కావడం వంటి పరిణామాల వల్ల కూడా వివిధ భాషలకు చెందిన నూతన పదాలు తెలుగులోకి ఆదానంగా వచ్చి చేరుతున్నాయి. జీవద్భాషా వ్యవహారంలోకి వాటి వలసను అరికట్టలేం. అన్యదేశ్యాలను యథాతథంగా స్వీకరించడంలో తప్పులేదు. ఇది ఆధునికీకరణ క్రమం కూడా. అయితే అదే సమయంలో నిత్య వ్యవహారంలో ముప్పిరి గొంటున్న ఇతర భాషలకు చెందిన పదాలను గురించి ఆలోచిస్తూ ఒక మాటను రెండవసారి వాడవలసి వచ్చినప్పుడు తెలుగులో ఒక పదాన్ని సృష్టించే కృషి లుప్తం కాగూడదు.

"దినపత్రిక భాష ప్రజలకు సంపూర్ణంగా అర్థం కావడం లేదు. కాబట్టి సాధ్యమైనంత వరకు దేశ్యపదాలనే వాడాలి. తత్సమ, ఆంగ్ల పదప్రయోగం తగ్గాలి. గత్యంతరం లేని స్థితిలో తప్పదు" అని ప్రసిద్ధ సంపాదకులు ఎబికె ప్రసాద్ అభిప్రాయపడుతున్నారు.[6]

---

6. ఎబికెతో ఇంటర్వ్యూ - తెలుగు దిన పత్రికల భాష ఆధునీకరణ - డా. పి. చంద్రశేఖర్ అనుబంధం 3-2 అముద్రితం

పై అభిప్రాయం ప్రకారం వేగంగా డెడ్‌లైన్ వెంట పరుగెత్తడంలో ఇతర భాషల్లోని మాటలను యథాతథంగా తీసుకుంటూపోవడం కొంతవరకు తప్పదు. అయితే అనువాద విధానంలో కొన్ని కొత్త మాటల్ని సృష్టి చేయడం కూడా ఒక భాగంగా కొనసాగితే మంచిది. ఎందుకంటే "దినపత్రిక లైవ్ వైర్ వంటిది. అది సరళంగా స్పష్టంగా సూటిగా వుండాలి. నుడికారపు సొంపులతో అలరారుతుండాలి. ఇటీవల పత్రికా రచనలో నుడికారం లోపిస్తుందన్న మాట వాస్తవమే"[7] అని ఎ. బి. కె. చెప్పారు.

వార్తా పత్రికా పాఠకులు అత్యధిక సంఖ్యాకులు అక్షరాస్యత దృష్ట్యా సామాన్యులు కాబట్టి పాత్రికేయుడు వారిని దృష్టిలో ఉంచుకొని రాయాలని, వారికి అర్థమయ్యే మాటలే ప్రయోగించాలనే వాదం ప్రబలంగా ఉండటంతో పాటు పత్రికా భాష సరళ గ్రాంథికం, శిష్టవ్యావహారికం వంటి దశలు దాటి సామాన్యీకరణ చెందాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న కాలం ఇది.

నూతన పదకల్పనకు మూడు మార్గాలు కనిపిస్తున్నాయి.

1. మణిప్రవాళ వాదం లేదా అంతర్జాతీయ వాదం 2. సహజ పరిణామ వాదం 3. పరిభాషా వివరణ వాదం.[8] వాటిని కొంచెం వివరంగా తెలుసుకుందాం.

## i. మణిప్రవాళవాదం లేదా అంతర్జాతీయవాదం

శాస్త్ర వైజ్ఞానిక రంగాల్లో, ఇతరత్రా పరిణామాల్లో ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కొత్త మాటలు, పారిభాషికపదాలు వాడుకలోకి వస్తాయి. ఆ మాటలను యథాతథంగా లిప్యంతరీకరించుకోవడం ఈ పద్ధతి. మూలభాషలోని మాటను లక్ష్య భాషలోకి యథాతథంగా తీసుకోవడం వల్ల అనువాదకులకు ఇబ్బంది ఉండదు.

## ii. సహజపరిణామవాదం

ఏవిధ భాషల నుంచి వచ్చే పారిభాషిక పదావళిని ఒకే ఒక్క మాటలో అనువదించేందుకు ఇబ్బందులున్న దృష్ట్యా దాని అర్థ వివరణను బట్టి రెండు మూడు

7. ఎబికెతో ఇంటర్వ్యూ - తెలుగుదిన పత్రికల భాష ఆధునీకరణ - డా.పి. చంద్రశేఖర్ అనుబంధం 3-2 అముద్రితం.

8. తెలుగులో శాస్త్ర పరిభాష వ్యాసం. చేరా ప్రత్యేక సంచిక సంపా. ఎన్. చంద్రశేఖర్ ఎ.పి.ఎస్. సాంబమూర్తి, ప్రచురణ : తెలుగు సారస్వత సమాఖ్య, న్యూఢిల్లీ.

మాటల్లో వివరణాత్మకంగా ప్రచారంలోకి తేవడం ఈ పద్ధతి. వివరణాత్మకంగా అర్థం తెలిసిన మీదట క్రమంగా పదసృష్టికి అవకాశమేర్పడుతుంది. ఇందులో ఒక పారిభాషిక పదానికి ఒక్కొక్కరు ఒకో రకమైన అనువాదాన్ని వాడతారు. ఏకరూపత కష్టం. అయితే వ్యవహారంలో ఆమోదయోగ్యతను బట్టి ఒక రూపం స్థిరపడే అవకాశం ఉంటుంది.

## iii. పరిభాషా వివరణవాదం

ఒక పారిభాషికవాదాన్ని లక్ష్య భాషలో సంక్షిప్తంగా అనువదించడం సాధ్యం కాకపోవచ్చు. అటువంటి పదాలను భావస్ఫూర్తితో వివరణ పూర్వకంగా అనువదించవచ్చు. యథాతథంగా తిప్యంతరీకరించుకోవడం కన్నా ఇది మెరుగైన పద్ధతిగా భావిస్తున్నారు. వివరణాత్మకంగా రాసినప్పుడు స్థలాన్ని ఆక్రమించడం, మూలపదంతో దీటైనదిగా రూపొందకపోవడం వంటి ఇబ్బందులున్నా అర్థం చేసుకొనేందుకు సౌలభ్యం ఉంటుంది. దినపత్రికల్లో పై మూడు పద్ధతుల్లో సాగే నూతన పదకల్పన రీతులు 10 అనువాదాంశాలుగా కనపడుతున్నాయి. 1, 2, 3, 4 - 10 అవి :

### a. ప్రతిష్టాత్మక ఆదానాలు

ఇతర భాషల్లోని మాటలకు తెలుగులో పదాలను కల్పించేటప్పుడు కొన్ని సందర్భాల్లో అచ్చ తెలుగులో తగిన మాటలున్నా సంస్కృతీకరణ క్రమంలో సంస్కృతం నుంచి ఆంగ్లం నుంచి ఇతర భాషల నుంచీ పదాలు తీసుకోవడం జరుగుతున్నది.

ఉదా :

| ఆంగ్లం | తెలుగు | సంస్కృతం/ఆంగ్లం/ఉర్దూ |
|---|---|---|
| Smoking | పొగతాగడం | ధూమపానం |
| Gold Medal | బంగారు పతకం | స్వర్ణపతకం |
| First time | తొలిసారి | ప్రథమం |
| Sports | ఆటలు | క్రీడలు |
| And others | మొదలైన వారు | ప్రభృతులు |
| Cabinet | మంత్రివర్గం | క్యాబినెట్ |
| dethroned | కూల్చివేయడం | బర్తరఫ్ |

**b. అవశ్యపూరక ఆదానాలు**

తెలుగు ఆదానాలకు ఎంతో అనువైంది. ఏ భాషలోని మాటలనైనా తనలో ఇముడ్చుకుని సొంతం చేసుకోగల సౌలభ్యం తెలుగు భాషకుంది. ఇతర భాషల నుంచి పదాలను ఆదానం చేసుకోవాల్సిన అగత్యం ప్రతిభాషకూ ఉంటుంది. ఆ విధంగా తెలుగులోకి వచ్చి చేరిన పదాలు తెలుగు పదాలు కావనేందుకు వీల్లేనంతగా స్థిరపడిపోయాయి.

| ఆంగ్ల పదాలు | ఉర్దూ | సంస్కృతం |
|---|---|---|
| పార్టీ | తహశీల్‌దారు | ప్రాణం |
| గవర్నర్ | ఫికర్ | అధికారం |
| కలెక్టర్ | పేషి | లేఖ |
| ఎం. ఎల్. ఏ. | మాజీ | భూమి |
| గేట్లు | హోదా | భవనం |
| రోడ్డు | జిల్లా | పక్షి |
| కార్పెట్ | ఖరీదు | భయం |

**c. సంపూర్ణ పదాదానం**

వివిధ భాషల నుంచి అనేక పదాలు చేరుతున్న క్రమంలో చాలావరకు పదాలను తెలుగులోకి యథాతథంగా స్వీకరించడం జరుగుతున్నది. ఆంగ్ల విద్య వల్ల తెలుగులోకి ఆంగ్ల భాషా పదాలే ఎక్కువ వచ్చాయి. ఆ విధంగా వచ్చి స్థిరపడి తెలుగు పదాలంత గౌరవం అందుకుంటున్న మాటలనేకం ఉన్నాయి. ఆంగ్లం నుంచి సంపూర్ణపదాదానంగా లిప్యంతరీకరించుకొని స్థిరపడిన మాటలు :

| | |
|---|---|
| రాకెట్ | కంప్యూటర్ |
| క్లబ్ | స్పుత్నిక్ |
| పోలింగ్‌బూత్ | డ్రెడ్జర్ |
| కంట్రాక్టర్ | పార్లమెంటు |

| | |
|---|---|
| ఫోన్ | రాబోట్ |
| కేబుల్ | స్కానింగ్ |
| ఆటోరిక్షా | స్కాం |
| కారు | రోడ్డు |

**d. మిశ్ర సమాసకల్పన**

సమాసాన్నో, పదబంధాన్నో అనువదించేటప్పుడు రెండింటిలో వీలయితే ఒక మాటను అనువదించి, ఒకటి మూలభాషలోని మాటను యథాతథంగా కలిపి మిశ్ర సమాసంగా చేయడం జరుగుతోంది.

ఇతర రచనల్లో సంస్కృత, తెలుగు మిశ్రసమాసాలు కనిపిస్తాయి. దినపత్రికా రచనలో ప్రధానంగా కనిపించేవి ఆంగ్ల తెలుగు ఉభయభాషా పదాలతో కూడిన మిశ్రసమాస కల్పన, కొన్నిసార్లు ఆంగ్ల - సంస్కృత భాషలతో మిశ్ర సమాసకల్పన కూడా జరుగుతుంది.

వేర్వేరు గ్రూపులు
పార్లమెంటరీ పార్టీ నాయకుడు
ఓటర్ల జాబితా
క్లోరిన్ వాయువు
హైకోర్టు న్యాయమూర్తి
బడ్జెట్ ప్రసంగం
హోంమంత్రి

**e. అర్థానుకూలనం**

కొన్ని ఇదివరకు చాలాకాలం కిందటే భాషలో వేళ్లూనుకొని ఉన్న దేశ్య పదాలు తర్వాతి కాలంలో భావ సారూప్యం కలిగిన కొత్త పదాల్లో పొదుగుతుంటాయి. భావన నూతనమైనదే అయినా అర్థం దృష్ట్యా దానికి బాగా అతికే పాత మాటలతో కొత్త పదబంధాలురూపొందుతాయి. ఇది గతంలో లేని అర్థాలనిచ్చే విధంగా ఉంటాయి.

అంతరిక్ష కర్మాగారం (అంతరిక్షం ఇదివరకే ఉంది. ప్రాచీనమైంది)

వాణిజ్య పన్నులు (వాణిజ్యం ప్రాచీనం పన్నులు అనే క్రొత్త భావనకోసం చేరింది)

శాసనసభా వ్యవహారాలు (శాసనం ప్రాచీనం)

సినీతారలు (తారలు)

ప్రజాస్వామ్యం (స్వామ్యం)

### f. పదానువాదం

ఇందులో సాధారణంగా మూలభాషలోని పదాన్ని లేక పదాలను అనుకరించి లక్ష్యభాషలో పదాలను అనువదిస్తారు. మూలభాషలోనిది సమాసపదమైతే లక్ష్యభాషలో కూడా దాని అర్థాన్ని మననం చేసుకుంటూ అనువాద సమాస రచన చేయడం కనిపిస్తుంది. ఆ విధంగా చేసిన అనువాదాలు వ్యవహారంలో అనేకం నిలిచిపోయాయి.

| | | |
|---|---|---|
| Industrial Development Corporation | - | పరిశ్రమల అభివృద్ధి సంస్థ |
| Road Transport Corporation | - | రోడ్డు రవాణా సంస్థ |
| Department of Tourism | – | పర్యాటక శాఖ |
| Rural Water Supply | - | గ్రామీణ నీటి సరఫరా |
| Family Welfare | - | కుటుంబ సంక్షేమం |
| Electricity Board | - | విద్యుచ్ఛక్తి మండలి |
| First Information Report | - | ప్రథమ సమాచార నివేదిక |
| Basic Eminities | - | కనీస సౌకర్యాలు |
| Essential Commodities | - | నిత్యావసర వస్తువులు |

### g. తాత్పర్యార్థం

మూల భాషలోని ఒక మాటను లక్ష్య భాషలో ఒకటి లేదా రెండు మాటలతో అనువదించలేని పక్షంలో కొన్ని మాటలతో వివరణాత్మకంగా అనువదించడం జరుగుతుంది. మూల భాషలోని మాటకు ఆ భాషలో ఉన్న తాత్పర్యార్థంతో

అనువదించడం జరుగుతుంది. సాధారణంగా ఈ అనువాదం రెండు మూడు మాటలతో కూడి వుంటుంది.

| | | |
|---|---|---|
| Bhopal Gas Tragedy | - | భోపాల్ గ్యాస్ విషాదం |
| Departmental Enquiry | - | శాఖాపరమైన దర్యాప్తు |
| Delhi-based Company | - | ఢిల్లీకి చెందిన కంపెనీ |
| Jawahar Rozgar Yojna | - | జవహర్ రోజ్‌గార్ పథకం |
| Weaker Section Housing | - | బలహీనవర్గాల గృహనిర్మాణం |
| Cabinet meeting | - | మంత్రివర్గ సమావేశం |
| Foreign exchange regulation | - | విదేశీమారక ద్రవ్య నియంత్రణ |

## h. అర్థ పునర్నిర్వచనం

ప్రాచీన ప్రయోగాలకు సంబంధించిన మాటలు ఆధునిక కాలంలో చోటు చేసుకున్న అభివృద్ధికర పరిణామాల్లో కొత్తఅర్థాలతో అర్థపునర్నిర్వచితమై కనిపిస్తాయి. ప్రాచీన కాలంలో ఆ మాటలిచ్చే అర్థం నూతన భావనా పరిధులకు విస్తరించడం గమనించవచ్చు. ఇతర భాషలకు చెందిన కొత్త మాటలను అనువదించేటప్పుడు చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని స్పృశించడమన్న మాట.

| | | |
|---|---|---|
| Strategy | - | వ్యూహం (పూర్వం యుద్ధ తంత్రానికి మాత్రమే ఉపయోగించే మాట. యుద్ధం చాలా రకాలు) |
| Helmet | - | శిరస్త్రాణం (పూర్వం సైనికులు యుద్ధం చేసేటప్పుడు ధరించేవి. ఇప్పుడు వాహనాలు నడిపే వారు ధరిస్తారు) |
| Imperialism | - | సామ్రాజ్యవాదం (సామ్రాజ్యం అనేది ప్రాచీన రాచరిక సంప్రదాయంలోది. ఇప్పుడు అర్థం వేరు) |
| Trust | - | నిధి (గతంలో దీనికి కోశం అనే అర్థం ఉంది. ఇప్పుడు అర్థం వేరు) |
| All India Radio | - | ఆకాశవాణి (ప్రాచీనకాలంలో అశరీరవాణిగా, ఆకాశవాణిగా ఉంది. ఇప్పుడు రేడియో అనే అర్థంలో ఉంది) |

### i. అర్థవ్యాకోచం

ఒక కాలంలో పరిమితమైన అర్థానిచ్చిన పదం అనంతరకాలంలో మరిన్ని విషయాలకు అర్థబోధకంగా విస్తృతమైనప్పుడు దాన్ని అర్థవ్యాకోచంగా పరిగణించవచ్చు. ఒక కాలంలో ఒక సందర్భానికి పరిమితమైన పదం తర్వాతి కాలంలో దానితో పోలిన, లేక ఒకే స్వభావం కలిగిన సందర్భాలకు నూతన భావాల అభివ్యక్తికి పరివ్యాప్తమైతే అర్థవ్యాకోచం కలిగినట్లు.

పట్టువదలని విక్రమార్కుడు

అతిరథమహారథులు

దీక్ష

ఉపసంహరణ

భరతవాక్యం

మంగళం

దాడి

### j. భావానువాదం

కొన్ని మాటలకు యథాతథంగా పదానువాదం చెయ్యలేం. రెండు పదాలు కలిసి ఒక పారిభాషిక పదంగా ఏర్పడిన పదబంధంలో రెండూ వేరే వేరే అర్థాలనివ్వవచ్చు. ఒకోసారి మాటకు ఉన్న అర్థం వేరు ఒక పారిభాషిక పదంలో చేరినప్పుడిచ్చే అర్థం వేరుగా ఉంటుంది. ఒకోసారి రెండు భాషల్లో ఒకే మాట వేరు వేరు అర్థాలనిస్తుంది. హిందీలో 'రాజ్య' అంటే రాష్ట్రమని, 'రాష్ట్ర్' అంటే జాతి అని, 'ఉపన్యాస్' అంటే నవల అని, 'ఉద్యోగ్' అంటే పరిశ్రమలని అర్థం. ఈ దృష్ట్యా కొన్ని పదాలకు భావానువాదం తప్పనిసరి అవసరం. నుడికారాల అనువాదం కూడ ఇందులోకి వస్తుంది.

| | | |
|---|---|---|
| Treasury Bench | - | అధికార పక్షం |
| Appropriation Bill | - | ద్రవ్య వినిమయ బిల్లు |
| Privilege Motion | - | సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం |

| | | |
|---|---|---|
| Black Day | - | నిరసన దినం/సంతాప దినం |
| Walkout | - | వాకౌట్ ప్రకటించి సభలోంచి వెళ్లిపోవడం |
| Give up | - | విరమించడం |
| Green Revolution | - | వ్యవసాయ విప్లవం |
| Liquer Free | - | మద్యరహిత |

### k. శబ్ద పల్లవీకరణ

ఇంగ్లీషులో క్రియా పదంతో వ్యక్తమయ్యే భావం తెలుగుకు వచ్చేసరికి నామవాచకానికి సహాయ క్రియాపదం తోడు చేయవలసి ఉంటుంది.

| | | |
|---|---|---|
| Complete | - | పూర్తి చేయు |
| To arrange | - | ఏర్పాటు చేయు |

ఇందులో కొన్నిసార్లు ఇంగ్లీషు లేదా హిందీలో క్రియా పదా (తెలుగులో అయితే నామవాచకం) న్ని లిప్యంతరీకరించి ఆ మాటను యథాతథంగా వాడుతూనే దానికి తెలుగులో శబ్దపల్లవం జోడించి అనువాద పదసృష్టి చేయడం కనిపిస్తుంది. దాన్నే శబ్ద పల్లవీకరణ అంటారు.

| | | |
|---|---|---|
| To cancell | - | రద్దు చేయటం ('రద్దు' హిందీ మాటను యథాతథంగా తీసుకుంటూ దానికి 'చేయటం' తో శబ్దపల్లవీకరించడం) |
| To arrest | - | అరెస్టు చేయటం |
| To vote | - | ఓటు వేయటం |
| To punish | - | శిక్షించటం (శిక్షించటం సంస్కృతం) |

పత్రికల్లో ప్రత్యక్షానువాదంలో మునిగి వుండే పాత్రికేయులకు ఈ పద్ధతులకు గురించి ఆలోచించే వ్యవధి ఉండదు. ఈ ఆలోచించటం అనేది భాషాపరమైన వివేచన.

## v. లేఖన పద్ధతులు

'వ్యవహారంలో భాష మానవునంత ప్రాచీనమైంది. మనం ఇప్పుడు మాటలతో వ్యవహరిస్తున్న భాష ఏర్పడి 25 వేల సంవత్సరాలైందని ఒక అంచనా. అయితే లిపి

మాత్రం ఇటీవలనే ఏర్పడినట్లు తెలుస్తున్నది. లేఖన పద్ధతి మొట్టమొదట ఎలా ఆరంభమైందో తెలియదుగానీ చిత్రలేఖనం నుంచి ఇది ఉద్భవించిందని చెప్పవచ్చు.[9] ఏ భాషకైనా ధ్వని మౌలిక లక్షణం. లిపి దానికి గౌణమే కాని మౌలిక లక్షణం కాదు. ధ్వనికి, భాషకూ ఉండే సంబంధం హేతుబద్ధమైనదేమీ కాదు. అది యాదృచ్ఛికమే కాకుండా పరంపరాగతమైంది కూడా. ఫలానా మాటకూ ఫలానా లిఖిత రూపానికీ మధ్య హేతుబద్ధమైన కారణాలేమీ లేవు. కాబట్టి ఈ రెంటి మధ్య అంతరముంది. భాషాధ్వనులకు లిపి నిర్మాణం సమగ్రంగా ఉండదు. ఒక లేఖన రూపానికి అనేక ధ్వనులుండవచ్చు. ఒక ధ్వనికి అనేక లేఖన రూపాలు కూడా ఉండవచ్చు. పూర్తిగా ధ్వని విధేయ లిపి అంటూ ఉండదు. భాషా శాస్త్రజ్ఞులు ఇటీవల ఉచ్చారణలో నిక్కచ్చితనం కోసం అంతర్జాతీయ ధ్వని విధేయ లిపి (International Phonetic Alphabet) ను రూపొందించుకోవడం జరిగింది. ఆధునిక భాషలో 43 వర్ణాలున్నట్లు చేకూరి రామారావు గుర్తించారు. అందులో 10 అచ్చులు 33 హల్లులు. అవి.

అచ్చులు : అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఒ, ఓ

హల్లులు : క, ఖ, గ, ఘ, చ, ఛ, జ, ఝ, ట, ఠ, డ, ఢ, ణ

త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ, ళ, f

ఆధునిక ప్రామాణిక తెలుగులో 46 వర్ణాలున్నాయని భద్రిరాజు కృష్ణమూర్తి పేర్కొన్నారు. వాటిలో అచ్చులు 11, హల్లులు 35.

అచ్చులు : అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఎ̄, ఒ, ఓ

హల్లులు : క, ఖ, గ, ఘ, చ, చ̆, ఛ, జ̆, జ, ఝ, ట, ఠ, డ, ఢ, ణ

త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ, ళ, f

పై వర్ణ సమామ్నాయాల్లో ఋ, ౠ, ఌ ౡలు లేవు. ఇవి నేటి వ్యవహారంలో చ్యుతమయ్యాయి. ఒకప్పుడు వీటికి ప్రత్యేక ఉచ్చారణ ఉండేది. అయితే 'ఋ' తో కూడిన పదాలు ఇప్పటికీ కనిపిస్తాయి. 'ఋ' వర్ణానికీ సాదు రేఫానికీ మధ్య వ్యవహారం సాగుతూనే ఉంది. వాటిని ఉచ్చారణలో 'ఋ' ను 'రు' గా పలుకుతున్నారు.

9. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పి.ఎస్. సుబ్రహ్మణ్యం, తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ ద్వి.ము. 1993

10. ఆధునిక భాషా సంగ్రహవర్ణన, తెలుగు భాషా చరిత్ర, భ. కృష్ణమూర్తి - 1994 ద్వి. ము. 1993

11. తెలుగు భాషా చరిత్ర - భద్రిరాజుకృష్ణమూర్తి తెలుగు విశ్వవిద్యా. ప్రచురణ.

| | | |
|---|---|---|
| ఉదా : | ఋణం | → రుణం |
| | ఋషి | → రుషి |

అరసున్నా కూడా వ్యవహారం లోంచి జారిపోయింది. ఏదో కొన్ని చోట్ల 'మాఁవ', ఏఁవిటి వంటి చోట్ల వ్యవహారంలో అనునాసిక ధ్వనిని సూచించటానికి వాడుతున్నారు. సాదు శకటరేఫాల మధ్య కూడా భేదం చెరిగిపోయింది.

| | | |
|---|---|---|
| ఉదా : | చెఱువు | → చెరువు |
| | కఱువు | → కరువు |
| | గుఱ్ఱం | → గుర్రం |

వ్యావహారిక భాషలో పదాదిరేఫము లోపించడం వల్ల లేఖనంలో కూడా రేఫం లోపించింది.

| | | |
|---|---|---|
| ఉదా : | క్రొత్త | → కొత్త |
| | మ్రాను | → మాను |
| | వ్రేలు | → వేలు |
| | త్రాగు | → తాగు |
| | క్రింద | → కింద |
| | ప్రేలు | → పేలు |
| | త్రాచు | → తాచు |

పదాంతంలో ఉన్న 'ఉ' వర్ణకానికి బదులు పూర్ణానుస్వారం వ్రాయడం వ్యావహారిక భాషా లక్షణంగా మారింది.

| | | |
|---|---|---|
| ఉదా: | రాజ్యము | → రాజ్యం |
| | పుస్తకము | → పుస్తకం |
| | సంఘము | → సంఘం |
| | విగ్రహము | → విగ్రహం |
| | భయము | → భయం |

| | | |
|---|---|---|
| వైవిధ్యము | → | వైవిధ్యం |
| వ్యాపారము | → | వ్యాపారం |
| అంతర్భాగము | → | అంతర్భాగం |

సామాన్య భాషా వ్యవహర్తల్లో మహాప్రాణోచ్చారణ తరచూ లోపించడం జరుగుతోంది. మహాప్రాణంతో ఉండేవి ఎక్కువగా సంస్కృత ధ్వనులే.

| | | | |
|---|---|---|---|
| ఉదా : | శ్రేష్ఠం | → | శ్రేష్టం |
| | కంఠం | → | కంటం |
| | పాఠం | → | పాటం |
| | సంక్షోభం | → | సంక్షోబం |
| | నిబంధన | → | నిబందన |
| | నిష్ఠూరం | → | నిష్టూరం |
| | శంకుస్థాపన | → | శంకుస్తాపన |
| | బాధ | → | బాద |

కాని 'థ', 'ధ' ల విషయంలో ధ్వని సామ్యం కంటే లిపిసామ్యమే శ్వాస భేదం పోవడానికి దారితీసిందని చెప్పవచ్చు.

| | | | |
|---|---|---|---|
| ఉదా : | జగన్నాథ | → | జగన్నాధ |
| | ప్రాథమిక | → | ప్రాధమిక |
| | అర్థశాస్త్రం | → | అర్ధశాస్త్రం |
| | గ్రంథాలయం | → | గ్రంధాలయం |
| | స్వార్థం | → | స్వార్ధం |
| | ప్రగతిపథం | → | ప్రగతిపధం |
| | రథచక్రాలు | → | రధచక్రాలు |
| | దృక్పథం | → | దృక్పధం |

'గ' కారం 'వ' కారంగా ఆధునికీకరణ చెందడం వ్యావహారిక భాషలో కనిపిస్తున్నదే.

| | | |
|---|---|---|
| నగుబాటు | → | నవుబాటు |
| ప్రేగులు | → | ప్రేవులు |
| కన్నుల పండుగగా | → | కన్నులపండువుగా |
| బాగుంది | → | బావుంది |

అలాగే 'మ' కారానికి రెండు రకాల ఉచ్చారణ ధ్వని పరిసరాలు మారినప్పుడు )పిస్తుంది.

| | | |
|---|---|---|
| మామయ్య | → | మాఁవయ్య |
| ఎందుకేమిటి | → | ఎందుకేఁవిటి |
| రాముడు | → | రాఁవుడు |
| భూములు | → | భూఁవులు |

కోస్తాజిల్లాల మాండలికంలో 'స' 'శ' ల మధ్య భేదం తొలగిపోయింది.

| | | |
|---|---|---|
| చూసారు | → | చూశారు |
| వేసారు | → | వేశారు |
| సాయి | → | శాయి |
| వెరసి | → | వెరశి |
| సివంగి | → | శివంగి |
| సీతాఫలం | → | శీతాఫలం |
| వచ్చేశారు | → | వచ్చేసారు |
| చేశారు | → | చేసారు |
| శలవు | → | సెలవు |

ఒకపదంలోని వర్ణం లోపించి దానిముందున్న వర్ణం దీర్ఘం అవుతోంది. దీన్ని ర్ఘలోపత అంటారు. ఇది ఎక్కువగా 'హ' వర్ణం లోపించినప్పుడు జరుగుతుంది.

| | | |
|---|---|---|
| తహశీల్‌దారు | → | తాశిల్దారు |
| రహదారి | → | రాదారి |
| సహోదరుడు | → | సోదరుడు |
| మహారాజు | → | మారాజు |
| మొహమాటం | → | మోమాటం |
| సహాయం | → | సాయం |

ఆంగ్ల భాష ద్వారా తెలుగులోకి వచ్చిన పదాలు లిప్యంతరీకరణకు లోనవుతాయి

| | | |
|---|---|---|
| Bank | → | బ్యాంకు |
| Tank | → | ట్యాంకు |
| Van | → | వ్యాను |
| Land | → | ల్యాండు |
| Dam | → | డ్యాము |
| Fan | → | ఫ్యాను |
| Ballot | → | బ్యాలెట్ |
| Manner | → | మ్యానర్ |
| Banner | → | బ్యానర్ |

ఒక ధ్వని ద్విత్వ, సంయుక్త హల్లులతో కూడినప్పుడు 'అ' 'ఎ' గా మారుతోంది

| | | | | |
|---|---|---|---|---|
| Fashion | → | ఫ్యాషన్ | → | ఫేషన్ |
| Value Based | → | వాల్యూబేస్డ్ | → | వేల్యూబేస్డ్ |
| Ranking | → | రాంకింగ్ | → | రేంకింగ్ |
| Thanks | → | థాంక్స్ | → | థేంక్స్ |
| Canara Bank | → | కానరా బాంక్ | → | కెనరా బేంక్ |

సంధి స్వరాలైన 'ఐ' 'ఔ' గా 'ఔ', అవు' గా మారుతుంటాయి. ఇవి రెండురకాలుగా మారడం కనిపిస్తుంది.

| | | |
|---|---|---|
| ఐ | → | అయి |
| స్ట్రైట్ | → | స్ట్రయిట్ |
| రిప్లై | → | రిప్లయి |
| అప్లై | → | అప్లయి |
| సప్లై | → | సప్లయి |
| ఫ్లైట్ | → | ఫ్లయిట్ |
| గుర్రై | → | గురయి |
| ఔ | → | అవు |
| కౌంటింగ్ | → | కవుంటింగ్ |
| మౌంటేన్ | → | మవుంటేన్ |
| కౌంట్‌డౌన్ | → | కవుంట్‌డవున్ |
| సరౌండింగ్స్ | → | సరవుండింగ్స్ |
| అక్షౌహిణులు | → | అక్షవుహిణులు |

ఇంగ్లీషులో 'వ', 'వూ', 'వొ', 'వో' లతో ప్రారంభమయ్యే పదాలు కనిపిస్తాయి. అవి తెలుగులోకి వచ్చినప్పుడు 'వొ', 'వో' లకు బదులు అచ్చు 'ఒ' 'ఓ' లు రాయడంకనిపిస్తుంది.

| | | |
|---|---|---|
| వొకేషనల్ | → | ఒకేషనల్ |
| వొకాబ్యులరీ | → | ఒకాబ్యులరీ |
| వోకల్ | → | ఓకల్ |
| వోటింగ్ | → | ఓటింగ్ |

తెలుగులో లేకుండా ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ భాషల్లో ఉన్న ఒక ప్రత్యేక వర్ణం 'ఫ' ఇది శ్వాస దంత్యోష్మం. దీనికి ధ్వని విధేయాక్షరం లేదు. 'లిప్యంతరీకరించినప్పుడు ఈ కింది మార్పులు కనిపిస్తాయి.

| | | | | |
|---|---|---|---|---|
| Family | → | పామిలీ | → | ఫామిలీ |
| Fast food | → | పాస్ట్‌ఫుడ్ | → | ఫాస్ట్‌ఫుడ్ |
| Feminist | → | పెమినిస్ట్ | → | ఫెమినిస్ట్ |
| Fundamental | → | పండమెంటల్ | → | ఫండమెంటల్ |

పై ఉదాహరణలు సూత్రప్రాయంగా మాత్రమే ఇవ్వడం జరుగుతోంది. ఇది వ్యావహారిక భాషా ప్రయోగం విషయంలో ఒక ద్రవస్థితిని ప్రతిబింబిస్తున్నదని. ఇంతకుముందే చెప్పుకున్నాం. ఒక భాషలో అన్ని ఉచ్ఛారణలకు సరిపోయిన లిపి చిహ్నాలుండవు. తెలుగులో కొన్ని ధ్వనులకు అక్షరాలు లేవు. దీనివల్ల రకరకాల లిపి రూపాలు వాడుకున్నప్పటికీ అవి క్రమంగా ఒక వ్యవస్థను ఏర్పరచుకుంటున్నట్టుగా తోస్తున్నది. 'ఈనాడు' పత్రిక ఈ విషయంలో మార్గదర్శకంగా కనిపిస్తున్నది. భాష ఎవరో ఒకరు రూపొందించిన నియమాలకు లొంగేది కాకున్నా చాలా వరకు ఒక క్రమతను (Uniformity) సాధించడానికి వీలవుతుంది. ఉదాహరణకు 'వెనక' ను 'ఎనక' అని 'యెనక' అని రాస్తున్నారు. పలికేటప్పుడు 'య' కారోచ్ఛారణ వినిపిస్తుంది గాని రాతలో అచ్చులు వాడటమే మంచిదని ఈనాడు నియమావళి చెబుతుంది. దానికి కారణం 'య' 'వ' లతో మొదలయ్యే మాటలను అచ్చులతో మొదలు పెట్టి రాసే సంప్రదాయం మనకు లేదు. కాబట్టి ఇలాగే అచ్చులతో మొదలయ్యే మాటలను కూడా 'య' 'వ' లతో రాయటం మానాలి. దీనివల్ల పదస్వరూప నిరూపణలో ఒక స్పష్టత ఏర్పడడంతోపాటు స్థలం కూడా కలిసివస్తుందని అభిప్రాయపడడం జరుగుతోంది.

అయితే లేఖన పద్ధతుల్లో ప్రమాణీకరణాన్ని సాధించి ఏకరూపత కోసం చేసే ప్రయత్నాలు నిరంతరంగా కొనసాగుతుంటాయి.

## vi. భాషా నిర్మాణం

లోకంలో ఏ దినపత్రికకైనా ఆ మాటకొస్తే ఏ పత్రికకైనా తనదైన ఒక భాష ఉంటుంది. భాష ఉంటుందనే కంటే ఒక భాషా సంస్కృతి ఉంటుంది అనటం సబబు. శైలి అనేకంటే భాషా సంస్కృతి అనటమే మెరుగైన వ్యక్తీకరణ అనిపిస్తుంది. ముఖ్యంగా 'ఈనాడు' కు ఒక ప్రత్యేకమైన భాషా సంస్కృతి ఉన్నట్టుగా కనిపిస్తుంది. దీనిని ఒక

లక్ష్యంతో ఏర్పరచుకున్నట్లుగా తోస్తున్నది. సామాన్యంగా ఒక భాష ఎక్కడైనా ఎవరికైనా సామాన్య భాషే కాని దానికి ఒక విశిష్టమైన వ్యవస్థీకృత రూపమివ్వడానికి డా॥ బూదరాజు రాధాకృష్ణ 'ఈనాడు భాషా స్వరూపం' అనే గ్రంథంలో ప్రయత్నించారు. పత్రికా భాషను క్రమబద్ధీకరించడానికి (Rationalisation) పత్రికలో రోజువారీగా వెలువడుతున్న భాషను పరిశీలించి దాని ఆధారంగా కొన్ని విధి నిషేధాలను గుర్తించారు.

## a. లింగం :

ఉదాహరణకు 'లింగం' (Gender) తీసుకుందాం. ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ వంటి భాషల్లోని లింగప్రణాళిక కంటే తెలుగులోని లింగ వ్యవస్థ భిన్నమైంది. ఆ భాషల్లో లాగా ఇది వ్యాకరణ సిద్ధం కాదు. పూర్తిగా అర్థ భేదం మీద ఆధారపడినట్టిది.

'పార్టీ అదేశించింది', 'పార్టీవారు ఆదేశించారు' అనే వాక్యాలను తీసుకుంటే కర్త యొక్క లింగాన్ని బట్టి క్రియా రూపం తెలుగులో మారుతుందని తెలుస్తుంది. కాని 'పార్టీ వారు' అనేది బహువచనం కాదనేది గమనార్హం. ఇది గౌరవ వాచకం. 'ఏలినవారు' లాగా.

'డు' 'వు' ప్రత్యయాలు 'రాముడు' 'కృష్ణుడు' మహత్తులను సూచించినప్పటికీ 'అమ్మడు' అనేది అమహత్తేనని మనకు తెలుసు. అంటే అర్థం దృష్ట్యా ఇక్కడ లింగ నిర్ధారణ జరిగిందని తెలుస్తుంది. 'మంత్రి' అనే పదం ఉభయ లింగాలకు వాడటం జరుగుతుంది. మంత్రిణి అని ఎవరూ వాడటం లేదు. ఇటువంటివి ఎన్నో లింగ విశేషాలను గుర్తించవచ్చు.

## b. వచనం

కొన్ని మాటలు ఏకవచనంలో వాడినప్పటికీ వాటికి సమూహార్థమే కనిపిస్తుంది. 'ఆ మైదానంలో లక్ష జనం పట్టింది.' ఇక్కడ ఏకవచన క్రియ ఉన్నప్పటికీ బహువచనార్థాన్నే గుర్తించాలి. 'పాలు', 'నీళ్లు', 'పేలాలు' వంటివి నిత్య బహువచనాలుగా గుర్తించాలి. తత్సమాల్లో 'ము' చేరిన రూపం, చేరని రూపం కూడా ఉంటాయి. 'కర్మ', 'చరిత్రం' వంటి మాటలు ఇలాంటివి. వీటిని గుర్తించటానికి లోకంలోని వాడుకే ఆధారం. అన్యదేశ్యాలను బహువచన రూపంలోనే తెలుగు ప్రత్యయం చేర్చకుండా వాడవచ్చునని

డా. బూదరాజు రాధాకృష్ణ గారు అభిప్రాయపడుతున్నారు.[12] 'సేల్స్‌మెన్ సమావేశమవుతున్నారు' 'సేల్స్‌మెన్లు,' 'సెల్స్‌మన్‌లు' అనక్కర్లేదని ఆయన సూచిస్తున్నారు.

## c. విభక్తులు

ద్వితీయా విభక్తి నుంచి ప్రత్యయాలు చేరేటప్పుడు నామపదంలో కొన్ని మార్పులు వస్తాయి. 'స్థలం - ని స్థలాన్ని' అంటాం. 'స్థలంలను' అనకూడదు. 'శ్రద్ధతో పనిచేస్తాడు', 'శ్రద్ధగా పనిచేస్తాడు' ఈ రెండు వాక్యాల్లో 'శ్రద్ధగా పనిచేస్తాడు' అనేది మెరుగైన ప్రయోగంగా గుర్తించాలి. అలాగే 'ఊరికి వెళ్లాడు', 'ఊరు వెళ్లాడు' అనే వాటిల్లో రెండోది మెరుగు. ఇట్లా గుర్తించవలసినవి అసంఖ్యాకంగా ఉన్నాయి. ఇవి మచ్చుకు మాత్రమే.

## d. సర్వనామాలు

'పదిహేను', 'పదైదు', 'పదహైదు' ఇవి మాండలిక భేదంతో ఉన్న సంఖ్యావాచక సర్వనామాలు. వీటిల్లో ఒక రూపాన్నే నియతంగా వాడాలని రాధాకృష్ణగారు అభిప్రాయపడ్డారు. అంటే ఏదో ఒక రూపాన్ని ప్రమాణంగా తీసుకోవాలన్న మాట. అప్పుడే ప్రమాణం అంటే ఏమిటనే చర్చలు మొదలవుతాయి. సంఖ్యా వాచకాలకు చివర 'వో' చేర్చి విశేషణాలను కల్పించటం కనిపిస్తుంది. 'ఒకటో', 'రెండో', 'మూడో' మొదలైనవి. 'ఒకటవ' 'రెండవ', 'మూడవ' అని పాత వాడుకలోని అవరూపాల ప్రయోగం చాలా అరుదైపోయింది.

## e. విశేషణం

విశేషణాల్లో 'అటువంటి', 'టటువంటి' ప్రయోగాల్ని కొందరు వాడతారు. 'చేయు' ధాతువుతో 'చేసేటటువంటి' వంటి ప్రయోగాన్ని పరిహరించి 'చేసే' అంటే చాలు. 'పడకటిల్లు' 'దుక్కిటెద్దు' వంటి సమాసాల్లో 'టి' నిత్యంగా చేరుతుందని వ్యవహారం గ్రహించి వాడాలి. ఇటువంటివే మరెన్నో విశేషణాలను గుర్తించవచ్చు.

---

*12. ఈనాడు భాషా స్వరూపం పు. 31*

## f. క్రియలు

హిందీ, ఉర్దూ క్రియా రూపాలకు 'ఇంచు' ప్రత్యయాలు చేర్చి తెలుగు క్రియలుగా మార్చడం కనిపిస్తుంది. మిల్నా - మిలాయించు, దబానా - దబాయించు వంటివి. ఇంగ్లీషు నామ పదాదులకు 'చేయు' మొదలైన అనుబంధాలు చేర్చి తెలుగు మాటలుగా మార్చవచ్చు. 'ఫోన్ చేయు', 'ట్యూన్ చేయు' వంటి వాటిని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. 'ఉదాహరణ' అనే క్రియా రూపానికి 'యించు' ను చేర్చినప్పుడు కొందరు 'ఉదహరించు' అని కూడా రాస్తారు. 'ఉదాహరించు' అనడమే సరైనది. 'అనినా', 'వినినా', 'పడినా', 'చెడినా' వంటి క్రియాజన్య విశేషణాలకు బదులుగా 'అన్నా', 'విన్నా', 'పడ్డా', 'చెడ్డా' వంటి రూపాలను వాడటం కనిపిస్తుంది. 'జరుగు' 'జరిగింది', 'జరుగుతుంది' వంటి జరుగుడు వాక్యాల వాడకం మీద ఈ మధ్య పత్రికల్లో విస్తృతంగా చర్చ జరిగింది. వాటిని పూర్తిగా వాడకూడదని, అవసరమైనప్పుడు వాడవచ్చునని రెండు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తెలుగుకు కర్తరి ప్రయోగాలే సహజమైనవి (Active Voice) కాని ఒక్కొక్కప్పుడు సంస్కృత, ఆంగ్లాల ప్రభావం వల్ల కర్మణి వాడక తప్పని పరిస్థితి కనిపిస్తుంది.

ఉదా॥

కోర్టులో హత్యానేరం రుజువయ్యే దాకా 'ఫలానా వాడు చంపబడ్డాడు' అని మాత్రమే రాయవలసి ఉంటుంది. అలాగే 'అని' చేర్చిన వాక్యాలు కొన్ని హేత్వర్థాలుగా ఉంటాయి.

ఉదా॥

అతను కొట్టాడని ఆమెకు కోపం వచ్చింది. ఈ విధంగా 'అని' ఎన్ని అర్థాల్లో వస్తున్నదో తెలిసి ప్రయోగించవలసి వుంటుంది.

దినపత్రికల భాషాస్వరూపానికి ముఖ్యంగా ఈనాడుభాషాస్వరూపానికి ఇది స్థూల ప్రదర్శన మాత్రమే. అసంఖ్యాకంగా ఉన్న సాధారణాంశాలను ఇక్కడ చేర్చడం జరగలేదు.

## vii. వార్తా కథన రచన - శైలి

ఈ శతాబ్ది తొలినాళ్ల నుంచీ తెలుగులో దినపత్రిక ఉంది. దేశవిదేశాల్లో జరిగే సంఘటనలను రోజూ వార్తలుగా అందించడం మొదటినుంచీ జరుగుతున్నదే. అయితే

ఈ శతాబ్ది ద్వితీయార్థంలో మాత్రమే దినపత్రికకు ప్రాచుర్యం లభించింది. 'ఈనాడు' రాకతో శతాబ్ది తృతీయపాదంలో దినపత్రిక సరికొత్త ఆవరణలో పాదం మోపింది. అంతకు పూర్వం ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి మొదలైన దినపత్రికల్లో జరిగిన కృషిని సమన్వయించుకొని తనదైన భాషా స్వరూపాన్ని ఈనాడు రూపొందించుకొన్నది. వార్తారచనను పునర్నిర్వచించుకొన్నది. తనదైన వార్తా రచన శైలిని ప్రవేశపెట్టింది. సమగ్ర దినపత్రికా పఠన సంతృప్తిని తీర్చడానికి పటిష్ఠమైన రచన, ప్రచురణ, రవాణా ప్రమాణాల వ్యూహాన్ని అమలు చేసి విజయం సాధించింది.

వార్తా పత్రిక అంటే దినపత్రిక అనే మాట స్థిరపడిపోయింది. వార్తాపత్రికలో కూడా సంపాదకీయ పేజీలో వర్తమాన విషయాలపై వ్యాసాలు, బాలలు, మహిళల కోసం ప్రచురించే ప్రత్యేక విషయాలు వాస్తవానికి వార్తలుగా పరిగణించే వీలులేదు. ఈ కారణం వల్ల దినపత్రికలోని వన్నీ వార్తలు కావు. ఇక్కడ, అక్కడ అని లేదు నిన్న జరిగింది ఏదైనా ఈరోజు పత్రికలో వార్తే. అంతేకాదు జరిగిన సంఘటనలపైన, జరగవలసిన వాటిపైన వచ్చే అనుగామి వార్తలు (Followup stories), సన్నాహక వార్తలు (Curtain Raisors), సమీక్షల (Roundup) వంటివీ వార్తలే. దినపత్రికలో వార్తలకు తోడు ఆర్థిక, వ్యాపార విషయాలు, రైళ్ల రాకపోకల వేళలు, సినిమా ప్రదర్శనల సమాచారం, నగరంలో జరిగే కార్యక్రమాల సూచన వంటివి కూడా వార్తా స్వభావాన్ని కలిగినవే.

'వార్త' అంటే ఒక సంఘటన జరగడం, దాన్ని పాఠకులకు తెలియజేసేందుకు అన్ని వివరాలతో రాయడం . . రెండూ. ఆకర్షణీయమైన శీర్షిక (Heading), పరిచయం (Lead), మిగతా కథనం (Body) రాసి అచ్చులో తగిన ప్రాముఖ్యంతో ప్రచురించడం కూడా 'వార్త' గానే పరిగణించాలి. ఈ ప్రక్రియ (Process) ద్వారా అనేక వార్తలు, వార్తా స్వభావం కలిగిన ఇతర అంశాలు, ఛాయాచిత్రాలు, వ్యంగ్య చిత్రాలు (Cartoons) కలిసి పాఠకుల ముందు పరచుకొనే సమగ్ర స్వరూపం 'దినపత్రిక'.

ఇందులో 'వార్త' ను ఒక ప్రాతిపదికగా (Unit) గా చూస్తే అనేక అంశాలు పరిశీలనార్హంగా కనిపిస్తాయి. ఇందులో 1. శీర్షిక, 2. పరిచయం. 3. వార్తాకథన శరీరం, ఈ మూడింటిలో పాలలో పంచదారలా పాఠకులకు వార్తను ఆసక్తిదాయకంగా అందించే 4. శైలి ప్రధానంగా ఉన్నాయి. ఇవన్నిటిలో ప్రతిదానికీ ప్రాధాన్యత ఉంది. వాటిని గురించి చర్చిద్దాం.

### i. శీర్షికలు (Headings)

వార్త వైపు దృష్టిని ఆకర్షించడానికీ మనసుకు హత్తుకుపోవటానిక మంచి శీర్షిక తోడ్పడుతుంది. ఇందులో కవితాత్మకత, శబ్ద చమత్కారం, వ్యంగ్యం, అధిక్షేపం వంటివి ఉంటాయి. అటువంటి శీర్షిక మీద ముందుగా పాఠకుల దృష్టి వాలుతుంది. వార్త చదివేందుకు ఉత్సాహాన్ని, ఉత్కంఠనూ కలిగిస్తుంది. వార్తా పత్రికలో ప్రతివార్తకూ శీర్షిక తప్పనిసరి. వార్తలోని సారాంశానికి మకుటాయమానంగా నిలిచేది శీర్షిక. శీర్షికా రచన ఒక కళ. వార్త నిడివి, పత్రికలో దానికి లభించే స్థల పరిమితిని, వార్త ప్రాముఖ్యాన్ని, వైవిధ్యాన్ని, భావాన్ని. ఇలా ఎన్నో అంశాలను దృష్టిలో ఉంచుకొని శీర్షిక రాయవలసి ఉంటుంది. వేగంగా జరిగే పత్రికా రచనలో పై అంశాలన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ఔచిత్యం దెబ్బ తినకుండా శీర్షిక రాయడం ఒక సాము వంటిదే. అల్పాక్షరాల్లో అనల్పార్థం యిమిడ్చేలా ఉండాలి. అలంకారికత, సృజనాత్మకతతో కూడిన భాషా పరిజ్ఞానం ఉండాలి. శీర్షిక క్లుప్తంగా ఉండాలి. అసందిగ్ధంగా ఉండాలి. ఆకర్షణీయంగా ఉండాలి. పాత్రికేయుని రచనా జీవితంలో ప్రతి శీర్షికా రచనా ఒక స్వతంత్ర సృష్టే. కొన్ని రకాల శీర్షికల్ని పరిశీలిద్దాం.

### a. సాభిప్రాయ శీర్షికలు

కొన్ని శీర్షికలు సాభిప్రాయంగా ఉంటాయి. ఇందులో విశేషణ విశేష్యాల పరస్పర సంబంధాన్ని కూర్చి చెప్పటం జరుగుతుంది. వార్తలోని కార్యకారణ సంబంధాలలో సాభిప్రాయం కనిపిస్తుంది.

ఉదా॥ 'హుసేన్‌సాగర్‌లో కన్నీటి కెరటాలు'[13]

ఇందులో 'హుసేన్‌సాగర్‌లో కన్నీటి కెరటాలు' అన్నప్పుడు కన్నీటి కెరటాలకు బదులు విషాదానికి మరేదో మాట రాయవచ్చు. కాని ఇక్కడ హుసేన్‌సాగర్‌కు, కెరటాలకు సంబంధం ఉండడం వల్ల ఇదే సబబుగా ఉంటుంది.

ఇలాంటివే మరికొన్ని సాభిప్రాయ శీర్షికలు :

'తూనికల అధికారుల్లో కొలతకందని అవినీతి' (ఈనాడు),

'సింహాద్రి'కి సత్వరమే స్థలం (వార్త)

'మట్టిలో పనికెళ్లి మట్టిలో కలిశాడు' (ఈనాడు)

తూటాలు పేల్చింది తుపాకీ రాజ్యమే (ఆంధ్రప్రభ)

'పుష్కర కాలంగా పడకేసిన ఆస్పత్రి' (ఈనాడు)

'కూత పెట్టని కోళ్ళ పరిశ్రమ' (ఈనాడు)

**b. వ్యంగ్య శీర్షికలు**

కొన్ని శీర్షికలు వాచ్యంగాకాక వ్యంగ్యార్థంలో రాస్తే అవి వ్యంగ్య శీర్షికలు. ఇందులో మౌలికార్థాలను అర్థ పరివర్తనతో వ్యతిరేకార్థం వచ్చేలా చెప్పడం జరుగుతుంది.

'ఉదా ॥ 'చంద్ర' కాంతులు మూన్నాళ్ల ముచ్చటే' (ఈనాడు)

కేంద్రంలో శ్రీ చంద్రశేఖర్ ప్రభుత్వం యొక్క అల్పాయుష్షను తెలియజేసే ఈ శీర్షిక వ్యంగ్య వైభవంతో అలరారింది.

ఇలాంటివి మరికొన్ని

'సింహపురిలో కాంగ్రెస్ 'గర్జన' నేడే' (వార్త)

'విద్యార్థుల భవిష్యత్తుకు 'స్పాట్' పెట్టొద్దు' (ఈనాడు)

'ఇది మల్లికార్జున్ ఎయిర్‌బస్' (ఆంధ్రజ్యోతి)

'కమల్' చర్యలపై కార్యకర్తల కారాలు మిరియాలు' (ఈనాడు)

మద్దిలేరుకు అవినీతి పునాది రాళ్ళు (ఆంధ్రప్రభ)

**c. అతిశయోక్తి శీర్షికలు**

వాస్తవాన్ని అతిశయింపజేసేవి అతిశయోక్తి శీర్షికలు.

ఉదా॥ 'ఆకాశాన్నంటిన ధరలు'

ఇందులో ధరలు బాగా పెరిగాయి అనే అర్థాన్ని అతిశయింపజేసి ఆకాశాన్నంటాయని ప్రయోగించారు. ఆకాశం అనేది అతిశయోక్తే గాని వాస్తవం కాదు. అయితే ధరలు పెరిగాయనే మాటను పోల్చేందుకు వాడారు. ఇటువంటివి తక్కువ.

ఉదా : ప్రకృతి భీభత్సాన్ని మరిపిస్తున్న సర్కార్ కూల్చివేతలు (వార్త),

'ప్రజా ప్రతిఘటన నరమేధం (ఆంధ్రజ్యోతి)

'భగ్గుమంటున్న కూరగాయల ధరలు (ఆంధ్రప్రభ)

### d. శ్లేష శీర్షికలు

ఒకటికన్నా ఎక్కువ అర్థాలున్న మాటలున్నాయి. శీర్షికలో ఒక మాట మామూలుగా చదివితే ఒక అర్థం, దాన్ని మరొకరకంగా చూస్తే విశేషార్థం గోచరస్తుంది.

ఉదా : 'ఒక్క 'నెల' రాజు నాదెండ్ల ఆక్రోశం' (ఈనాడు)

కంట్రాక్టరుకు మంత్రి ఉపాధి హామీ (ఆంధ్రజ్యోతి)

జనారణ్యంలో హిరణ్యాక్షుడు (వార్త)

ఇందులో నెలరాజు అంటే చంద్రుడు. . . నెలకొక పర్యాయం వచ్చే పున్నమి చంద్రుని నెలరాజు అంటాం. ఇక్కడ నాదెండ్లకు అనువర్తింపజేసి చెబుతున్నందుకు ఆయన నెలరోజులే ముఖ్యమంత్రిగా ఉన్నాడని మరో అర్థం వస్తుంది.

### e. అంత్యప్రాస శీర్షికలు

ఒకే విధమైన ఉచ్చారణ కలిగిన పదాంతాలతో రెండు భాగాలుగా శీర్షికను విభజించి రాస్తే అది అంత్యప్రాస శీర్షిక.

ఉదా : 'ఖజానాపై వేతన సవరణ భారం ఇక రైల్వేలో అభివృద్ధి పనులు దూరం' (వార్త)

'ముంగిట్లో ధాన్యం ముఖంలో దైన్యం' (ఈనాడు)

'మహారాష్ట్రపై వేటు కేంద్రానికే చేటు' (ఆంధ్రజ్యోతి)

'పథకాలు ఫైళ్లలో నీళ్ల కొరత ఊళ్లలో' (ఈనాడు)

'ఆదాయంలో అగ్రస్థానం . . . అభివృద్ధిలో అధమస్థానం' (ఆంధ్రప్రభ)

శీర్షికల్లో అంత్యప్రాస శీర్షికలు ఎక్కువే. పాత్రికేయులు ఎక్కువమటుకు సులభమైన మార్గంగా దీన్ని ఎన్నుకుంటారు. అయితే 'ప్రాస' కోసం ప్రాకులాటలో ఔచిత్యానికి తిలోదకాలివ్వడం కూడా ఎక్కువేనని చెప్పవచ్చు.

### f. కవిత్వ పాదాల శీర్షికలు

ప్రసిద్దికెక్కి జనం నోళ్లలోనానే కవిత్వ పాదాలను సందర్భానికి తగినట్లు యథాతథంగానో పేరడీప్రాయంగానో పెట్టే శీర్షికలను కవితాత్మక శీర్షికలుగా చెప్పవలసి ఉంటుంది. సినీ గీతాల పల్లవులు కూడా ఇందులో కోకొల్లలుగా చేరతాయి. దినపత్రికల్లో ఇవి అపరిమితంగా కనిపిస్తాయి. పాఠకులకు ఈ శీర్షికలు సులభ గ్రాహ్యంగా ఉండటమేగాక రచనా సౌలభ్యం కూడ వీటిల్లో ఉంది.

ఉదా ॥ 'జనావళికి దీపావళి'

1984 ఆగస్టు సంక్షోభం అనంతరం తిరిగి ఎన్. టి. ఆర్. ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ప్రజలు హర్షాతిరేకాన్ని వ్యక్తం చేశారన్న వార్తకు చక్కటి కవితాత్మక అభివ్యక్తితో ఈ శీర్షిక పెట్టారు.

ఇటువంటివి అనేకం.

'మబ్బులు వస్తూ పోతుంటాయి నిలిచేదొకటే నీలాకాశం' (ఆంధ్రజ్యోతి)

'ఏ నిమిషానికి ఏమి జరుగునో' (ఈనాడు)

'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' (ఈనాడు)

'వద్దంటే వెళ్లాను మంగళగిరికి' (ఈనాడు)

'నేనెరుగ నేనెరుగ అన్ననడుగు' (ఈనాడు)

ఇవి కొన్నిమాత్రమే. నిత్యం పత్రికనిండా రకరకాల శీర్షికలతో వార్తల్ని అలంకరించవలసి ఉంటుంది. ఆ పనిలో తలమున్కలయ్యే పాత్రికేయులు నిరంతరం కొత్తకొత్త శీర్షికలు సృష్టిస్తూ ఉంటారు. ఇక్కడ లక్షణంకన్నా లక్ష్యం చాలా ముందుంటుంది. కొన్ని పత్రికలుచూసి, కొన్ని ప్రధాన వార్తలకు తీర్చిన చక్కని శీర్షికలను చూసి శీర్షికలను కొన్ని రకాలుగా వర్గీకరించాం. ఇది స్థూల దృష్టితో చేసింది. వాస్తవానికి అనునిత్యం అనేకరకాలైన కొత్త శీర్షికలు అవతరిస్తూ ఉన్నాయి.

## ii. పరిచయం (Lead)

వార్తకు ముందు రాసే పరిచయం పాఠకులకు వార్తా పఠన సౌలభ్యాన్ని కలిగిస్తోంది. మూడు నాలుగు మాటల్లో ఆ వార్తకు ప్రవేశికగా రాసేదే పరిచయం. వార్తకు అందమైన

ముఖంగా భాసించేది పరిచయం. దీన్ని ప్రవేశిక (Intro) అని కూడ వ్యవహరిస్తున్నారు. వార్తల వైవిధ్యాన్ని బట్టి, సంఘటన స్వభావాన్ని బట్టి, ప్రభావాన్ని, స్థాయిని బట్టి రకరకాల పరిచయాలు (Leads) రాస్తున్నారు. పరిచయం ఔచిత్యం పరిధిని దాటకూడదు. అదే విధంగా 1. స్పష్టత (Clarity) 2. ఉత్కంఠ (Anxiety) 3. క్లుప్తత (Brievity) పరిచయంలో ఉండాలి. అన్వయ కాఠిన్యం కలిగిన మాట ఒక్కటీ ఉండకూడదు. వార్తలోని ప్రధానాంశం వాస్తవం ఆధారంగా ఆకర్షణీయంగా, హృద్యంగా రూపొందే అనేకరకాల పరిచయాలను పేర్కొనవచ్చు.

**a. అతిశయ పరిచయం (Super Lead)**

కొన్నిసార్లు ప్రత్యేక సందర్భాల్లో పరిచయాని (Lead) కి ముందు అతిశయ పరిచయం (Super Lead) కూడా రాయటం అరుదుగా కనిపిస్తుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అత్యంత ప్రధానమైన సంఘటనలు జరిగినప్పుడు, పెను మార్పులు చోటు చేసుకున్నప్పుడు మాత్రమే ఇటువంటి పరిచయం రాస్తారు.

ఉదా ॥ 1983 జనవరి 1 - ఈనాడు

***"ప్రపంచమంతా ఉత్కంఠతో ఎదురు చూస్తున్న జనవరి ఎన్నికల్లో ఎవరూ ఊహించని ఫలితాలు రాబోతున్నాయి. ముప్ఫై ఐదేళ్ల కాంగ్రెస్ రాజ్యానికి తెలుగువాళ్లు భరతవాక్యం పలకబోతున్నారు. కాంగ్రెస్ 'కంచుకోట తునాతునకలు కాబోతున్నది. తెలుగు జాతి ఆశయాల ప్రతిబింబమైన తెలుగుదేశం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో, అన్ని జిల్లాల్లో జైత్రయాత్ర సాగించనున్నది. ఈ వెలుగు రథం ఇరుసులలో నలిగి ఇంకాం అతిరథులు, మహారథులే తుత్తునియలు కాబోతున్నారు. ఘనత వహించిన కాంగ్రెస్ 'ఐ' మంత్రులు రాజధానిలో యిక సామాన్లు సర్దుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 'న్యూస్‌టుడే' శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిన సర్వేలో తెలుగు ప్రజల మనోవాంఛితం విస్పష్టంగా వెల్లడైంది."***

ఎన్. టి. రామారావు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ తొలిసారి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఈనాడు సర్వే జరిపి ఓటర్ల మనోభావాలను విశ్లేషిస్తూ పతాక శీర్షికా వార్త పైన ఈ పరిచయం రాసింది. అదే విధంగా మరో ఉదాహరణ చూడండి! ఇది జాతీయ స్థాయి సంఘటనకు రాసిన పరిచయం. 30 ఏళ్ల కాంగ్రెస్ అవిచ్ఛిన్న పాలన అనంతరం 1977లో ఓడిపోయి మొదటిసారి కాంగ్రెసేతర ప్రభుత్వం (జనతా) అధికారంలోకి వచ్చిన సంఘటనపై 'ఈనాడు' ఇలా రాసింది.

1977 మార్చి 25 - ఈనాడు

"దేశ రాజకీయరంగం కొత్త మలుపు తిరిగింది. స్వాతంత్ర్య పోరాటకాలం నుంచీ దేశానికి సారథ్యం వహించిన కాంగ్రెస్ 30 సంవత్సరాల పాటు సాగించిన పాలన అంతమైంది. నూతన శకారంభంగా జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే ఎన్నికలలో కలిసికట్టుగా పోటీ చేసి విజయం సాధించిన జనతా, ప్రజాస్వామ్య కాంగ్రెస్‌లు కొత్త లోక్‌సభలో వేరు వేరు గ్రూపులుగానే వ్యవహరించనున్నాయి. కొత్త మలుపులో ఇదివాళ ఒక నూతన పరిణామం. 'ప్రజాస్వామ్యమా? నియంతృత్వమా?' లేక 'సుస్థిరతా? అస్థిరత్వమా?' అనే నినాదాల మధ్య సాగిన ఎన్నికల ఫలితాలను యావత్ ప్రపంచం గమనిస్తున్న తరుణంలో దేశపాలనా బాధ్యతలను జనతాపార్టీ స్వీకరిస్తున్నది."

1996 జనవరి 19 ఆంధ్రజ్యోతి

"నిలువెత్తు తెలుగుతేజం . . . నిండైన వ్యక్తిత్వం . . . అనేక యుద్ధాల ఆరితేరిన ధీరోదాత్తత . . . స్ఫురద్రూపం . . . చూసి మురిసే సమ్మోహన ఆకారం . . . ఖంగున మ్రోగే కంచు కంఠం . . . అయిదు దశాబ్దాల సంచలనం . . . ఆరు కాలాల ప్రాభవం . . . నందమూరి జీవితం. సినీ వినీలాకాశంలో విరిసిన సితార . . . రారాజు . . . మహానటుడు . . . రాజకీయ యుద్ధవీరుడు . . . బడుగు జన బాంధవుడు . . . అడుగ జనాల అన్న . . . సంస్కర్త . . . రాజీపడనివాడు . . . అలుపెరుగనివాడు . . . ఓటమికి వెరవనివాడు . . . వైఫల్యాల్లోని విజయరహస్యం తెలిసినవాడు . . . అతడు 'ఈకాలం వీరుడు' జనం దైవం. ఆరుకోట్ల ఆంధ్రుల అభిమాన కథానాయకుడు . . . కృష్ణుడు . . . రాముడు . . . రావణుడు . . . యముడు . . . దేవుడు . . . చరిత్ర ప్రతిమలుపులో విశ్వరూపం చూపినవాడు . . . తానే స్వయంగా చరిత్రైనవాడు . . . అతడు ఘనుడు . . . పౌరాణిక పాత్రల్లో జీవించినప్పుడు జనం నీరాజనం పలికారు . . . రాజకీయ రణభేరి మ్రోగించినప్పుడు జనం జేజేలు పలికారు. నేడు నందమూరి మహాభినిష్క్రమణం వార్త విని యావత్ దేశం దిగ్భ్రాంతి పడింది. అఖిలాంధ్ర జగత్తు శోకసంద్రంలో మునిగింది."

**1997 జూలై 18 - వార్త**

శ్రీ కె. ఆర్. నారాయణన్ రాష్ట్రపతిగా ఎన్నికయిన సందర్భంలో 'వార్త' **1997** జూలై 18 నాటి సంచికలో ఈ కింది విధంగా అతిశయ పరిచయం రాసింది. **"పసిడి పండగ**

*చేసుకుంటున్న ప్రజాస్వామ్య భారతం సగర్వంగా తలెత్తుకొనే రోజిది. బెల్చీలు, కిలవేన్మణిలు, చుండూరులు, కారంచేడులు మాత్రమే అనుభవమైన దళిత వర్గాలనుంచి దేశానికొక 'ప్రథమ పౌరుడు' ఆవిర్భవించిన క్షణాలివి. పచ్చటి ప్రకృతికే, పదునైన మేధకూ ప్రతీకైన కేరళలో పుట్టి, విద్యతోపాటే వినయాన్ని పెంచుకుంటూ వచ్చిన కొచ్చెరిల్ రామన్ నారాయణన్ ఈ దేశానికి పదకొండో రాష్ట్రపతి కాబోతున్నారు. ఈ 'సంకీర్ణ' యుగంలో ఆ పదవికి అవసరమైన సమయస్ఫూర్తి, సంయమనం, విశిష్ట ప్రజ్ఞాపాటవాలు పుష్కలంగా ఉన్న అరుదైన వ్యక్తి నారాయణన్."*

ఇక వివిధ రకాల ఇతర పరిచయాల (Leads) ను పరిశీలిద్దాం.

**b. సారాంశ పరిచయం (Summary Lead)**

ఒక వార్త అందులోని సంఘటనకు సంబంధించిన వివరాల సారాంశాన్ని క్లుప్తంగా సమగ్రస్ఫూర్తితో రాసే పరిచయాన్ని సారాంశ పరిచయం అనవచ్చు ఈ రకమైన పరిచయం ఎక్కువ వార్తలకు రాస్తారు.

ఉదా ॥

1981 జూన్ 1 - ఈనాడు

*"ఆంధ్రప్రదేశ్‌లో 48 గంటల్లో సంభవించిన నాటకీయ పరిణామాల ఫలితంగా ఎన్. టి. రామారావు నాయకత్వంలోని ప్రభుత్వ స్థానాన్ని రెండురోజుల క్రితం దాకా ఎన్. టి. ఆర్. 'ఛీఫ్ లెఫ్టినెంట్' గా వ్యవహరించిన నాదెండ్ల భాస్కరరావు ప్రభుత్వం సొంతం చేసుకుంది. మెజారిటీని కోల్పోయిందనే మిషతో పద్దెనిమిది నెలల వయసుగల ఎన్. టి. ఆర్. ప్రభుత్వాన్ని రాష్ట్ర గవర్నర్ రాంలాల్ రద్దు చేసి తెలుగుదేశం పార్టీ నుంచి వేరుపడిన నాదెండ్ల భాస్కరరావు చేత ఆంధ్రప్రదేశ్ పదకొండో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. 58 మంది కాంగ్రెస్ (ఐ) ఎం. ఎల్. ఎ. లతో పాటుగా తనకు 91 మంది ఎం. ఎల్. ఎ. ల మద్దతు వుందని భాస్కరరావు చెప్పుకుంటున్నారు."*

ఆంధ్రప్రభ 1997 సెప్టెంబర్ 15 నాటి సంచికలో రాసిన సారాంశ పరిచయం కింది విధంగా వుంది. అంతకు ముందురోజు విశాఖ హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్‌లో జరిగిన విస్ఫోటనంపై రాసిన పరిచయం అది.

*"మహావిస్ఫోటాన్ని తలపింపజేసిన ఆ భయానక ధ్వనికి విశాఖ పౌరులు అదిరిపడి నిద్రలేచారు. మీదపడిన ఉత్పాతం ఎటువంటిదో అర్థం కాక బిక్క చూపులు చూశారు. చూస్తూ ఉండగానే రోడ్లు జనమయం అయిపోయాయి. అందరిలో మృత్యు భయం తాండవించింది. విశాఖ గగనాన్ని కారుమేఘాలు కమ్ముకున్నాయి. ట్యాంకులు కాలిన సంగతి తెలుసుకుని అటుగా పరుగులు తీసిన పత్రికా ప్రతినిధులనూ, ప్రజా ప్రతినిధులనూ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ అధికారుల మౌనం నిలువునా వెక్కిరించింది. అంతటి అయోమయం. . . ఆందోళన. . . మృతులెందరో, క్షతగాత్రులెందరో. . . వెంటనే వివరాలు తెలియక సర్వత్రా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కొన్ని కోట్ల రూపాయలు విలువ చేసే ఆస్తులు దగ్ధమయ్యాయి. ఇంకా ఎన్నో కోట్ల విలువైన ఇంధనం కాలిపోయింది. ఆలస్యంగా అందిన సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 50కి పైనే ఉండవచ్చునని తెలిసింది."*

1981 జనవరి 20 ఆంధ్రజ్యోతి

*"దాదాపు 443 రోజులుగా యావత్ప్రపంచం ఉత్కంఠతో ఎదురు చూస్తున్న అమెరికన్ బందీల సమస్య ఎట్టకేలకు నేడు పరిష్కారమైంది. 52 మంది అమెరికన్ బందీలను విడుదల చేయడానికి ఇరాన్ నేడు లాంఛనంగా అంగీకరించింది. అమెరికన్ బందీల విడుదల సంక్షోభంలో రేపు పదవీ విరమణ చేయనున్న అమెరికా అధ్యక్షుడు జిమ్మికార్టర్ తుదకు విజయం సాధించారు. అమెరికన్ బందీలను విడుదల చేయడానికిగాను అమెరికాలో స్తంభింపజేసినట్లుగా పేర్కొంటున్న తన దాదాపు వెయ్యి కోట్ల డాలర్ల ఆస్తులను తిరిగి తనకు అప్పగించాలని ఇరాన్ షరతు విధించింది."*

**c. సావధాన పరిచయం (Delayed Lead)**

వార్తా విషయాన్ని సూటిగా కాకుండా దానికి సంబంధించిన నేపథ్యాన్ని గురించిగాని, అంతకు పూర్వం అటువంటి సంఘటనలు, వాటి ఫలితాంశాలను గురించి గాని వివరిస్తూ ప్రస్తుత వార్తా వివరాలలోకి ప్రవేశించడం అన్నమాట.

1983 జనవరి 1 - ఈనాడు

*"ఇంకో ఐదు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇందిరా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పనున్నారు. ముప్పై ఐదేళ్లుగా దాదాపు అవిచ్ఛిన్నంగా జనజీవితాన్ని శాసిస్తున్న పార్టీని ఆ రోజు*

*తెలుగు గడ్డమీద భూస్థాపితం చేసి, తెలుగు వాళ్లు చరిత్ర సృష్టిస్తారు. తద్వారా కొత్త శకానికి నాందీ ప్రస్తావన చేస్తారు. 'డ్రామాట్రూప్' అనీ, 'సినిమా గ్లామర్' అనీ కాంగ్రెస్ ఐ మహామహులు ఈసడించిన 'తెలుగుదేశమే', తెలుగునాట కాంగీని చిత్తు చిత్తు చేసి, బ్రహ్మాండ విజయం సాధించబోతున్నది. ఎన్ని కోట్ల డబ్బు సంచులు కుమ్మరించినా, ఎన్ని సముద్రాల సారాను పారించినా, ఎన్ని మాయోపాయాలను పన్నినా, ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ కుమార సమేతంగా సుడిగాలిలా ఎన్నిసార్లు రాష్ట్రం చుట్టూ తిరిగినా. . . ఈ అనివార్య చారిత్రక పరిణామాన్ని ఎవరూ అడ్డుకోలేరు. . . "*

సావధాన పరిచయానికి మరో ఉదాహరణ ఆంధ్రజ్యోతిలో 1997 జూలై 8వ తేదీ సంచికలో నుంచి . . . అంతకుముందు రోజు హైదరాబాద్ రాంనగర్‌లోని మూడు వేరువేరు చోట్ల షిర్డీ సాయిబాబా చిత్రపటాలు, విగ్రహాల నుంచి విభూది, కుంకుమ, గంధం రాలిపడుతున్న సంఘటన సంచలనం సృష్టించిందన్న వార్తకు ఈ పరిచయం రాశారు.

*"వినాయక విగ్రహాలు పాలు తాగుతున్నాయనే ఉదంతం రెండేళ్ళ క్రిందట దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇటీవల వివాదాస్పద భగవానుడిగా వార్తల కెక్కిన 'కల్కి భగవానుడి' చిత్రపటం నుంచి విభూది రాలుతున్నదని, కల్కి భగవానుడు ఏకంగా తేనెను నైవేద్యంగా ఆస్వాదిస్తున్నాడని, ఆ భగవానుని నేత్రాలు, కదులుతున్నాయనే వార్తలు రాష్ట్రంలోనూ, పొరుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ క్రమంలోనే తాజాగా నగరంలో షిర్డీ సాయిబాబా, పుట్టపర్తి సాయిబాబాల చిత్రపటాలు, విగ్రహాల నుంచి విభూది, కుంకుమ రాలుతున్నాయనే వార్తలు జంటనగరాలలో సంచలనం సృష్టించాయి. ఇది రసాయన చర్యల ఫలితమేనని, మహిమలు . . . మహాత్మ్యం ఏదీలేదని శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. అయితే ఇది భగవంతుడి మహిమేననే విశ్వాసంతో భక్తులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు."*

**d. ఆలంకారిక పరిచయం (Colourful Lead)**

ఆలంకారికతకు ఆస్కారం ఉన్న సంఘటనలు వార్తలుగా రాసినప్పుడు వాటికి ఈ రకమైన పరిచయం మరింత అందాన్ని ఆపాదింపజేస్తుంది. అపూర్వం, అపురూపమైన,

అరుదైన విషయాలు, సంఘటనలు జరిగినప్పుడు, అవి ప్రజాసామాన్యానికి తెలుసుకోదగిన ఒక గాథలా ఉన్నప్పుడు ఈ పరిచయం సరిపోతుంది.

ఉదా ॥

1984 సెప్టెంబర్ 17

*"తెలుగుతల్లి ముద్దుబిడ్డలకు, దేశంలోని ప్రజాస్వామ్య ప్రియులకు ఈ రోజు పర్వదినం. తెలుగుదేశానికి నెలరోజుల కిందట పట్టిన గ్రహణం పీడ నేడు విరగడైంది. ధర్మం జయించింది. అధర్మం అణగారిపోయింది. అన్న ఇంట్లోలేని సమయం చూసి కుట్రపన్ని ఢిల్లీ తల్లి ముందు మోకరిల్లి, తోక ఆడించి ప్రసన్నం చేసుకుని అన్న ఇంటికి తిరిగి రాగానే క్షుద్ర జిత్తులతో వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పీఠాన్ని మైలపరచిన నాదెండ్ల వర్గం చివరకు దిక్కుతోచని స్థితిలో తోకముడిచి పిక్క బలం చూపింది. సింహాసనం సింహానికే దక్కింది. అఖిలాంధ్ర ప్రజ ఆగ్రహాగ్నిలో నడమంత్రపు 'సిరి' మసి అయింది. పదవి కోసం కాక ప్రజాస్వామ్య మనుగడ కోసం జరిగిన ఈ మహాసంగ్రామంలో ఉవ్వెత్తున లేచిన తెలుగు 'వాడి' కి నమోవాకములు. ఢిల్లీ నిరంకుశ పెత్తనాన్ని తెలుగు వీరులు మన పొలిమేరల నుంచి తరిమికొట్టారు. . . "*

ఇది సాహసోపేత పరిచయం. అలంకారిక శైలి ఇరుసులలో సంయమనం నలిగిపోయినట్లు కనిపిస్తుంది. వార్తా రచనలో ఇంత సాహసం వాంఛనీయం కాదు. అయితే వార్తలోని సహజమైన ఆవేశం ఆనాడు తెలుగునేలమీద లాస్యమాడిందేనని అంగీకరించవలసి ఉంటుంది.

1997 సెప్టెంబర్ 5వ తేదీ రాత్రి మదర్‌థెరిసా కలకత్తాలో మరణించారు. అంతకు వారం రోజుల కిందటే బ్రిటిష్ యువరాణి డయానా కారు ప్రమాదంలో మరణించారు. ఈ రెండు ప్రపంచ ప్రాధాన్యం సంతరించుకున్న సంఘటనలను సమన్వయిస్తూ 'వార్త' రాసిన ఆలంకారిక పరిచయం :

1997 సెప్టెంబర్ 7 - వార్త

*"ప్రేమరాహిత్యంలో పరితపించి, కాలం చెల్లిన సంప్రదాయాలను ధిక్కరించి బ్రిటిష్ రాజరిక వ్యవస్థ బంగారు పంజరం నుంచి బయటపడి బాధలన్నింటినీ గిరాటేసి ఒక అనునయవాక్యం కోసం ఒక చల్లని ఓదార్పు కోసం శ్వాసిస్తూ ఆక్రోశిస్తూ దోడీకి చేరువైన అతికొద్దికాలంలోనే కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువరాణి*

డయానా శనివారం నాడు భౌతికంగా కూడా ఈ లోకం నుంచి కనుమరుగయిపోయింది. ఓ స్వేచ్ఛా స్వప్నం ఈ ప్రపంచం కళ్ళ ముందే కరిగిపోయింది.

ఎవరి స్ఫూర్తితోనైతే డయానా తనలోని శూన్యాన్ని తొలగించుకోడానికి సేవా కార్యక్రమాలు ప్రారంభించిందో ఆ కరుణామయి, పేదల పాలిట అమృత కల్పవల్లి మదర్ థెరిసా కన్నుమూయడంతో విశ్వమానవ సేవాభావం వికలమయ్యింది. "పతితులార భ్రష్టులార బాధా సర్పదష్టులార ఏడవకండేడవకండి, నేనున్నా నేనున్నాను" అంటూ ఓదార్చి ఎందరికో సేవలు చేస్తూ సేదదీర్చి మానవత్వానికే మణిపూసగా విలసిల్లిన నిస్వార్థజీవి థెరిసా సృష్టించిన భూతల స్వర్గం కదిలిపోయింది."

**e. విలక్షణ పరిచయం ( Oddity Lead)**

ఇది విలక్షణంగా ఉంటుంది. సర్వసాధారణ వార్తలకు పూర్తిగా భిన్నమైన వార్తలకు ఈ పరిచయం రాస్తారు. 'ఈనాడు' తొలినాళ్ల నుంచి వార్తల్లో స్థానికంగా జరిగే సంఘటనలకు ప్రాధాన్యం ఇస్తూనే ప్రపంచ వ్యాప్తంగా జరిగే అరుదైన సంఘటనలు, వింతలు, అద్భుతాలను ఏదో విధంగా చమత్కారపూర్వకమైన పరిచయం జోడించి ప్రచురిస్తున్నది. ముఖ్యంగా దినపత్రిక మొదటిపుటలో ఎడమవైపు పుటనిండా 'టూకీగా' వేస్తారు. అందులో చోటు చేసుకొనేలాంటి వార్తలకు ఈ పరిచయం బావుంటుంది.

1984 డిసెంబర్ 4 - ఈనాడు

*"అందమునకు గురుతు అగుపించుటే సాక్షి*
*ఫాషనుకు నిజముగా పొట్టి గౌనే సాక్షి అని*
*ఫెర్లాట్ కంపెనీ వారు మరీ మరీ మినీ గౌన్లు*
*రకరకాల తరహాల్లో రూపొందించారు.*
*వున్నట్టా లేనట్టా అనిపించే, ఉన్నా ఎందుకున్నట్లు*
*అని జిజ్ఞాస రేకెత్తించే యీ మరీ మినీ పొట్టి గౌన్లు*
*తొడుక్కుంటే అందం కనుచెదిరే చందంగా*
*వెల్లడవుతుందని ఊదరగొట్టేశారు. కాలిఫోర్నియాలోని*
*ఫెర్లాట్ కంపెనీవారు అతి తక్కువ సైజులో వుండే పొట్టి గౌన్లను. . . "*

'యీ మరీ మినీ పొట్టి గౌన్లు' వంటి మాటల్లో చమత్కారం మరీ ఎక్కువైనా పునరుక్తి దోషం వున్నా ఇటువంటి వాటికి పరిచయం ఈ విధంగానే రాయవలసి ఉంటుంది.

రంగారెడ్డి జిల్లాలో ఒక చోట బహిరంగ సభ జరుగుతుండగా సభకోసం నిర్మించిన వేదిక అమాంతం సభలోని మంత్రుల మీదే కుప్పకూలిపోయింది. ఆంధ్రప్రభలో తమాషా అయిన సంగతులు రాసే 'పెన్‌టార్చ్' శీర్షికలో రాసిన 'విలక్షణ పరిచయం' ఈ విధంగా వుంది.

1997 జూన్ 19 - ఆంధ్రప్రభ

***"బహిరంగసభలలో నాయకుల భద్రత కోసం పోలీసులు పడేపాట్లు ఇన్నీ అన్నీ కావు. ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగి అది తమ పీకలకు చుట్టుకుంటుందేమోన్న భయంతో ముందుగావే అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంటారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏవో పొరపాట్లు జరుగుతూనే వుంటాయి."***

ఇటువంటివి ఆంధ్రప్రభలో శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు లాబీల్లో జరిగే తమాషాలను 'అసెంబ్లీ లాబీలు' శీర్షికల్లో రాస్తుంది.

**e. ఉద్ధరణ పరిచయం (Quotation Lead)**

వార్తల్లోని ప్రధాన వ్యక్తులు చెప్పే మాటలను పరిచయం (Lead) లో యథాతథంగా ఉటంకించి వార్తలోకి ఉపక్రమించడాన్ని ఉద్ధరణ పరిచయం అంటారు. అత్యంత ప్రధానమైన పదవుల్లో ఉన్నవారు, వారు ప్రసంగించిన వేదికగాని, అంశం గాని ప్రాముఖ్యం కలిగిన సందర్భాల్లో ఆ వార్తలకు ఇటువంటి పరిచయం రాస్తారు.

1977 అక్టోబర్ 5 ఈనాడు

***"భారతదేశం అన్ని దేశాలతోనూ స్నేహ సంబంధాలను కోరుకుంటుంది. కాని ఏ దేశంపైనా ఆధిపత్యం చెలాయించదు"*** - అని విదేశ వ్యవహారాల మంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయ్ నేడు ఐక్యరాజ్యసమితి సమావేశంలో చెప్పారు."

1981 జనవరి 19 ఆంధ్రజ్యోతి

***"ఈ రోజుకు నన్ను వదలండి." నేడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన అనంతరం***

*ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య పై విజ్ఞప్తి చేశారు. "నేను తిరిగి ఢిల్లీ వెడుతున్నట్లు మాత్రం రాసుకోండి" అని ఆయన విలేఖరులతో అన్నారు.*

ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన శ్రీ కృష్ణకాంత్ ఉపరాష్ట్రపతి పదవికి యునైటెడ్ ఫ్రంటు, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆ పార్టీలకున్న బలం ప్రకారం ఆయన ఇక ఉపరాష్ట్రపతి అయిపోయినట్లే. అలా ఎంపికైన రోజు ఇక్కడ రాజ్‌భవన్‌లో విలేఖరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ అన్న మాటల్ని ఆంధ్రప్రభ కొటేషన్ లీడ్‌గా రాసింది. . .

1997 జూలై 27 - ఆంధ్రప్రభ

*"ఉపరాష్ట్రపతి పదవి గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో ప్రధానమంత్రి ముందుగా టెలిఫోన్ చేసి ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా నన్ను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. నమ్రతతో అంగీకరించాను" అని రాష్ట్ర గవర్నర్ శ్రీ కృష్ణకాంత్ అన్నారు.*

సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు మోహన్‌బాబు తిరుపతిలో జరిగిన సంఘటనలపై టిడిపి క్రమశిక్షణా సంఘం జారీ చేసిన నోటీసుకు వివరణనిచ్చిన తర్వాత విలేఖరులతో మాట్లాడుతూ అన్న మాటలు.

1997 జూలై 8, ఆంధ్రజ్యోతి.

*"అన్న (ఎన్. టి. ఆర్.) గారికి మేము ద్రోహం చేశాం. లక్ష్మీపార్వతిని అడ్డం పెట్టుకుని ఎన్టీఆర్‌కు ద్రోహం చేశాం. అన్న (ఎన్. టి. ఆర్) కి నేను ద్రోహం చేసి ఉండాల్సింది కాదు. ఆనాడు అన్నగారికి ద్రోహం చేయబట్టే ఈ రోజు నాకు ద్రోహం జరిగింది. పార్టీకి సంబంధం లేకపోయినా వ్యక్తిగతంగా జరిగిన ఘటనపై వివరణ ఇచ్చేందుకు క్రమశిక్షణ సంఘం ముందు హాజరు కావడం ఆ రోజు ఎన్‌టిఆర్‌కు చేసిన ద్రోహం ఫలితం. ఎన్‌టిఆర్‌కు చేసిన ద్రోహానికి క్రమశిక్షణామండలి ముందు హాజరుకావడమే ప్రాయశ్చిత్తంగా భావిస్తున్నాను."*

1984 ఆగస్టు 17 - ఈనాడు

*"కేంద్రంలోని కాంగ్రెస్ ఐ ప్రభుత్వాన్నీ, రాష్ట్రంలోని కీలుబొమ్మ ప్రభుత్వాన్నీ పడగొట్టేవరకూ నేను విశ్రమించేది లేదు" అని పదవీచ్యుతులైన శ్రీ ఎన్. టి. రామారావు నేడు అన్నారు.*

ఆగస్టు సంక్షోభంలో ఇరుక్కున్న మరునాడు శ్రీ ఎన్. టి. రామారావు హైదరాబాద్‌లో విలేఖరుల సమావేశంలో అన్న మాటల్ని వార్తలో పలుమార్లు "...." యథాతథంగా పొందుపరచారు. అయినా వార్త నివేదించడంలో హుందాతనానికి లోపం జరగలేదు.

## g. ప్రశ్నారూప పరిచయం (Question)

వార్తలో ప్రశ్న లేవదీసే పని పాత్రికేయుడు స్వీయ వ్యాఖ్యానం ద్వారా చెయ్యవచ్చు, ప్రజాభిప్రాయంలో ప్రశ్నలను (ప్రశ్నిస్తున్నారు) లేవదీయవచ్చు. వార్తలోని ప్రముఖులూ ప్రశ్నించవచ్చు. వార్త పరిచయంలో, ముగింపులో ప్రభుత్వం ఏం చర్య తీసుకుంటుందో వేచి చూడవలసిందే వంటి ప్రశ్నలు లేవదీయడం అరుదుగా కనిపిస్తుంది. పరిచయం ప్రశ్నారూపంలో ఉంటే ప్రశ్నారూప పరిచయమని అంటున్నాం.

ఉదా॥ 1980 డిసెంబర్ 21 - ఈనాడు :

***"మన సమాజంలో ఎన్నో వివాదాలు తలెత్తుతున్నాయి. అధ్యక్ష తరహా పాలన నుంచి ప్రజాస్వామ్యయుత పాలన వరకు వివాదాలు సహజమే. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఒక ఆసక్తికరమైన వివాదం ఏర్పడింది. తెలుగు తల్లికి ఎన్ని చేతులుండాలి? రెండా? నాలుగా?"***

విలేఖరి దృష్టికి వచ్చిన సాంస్కృతికపరమైన ఒక వార్తాంశం అతని చేతే వార్తలో పరిశీలనా దృష్టితో కూడిన ప్రశ్నను వేయించింది. మొత్తానికి సంఖ్యాపరంగా ఇటువంటి పరిచయం (Lead) లు తక్కువనే చెప్పాలి.

సిబిఐ డైరెక్టర్ జోగిందర్‌సింగ్ పనితీరు పట్ల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధానమంత్రి అసంతృప్తి వ్యక్తం చేయడాన్ని బట్టి ఆంధ్రజ్యోతి ప్రశ్నారూప పరిచయం కింది విధంగా రాసింది.

1997 మే 25 ఆంధ్రజ్యోతి

***"ప్రధానమంత్రి ఐ. కె. గుజ్రాల్ తన వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో సిబిఐ డైరెక్టర్ జోగిందర్‌సింగ్ తనకు తానుగా రాజీనామా చేయనున్నారా?. . . ."***

## h. సంవాద రూప పరిచయం (Dialogue Lead)

అంత విస్తృత ప్రయోగంలో లేని పరిచయం ఇది. అయితే సమావేశాల వార్తల్లో సభ్యునికీ, సభకు అధ్యక్షత వహించిన వారికీ సంవాదం జరుగుతూండటం, వార్తా

శరీరం సంవాద రూపంలో రాయడం అప్పుడప్పుడూ పాఠకుల్లో ఆసక్తి గొల్పే ఉద్దేశంతో జరుగుతుంది. విలేఖరికి, వార్తలోని వ్యక్తికీ మధ్య సంవాదం జరిగినట్లు రాసే సందర్భాల్లో సంవాదరూప పరిచయం కనిపిస్తుంది.

ఉదా॥

1984 సెప్టెంబర్ 16 - ఈనాడు

*"కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. డి. శర్మ ఎన్. టి. రామారావును ఆహ్వానించడంపై తమ అభిప్రాయం తెలుపవలసిందిగా ప్రధాని ఇందిరా గాంధీని అడగ్గా ఆ విషయం తనకు నిజంగా తెలియదన్నారు. ఆమె ఇక్కడి నుంచి ఢిల్లీ బయలుదేరుతుండగా ఈ వార్త గురించి వ్యాఖ్యానించవలసిందిగా విలేకరులు కోరగా ఆ వార్త తనకు అందలేదన్నారు."*

ఇంటర్వ్యూ వార్తల్లో, విలేకరుల సమావేశాల్లో ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులను విలేకరులు అడిగిన విషయాలు సంవాదరూపంలో రాస్తుంటారు.

**i. వర్ణనాత్మక పరిచయం (Discriptive Lead)**

పెద్ద పెద్ద సంఘటనలు జరిగినప్పుడు ప్రధానవార్తతోపాటు ఆసక్తి కలిగించే ఉపవార్తలు (Sidelights stories), మానవాసక్తి కథనాలు (Human interest stories) వంటి వాటికి కూడా ఆస్కారం ఉంటుంది. అటువంటి ప్రాముఖ్యం కలిగిన వార్తల్లో ప్రధాన వార్త సాధ్యమైన మేరకు పరిచయం వాస్తవ విషయాలు తెలియజేస్తూ ప్రారంభమవుతుంది. ఆ సంఘటనల మీదే ఆధారపడి రాసే ఇతర వార్తలకు వర్ణనాత్మక పరిచయం పాఠకుల హృదయాలకు హత్తుకొనేలా ఉంటుంది.

ఉదా॥

1984 డిసెంబర్ 4 - ఈనాడు

*"అర్ధరాత్రి... అంతా గాఢనిద్రలో ఉన్నవేళ... ఏదో వాసన ఊపిరి సలపనీయలేదు. ఆ గాలి పీలుస్తుంటే కడుపులో దేవినట్లవుతోందని ఆ వాసన భరించలేక ఆ గాలి పీల్చలేక బయటకు వచ్చినా అదే గాలి. ఊపిరి సలపని స్థితిలో దిక్కుతోచని ఆ గాలి భరించలేక ఏడుస్తూ అరుస్తూ గగ్గోలు పెడుతూ హాహాకారాలు చేస్తూ స్త్రీలు పిన్నలు పెద్దలు రోడ్డు మీదకు పరుగులు పెట్టారు. చంటి పిల్లల్ని చంకన వేసుకుని మిగతా పిల్లల్ని పక్కల మీద నుంచి లేపి తరుముతూ పరుగులు పెట్టారు. . . . "*

సంఘటన అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన భోపాల్ విషవాయు విషాదానికి సంబంధించింది. ఆ వార్తకు రాసిన పరిచయంలో వర్ణనాత్మకత, మానవాసక్తి ఉన్నా, ప్రయత్నం మంచిదయినా రాసిన విధానం ఉత్తమంగా లేదు.

1983 జనవరి 10 ఈనాడు

*"ఇంతవరకూ ప్రత్యేకాహ్వానితులకు, అతిముఖ్య వ్యక్తులకు మాత్రమే ప్రవేశం ఉండే మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లక్షలాది ప్రజల సమక్షంలో బహిరంగంగా నిర్వహించడం ద్వారా 'తెలుగుదేశం' ప్రభుత్వం కొత్త పుంత తొక్కింది. ఏదో తతంగంలా జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజల సంబరంగా నిర్వహించి తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నది."*

పరిచయ రచన బాగా సాగింది. విలేఖరి రచనానుభవానికి ప్రతిబింబంగా కనిపిస్తోంది. తొలిసారిగా 1983 జనవరి 9వ తేదీన నందమూరి తారక రామారావు నేతృత్వంలో తెలుగుదేశం మంత్రివర్గం సంప్రదాయానికి భిన్నంగా హైదరాబాద్ లాల్‌బహద్దూర్ స్టేడియంలో ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన సంఘటనపై రాసిన వార్త ఇది.

1997 ఆగస్టు 15, ఆంధ్రజ్యోతి

*"ఆ రోజు ఆగస్టు 15, 1947 భారతమాత నిగళాలు మంజుల నిక్వాణంగా మ్రోగిన మధురక్షణాలు... అది అర్ధరాత్రి అస్వతంత్ర తమో సముద్ర గర్భం చీల్చుకొని వెలుగు తొలిరేకై పొడిచిన సూర్యోదయం... ఆ ఉషోదయం రాగరంజిత స్వాతంత్ర్య ఉచ్ఛల జలధి తరంగం... తూర్పు కొండల్లో సంధ్యారాగం! స్వేచ్ఛా జనగీతం!!... యాభై వసంతాలు, యాభై శిశిరాలు... ఎన్నో పురోగమన తిరోగమనాలను చవి చూసిన స్వర్ణమయ సువర్ణ త్రివర్ణ పతాకమా! జయ హే! జయజయ జయ హే!!"*

### j. నిర్భేదక పరిచయం (Bullet Lead)

వార్తల్ని సూటిగా రాసేందుకు ముందు రెండు మూడు మాటలతో లేదా వాక్యాలతో ఈ పరిచయం రాస్తారు. వార్తను సుగమంగా ప్రారంభించేందుకు ఈ పరిచయం ప్రవేశికలా దోహదం చేస్తుంది. ఇది క్లుప్త పరిచయం.

1979 అక్టోబర్ 18 - ఈనాడు

*"భారతదేశంలోని పీడిత ప్రజానీకం అభిమానించే మదర్ థెరిసాకు 1979 సంవత్సరపు*

***నోబెల్ శాంతి బహుమతి యిస్తున్నట్లు నోబెల్ కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ జాన్ సన్నెస్ నేడు ప్రకటించారు. ... '***

పై వార్తలో 'భారతదేశంలోని పీడిత ప్రజానీకం అభిమానించే' అనే వాక్య భాగం మాత్రమే పరిచయం. అయితే వార్తకు చక్కని అలంకారంగా అమరింది.

1990 2 డిసెంబర్ - ఈనాడు

***"మంగళవారం మధ్యాహ్నం సరిగ్గా పన్నెండు గంటల పన్నెండు నిముషాలకు కరసేవకులు పోలీసుల భద్రతా వలయాలను ఛేదించుకుని వివాదాస్పద రామ జన్మభూమి - బాబరీ మసీదు ప్రాంగణంలోకి చొచ్చుకుపోయి, కరసేవ ప్రారంభానికి సంకేతంగా ఆ ప్రదేశంలో త్రిశూలం నాటి కాషాయ జెండా ఎగురవేశారు. . . ."***

దేశాన్ని ఒక కుదుపు కుదిపివేసిన అయోధ్య సంఘటనకు నిర్భేదక పరిచయంతో సమర్థంగా వార్త ప్రారంభించినట్లు స్పష్టమవుతుంది. ఇటువంటి వార్తకు ఈ పరిచయం చక్కగా సరిపోతుందనడానికి కూడా దీన్నొక ఉదాహరణగా పేర్కొనవలసి ఉంటుంది.

1997 సెప్టెంబర్ 13 ఆంధ్రప్రభ

***"రాష్ట్రంలో గత మూడు దశాబ్దాల్లో ఎప్పుడూ లేనంతటి తీవ్రస్థాయిలో ఏర్పడ్డ దుర్భిక్ష పరిస్థితులపై చర్చించేందుకు మంత్రిమండలి శనివారం ప్రత్యేకంగా సమావేశం కానుంది."***

1997 నవంబర్ 23 వార్త

***"కేంద్రంలో నెలకొన్న రాజకీయ ప్రతిష్టంభనను తొలగించే ఆయుధం ఏదీ ఇప్పుడు తమ చేతుల్లో లేదని యునైటెడ్ ఫ్రంటు కన్వీనరు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు."***

### k. అసంబద్ధ పరిచయం (Staccato Lead)

ఈ రకం పరిచయం మాటల్ని లయాత్మకంగా పేరుస్తూ రాయడం కనిపిస్తుంది ఏ మాట కామాట అసంబద్ధంగా పేర్చినట్లున్నా వాటి పొందిక వెనుక పొంచి ఉన్న ఆవేశం, భావం, ఉద్వేగం పాఠకులకు సుబోధకంగానే ఉంటాయి. ఇదీ వర్ణనాత్మకంగానే ఉంటుంది. అయితే దీర్ఘ వర్ణనావకాశం ఉండదు.

ఉదా : 1984 సెప్టెంబర్ 17 ఈనాడు

*"ఆనందబాష్పాలు.... కట్టలు తెంచుకున్న ఉత్సాహం... ఉద్వేగం... ఉరుకులు... పరుగులు... కేరింతలు.... బాణసంచా ప్రేలుళ్లతో తిరుపతి పట్టణ వీధులన్నీ నేడుపార్లిపోయాయి. నందమూరి తారకరామారావును ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు రమ్మని గవర్నర్ ఆహ్వానించాడని మధ్యాహ్నం ఒంటిగంట పదినిమిషాలకు ఆకాశవాణి హైదరాబాదు ప్రాంతీయ వార్తలలో ప్రకటించిన మరుక్షణం --"రామారావు జిందాబాద్' 'ప్రతిపక్షాల ఐక్యత జిందాబాద్"... కేకలతో యువకులు వీధుల్లోకి పరుగెత్తుకువచ్చారు.*

విలేఖరి వార్తా పరిచయ రచనలో ప్రజా ప్రతిస్పందన సహజంగా వర్ణించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. ఇందులో తానూ లీనమైతే తప్పు రాయలేదు. ఇటువంటి పరిచయ రచనకు అది అవసరం కూడా.

1997 నవంబర్ 20 ఆంధ్రజ్యోతి

*"నగరం నివ్వెరపోయింది... నాలుగు శతాబ్దాల చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన ఘోరకలితో భాగ్యనగరవాసులు భయకంపితులయ్యారు. ఖండఖండాలుగా చెల్లాచెదరైన మానవదేహాలు... కాలి కమిలిన మాంసం ముద్దలు... సజీవ దహనమైన శరీరాలు... తుదిశ్వాస విడుస్తూ గుక్కెడు మంచినీటికోసం పరితపించిన అభాగ్యుల నీరవ నీరస ఆక్రందనలు... రెప్పపాటులో జరిగిపోయిందంతా. మృత్యువు ఒడిలో చేరినవారు, కొనవూపిరితో కొట్టుమిట్టాడినవారు... ఇంకా నేలమీద నూకలు మిగిలి తప్పించుకున్నవారు. . కాలం తీరినవారంతా అమాయకులే కావడం విషాదం. నేరరాజకీయాలతో సంబంధంలేని వారంతా ఇలా నేలకొరిగిపోవడం అత్యంత విషాదం. ఒకరా ఇద్దరా 22 మంది కారుబాంబు ఘాతుకానికి బలైపోయారు. ఎందరో మృత్యువుతో పోరాడుతూ చావుకు చేరువలో వున్నారు. పంచరంగుల ప్రపంచం ఫిల్మ్ నగరం బాంబు పేలుడుతో మరుభూమిగా మారిపోయింది. తెగిపడిన శరీరభాగాలతో భీభత్స దృశ్యమైంది. క్షతగాత్రుల రోదనలతో, ఆప్తుల కన్నీటితో యుద్ధభూమిని తలపింపజేసింది... నగర చరిత్రలో మాసిపోని విషాదాన్ని మిగిల్చింది... !!"*

### iii. వార్తా కథన రచనా శైలి (Style)

ఆధునిక వచన రచనలో కథ, నవల, నాటకం, వ్యాసం, పత్రికా రచనను ప్రధానంగా చెప్పుకోవచ్చు. అన్నిటిలోనూ రాసేది వచనమే అయినా ఒక్కో ప్రక్రియకు తనదైన

విలక్షణమైన శైలి ఉంటుంది. ఈ ప్రక్రియల్లో భాష వాడుకభాషకు సన్నిహితంగా వచ్చినప్పటికీ పాత్రోచితంగా గాని, సన్నివేశాన్ని బట్టిగాని శైలీ భేదం అనివార్యం. అసలు శైలి అంటే ఏమిటి? శైలి అంటే రచనా రీతి. భావాభివ్యక్తికి, భావోద్దీపనకు భాషను వాడుకొనే తీరును శైలి అనవచ్చు. కథలోగాని, నవలలోగాని, పత్రికా రచనలోగాని రచనలో భాషను వాడుకొనే శక్తినీ, నేర్పునూ శైలి అనవచ్చు.

ఒక ప్రక్రియలో పాఠకుల స్థాయిని బట్టి, రచయితకున్న రచనానుభవాన్ని బట్టి ఒక ప్రత్యేక శైలి ఏర్పడుతుంది. ఒకే ప్రక్రియలో సైతం అందరికీ తెలిసిన భాషలోనూ రచయిత తనవంటూ పదబంధాలను నిర్మించుకుని ప్రయోగించడం ద్వారా తన శైలిని సాధించగలుగుతాడు. 1.పదాల ఎంపిక, పదబంధాల నిర్మాణ కౌశలం, 2. వాక్యప్రయోగ భేదాలను ఉపయోగించడంలోని సామర్థ్యం, 3. ఆలంకారికత...[14] ఈ మూడూ శైలిని నిర్ణయించే అంశాలు.

ఒక రచన చేసేటప్పుడు పదాల ఎంపికలో సహజత్వానికీ, సూటిదనానికీ, సంక్షిప్తతకూ ప్రాధాన్యమివ్వడం అవసరం. ఒక భావాన్ని తెల్పడానికి ఏ సందర్భంలో ఏ మాట అతుకుతుంది? లేదా ఎన్ని మాటలు అవసరం అనే విషయం దృష్టిలో ఉంచుకోవాలి.

మిగతా వచన ప్రక్రియల్లోకన్నా పత్రికా రచన శైలి విభిన్నమైంది. మిగతా వచన ప్రక్రియల్లో వాడుక భాషను అనుసరించే రచన జరుగుతున్నా ప్రధానంగా సాహిత్యశైలి తప్పనిసరి. పత్రికా కథన రచనకు కూడా వాడుక భాషే మూలమైనా శైలి సాహిత్యాత్మకమైందిగా లేదు. ప్రజా జీవన వేదికలోని సమస్తమైన అంశాలు పత్రికలో రాయటానికి ఒకే శైలిని ఉపయోగించవలసి వస్తుంది. సాహిత్య రచనలో ఒకో రచయితకు ఒకో ప్రత్యేకమైన శైలి ఉంటుంది. పత్రికా రచన చేసే వారూ లెక్కకు మించిన సంఖ్యలో ఉన్నా వార్తా కథన రచన చేసేటప్పుడు మాత్రం అంతమందికీ అన్నిరకాల శైలి ఉండదు. పత్రిక శైలీ ఏకరూపత సాధించినందువల్ల వేరు వేరు పాత్రికేయులు రాసిన వాటిలో శైలీవైవిధ్యస్పర్శ కొంతఉన్నా స్థూల దృష్టితో ఒకటిగా కనిపిస్తుంది. ఈ రకమైన శైలీ ఏకరూపత సాధనకు 'ఈనాడు' ఒక ఒరవడి దిద్దింది. దాన్ని తర్వాత మిగతా పత్రికలు అనుసరించాయి. ప్రతి పత్రికా తనదైన శైలీ పత్రాన్ని (Style Sheet) రూపొందించుకొని అమలు చేస్తున్నప్పటికీ తేడా ప్రస్ఫుటంగా కనిపించదు.

---

14. తెలుగు మౌలిక అంశాలు - ఖండిక 8. సంపా. వేకూరి రామారావు సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రచురణ

## iv. వార్తా స్వరూపం (Structure)

సూర్యోదయానికి పూర్వమే పత్రికలు పాఠకులను చేరతాయి. పత్రికా పాఠకలోకాని కంతటికీ పత్రిక తొలి నిత్యావసరవస్తువు. మడత విప్పితే కళ్ళు వార్తల వెంట పరుగెత్తుతాయి. పత్రిక చదివేసి పక్కన పెడితే లోకమంతటా నిన్న ఏం జరిగిందో తెలుసుకున్న సంతృప్తి. ఆ సంతృప్తి తీర్చిన శక్తి పత్రికకు ఎలా వచ్చి ఉంటుంది? నగరాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉన్న లెక్కకు మించిన విలేఖరులు, ఉపసంపాదకులు, ఇతర సిబ్బంది, టెలికమ్యూనికేషన్ సౌకర్యాలు, ఇతర అత్యాధునిక యంత్రపరికరాల సమన్వయ కృషితో రూపొంది చందాదారు ఇంటి దాకా వేళకు నడచి వస్తుంది.

దినపత్రిక వార్తలమయం. ఒక్కో సంఘటనపై ఆధారపడి వార్తా నిర్మాణం జరుగుతుంది. ఆ వార్తా నిర్మాణంలో శీర్షిక (Heading), వార్త తేదీ, చోటూ (Date Line), వార్త ప్రధానాంశాలతో కూడిన పరిచయం (Lead), ప్రాధాన్యక్రమంలో ఇతర విశేషాలు, ముగింపు. ఇదీ వార్తా శరీర స్వరూపం.

వార్త ఆంతర స్వరూపం వేరు. సంఘటనలకు సంబంధించిన వివరాలనే ఇటుకలతో, శీర్షిక పరిచయం అనే హంగుల వ్యవస్థ (Design) తో తగిన వార్తా కథన శైలి అనే సిమెంటు, కాంక్రీటు మిశ్రమంతో వార్తా భవన నిర్మాణం చేసి ఆకర్షణీయమైన ముద్రణ ప్రమాణాలనే రంగులు వేసి పాఠకులను ఆకట్టుకునే విధంగా పత్రికను అందించడమన్నమాట. ఇందులో వార్తా కథనానికి శైలిని సిమెంటుతో పోల్చి చెప్పడానికి కారణం శైలికున్న ప్రాధాన్యమే. మిగతా పరిశ్రమనంతా సార్థకం చేసేది శైలి.

వార్త ఎటువంటిదైనా ఆలంకారిక శైలినో, జాతీయాలు నుడికారపు సొంపునో ఆశ్రయించి రాయడం ద్వారా పాఠకులకు అవశ్యపఠనీయంగా పాత్రికేయుడు రూపొందించగలుగుతున్నాడు.

సృజనాత్మక రచనలో రచయిత చక్కటి కథన శిల్పానికి, సన్నివేశ కల్పనా చతురతకు తోడు హృద్యమైన శైలిని ప్రోదిచేసి పాఠకుల ముందు ఒక లోకాన్ని సృష్టించగలుగుతున్నాడు. కల్పనా సాహిత్యానికి వార్తా కథన రచనకు ఏ విధంగానూ పొంతనలేకపోయినప్పటికీ వార్తను పాఠకులచేత తప్పక చదివించడంకోసం హృద్యమైన శైలిని ఎంచుకోవలసి వస్తోంది. వార్తను పాతకాలంలో వలె చేదుగుండులా అందించడం

కన్నా ఈ పద్ధతే మంచిదని దినపత్రికలు గుర్తించాయి. అయితే వార్తల్లో కవిత్వం ఎక్కువవుతోందని విమర్శలు వినవస్తున్నాయి. 'ఈనాడు' అవతరణతో కవిత్వ భాష, ఆలంకారికశైలి దినపత్రికలోకి వచ్చిందని కూడా పలువురు పాత్రికేయులు అంటున్నారు. ఔచిత్యం దెబ్బతినకుండా ఆలంకారికశైలి అవసరమేననేది చాలా వరకూ అంగీకరిస్తున్నారు.

**a. వార్తా కథనక్రమం (Order)**

జాతీయ ప్రాధాన్యం కలిగిన ఒకానొక సంఘటన ఒక రోజంతా ఎడతెరిపి లేకుండా అనేక మలుపులు తిరుగుతూ జరగవచ్చు. దాన్ని వార్తగా అందిస్తున్నప్పుడు సారాంశమంతటినీ 10 పంక్తులుగానూ, 100 పంక్తులుగానూ, 1000 పంక్తులు గానూ అందించవచ్చు. వార్తను కుదించడానికీ వివరణాత్మకంగా ఇవ్వడానికీ పాత్రికేయునికి కష్టం కావచ్చు. అయితే అందుకు తగిన వార్తాక్రమాన్ని రూపొందించుకోగలిగినప్పుడే అది సులభతరమవుతుంది. లేకపోతే రాసుకున్న నోట్సులో ఏ వాక్యం వార్తలోకి తీసుకోవాలో, ఏది వదిలి వెయ్యాలో ఏది ముందో ఏది వెనకో తెలియని గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. పేజీలకు పేజీలుగా తనదగ్గరున్న వివరాలను వడపోసి కొద్దిపాటి స్థలం లభించినా ముఖ్యాంశాలు పోకుండా రాయగలిగే సామర్థ్యం అలవర్చుకోవాలి. వార్తారచన క్రమాన్ని అందుకనుగుణంగా నిర్దేశించుకుంటే అదేమీ కష్టం కాదు. ఆంగ్లంలో 5Ws, 1H అనే పద్ధతి ఉంది. WHO? WHAT? WHEN? WHERE? WHY? HOW?.... సంఘటనలో ఈ ప్రశ్నలకు సమాధానంగా వివరాలుంటాయి. 5Ws, 1H సూత్రానికి అనుగుణంగా వార్తకు ఒకటి రెండు పేరాల్లో పరిచయం (Lead) రాసి, మిగిలిన వివరాల్లో అతి ముఖ్యమైన ఒక పేరాగా, ముఖ్యమైన విశేషాలు ఇంకొక పేరాగా, అవశ్యం ఇవ్వదగిన విశేషాలు మరో పేరాగా . . . ఇలా క్రమంగా ప్రాముఖ్యం తగ్గిపోయేలా వివరాలను రాస్తూ పోయే పద్ధతిని అనుసరించి రాయటం మేలైన పద్ధతి. 10 పేరాలుగా మొదట ఎడిషన్‌లో ప్రచురించిన ఒక వార్తలో కొంత స్థలాన్ని మరో ముఖ్యమైన వార్త కోసం కేటాయించాల్సి వస్తే మొదటి 10 పేరాల వార్తను కింద నుంచి పైకి అవసరాన్ని బట్టి 10వ పేరా, 9వ పేరా, 8వ పేరా ఈ విధంగా కత్తిరించేస్తూ వెళ్లినా ముఖ్యమైన విషయాలు కడవరకూ నిలుస్తూ వస్తాయి. ఆఖరికి పరిచయం (Lead)

పేరా ఒక్కటే మిగిలినా ఆ వార్తలోని ముఖ్యమైన వివరాల్ని అది పాఠకులకు అందించగలుగుతుంది.

## v. కొన్ని సూచనలు

ఒక సంఘటన జరిగి దాని సేకరణ, రచన, ప్రచురణ పూర్వ, ప్రచురణానంతర దశలు పూర్తి చేసుకొని పాఠకుల ముందుకు రావటానికి మధ్య కాలంలో ఎంతో మంది సృజన శక్తి, శ్రమ, యాంత్రిక , వాహన వ్యవస్థ, ఇతర ఖర్చు వినియోగించవలసి వస్తుంది' 'ఈనాడు' వంటి పత్రికల్లో నాలుగు పంక్తులదయినా సరే ఒక ముఖ్యమైన వార్తకోసం నాలుగు లక్షల రూపాయలైనా ఖర్చు చేసేందుకు వెనుకాడరు. వార్తలను అన్ని ప్రమాణాలతో పత్రికలో కెక్కించడమనేది ప్రాథమికమైంది. అంత పెట్టుబడి, అంత ఖర్చు వార్త సేకరణలో, వార్తా రచనలో చూపించే నైపుణ్యంతోనే సార్థకమవుతుంది. వార్తా సేకరణ పాఠకుల కోసం అవసరం. వార్తారచన పత్రికప్రతిష్ఠ, ప్రత్యేకతలను చాటేది. వార్తారచన అత్యంత ప్రధానమైంది. తమకు కావలసిన పాత్రికేయులను ఎంపిక చేసుకొని శిక్షణ ఇచ్చుకొనే స్థితిలో అన్ని పత్రికలూ లేవు. ఒక వార్తను సేకరించగల నేర్పు, ఓర్పు, రకరకాల స్థాయి, హోదాలు గల ప్రముఖ వ్యక్తులతో వ్యవహరించగల సమర్థత కొద్దిగానైనా ఉన్నవారే పత్రికా రంగంలోకి వస్తున్నారా? లేదా అటువంటి వారిని పత్రికల వారు ఎంపిక చేసుకోగలుగుతున్నారా? లేదు. కొంచెం కాళ్లూ చేతులూ ఆడించగల సత్తా ఉంటేచాలు ఎంపిక చేసుకొని బావిలో పడేసుకుంటే వాళ్లే ఈదుకుంటూ ఈతనేర్చుకుంటూ నెగ్గుకు వస్తున్నారు. ప్రతి పత్రికలోనూ అంతా ఇదే పద్ధతి కాదు. కొంత అనుభవం ఉన్న వారితోపాటు ఈరకం వారిని కూడా నియమించుకుంటున్నారు. ఉపసంపాదకులు/విలేఖరులుగా నియమించుకునే వారిలో ఈ రకమైనవారు కొంత ఉంటుండగా, గ్రామీణప్రాంతాల్లో, నగరాల్లో కంట్రిబ్యూటర్లుగా ప్రముఖ దినపత్రికలు పెద్ద సంఖ్యలో నియమించుకుంటున్నాయి. వారి విద్యా, అవగాహన స్థాయి, భాషా, వ్యవహార పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. (పత్రికా భాష ప్రామాణిక వ్యవహారభాష అనే ఒప్పుకోలు ఉందిగాని) వీరంతా రాసేది గ్రాంథిక, వ్యావహారిక, మాండలిక భాషా మిశ్రమంగా కూడ ఉంటుంది. అటువంటివారు రాసిన వార్తల్ని పరిశీలించి భాషాదోషాలు సరిదిద్ది అవసరమైతే తిరగరాసేందుకు సరిపోయే

ఉపసంపాదక వ్యవస్థ ఎన్ని పత్రికలకుంది? అంత వ్యవస్థను నియమించుకోవడం ఎవరికీ సాధ్యమయ్యేపని కాదు. అటువంటప్పుడు ఎంపిక చేసుకునే సమయంలో కొన్ని ప్రమాణాలు పాటించి ఆ తర్వాత వార్తాసేకరణ మెళకునలు, వార్తా రచనలో తగిన శిక్షణ ఇచ్చుకుంటే మంచిది. ఆధునిక తెలుగు అభివృద్ధి పత్రికల కృషి ఫలితమేననే ప్రశంసలో విభేదించవలసిందేమీ లేదు. అయితే తెలుగు అభివృద్ధి క్రమంలో పత్రికలు చేస్తున్న కృషిలో పై లోపాలను, కొరతలను కూడా పూరించుకోవాల్సి ఉంది. ఈ విషయంలో 'ఈనాడు' ను ప్రత్యేకంగా ప్రస్తావించవలసి ఉంటుంది. తమకోసం నియమించుకునే సిబ్బందికి శిక్షణనిస్తుంది. వార్తా రచనలో ఒకో అభివ్యక్తికి, ప్రయోగానికి ప్రామాణికాలను, ఇతరత్రా భాషా విధి నిషేధాలను వారికి అందించింది. 'ఈనాడు భాషా స్వరూపం' (Style Sheet) రూపొందించడం, అమలు చేసేందుకు చేసిన ప్రయత్నం, ఈనాడు జర్నలిజం స్కూల్ నెలకొల్పి సమగ్ర శిక్షణనిచ్చుకోవడం ఈ దిశలో వేసిన ముందడుగుగా భావించాలి. ఆది నుంచీ 'ఈనాడు' 'సుశిక్షితులైన పాత్రికేయుల ఉత్పత్తి' కి ప్రసిద్ధి పొందింది.

అయితే ఇంకా జరవలసిన కృషి చాలా ఉంది. దినపత్రిక ఒకే ప్రధాన సంకలనం (Main Edition) వేసేరోజుల్లో ఉన్నట్లుగా 'ఈనాడు' లో ప్రతిపదం మీద, ప్రతిపంక్తి మీద అదుపు ఈనాడు లేదు. స్థానిక సంకలనాలు (Local Editions) గా విస్తరించవలసి రావడం చారిత్రక అవసరమే కావచ్చు. కాని ఆ విస్తరణ వల్ల ముఖ్యంగా భాషా విషయికంగా సంపాదక యంత్రాంగం (Editorial Machinery) అదుపు పూర్తిగా పోయింది. అచ్చుతప్పులు, పద, వాక్య నిర్మాణదోషాలు, మిశ్రమ (గ్రాంథిక, వ్యావహారిక, మాండలికమో తెలియని) భాషా ఛాయలు చోటు చేసుకుంటున్నాయి. మొదటిసారి గజ్జెకట్టిన చిరంజీవి నాట్య ప్రతిభాస్పర్శకు, ఉదీయమాన నర్తకి నైపుణ్యానికి, పరిణతి సాధించిన నర్తకి చూపే పాండిత్యానికి తేడా చూడకుండా విశేషణాలు వాడడంలో విచక్షణ, సంయమన దృష్టిలోపిస్తోంది. అప్రధానమైన వార్తలకు సైతం అనవసర ప్రాధాన్యం కల్పించి స్థలం కేటాయిస్తున్నారు.

'విచారం,' 'ఆందోళన', 'ఆవేదన', 'కలత', 'మనస్తాపం' అనే మాటలను భావ తీవ్రతలో స్థాయి భేదాలను బట్టి ప్రయోగించడానికి పాత్రికేయునికి పర్యాయ పదాలు

తెలియాలి. భాష మీద అధికారం ఉండాలి. ఇది శిక్షణలో రాదు. నేర్చుకోవాలన్న ఆర్తి వల్ల, [illegible]నుగత గ్రంథ పఠనాభిరుచి వల్ల సాధించవచ్చు. పదజాలం(Vocabulary) సమృద్ధి కలిగిన వారు అరుదయి పోతున్నారు.

కంట్రిబ్యూటర్లకు వార్తా కొలత (Line Account) పద్ధతిలో పారితోషికం ఇస్తున్నారు. కాబట్టి కొలత పెంచుకొనే దృష్టితో వాళ్లు చిన్న విషయాలైనా పెద్దగా రాస్తున్నారని ఫిర్యాదు ఉంది. దాని వల్ల కొన్ని వార్తలకు అనవసర ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతున్నది. స్థలం వృథా అవుతున్నది. అలా కాకుండా వారికి తప్పనిసరిగా కొంత గౌరవ పారితోషికం ఏర్పాటు చేయడం ద్వారా వార్తలను అవసరానికి మించి పొడిగించకుండా నివారించవచ్చు. నాణ్యత పెంపొందించవచ్చు. స్థలం ఆదా చేసి ముఖ్యమైన ఇతర ప్రాంతాల వార్తలనూ క్లుప్తంగా వేయవచ్చు.

భాష విషయంలో పాత్రికేయులు తాము రాస్తున్నది గ్రాంథికమా, సరళగ్రాంథికమా, శిష్ట వ్యావహారికమా, మాండలికమా అనేది తెలుసుకోవాలి. ఈ దశలన్నీ దాటి ఈనాడు సామాన్యీకరణ (వాడుకభాష) వైపు సాగవలసిన అవసరాన్ని గుర్తించాలి. 'ఈనాడు' ది అదే లక్ష్యమైనప్పటికీ దాన్ని పాత్రికేయ సిబ్బంది ఆచరించినప్పుడే ఆ లక్ష్యం నెలవేరుతుంది. పత్రికా భాషను సామాన్యీకరించడానికి గల అవరోధాలను అధిగమించగలిగితే అది వాడుక భాషలో పడి అన్నివర్గాల పాఠకులకు సన్నిహితంగా వెళుతుంది. పత్రికలో పచ్చిందే ప్రామాణిక భాష అనేది ఒక ప్రమాణంగా ఉంది. కొత్తగా పాత్రికేయులైనవారు బైబిల్‌లా అనుసరించేది పత్రికలో వచ్చే భాషే. అందుకని ప్రతిరోజూ ముద్రణ జరిపి పాఠకుల ముందుకు పంపేముందు ఆ ప్రమాణాన్ని పాటించే వ్యవస్థ నెలకొనాలి.

భాషా పరిజ్ఞానం, రచనా ధోరణీ పత్రికలో మెరుగు పెట్టుకొనేదే గాని ఎంపిక చేసుకున్న తర్వాత నేర్పించేది కాదు. ఎంపిక చేసే సమయంలోనే ఈ విషయం దృష్టిలో ఉంచుకోవాలి.

తెలుగు ఇతర భాషా పదాలను ఆదానం చేసుకొనేందుకు అనువుగా ఉంటుంది. ఇదివరకే తెలుగులో అనేక ఇతర భాషాపదాలు చేరి స్థిరపడిపోయాయి. ఆ మాటకొస్తే ఇతర భాషల మాటలు వచ్చి చేరడం వల్ల ఏ భాషయినా సుసంపన్నమవుతుందే తప్ప భాషా దారిద్ర్యం రాదు. అయితే ఏ మాత్రం అవకాశం లభించినా వివిధ భాషల నుంచి ఎప్పటికప్పుడు వచ్చే మాటలను తెలుగులోకి అనువదించాలనే దృష్టి సమర్థనీయం. ఒక మాట మొదటి సారి తగిలినప్పుడు వ్యవధిలేక అప్పటికి యథాతథంగా తీసుకున్నా

రెండోసారి అయినా తెలుగులో పద సృష్టి చేయడానికి వెనుకాడ కూడదు. అలా చేసినవి వ్యవహారంలో నలిగి నిలిచినవి నిలుస్తాయి. నిలవలేకపోతే నిష్క్రమిస్తాయి. అందువల్ల వచ్చే నష్టం లేదు.

'ఈనాడు' శిక్షణలో వార్తల్లో రకాలు, వార్తలకు అవకాశం ఉన్న వనరులు, సేకరణకు, రచనకు తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించవలసిన సూత్రాలు, ధ్వని, నర్మ, పద, వాక్య నిర్మాణాలు, వ్యాకరణ నియమాలు, అనువాదం. . . . ఇలా అనేక విషయాలతో కూడిన పఠన సామగ్రిని తయారు చేసి ఇవ్వడమేగాక ఆయా అంశాల్లో బోధన, పునర్విమర్శ ఉంటున్నది. ఇది జర్నలిజానికి ఎంతో పుష్టిని కలిగిస్తున్నది.

'ఈనాడు' రచనా ధోరణి తీరుతెన్నులు, తప్పొప్పులను గురించి 'ఈనాడు సమీక్ష', 'మేలుకొలుపు' వంటి సంచికలు (ఇవి ఈనాడులోని పాత్రికేయ సిబ్బందికే పరిమితం) కూడా ఎంతో ఉపయుక్తంగానే ఉన్నాయి. ఈ సమీక్షలను 'ఉదయం' వంటి దినపత్రికలు కూడా వేశాయి.

# 6. దినపత్రికల సాహిత్య స్వరూపం

పత్రికల్లో సాహిత్య ప్రచురణ తొలినాళ్ళనుంచీ కనిపిస్తుంది. దీనికొక చారిత్రక క్రమం వుంది. ప్రాధాన్యం కూడా వుంది. సారస్వత విషయాలకే ప్రాధాన్యమిచ్చిన మొట్టమొదటి పత్రిక సుజనరంజని **(1862-67)** మొదలుకొని ఈనాటివరకూ పత్రికల్లో సాహిత్యానికి చోటు లభిస్తూనే వుంది. 19 వ శతాబ్ది ఉత్తరార్థంలో కవులు, పండితులు స్వయంగా పత్రికలు నడిపారు. తమవద్దనున్న తాళపత్రబంధనాల నుంచి వెలికి తీసిన ప్రాచీన కావ్యాలను ప్రతి సంచికలోనూ ధారావాహికంగా ప్రచురించేవారు. అనేక ప్రక్రియలను తెలుగులోకి తీసుకురావడంలోనూ, పత్రికలు స్థాపించి వాటిని ప్రచురించడంలోనూ ఆద్యతను వహించిన మహాపురుషుడు కందుకూరి వీరేశలింగం గారిని పేర్కొనవలసి వుంటుంది. ఆయన సమకాలికుడు కొక్కొండ వేంకటరత్నం పంతులు కూడా పత్రికల్లో సాహిత్యాంశాల ప్రచురణను చెప్పుకోదగిన రీతిలో ప్రభావితం చేశారు. పంతులుగారు 'ఆంధ్రభాషాసంజీవని' పత్రికతో తెలుగు పత్రికలలో సంపాదకీయాన్ని ప్రారంభించారు.[1] ఆ పత్రికలో గ్రంథ సమీక్షలను, కవితలను ప్రచురించారు. వీరేశలింగంగారి తొలిపద్యకావ్యం శుద్ధాంధ్ర భారతం సభాపర్వం కొంత, వడ్డాది సుబ్బారాయుడు గారి స్మృతిగీతం ఈ పత్రికలోనే ప్రచురితమయ్యాయి. తెలుగు సాహిత్యంలో ఇదే తొలి స్మృతి గీతమని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. పత్రికల్లో ప్రాచీనకావ్యాలను, ప్రబంధాలను ప్రచురించిన కాలం తర్వాత అనేక ఆధునిక ప్రక్రియల్లో రచనలకు పత్రికలు తగిన విధంగా చోటు కల్పించాయి. ఈ విధంగా అనేక ప్రక్రియలు, వాటిలో తొలిరచనలనుంచి పత్రికల్లోనే ప్రారంభమయ్యాయి. ఆధునిక ప్రక్రియలన్నీ పత్రికల పొత్తిళ్ళలోనే పుట్టిపెరిగాయని ఇదివరకే పేర్కొనడం జరిగింది. మాస, ద్వైమాస, త్రైమాస, పక్ష, వారపత్రికలు సాహిత్య ప్రచురణకే ప్రాధాన్యతనిచ్చాయి. దినపత్రికలు ఆవిర్భవించిన తర్వాత వార్తాప్రచురణ అగ్రాసనం వేసుకుంది. దినపత్రికల్లో

1. *తెలుగు పత్రికల సాహిత్య సేవ - డా. తిరుమల రామచంద్ర పు. 14*

సాహిత్యాన్ని ప్రచురించిన తీరు గమనిస్తే మొదటినుంచి కూడా ప్రతిరోజూ సాహిత్యాన్ని ప్రచురించలేదని అవగతమవుతోంది. వార్తలు, సాహిత్యాంశాల ప్రచురణలో సమగ్రతకు నాందిపలికిన ఆంధ్రపత్రిక లో ఆదివారం అనుబంధంలో సాహిత్యం ప్రచురించేవారు. ఇతర అంశాలు కూడా వుండేవి. దినపత్రికల్లో గ్రంథసమీక్షకు మొదటినుంచీ ఎక్కువ ప్రాధాన్యత లభించింది. ఆ తర్వాతి స్థానం చిన్నకథలకు, విమర్శకు, ధారావాహిక నవలలకు, కవిత్వానికీ, శీర్షికలకు లభించింది. రానురాను దినపత్రికల్లో గ్రంథసమీక్షలు, కవిత్వానికి, విమర్శకూ ప్రాధాన్యత స్థిరపడింది. కధానికలు, ధారావాహికనవలలు వార, మాసపత్రికల్లోకి మారి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రత్యేక శీర్షికలు దినపత్రికల ఆదివారం అనుబంధాలను నీడి ఇతర పేజీలకు విస్తరించాయి. సాహిత్యానికే పరిమితంకాక ఇతర విషయాలకూ చోటిచ్చాయి. మరింత ముందుకు సాగితే దినపత్రికల్లో ఆదివారం అనుబంధంలో ఇతర అంశాలకు ప్రాధాన్యతపెరిగి సాహిత్యానికి ప్రాధాన్యత తగ్గినట్లు కనిపిస్తుంది. ఆలోటు పూరించేందుకు దినపత్రికలవారు వారంలో ఒకరోజు ఒక పేజీ నిండా సాహిత్యాన్ని ప్రచురించేందుకు సాహితీ వేదికలు ప్రారంభించాయి. సమకాలీన సాహిత్యానికి ప్రాధాన్యతను పెంచాయి. నియతంగా సాహితీవేదికల్లో ఒక కవిత, ఒక విమర్శావ్యాసం, గ్రంథసమీక్షలు, స్వీకారం చోటు చేసుకుంటూ వచ్చాయి. **1985** తర్వాత ముద్రణారంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులవల్ల దినపత్రికల్లో సాహిత్యం పేజీలు ఆకర్షణీయంగా ముస్తాబై వెలువడడం ప్రారంభించాయి. రానురాను సాహితీవేదికల్లో ప్రచురించే అంశాలు ప్రామాణికతను, సమగ్రతను సంతరించుకున్నాయి. దినపత్రికల్లో గ్రంథావిష్కరణలు, కవులు, సాహిత్యవేత్తల సన్మానాలు, నిర్యాణాలు మొదలైన వార్తలు మునుపటికన్నా ఇప్పుడు ఎక్కువే వస్తున్నాయి. అయితే స్థానిక ఎడిషన్లకే పరిమితమవుతున్నాయి.

దినపత్రికల్లో **1975-90** ల మధ్య సాహిత్య ప్రచురణ గురించి అధ్యయనం చేయడానికి నేను కాలపరిమితి విధించుకున్నప్పటికీ అసలు పత్రికలు ప్రారంభమైనప్పటినుంచీ సాహిత్య ప్రచురణకు సంబంధించిన విషయాల పూర్వ సమాచారం ఇవ్వవలసిన అవసరం ఏర్పడింది. సాధ్యమైనంత సమాచారం ఇవ్వడానికి శాయశక్తులా ప్రయత్నించినా దేనికీ సమగ్రత సాధ్యంకాదు గదా!

## i. సమకాలీనత

పత్రికలు ఆవిర్భావం నుంచి కూడా సమకాలీనాంశాలను వెంట తీసుకుని ముందుకు సాగుతున్నాయి. ఆయాకాలాల్లో పాఠకులు తమకు సమకాలీనత, ప్రాచీనత ఏ పాళ్ళలో అవసరమని భావిస్తున్నారో తరచి చూస్తూ ఆమేరకు పత్రికలు వారిననుసరిస్తూనే ఎప్పటికప్పుడు ఆధునికతను ప్రబోధిస్తూ నేటిని గురించిన స్పృహను పెంపొందిస్తూ వచ్చాయి. గడచిన 160 ఏళ్ళ చరిత్ర కలిగిన పత్రికలను, వాటిలో చోటు చేసుకున్న అంశాలను ముఖ్యంగా సాహిత్య ప్రచురణాంశాలను అవలోకిస్తే ఈ విషయం బోధపడుతుంది.

తొలిపత్రిక 'వృత్తాంతి' నుంచి ఈనాటివరకూ సాహిత్యానికిచ్చిన ప్రాధాన్యంలో ప్రాచీనత ఎంత, సమకాలీనత ఎంత అనేది చర్చించవలసివస్తే పత్రికలు ఆనాటి అవసరం మేరకు రెంటికీ తగిన పాళ్ళలో చోటు కల్పించాయని చెప్పవలసివుంటుంది..

మొదట్లో పత్రికలు అప్పటికి అముద్రితంగా ఉన్న ప్రాచీన కావ్యాలను, ప్రబంధాలను ప్రచురించి పాఠకులకు అందించటం ప్రారంభించాయి. తాళపత్రాల రూపంలో ఉండిపోయి వెలుగులోకి వచ్చే మార్గం కానరాక పండితులవద్దే మగ్గిపోయిన ప్రాచీన సాహిత్య రత్నరాశులకు పత్రికలను చూసి ప్రాణం వచ్చినట్లయింది. ఆ విధంగా తొలుదొల్త ప్రాచీన కావ్య, ప్రబంధ సాహిత్య సంపదకు పత్రికలు కావలసినంత చోటు కల్పించాయి. తర్వాత మెల్లమెల్లగా సమకాలీన సాహిత్య రచనలు పత్రికల్లో చోటుచేసుకుంటూ వచ్చాయి. వంగదేశంలో ఊపిరిపోసుకున్న సంఘ సంస్కరణ దృక్పథం ఆంధ్రదేశాన్ని ప్రభావితంచేసింది. పత్రికలు సంస్కరణ భావాలకు వాహికలయ్యాయి.

పౌరాణిక, ఐతిహాసిక వస్తువులతో పాటు సాహిత్యసృజనలో ఆధునిక వస్తువుకు స్థానం లభించింది. పాశ్చాత్య సాహిత్యలోకంలో విస్తృతరూపం దాల్చిన అనేక నూతన ప్రక్రియలు తెలుగులోకి వచ్చాయి. అదివరకు ప్రాచీన సాహిత్యాన్ని ప్రచురించిన పత్రికలు తర్వాత వాటితోపాటు కవిత్వం, నవల, కథానిక, నాటిక, వ్యాసం, జీవితచరిత్ర మొదలైన ఆధునిక సాహిత్య ప్రక్రియలను ప్రచురించడం ప్రారంభించాయి. 1881లో వడ్డాది సుబ్బారాయుడు రచించిన సతీస్మృతిని 'ఆంధ్రభాషా సంజీవని' ప్రచురించింది.

తెలుగులో తొలి స్మృతి (ఎలిజీ) కవిత అదే. Cowper రచించిన ఆంగ్లకవిత "On Receipt of my mother's Picture" ను వావిలాలవాసుదేవశాస్త్రి అనువదించగా 'పురుషార్థ ప్రదాయిని (1872-78) లో ప్రచురించారు. అదే తొలి అనువాదమని నిడుదవోలు వెంకట్రావుగారు పేర్కొన్నారు. పి. ఆనందాచార్యులు నడిపిన 'వైజయంతి' పత్రికలో కొక్కొండ వెంకటరత్నము పంతులు రచించిన 'మహాశ్వేత' నవలను ప్రచురించారు. దాన్ని తొలి నవలగా కొందరు పేర్కొంటున్నారు. 19 వ శతాబ్దం ప్రారంభం నుంచి పత్రికల్లో సమకాలీన సాహిత్య ప్రచురణ అగ్రతాంబూలమందుకున్నది. 'మంజువాణి' (1898-1904) లో 'వ్యావహారికభాష' అనే తొలి మాండలికరచనను ప్రచురించారు. 'ఆంధ్రభారతి' (1910-15)లో తొలి తెలుగుకథ గురజాడవారి 'దిద్దుబాటు' ను ప్రచురించారు. 'సరస్వతి' (1923-28)లో వేటూరి ప్రభాకరశాస్త్రిగారి 'తెలుగుదేశకవుల' గురించిన వ్యాసాలు వేశారు. 1921లో ఆంధ్రపత్రిక దిన పత్రికకు అనుబంధంగా సమగ్ర సాహిత్య వేదిక 'సంవత్సరాది సంచిక' ప్రారంభమైంది. ఆంధ్ర పత్రిక సార్వతానుబంధం పానుగంటి వారి 'సాక్షి' వ్యాసాలతో ప్రారంభమైంది.

'జ్వాల' (1932) లో శ్రీశ్రీ మహాప్రస్థాన గేయం మొదటిసారి ప్రచురణ పొందింది. 'ప్రబుద్ధాంధ్ర' సమకాలీన సాహిత్య ప్రచురణ వ్యూహలో ఒకడుగు ముందుకు వేసి 1934 నుంచి పద్య ప్రచురణను మానేసి పూర్తిగా వ్యావహారిక భాషలోకి మారింది. వచన రచనల్ని మాత్రమే ప్రచురించింది. 'శారద' పత్రిక అడివిబాపిరాజు 'హిమబిందు' నవల ధారావాహికగా ప్రచురించింది. 1914లో దినపత్రికగా అవతరించిన 'ఆంధ్రపత్రిక' వారాంతపు సాహిత్యానుబంధంలో, 1921 నుంచి ఆ పత్రికకు అనుబంధంగా ప్రారంభమైన సంవత్సరాదిసంచికల్లో, అదే పత్రిక 1924లో ప్రారంభించిన సాహిత్యమాస పత్రిక 'భారతి'లో సమకాలీన తెలుగు సాహిత్యం పుంఖానుపుంఖంగా చోటుచేసుకుంది. 1938లో ప్రారంభమైన ఆంధ్రప్రభ' దినపత్రిక 'సాహిత్యకళావేదిక' పేర వారాంతపు సాహిత్యానుబంధం ప్రాచీన, ఆధునిక సాహిత్యానికి ప్రాధాన్యమిచ్చింది. అదే సంవత్సరంలో ప్రారంభమై కొంతకాలం వెలువడిన జనవాణి దినపత్రిక తాపీ ధర్మారావు తొలిసారిగా వ్యవహారభాషలో సంపాదకీయం రాశారు. 1944లో ప్రారంభమైన 'మీజాన్' దినపత్రికలో అడివిబాపిరాజు నవలలు ధారావాహికంగా ప్రచురించారు.

దినపత్రికలు పాఠకుల అభిరుచులను బట్టి ప్రాచీన సాహిత్యానికి, ఆధునిక ప్రక్రియలకు తగిన పాళ్ళలో ప్రాధాన్యం కల్పిస్తూ వచ్చాయి. తరువాతి కాలంలో ఆధునిక ప్రక్రియలకు పెద్దపీట వేశాయి. సమకాలీన సాహిత్యానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇవ్వడంలో దినపత్రికలు పరస్పరం పోటీ పడ్డాయి.

సమకాలీన సాహిత్యానికి పత్రికలందించిన ప్రోత్సాహంవల్లే వివిధ ప్రక్రియల్లో ఎంతో విస్తృతి, వైవిధ్యం, పరిణతి సాధ్యమైందని భావించవచ్చు. సాహిత్యం, సాహిత్యేతర శీర్షికల ద్వారా, భాషాపరమైన సంచలనంతో సంపాదకీయాల ద్వారా నార్ల సంపాదకత్వంలో 'ఆంధ్రప్రభ' దినపత్రిక పాఠకుల సమకాలీన స్పృహకు ఊతమిచ్చింది.

కమ్యూనిస్టు పత్రికల ఆవిర్భావంతో అభ్యుదయ సాహిత్యానికి అగ్రస్థానం లభించింది. ప్రజాశక్తి, విశాలాంధ్ర వంటి దినపత్రికల్లో రచయితలు పంపిన రచనలకు సముచితరీతిలో పత్రికల్లో స్థానం కల్పించటమే గాక సమకాలీన సమాజాభ్యుదయానికి చేయవలసిన కృషిని కూడా నిర్దేశించారు. "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" నినాదానికి బలం చేకూర్చి ఆస్ఫూర్తితో సాగిన రచనలకు విశేష ప్రాముఖ్యంకల్పించారు. విశాలాంధ్ర నిజాం వ్యతిరేక పోరాటపథంలో ప్రజానాట్యమండలి, అభ్యుదయ సాహిత్యోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. 1960 లో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆవిర్భవించింది. పత్రికల్లో సమకాలీనత రానురాను అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటూ వచ్చింది.

మాస, పక్ష, వారపత్రికలకన్నా దినపత్రికలు, అవి వెలువరించే వారాంతపు సాహిత్యానుబంధాల్లో సమకాలీన రచనలకు ఎక్కువ స్థానం కల్పిస్తున్నాయి. విమర్శ వ్యాసాల్లో, కవిత్వంలో, సాహిత్య చర్చల్లో ఎక్కువగా ఆధునికమే తప్ప ప్రాచీన దృష్టి ఈనాడు అరుదైపోయింది. గ్రంథ సమీక్షల్లో సమకాలీనతను ప్రత్యేకంగా వెతకవలసిన పనిలేదు. ఈరోజు ముద్రణ చేసుకున్న గ్రంథం రేపు పాఠకుల ఎదుట ఆవిష్కరింపబడి వారు కొని చదువుకోడానికి దినపత్రికలు దోహదం చేస్తున్నాయి.

## ii. ఉద్యమాలు

సమాజం, సాహిత్యం రెండూ వేరువేరు కాదు. అవిభాజ్యమైనవి. ఏ ఉద్యమం వచ్చినా సమాజంలోంచే వస్తుంది. సాహిత్యం దాని వల్ల ప్రభావితమవుతుంది. సమాజానికి

లేదా ఉద్యమాల్లో పాల్గొనేవారికి ఇది ఒక సాధనంగా ఉంటుంది. చైతన్యాన్ని నూరిపోసి మిగతావారిని ఉద్యమంలో భాగస్వాముల్ని చేసేందుకు ప్రేరణ శక్తిని ప్రోదిచేస్తుంది.

ఆ విధంగా మొదటినుంచి తెలుగువారి ప్రతి ఉద్యమంలోనూ సాహిత్యం తన పాత్ర తాను నిర్వహించింది. అటువంటి సాహిత్యాన్ని పత్రికలే ప్రచురించాయి.

1857 సిపాయిల తిరుగుబాటు ఘటన ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ స్పృహను పెంపొందించేందుకు దోహదం చేసింది తప్ప ఎందుకో ఆ ప్రభావం తెలుగుపత్రికలపై ఎక్కువ కనిపించలేదు. అసలు తెలుగు పత్రికలకు అప్పటికింకా పురిటి పరిమళం వదిలినట్టులేదు ఆ తర్వాత రెండు మూడు దశాబ్దాలలో సంఘసంస్కరణోద్యమం పత్రికలను ఆకర్షించింది. సంఘసంస్కరణ విషయాలను ప్రజలకు తెలియజేసేందుకు సంఘ సంస్కరణ సాహిత్యాన్ని పత్రికలు విరివిగా ప్రచురించసాగాయి. పత్రికలద్వారా కందుకూరి వీరేశలింగం చేసిన అపూర్వమైనకృషి ఆయనకు యుగపురుషఖ్యాతిని సంతరించిపెట్టింది. 'వివేకవర్ధని' వంటి (1874) పత్రికలు ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితో మరికొన్ని పత్రికలు వెలిశాయి. ఆ విధంగా స్త్రీవిద్యా వ్యాప్తికి బాల్యవివాహాలు, బోగంమేళాలు, మతమౌఢ్యం, అస్పృశ్యత, ఛాందస భావాల నిర్మూలనకు పత్రికలు గొంతుకలు విప్పాయి.

1885 లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది. 19వ శతాబ్ది చివరిపాదంలో రాజకీయ పత్రికలు ప్రారంభమయ్యాయి.

1905 లో ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వైస్రాయికర్జన్ బెంగాలును రెండుగా విభజించాడు. దానికి ప్రతిగా ప్రజా ప్రతిఘటనోద్యమంవెల్లువెత్తింది. ఆ ఆగ్రహాగ్నిజ్వాలలు ఆంధ్రదేశాన్ని కూడా తాకాయి. కలకత్తానుండి వెలువడే 'సంజవాణి' అనే వారపత్రిక 1905 జూలై 6న మొట్టమొదటిసారిగా విదేశీవస్త్రాలను బహిష్కరించాలని పిలుపునిచ్చింది. దేశమంతటా స్వదేశీ ఉద్యమం ప్రారంభమైంది. 1906 డిసెంబర్ 28 నాటి 'శశిలేఖ' పత్రిక స్వదేశీ ఉద్యమ విషయాలను విపులీకరించింది. కృష్ణాపత్రిక, నవయుగ, దేశాభిమాని, స్వరాజ్య మొదలైన పత్రికలు జాతీయోద్యమానికి వ్యాప్తిని చేకూర్చాయి. తెలుగునాట బిపిన్ చంద్రపాల్ పర్యటన ఆయన ప్రసంగించిన ప్రతిచోట చిలకమర్తివారి

'భరత ఖండంబు చక్కని పాడియావు[2] పద్యపఠనం, వీటి వివరాలు పత్రికల్లో ప్రచురణకావడం ఇవన్నీ కలిసి ఉద్యమాన్ని అజేయంగా ముందుకు తీసుకెళ్ళాయి. 1910లో ఆంధ్రభారతి' లో 'మేలుకొలుపు' శీర్షికన ప్రచురితమైన గేయం ప్రజల్లో ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది.[3]

భారతజాతీయ స్ఫూర్తితోస్వాతంత్ర్యోద్యమం, తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే స్ఫూర్తితో ఆంధ్రరాష్ట్రోద్యమం రెండూ తెలుగునాట ఏకకాలంలో కలిసి మెలిసి నడిచాయి. 'దేశాభిమాని' పత్రిక 1910 ఫిబ్రవరి 4 నాటి సంచికలో ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం కావాలని తొలిసారి నినదించింది. ఈ స్ఫూర్తితో దర్బారు, ఆంధ్రపత్రిక, దేశమాత, భారతమాత, కృష్ణాపత్రిక మొదలైన పత్రికలు రెండు ఉద్యమాలకూ బాసటగా నిలిచాయి. 1914లో ఆంధ్రపత్రిక మద్రాసుకు మారి దినపత్రికగా అవతరించింది. అది మొదటి ప్రపంచ యుద్ధకాలం. 1919 లో గాంధీజీ స్వాతంత్ర్యోద్యమరంగం మీదకు వచ్చారు. అదే సంవత్సరం ఏప్రిల్ 13న అమృత్‌సర్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో దారుణమారణకాండ జరిగింది. ఆ దారుణాన్ని తెలుగునాట కృష్ణాపత్రిక, దేశాభిమాని పత్రికలు తీవ్రంగా నిరసించాయి. 1921లో తెలంగాణా ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. రాజకీయంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా నిద్రాణమైవున్న తెలంగాణాను ఆంధ్రోద్యమం జాగృతం చేసింది. నల్లగొండ నుంచి వెలువడిన 'నీలగిరి', ఇనుగుర్తి (వరంగల్) నుంచి వెలువడిన 'తెనుగుపత్రిక' ఆంధ్ర మహాసభలకు ప్రోత్సాహం అందించాయి. 'గోలకొండ పత్రిక' కొండలాగా ప్రజల అండన నిలిచింది.

ఉద్యమాలు సఫలీకృతమయ్యాయి. పత్రికలు అలుపెరుగక నిర్బంధాలకు వెరవక ముందుకు సాగాయి.

ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ దినపత్రికలు స్వాతంత్ర్యోద్యమ సాహిత్యానుబంధాలను

---

2. *భరతఖండంబు చక్కని పాడియావు, హిందువులు లేగదూడలై యేడ్చుచుండ, తెల్లవారను గడుసరిగొల్లవారు, పితుకుతున్నారు మూతులు బిగియగట్టి*

3. *మేలుకొనుమీ భరత పుత్రుడ, మేలుకొనుమా సుజనపుత్రుడ మేలుకొనుమా సచ్చరిత్రుడ, మేలు కొనవయ్యా! నత్సామేలుకో, వేడుకను జాతీయత యను వేగు చుక్క పొడిచె నదుగో కూడివందేమా తరమ్మను కుక్కుటములరచెన్*

వెలువరించాయి. ఆ సంచికలు పాఠకుల్లో, ఉద్యమ కార్యకర్తల్లో ఎంతో ఉత్తేజాన్ని కలిగించాయి. గాంధీజీ స్ఫూర్తితో ఈ దినపత్రికల్లో హరిజనాభ్యుదయాన్ని ప్రబోధించే పద్య రచనలను విరివిగా ప్రచురించారు. 1953లో ఆంధ్రరాష్ట్రావతరణ, 1956లో విశాలాంధ్ర అవతరణను పురస్కరించుకొని దినపత్రికలన్నీ ప్రత్యేక సంచికలు ప్రచురించాయి. తెలుగు వారి చరిత్ర, సంస్కృతి, భౌగోళిక విశేషాలతోపాటు దాశరథి, కరుణశ్రీ, మొదలైన కవుల కవితల్ని ఆ సంచికల్లో వేశారు.

1969, 1974 ల్లో 'ప్రత్యేక తెలంగాణా', 'జై ఆంధ్ర' మొదలైన వేర్పాటు వాద ఉద్యమాలు వచ్చినపుడు కూడ ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి ఆంధ్రభూమి మొదలైన దినపత్రికలు నిర్మాణాత్మక పాత్రను పోషించాయి. స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్రోద్యమం వంటి ఉద్యమాల్లో అనుకూలంగా, ప్రత్యేక తెలంగాణా, జైఆంధ్ర వంటి ఉద్యమాల్లో వ్యతిరేకంగా సాహిత్యాన్ని, ఇతర వార్తల్ని ప్రచురించి పత్రికలు తమ బాధ్యతను నెరవేర్చాయి.

## iii. వ్యక్తులపై దుమారం

తెలుగు సాహిత్య చరిత్రలో అవిస్మరణీయంగా నిలిచిపోయిన, అనేక దూషణ భూషణలు పత్రికాముఖంగా జరిగాయి. దిగ్గజాలవంటి కవులు, రచయితలు, విమర్శకులు పరస్పరం సాహిత్య సంబంధమైన విషయాలపై ఎడతెగని చర్చలు చేశారు. ఆవిధంగా చెలరేగిన వివాదాల్లో, సాహిత్యచర్చల్లో ఇరువైపుల వారి అభిమానులు సైతం కలగజేసుకుని పత్రికలనిండా ఆవివాదాలు చాలాకాలం కొనసాగడం మనకు మొదటి నుంచీ ఉంది.

మొట్టమొదట ఇటువంటి వివాదం సుప్రసిద్ధ గ్రాంథికభాషావాది కొక్కొండ వెంకటరత్నము పంతులుగారికి, కందుకూరి వీరేశలింగంగారికి మధ్యనే నడిచింది. మొదట ఈ ఖండనమండనాల పర్వం భాషకు, భావాలకు మాత్రమే సీమితంకాక వ్యక్తిగత విషయాలకు కూడా మళ్ళినట్లు అవగతమవుతోంది. కలశపాకము విజయరాఘవనాయుడు అనే వదాన్యుని సహాయంతో కొక్కొండ వెంకటరత్నము పంతులు గారు 1871 లో ప్రారంభించిన 'ఆంధ్రభాషాసంజీవని' పత్రిక పూర్వాన్నత్య పునరుద్ధరణ వాదులకు ప్రాతినిధ్యం వహించింది. స్త్రీవిద్య మొదలైన సంఘసంస్కరణ భావాలను వ్యతిరేకిస్తూ వ్యాసాలు ప్రచురించారు. వేదము వేంకటరాయశాస్త్రిగారు

పాత్రోచితభాషను కందుకూరి వీరేశలింగంగారి సరళగ్రాంథిక భాషావాదాన్ని ఆంధ్రభాషా సంజీవని ఖండించింది.

మొదట పురుషార్థప్రదాయిని పత్రిక ఆంధ్రభాషాసంజీవనికి ప్రత్యర్థిగా వుండి సంఘసంస్కరణవాదాన్ని సమర్థించింది. తర్వాతి కాలంలో వీరేశలింగంగారి 'వివేకవర్ధని' మొదలైన పత్రికలకూ, ఆనాటి 'అముద్రిత గ్రంథచింతామణి', 'హిందూజనసంస్కారిణి' 'రాజయోగి' మొదలైన పత్రికలకు మధ్య అనేక విషయాలపై వివాదాలు జరిగాయి. వీరేశలింగం గారిని అవమానపరచేందుకు కొక్కొండ వారు 'హాస్యవర్ధని' (1875)ని నడిపితే, కొక్కొండ వారికి ప్రతిగా వీరేశలింగంగారు 'హాస్యసంజీవని' (1876)ని నడిపారు.

ఆకాలంలో పత్రికల్లో సాహిత్యపరమైన చర్చలు ఎక్కువే అయినా పండితులకే పరిమితంగా ఉండేవి.

ఆధునిక కాలంలో సాహిత్య వివాదాలు, సాహిత్యచర్చలు ఆవిధంగా కాక కవుల కవిత్వ చర్చలు, సాహిత్య ప్రక్రియా ధోరణులను గురించిన వాదోపవాదాలు అనేకం జరిగాయి. 'గురజాడ', 'శ్రీశ్రీ' విశ్వనాథ ప్రభృతులపై దుమారాలు కూడా చెలరేగాయి.

1935 ప్రాంతాల్లో 'ఆంధ్రపత్రిక' దినపత్రికలో 'నన్నెచోడుని'పైనా, 'కుమారసంభవం'. పైనా విస్తృతంగా చర్చ జరిగింది. నన్నెచోడుని ఉనికిని గురించి, 'కుమారసంభవం' కావ్యాన్ని గురించి నన్నెచోడుడు నన్నయకు పూర్వుడని నన్నయ మహాభారతా ను వాదానికి పూర్వమే కుమారసంభవం రచించడం జరిగిందని కాలనిర్ణయవాదాలు జరిగాయి. నన్నెచోడుని ఉనికి ప్రశ్నార్థకమని, అలాగే కుమారసంభవకర్త నన్నెచోడుడు కాడని, నన్నయ ఆదికవి అని కూడా అనేకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ చర్చలు పండితుల్లో పరిశోధనాసక్తిని రేకెత్తించి సాహిత్యాధ్యయనం వైపు మరల్చేవిధంగా సాగాయి.

ఆంధ్రపత్రిక 1955 జనవరి 4 వతేదీ సంచికలో 'ఆంధ్ర రచయితల గురుతరబాధ్యత' అన్న చర్చ ప్రారంభించింది. అది ఎన్నికల సమయం. ఒకవైపు కాంగ్రెస్ మరోవైపు కమ్యూనిస్టుపార్టీ హోరాహోరీగా మోహరించిన సమయం. ఆంధ్రపత్రిక చర్చను పార్టీల ఎన్నికల ప్రణాళికా ప్రస్తావనతో ప్రారంభిస్తూ కమ్యూనిస్టుల ఎన్నికల ప్రణాళికపై

వ్యాఖ్యానించింది. అభ్యుదయ కవుల గానాన్ని బట్టి రష్యా, చైనా వంటి దేశాలు ఆదర్శరాజ్యాలని అభిప్రాయం కలుగుతుందని పేర్కొంది. అంతటితో ఆగక శ్రీశ్రీ పేరెత్తకుండా 'ఈమధ్యనే శాంతిసభ'కు వెళ్ళివస్తూ రష్యాలోని మాస్కో విశ్వవిద్యాలయాన్ని చూచివచ్చిన ఒక అభ్యుదయకవి'...

"మాస్కో విశ్వవిద్యాలయంలాంటి విశ్వవిద్యాలయం మనదేశంలొ ఒక్కటైనా వున్నదా? ఎంత బ్రహ్మాండమైన భవనం? ఎన్నిగదులు? ఆ భవనంలో ఒక గదిలో ఒక శిశువు జన్మిస్తే ఆ శిశువును ప్రతిరోజూ ఒక గదిలో నిద్రచేయిస్తే అన్ని గదుల్లోనూ నిద్రచేయించడానికి నూరేండ్లు పడుతుంది" అని ప్రస్తుతించాడు.

అందులో చదువు ఎలా చెబుతున్నారో ఏంచెబుతున్నారో తెలుసుకోకుండా భవనమే ఇలా వుంటే చదువుఇంకెలా వుంటుందో అన్నట్లు ఊహించుకుంటే ఎలా? అసలీ భవనాన్ని ఎవరు కట్టించారో తెలిస్తే ఆయనలా మాట్లాడరు. అది రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడకముందే 1775 లో ఏర్పడింది.

అంటూ - 'ఒక రచయిత' పేర శ్రీశ్రీని నిందించింది.

దానికి 1955 జనవరి 7 శుక్రవారం సంచికలో శ్రీశ్రీ సమాధానం వచ్చింది. శ్రీశ్రీ సమాధానం ఆయన పంపిన మాస్కో విశ్వవిద్యాలయ భవనం ఫోటోతోసహా అచ్చయ్యింది. అందులో మొదట ఆయన 'ఇది మాస్కో విశ్వవిద్యాలయం ఫోటో. ఈ భవన నిర్మాణం కిందటేడేపూర్తయ్యింది. 1775 లో పూర్తయిన విశ్వవిద్యాలయం గురించి కాదు నేను చెప్పింది' అన్నారు.

శ్రీశ్రీ సమాధానంలో ఇంకా ఇలా వుంది.

"రెండు మహాయుద్ధాలలో లక్షల కొలది మంది ప్రజలనీ, కోట్లకొలది ఆస్తినీ నష్టపోయినప్పటికీ బ్రహ్మాండమైన పునర్నిర్మాణం సాగిస్తున్న రష్యాదేశాన్ని, విశాఖపట్టణంలో బాంబులు పడితే ఢిల్లీదాకా పరుగెత్తే ప్రజలున్న భారతదేశం విమర్శించబూనుకోవడం పరిహాసాస్పదమే అవుతుంది. (శ్రీశ్రీ 4.1.55)"

దానికి మళ్ళీ 'ఒక రచయిత' (చర్చకు కేంద్రబిందువు) శ్రీశ్రీపై తీవ్రపదజాలంతో దుమ్మెత్తిపోస్తూ పద్యాలతో సహా సమాధానం రాశాడు.

---

*4. 1955 జనవరి ఆంధ్రపత్రిక సంచికలు*

'తలవుంటే తెలిసేదీ

తెలివుంటే తెలిసిందేదీ

కనులుంటే కన్పించినదేమీ

చెవులుంటే విన్పించినదేమీ'

అజ్ఞానమే ఆనందదాయకం, ఉష్ట్రపక్షి మార్గదర్శి అనుకుంటే కావచ్చు. "ఇగ్నొరెన్సు ఈజ్‌బ్లిస్"

కారం

అకారం

వికారం

హాహాకారం

అహంకారం

మహాకవి అలంకారం

దీనిపై అదే సంచికలో సంపాదకుల నోటు ప్రచురితమైంది."శీర్షిక వివాద గ్రస్తము" కావడంపట్ల విచారం వ్యక్తం చేస్తూ "దూషణ భూషణలకు ఆస్కారమివ్వక సహేతుకముగ సోదాహరణగ ఎవరు వ్రాసినను ప్రచురించగలము" అన్నారు అందులో.

జనవరి **11, 1955** సంచికలో మళ్ళీ శ్రీశ్రీ సమాధానం వేశారు. అసలు దీనికంతటికీ కారణం ఆంధ్రపత్రికవారేనని శ్రీశ్రీ భావించినట్లు ఆయన సమాధానాన్ని బట్టి భావించవలసివస్తుంది.

శ్రీశ్రీ లేఖలో ఒకచోట

"ఎర్రకోట మీద కాంగ్రెస్ జెండా ఎగురుతున్నంత మాత్రంచేత, ఆంధ్రపత్రికా కార్యాలయానికి రీడర్స్ డైజెస్టు రవాణా అవుతున్నంత మాత్రం చేత తెలుగు డొక్కలు నిండిపోయాయని గాని తెలుగుపుణ్యం పండిపోయిందని గాని భ్రమపడేవాళ్ళను చూసి జాలిపడాలి. గంగాభాగీరథీసమానురాలైన కాంగ్రెస్‌కి ఎంత పెందరాళే ఉద్వాసన చెబితే అంత శీఘ్రంలో మనం బాగుపడుతాం"

అని రాశారు.

మామూలుగా ఆదివారం సాహిత్యానుబంధంలో సాహిత్య సంబంధమైన అంశాలకు చోటిచ్చేవారు. అటువంటిది ఈ చర్చను సాధారణ పేజీలో ప్రారంభించారు. అలాగే కొనసాగింది. ఇక శ్రీశ్రీకి తిరిగి 'ఒక రచయిత', 'ఒక రచయిత'కు మళ్ళీశ్రీశ్రీ సమాధానం చెప్పుకున్నారు. పాఠకులు, రచయితల స్పందనలతో కూడిన లేఖల్ని విస్తృతంగా ప్రచురించనారంభించారు. దుమారంచాలా తీవ్రస్థాయికి వెళ్ళింది. ఎక్కువ లేఖలు శ్రీశ్రీకి వ్యతిరేకంగా రాసినవి, కొన్ని అనుకూలంగా వున్నవి రోజా ఆంధ్రపత్రికలో వేయడం కొనసాగింది.

భారతీయుల్ని విశాఖలో బాంబులు పడితే ఢిల్లీ వరకూ పారిపోయే పిరికిపందలని శ్రీశ్రీ నిందిస్తాడా... ఈ దేశం ఉప్పుతిని బ్రతుకుతూ రష్యాకు అమ్ముడుపోవడం వ్యభిచారం కన్నా నీచంకూడాను... కమ్యూనిస్టును సమర్థించడమే అభ్యుదయరచనా ... శ్రీశ్రీని కమ్యూనిస్టు అనడం నీచం..." అంటూ వేనోళ్ళ దుమ్మెత్తి పోశారు శ్రీశ్రీపైన.

మామూలు పాఠకులు, రచయితలతోపాటు చర్చలో ప్రముఖ రచయితలు కూడా పాల్గొనడం ప్రారంభమైంది. మొక్కపాటి నరసింహశాస్త్రిగారు జోక్యం చేసుకుంటూ (జనవరి 17 నాటి సంచిక) 'ఈ దుమారం నిర్హేతుకమైందని పిల్లల ఉడుకుబోతుతనంగా వుందని, వక్రమార్గంవీడి సరైన అభిప్రాయాలను ప్రకటించాలని ముఖ్య రచయితలకు సలహాఇచ్చారు.

ఆ దుమారం మరికొన్నాళ్ళ వరకూ కొనసాగింది.

'భారతదేశాన్ని కాదనలేను
రష్యాదేశాన్ని కొలువలేను'

అంటూ 'కవివాక్కు' శీర్షికతో బాలగంగాధర తిలక్ కవితాస్పందన సైతం 1955 జనవరి 23 సంచికలో వచ్చింది. చివరికి"వ్యక్తి స్వాతంత్ర్యములకు భంగములేని ప్రజాస్వామికాదర్శములతో రాజకీయ పక్షాలకతీతులై రచనలు కావించుటే రచయితల లక్ష్యం" అని సుమారు 300 మంది రచయితలు, కళాకారుల సంతకాలతో లక్ష్య ప్రకటన చేయవలసి వచ్చింది. ఈ లక్ష్య ప్రకటనతో దుమారం శాంతించింది.

ఈ దుమారం పట్ల శ్రీశ్రీ తీవ్రమనస్తాపానికి గురయ్యాడు.

అది జరిగిన రెండు సంవత్సరాలకు 1957లో నిజాంకళాశాల విద్యార్థుల వార్షిక సంచిక శ్రీశ్రీ ముఖచిత్రంతో వచ్చింది. అప్పటి విద్యార్థులు చేరా ప్రభృతులు శ్రీశ్రీకి వ్యతిరేకంగా ఆంధ్రపత్రికలో జరిగిన దుమారానికి నిరసనగా చేసిన ప్రయత్నం అది. అందులో 'శ్రీశ్రీ దేశభక్తుడు' అనే వ్యాసం కూడా వుంది. దాని ప్రతిని శ్రీశ్రీకి పంపారు. శ్రీశ్రీ దానికి ప్రతిస్పందనగా చేరాకు రాసిన ఉత్తరంలో 'దేశభక్తి ... విదేశభక్తి వంటివాటిపై చర్చకిది సమయంకాదు' అని రాశారు.

1962లో ఇటువంటి ఆంధ్రపత్రికావిపత్తే మరొకటి జరిగింది. ఒక మహాకవిపై దుమారం సద్దుమణిగి మరో మహాకవిపైకి మళ్ళిన ఉదంతం అది. విశ్వనాథసత్యనారాయణపై రేగిన ఈ దుమారంలో ఆయన కవిత్వంలో భాషా దోషాలు, ఛందోదోషాలపై కొంతమంది రాసిన విమర్శావ్యాసాలను, లేఖలను ఆంధ్రపత్రిక ప్రచురించింది. తర్వాత విశ్వనాథవారి సమాధానం కూడా ప్రచురితమైంది. జరిగిన దుష్ప్రచారానికి ఆయన చాలా కలత చెందారు.[5]

అది "నన్ను స్థిమితంగా మనశ్శాంతిగా ఉండనీయండి. ఈ దుమారం నిలిపేయండి" అని విజ్ఞప్తి చేసేదాకా వెళ్ళింది.

1960 ల్లోనే ఆంధ్రపత్రికలో 'కన్యాశుల్కం' నాటకాన్ని గురజాడ రాయలేదని గురజాడ స్నేహితుడు గోమఠం శ్రీనివాసాచార్యులు రాశాడని ఒక పెద్ద వివాదం చెలరేగింది.

ఇద్దరు మహాకవులను చిత్రహింస పెట్టేవిధంగా సాగిన ఈ దుమారాలను మినహాయిస్తే ఆంధ్రపత్రిక దినపత్రికలోనూ, భారతిలోనూ సాహిత్యపరమైన చర్చలు చాలా ఆలోచనాత్మకమూ ప్రయోజనాత్మకమైనవే వచ్చాయి. బరువైన భాషా, శాసనపరిశోధనాంశాలపైనా, సమీక్షలపైన కూడాఆంధ్రపత్రికలో చర్చలు జరిగాయి. ఇదే పత్రికలో 1972లొ సంపత్కుమార చేరాలమధ్య 'వచనపద్యం లక్షణ చర్చ 'జరిగింది. ఇది తరువాత గ్రంథరూపంలో వచ్చింది.

'ఆంధ్రప్రభ'లో నార్లవెంకటేశ్వరరావు ఉన్నప్పుడు కమ్యూనిస్టుల మీది కోపంతో కొంతమంది రచయితలకు టెలిగ్రాములిచ్చి 'Why I oppose Communists' అనే అంశంపై వ్యాసాలు రాసిపంపవలసిందని కోరగా గిడుగు సీతాపతి, వడ్లమూడి గోపాల కృష్ణయ్య రాశారట. ఆ సమయంలో నార్ల చిరంజీవి కమ్యూనిస్టులను సమర్థిస్తూ కాంగ్రెస్‌వారిని విమర్శిస్తూ విశాలాంధ్రలో పెద్ద లేఖ రాశారట.[6]

5. చేరాతో సంభాషణ
6. చేరాతో సంభాషణ

ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రిక వారాంతంలో వేసే అనుబంధంలోనూ, సోమవారాల్లో దినపత్రిక ఎడిటోరియల్ పేజీలో వేసే 'సాహితీ వేదిక' లోనూ సాహిత్య సంబంధమైన చర్చలు జరిగాయి. వ్యక్తిగత నిందల జోలికి పోలేదు. ఆదివారం అనుబంధంలో 'చేరాతలు' కాలమ్ ఎంతగానో ప్రసిద్ధికెక్కింది. చేరాతల్లో వ్యక్తమైన అభిప్రాయాలపై, వ్యాఖ్యలపై కూడా వాదవివాదాలు జరిగాయి. అవి కూడా పరస్పరం నిందలు వేసుకొనే స్థాయికి దారితీయలేదు. ఈ వాదవివాదాలు, చర్చలు మొత్తంమీద సాహిత్య ప్రయోజనానికి దోహదం చేశాయని చెప్పవచ్చు.

## iv. శీర్షికలు

తెలుగుపత్రికలను సుసంపన్నంచేసిన అంశాల్లో 'శీర్షికలు' ఒకటి. తొలి పత్రికల్లో ఒకటైన 'శ్రీమద్వర్తమానతరంగిణి' (1894-96)లో సత్కవి ప్రశంసనము శీర్షికన ప్రతిసంచికలో సమకాలీన కవులను గురించి ప్రచురించడాన్ని బట్టిపత్రికలు ప్రారంభమైన కాలంలోనే శీర్షికలు ప్రాముఖ్యం వహించాయని తెలుస్తున్నది. 1895 సంచిక 'శ్రీమద్వర్తమానతరంగిణి' లో ఈ శీర్షికన కందుకూరి వీరేశలింగం గారిని గురించి రాశారు. ఒక మకుటాన్ని ధరించి వారపత్రికలు గాని మాసపత్రికలుగాని దినపత్రికలుగాని సాహిత్య విషయాలు లేదా ఇతర విషయాలు ప్రచురిస్తూ ఉండటాన్ని శీర్షికగా పేర్కొనవచ్చు. తెలుగు పత్రికలు ప్రతిబింబించిన వివిధ అంశాలను పరిశీలిస్తే శీర్షికలద్వారా అన్ని వర్గాల పాఠకులకు సాహిత్యాన్ని గురించి ఎంతో కొంత ప్రయోజనాత్మకమైన విషయసంపదను అందించినట్లు బోధపడుతున్నది. చెప్పుకోదగిన శీర్షికల్లో భారతి పత్రికలో 1927లో 'కలగూరగంప' శీర్షికద్వారా సాహిత్యంలోని వివిధ అంశాలపై విస్తృతంగా చర్చా వ్యాసాలు వెలువడ్డాయి. విశ్వనాథ సత్యనారాయణగారు 1927లో ప్రారంభించిన 'జయంతి' పత్రికలో 'సాహిత్యధార' శీర్షిక అప్పట్లో ప్రసిద్ధం. 'పరిశోధన' పత్రిక (1953-56) దేశిరచనలు, సాహిత్యమీమాంస, తెలుగుతోబుట్టువులు, టీకాటిప్పణి, ఛందస్సు, అలంకారం మొదలైన అనేక సాహిత్య విషయాలను పాఠకులకు తెలియజేయడానికి శీర్షిక ప్రవేశపెట్టింది.

ఆంధ్రపత్రిక దినపత్రికకు 1921లో సాహిత్యానుబంధాన్ని ప్రారంభించారు. తొలిసంచికలో పానుగంటి వారి 'సాక్షి' శీర్షికావ్యాసాలు ప్రారంభమై చాలా కాలం

సాహిత్య జగత్తులో ప్రకాశించాయి. అదేవిధంగా ఆంధ్రపత్రిక సాహిత్యానుబంధంలో మానవల్లి రామకృష్ణకవిగారి 'పుష్పాంజలి' శీర్షిక వివిధ సాహిత్య విషయాలతో వెలువడి అలరించేది.

నార్లవెంకటేశ్వరరావు ఆంధ్రప్రభలో 'మాటామంతీ', 'పిచ్చాపాటి' శీర్షికలు నడిపి సాహిత్యంపై, ఇతర విషయాలపై చిన్నవిగా ఉండే శీర్షికా వ్యాసాలు సరళమైన భాషలో రాసి పాఠకులను బాగా ఆకట్టుకున్నారు.

ఆంధ్రపత్రిక 1960లో నిర్వహించిన 'తెలుగు వెలుగులు' శీర్షిక తెలుగులో ఒక విశిష్టతను సంతరించుకున్నది. 75 వారాలపాటు చక్కటి రేఖాచిత్రాలతో తెలుగు వెలుగులను గురించి ఆ శీర్షికలను రూపొందించారు.

ఆవంత్స సోమసుందర్ నడిపిన 'కళాకేళి' పత్రిక (1968)లో 'తొలకరి' శీర్షికన కొత్తగా కవిత్వాన్ని వ్రాస్తున్నవారి కవితలను ప్రచురించారు. 'రుతుపవనాలు' శీర్షికలో దేశదేశాల కవులను గురించి, వారి ధోరణులను గురించి ప్రచురించారు. 'కుంకుమరేఖలు' శీర్షికలో కవయిత్రులకవితల్ని ప్రచురించేవారు.

1950లో ఆంధ్రపత్రికలో 'కాలక్షేపము' అనే శీర్షిక విశేషంగా ఆకట్టుకుంది. ప్రాచీన సాహిత్య సౌందర్యం అలంకార విశిష్టతపై అద్భుతమైన వ్యాసాలు వెలువరించింది. 1950 ఆగస్టు 3 నాటి సంచికలో పెద్దన గారి పద్యం వేసి దాన్ని గురించి వివరిస్తూ:

"సాయంకాల సమయంలో వీణమెట్లను నాటరాగానికి సరిచేసి రాజకుమారి దానిని మేళవించి చాలా సేపు వాయించింది. ఆ వీణను అలాగే మేళవించి వుంచి ఆమె నిద్రపోయింది. రాత్రిగడచి ప్రాతఃకాలమైంది. ఆమె ఇంకా నిద్రలేవలేదు. ఆ ప్రభాతకాలమందు వచ్చుచున్న గాలిచేకొట్టబడి కదలుచున్న తీగెలు ఇంకా నాటరాగమునే పలికించుచున్నవి. కాని తెల్లవారుజామున వాయించవలసిన రాగం దేశాక్షిరాగం. సాయంకాలం వాయించవలసిన నాటరాగం ఆ వీణెమీద (వేళకానివేళ) బల్కుచున్నది. కాన ఓ లోలాక్షీ నీవు లేచివచ్చి ఆవీణెను దేశాక్షిరాగానికి మేళవించి శ్రుతి చెయ్యి ఒకసారి అని చెలికత్తెలు సుకుమారంగా చమత్కారంగా అన్నారని పెద్దనగారి పద్యం చెబుతోంది" అని ఆ శీర్షిక వివరించింది.

1960లో ముళ్ళపూడి వెంకటరమణ 'వ్యంగ్యరచన' అనే శీర్షికను వ్యంగ్యకార్టూన్లతోపాటు వివిధ విషయాలపై నిర్వహించి అలరించారు.

ఆంధ్రప్రభ వివిధ వ్యాసానుబంధంలో 1957 డిసెంబర్‌నుంచి ఆచంట జానకీరాం 'నా స్మృతిపథంలో' అనే శీర్షిక నిర్వహించారు. 1961 లో రావూరు వెంకటసత్యనారాయణరావు గారు నిర్వహించిన 'ఆషామాషీ' శీర్షిక విశేషంగా ఆకట్టుకొంది. 1967లో విద్వాన్ విశ్వం 'వారంవారం' అనే శీర్షిక నడిపారు. 1977లో విశాలాంధ్రలో ఆర్వీయార్ 'పనికొచ్చేముక్క' నడిపారు. 'ఉదయం'లో 1987లో జి. కృష్ణగారి 'మనసులో మాట' అనేక దశాబ్దాల పరిణామాలను, విశేషాలను అలవోకగా విప్పిచెబుతూ సాగిన శీర్షిక.

'ఈనాడు' దినపత్రికలో 1979నుంచి గజ్జెలమల్లారెడ్డి పుణ్యభూమి శీర్షిక నడిచి బహుళ ప్రాచుర్యం పొందింది. సమకాలీన రాజకీయాలపై వ్యంగ్య, అధిక్షేప కవితలతో కూడి వుండడం వల్ల శీర్షిక పాఠకులు మెచ్చేదిగా సాగింది. ఈనాడు నుంచి మల్లారెడ్డి 'ఆంధ్రభూమి'కి వచ్చిన తర్వాత 1983లో అదే శీర్షికను భూమిలో కొనసాగించారు. 'ఉదయం' లోకి మారిన తర్వాత 'మల్లారెడ్డి మాటకచేరి'గా పేరు మార్చుకుని రోజూ దర్శన మిచ్చింది. ఈనాడు, ఆంధ్రభూమి పత్రికల్లో వారానికోసారి వచ్చేది, ఉదయంలో 1990 నాటికి పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'మరమరాలు', రాంభట్ల 'పిడకలవేట' శీర్షికలు పాఠకులను విశేషంగా ఆకర్షించాయి. 1978లో ఉషశ్రీ ఆంధ్రప్రభ ఆదివారం విజ్ఞాన వేదికలో 'భారతంలో చిన్నకథలు' శీర్షిక నిర్వహించారు. 1981లో లత 'ఊహాగానం' తనదైన ప్రత్యేక శైలిలో సాగింది. 1984 నుంచి ఆంధ్రప్రభలో జి. కృష్ణగారి 'అప్పుడు ఇప్పుడు', అరిపిరాలవిశ్వంగారి 'పరంపర' శీర్షికలు వచ్చాయి. 1985లో జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఆంధ్రప్రభలో 'తెలుగులో వెలుగు' అనే శీర్షిక నడిపారు. 1987 లో కె.వి. రమణారెడ్డి ఆంధ్రప్రభలో 'ఆధునిక భారతసాహిత్యకర్తలు' అనే శీర్షిక నిర్వహించారు. అదేకాలంలో వుప్పల నరసింహంగారి 'తెలంగాణా' శీర్షిక, తర్వాత పులికంటి కృష్ణారెడ్డిగారి 'రాయలసీమ జీవనశైలి' శీర్షిక ఒక దాని తర్వాత మరొకటి నడిచాయి. 1988లో ఆంధ్రప్రభలో జి.వి. సుబ్రహ్మణ్యం గారి 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు' అనే శీర్షిక మంచి స్పందన కలిగించింది.

తెలుగులో ఏ పత్రిక తిరగేసినా శీర్షికలు మెదడుకు పదునుపెట్టేవిధంగా విషయాలను సరళమైనభాషలో అందించేవి. ప్రస్తుతం దిన పత్రికలు ప్రధానంగా మునుపటిలా ఒక ధోరణికి కట్టుబడక అన్ని వర్గాల పాఠకులకు అన్ని రకాల విషయాలను అందించే

పద్ధతిని అవలంబిస్తూ ఉండటం మూలాన ప్రత్యేకంగా సాహిత్య ప్రధానమైన శీర్షికలు తగ్గుముఖం పట్టాయని చెప్పకతప్పదు.

ఒక దినపత్రికలో ఎనిమిదేళ్ళ సుదీర్ఘకాలం అవిచ్ఛిన్నంగా ఒక సాహిత్య శీర్షిక నిర్వహించిన ఘనతను 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక దక్కించుకుంది. **1986** అక్టోబర్ నుంచి **1994** మార్చివరకు (మధ్యలో **1988**లో **8** నెలల విరామం తప్ప) చేరాతలు శీర్షిక నడిచింది. శీర్షిక యువతరంలో సాహిత్యాభిరుచిని పెంపొందించింది. అన్ని తరాల కవి, రచయితల రచనలను స్పృశించి ఎక్కువమంది ప్రతిస్పందనకు నోచుకున్న శీర్షికగా కూడా ప్రసిద్ధికెక్కింది. కావ్యవిమర్శ, ప్రక్రియా విమర్శ, గ్రంథవిమర్శ, ఛందస్సుపై వివేచన, శైలీ శాస్త్రదృష్టులతో పాటు కొన్ని సందర్భాల్లో ఒకే ఖండిక (single poem) పై కూడా పూర్తిసమాలోచనను చేరాతల శీర్షిక చేసింది. **1982**లో ఆంధ్రజ్యోతి సంపాదకీయ పేజీలో ఆరుద్ర వ్యాసపీఠం శీర్షిక వచ్చింది. **1985**లో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'భాషలో తమాషాలు' శీర్షిక వెలువడింది. ఉదయం దినపత్రిక సాహిత్యానుబంధంలో కాకుండా మామూలూ రోజువారీగానే వారంలో రెండు మూడు శీర్షికలు నిర్వహించడం చెప్పుకోదగిన విషయం. ఆంధ్రజ్యోతి దినపత్రికలో కూడా కొన్ని శీర్షికలు అదే విధంగా వచ్చినా అవి పూర్తిగా సాహిత్య విషయాలతో కూడుకొన్నవి కావు. ఉదాహరణకు నామిని సుబ్రహ్మణ్యం నాయుడు 'సినబ్బ కథలు' శీర్షిక పల్లీయ జీవితానుభవాల్ని మాండలికంలో ప్రతిబింబించడంతోపాటు సాహిత్య పరిమళాన్ని సంతరించుకున్నది. ఉదయం దినపత్రికలో కూడా నామినిదే 'పచ్చనాకుసాక్షిగా' శీర్షిక కొనసాగింది. అబ్బూరివరదరాజేశ్వరరావు 'ఉదయం' లోనే నిర్వహించిన శీర్షిక 'వరదకాలం'. ఇదీ సాహిత్య ప్రధానమైన శీర్షికే. అబ్బూరి రామకృష్ణారావు తనయుడవటమేకాక 'వరద' స్వయంగా కవి, విమర్శకుడు కాబట్టి తనకు సాహిత్యంతో, సాహితీ వ్యాసంగంలో మునిగితేలిన మహనీయ కవిరచయితలతో ఉన్న పరిచయానికి సంబంధించిన ఆత్మీయ విషయాలను ఈ శీర్షికలో రాశారు. ఉదయంలో నగ్నముని నిర్వహించిన 'అక్షరాయుధం' కూడా చెప్పుకోదింది.

దినపత్రికల్లో సాహిత్యానికి చాలావరకు ప్రాధాన్యత తగ్గిపోతూ జాతీయ అంతర్జాతీయ ప్రాంతీయవార్తలు, ఆర్థిక పారిశ్రామిక వార్తలే పూర్తిగా ఆక్రమిస్తున్న కాలమిది. కాబట్టి దినపత్రికల్లో సాహిత్య శీర్షికలు పూర్తిగా తగ్గిపోతున్నాయి.

## V. గ్రంథ సమీక్షలు

తెలుగు పత్రికల చరిత్ర సమస్తం పరిశీలిస్తే రెండు ప్రధానాంశాలు అవగతమవుతాయి. ఒకటి సుప్రసిద్ధమైన తెలుగు కావ్యాలను, ప్రబంధాలను, సమకాలీన గ్రంథరచనలను వెలుగులోకి తేవడమే పనిగా పెట్టుకున్న పత్రికలు. గత్యంతరంలేక చీకటి గుహల్లో మగ్గిపోయిన కావ్యాలను ప్రచురించి పాఠకులకు అందుబాటులోకి తెచ్చిన సాధనాలు పత్రికలే. తర్వాత సమకాలీన గ్రంథరచనలను ప్రోత్సహించేందుకు గ్రంథస్వీకారం, గ్రంథ సమీక్ష వంటి శీర్షికల ద్వారా నవ్య రచనలను పత్రికలే ప్రజల్లోకి తీసుకు వెళ్ళడం కనిపిస్తుంది. పూర్తిగా సాహిత్య పత్రికలయినా, సాహిత్యాన్ని పాక్షికంగా మాత్రమే ప్రచురించే పత్రికలయినా అందరూ గ్రంథసమీక్షకు చోటు కల్పించడం విశేషంగా చెప్పుకోవాలి. 1870 లోనే 'ఆంధ్ర భాషా సంజీవని' గ్రంథ సమీక్షలు చేయించేది. 'వైజయంతి' పత్రిక 1895 ఏప్రిల్ సంచికలో కందుకూరి వీరేశలింగం 'కవుల చరిత్ర' ద్వితీయ భాగాన్ని సమీక్షించింది. 'అముద్రితగ్రంథచింతామణి' 1891అక్టోబరు సంచికలో ఆ పత్రిక సంపాదకుడు పూండ్ల రామకృష్ణయ్య గురజాడవారి 'కన్యాశుల్కం' నాటకాన్ని సమీక్షించారు. 'చింతామణి' పత్రికకూడా 1893 ప్రాంతంలో 'కన్యాశుల్కం' నాటకాన్ని సమీక్షించింది.

'గ్రంథస్వీకారం'లో గ్రంథ సమీక్షతోపాటు అప్పటి పత్రికలు 'పత్రికాస్వీకారం' కింద పత్రికా సమీక్ష కూడా చేసేవి. 'జనానా పత్రిక' (1901)లో శ్రీపాద గోపాలకృష్ణమూర్తి శాస్త్రిగారి 'గౌతమి' పత్రికను సమీక్షించింది.

'ఆంధ్రభారతి' 1909 (శాలివాహనశకం 1831, మాఘ) సంచికలో గురజాడ వారి 'నీలగిరి పాటల'ను "ఈ కీర్తనలయందలి వర్ణనలు స్వాభావికముగను, కవిత్వము బహురసవంతముగానున్నది" అని సమీక్షించింది.

'సారస్వత సర్వస్వము' (1923) పత్రిక 'పత్రికా స్వీకారం' కింద 'ఆంధ్రభాషావిలాసిని', 'సరస్వతి', 'సాహితి', 'ప్రబుద్ధాంధ్ర', 'ముద్దులమూట', 'మీమాంస', 'రెడ్డిరాణి', 'కళ', 'ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక', 'నీలగిరి', 'అభినవసరస్వతి', 'బాలభారతి' మొదలైన పత్రికలను సమీక్షించింది.

75 ఏళ్ళకుపైగా నడిచి తెలుగు పత్రికా చరిత్రలో నూతనాధ్యాయం సృష్టించిన

'భారతి' లో శతకకవుల చరిత్రం, బారిస్టరు పార్వతీశం, కమలాక్షి, స్త్రీ రత్నాలు. ఆంధ్ర మహాభారతం, అయ్యలరాజు కవితా వైభవం, పింగళిసూరన కవితా వైభవం, వజ్రాయుధం, సౌందర్యలహరి, మానవారణ్యం, తెగిన చుక్కలు, శతాబ్దాల నిశ్శబ్దం తులసీరామాయణం, ముట్నూరికృష్ణారావువ్యాసాలు, వ్యాసరచనల సూచి, కుమారసంభవం, శ్రీశ్రీ కవితా వైభవం, గద్దర్‌పాటలు, సింహాసన ద్వాత్రింశిక, ఆంధ్ర మహాభారతా:: ారిక మీమాంస, సి.ఆర్. రెడ్డి పీఠికలు, మనువసుచరిత్రల తులనాత్మక పరిశీలనం, ఆంధ్ర సాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం వంటి అసంఖ్యాక గ్రంథవిమర్శలు వెలువడ్డాయి.

ప్రతిభ (1936) త్రైమాసిక పత్రికలో ఈ విధంగా ప్రకటించారు. ".. మా కార్యాలయమునకు వచ్చే గ్రంథములు ఆయా విషయములలో ప్రవీణులైనవారి చేత విమర్శ చేయించి ఈ పత్రికలో ఆ విమర్శలు ప్రకటిస్తాము. తగవులకూ, వ్యక్తిగత దూషణలకూ తావివ్వనివయితే ప్రతివిమర్శలకు కూడా అవకాశము చూచుకొని మా పత్రికలో తావు కల్పిస్తాము." దీన్ని బట్టి మొదటి నుంచీ పత్రికలు గ్రంథవిమర్శను సమాజోపయోగకార్యముగా భావించి పవిత్ర సంకల్పంతో నిర్వహించినట్లు స్పష్టమవుతుంది. 'సూర్య రాయాంధ్ర నిఘంటువు' తొలి సంచికను గురించి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సుదీర్ఘమైన సమీక్షావ్యాసం ఎన్నదగింది.

'కళాకేళి' పత్రిక (1969) 'గ్రంథావలోకనం', 'గ్రంథవిమర్శన' శీర్షికల కింద ప్రాచీన, ఆధునిక సాహిత్య గ్రంథాలను సమీక్షించింది.

దినపత్రికలు గ్రంథసమీక్షలకు సాహిత్యంలోని ఇతర అంశాలకన్నా అధిక ప్రాధాన్యతనిచ్చాయి. సాహిత్య ప్రచురణకు కేటాయించిన స్థలంలో అత్యధికభాగం సమీక్షలు ఆక్రమించాయి.

ఆంధ్రపత్రిక 1954 ఆగస్టు 29 సంచికలో తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి గారి 'హృదయేశ్వరి' కావ్య సమీక్ష వేశారు. 1955లో రావిశాస్త్రి నవల 'అల్పజీవి' సమీక్ష వేశారు. తెలుగు దినపత్రికలన్నిటిలోనూ సమీక్ష కోసం ప్రత్యేకంగా ఒక శీర్షిక నిర్వహిస్తూ వచ్చారు. కొన్ని సందర్భాల్లో ఒక్కోవారం ప్రత్యేకంగా శీర్షికను ఒక ప్రక్రియకే పరిమితం చేసి ఆకాలంలో ఆ ప్రక్రియ వికాసం, విస్తృతి, పరిణతి, గురించి పూర్వాపరాల గురించి

చర్చ సాగించి ఆ తర్వాత వరుసగా ఆ ప్రక్రియలో వెలువడిన పుస్తకాలను సవివరంగా సమీక్షించడం కనిపిస్తుంది. ఆంధ్రప్రభలో 'వ్యాసపీఠం' అనే శీర్షికన ప్రతివారం 'వివిధ వ్యాసానుబంధం'లో గ్రంథ సమీక్షలు చేశారు. 1960 అక్టోబరు 2 ఆదివారం 'ఆరు తెలుగునవలలు' పేర నవలపై, 1962 సెప్టెంబరు 16న కథా సంకలనాలపైనా, మరో వారం కవితా సంకలనాలపైనా సమీక్షరాశారు. గ్రంథ సమీక్ష కోసం కేటాయించిన స్థలంలో సమీక్ష వేయగా మరికొన్ని మిగతా గ్రంథాల వివరాలు క్లుప్తంగా 'స్వీకారం' లో వేసేవారు. సమీక్షించగలిగినన్ని సమీక్షించి మిగతావి స్వీకారం కింద వేసుకొనే పద్ధతి 1950వ దశకం నుంచే వుంది. 1972 సెప్టెంబరులో నగ్నముని 'తూర్పుగాలి', తాపీధర్మారావు 'సాహిత్య మొర్మరాలు', డి. కామేశ్వరి నవల 'రమణి', శంకరశెట్టి వెంకట్రావు 'త్యాగశీల' నాటక సమీక్షలు వేశారు. ఆంధ్రప్రభలో 1988లో గ్రంథ సమీక్షల కోసం 'కలాలు - సంకలనాలు' అనే శీర్షిక ప్రవేశపెట్టారు. అక్టోబరు 2 సంచికలో ముళ్ళపూడి వెంకటరమణ 'సీతాకళ్యాణం' రెండో ముద్రణ సమీక్ష, 16వ తేదీ సంచికలో బుచ్చిబాబు ఇతర కథలు 'తడిమంటకిపొడినీళ్ళు', ఇచ్ఛాపురపు జగన్నాథరావు కథలపై టి.ఎల్. కాంతారావు సమీక్ష వేశారు.

ఆంధ్రజ్యోతిలో కూడా 1961 ఫిబ్రవరి 12 నాటి ఆదివారం అనుబంధంలో హితశ్రీ 'అంతర్వాహిని', కొమ్మూరి వేణుగోపాలరావు 'శారద', పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'చంద్రునికోనూలుపోగు' నవలలను సమీక్షించారు. జూన్ 17 సంచికలో 'గ్రంథావలోకనం' లో తిలక్ వచన కవితా సంపుటి 'ఊరిచివరి ఇల్లు' సమీక్షించారు. 1965 మే సంచికలో 'రా.వి.శాస్త్రి కథలు' ను ఆచంట జానకీరాం సమీక్షించారు. మే 12 నాటి సంచికలో 'కొన్ని వచన కవితారీతులు' అని శీర్షిక పెట్టి ఆ మధ్యకాలంలో వెలువడిన వచన కవితాసంపుటాలపై వ్యాఖ్యరాసి అందులో సోమసుందర్ 'మిణుగురులు', వజీర్‌రహ్మాన్ 'ఏచటికి పోతావీరాత్రి' మొదలైన గ్రంథాలను జానకీరాం సమీక్షించారు. మే 26 సంచికలో కథానికా గ్రంథాలను గురించి రాస్తూ ఆదివిష్ణు 'తొలిమజిలీ' ని సమీక్షించారు.

ఆంధ్రజ్యోతి 1968 అక్టోబర్ 6వ తేదీ సంచికలో 'పుస్తకాలు' అనే శీర్షికలో పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు 'నీళ్ళు', ముప్పాళరంగనాయకమ్మ కథాసంపుటి 'అమ్మ', కొడవటిగంటి కుటుంబరావు చిన్ననవల 'అనామిక' సమీక్షించారు. 1969 నవంబర్ 16

సంచికలో ఆచంట జానకీరాం డా సి. నారాయణరెడ్డి 'మధ్యతరగతి మందహాసం' కావ్య సమీక్ష చేశారు.

ఆంధ్రభూమిలో 'పుస్తక సమీక్ష' శీర్షికలో **1986** మార్చి సంచికలో రావూరిభరద్వాజ 'ఇనుపతెరవెనుక', మే **12** సంచికలో భరద్వాజదే 'నాకు దేవుని చూడాలని వుంది' సమీక్షించారు. **1987**లో భరద్వాజ గారికి 'ఇనుపతెరవెనుక' గ్రంథానికి సోవియెట్‌లాండ్ నెహ్రూ అవార్డు వచ్చింది. ఆంధ్రభూమి **1985** నుంచి 'పుస్తక సమీక్ష'ను 'కితాబు' గా మార్చి ప్రతివారం ప్రత్యేకంగా ఎక్కువస్థలం గ్రంథసమీక్షలకు కేటాయిస్తూవచ్చింది.

ఈనాడు **1977**నుంచి 'పుస్తకప్రపంచం' శీర్షిక కింద సమీక్షలు వేయనారంభించింది. **1977**లో 'ఆంధ్రపత్రిక' సంవత్సరాది సంచికలో వచన పద్యం లక్షణ చర్చ ప్రారంభమై తర్వాత 'భారతి'లో కొనసాగి ప్రాచుర్యం పొందింది. ఆ చర్చంతా 'వచన పద్యం' పుస్తకరూపంలో వెలువరించి నాయనిసుబ్బారావుకు అంకితం చేశారు. 'ఆంధ్రప్రభ' **1981** ఆగస్టు **30** సంచికలో ఆ గ్రంథాన్ని జి. కృష్ణగారు సమీక్షించారు. డిసెంబరు **4** సంచికలో దాశరథి రంగాచార్య గారి 'జనపదం' నవలసమీక్ష వేశారు.

విశాలాంధ్ర సాహిత్యానుబంధంలో కూడా గ్రంథ సమీక్షలు వేశారు.

ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో 'పుస్తక పరిచయం' శీర్షికకింద గ్రంథసమీక్షలు వేశారు. **1982** ఫిబ్రవరి **7** సంచికలో 'మునగాల పరగణా ప్రజా ఉద్యమ చరిత్ర' తటువర్తి వెంకటేశ్వరరావు రచన, **1984** అక్టోబరు **14** సంచికలో అడిగోపుల వెంకటరత్నం 'సూర్యోదయం' సమీక్షించారు.

'ఉదయం'లో 'చదువు' శీర్షికన పుస్తక సమీక్షలు వేస్తూనే కొన్నింటిని 'అందుకున్నాం' అని వివరాలు వేశారు. కొంత కాలం గ్రంథ సమీక్షలు ఆదివారం అనుబంధంలో వేసి తర్వాత 'సోమవారం స్పెషల్' ప్రవేశపెట్టారు. సోమవారంనాడు గ్రంథసమీక్షలకు ఎక్కువ స్థలం కేటాయించడం ప్రారంభించారు. తర్వాత ఆదివారం సంచిక టాబ్లాయిడ్‌గా రావడం ప్రారంభమైన తర్వాత కూడా గ్రంథసమీక్షలను 'పుస్తకాలమ్'లో వేస్తూ వచ్చారు.

ప్రధాన దిన పత్రికలలో గ్రంథ సమీక్ష కొనసాగుతున్నది. 'ఆంధ్రజ్యోతి', ఈనాడు దినపత్రికల్లో ఆదివారం అనుబంధంలో, ఆంధ్రప్రభ ఆదివారం సంచికలో భాగంగా వెలువడే 'గవాక్షం'లో గ్రంథసమీక్షలు ప్రచురిస్తున్నారు.

## vi. కవిత్వం

తెలుగు కవిత్వం వెలుగుచూసే విషయంలో పత్రికలు నిర్వహించిన పాత్ర అనితర సాధ్యమైంది. ఒక కవితను కవిరాసిన వెంటనే ప్రచురించటంలోనూ, ఒక కవి కావ్యం ప్రచురిస్తే దాన్ని సమీక్షించి పాఠకుల ముందుకు తీసుకువెళ్ళటంలోనూ పత్రికలు ఎనలేని కృషి చేస్తున్నాయి. తెలుగు పత్రికలకు, ఆధునిక తెలుగు కవిత్వానికి అవినాభావ సంబంధం ఉంది. కావ్య, ప్రబంధయుగాలనాటి కవిత్వాన్ని ప్రచురించి అందించడం ఒక చారిత్రక కర్తవ్యంగా స్వీకరిస్తూనే పత్రికలు ఆధునిక కవిత్వాన్ని చేతులారా పెంచాయని చెప్పవచ్చు. ప్రాచీన కవిత్వానికి సిపిబ్రౌనువంటి విదేశీ మహనీయమూర్తులు చేయగలిగినదంతా చేసి దాన్ని వెలుగులోకి తెచ్చారు.

ఆధునిక కవిత్వం అవతరించడమే పత్రికల పొత్తిళ్ళలో జరిగిందని చెప్పుకున్నాం. ఆనాటినుంచి ఈనాటివరకూ వస్తువులోనూ, రూపంలోనూ నిలిచే కవిత్వమంతా ముందు పత్రికల్లో రావలసిందే. సాహిత్యంలోని ఇతర ప్రక్రియలన్నిటిలోకి కవిత్వం అగ్రప్రధాన పయనిస్తున్నట్లే ఆ ప్రక్రియకు పత్రికలు ప్రాధాన్యతను కూడా సముచిత స్థాయిలోనే కల్పిస్తున్నాయి. పత్రికల్లో ప్రచురణార్హత పొందిన కవిత్వం ప్రామాణికమైందనే పరిగణన ఉంది.

'ఆంధ్రభాషా సంజీవని' (1870) పత్రికలో కందుకూరి వీరేశలింగం రచించిన తొలిపద్య కావ్యం 'శుద్ధాంధ్ర భారతం' ప్రచురించారు.

తెలుగు జనానా పత్రిక 1900 జూలై సంచికలో "విక్టోరియా మహారాజ్ఞి విజయగీతము శీర్షికతో ఓ గేయం వెలువడింది. ఆ కవి బహుశా కొక్కొండ వెంకట రత్నం పంతులేనని డా. సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. 'కల్పలత' పత్రిక 1904 ఆగస్టు సంచికలో 'బొండుమల్లె' శీర్షికతో ప్రచురితమైన గేయం రాసింది ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మ గారేమోని నారాయణరెడ్డిగారు అన్నారు. ఈ గేయం ఖండకావ్య ప్రక్రియ సరసన చేరదగింది.[7]

---

7. ఆధునికాంధ్ర కవిత్వము - డా. సి. నారాయణ రెడ్డి

1909 అక్టోబర్‌లో 'ఆంధ్రభారతి (శా.శ. 1831 మాఘ) సంచికలో గురజాడవారి నీలగిరిపాటల్లో ఒకటి (వూటి చోద్యమేమి చెపుదు)' ప్రచురితమైంది. అదే సంవత్సరం రాయప్రోలు వారి 'లలిత' ప్రచురితమైంది. 1910 జ్యేష్ఠ మాససంచికలో గురజాడవారి మొట్టమొదటి నవ్యగేయం 'తోకచుక్క', శ్రావణ మాస సంచికలో 'కాసులు', భాద్రపద సంచికలో 'డామన్ పిథియస్' అనే గేయాలు వచ్చాయి. అదే సంవత్సరం 'ముత్యాల సరాలు' సంపుటి వెలువడింది.

'ఆంధ్రభారతి'లో 1912లో రాయప్రోలు 'కనకము' గురజాడ వారి 'కన్యక'ను ప్రచురించారు.

ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రవర్తిల్లిన యుగాల ఆవిర్భావాలు, కొనసాగిన ధోరణుల ఉనికి ఆనాటి పత్రికల్లో కనిపిస్తుంది. మంజువాణి, కల్పలత, ఆంధ్రభారతి వంటి పత్రికల్లో రచనలు నవ్య కవిత్వానికి, భారతి, ఆంధ్రభూమి, ఆంధ్రపత్రిక వంటి పత్రికల్లో రచనలు భావ కవిత్వానికి సంబంధించినవి కాగా 1928 ఆంధ్రపత్రిక ఉగాది సంచికకు రాగానే భావ కవిత్వంపై తిరుగుబాటు రచనలు కనిపిస్తాయి. నారాయణబాబు రాసిన 'వలపు చెలమలు' గీతం ఉగాది సంచికలో వచ్చింది. ప్రతిభ, అభ్యుదయ, ఆంధ్రపత్రిక 1932 ఉగాది సంచిక, ప్రబుద్ధాంధ్ర మొదలైన పత్రికల్లో అభ్యుదయ కవిత్వోద్యమం ఉనికి గోచరిస్తుంది.

ఆంధ్రపత్రిక (1932) ఉగాది సంచికలో శ్రీశ్రీ సొంత గొంతుక విచ్చి 'ఖండశశి' శీర్షికతో రాసిన 'ఖండేందుమూర్తి! ఆకాశ కర్పరమెల్ల

నిండు నీగ్రుడ్డి వెన్నెల ధూమధూపమై' అన్న గేయం ప్రచురింపబడింది.

శ్రీశ్రీ కవిత్వ పరిణామ దిశలో మైలురాయిగా చెప్పుకోదగిన 'విద్యున్మాలికలు' గేయాన్ని ఆంధ్రపత్రిక 1933 ఉగాది సంచికలో ప్రచురించారు.

"బారులు బారులుగా తీరిన

మబ్బు గుబ్బలుల దారుల

దారితప్పి చరించె

ఆరేయి తరళ సరళేరమ్మదములు"

అనే ఈ గేయం శ్రీశ్రీ రాసిన మొదటివచన గేయమని సినారె అన్నారు.

ముద్దుకృష్ణ సంపాదకత్వంలో 1932లో ప్రారంభమైన 'జ్వాల' పత్రికలో శ్రీశ్రీ 'మహాప్రస్థానం'గేయం ప్రచురితమైంది. 'మరో ప్రపంచం' అని ప్రారంభమై, 'హోమజ్వాలల భుగభుగల'తో ముగిసిన ఈ గేయాన్ని ఐదు నిముషాల్లో రాసినట్లు శ్రీశ్రీ యే చెప్పుకున్నాడు.[8]

'భారతి' సాహిత్య పత్రికను గురించి తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా కవిత్వానికి అది చేసిన సేవగురించి చెప్పుకోవడానికి ప్రత్యేక గ్రంథమే వెలువరించవచ్చు. ఆంధ్రపత్రిక దినపత్రిక సాహిత్యానుబంధం, సంవత్సరాదిసంచికలు, భారతి పత్రికల్లో ఆధునికసాహిత్యానికి లభించిన స్థానం, ప్రాచుర్యం అటువంటిది. 19వ శతాబ్దంలో దాదాపు మూడువంతుల స్థానం ఈ పత్రికలదే.

1935లో కొంపెల్ల జనార్దనరావు ప్రారంభించిన 'ఉదయిని' ద్వైమాసపత్రిక 'నాటి తెలుగు కావ్యవాణికి నాట్యరంగమని' ప్రసిద్ధి పొందింది. అదే కోవలో 'ప్రతిభ' (1936) భావ కవిత్వానికి, 'అభ్యుదయ' (1946) అభ్యుదయ కవిత్వానికి పట్టుగొమ్మగా నిలిచింది. 'అభ్యుదయ' స్వాతంత్ర్య చైతన్యాన్ని పెంపొందించే రచనల్ని కూడా ప్రచురించింది.

దిన పత్రికల్లో వామపక్ష పత్రికలైన ప్రజాశక్తి, విశాలాంధ్ర, ఇతర దినపత్రికలు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి వంటి వాటిల్లో సాహిత్య ప్రచురణ విషయంలో రెండు ప్రధానమైన తేడాలు కనిపిస్తాయి.

ఒకటి కమ్యూనిస్టు దినపత్రికల్లో కవిత్వమైనా ఇతర ప్రక్రియలైనా అభ్యుదయ దృక్పథాన్ని ప్రతిబింబించేవిగా ఉన్నాయి

రెండవది మిగతా దినపత్రికలన్నిటిలో ఒక ధోరణికి కట్టుబడకుండా సాధారణ మార్గంలో సాహిత్యాన్ని ప్రచురించడం కనిపిస్తుంది.

సాహిత్య ప్రచురణ విషయంలో కమ్యూనిస్టు దినపత్రికలు తమదంటూ ప్రత్యేక దృక్పథాన్ని కొనసాగించాయి. వివిధ సమస్యలపై వామపక్షాలు సాగించే ఉద్యమాల్లో ఇతర ఆయుధాలతో పాటు సాహిత్యాన్ని ఆయుధంగా వాడుకున్నారు. అభ్యుదయ కవి సోమసుందర్ 'వజ్రాయుధం', అనిసెట్టి 'అగ్నివీణ', ఆరుద్ర 'త్వమేవాహం' కమ్యూనిస్టు

8. కృతాద్యవస్థ

పత్రికల్లో వచ్చాయి. 1950 ప్రాంతాల్లో నవశక్తిలో శ్రీశ్రీ గీతాలు 'దేశచరిత్రలు', 'మాయంటావా మిథ్యంటావా', ప్రజాశక్తిలో 'లేలే రష్యా'లను ప్రచురించారు. ప్రజాశక్తి దినపత్రిక ఆదివారం సంచికల్లో కమ్యూనిస్టు భావజాలానికి చెందిన వచన సాహిత్యంతోపాటు ఛందోబద్ధమైన పద్యాల్ని కూడా వేశారు. 'అరసం'ను బలపరచిన ప్రయాగ కోదండరామశాస్త్రి పద్యాలు ప్రజాశక్తిలో వచ్చాయి. ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం సాహిత్యానుబంధం చాలా ఆసక్తి గొలిపే విధంగా వేసేవారు.

సాహిత్యాన్ని దినపత్రికలో ప్రచురించే విషయంలో 'ఈనాడు' రాజీలేని వైఖరిని అవలంభించినప్పటికీ గతంలో ముఖ్యంగా పత్రిక తొలినాళ్ళలో కొద్దిపాటి కవితలు వేయడం కనిపిస్తుంది. 1976 ఆగస్టు 23 సోమవారం సంచిక నుంచి 'కొత్తపాళీ' అనే శీర్షిక కింద రోజూ ఒక కవిత వేస్తూ వచ్చారు. అయితే ఆ కవితలు కొత్తవాళ్ళు రాసినవే. 1982 జనవరి 5 నాటి సంచికలో మొదటిపేజిలో 'చరిత్ర సృష్టించండి' రామోజీరావు సంపాదకీయం, అదే పేజీలో 'లేవోయిదీక్షబూని' అనే కొండవీటి వెంకటకవి పద్య కవిత వేశారు. గజ్జెల మల్లారెడ్డి 'పుణ్యభూమి' రాజకీయ వ్యంగ్య కవిత్వంతో కూడిన శీర్షిక ఈనాడులోనే మొదట బహుళ ప్రాచుర్యం పొందింది. అందులో శీర్షిక జనాదరణ పాత్రం కావడంలో పద్యమే ప్రాధాన్యం వహించింది.

ఆంధ్రపత్రికలో 1960 వ దశకం వరకూ పద్య గేయ కవితలే వేసినట్లు కనిపిస్తోంది. ఆ ఏడాదిజూలై 10 నాటి సంచికలో రాయప్రోలువారి 'ఆషాఢి' అన్న పద్యకవిత వేశారు. 1956 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ సంచికలో కొసరాజు రాఘవయ్య చౌదరి గారి 'స్వతంత్ర భానుడు' గేయకవిత చక్కగా వేశారు. 1950, 60 దశకాల్లో సైతం తెలుగు దినపత్రికల్లో అనువాద కవితలు, కథలు, విమర్శావ్యాసాలు ఎక్కువగానే వేసేవారు. ఆంధ్రపత్రిక 1964 ఫిబ్రవరి 9నాటి సంచికలో రవీంద్రుని 'అధినేత' కావ్యం నుంచి కొన్ని పద్యాలు రాచకొండనరసింహమూర్తి అనువదించినవి వేశారు. ప్రజాశక్తి 1984 అక్టోబర్ 7 సంచికలో గోర్కి కథను 'అతడు ఆమె' పేర అనువదించి వేశారు. విశాలాంధ్ర 1970 జూలై 19 సంచికలో బొల్లిముంత నాగేశ్వరరావు రచించిన 'లెనిన్‌పాప' వేశారు. ఆంధ్రపత్రికలో 1943లో 'అరేబియన్ నైట్స్' కథలకు బసవరాజు అప్పారావు

గారి అనువాదం ప్రచురించారు. ఆంధ్రజ్యోతిలో 1961 ఫిబ్రవరి 12 సంచికలో 'వనపూల్' హిందీ నవలకు దండమూడి మహీధర్ అనువాదం సీరియల్‌గా వేయడం ప్రారంభించారు. 1915లో ఫ్రెంచి రచయిత రోమారోలాకు నోబెల్ బహుమతి తెచ్చిపెట్టిన నవలను విద్వాన్ విశ్వం సంగ్రహంగా అనువదించగా 'మానవుడు' పేర ఆంధ్రప్రభ 1952లో ప్రచురించింది.

ఇక కవిత్వం విషయానికొస్తే దినపత్రికల వారాంతపు అనుబంధాల్లో ఇతర సాహిత్య పత్రికలు వార, మాస పత్రికల్లో వలె కవిత్వం ఎక్కువగా ప్రచురించినట్లు లేదు. దినపత్రికల్లో గ్రంథ సమీక్షలు, విమర్శ తర్వాత కవిత్వం తనస్థానం వహిస్తుంది. ఆంధ్రప్రభ 1965 ఆగస్టు 8 నాటి సంచికలో కరుణశ్రీ 'నవభారతి' పద్యకవిత వేశారు. 1978 నుంచీ ఆంధ్రప్రభ విజ్ఞాన వేదిక (ఆదివారం) లో వచన కవితలు విరివిగా కనిపిస్తున్నాయి. రామాచంద్రమౌళి 'వీణాతంత్రులపై సీతాకోక చిలుక' వంటివి వేశారు. 1981లో ఆంధ్రప్రభలో 'కవికాలం' అనే శీర్షికతో వచన కవితలు వేశారు. ఏ. సూర్య ప్రకాష్ కవిత, దేవిప్రియ కవిత వచ్చాయి. సోమసుందర్ 'తిమిరఝంఝ', అఫ్సర్ 'శిథిలనేత్రాలు', డా. సి.నారాయణరెడ్డి 'కదలిపోయేకాంతికథ', డా. దాశరథి 'అంతరంగంలో రంగవల్లికలు' అలా వచ్చినవే.

ఆంధ్రభూమి 'ఆదిత్య హృదయం' పేర వేసిన ఆదివారం అనుబంధంలో 1982 నవంబర్ 1 రాష్ట్రావతరణదినోత్సవం రోజు దాశరథి కవిత 'తెలుగు వైజయంతిక' వేశారు. ఆదివారం అనుబంధంలో ప్రతివారం కొత్త కలాల్ని ప్రోత్సహించేందుకు 'కవులరైలు' శీర్షికన కవితలు వేశారు. వడ్డేపల్లి కృష్ణ, టి. శ్రీరంగస్వామి, డా. తిరుమల శ్రీనివాసాచార్య, రఘువర్మ, సూర్య ప్రకాష్, వేముగంటి నరసింహాచార్యులు వంటి కవుల కవితలు 1980లో వచ్చాయి. ఆంధ్రభూమిలో ప్రతి ఆదివారం విమర్శావ్యాసం, సీరియల్‌తోపాటు కవిత తప్పక వేసేవారు. 1989 నాటికి ఆదివారం సాహిత్యానుబంధం 'అక్షరం'గా మారిన తర్వాత కూడా కవిత తప్పనిసరిగా ఇతర పత్రికలతో దీటుగా వేస్తున్నారు.

'ప్రజాశక్తి ఆదివారం అనుబంధం'లో అభ్యుదయ సాహిత్యమే ఎక్కువ స్థానం సంపాదించుకుంది. కవితలు కూడా అవే రావడం యాదృచ్ఛికంకాదు. 1982 ఫిబ్రవరి

7 సంచికలో స్వాతంత్ర్యం వచ్చి 33 ఏళ్ళయినా దారిద్ర్యం తీరలేదని 'ఈ ఆకలికి ముప్ఫై మూడేళ్ళు' అద్దేపల్లిరామమోహన్‌రావు కవిత వేశారు. ప్రతి సంచికలోనూ కవితలకు స్థానం లభించింది. 'చరిత్ర చెప్పేమంచి పాఠం' ఎస్వీభుజంగరాయశర్మ గేయకవిత 1984 అక్టోబర్ 14 సంచికలో వేశారు. 1985లో కమ్యూనిస్టు వైతాళికుడు పుచ్చలపల్లి సుందరయ్య మరణించినప్పుడు ఆరుద్ర రాసిన 'జోహారు కామ్రేడు సుందరయ్యా' మే 20 నాటి సంచికలో వేశారు. 1987 నుంచి 'కలాలు గళాలు' అనే శీర్షిక కవితలకోసమే ప్రవేశపెట్టారు.

భారత కమ్యూనిస్టు పార్టీ పదవ మహాసభల ప్రత్యేక సంచికగా వెలువడిన విశాలాంధ్ర 1975 జనవరి 27 సంచికలో కవితలు అనేకం చోటు చేసుకున్నాయి. 'ఎర్రబాట' ఏటుకూరి ప్రసాద్ కవిత, 'ఇంటర్నేషనేల్' అనువాద కవిత తెలుగు సేత రాంభట్ల, 'లాల్‌సలాం' అనే మరో కవిత రాంభట్లదే, 'నిప్పుపువ్వు' కె. రాజేశ్వరరావు కవిత ప్రచురించారు. ప్రగతిశీల కవిత్వం ప్రచురించడంలో విశాలాంధ్ర, ప్రజాశక్తి దినపత్రికలు ఒకే బాట నడిచాయి. అనుముల శ్రీహరి కవిత 'లోకం నిద్రిస్తున్న రాత్రి', నెల్లుట్లవెంకటేశ్వరరావు కవిత 'క్షమించు', సోమసుందర్ 'వజ్రాయుధపుబాట', 'అగ్గిరేగుద్ది' వంటి కవితలు (1970 ఆగస్టు) అభ్యుదయ మార్గంలో ముందడుగు వేసినవే.

విశాలాంధ్రలో ఇతర ప్రక్రియలతో పోలిస్తే కవితలకే ఎక్కువ స్థానం లభించినట్లు తెలుస్తుంది. అదే విధంగా అనువాద కవిత్వం కూడా విశేషంగానే చోటు చేసుకుంది. విశాలాంధ్రలో వచ్చిన కవితల్లో ఎక్కువశాతం గేయాలే.

ఆంధ్రజ్యోతి, ప్రారంభమైన తర్వాత మొదటి 5, 6 ఏళ్ళలో కవిత్వం అంతగా ప్రచురించలేదు. పత్రిక సంక్రాంతి, ఉగాది ప్రత్యేక అనుబంధాల్లో మాత్రం కవిత్వం వేశారు. 1967 సంక్రాంతి అనుబంధంలో నాగభైరవ, సాహితి, రజనీప్రియ ప్రభృతుల కవితలు వేశారు.

ఆంధ్రజ్యోతి, ఉదయం వంటి పత్రికల్లో కవులతో ఇంటర్వ్యూ ఒక ఆకర్షణగా సాగినట్లు తెలుస్తుంది. 1980 ఆగస్టు 10 నాటి ఆంధ్రజ్యోతి సంచికలో డా. సి. నారాయణరెడ్డి గారిని ద్వా.నా. శాస్త్రి, ఇంటర్వ్యూ చేశారు. ఆ ఇంటర్వ్యూలో నారాయణరెడ్డిగారిని మీకు శబ్దం మీద మోజు ఎక్కువని అంటారు. మీరేమంటారు?

అని అడిగారు. దానికి సమాధానంగా "శబ్దం మీద మోజులేనిదెవరికి? శ్రీనాథుని దగ్గర్నుంచి శ్రీశ్రీ వరకు అందరికీ శబ్దంమీద మోజు వుంది కదా! కవికి శబ్దం మీద మోజు లేకపోతే ఎలా! అసలు భావంలేకుండా శబ్దాన్ని ఎవరు పేరుస్తారు?" డా. నారాయణరెడ్డి చెప్పారు.

ఇటువంటి ఇంటర్వ్యూల్లో కొన్ని చెప్పుకోదగిన అంశాలు వెలికివస్తాయన్న సంగతి తెలిసిందే. 1988 ఆగస్టు 1 సంచిక ఉదయం (సోమవారం స్పెషల్)లో వరవరరావుతో ఇంటర్వ్యూ వచ్చింది. 'మీకు ఏవరి కవిత్వం ఇష్టం ఎలాంటి కవిత్వం ఇష్టం?' అని ఆయనను అడిగితే, జవాబుగా 'గద్దర్ కవిత్వం' ఇష్టం అని చెప్పారు. గద్దర్ గాయకునిగానే కాదు (సంధ్య కూడా అంతబాగా పాడుతుంది) కవిగా కూడా ఆయన కవిత్వమే నాకు ఇష్టం. ఎందుకంటే అక్షరాలా సాయుధం చేసే రెవల్యూషనరీ కవిత్వం ఆయనది' అన్నాడు వరవరరావు.

'ఉదయం'లో 1987 ఫిబ్రవరిలో కవితల కోసం 'అక్షరనేత్రం' అనే శీర్షికను ప్రవేశపెట్టి ప్రతివారమూ కవితలు వేశారు. ఎల్లోరా 'నామెదడులో పూచిన అగ్ని పుష్పం', నందిని సిధారెడ్డి 'శూన్యంలో నెలవంక', కె. రాజమోహన్‌రాజు 'ధ్వనులు', డా. సి. నారాయణరెడ్డి 'కన్ను కాగడాలా సాగుతుంది.' ప్రసేన్ 'ఇప్పుడెలా వుంది' వంటివి అక్షరనేత్రంలో వరసగా వేశారు.

ఆంధ్రజ్యోతిలో 1980 నుంచే ప్రతివారం 'ఈవారం కవిత' శీర్షికన కవితలు వేయడం జరుగుతున్నది. ఆ సంవత్సరం ఆగస్టు 17 నాటి సంచికలో ఈ శీర్షికలో జూకంటి జగన్నాథం, కె. గోదావరి శర్మ, శశికాంత్ శాతకర్ణి గార్ల కవితలు ప్రచురించారు. 1986 ప్రాంతాలకు దినపత్రికల ప్రచురణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశించి విప్లవం సృష్టించింది. కంప్యూటర్ కంపోజింగ్, ఆఫ్‌సెట్ మల్టీ కలర్ ప్రింటింగ్, అద్భుతంగా పుటలను అలంకరించుకొనే సౌకర్యం వచ్చాయి. దినపత్రికల ఆదివారం అనుబంధం సర్వాంగ సుందరంగా వెలువడడం ప్రారంభమైంది. సాహితీ వేదికలు కూడా విషయ ప్రాముఖ్యాన్ని బట్టి పేజి మేకప్ హంగులను సంతరించుకున్నాయి.

1950 నుంచి 1980 వరకు వివిధ దినపత్రికల ఆదివారం అనుబంధంలో సాహిత్యాంశాల ప్రచురణ సరళి పరిశీలించినట్లయితే విమర్శకు అగ్రతాంబూలం

లభించినట్లు స్పష్టమవుతుంది. ఆదివారం అనుబంధం చాలా వరకు నాలుగు పేజీలుగా వెలువడింది. మొదటిపేజీలో ఒక ప్రధాన వ్యాసం. అది ఎక్కువ మటుకు సాహిత్యేతరమై, సమకాలీన విషయమై వుండేది. ఆ తర్వాత రెండవ పేజీలో నియతంగా గ్రంథసమీక్ష, విమర్శ కనిపిస్తుంది. ఆ తర్వాతి స్థానం కవిత, కథానికలది. 1980 తర్వాత ఆదివారం అనుబంధంతోపాటు ప్రతి దినపత్రికా వారంలో ఒక రోజు ఒకోపేరుతో 'సాహితీ వేదిక' ను తీర్చిదిద్ది అందిస్తోంది. ఆంధ్రజ్యోతిలో 'సాహితీవేదిక', 'ఆంధ్రభూమిలో 'అక్షరం' ఆంధ్రప్రభలో 'గవాక్షం', ఉదయంలో 'రసన' (1994లో మూతబడింది). ఈ సాహితీవేదికల్లో ప్రధానంగా ఒక విమర్శావ్యాసం, ఒకటి, రెండు కవితలు, గ్రంథ సమీక్ష ఒకటి రెండు ఇతర విషయాలు, చర్చలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం అనుబంధంగా వెలువడుతున్న టాబ్లాయిడ్‌లలో, చిన్నపుస్తకాల్లో కూడా కథలు, గ్రంథ సమీక్షలు, కవితలు వేస్తున్నారు. ధారావాహిక నవలలు డెయిలీ సీరియల్స్‌గా మారిపోయాయి.

## vii. కథానికలు

సృజనాత్మక వచన రచనా ప్రక్రియల్లో కథానికకు అగ్రపీఠం వేయవలసి ఉంటుంది. తెలుగు కథానికా చరిత్రను పరిశీలిస్తే నవలకన్నా ఒక మెట్టు పైన కవిత్వంకన్నా ఒక మెట్టు కిందా[9] నిలిచి వెలుగుతుండడం కనిపిస్తుంది. తెలుగు ప్రజల జీవితాన్ని ప్రతిబింబించడంలో ఆదినుంచీ నేటి వరకూ శక్తి కొలదీ ముందడుగు వేస్తున్న ప్రముఖ ప్రక్రియ కథానిక. మిగతా ప్రక్రియలలాగే కథానిక కూడా పత్రికల్లోనే పుట్టి పెరిగింది. విడిగా సంకలనాలుగా కూడా వచ్చాయి. పాశ్చాత్య కథానికా శిల్పాన్ని కొంత వరకు పుణికి పుచ్చుకొని తెలుగులో రూపుదిద్దుకున్న ఈ ప్రక్రియను పత్రికలు ఆదరించి పోషించాయి.

తొలినాళ్ళలో ఆంధ్ర భారతి, త్రిలింగ, సువర్ణలేఖ మొదలైన పత్రికలు కథానికలను ప్రచురించాయి. పానుగంటి లక్ష్మీనరసింహారావు రాసిన కథల్ని 'సువర్ణలేఖ' ప్రచురించింది.

మాడపాటి హనుమంతరావు 11 కథలతో 'మల్లికా గుచ్ఛము' అనే సంపుటాన్ని 1915లో ప్రచురించి తొలితరం కథారచయితల్లో ఒకరుగా స్థానం సంపాయించుకున్నారు.

---

9. *తెలుగు కథానిక : దశాబ్ది ధోరణులు : వ్యాసం : డా. కేతు విశ్వనాథరెడ్డి ఆంధ్ర ప్రదేశ్ మాస పత్రిక ఏప్రిల్ 1994 ఉగాది సంచిక పు. 125*

తల్లావఝ్ఝలశివశంకరశాస్త్రి, చింతాదీక్షితులు, కొడవటిగంటి కుటుంబరావు, మునిమాణిక్యం నరసింహారావు, నోరినరసింహశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి, అడివి బాపిరాజు, గుడిపాటి వెంకటాచలం మొదలైన దిగ్గజాలు సాహితీ సమితిని స్థాపించారు. సమితి తరఫున 1920 నుంచి 'సాహితి' పత్రికనడిపారు. వీళ్ళంతా తొలినాళ్ళలో అద్భుతమైన కథలు రాసి పత్రికల్లో ప్రచురించారు.

తెలుగు కథకుల్లో విశిష్టస్థానం ఆక్రమించిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథా ప్రక్రియకు దిద్దిన వన్నె చెరిగిపోనిది. ఆయన తొలికథను 1915లో ఆంధ్రపత్రిక ప్రచురించింది. మరో నాలుగు కథల్ని ప్రబుద్ధాంధ్ర మిగతా కథల్ని రెడ్డిరాణి మొదలైన పత్రికలు ప్రచురించాయి.

1927లో విశ్వనాథ సత్యనారాయణగారు తను ప్రారంభించిన 'జయంతి ద్త్రెమాసపత్రికలో సంపాదకీయం రాస్తూ "ఇప్పటికి తెలుగులో బయలుదేరిన మంచికథలు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చును." అని రాశారు. దీన్ని బట్టి 1910 లోనే తెలుగులో కథ అవతరించినా ప్రక్రియావిస్తృతికి కనీసం రెండు దశాబ్దాలు పట్టిందని భావించవలసి ఉంటుంది. అయితే తొలితరంలోని చింతా, శ్రీపాద, చలం, కరుణకుమార, గోపీచంద్, కొ.కు, పద్మరాజు, బుచ్చిబాబు ప్రభృతులు కథానిక ప్రక్రియకు జీవాన్ని జవాన్నీ ప్రసాదించారు.

కృష్ణాపత్రిక, భారతి మొదటి నుంచీ కథలను ప్రచురించాయి. చింతాదీక్షితులు గారి కథలు, మునిమాణిక్యం వారి 'కాంతం కథలు' నోరి నరసింహశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రభృతుల కథలు భారతిలో వచ్చాయి. కథానికకు లభించిన ప్రోత్సాహంలో ఎక్కువ భాగం భారతి, కృష్ణాపత్రిక వంటిపత్రికలకు దక్కుతుంది.

అరుణతార వంటి పత్రికలు కథలకు ప్రత్యేక సంచికల గౌరవాన్ని కట్టబెట్టాయి. ఇంకా సృజన, స్రవంతి, వజ్రాయుధం, ప్రజాసాహితి, మేఖల, మణిమంజరి వంటి పత్రికలు కథలకు ప్రోత్సాహమందించాయి.'

తెలుగు కథను సుసంపన్నం చేసిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు, కొనకళ్ళ వెంకటరత్నం, గోపీచంద్, పాలగుమ్మి పద్మరాజు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, బుచ్చిబాబు, మరెందరో వీరందరి కథలతో ఆనాటి పత్రికలు విలువను సంతరించుకున్నాయి.

గురజాడవారి 'దిద్దుబాటు', 'మీపేరేమిటి' కథలు ప్రచురించిన ఆంధ్రభారతిలోనే కవికొండల వెంకటరావుగారి 'ప్రేమతత్వం' కథ వచ్చింది. కథక చక్రవర్తిగా పేరువడసిన కవి కొండల రెండు మూడు కథా సంపుటాలు ప్రచురించారు. ఆయన కవి కూడా. పూడిపెద్ది వెంకట రమణయ్య అసంఖ్యాకంగా కథలు రాయడంతో పాటు స్వయంగా 'పూలగుత్తి' అనే పత్రికను స్థాపించి కథలు ప్రచురించారు.

ఆంధ్రపత్రికలో మొదటినుంచి అప్పుడప్పుడు చిన్నకథలు వేస్తూ వున్నప్పటికీ 1950 తర్వాత ఎక్కువ కథలు వేయడం కనిపిస్తుంది. 1950 ఫిబ్రవరి 5 సారస్వతానుబంధంలో పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'కొత్తకోడలు', నండూరి రామమోహనరావ్ 'భూలోకస్వర్గం' ప్రచురించారు. అప్పుడప్పుడు అనువాదకథలు కూడా వేసేవారు. 1943 అక్టోబర్ 24 సంచికలో అరేబియన్ నైట్స్ కథలకు బసవరాజు అప్పారావుగారు చేసిన అనువాదం ప్రారంభమైంది. 1986లో ఆంధ్రపత్రికలో 'కథాకుసుమం' అనే శీర్షిక ప్రవేశపెట్టి తొలుత మానేపల్లి 'వీధిగుమ్మం' కథ ప్రచురించారు. ఆంధ్రప్రభ వివిధ వ్యాసానుబంధం 1952 మే 16 సంచికలో 'బ్రతుకు బరువులు' శేషు అనే చిన్నకథ వేశారు. 1967 జనవరి 14 సంక్రాంతి ప్రత్యేక అనుబంధంలో ఆంధ్రజ్యోతిలో 'ప్రజాస్వామ్యానికి పరీక్ష' వీరమల్లు రామకృష్ణ చిన్న కథ వేశారు. 1980 ఆగస్టు 31 నుంచి ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో 'ఈవారం కథ' శీర్షికన ప్రతివారం క్రమంతప్పకుండా కథ వేస్తున్నారు. ఇటీవలి కాలంలో ప్రముఖ కథారచయితలు, వారు రచించిన కొన్ని కథలను వారి స్పందనలతో పాటు ప్రచురిస్తున్నారు. ప్రజాశక్తి దినపత్రికలో అప్పుడప్పుడు ప్రగతిశీల భావాలకు అద్దంపట్టే కథలే వేశారు. 1985 నవంబర్ 3 సంచికలో పి. చంద్రశేఖర ఆజాద్ కథానిక 'ఎర్రకలువ' వంటివి చెప్పుకోదగినవి. 1990 తర్వాతనే విశాలాంధ్రలో కథలు వేయడం ప్రారంభించారు. సాహిత్యాంశాల ప్రచురణకు కూడా 1990 తర్వాతనే ప్రాధాన్యం పెరిగింది. ఉదయంలో 1987 ఫిబ్రవరి 15 ఆదివారం అనుబంధంలో కథల కోసం 'గురజాడవీధి' అనే శీర్షిక ప్రవేశపెట్టారు. ఆదివారం మధురాంతకంరాజారాం గారి 'యక్షప్రశ్న' ప్రచురించారు. ఆంధ్రప్రభలో 1984 నుంచీ ఆదివారం అనుబంధంలో 'ఈ వారం కథ' శీర్షికతో ప్రతివారం కథ వేస్తూ వచ్చారు.

ప్రధాన దినపత్రికల ఆదివారం సంచికలకు అనుబంధంగా వెలువడుతున్న 'టాబ్లాయిడ్' లలో, చిన్న పుస్తకాల్లో ప్రతివారం ఒక కథ వేస్తున్నారు. సాహితీవేదికల్లో కథలు వేయడం మానివేశారు. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ వంటి దినపత్రికలతోపాటు వెలువడుతున్న సచిత్రవార పత్రికల్లో కథలకు మంచి ప్రాముఖ్యం లభిస్తోంది. ఈ విధంగా కథ దినపత్రికా పాఠకులకు దూరమై వార, మాస పత్రికల పాఠకులకు అతి దగ్గరగా వెళ్ళింది.

## viii. ధారావాహిక నవల

తెలుగునాట ఇంటింటి పఠనాభిలాషను పెంచిన వచన ప్రక్రియల్లో నవల కూడా అగ్రశ్రేణిలోనిదే. అటువంటి నవల ఆవిర్భావ, వికాసాలు పత్రికలతో ముడివడి ఉన్నాయి. ధారావాహిక నవలలు ప్రచురించడంవల్ల పత్రికల సర్క్యులేషన్ పెరిగిన సంఘటనలున్నాయి. ధారావాహిక నవలవల్ల సాధారణ పత్రికా పాఠకుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. నవలా ప్రక్రియకున్న ఈ గుణం వల్లే ధారావాహిక నవలకు ద్వైమాస, మాస, పక్ష, వార, దినపత్రికలనే తేడా లేకుండా పత్రికల్లో ఆదరణ లభించింది. ఇంతటి మహత్తు కలిగిన ఈ ప్రక్రియ పాశ్చాత్య సాహిత్యం నుంచే తెలుగులోకి వచ్చింది. 1872లో నరహరి గోపాల కృష్ణమ చెట్టి 'శ్రీరంగ రాజచరిత్ర' రచించారు. అది వస్తువు చారిత్రకమై, కథాకథనం జానపదశైలితో కూడి నవలా గుణాన్ని సంతరించుకున్నదే గాని సమగ్రమైన నవలగా పరిశోధకులు భావించలేదు. ఆదృష్టితో కందుకూరి వీరేశలింగం రచించిన 'రాజశేఖరచరిత్ర' తొలి తెలుగు నవలగా స్థిరపడిపోయింది. 'వివేకవర్ధని' పత్రికలో 1878 లో 'రాజశేఖరచరిత్ర' ధారావాహికగా ప్రచురించారు. తెలుగులో ఇదే తొలి ధారావాహిక అని లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు.[10]

1867 లో కొక్కొండ వారు రచించిన 'మహాశ్వేత' తొలి తెలుగు నవల అని నిడుదవోలు వారు పేర్కొన్నారు. అది 'వైజయంతి' పత్రికలో 1895 జూన్ నుంచి అక్టోబర్ వరకూ ధారావాహికగా ప్రచురించారు. తొలి ధారావాహిక ఏది అనే అంశంపై

*10. తెలుగు జర్నలిజం అవతరణ వికాసం*

పరిశోధన సాగాల్సి వుంది. 1893లో చింతామణి పత్రిక నవలల పోటీ నిర్వహించింది. నవలా రచనకు కొన్ని సూత్రాలు కూడా ఆ పత్రిక రూపొందించింది. పోటీకి వచ్చిన మూడు నవలల్లో రెండింటికి ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి.[11]

ఆ ప్రోత్సాహంతో ఆ తర్వాతి రెండు దశాబ్దాల కాలంలో 10 నవలలు వచ్చాయి. 1887 నుంచి 1920 మధ్య కాలంలో వచ్చిన కొద్దిపాటి నవలల్లో చారిత్రక నవలలే అధికం. 1922లో ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాల పల్లి వచ్చింది. 1923లో 'శారద' మాస పత్రికలో అడివిబాపిరాజు నవల 'హిమబిందు' ధారావాహికగా ప్రారంభమైంది. మచిలీపట్నం నుంచి వెలువడిన ఈ పత్రిక అనంతర సాహిత్య పత్రికలు అనుసరించదగిన ప్రమాణాలను అమలు పరచింది. నవలల్లో పాత్రలెలా ఉండాలి. పాత్రపోషణ, వస్తువు, భాష వంటి అంశాల్లో వ్యాసాలు ప్రచురించి నవలా విస్తృతికి దోహదం చేసింది.

ధారావాహిక నవలల ప్రచురణలో ఆంధ్రపత్రికను చెప్పుకోవలసి ఉంటుంది. ఆ పత్రికకు అనుబంధంగా ఉన్న వారపత్రికలోనూ, దిన పత్రికలోనూ, సాహిత్య పత్రిక 'భారతి'లోనూ ధారావాహిక నవలలు ప్రచురించారు. 'భారతి'లో విశ్వనాథ వారి 'ఏకవీర' వచ్చింది. 'ప్రేమపాశం', 'తగిలిన వేలికే తగుల్తుంది', 'ఓబయ్యా', 'థాంక్‌యూ మిస్టర్ గ్లాడ్', 'మృత్యువు', 'నల్లమబ్బుకో వెండిఅంచు' వంటి సీరియల్స్ వచ్చాయి. 1945లో హైదరాబాద్ నుంచి వెలువడిన 'మీజాన్' దినపత్రికలో ఆ పత్రిక సంపాదకుడు అడివిబాపిరాజుగారి నవలలు ధారావాహికంగా వెలువడ్డాయి. 'మీజాన్'లో 'తుపాను', 'గోనగన్నారెడ్డి', 'నరుడు', 'జాజి మల్లి' వంటివి వచ్చాయి. ఆంధ్రపత్రిక వారపత్రికలో 1936 ప్రాంతంలో విశ్వనాథవారి 'వేయిపడగలు' సీరియల్‌గా ప్రచురించారు. ఈ సీరియల్ వల్ల పత్రిక సర్క్యులేషన్ 7, 8 వేలవరకు పెరిగింది. 'ఆంధ్రపత్రిక' సంపాదకుడు శ్రీ శివలెంక శంభుప్రసాద్ విశ్వనాథవారి 'చెలియలికట్ట', 'తెరచిరాజు', 'స్వర్గానికి నిచ్చెనలు', 'హాహాహూహూ', 'వీరవల్లడు' వంటివి పత్రికలో ధారావాహికంగా ప్రచురించారు.

---

*11. 'తెలుగు నవల' వ్యాసం ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక డా. అక్కిరాజు రమాపతి రావు 1994 ఏప్రిల్, ఉగాది సంచిక పు. 129.*

1955 జనవరి 2వ తేదీ ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో విశ్వనాథవారి 'తెరచిరాజు' ధారావాహిక నవల ప్రముఖంగా వేశారు. తర్వాత నోరినరసింహశాస్త్రిగారి 'ధూర్జటి' నవల, పులిచెర్ల సుబ్బారావు, 'జైభవానీ వీరశివాజీ' ధారావాహికంగా వచ్చాయి. ఆదూరిసావిత్రి 'కాలం కాటేసిన మనుషులు' 1984లో ప్రతిరోజు వచ్చింది.

ఆంధ్రప్రభలో 'వివిధ వ్యాసానుబంధం' అనీ, 'కళాసాహిత్య విజ్ఞానవేదిక' అనీ పేరు మార్చి ప్రచురించిన ఆదివారం అనుబంధంలోనూ, మామూలు రోజుల్లోనూ ధారావాహిక నవలలు ప్రచురించారు. ఆర్. సంధ్యాదేవి 'జీవనతార', కొడాలి సాంబశివరావు 'రాగపరాగం', యలమంచిశేఖర్ 'జీవన వలయాలు' వంటివి వెలువడ్డాయి. 1987 డిసెంబర్‌లో విశ్వనాథసత్యనారాయణ గారి 'విష్ణు శర్మ ఇంగ్లీషు చదువు' ధారావాహికంగా వేశారు.

ప్రజాశక్తిలో కిషన్‌చందర్ హిందీనవల 'జంగ్లీ' తెలుగు అనువాదాన్ని 1972లో ధారావాహికంగా ప్రచురించారు. విశాలాంధ్రలో 1977లో డా. శ్రీమతి విజయలక్ష్మి 'సజీవ స్వప్నాలు' వేశారు. 1978లో 'నిరంజన్' కన్నడనవలను తెలుగులోకి తిరుమల రామచంద్రగారు 'చిరస్మరణ' పేర అనువదించగా విశాలాంధ్రలో ధారావాహికంగా ప్రచురించారు. తర్వాతి కాలంలో పులిపాక శ్రీరామచంద్రమూర్తి 'సిరాచుక్క', కిషన్‌చందర్ హిందీ నవల తెలుగుసేత డా. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి 'దేవుడేబాలుడైతే', రాహుల్ సాంకృత్యాయన్‌నవల 'ఓల్గానుండి గంగవరకు' చాగంటి తులసి తెలుగు అనువాదం మొదలైనవి ధారావాహికంగా వెలువడ్డాయి. విశాలాంధ్ర అనువాద నవల ప్రచురణకు, విమర్శ ప్రచురణకు ప్రాధాన్యం కల్పించింది.

ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం 'ఆదిత్య హృదయం'లో ఉమ్మెత్తల నరసింహమూర్తి 'ఈజీవితానికిది చాలు', పైడిమర్రి దయాసాగర్ 'చక్రవర్తి', ఇల్లిందల సరస్వతీదేవి 'చీకటి వెలుగులు', శివల జగన్నాథరావు 'డియర్ డెవిల్' వంటి ధారావాహిక నవలలు వేశారు. అడివిబాపిరాజు 'మధురవాణి' అసంపూర్తి నవలను ఆంధ్రభూమిలో దిట్టకవిశ్యామలాదేవి సీరియల్ నవలగా పూర్తి చేశారు.

1984లో ప్రారంభమైన ఉదయం దినపత్రిక ప్రతిరోజూ ధారావాహిక నవలల ప్రచురణలో అశేష పాఠకాదరణ చురగొనే ప్రయత్నం చేసింది. శాతవాహన 'మహాయజ్ఞం', సూర్యదేవర రామ్మోహనరావు 'మోడల్', 'సూపర్‌స్టార్', దాసరినారాయణరావు 'ఆచారి గారి ఆమెరికాయాత్ర' కొమ్మనాపల్లి గణపతిరావు 'రోషనారి' మొదలైనవి ప్రచురించారు.

'ఈనాడు' దినపత్రికలో మొదట్నుంచీ ధారావాహిక నవలా ప్రచురణకు చోటు కల్పించలేదు. ఈనాడు గ్రూపు 'చతుర' పేరిట వెలువడే పత్రికలో ప్రతినెలా ప్రత్యేకంగా ఒక నవల వేస్తున్నారు.

పత్రికల్లో ధారావాహిక నవలలే గాక ఇతర అంశాలు కూడా ధారావాహికంగా ప్రచురించడం కనిపిస్తుంది.

ప్రస్తుతం ఒక ఆంధ్రప్రభలో తప్ప మిగతా దినపత్రికల్లో డెయిలీ సీరియల్స్ ప్రచురించడం లేదు.

ధారావాహిక నవలల ప్రచురణలో దినపత్రికలకన్నా వార, మాస పత్రికలే ముందంజలో ఉన్నాయి. ప్రముఖ రచయితలచేత ఒకప్రణాళిక ప్రకారం, సర్క్యులేషన్ వ్యూహంతో రాయించి వార, మాస పత్రికల్లో ధారావాహిక నవలల ప్రచురించడం కొంతకాలం కొనసాగింది. దినపత్రికలో ధారావాహిక నవలల్ని చదవాలంటే ఆపత్రికకు చందా చెల్లించటంతో పాటు బహుశా రోజూ క్రమంతప్పక చదవవలసిన వత్తిడికి గురికావలసి రావడంతో పాఠకులు దినపత్రికా ధారావాహిక నవలను తగినంతగా ప్రోత్సహించడం లేదు. వార, మాసపత్రికల్లోనయితే తీరిగ్గా చదువుకోవడం సాధ్యపడుతుంది. అందుకే ధారావాహిక నవల దినపత్రికలో కన్నా వార, మాసపత్రికలకే లాభసాటిగా మారింది. ఫలితంగా దినపత్రికల్లో ధారావాహిక నవలల ప్రచురణలో పెరుగుదల లేదు.

ఇకపోతే మిగతా దినపత్రికల్లో కొద్దిపాటిగానైనా ధారావాహిక నవలలు వచ్చాయి గాని వామపక్ష దినపత్రికలైన విశాలాంధ్ర, ప్రజాశక్తి దినపత్రికల్లో ఎక్కువగా కనిపించడం లేదు. అందుకు కారణాలు రెండు కావచ్చు. వామపక్ష దినపత్రికల్లో ప్రచురించే నవలలు ప్రధానంగా అభ్యుదయ సాహిత్యానికి వామపక్ష భావజాలానికి సంబంధించినవే అయి ఉండాలి. అందులో రాజీలేదు. అవి ఈకాలంలో అందులో నవలా ప్రక్రియలో

రాసేవారు అరుదయ్యారు. రెండవది ఆ రెండు దినపత్రికల్లోనూ స్థలం మిగతా దినపత్రికల్తో పోలిస్తే తక్కువ. ఉన్నస్థలం సాధారణ వార్తా ప్రచురణకు, పార్టీవైఖరికి సంబంధించిన ఇతర అంశాలు, వ్యాసాలకే సరిపోవడం లేదు.

## ix. విమర్శ

తెలుగుపత్రికలు విమర్శ ప్రక్రియా ప్రచురణ ద్వారా తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డాయి. తెలుగులో ప్రాచీనాధునిక ప్రక్రియల్లో రచనలను ప్రోత్సహిస్తూనే విమర్శసాహిత్యాన్ని కూడా ప్రచురించడం ద్వారా సాహిత్య సేవ చేశాయి. తొలిసాహిత్య పత్రిక సుజనరంజని (1864) మొదలుకొని ఈనాటివరకు పత్రికల్లో సాహిత్య ప్రచురణ స్వరూపాన్ని పరిశీలిస్తే సాహిత్య విమర్శ ఎంతో ప్రాధాన్యాన్ని వహించినట్లు తెలుస్తోంది. గ్రంథ ప్రచురణ ప్రక్రియ పూర్వాపరాలను పరిశీలించినా ఇతర ప్రచురణ సంస్థలు మౌలిక ప్రక్రియలనే ప్రచురించాయి. అవి విమర్శకు ప్రాధాన్యం ఇవ్వలేదు. అటువంటిది పత్రికలు విమర్శకు ఆదినుంచీ ఉత్తమస్థితినీ, ఉన్నతస్థితిని కట్టబెట్టాయి. ఒక్కమాటలో చెప్పాలంటే విమర్శ సమకాలీన రచనల్లోని మూల్యాల స్థితిగతులను అంచనావేస్తూ ఆయా ప్రక్రియల్లో పెరగవలసిన ప్రమాణాల స్థాయిని నిర్దేశిస్తూ వచ్చింది. నిజానికి విమర్శ లక్ష్యం కూడా అదే. మొత్తం సాహిత్యానికంతటికీ దిక్సూచి వంటి విమర్శకు పత్రికలు తగిన స్థానం కల్పించాయి.

అముద్రిత గ్రంథ చింతామణి (1885) తెలుగులో అప్పటికి అముద్రితంగా ఉన్న అనేక గ్రంథాలను ముద్రించేందుకు కంకణం కట్టుకుని అవతరించిన పత్రిక. సాహిత్య విమర్శలో పాశ్చాత్యరీతిని ప్రవేశపెట్టిన తొలిపత్రికగా చరిత్రలో నిలిచిపోయింది. ఈ విషయంలో అముద్రితగ్రంథ చింతామణి తీసిన కొత్తబాట అనంతర సాహిత్యవిమర్శను ప్రభావితం చేసింది.

పత్రికల్లో సాహిత్య విమర్శ ప్రధానంగా వ్యాసరూపంలో వచనంలో సాగడం మొదటినుంచీ ఉంది. 1910లో అవతరించి ప్రసిద్ధమైన 'ఆంధ్రభారతి'లో 'మహాభారతం' పై మాడపాటి హనుమంతరావు రాసిన వ్యాసం, రాయప్రోలు సుబ్బారావు రాసిన 'కళాకవిత్వములు', కోపల్లెహనుమంత రావు 'సాహిత్య విమర్శనము' 'తాజ్‌మహల్', తల్లాప్రగడ సూర్యనారాయణ 'పింగళి సూరనార్యుడు', కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి 'త్రిలింగము - తెలుగు' మొదలైన విమర్శా వ్యాసాలు ప్రచురించారు.

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' (1912)లో 'నాచన సోమనాథ నన్నెచోడుల కావ్యవిశేషాలు', 'నన్నె చోడుని కాలనిర్ణయాన్ని తెలిపే వ్యాసం', 'పెద్దన కావ్యరచనా నైపుణి', 'ఆంధ్ర సింహావలోకన సంగ్రహం', 'గ్రంథవిమర్శనపద్ధతి - విమర్శనం 'వంటి 'విమర్శ వ్యాసాలు ప్రచురించారు.

'సాహితి (1919) ద్వైమానిక పత్రిక వచ్చేసరికి నవ్యసాహిత్యం తన ఉనికిని ప్రబల పరచుకోవడం, ఆ ధోరణిని అనుసరించి పత్రికల్లో కవిత్వం కథలు, నాటికలు ప్రచురింపబడడం ఒక ఎత్తయితే అప్పటివరకు ప్రాచీన కావ్యాలపై, ప్రబంధాలపై సాగిన విమర్శ ఆధునిక ప్రక్రియలకు మారడం మరో ఎత్తు. 'సాహితి' పత్రిక సంపాదకుడు తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి. పత్రిక స్థాపకుల్లో నోరి, చింతా, మునిమాణిక్యం, మొక్కపాటి, నండూరి, నాయని, విశ్వనాథ, దేవులపల్లి ప్రభృతులుండడం ఈ నూతన సాహిత్యోద్యమానికి బలాన్ని చేకూర్చింది.

సాహిత్య పత్రికల రూపురేఖల్ని మార్చివేసిన 'శారద' నవలా ప్రక్రియ గురించి, ఎంకిపాటలు, ఆంధ్రనాటకం వంటి అంశాల్లో సాహిత్య విమర్శ వ్యాసాల్ని ప్రచురించింది.

'భారతి' ప్రాచీన, ఆధునిక సాహిత్యాంశాలను ప్రచురించడంలో, అన్ని పార్శ్వాలలో సాగుతున్న కృషిని ఉద్దీపింపజేసేవిధమైన విమర్శనా సాహిత్యాన్ని ప్రచురించడంలో సాటిలేని కృషి చేసింది. తెలుగు సాహిత్య పత్రికలన్నిటిలో 'భారతి' ది అగ్రస్థానం. వివిధ ప్రక్రియల్లో వెలసిన రచనల స్థాయిని వాటిపై 'భారతి'లో వెలువడే ప్రామాణిక విమర్శ తూచి నిర్ణయించే విధంగా ఉండేది. ఒక రచన ప్రచురించడమన్నా ఆ రచనపై గ్రంథ విమర్శగాని, ధోరణి విమర్శగాని, ప్రక్రియా విమర్శగాని ప్రచురించడమన్నా సాహిత్యలోకం భారతికి ఉన్నతస్థాయి కల్పించింది. ఇందులో మనుచరిత్ర విమర్శనం, ఛందశ్శాస్త్ర విమర్శనం, కళాపూర్ణోదయ విమర్శనం, క్రీడాభినయ కర్తృత్వ విమర్శనం, విమర్శ విమర్శనం, విజయ విలాస వ్యాఖ్యాన విధాన విమర్శనం, వేమన పద్యాల ప్రతులు పరిష్కరణ, నవయుగ కవి చక్రవర్తి జాషువా వంటి సాహితీ విమర్శనా వ్యాసాలు అసంఖ్యాకంగా 'భారతి'లో ప్రచురించబడ్డాయి.

ఆ తర్వాతి కాలంలో ఆంధ్ర సర్వస్వము, వజ్రాయుధము, జయంతి, ప్రతిభ, ఉదయిని, అభ్యుదయ, స్రవంతి, సాహితి, సృజన వంటి సాహిత్య పత్రికలు, ఆంధ్రపత్రిక,

ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి, విశాలాంధ్ర, ఉదయం వంటి దినపత్రికలు సాహిత్య విమర్శకు ప్రాముఖ్యాన్ని కట్టబెట్టాయి. దిన పత్రికలు తమ ఆదివారం అనుబంధాల్లో ఇతర సాహిత్యాంశాల కన్నా విమర్శకు ఎక్కువ చోటు కల్పించాయి.

ఆదివారం సాహిత్యానుబంధంలో విమర్శావ్యాసం, గ్రంథ సమీక్ష, శీర్షిక, చిన్న కథ, కవిత అన్నవి ప్రచురించడం ఆంధ్రపత్రిక కొనసాగించింది. ఇందులో దాదాపు విమర్శా వ్యాసం, గ్రంథ సమీక్షకు ప్రథమ గణ్యత లభించింది. దిన పత్రికల్లో సాహిత్యాంశాల ప్రచురణకు మిగతాదినపత్రికలు ఈ మార్గాన్నే అనుసరించినట్లు కనిపిస్తుంది. అన్ని పత్రికల్లో విమర్శకు అంత ప్రాధాన్యతనిచ్చినట్లు పత్రికలని పరిశీలిస్తే తెలుస్తుంది.

పత్రికలు ప్రచురించిన విమర్శను పరిశీలిస్తే సాహిత్యంలో అన్ని ప్రక్రియలకన్నా అగ్రస్థానంలో వున్న కవిత్వ విమర్శకు ఎక్కువ స్థానం కల్పిస్తూ మిగతా కథా, నవలా, నాటక ప్రక్రియల విమర్శకు కూడా సముచిత ప్రాధాన్యం కట్టబెట్టినట్లు తెలుస్తున్నది.

ఆంధ్రపత్రిక 1969 ఏప్రిల్ 6 సంచికలో శ్రీతోటనాగేశ్వరరావు 'తెలుగు నాటక రంగం : స్థితిగతులు' వేశారు. 1980 ఏప్రిల్ 20వ తేదీ సంచికను ఆంధ్రపత్రిక రాయలసీమ ప్రత్యేకానుబంధంగా వెలువరించింది. ఇందులో 'రాయలసీమ రచయితల' గురించి జానమద్ది హనుమచ్ఛాస్త్రి, రాయలసీమ నేలినరాజుల' గురించి నిడుదనోలు వెంకటరావు గార్ల వ్యాసాలు వచ్చాయి. 'రాయలసీమలో నాటకరంగం' అనే వ్యాసం కూడా వచ్చింది. 1983 మే 29 సంచికలో 'తెలుగు నాట వెలసిన తొలి శతకం' 12 వ శతాబ్దికి చెందిన పాల్కురికి సోమనాధుని వృషాధిపశతకం, సుపాణి వ్యాసం వచ్చింది. 'మన నాటకాలమీద పాశ్చాత్య ప్రభావం', డా. పి.వి.రమణ, 'నటకావతంస స్థానంనరసింహారావు' మధిరభానుమూర్తి, 'భరతుని నాట్యశాస్త్రవారసత్వం కూచిపూడినృత్యం', డా. చింతారామనాథం,'జాతిజీవన దర్పణం జానపద సాహిత్యం' ఎం. సోమశేఖరశర్మ వంటివి అప్పట్లో వచ్చిన విమర్శలు. 1988లో ఆంధ్రపత్రికవారు సాహిత్యం కోసం 'సాహితి' అనే పేజి ప్రత్యేకించారు. ఆ సంచికలో 'కవిత్వంలో సొంతగొంతుకలు', కవిత్వంలో ప్రభావాలు, ప్రతిభావిశేషాలు వంటి విమర్శవ్యాసాలు ప్రచురించారు. 1989నాటికి 'ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధం ఆహ్లాదవేదికగా పేరు మార్చుకున్నది. సాహిత్యానికి మరింత ఎక్కువ చోటు కల్పించనారంభించింది.

'కందుకూరి వారి రాజశేఖర చరిత్ర' డా. గుజ్జర్లమూడి కృపాచారి, 'వేటపాలెం సారస్వతనికేతనం' రమాదేవి జోషి, 'రంగనాయకమ్మతో ఇంటర్వ్యూ' వంటివి ఆ సంవత్సరం ప్రచురించారు.

విశాలాంధ్ర సాహితీ స్రవంతిలో 1970లో 'రచయితల్లో పోలరైజేషన్ ఏ రూపంలో ప్రయోజనకరం', మున్షీప్రేమ్‌చంద్ 90 వ జన్మదిన సందర్భంగా 'భారత దేశ అభ్యుదయ సాహిత్య కేతనధారి 'ప్రేమ్ చంద్' వ్యాసాలు వచ్చాయి. విశాలాంధ్ర తెలుగు సాహిత్య విమర్శతోపాటు ఇతర భాషా సాహిత్యాల్లో జరుగుతున్న కృషిని కూడా తెలుగులోకి తెచ్చేందుకు కృషి చేసింది. 'రచయితలకు శరత్ సూచనలు', 'బాహ్య వాస్తవికతను కళామయంగా ప్రతిబింబించిన కథన శిల్పి కిషన్ చందర్ ప్రేమ్‌చంద్‌పై రాసిన వ్యాసం అటువంటిది. 1977లో 'కొండూరువీరరాఘవాచార్యుల వారి బహుముఖ సాహితీసేవ', 'వేమన తాత్విక చింతన' వంటివి విశాలాంధ్రలో ప్రచురించారు. 'అనువాద భాషగా తెలుగు' గోవిందరాజు రామకృష్ణారావు, 'మచ్చుకైనా అలౌకిక శృంగార స్పర్శలేని క్షేత్రయ్య పదసాహిత్యం - ఒక పరిశీలన' ప్రతాపరామ సుబ్బయ్య, 'పరిశోధన భాషగా తెలుగు' డా. ఎం. కులశేఖరరావు, 'చారిత్రకనవలలు' డా. నాయని కృష్ణకుమారి, 'వచన సాహిత్యం - స్త్రీలు' ఐవిఎస్ అచ్యుతవల్లి వంటి వ్యాసాలు విమర్శా వైవిధ్యానికి నిదర్శనాలు. 1984లో 'విస్మృత అభ్యుదయ కవితలు, 'కుందుర్తి ఉత్తరాలు' ద్వానా శాస్త్రి, 'జాషువా రాజకీయ చైతన్యం' - రావిరంగారావు, 'సమకాలీన సామాజిక ప్రతిబింబాలైన వీరేశలింగం ప్రహసనాలు' - సోమసుందర్, 'వీరేశలింగం పంతులుగారిని గూర్చి అసత్యాలు - అర్ధసత్యాలు' అక్కిరాజురమాపతిరావు మొదలైన గంభీరమైన అంశాలను ఆంధ్ర పత్రిక ప్రచురించింది. ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికలు అభ్యుదయ సాహిత్యానికి, విమర్శకు ప్రాధాన్యతనిచ్చాయి. 'శాంతి మహోద్యమానికి అనిసెట్టి కల్పించిన రూపం', 'అభ్యుదయ సాహిత్యం ఉద్యమచరిత్ర తొలి రోజులు', మద్దుకూరి చంద్రశేఖరరావు స్మారకోపన్యాసం - ఆరుద్ర ప్రసంగవ్యాసం వంటివి ఆ కోవలోనివే. విశాలాంధ్రలో 1990నాటికి సాహిత్య ప్రచురణకు ప్రాధాన్యత పెరిగింది. 'జీవితం పట్ల కవిత్వం పట్ల నాకున్న అభిప్రాయాలు' సినారె జ్ఞానపీఠ అవార్డు స్వీకరించిన సందర్భంలో చేసిన ప్రసంగం, 'వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యపు వెలుగులు' జాతీయ సదస్సు సమీక్ష, 'తెలుగు దేశపు సుబ్రహ్మణ్య భారతి శ్రీ గరిమెళ్లసత్యనారాయణ' చల్లా రాధా కృష్ణ శర్మ వంటి విశేషాంశాల్లో విమర్శావ్యాసాలు పత్రికలో కొలువుతీరాయి.

పత్రికల్లో సాహిత్య విమర్శ వ్యాసాలే గాక తెలుగువారి చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలు కూడా చోటుచేసుకున్నాయి. 'ఆంధ్రప్రభ'లో 1950లో నాయని కృష్ణకుమారి 'ఆంధ్రులకథ' అనే ధారావాహిక వ్యాసావళి, 1986లో 'మనచరిత్ర సంస్కృతి' దేవులపల్లి రామానుజరావు, 'మేలుకలయిక తెలుగు సంస్కృతి' డి. రామలింగం మొదలైన వ్యాసధారావాహికలు వెలువడ్డాయి. విశాలాంధ్రలో 'విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు' పడాలరామారావు వ్యాసం, 'మనుచరిత్ర' ఏటుకూరి బలరామమూర్తిగారి ధారావాహిక, ఆంధ్రప్రభలో 1957లోనే 'నాగార్జున కొండ నిక్షేపం - బయల్పడిన విధానం' ఆరుద్ర ప్రధాన వ్యాసం, ప్రజాశక్తిలో 'కూచిపూడి నృత్య శైలి విశిష్టత' పోలవరపు కోటేశ్వరరావు వ్యాసం చెప్పుకోదగినవి.

ఆంధ్ర ప్రభలో 1954లో 'రవీంద్ర కవీంద్రుడు - సౌందర్యాన్వేషణకు ఆ జన్మ దీక్షగా ప్రవర్తించిన కళాతపస్వి' బెజవాడ గోపాలరెడ్డి, 57లో 'నేనెరిగిన మానవల్లి కవిగారు' పిఎస్ఆర్ అప్పారావు, 58లో 'ఆంధ్రసాహిత్యంపై వివిధ మతాల ప్రభావం' కొండూరు వీరరాఘవాచార్యులు, 60లో 'మరువరానిమిత్రుడు చింతాదీక్షితులు' చలం, 'సంప్రదాయ సాహిత్యం' అమరేంద్ర, 'ఆధునిక భారత సాహిత్య కర్తలు' కె.వి. రమణారెడ్డి ధారావాహిక, తెలుగు ఛందోవీధి' సంపత్కుమార, 'ఆధునికాంధ్ర నిర్మాత వీరేశలింగం' జాస్తి వెంకటనరసయ్య, 64లో 'ధ్వనివిధానం' గుంటూరు శేషేంద్రశర్మ, 'నవ్య సాహిత్యం : భారతీయ హృదయం ప్రతిబింబించే మహోద్యమం తలఎత్తాలి' ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, 'విద్వాన్ విశ్వం పెన్నేటిపాట' సుందరరామశర్మ ఏ వ్యాసం చూసినా విషయపరంగానూ విశ్లేషణపరంగానూ గాంభీర్యాన్ని చాటేవే పత్రికల్లో చోటు చేసుకుని సాహిత్య వికాసానికి దోహదం చేశాయి.

ఆంధ్రజ్యోతి దినపత్రిక కూడా వివిధ భారతీయ, అంతర్జాతీయ భాషలపై దృష్టి సారించినట్లు కనిపిస్తుంది. 1961లోనే డి. రామలింగంగారు రష్యా పర్యటించివచ్చిన సందర్భంగా అక్కడి భాషా సాహిత్యాలు, కవుల గురించి ధారావాహిక వ్యాసాలు రాశారు. వాటిలో ఒకటి 'మహాకవుల స్మృతులతో ప్రఖ్యాతమైన పట్టణం పుష్కిన్' అనేది. హిందీ నవల వనపూల్‌ను తెలుగులోకి దండమూడి మహీధర్ అనువదించగా ధారావాహికంగా ప్రచురించారు. 1965 ప్రాంతాల్లో 'రవీంద్రునికవిత్వంపైనా, రవీంద్రునిపైనా వ్యాసాలు అనేకం వెలువడ్డాయి. 'రవీంద్ర కవీంద్రుని సందర్శనభాగ్యం'

అని సంజీవదేవ్ రాసిన వ్యాసం ఆ కోవలోనిదే. 1968లో 'గజల్ - ఉర్దూలో రసవత్తర సాహిత్య ప్రక్రియ' సదాశివ వ్యాసం, ఆర్. కె. నారాయణ్ ఆంగ్ల నవల 'The Financial Expert ను 'ప్రయోజకుడు' పేర మల్లాది సూరి బాబు అనువదించగా ధారావాహికగా వేశారు. సంస్కృతంపై కూడా దృష్టి కేంద్రీకరించారు. సంస్కృతంలోని భారవి 'కిరాతార్జునీయం'ను, మాఘకవి 'శిశుపాలవధ'ను విద్వాన్ విశ్వం తెలుగులోకి అనువదించగా ధారావాహికంగా ప్రచురించారు. సంస్కృతం - సంస్కృతి' నార్ల వారి ధారావాహిక కూడా అందులో వచ్చింది. 'నన్నెచోడుని వర్ణనలు' నండూరి వేంకటసత్యరామారావు, 'ఆధునిక నవలారచనలో వాస్తవికత లోపిస్తున్నదా!' కోడూరి శ్రీరామమూర్తి, 'కథారచనలో కుటుంబరావుగారి పద్ధతి' వి.ఎస్. అవధాని, 'గురజాడపేర అవసరాలసూర్యారావు చేసినఫోర్జరీలు', 'కృష్ణశాస్త్రి కవితలో క్రమపరిణతి' అమరేంద్ర వంటి విమర్శావ్యాసాలు ఆంధ్రజ్యోతిలో వచ్చాయి.

1980 వ దశకంలో వివిధ దినపత్రికల్లో సాహిత్యానికిచ్చిన ప్రాధాన్యంలో ఇతర ప్రక్రియలకన్నా విమర్శకే ఎక్కువచోటు లభించింది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈశ్వర్‌రాసిన 'గురజాడ కవిత చెప్పిన తోకచుక్క', 'ప్రతీకవాద కవితలో ప్రత్యేకత', కౌండిన్యరాసిన 'ఆరుద్ర కవి చంద్రునికో నూలుపోగు', డా. దాశరథి రచించిన 'ఆధునిక కవిత - ఆరుద్రముద్ర' మొదలైన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. విశాలాంధ్ర దిన పత్రికలో సెట్టి ఈశ్వరరావు రచించిన 'ఆంధ్రభాషా సాహిత్యాల నవయుగోదయం గురజాడ యుగం', కాత్యాయని విద్మహే రచించిన 'చాసో కథల్లో జీవచైతన్యం', కొదమగుండ్ల రచించిన 'ఖండకావ్యస్రష్ట జాషువా', ద్వానా శాస్త్రి రచించిన 'కవిత్వ తత్త్వవేత్త బైరాగి' వంటి వ్యాసాలు వచ్చాయి.

ఆంధ్రప్రభ దినపత్రిక టి.ఎల్. కాంతారావు రాసిన 'మేరుగిరి శిఖరాలు విశ్వనాథ, శ్రీశ్రీ', ఎల్లోరా రాసిన 'తెలుగు సాహిత్యాన్ని ఆపోశనపట్టిన అగస్త్యుడు ఆరుద్ర', చామర్తి కనకయ్య రాసిన 'తెలుగులో హాస్య కథలు', 'తొలిభువనవిజయం' వ్యాసాలు, ఘట్టమరాజు రాసిన 'కథక చక్రవర్తి మధురాంతకం రాజారాం', ద్వానా శాస్త్రి రాసిన 'మహామహుల సాహితీ వేదిక' వంటి వ్యాసాలు వచ్చాయి. తెలుగు కవిత్వానికి, సాహిత్య చరిత్ర నిర్మాణానికి దశాబ్దాల కృషి అందించిన ఆరుద్రకు వివిధ పత్రికల్లో పలువురు

విమర్శ వ్యాసాల ద్వారా కృతజ్ఞతావచనాలు అందించడం విశేషంగా చెప్పుకోవాలి. ఆంధ్రపత్రికలో టి.ఎల్. కాంతారావు రాసిన 'అతడు అడవిని జయించాడు', 'ఈనాటికీ అమరుడు తిలక్', 'కవిత్వంలో ఇది కాలుష్య యుగమా', 'గురజాడకవితలు, కథానికలు', 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ', 'మండే సూర్యుడు శేషేంద్ర', 'మహాభారతం - భూమి పోరాటం', 'రచయితలు ప్రేరణలు', 'వచన కవితాపితామహుడు', 'వేదులవారి వేదన', 'సామాన్యుడి కామన - జీవనశిల్పం' (శ్రీశ్రీతో కొన్ని జ్ఞాపకాలు', 'సాహిత్య సముద్రుడు - ఆరుద్రుడు', 'సోమసుందర్ - వజ్రాయుధం', డా. ఎస్. గంగప్ప రాసిన 'పద్యం ద్వారా అభ్యుదయం ఆశించిన జాషువా' మొదలైన విమర్శా వ్యాసాలు ప్రచురిత మయ్యాయి. ఉదయం దినపత్రికలో కె.వి. రమణారెడ్డి రచించిన 'చెరగని శ్రీశ్రీ మొహరు', 'సాహిత్య విమర్శతేజరిల్లుతోంది', జయధీర్ తిరుమలరావు రాసిన 'ప్రజాసాహిత్యానికి నాందీగీతం పాడిన గద్వాల' వంటి చెప్పుకోదగిన వ్యాసాలు వచ్చాయి. ఆంధ్రభూమి దినపత్రికలో బి.ఎస్.ఆర్. కృష్ణ రాసిన 'బెజవాడ గోపాల రెడ్డి సాహితీ వాల్లభ్యం', చైతన్య ప్రసాద్ రాసిన 'అభ్యుదయం ఎలుగెత్తిన నయాగరాకవి కుందుర్తి', 'తెలుగు సాహిత్య గగనంలో తోకచుక్క' మొదలైన వ్యాసాలు వచ్చాయి.

ఉదయంలో 1987లో 'రాజకీయ వాస్తవికత ప్రజాస్వామ్య సాహిత్య వాస్తవికత' అనే నగ్నముని వ్యాసం వచ్చింది. ఆ వ్యాసంపై కొన్ని వారాలు వాదోపవాదాలు కూడా జరిగాయి. నగ్నముని వ్యాసానికి 'దిగంబరకవుల పాడిగింపు కాదు విరసం' అని శివారెడ్డి ప్రతిస్పందన వ్యాసం రాశారు. తర్వాతి వారం ఎన్. వేణుగోపాల్ వ్యాసం వచ్చింది. తర్వాతి వారం 'తెలుగు సాహిత్యంలో స్తబ్దత చోటు చేసుకుంది, 1947 తర్వాత పరిణామాలు రికార్డు కాలేదు' అంటూ నమ్మి వ్యాసం వచ్చింది. ఆ తర్వాతి వారం మళ్ళీ శివారెడ్డి వ్యాసం వచ్చింది. దానిపై ఎస్వీ వ్యాసం పైవారం వచ్చింది.

ఆంధ్రభూమిలో 1985లో డా. సి. నారాయణరెడ్డి రాసిన 'ఆంధ్రులకు వరం సురవరం అతడు ప్రతాపరెడ్డి యిరులై పడియున్న తెలుంగువారి గుండె తెరల దుల్పి వెల్గులను నిల్పిన మిత్రుడు' అనే ప్రధానవ్యాసం, 'కొల్లాయి గట్టితేనేమి? నేనెందుకు రాశాను' మహీధరరామమోహన్‌రావు వ్యాసం మొదలైనవి వచ్చాయి.

'ఈనాడు' సాహిత్యానికి చోటు కల్పించక పోయినప్పటికీ ఒక దశలో ఆదివారం అనుబంధంలో 'చలం శ్మశాన సాహిత్యం' శీర్షికతో డా. నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు విమర్శావ్యాస పరంపర ప్రచురించడం గమనార్హం.

1990 నాటికి వివిధ దినపత్రికల్లో సాహిత్యానికి ప్రాధాన్యత పెరిగింది. విమర్శాసాహిత్యానికి తప్పనిసరిగా సముచిత ప్రాముఖ్యం కల్పించడం జరుగుతోంది.

## x. ప్రత్యేక సందర్భాలు

ఒక మహాకవికో, మరొక విమర్శకావతంసునికో నివాళిగా ఒక ప్రత్యేక సందర్భంలో ప్రత్యేక సంచిక వెలువడితే సాహిత్యచరిత్రలో నిలిచిపోయే అంశాలు, సాహితీలోకంలో చర్చోపచర్చలకు దారితీసే విషయాలు, పరిశోధనాధ్యాపనాలకు ఉపయుక్తమయ్యే విషయాలు అందులో చోటు చేసుకోవడం తెలుగులో ప్రత్యేకత. స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ, సంవత్సరాది సంచికలు వంటి ప్రత్యేక సందర్భాల్లో వివిధ పత్రికలు ప్రచురించిన ప్రత్యేక సంచికలు ఎంతో విలువైన విషయ సంపదను సాహిత్యలోకానికి అందించాయి. మహనీయుల శత జయంతులు, స్మారక సంచికలు, ఇవిగాక ప్రత్యేకంగా ఆయా పత్రికల ప్రారంభసంచికలు, దశాబ్ది, రజతోత్సవ, స్వర్ణోత్సవ, వజ్రోత్సవ సందర్భాల్లో వెలువరించే ప్రత్యేక సంచికలు సాహిత్యాంశాల ప్రచురణ దృష్ట్యా ఎంతో విలువైన సామగ్రిని అందిస్తూ వచ్చాయి. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికకూడా ప్రతిసంవత్సరం పాఠకులు సంవత్సరాది పర్వదినంకోసమేగాక సంవత్సరాది సంచిక కోసం కూడా ఎదురు చూసేలా సాగిందని చెప్పవచ్చు.

తొలినాళ్ళ పత్రిక 'వర్తమానతరంగిణి' ప్రారంభసంచికలో అప్పట్లో ముద్రితమై ఉన్న కావ్య ప్రబంధాల పట్టిక పొందుపరచడంవల్ల అది ఎంతో ప్రయోజనకరమైంది. 'సరస్వతి' (1898) 14 ఏళ్ళపాటు వెలువడింది. పత్రిక 13 వసంపుటం 12 వ సంచిక ఐదవ జార్జి చక్రవర్తి పట్టాభిషేకం సందర్భాన్ని పురస్కరించుకొని "పంచమ జార్జి పట్టాభిషేక మహోత్సవ సంచిక" గా వెలువడింది. జార్జి చక్రవర్తి పట్టాభిషేకాన్ని గురించి 100 మంది కవులు రాసిన పద్యాలను ముద్రించడం ఈ సంచిక ప్రత్యేకత.

తెలుగు సారస్వతానికి ముద్రణ రూపం కల్పించి లోకానికి పంచిపెట్టిన మహనీయులు వావిళ్ళ సోదరులను గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 1916లో వావిళ్ళ సంస్థ పక్షాన వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి గారు 'త్రిలింగ' పత్రిక స్థాపించారు. అది నిరాఘాటంగా 40 సంవత్సరాలు నడిచి తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించింది. 1941లో పత్రిక రజతోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఆ సందర్భంగా ప్రచురించిన 844 పేజీల

రజతోత్సవ సంచికలో విలువైన వ్యాసాలు, కవితలు, సుమారు 200 మంది వ్రాసిన అభినందన పత్రాలు ఉన్నాయి.

తెలుగు భాషా సాహిత్య రంగాలతోపాటు చరిత్ర, సంస్కృతి వంటి ఇతర సమస్త అంశాలను సమగ్రంగా ప్రచురించిన 'భారతి' పత్రిక 1949లో రజతోత్సవాన్ని, 1974లో స్వర్ణోత్సవాన్ని, 1984లో వజ్రోత్సవాన్ని జరుపుకొని ఆ సందర్భాల్లో ప్రత్యేక సంచికలు వెలువరించింది.

1937 లో ప్రారంభమైన నవశక్తి పత్రిక 'త్రిపుర కాంగ్రెస్ సంచిక', 'రష్యా సంచిక' అని రెండు ప్రత్యేక సంచికలను ప్రచురించింది. ప్రథమ సోషలిస్టు దేశం రష్యా వివిధ రంగాల్లో సాధించిన విజయాలను అభివృద్ధిని రష్యా సంచికలో ప్రచురించారు. భారత జాతీయోద్యమాన్ని మార్క్సిస్టుదృక్పథంతో దర్శించడం రష్యా సంచికలోని ప్రత్యేకత.

ఇదే వరసలో ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు చెప్పుకోదగ్గవి. రాజకీయ, సాహిత్య, చారిత్రక, చిత్రకళ, సంగీత, మత, వ్యవసాయాది వివిధ రంగాలకు సంబంధించిన విలువైన వ్యాసాలను ఈ సంచికల్లో ప్రచురించేవారు. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ప్రజాశక్తి మొదలైన దినపత్రికలు స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలను అపూర్వమైన రీతిలో వెలువరించాయి.

1953లో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక దినపత్రికలు బుద్ధుని 2500 వ జయంతి సందర్భంగా ప్రత్యేక సంచికలు ప్రచురించాయి. ఆంధ్రప్రభ 66 పేజీలతో ఈ ప్రత్యేక సంచికను తీర్చిదిద్దింది. బౌద్ధ (ప్రాకృత, పాళీ) వాఙ్మయం, వాస్తుశిల్పం, సాహిత్యం, బుద్ధుని పీటకాలు వంటి ఎన్నో అంశాలు ఆ సంచికలో చోటు చేసుకున్నాయి.

1954లో దినపత్రికలు ఆంధ్రరాష్ట్రావతరణ ప్రత్యేక సంచికలు వెలువరించాయి. కమ్యూనిస్టు దిన పత్రికలు, ఇతర దిన పత్రికలు రాష్ట్రంలో వేర్పాటువాద ఉద్యమాలను సమర్థించక విశాలాంధ్ర ఉద్యమానికి ఊతం కల్పించాయి. 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' నినాదాన్ని కమ్యూనిస్టు దినపత్రికలు ఘోషించాయి. ప్రజలకలలు, పత్రికల కృషి ఫలించి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించిన శుభ తరుణాన పత్రికలు ప్రత్యేక సంచికలను ప్రచురించాయి. 'విశాలాంధ్ర'లో తెలుగువారి ప్రాచీన చరిత్ర, భౌగోళిక విశేషాలు, సాంస్కృతిక వైభవం, రాజకీయాలతోపాటు దాశరథి, కరుణశ్రీ ప్రభృత కవుల గేయాలను ఆ సంచికలో ప్రచురించారు.

1962 సెప్టెంబర్ 21న గురజాడ శతజయంతి సంస్మరణ సంచిక వెలువడింది. అందులో గురజాడవారి 'దేశమును ప్రేమించుమన్నా' గేయాన్ని ద్వారం వెంకటస్వామినాయుడు గారు స్వరపరచి తొలిపేజీలో నొటేషన్‌తో సహా పొందుపరచడం అరుదైన విషయంగా చెప్పుకోవాలి.

1966లో సృజన 7వ సంచికను చలం సాహిత్యసమాలోచన సంచికగా వెలువరించారు. చలం కథలమీద, నవలల మీద పరిశీలనాత్మక వ్యాసాలు, చలం దృక్పథంపై చర్చ, చలంతో ఇంటర్వ్యూ ప్రచురించారు. తిలక్, శ్రీశ్రీల ప్రత్యేక సంచికల్ని కూడా 'సృజన' ప్రచురించింది.

1968 నుంచి 'కళాకేళి' పత్రిక పలు ప్రత్యేక సంచికల్ని ప్రకటించి సాహిత్యలోకం దృష్టిని ఆకర్షించింది. అభ్యుదయకవి ఆవంత్స సోమసుందర్ ఈ పత్రికకు సంపాదకుడు. 'కళాకేళి' మొదటి సంపుటి 3వ సంచికను కారల్‌మార్క్స్ 150 జన్మదినం ప్రత్యేక సంచికగా, సౌమ్య ఉగాదిని పురస్కరించుకొని పత్రిక జన్మదిన ప్రత్యేక సంచికగా వెలువడ్డాయి. ఏడు, ఎనిమిదవ సంచికలను కలిపి గాంధీ శతజయంతి అభినందన సంచికగానూ, పది, పదకొండవ సంచికలను కలిపి 'శ్రీశ్రీ షష్టిపూర్తి అభినందన' సంచికగానూ కళాకేళి వెలువరించింది. మూడవ సంపుటి మొదటి సంచికను 'కథానికల ప్రత్యేక సంచిక'గా, 1971 మార్చి సంచికను ఉగాది ప్రత్యేక సంచికగా ప్రచురించారు. 1967-68లో ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక 'పండితారాధ్యుల నాగేశ్వరరావు గారి శతజయంతి' సంచికగా వెలువడింది. ఆ సంచికలో ఆయనకు నివాళిగా 'శతకవాఙ్మయం', 'కావ్యాత్మ', 'సాహిత్య తత్త్వము' వంటి అనేక రచనలు ప్రచురించారు. కథలు, పద్య కవితలు కూడా వేశారు.

1979-80 సంవత్సరాది సంచికలో పలు అంశాలపై వ్యాసాలు, పద్యాలు, ఇతర ప్రక్రియలు ప్రచురించారు. 1988లో 'అరుణతార' నూరవ సంచికను అమరవీరులకు అంకితం చేస్తూ 'రావిశాస్త్రి సాహిత్య సమాలోచన' పేర కథల ప్రత్యేక సంచికగా వెలువరించారు.

కృష్ణాపత్రిక సంక్రాంతి ప్రత్యేక సంచికల్ని గురించి కూడా చెప్పుకోవాలి. ఆంధ్రపత్రికవారు సంవత్సరాది సంచికలు వెలువరించినట్లు గానే కృష్ణాపత్రిక సంక్రాంతి

సంచికలు ప్రచురించేది. ఈ సంచికలను గురించి కాశీనాధుని నాగేశ్వరరావుగారు "కృష్ణా పత్రికాధిపతులు సుందరమైన సంక్రాంతి సంచికను ప్రచురించి ప్రచురణమునందు నవీనమార్గమవలంబించి సాహిత్యాభ్యుదయమునకు వివిధ రంగములందు చేయదగిన పనులను వ్యక్తము చేసిరి" అని మెచ్చుకున్నారు.[12]

హిందీ ప్రచార సభ వారు తెలుగులో ప్రచురించే 'స్రవంతి' సాహిత్యానికి చేస్తున్న సేవను ప్రత్యేకంగా పేర్కొనవలసి ఉంటుంది. 'సురవరం ప్రతాపరెడ్డి స్మృత్యంజలి', 'బూర్గులరామకృష్ణారావు షష్టిపూర్తి ఉత్సవ సంచిక' వంటి అనేక ప్రత్యేక సంచికలను స్రవంతి వెలువరించింది.

ఈనాటి దినపత్రికలు సాహిత్య ప్రధానమైన ప్రత్యేక సంచికల్ని ప్రచురించడం లేదు. కొద్దిపాటి సాహిత్య పత్రికలు జన్మదిన సంచికల పేర ప్రత్యేక సంచికలు వెలువరిస్తున్నా వాటికంతగా ప్రాధాన్యం లేదని విమర్శకులు భావిస్తున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం అప్పుడప్పుడు తెలుగు మహాసభలను పురస్కరించుకొని ప్రచురించే తెలుగువాణి ప్రత్యేక సంచికలు ఉపయుక్తంగా రూపొంది వెలువడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార శాఖ వెలువరించే 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక తరచూ ఉగాది సందర్భంగా ప్రత్యేక సంచికలతో ముస్తాబై వస్తున్నది.

## xi. తొలిసారి వెలుగులోకి తేవడం

తెలుగు సాహిత్యంలో మైలురాళ్ళవంటి సంఘటనలనేకం తెలుగు పత్రికలద్వారా వెలుగు చూసినవే. పాశ్చాత్య సాహిత్యం వెలుగులో మెరుగులు దిద్దుకున్న అనేక వచన ప్రక్రియలను పత్రికలు పాఠక సామాన్యంలోకి తీసుకు వెళ్ళాయి. ఆ విధంగా అనేక నూతన ప్రక్రియలను పత్రికలు వెలుగులోకి తీసుకురావడం, అదేవిధంగా పత్రికలకృషివల్ల పలు సాహిత్య సంఘటనలు వెలుగులోకి రావడం జరిగింది. ఇటువంటి సంఘటనల్లో మొదట చెప్పుకోవలసింది అముద్రిత గ్రంథచింతామణి పత్రికను. అప్పటికి అముద్రితంగా ఉన్న అనేక కావ్యాలను, ప్రబంధాలను ఈ పత్రిక ప్రచురించింది. ఈ పత్రికలో **1885 - 1904** మధ్యకాలంలో ఆధునిక సాహిత్యంలో చీకటి కోణాలపై దృష్టి సారించిన లేఖలు ప్రచురితమయ్యాయి. పలువురు విమర్శకులు, సాహిత్య కారులకు

*12. తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం- లక్ష్మణరెడ్డి*

మధ్య నడిచిన ఈ లేఖలు అనేక నూతన సత్యాలను ఆవిష్కరించాయి. కందుకూరివీరేశలింగం గారు ప్రారంభించిన చింతామణి (1890-1904) తెలుగులో తొలిసారిగా నవలల పోటీ పెట్టి బహుమతులిచ్చింది. ఈ పత్రిక మొల్ల రామాయణాన్ని వెలుగులోకి తెచ్చి ప్రచురించింది. ఎఱ్ఱన 'నృసింహపురాణం' వంటి ప్రబంధాలను కూడా ఈ పత్రిక ప్రచురించింది. కళావతి (1900-1903) పత్రిక తెనాలి రామకృష్ణుని 'ఘటికాచల మహాత్మ్యము'ను వెలుగులోకి తెచ్చింది.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక (1912) శ్రీ సూర్య రాయాంధ్రనిఘంటువును ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ప్రచురించింది. భీమకవి 'కవిజనాశ్రయము' అనే తొలిఛందో గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ పత్రిక తొలిసారిగా అనేక తెలుగు శాసనాలను వాటి ఛాయా చిత్రాలతో, ఆధునిక భాషలో ప్రచురించింది.

'త్రిలింగ' (1915) 'భారత కూలంకషం' పేరుతో కవిత్రయ భారతంపై వ్యాఖ్యానాన్ని వెలుగులోకి తేవడంతో పాటు, పత్రికలో సభాపర్వ వ్యాఖ్యానం వేశారు. మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి కర్ణ - అర్జున పాత్రల తులనాత్మక అధ్యయనం వేశారు.

గోలకొండపత్రిక (1926) తెలంగాణాలో మారుమూల ప్రాంతాల్లో నివురుగప్పిన నిప్పుల్లా ఉన్న కవుల నెందరినో వెలుగులోకి తెచ్చింది. కోస్తానుంచి వెలువడే ఒక వారపత్రికలో వచ్చిన ఒక వార్త ఈ సంఘటనకు ప్రేరణ అయ్యింది. 'తెలంగాణాలో తెలుగుభాష మాట్లాడటమే తెలియదు. ఇక కవులెక్కడున్నారు. అనేది ఆ వార్త సారాంశం. అది చదివి పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి గారు నొచ్చుకున్నారు. తన వద్దనున్న కాగితాల కట్టలన్నీ వెతికి తెలంగాణాలోని ఎందరో కవుల గురించి, వారి కవిత్వాన్ని సృజనాత్మక ప్రతిభను గురించి అనేక విషయాలు వెలికితీసి గోలకొండ పత్రికలో ధారావాహికగా ప్రచురించడం ప్రారంభించారు. మరెంతో మంది కవుల సమాచారాన్ని స్వయంగా సేకరించి వారిని గురించి 'గోలకొండ కవుల సంచిక'గా పత్రికలో ప్రకటించాడు. సుమారు 200 మందికి పైగా తెలంగాణాకవులను వారి వివరాలు, కవితలతో సహా రెండున్నర మూడు సంవత్సరాల పాటు ప్రచురించి ఆ పైన ఒక సంపుటాన్ని వెలువరించారు. మట్టిలో మాణిక్యాల్లాంటి ఎంతోమంది కవులను లోకానికి పరిచయం చేసి తెలంగాణాలో కవులకు కొదవ లేదని ప్రతాపరెడ్డిగారు లోకానికి చాటిచెప్పారు.

'సరస్వతి' పత్రిక తొలిసారిగా బుద్ధుని జాతకకథలను ప్రచురించింది. అందులో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తెలుగుకవుల గురించి వ్యాసాలు రాశారు. ఆంధ్రపత్రిక, భారతి పత్రికలు రెండూ వెలుగులోకిరాని సాహిత్య నిధి నెంతటినో తీసుకువచ్చాయి. అసలు ఆంధ్రపత్రిక దినపత్రికకు అనుబంధంగా వెలువడిన సంవత్సరాది సంచిక ప్రారంభ సంచికలోనే అటువంటి అరుదైన శీర్షికను ప్రవేశపెట్టారు. మల్లాది రామకృష్ణశాస్త్రిగారి 'పుష్పాంజలి' శీర్షికలో తెలుగు సంస్కృతాల్లో లోకానికి తెలియక అజ్ఞాతంగా వున్న కవులెందరినో పరిచయం చేశారు ప్రాకృత, పాళీ సాహిత్యాన్ని ఆంధ్రపత్రిక ద్వారానే పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు వెలుగులోకి తెచ్చారు.

1976లో దక్షిణ ఢిల్లీవారు ప్రచురించిన గురజాడ సంస్మరణ సంచికలో 'శ్రీ గురజాడ అప్పారావు గారు' అన్న వ్యాసం ఒకటి వేశారు. ఆ వ్యాసం విశ్వనాథవారు రాసింది. ఆ వ్యాసం ముద్రించిన చోట సంపాదకులు ఒక వివరణ పొందుపరచారు. "తమ వ్యాసాన్ని అచ్చులో చూడడానికి విశ్వనాథ వారు లేకుండా పోయారు. (అప్పటికే మరణించారు) 1932-36 ప్రాంతంలో 4 సంవత్సరాలపాటు తమ విలువైన సమయాన్ని విశ్వనాథవారు కన్యాశుల్కంలో రామప్పంతులుగా నటించేందుకు కేటాయించినట్లు ఎర్రోజు మాధవాచార్యులు వెలుగులోకి తెచ్చారు" అని పేర్కొన్నారు.

ఆ సంచికలో తెన్నేటి, చంద్రరాజేశ్వరరావు, వి.ఎస్. రమాదేవి, మిక్కిలినేని, పురాణం, ఆరుద్ర, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, దాశరధి, రాచమల్లు రామచంద్రారెడ్డి, చలం, పురిపండా, చేరా ప్రభృతుల విలువైన వ్యాసాలున్నాయి.

ఆంధ్రప్రభ 1982 జూలై 11 సంచికలో "కందుకూరి వీరేశలింగం మెట్రిక్ పాస్ కాలేదా?"అని ప్రారంభించింది.

పత్రిక కథనం ఆంధ్రమహాపురుషుడు కందుకూరి వీరేశలింగం మెట్రిక్ ఎప్పుడు పాసయ్యాడు అనే విషయంపై కూడా వివాదం ఉండవలసిన పన్లేదు. అని ప్రారంభించింది.

విషయం ఏమిటంటే కందుకూరి వీరేశలింగం మెట్రిక్ పాసయ్యాడా లేదా అన్నది ఒక వివాదంగా పరిణమించింది.

వీరేశలింగంగారు 1863లో రాజమండ్రి జిల్లా స్కూల్లో మెట్రిక్ చదివినట్లు ఆ సంవత్సరం పరీక్షలో తాను తప్పినట్టు, 1869లో తిరిగి పరీక్షకు కూర్చోవలసివుండగా

అనారోగ్యంమూలంగా అది సాధ్యం కానట్లు ఆ మరుసటి సంవత్సరం అంటే 1870లో ప్రయివేట్‌గా కూర్చొని పాసైనట్లు స్వీయచరిత్రలో వీరేశలింగంగారే రాశారు.

స్వీయ చరిత్రలో రాశాడు కాబట్టి నమ్మారు.

అయితే వీరేశలింగం గారిపై పరిశోధన చేసిన జాన్ గ్రీన్‌ఫీల్డ్ లియొనార్డ్ అనే అమెరికాకు చెందిన స్కాలరుకు 1869 - 1871 వరకు మూడేళ్ళ ప్రభుత్వ గెజిట్లలో అచ్చయిన మెట్రిక్ పాసైనవారి జాబితాల్లో కందుకూరి వీరేశలింగం పేరు కానరాలేదు. దాంతో వీరేశలింగం మెట్రిక్ పాస్ కాలేదని తేల్చేశాడు లియొనార్డ్.

చివరికి బంగోరె 1870 నాటి ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ సప్లిమెంట్‌లో వీరేశలింగం ద్వితీయ శ్రేణిలో పాసైనట్లు కనుగొన్నారు.

ఈ రకంగా ముగిసిన వివాదం మలుపును ఆంధ్రప్రభ వెలుగులోకి తెచ్చింది.

## xii. సాహిత్య వార్తలు

దిన పత్రికల్లో సాహిత్యానికి సంబంధించిన వార్తలు ప్రముఖంగా వేసేవారు. అవి అనంతరకాలంలో సాహిత్య చరిత్ర నిర్మాణానికి దోహదం చేసేవిగా వున్నాయి. అంతేకాదు అవి సమకాలీన పత్రికా పాఠకులు సాహిత్యరంగంలో పరిణామాలను తెలుసుకొనేందుకు వీలుకల్పించేవి.

1950 ఫిబ్రవరి 15న విజయవాడలో కళాప్రపూర్ణ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు అస్తమించారని ఆంధ్రపత్రికలో వార్త వచ్చింది. అప్పటికి శాస్త్రిగారు ఆంధ్రా ఆస్థాన కవిగా వున్నారు. శాస్త్రిగారి మరణవార్త, ఆయన సుదీర్ఘ సాహితీ జీవిత విశేషాలు, సంతాపాలు పేజీలకొద్దీ ప్రచురించారు.

ఆ ఏడాది ఆగస్టు 3న ఆంధ్రపత్రికలోనే నూతన ఆస్థాన కవి నియామకానికి సన్నాహాల గురించి వార్త వచ్చింది.

"ఆంధ్రా ఆస్థానకవి నియామకం సలహాసంఘం ఆర్థిక మంత్రి బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన ఆగస్టు 5వ తేదీన సాయంకాలం అసెంబ్లీ సమావేశం ముగిశాక సమావేశమై తమ నిర్ణయం మంత్రివర్గమునకు తెలిపెదరు.

సంఘం ఇతర సభ్యులు డా. ఆర్.బి. రామకృష్ణంరాజు, డా. చిలుకూరి నారాయణరావు, ఉయ్యూరి రాజా డా. వై. గోవింద రాజులు నాయుడు గారు.

కీ.శే. చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారి స్థానే ఆంధ్రాఆస్థాన కవిగా నియమించుటకు యీ దిగువవారిపేర్లు ప్రభుత్వంవారికి యింతవరకు సూచింపబడినవని తెలియుచున్నది. కవి సార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, గడియారం వెంకట శేషశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు గార్లు."

తర్వాత శ్రీపాద గోపాల కృష్ణమూర్తిశాస్త్రిగారిని ఆస్థానకవిగా నియమించారన్నవార్త. ఆ సందర్భంగా 1950 ఆగస్టు 6న విజయవాడలో హర్షోత్సాహసభ జరిగింది. విశ్వనాథ మొదలైనవారు పాల్గొన్నారు. ఆగస్టు 7, 1950న ఆంధ్రపత్రికలో వార్త వచ్చింది.

1970 జూలై 5 వ తేదీ విశాలాంధ్ర దినపత్రికలో అభ్యుదయ రచయితల సంఘం నుంచి వేరుపడి వేరొక సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీశ్రీ అంతకు ముందు రాత్రి చేసిన ప్రకటన వార్తగా వచ్చింది. ఆ ప్రకటనకు 12 మంది కవులు, రచయితలు తమ స్పందనను తెలియజేశారు.

"శ్రీరంగం శ్రీనివాసరావు నిన్నరాత్రి 1.10 గంటలకు చేసిన ప్రకటన, ప్రచురించిన కరపత్రం చూశాం. శ్రీశ్రీగారు అభ్యుదయ రచయితల సంఘంలో అనేక సంవత్సరాలుగా ప్రముఖ పాత్ర వహించారు. పైగా ఆ ప్రకటన వెలువరించేముందు అంటే రాత్రి 7 గంటల వరకూ ద్వారకా హోటల్‌లో జరిగిన అభ్యుదయ రచయితల సమావేశానికి వారే అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘాన్ని పునరుద్ధరించాలని ప్రాంతీయ సంఘాలను నెలకొల్పాలని త్వరలో ఒక ప్రాంతీయ మహాసభ జరపాలని నిర్ణయించారు.

ఆ నిర్ణయాలను సంవత్సరాంతంలోగా ఫలప్రదం చెయ్యాలని శ్రీశ్రీగారు తమ తీవ్రవాంఛను వెల్లడించారు. అభ్యుదయ రచయితల సంఘాన్ని గురించి వారికి మరోవిధమైన అభిప్రాయంగాని, తాము మరో రచయితల సంఘాన్ని ప్రారంభించ బోతున్నారనిగాని తెలియజేయలేదు. అటువంటిది హఠాత్తుగా ఈ ప్రకటన."

స్పందన ప్రకటనపై సంతకాలు చేసినవారు పురిపండా, ఆరుద్ర, విద్వాన్ విశ్వం, సినారె, అనిసెట్టి, నార్ల చిరంజీవి, నిడమర్తి ఉమారాజేశ్వరరావు, తుమ్మల వెంకటరామయ్య, రాంభట్ల, మహీధర రామమోహన్‌రావు, ఏటుకూరిబలరామమూర్తి, బొల్లిముంత శివరామకృష్ణ

1977 జూన్ 12న విశాలాంధ్రలో వచ్చిన మరోవార్త. జూన్ 9, 10 తేదీల్లో విరసం ప్లీనరీ (ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జరిగిన మొట్టమొదటి ప్లీనరీ) గురించి.

ఆ సమావేశంలో వి.ర.సం. అధ్యక్షపదవినుంచి శ్రీశ్రీ వైదొలగారు. పదవికి నెలరోజుల కిందట సమర్పించిన రాజీనామాను ప్లీనరీ 10నాటి సమావేశం ఆమోదించి శ్రీశ్రీని సాధారణసభ్యునిగా కొనసాగేందుకు అనుమతినిచ్చింది. అప్పుడు విరసం ప్రధాన కార్యదర్శిగా శ్రీ కె.వి. రమణారెడ్డి వున్నారు.

ఆ సమావేశానికి శ్రీశ్రీ పంపిన సంజాయిషీ

"నేను ఆ రోజుల్లో ఇందిరాపాలనను వామపక్ష నియంతృత్వంగా భ్రమించాను. అదో గొప్ప పొరపాటని ఇప్పుడు ఏ మినహాయింపూ లేకుండా ఒప్పుకొంటున్నాను. ఆర్థిక కారణాలవల్ల 20 పాయింట్ల మీద ఆకాశవాణికి సినిమాపాటరాసినట్లే రాశాను. 20 పాయింట్లవల్ల పీడితవర్గానికి మేలు జరుగుతుందని కూడా భ్రమించాను. నాలోకొంత విదూషకుడి మనస్తత్వం వుంది. శ్రీ జలగం వెంగళరావు గురించి నేనేమన్నా అది వేళాకోళానికే. కాని జైళ్ళలో నామిత్రులు తీవ్ర నిర్బంధాలకు గురి అయిన కాలంలో హాస్యానికైనా (అందుకు ప్రధాన కారకుడైన) వెంగళరావు గురించి రాయడం ఒక పొరపాటే అని గుర్తిస్తున్నాను. ఆనాటి ప్రభుత్వం దేశవ్యాప్తంగా పౌరహక్కుల్ని కాలరాస్తున్నా పౌరహక్కుల సంఘం అధ్యక్షునిగా నేనేమీ చేయలేకపోయినందుకు విచారిస్తున్నాను. నా హృదయం ఇంకా వుండవలసిన చోటనేవుంది. అది ఎప్పుడూ విరసంతోనే ముడిపడివుంటుంది. నేను చేసినవేమీ చిన్న పొరపాట్లు కావని తెలుసుకోవడమే నన్ను విరసం అధ్యక్షపదవినుంచి తొలగించడానికి ప్రేరేపిస్తోంది." అని రాశారు.

1978 డిసెంబర్ 24, 25 తేదీల్లో కాకినాడలో అభ్యుదయ రచయితల సంఘం 8వ మహాసభల వార్తలు విశాలాంధ్రలో 1979 జనవరి 7 నాటి సంచికలో పేజీ నిండా వచ్చాయి. ఆ మహాసభల్లో అరసం నూతన అధ్యక్షవర్గం అధ్యక్షునిగా పురిపండా ఎన్నికయ్యారు. అధ్యక్షవర్గంగా రోణంకి, ఉప్పల లక్ష్మణరావు, కుందుర్తి, సోమసుందర్, సినారె, చాగంటి, మహీధర, దొణప్ప, తుమ్మల, రా.రా. గంగినేని వెంకటేశ్వరరావు, గజ్జెలమల్లారెడ్డి, బూదరాజు రాధాకృష్ణ, దాశరథి రంగాచార్య ఎన్నికయ్యారు.

1982 నవంబర్‌లో కుందుర్తి, పురిపండా మరణించారు. నవంబర్ 18న తన 78వ ఏట పురిపండా మరణించారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకీయం రాసింది.

1990 సెప్టెంబర్ 1న సరస్వతీపుత్ర పుట్టపర్తినారాయణాచార్యులవారి అస్తమయవార్తను ఉదయం మొదలైన దినపత్రికలు ప్రముఖంగా వేశాయి. ఆ వార్తలతోపాటు పుట్టపర్తివారు జీవించివుండగా జానమద్ది హనుమచ్ఛాస్త్రి జరిపిన ఇంటర్వ్యూ ప్రచురించారు. అదే నెల 5వ తేదీన బీనాదేవి (బీనాదేవి పేరుతో నవలలు కథలు రచించిన దంపతుల్లో నరసింగరావు) మరణించిన వార్త వచ్చింది.

1990 సెప్టెంబర్ 9 ఆదివారం సంచికలో బీనాదేవి స్మృతిలో ఆయనకథ 'ఆవుపులి' ప్రచురించారు. అదే సంచికలో 'సరస్వతీ పుత్రునికి శ్రద్ధాంజలి' పుట్టపర్తి వారికి నివాళి వ్యాసం అక్కిరాజురమాపతిరావు రాశారు.

# ఉపయుక్త గ్రంథాలు


## తెలుగు

**అనువాద సమస్యలు**
రాచమల్లు రామచంద్రారెడ్డి,
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు - 1987

**ఆంధ్రమహా భారతము**
కవిత్రయం
తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం
హైదరాబాదు.

**ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు**
డా॥ సి. నారాయణరెడ్డి,
ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్స్, సికిందరాబాద్ - 1977

**ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు**
డా॥ పి. ఎస్. సుబ్రహ్మణ్యం
తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం
హైదరాబాదు. - 1995

**ఆలోకన**
వార్షిక వాఙ్మయ సూచి
సంపా. ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం
తెలుగుసాహితి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు - 1985

**ఈనాడు భాషా స్వరూపం**
ఉషోదయా పబ్లికేషన్స్, ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాదు - 1981

**కథానిక స్వరూప స్వభావాలు**
డా॥ పోరంకి దక్షిణామూర్తి
స్వీయ ప్రచురణ
1-100, చైతన్యపురి, హైదరాబాద్-60 - 1988

**కాశీనాథుని నాగేశ్వరావు**
దేవులపల్లి రామానుజరావు
తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం
హైదరాబాదు - 1988

**జర్నలిజం అవగాహన, ఆచరణ**
డా॥ బూదరాజు రాధాకృష్ణ
దక్షిణభారత జర్నలిస్టుల సమాఖ్య, మద్రాసు - 1995

**జర్నలిజం - చరిత్ర వ్యవస్థ**
రాపోలు ఆనంద భాస్కర్
ఉద్యమ పబ్లికేషన్స్, హైదరాబాదు - 1988

**తెలుగు జర్నలిజం**
దుర్గం రవీందర్
సుమవనం ప్రచురణలు,
నిజామాబాద్ - 1991

**తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం**
డా॥ వి. లక్ష్మణరెడ్డి, గోపీచంద్ పబ్లికేషన్స్, విజయవాడ - 1985

**తెలుగు దినపత్రికల భాష ఆధునీకరణ**
సిద్ధాంత వ్యాసం, అముద్రితం
డా॥ పి చంద్రశేఖర్, తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు

**తెలుగు పత్రికల సాహిత్య సేవ**
డా॥ తిరుమల రామచంద్ర
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
హైదరాబాద్ - 1989

**తెలుగు పత్రికలలో కొత్త ప్రయోగాలు - పరిణామాలు**
తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం
హైదరాబాదు. - 1991

**తెలుగు సంస్కృతి (దేశము చరిత్ర)**
మొదటి సంపుటం
విజ్ఞాన సర్వస్వం
తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 1987

**తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ**
డా. గుజ్జర్లమూడి కృపాచారి
స్వీయ ప్రచురణ
నాగార్జున విశ్వవిద్యాలయం అధ్యాపకుడు - 1988

**తెలుగులో సాహిత్య పత్రికలు**
డా. ఎస్. హెచ్. సౌభాగ్యమ్మ
ఎస్జీడీ పబ్లికేషన్స్, తిరుపతి - 1992

**పత్రికా భాషా నిఘంటువు**
తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం
హైదరాబాద్ - 1995

**పాతికేళ్ల పత్రికా రచన**
సంపా. డా జి. వి. సుబ్రహ్మణ్యం
డా. తిరుమల శ్రీనివాసాచార్య
యువభారతి, హైదరాబాద్ -1992

**ప్రజాకవి వేమన**
డా. ఎన్. గోపి
ద్వితీయ ముద్రణ
ఎన్. అరుణ, ప్లాట్ నెం. 13,
శ్రీనివాసపురం, రామంతపూర్, హైదరాబాద్. - 1992

**సమగ్ర ఆంధ్ర సాహిత్యం**
(9వ సంపుటం, కుంఫిణీ యుగం)
డా. ఆరుద్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్, విజయవాడ - 1990

**సురవరం ప్రతాపరెడ్డి**
డా॥ రావి భారతి
తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం, హైదరాబాద్ -1989

**సాహిత్య వ్యాసంగం**
డా॥ అక్కిరాజు రమాపతి రావు
విజ్ఞాన దీపిక, హైదరాబాద్ - 1994

**వాడుక భాషే రాస్తున్నామా**
రంగనాయకమ్మ
స్వీట్ హోం పబ్లికేషన్స్,
విజయవాడ - 1990

## ఇంగ్లీషు గ్రంథాలు

**BOOK PRINTING IN INDIA**
Dr. J. Mangamma
Bangorey Books, Nellore - 1975

**JOURNALISM IN ANDHRA PRADESH**
A Brief Survey
Hyderabad Union of Journalists
Hyderabad - 1987

**'STUDIES IN THE HISTORY OF TELUGU JOURNALISM**
Ed. K. R. Seshagiri Rao
Narla Shashtyabdapurti
Celebration Committee
DELHI. -1968

## తెలుగులో వ్యాసాలు

**ఈ పాతికేళ్లలో తెలుగు పత్రికల ప్రగతి**
**జి. ఎస్. వరదాచారి**

**తెలుగువాణి**

మూడవ అఖిల భారత తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక
తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 1990

**ఒకటిన్నర శతాబ్ది చరిత్ర కలిగిన తెలుగు పత్రికా రంగం**

జి. ఎస్. వరదాచారి
ఆంధ్రప్రదేశ్ పత్రిక
భావనామ ఉగాది ప్రత్యేక సంచిక
సమాచార శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు - 1994

**తెలుగు కథానిక దశాబ్ది ధోరణులు**

డా॥ కేతు విశ్వనాథరెడ్డి
ఆంధ్రప్రదేశ్ పత్రిక
భావ ఉగాది ప్రత్యేక సంచిక
సమాచార శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్ - 1994

**తెలుగు పలుకు**

దశమ ఉత్తర అమెరికా తెలుగు సమావేశం ప్రత్యేక సంచిక
సంపా. జంపాల చౌదరి
ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)
చికాగో యు. ఎస్ ఎ.

**తెలుగు మౌలిక అంశాలు**

సంపా. చేకూరి రామారావు
ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 1986

**'వ్యాస నవమి'**
డా. ఎన్. గోపి
చైతన్య పబ్లికేషన్స్, హైదరాబాద్ - 1986

**'ఈనాడు దినపత్రిక' సంచికలు**
1974 నుంచి 1990 వరకు అక్కడక్కడా

**'ఈనాడు మేలుకొలుపు'**

| బులెటిన్ నం. | తేది | బులెటిన్ నం. | తేది |
|---|---|---|---|
| 1 | 1.8.1989 | 12 | 16.12.1989 |
| 9 | 26.9.1989 | 14 | 15.1.1990 |
| 10 | 3.10.989 | 15 | 1.2.1990 |
| 11 | 17.10.1989 | 17 | 1.5.1990 |

**ఈనాడు సమీక్షలు**

| సంచిక | తేది | సంచిక | తేది |
|---|---|---|---|
| 20 | 8.1.1990 | 38 | 29.6.1990 |
| 30 | 26.1.1990 | 39 | 9.7.1990 |
| 31 | 5.2.1990 | 40 | 16.7.1990 |
| 32 | 12.2.1990 | 42 | 20.8.1990 |
| 37 | 1.6.1990 | | |

ఆంధ్రపత్రిక 1950 అంతకన్నా ముందు నుంచి ఆగిపోయేవరకు అక్కడక్కడా, ఆంధ్రప్రభ, ఉదయం, విశాలాంధ్ర, ప్రజాశక్తి, ఆంధ్రభూమి, దినపత్రికలు వాటి ప్రారంభం నుంచి 1990 వరకు, వార్త (కొన్ని సంచికలు).



# రచయిత గురించి ...

చెన్నయ్య రచయితగా, పాత్రికేయునిగా, రేడియో కళాకారునిగా, న్యూస్‌రీడర్‌గా సుపరిచితుడే.

1958 జనవరి 8న మహబూబ్‌నగర్ జిల్లా కావేరమ్మ పేటలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు, భారతీయ విద్యాభవన్‌లో, మధురై కామరాజ్ యూనివర్సిటీలో ఎం.ఏ. జర్నలిజం చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పత్రికల గురించి పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'ఈనాడు' దినపత్రికలో సుమారు పదిసంవత్సరాలపాటు పాత్రికేయునిగా పనిచేశారు. ఇరవై రెండు సంవత్సరాలుగా రేడియోలో వివిధ కార్యక్రమాలకు రచన చేయడంలో, కార్యక్రమాల నిర్మాణంలో, ప్రాంతీయ వార్తలు చదవడంలో, వార్తల అనువాదంలో అనుభవం సంపాదించారు. ముఖ్యంగా రేడియోలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి ప్రసంగాలను అనువదించడంలో, భావయుక్తంగా చదవడంలో ప్రత్యేక ప్రశంసలు పొందుతున్నారు. వివిధరకాలైన అనువాదాలు చేస్తున్నారు. పత్రికల్లో, ప్రత్యేక సంచికల్లో రచనలు ప్రచురణ పొందాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 1990 నుంచి ప్రజాసంబంధాల అధికారిగా సేవలందిస్తున్నారు.